# rāḷḷapalli anantakr̥ṣṇa śarma jīvitaṁ, racanalu: samagra pariśīlana

A Thesis submitted to the University of Hyderabad in partial fulfilment
of the requirement for the award of

Doctor of Philosophy
In
Telugu

Researcher
**BADIGE UMESH**
**(Reg No: 14HTPH06)**

Department of Telugu
School of Humanities
University of Hyderabad
Hyderabad– 500046
Telangana, India

June – 2019

# రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ జీవితం, రచనలు : సమగ్ర పరిశీలన

**పిహెచ్. డి., పట్టా కోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథం**


**పరిశోధకుడు**

**బడిగె ఉమేశ్**

**14HTPH06**

**పర్యవేక్షకులు**

**ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు**

తెలుగు శాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాదు విశ్వవిద్యాలయం

హైదరాబాదు- 500046



**జూన్ 2019**

# DECLARATION

I, **Badige Umesh** hereby declare that this thesis entitled **rāḷḷapalli anantakr̥ṣṇa śarma jīvitaṁ, racanalu: samagra pariśīlana** submitted by me under the guidance and supervision of Prof. Darla Venkateswara Rao is my bonafide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma. I hereby agree that this thesis can be deposited in Shodhganga/INFLIBNET.

Signature of the Student

Date:

Name: **BADIGE UMESH**
Registration No. **14HTPH06**

# CERTIFICATE

This is to certify the Thesis entitled **rāḷḷapalli anantakr̥ṣṇa śarma jīvitaṁ, racanalu: samagra pariśīlana** submitted by **Mr. Badige Umesh** bearing **Regd. No. 14HTPH06** in partial fulfilment of the requirements for the award of **Doctor of Philosophy** in the School of Humanities, Department of Telugu is a bonafide work carried out by him under my supervision and guidance.

The thesis is free from plagiarism and has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma.

**A. Published in the following publications:**

Parts of this thesis have been: (NOT EXACT PARTS. Issues discussed in the following papers have been presented elaborately in the chapter-1and 2 of the thesis.)

1. **"Kavi jīvitāla pariśōdhanalu: Rāḷḷapalli anantakr̥ṣṇa śarma"(ISBN 978-93-81992-32-6),** Pg.No.160-163, February 2016. 1st Chapter. "Pariśōdhana: nāḍu, nēḍu, rēpu (pariśōdhana patrāla saṅkalanaṁ)" Edited by Prof. Sampathkumar, Madabhushi. Department of Telugu, Madras University. Madras.
2. **"Rāḷḷapalli vāri sāhitya pīṭhika parimaḷaṁ" (ISSN 2456-4702),** Bhāva vīṇa Pg. No. 41-42, November- 2017. 4th Chapter. Chief Editor "Dr. B. Venkataswamy", P.A.S. College, Pedanandipadu - 522235, Guntur Dist., A.P. And

**B. Presented in the following National seminars:** (Issues presented in the following papers have been discussed elaborately in the chapter-1and 2 of the thesis.)

2. **"Rāḷḷapalli vāri tārādēvi khaṇḍakāvyaṁ"**, 2th Chapter. 'Adhunika Telugu Sahithyam – Thiru Tennulu' U.G.C. National seminar Conducted By Telugu Shakha VisvaKalaparishath, Vishakapatnam, July 30, 2016.

1. **" Rāḷḷapalli vāri kavitvanlō prāntīya asthitvaṁ ",** 1st Chapter. 'Adhunika Telugu Kavithvamlo Pranthiya Asthitvam, National seminar, conducted by Sri Virakthi Prabhuthva Degree College, Kalyandurgam -515761, February 2, 3, 2017.

Further, the Student has passed the following courses towards fulfilment of coursework requirement for Ph.D./was exempted from doing coursework (recommended by Doctoral Committee) on the basis of the following courses passed during his **M. Phil** program and the M. Phil degree was awarded.

| S.N | Course Code | Name | Credits | pass/fail |
|---|---|---|---|---|
| 1 | HT701 | Research Methodology | 4.00 | PASS (B+) |
| 2 | HT702 | History of Telugu Research | 4.00 | PASS (B) |
| 3 | HT703 | Studies in Specialized Area | 4.00 | PASS (B+) |
| 4 | HT704 | Broad Field | 4.00 | PASS (B+) |
| 5 | HT780 | Dissertation(M. Phil) | 16.00 | PASS (A) |

**(Prof. DARLA VENKATESWRA RAO)**
**Research Supervisor**

**(Prof. G.ARUNAKUMARI)**
**Head, Department of Telugu**

**(Prof. S. SARAT JYOTSNA RANI)**
**Dean, School of Humanities**

# కృతజ్ఞతలు

నాకు జన్మను ప్రసాదించి, ఎండనకా, వాననకా చెమటోడ్చి కష్టపడుతూ, నా ఉన్నతి కోసం కళ్ళల్లో వత్తులేసుకొని ఎదురు చూస్తున్న నా ఆరాధ్య దేవతలు అమ్మానాన్నలకు పాదాభివందనాలు.

చైతన్యానికి నిలువుటద్దం. చదువులో వెనుకబడిన విద్యార్థుల్ని గుర్తించి, వారి ఆసక్తిని బట్టి అభివృద్ధికి బాటలు వేయటంలో సాటిలేని మేటి– నన్ను ఎం. ఏ. నుండీ కనిపెడుతూ ఎం. ఫిల్., పరిశోధనలో పర్యవేక్షకులుగా ఉంటూ, పిహెచ్. డి.,పరిశోధనకు పురికొల్పారు – ఈయన సృజనాత్మక రచనలు చేస్తూ, విమర్శనాత్మక కృతులు రచిస్తూ, తన పరిశోధక విద్యార్థుల్ని కూడా అటువైపు మళ్ళించే సహృదయులు – నాకు విశ్వవిద్యాలయంలో పెద్ద దిక్కు – పరిశోధనలో విలువైన సలహాలు సూచనలు చేసి, కావాల్సినంత సమయాన్నిచ్చి వెన్ను దన్నుగా నిలిచిన మా పర్యవేక్షకులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావుగారికీ, నిష్కల్మషమైన మనసుతో, నిరంతరం అమృతాశీస్సులు అందించే వారి సతీమణీ మాతృ శ్రీ సమానురాలైన డా॥ మంజుశ్రీగారికీ నా నమస్సుమాంజలులు.

పరిశోధన చేయడానికి అవకాశం కల్పించిన తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు ఆచార్య తుమ్మల రామకృష్ణగారికి, డాక్టోరల్ కమిటీ మెంబర్ గా ఉంటూ నాలో పరిశోధన పట్ల ఆసక్తిని కలిగించడమేగాక నా అభివృద్ధిని కాంక్షించే మాతృ హృదయ ప్రస్తుత తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య జి. అరుణ కుమారిగారికీ, తెలుగు శాఖలో ఎం. ఏ., నుండీ పాఠాలు బోధించిన ఆచార్య ఎస్. శరత్ జ్యోత్స్నా రాణిగారు, ఆచార్య రేమిళ్ళ వేంకటశాస్త్రిగారు, ఆచార్య పిల్లల మర్రి రాములుగారు, డా॥ పమ్మిపవన్ కుమార్ గారు, డా॥ విజయలక్ష్మిగారు, డా॥ భుజంగ రెడ్డిగారు, డా॥ విజయకుమారి గార్లకు అలాగే తెలుగు శాఖలో నూతనంగా చేరిన ఆచార్య ఎండ్లూరి సుధాకర్ గారు, ఆచార్య గోనాయక్ గారు మొదలైన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు. ముఖ్యంగా నేను కనబడినప్పుడల్లా పరిశోధన బాగా చేయమని ప్రోత్సాహాన్నిచ్చిన అధ్యాపకులందరి కీ నా ప్రణామాలు.

ప్రసిద్ధ హైదరాబాదు విశ్వవిద్యాలయం గురించి చెప్పి, దీనిలో ప్రవేశం పొందడానికి సహాయ సహకారాలు అందించిన కాటంరెడ్డి రామలింగారెడ్డిగారికీ వందనాలు.

విషయ సేకరణ, వర్గీకరణ, విశ్లేషణలో దారి చూపిన విద్వన్మణులు. పరిశోధన పాఠాలతో పాటు జీవితాదర్శాలను నేర్పిన శ్రీ ఘట్టమరాజు అశ్వత్థనారాయణగారికీ, నేను మా

గురుదేవులను కలవడానికి ఎప్పుడు ఇంటికి వెళ్ళినా, చిరునవ్వుతో పలకరించి, ఆదరించిన గురుపుత్రి డా॥ ఎఱ్ఱమిల్లి అపర్ణగారికీ కృతజ్ఞాభివందనాలు.

పరిశోధనకు తోడ్పడిన రాళ్ళపల్లి వారి సుపుత్రులు శ్రీ ఆర్. ఏ. జయంతగారికీ, అనంతకృష్ణుల జ్యేష్ఠ పుత్రులు కీ. శే. ఆర్. ఏ. ఫణిశాయిగారి కుమారులైన శ్రీ ఆర్. ఏ. నందనందన గారికీ, రాళ్ళపల్లి వారి మనుమరాలు ఆచార్య సి. మృణాళినిగారికీ నమస్సులు.

నా పరిశోధనా కాలంలో విషయ సేకరణలో తోడ్పడిన ఉభయ రాష్ట్రాల్లోని ఆయా విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న ఆచార్యులకు కృతజ్ఞతలు. ప్రధానంగా ఆచార్య కృపాచారి (ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం), ఆచార్య ననుమాస స్వామి (ఉస్మానియా విశ్వవిద్యాలయం),ఆచార్య శ్రీరామచంద్రమూర్తి (వారణాసి విశ్వవిద్యాలయం), డా॥ ఎన్. ఎలిజబెత్ జయకుమారి (ద్రావిడ విశ్వవిద్యాలయం), డా॥ బాల శ్రీనివాసమూర్తి (తెలంగాణ విశ్వవిద్యాలయం), డా॥కె. ఆశాజ్యోతి (బెంగళూరు విశ్వవిద్యాలయం), ఆచార్య రామచంద్ర రెడ్డి (యోగివేమన విశ్వవిద్యాలయం) మొదలైన వారికీ నా ప్రత్యేక నమోవాకాలు.

నా సిద్ధాంత గ్రంథానికి టైటిల్ పేజీలను కళాత్మకంగా, ఆలోచనాత్మకంగా తీర్చిద్దిన మా సూపర్ సీనియర్ మద్దిరాల సిద్దార్థ అన్నకూ, రాళ్ళపల్లివారి పెనుగొండ పాటను మోహన రాగంలో ఆలపాన చేసి చిరకాలం గుర్తుండిపోయేలా చేసిన నా మిత్రుడు కంకిపాటి రాజాకు ప్రత్యేక ధన్యవాదాలు. నా ఉన్నతిని కోరుకొనే గోపాల్ రెడ్డి సార్ గారికీ, వీరి సతీమణి జయలక్ష్మి గారికీ, మంగయ్య సార్ గారికీ నమస్సులు.

నా పరిశోధన చివరి చరణంలో నాకు దొరకని రాళ్ళపల్లివారి వ్యాసాలనూ, పీఠికల్ని ఇచ్చి సహకరించిన డా॥ సాతవల్లి చంద్రశేఖర్ గారికీ, నాకు విషయ సేకరణలో తోడ్పడిన ఇందిరా గాంధీ మెమోరియల్ (హైదరాబాదు విశ్వవిద్యాలయం) గ్రంథాలయ సిబ్బందికి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఉన్న ప్రసిద్ధ గ్రంథాలయాల సిబ్బందికి, పరిశోధన చేయడానికి ఆర్థిక ప్రోత్సాహం అందించిన యు. జి. సి. వారికి, అంతేకాకుండా ప్రత్యక్షంగా, పరోక్షంగా నా పరిశోధనకు తోడ్పడిన 'ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు.'

బడిగె ఉమేశ్

(14HTPH06)

# సంకేత పద వివరణ

| | |
|---|---|
| భా. వి. ప. | – భారతము విరాట పర్వము |
| ఉ. హ. | – ఉత్తర హరివంశము |
| రా. సా. సం. వ్యా. | – రాళ్ళపల్లి సాహిత్య సాహిత్య, సంగీత వ్యాసాలు |
| భా. అ.ప. | – భారతము అరణ్య పర్వము |
| శా. గా. స. | – శాలివాహన గాథాసప్తశతీసారము |
| అ. స్త. | – అభీతి స్తవము |

# ప్రవేశిక

## 1. పరిశోధనాంశం పరిచయం (Introduction)

బాగా వెనుకబడిన ప్రాంతంలో పుట్టినా, ఉన్నత చదువులు చదవకపోయినా, నేర్చుకోవాల్సిన విద్యనూ, చేయాల్సిన పనులనూ త్రికరణ శుద్ధిగా చేసి, పొందాల్సిన గౌరవాదరాలను పొందిన బహుముఖ ప్రజ్ఞాశాలి రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ. ఈయన బాల్యం నుండి సంప్రదాయబద్ధంగా, గురుముఖ సాహిత్యాన్నీ, సంగీతాన్నీ అభ్యసించి ఈ రెండు క్షేత్రాల్లో ఋషి పీఠం వహించిన మనీషి. శర్మగారు పదమూడేళ్ళ నుండి ఎనభై నాలుగేళ్ళ వరకూ తమ రచనా వ్యాసంగాన్ని నిర్విరామంగా కొనసాగించారు. తెలుగు సాహిత్యానికి ఆలోచనామృతాన్ని, ఆపాత మధురాన్ని కలిగించిన బహు కొద్ది మందిలో రాళ్ళపల్లి వారు ప్రముఖులు . కట్టమంచి రామలింగారెడ్డి ఔదార్యం వల్ల తెలుగు సాహిత్య విమర్శకు దొరికిన గొప్ప ఆణిముత్యం రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ.

రాళ్ళపల్లి వారు సుమారు 120 గ్రంథాలకు పీఠికలు వెలువరించారు. వీటిపై 2013లో 'రాళ్ళపల్లి పీఠికలు – పరిశీలన' అనే అంశంపై ఎం. ఫిల్ పరిశోధన వ్యాసాన్ని రాసి హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించాను. ఈ ఎం. ఫిల్ చేస్తున్న సమయంలో రాళ్ళపల్లివారి రచనలపై, వారి అభిప్రాయాలపై ప్రత్యేక అసక్తి కలిగింది. దీనితో వీరి రచనలపై సమగ్ర పరిశీలన జరగలేదని గ్రహించాను. మా పర్యవేక్షకులు డా॥ దార్ల వెంకటేశ్వరరావు సూచన మేరకు అనంతకృష్ణశర్మగారి మొత్తం రచనలపై పరిశోధన చెయ్యాలని భావించి ***"రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ జీవితం, రచనలు : సమగ్ర పరిశీలన"*** అనే అంశాన్ని నా పి. హెచ్. డి., పరిశోధనాంశంగా ఎన్నుకున్నాను.

## 2. పరిశోధన ఆవశ్యకత (Necessity of the Research)

అనంతకృష్ణశర్మగారి కాలంలో కొనసాగిన విమర్శపై విస్తృత పరిశోధనలు జరగాలి. ఆనాటి విమర్శలో ఎంతో స్పష్టత, నిష్పాక్షికత ఉందన్న అంశాలపై పునర్మూల్యాంకనం జరగాల్సిన అవసరం ఎంతో ఉంది. కాగా విషయాన్ని బట్టి ఒక వ్యాసాన్ని ఎలా రాయాలి? దాని ఆది, మధ్య, అంతాల్ని ఎలా నిర్మించాలి? చెప్పే విధానం ఏతీరుగా ఉండాలన్న సూక్ష్మాంశాలు చాలా ముఖ్యమైనవి. వీటిని భావితరాల వారు తెలుసుకుంటే బహు ఉపయోగకరం. అంతేకాదు కళలపై నానాటికి తగ్గిపోతున్న ఆదరణను కాపాడుకోవాలంటే రాళ్ళపల్లివారి ఆవేదనను సాధ్యమైనంతగా ప్రచారంలోకి తీసుకురావాలి. నాకు తెలిసినంత వరకు ఈ దృష్టితో

అనంతకృష్ణశర్మగారి రచనలపై పరిశోధనలు జరగలేదు. ఈ అవగాహనతోనే పరిశోధన ఆవశ్యకతను రూపొందించుకున్నాను.

## 3. పూర్వ పరిశోధనల పరామర్శ (Review of literature)

నేను సేకరించిన సమాచారం మేరకు రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ సాహిత్యంపై జరిగిన పరిశోధన వివరాలిలా ఉన్నాయి.

సాతవల్లి చంద్రశేఖర్ ***'శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి సాహిత్య సేవ – సవిమర్శక సమీక్ష'*** అనే అంశంపై ఆచార్య జి. ఎన్. రెడ్డి పర్యవేక్షణలో 1978లో ఎం. ఫిల్ పరిశోధన చేసి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి సమర్పించారు. ఇది అముద్రితం. ఈ పరిశోధన వ్యాసంలో ఈయన రాళ్ళపల్లివారి జీవిత సంగ్రహాన్నీ, కావ్య రచనా విశేషాల్నీ, శర్మగారి విమర్శను, వారి వ్యక్తిత్వాన్ని స్థూలంగా పరిచయం చేశారు.

రమాంజనీ కుమారి ***'విమర్శకునిగా రాళ్ళపల్లి'*** అనే అంశంపై 1983లో ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావు పర్యవేక్షణలో పరిశోధన చేసి హైదరాబాదు విశ్వవిద్యాలయం నుండి ఎం. ఫిల్ పట్టా పొందారు. ఇది ముద్రిత గ్రంథం. ఈమె రాళ్ళపల్లి వారి జీవితం, రచనల్నీ, తెలుగు సాహిత్య విమర్శ– రాళ్ళపల్లికి పూర్వ రంగాన్నీ, సాహిత్య సౌందర్య తత్త్వ దృక్పథాన్నీ, రాళ్ళపల్లివారి విమర్శ కృషిని స్థాలీపులాకంగా వివరించారు.

బడిగె. ఉమేశ్ ***'రాళ్ళపల్లి పీఠికలు – పరిశీలన'*** అనే అంశంపై డా॥ దార్ల వేంకటేశ్వరరావు పర్యవేక్షణలో 2014లో హైదరాబాదు విశ్వవిద్యాలయంలో ఎం. ఫిల్., పరిశోధన చేశారు. ఇది అముద్రితం. దీనిలో రాళ్ళపల్లివారి పీఠికలను స్థూలంగా పరామర్శించారు.

2015లో ***'సంగీత కళానిధి రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి సంగీత వైదుష్యం– ఒక పరిశీలన'*** అనే అంశంపై పొట్లూరి అనురాధ డా॥ ఉమా దేవి పర్యవేక్షణలో ఎం. ఫిల్., పరిశోధన చేసి తెలుగు విశ్వవిద్యాలయ సంగీత విభాగం నుండి పట్టా స్వీకరించారు. ఇందులో రాళ్ళపల్లివారి సంగీతానికి సంబంధించిన రచనల్ని పరిశీలించారు.

అంటే పై పరిశోధనలన్నీ ఒక యేడాది కోర్సులు ( ఎం. ఫిల్.,) కావడం వల్ల రాళ్ళపల్లివారి సాహిత్య. సంగీత విద్వత్తుని లోతుగా పరిశీలించే అవకాశాలు చాలా తక్కువ. కాబట్టి ఈ పరిశోధనల వల్ల రాళ్ళపల్లివారి సాహిత్య కృషిని మొత్తం తెలుసుకోవడం కుదరదు. నిజానికి అనంతకృష్ణశర్మగారు తెలుగు సాహిత్య విమర్శకు వేసిన మార్గాన్ని అర్థం చేసుకోవాలంటే సునిశిత పరిశీలన ఎంతో అవసరం. ముఖ్యంగా ఒక వ్యాసాన్ని రాసే పద్ధతి, సాహిత్య విమర్శకు దారి చూపే అంశాలు, మన కళలను కాపాడుకోవడం లాంటి గొప్ప లక్ష్యాలను తెలుసుకోవడం అవసరం. దీనికి సమాజం చేయాల్సిన కృషి ఏమిటి అనే అంశాలు రాళ్ళపల్లివారి సాహిత్య

కృషిలో తవ్విన కొద్దీ దొరుకుతాయి. వాటిని అవగాహన చేసుకుంటే అంతో ఇంతో కాదు ఎంతో ఉపయోగమవుతుందని గ్రహించాను. కాగా రాళ్ళపల్లివారి బహుముఖీన ప్రతిభను నేటి సాహిత్య ప్రపంచానికి వివరించి చెప్పాలనే ఉద్దేశ్యంతో నేను ఈ పరిశోధనకు నడుం బిగించాను.

## 4. క్షేత్ర పర్యటన / గ్రంథ సేకరణ (Field-Work / Books collection)

రాళ్ళపల్లివారి రచనలను సేకరించే క్రమంలో నాకున్న కాలపరిమితులను దృష్టిలో పెట్టుకొని ప్రసిద్ధమైన ఇందిరాగాంధీ మెమోరియల్ లైబ్రరీ (హైదరాబాదు విశ్వవిద్యాలయం) రాష్ట్రఆర్కేవ్స్ (హైదరాబాదు), ప్రాచ్య లిఖిత భాండాగారం (హైదరాబాదు), రాష్ట్ర కేంద్ర గ్రంథాలయం (అఫ్జల్ గంజ్, హైదరాబాదు) నగర కేంద్ర గ్రంథాలయం (చిక్కడపల్లి, హైదరాబాదు), ఉస్మానియా విశ్వవిద్యాలయం గ్రంథాలయం (హైదరాబాదు), పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ గ్రంథాలయం (హైదరాబాదు), శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ గ్రంథాలయలం, (తిరుపతి), శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం గ్రంథాలయాలను (అనంతపురం) ప్రధానంగా సందర్శించాను. అలాగే రాళ్ళపల్లివారి సాహిత్య కృషిని బాగా అవగాహన చేసుకొన్న ఘట్టమరాజు అశ్వత్థనారాయణగారితో మరికొంత మంది ప్రముఖులను, పరిశోధకులను, శర్మగారి కుటుంబ సభ్యులను కలిసి ఆయా గ్రంథాలనూ, వ్యాసాలను సేకరించాను. ఎన్నో విషయాలను తెలుసుకున్నాను.

రాళ్ళపల్లివారి సృజనాత్మక రచనల్లో 'లీలాదేవి'(1913) నవల తప్ప ఇంచుమించు మిగతా అన్ని రచనలు లభ్యమయ్యాయి. శర్మగారి అనువాద, విమర్శ, సంగీత రచనలు దాదాపుగా దొరికాయి. ప్రధానంగా అనంతకృష్ణశర్మగారి రచనల్లో ఇంత వరకు లభ్యం కానీ వ్యాసాలూ, పీఠికల్లో కొన్నిటిని సేకరించాను. వీటి వివరాలు రాళ్ళపల్లివారి రచనల పట్టిక అనుబంధం -2 (పుటలు:374-380) లో పొందుపరిచాను. ఈ రచనల గురించి నా సిద్ధాంత గ్రంథంలో లోతుగా పరిశీలించే ప్రయత్నం చేశాను.

నా పరిశోధన గ్రంథం సాహిత్యాన్ని కేంద్రంగా చేసుకొని ఉంటుంది. ఇందులో రచయిత జీవితం. వ్యాసంగం, విమర్శ, భాషాశైలి మొదలైన అంశాలను ప్రధానంగా పరిశీలించాను. శర్మగారి సంగీతాన్ని సామాన్య పాఠకులు సైతం అవగాహన చేసుకొనేలా పరామర్శించాను. రాళ్ళపల్లివారి జీవిత సంగ్రహాన్ని రాయడానికి పూర్వ పరిశోధకులూ, విమర్శకులు రాసిన వ్యాసాలను ఆధారంగా చేసుకున్నాను. ఇంతవరకు రాళ్ళపల్లి వారు జన్మించిన గ్రామాన్ని సందర్శించినట్లు పరిశోధకులు పేర్కొనలేదు. నేను అక్కడికి వెళ్ళి శర్మగారి గురించి కొన్ని కొత్త విషయాల్ని తెలుసుకున్నాను. తర్వాత వారి కుటుంబీకుల్ని కలిసి ఆయా వివరాలను సేకరించి నా పరిశోధనలో పొందుపరిచాను. రాళ్ళపల్లివారి అన్ని రచనల్నీ దాదాపు సమీక్షించే ప్రయత్నం

చేశాను. కొన్ని రచనల్నీ తులనాత్మక అధ్యయనం కూడా చేశాను. శర్మగారి వ్యాసరచనా విధానాన్ని నూతన పద్ధతితో పరిశీలించాను. తెలుగు సాహిత్యానికి రాళ్ళపల్లివారి విమర్శ ఎలా తోడ్పడుతుందన్న విషయాన్ని తెలిపే ప్రయత్నం చేశాను. భాషాశైలిలో రచయితలో చోటు చేసుకొన్న ఆయా పరిణామాల్ని మార్పును సోదాహరణంగా వివరించే ప్రయత్నం చేశాను.

## 5. పరిశోధన ఆకరాలు (Research Source )

నా పరిశోధన పూర్తి చేయడానికి చాలా గ్రంథాలు, పత్రికలు ఇతరేతర ఆకరాలు తోడ్పడ్డాయి. వాటన్నిటినీ నా సిద్ధాంత గ్రంథం 'ఉపయుక్త గ్రంథ సూచికలో చూడవచ్చు. అయితే ఉదాహరణకు రాళ్ళపల్లివారి పుస్తకాలు, వీరి పై ప్రత్యేకంగా వెలువడిన కొన్ని గ్రంథాలను ఇక్కడ పేర్కొంటున్నాను.


1. అనంతకృష్ణశర్మ. రాళ్ళపల్లి, ***తారాదేవి.*** కాకినాడ: 'సరస్వతి' మాస పత్రిక ,1911.
2. అనంతకృష్ణశర్మ. రాళ్ళపల్లి, ***మిరాబాయి*** .రాజమహేంద్రవరం: 'మానవసేవ' మాస పత్రిక ,1913.
3. అనంతకృష్ణశర్మ. రాళ్ళపల్లి, ***వేమన.*** వాల్తేరు: ఆంధ్ర విశ్వకళా పరిషత్ ,1945.
4. అనంతకృష్ణశర్మ. రాళ్ళపల్లి, ***సారస్వతాలోకము***. హైదరాబాదు: మృదులా ప్రచురణ, 2009.
5. అనంతకృష్ణశర్మ. రాళ్ళపల్లి, ***శాలివాహన గాథాసప్తశతీసారము***, హైదరాబాదు: ఆంధ్ర సారస్వత పరిషత్తు, 1964.
6. అనంతకృష్ణశర్మ. రాళ్ళపల్లి, ***నృత్త రత్నావళి.*** హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 2007.
7. అనంతకృష్ణశర్మ. రాళ్ళపల్లి, ***నాటకోపన్యాసములు.*** మచిలీపట్నం: త్రివేణి పబ్లిషర్స్, 1968.
8. అనంతకృష్ణశర్మ. రాళ్ళపల్లి, ***సుందరపాండ్య విరచిత ఆర్యా***. ప్రొద్దుటూరు: శ్రీ రాయల సాహిత్య పరిషత్తు, 1970.
9. అనంతకృష్ణశర్మ, రాళ్ళపల్లి, ***రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు*** . హైదరాబాదు: ఎమెస్కో, చంద్రశేఖర్ రెడ్డి, డి. సంప, 2017.
10. అనురాధ. పొట్లూరి, ***సంగీత కళానిధి రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారి సంగీత వైదుష్యం- ఒక పరిశీలన,*** (ఎం. ఫిల్., సిద్ధాంత వ్యాసం), పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 2015.
11. అశ్వత్థనారాయణ ఘట్టమరాజు, సుందరం ఆర్వీయస్, శ్రీరామ చంద్ర మూర్తి శివలెంక, ***అనంతరాగం.*** బెంగళూరు: రాళ్లపల్లి అభినందన సమితి, 1977.
12. అశ్వత్థనారాయణ ఘట్టమరాజు, సుందరం ఆర్వీయస్, ***రాళ్లపల్లి పీఠికలు.*** బెంగళూరు: రాళ్లపల్లి అభినందన సమితి, 1977.

13. ఉమేశ్. బడిగె, **రాళ్లపల్లి పీఠికలు పరిశీలన.** (ఎం.ఫిల్., అముద్రిత సిద్ధాంత వ్యాసం), హైదరాబాద్: హైదరాబాద్ విశ్వవిద్యాలయం, 2014.

14. చంద్రశేఖర్. సాతవల్లి, ***శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ సాహిత్య సేవ- సవిమర్శక సమీక్ష.*** (ఎం. ఫిల్., అముద్రిత సిద్ధాంత వ్యాసం) తిరుపతి: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, 1978.

15. మోహన్. మేడసాని (సం.పా.), ***రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ శత జయంతి సంచిక.*** తిరుపతి: టి. టి. డి, 1993.

16. రమాంజనీ కుమారి. వి, ***విమర్శకునిగా రాళ్లపల్లి.*** (ఎం. ఫిల్., సిద్ధాంత వ్యాసం) హైదరాబాద్: విశ్వవిద్యాలయం, 2005.

సుందరాచారి, శంకరంబాడి. వెంకటేశ్వరరావు, కనక మేడల. ***శ్రీమాన్ రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ సన్మాన సంచిక.*** చిత్తూరు: అక్టోబర్ 1961.

## 6. పరిశోధన గ్రంథ రచనా పద్ధతి (Method of Research)

ఈ పరిశోధన కవి జీవిత విమర్శనాత్మక పద్ధతి (Biographical criticism) లో కొనసాగింది. రాళ్ళపల్లి వారు సాహిత్య, సంగీతాలపై చేసిన కృషిని దృష్టిలో పెట్టుకొని సిద్ధాంత గ్రంథాన్ని ఆరు అధ్యాయాలుగా విభజించడం జరిగింది. అవి:

| | | |
|---|---|---|
| మొదటి అధ్యాయం | : | **రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ జీవితం – పరిచయం** |
| రెండవ అధ్యాయం | : | **రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ రచనలు: సమీక్ష** |
| మూడవ అధ్యాయం | : | **వ్యాసకర్తగా రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ** |
| నాల్గవ అధ్యాయం | : | **రాళ్ళపల్లివారి సాహిత్య విమర్శ** |
| ఐదవ అధ్యాయం | : | **సాహిత్య, సంగీత సమన్వయకర్తగా రాళ్ళపల్లి** |
| అరవ అధ్యాయం | : | **రాళ్ళపల్లివారి భాషాశైలి** |

మొదటి అధ్యాయం ***'రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ జీవితం – పరిచయం'*** లో రాళ్ళపల్లివారి జీవితంలోని కొన్ని దశలు స్థూలంగా పరిచయం చేయబడ్డాయి. శర్మగారి కలం నుండి వెలువడిన సృజనాత్మక, విమర్శనాత్మక రచనల సంక్షిప్త సమాచారం ఇవ్వబడింది. రాళ్ళపల్లివారి అపూరూపమైన ఖండకావ్యాలు *'తారాదేవి'*, *'మీరాబాయి'* ల సంక్షిప్త చరిత్ర పేర్కొనబడింది. శర్మగారి ముక్తక కవితలు పెనుగొండ, శమీపూజ, సంధ్యావందనం మొదలైన తొమ్మిది కవితల నేపథ్యాలు వివరించబడ్డాయి వెరసి అనంతకృష్ణుల వ్యక్తిత్వ గరిమ ఆవిష్కరించబడింది.

రెండవ అధ్యాయం ***'రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ రచనలు: సమీక్ష'*** లో శర్మగారి లభ్యమైన రచనల పూర్వాపరాలు పరిశీలించబడ్డాయి. రాళ్ళపల్లివారి కష్టాలు, కన్నీళ్ళు తెలిపే 'భార్గవీ పంచ వింశతి' పద్యాల నేపథ్యం వివరించబడింది. శర్మగారి ఖండకావ్యాలైన

*‘తారాదేవి’, ‘మీరాబాయి’* ల కథా సారాంశం, కావ్య సౌందర్యం, పాత్ర చిత్రణా వైశిష్ట్యం, రచనా రామణీయకాలను సుదీర్ఘంగా చర్చించడం జరిగింది. అంతేకాక ఆనాడు వెలువడిన ఖండకావ్యాల నేపథ్యంలో రాళ్ళపల్లివారి ఖండకావ్యాల వైశిష్ట్యాన్ని గుర్తించబడింది. అనంతకృష్ణులవారి *‘పెనుగొండ కొండ’ ‘పరిహాసలీల’, ‘మురళీవీణ’, ‘సంధ్యావందనం’, ‘ఆహ్వానము’, ‘విస్మృత వేణుగీతి’, ‘శమీపూజ’, ‘భారతికి సాధు వాదము’, ‘ప్రబంధకవి’* అనే ముక్తక కవితల తాత్పర్యాలు, వాటి గొప్పతనాలు పరిచయం చేయబడ్డాయి. కాళిదాసు రచించిన *‘రఘువంశము’* లోని ‘అజ విలాపాన్నీ, వేదాంత దేశికుని ‘అభీతీ స్తవము’ ను శర్మగారు ఎంతో హృద్యంగా తేటతెలుగులోకి తీసుకొచ్చి, ఆలోచింపజేసిన విధానాన్ని పరిచయం చేయబడింది. కాగా హాలుని *‘గాథాసప్తశతి’*కి రాళ్ళపల్లి వారు చేసిన సంపూర్ణానువాదం తెలుగువారిని ఎంతో ఆకట్టుకొంది. దీన్ని మరి కొంతమంది తెలుగు భాషలోకి సంపూర్ణ అనువాదం చేశారు. ఈ అనువాదాలన్నిటినీ స్వీకరించి శర్మగారి అనువాదంతో తులనాత్మకంగా పరిశీలింపబడింది. వెరసి రాళ్ళపల్లివారి అనువాద కౌశలాన్ని సుస్పష్టంగా తెలుపడమైంది. కాగా *‘నృత్త రత్నావళి’ ‘సుందరపాండ్య విరచిత ఆర్యా’* ల అనువాద గొప్పతనాల్నీ, వాటి కథా కమామీషుల్నీ ఆవిష్కరింపజేయబడ్డాయి. రాళ్ళపల్లివారి వేమన, నాటకోపన్యాసములు, సారస్వతాలోకము, రాళ్ళపల్లి పీఠికలు, రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు అనే విమర్శ రచనల్లో రచయిత దృక్పథాన్ని, విషయ ఔచిత్యాన్ని సమీక్షించడం జరిగింది.

మూడవ అధ్యాయం ***‘వ్యాసకర్తగా రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ’***లో వ్యాసం నిర్వచనాలు, లక్షణాలు, భేదాల్నీ పేర్కొంటూ సాహిత్య వ్యాసం రాసిన ప్రముఖుల పేర్లను స్మరించుకోడం జరిగింది. శర్మగారి సమకాలికులు కట్టమంచి రామలింగారెడ్డి, పింగళి లక్ష్మీకాంతంల వ్యాసరచనా విధానాలు ఉదాహరణ సహితంగా పరిశీలించబడ్డాయి. అనంతకృష్ణుల వ్యాసరచనా ప్రత్యేకతలైన ఆది, మధ్య, అంతాల స్వరూపాల్ని ఆధారాలతో నిరూపించడం జరిగింది.

నాల్గవ అధ్యాయం ***‘రాళ్ళపల్లివారి సాహిత్య విమర్శ’*** లో తెలుగు సాహిత్య విమర్శ శర్మగారికి పూర్వం వర్ధిల్లిన తీరు వివరించబడింది. కట్టమంచి రామలింగారెడ్డి తమ భావనా శక్తితో తెలుగు సాహిత్య విమర్శకు దారి చూపిస్తే, రాళ్ళపల్లి వారు ఆ భావనా శక్తికి, వస్తువు, రచనలను జోడించి ఓ పటిష్ఠమైన మార్గాన్ని ఏర్పరచి ముందుకు తీసుకెళ్ళిన క్రమాన్ని సోదాహరణంగా వివరించడం జరిగింది. కాగా అనంతకృష్ణులవారు తమ సాహితీ వ్యాసంగంలో కనబరిచిన స్త్రీ దృక్పథం, వ్యక్తిత్వ చిత్రణ, పాత్ర చిత్రణా వైశిష్ట్యం, రస దృష్టి, అలంకార దృష్టి, సామాజిక నేపథ్యాలను వివరించడం జరిగింది. దరిమిలా కట్టమంచి వారి విమర్శా, భాషా ప్రభావాలు శర్మగారిపై ప్రసరించిన పరిస్థితులను ఈ అధ్యాయంలో చూడవచ్చు.

ఐదవ అధ్యాయం ***'సాహిత్య, సంగీత సమన్వయకర్తగా రాళ్ళపల్లి'*** లో అనంతకృష్ణశర్మగారు తొలి నుంచి తుది దాకా చేసిన సంగీత సాధన, పొందిన సిద్ధి వివరించబడింది. రాళ్ళపల్లివారి సంగీత రచనలు గీతాలు, స్వర పల్లవులు, వర్ణనలు, కృతులు, తిల్లానాలు, మంగళాల రాగ తాళాల వైశిష్ట్యం చెప్పడం జరిగింది. అన్నమయ్య సంకీర్తనలూ, తెనుగు మీరా పాటల విషయంలో రాళ్ళపల్లి వారు చేసిన కృషి పేర్కొనబడింది. అంతేకాకుండా శర్మగారికి కళలపట్ల ఉన్న ఆదరణ, ఆలోచనల మమకారం ఆయా వ్యాసాల్లో సుస్పష్టంగా ఉంది. దీనిని సంక్షిప్తంగా తెలపడం జరిగింది.

ఆరవ అధ్యాయం ***'రాళ్ళపల్లివారి భాషాశైలి'*** లో పద్య, గద్య రచనల్లో శర్మగారి భాషా శైలిని సునిశితంగా పరిశీలించడం జరిగింది. రాళ్ళపల్లి వారు మొదట గ్రాంథిక భాషలోనే రచనలు చేశారు. అయితే, రాను రాను తమ భాషను సరళీకరించుకొంటూ వ్యావహారిక శైలికి చేరువయ్యారు. వెరసి మాండలిక భాషాశైలిని ప్రోత్సహించిన ఆయా సందర్భాలను క్రోడీకరించడం జరిగింది. ప్రధానంగా అనంతకృష్ణశర్మగారి భాషలోని హాస్య, వ్యంగ్య వైఖరుల్ని గుర్తించబడ్డాయి. శర్మగారు ప్రయోగించిన అన్యదేశ్యాలు, సృష్టించిన నూతన పదాలు ఇందులో పేర్కొనబడ్డాయి.

## 7. అనుబంధాలు (Annexures)

ఈ పరిశోధనా గ్రంథం చివర్లో నాలుగు అనుబంధాలను జతపర్చటం జరిగింది.

**మొదటి అనుబంధంలో** వివిధ రచయితలతో తీసుకున్న ఇంటర్వ్యూలను పొందుపరిచాను. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ జీవితం, రచనల నేపథ్యంగా కొందరి ప్రముఖులకు ప్రశ్నావళిని పంపించాను. అందులో సమాధానాలు పంపిన వారు ఆచార్య ఆర్.వి,యస్ సుందరం, డా॥ డి. చంద్రశేఖర్ రెడ్డి, ఆచార్య సి. మృణాళిని, డా॥ సిహెచ్. లక్ష్మణ చక్రవర్తి. వీరి అభిప్రాయాలను ప్రశ్నావళి రూపంలో పొందుపరచడం జరిగింది.

**రెండవ అనుబంధంలో** రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ రచనల వివరాలను ఓ పట్టిక రూపంలో సూచించాను. ఇప్పటి వరకు అచ్చులోకి రాని శర్మగారి పీఠికలూ, వ్యాసాలను నా పరిశోధన కాలంలో వివిధ వ్యక్తులూ, గ్రంథాలయాల ద్వారా సేకరించాను. అలాగే అనంతకృష్ణశర్మగారిపై వివిధ పత్రికలూ, గ్రంథాల్లో వచ్చిన వ్యాసాల వివరాలు మొదలైన వాటిని మొత్తం పేర్కొనడం జరిగింది.

**మూడవ అనుబంధంలో** పరిశోధన కాలంలో నేను వివిధ అంతర్జాతీయ, జాతీయ సదస్సుల్లో పాల్గొని ఆయా అంశాలపై పత్రాలను సమర్పించాను. వీటి వివరాల్లో రెండింటిని మాత్రమే పొందుపరిచాను. అలాగే నేను రాసిన వ్యాసాలు కొన్ని ప్రసిద్ధ మాసపత్రికలూ,

దినపత్రికల్లో ప్రచురితమవడం జరిగింది. వాటిల్లో కూడా కొన్ని ఇందులో జత చేశాను. ఉదాహరణకు...

**జాతీయ సదస్సుల పత్రాల వివరాలు:**

1. 'తెలుగు సాహిత్యం తీరు తెన్నులు' అనే అంశంపై 'తెలుగు శాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్' (విశాఖపట్నం) జూలై 30, 2016న నిర్వహించిన జాతీయ సదస్సులో 'రాళ్ళపల్లివారి తారాదేవి ఖండకావ్యం : స్త్రీల ధైర్య సాహసాలు' పై పత్రం సమర్పించాను.
2. 'ఆధునిక తెలుగు కవిత్వంలో ప్రాంతీయ అస్తిత్వం' అనే అంశంపై 'శ్రీ విరక్తిగవి మఠం ప్రభుత్వ డిగ్రీ కళాశాల' (కళ్యాణదుర్గం) ఫిబ్రవరి 2,3, 2017న నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సులో 'రాళ్ళపల్లివారి కవిత్వంలో ప్రాంతీయ అస్తిత్వం'పై పత్రం సమర్పించాను.

**ప్రచురితమైన వ్యాసాల వివరాలు:**

1. 'పరిశోధన నాడు, నేడు రేపు' ఫిబ్రవరి, 2016 **(ISBN 978-93-81992-32-6)** అనే గ్రంథంలో ప్రచురితమైన వ్యాసం 'కవి జీవితాల పరిశోధనలు: రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ' పుటలు: 160-163.
2. భావవీణ (అంతర్జాతీయ తెలుగు సాహిత్య, సాంస్కృతిక & భాషాధ్యయన మాసపత్రిక) సంచిక: 14, సంపుటి: 11, నవంబర్, 2017. **(ISSN 2456-4702)** లో ' రాళ్ళపల్లివారి సాహిత్య పీఠికా పరిమళం' పుటలు: 41-42,
3. ఆంధ్రప్రభ, జనవరి,22, 2018. 'విమర్శకు వన్నె తెచ్చిన రాళ్ళపల్లి'
4. ఆంధ్రజ్యోతి, డిసెంబర్, 10, 2018. 'రాళ్ళపల్లి వ్యాసాల్లో స్త్రీ దృక్పథం'

**నాల్గవ అనుబంధంలో** పరిశోధన కాలంలో క్షేత్ర పర్యటనకు వెళ్ళినప్పుడు తీసుకున్న ఫొటోల్లో కొన్నిటిని మాత్రమే పొందుపరచడం జరిగింది.

## 8. పరిశోధన లక్ష్యం – ప్రయోజనాలు (Research objects/Results)

1. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ జీవితాన్ని, సాహిత్య, సంగీత కృషిని పరిచయం చేయడమే పరిశోధన ప్రధాన లక్ష్యం.
2. అల్పసంతోషిగానే రాళ్ళపల్లి వారు తమ జీవితాన్ని కొనసాగించారు. ఈయన జీవితంలో ఎన్ని ఒడిదుడుకుల ఎదురైనా వాటిని సంయమనంతో స్వీకరించి బతికినవారు. దీని నుండి స్ఫూర్తి కలుగుతుంది.

3. రాళ్ళపల్లివారి సృజనాత్మక, అనువాద, విమర్శ రచనల వల్ల ఎన్నో విశేషాంశాలు బోధపడతాయి.
4. సృజనాత్మక రచనల్లోని తారాదేవి, మిరాబాయి ఖండకావ్యాల్లో స్త్రీవాద దృక్పథం తెలుస్తుంది. అలాగే విషయం వివరణలో ప్రయోగించే అలంకారాలు, ఛందస్సు ప్రాముఖ్యం బోధపడుతుంది.
5. శర్మగారి ముక్తక కవితల వల్ల ప్రాంతీయ అస్తిత్వం, స్వాతంత్ర్య కాంక్ష, సంగీత విద్య విలువలు స్పష్టమవుతాయి.
6. అనువాద రచనల వల్ల మూల సౌష్ఠవం, విషయ ప్రాధాన్యం, జాతీయాలు, నుడికారాలు మొదలైన ప్రత్యేక భాషాంశాలు ఆకర్షిస్తాయి.
7. అనంతకృష్ణశర్మగారి వ్యాస రచనా విధానం ఓ ప్రత్యేకమైనది. దీన్ని తీర్చిదిద్దిన క్రమం ఆలోచనాత్మకంగా, విజ్ఞాన దాయకంగా, కళాత్మకంగా, ఉదాత్తంగా రూపొందినట్లు తెలుసుకుంటాం.
8. శర్మగారి వ్యాసాలన్నీ దాదాపు ఉపన్యాసాలే. కావునా శ్రోతల హృదయాల్లో ప్రవేశించి వారి స్థాయికి తగ్గట్టుగా తనదైన ధోరణితో మాట్లాడగలిగే నేర్పు, ఓర్పు రాళ్ళపల్లి వారికి సహజంగా అబ్బిందని స్పష్టమవుతుంది.
9. క్లిష్టమైన  పాఠాంతరాలను సులభంగా అర్థం చేసుకోవడానికీ శర్మగారి గ్రంథపరిష్కరణ విధానం బాగా దోహద పడుతుంది.
10. రాళ్ళపల్లి వారు చేస్తున్న పనిలో గుణ దోషాల తత్త్వాలను తెలుసుకొని ముందుకు కొనసాగిన ని స్వార్థ పరులని ఆయా రచనల వల్ల అర్థమవుతుంది.
11. ఈయన ప్రాచీన సాహిత్యంపై వెలువరించిన అభిప్రాయాలు ఆధునిక సాహిత్య అధ్యాయానికి ఎంతో ఉపకరిస్తాయి.
12. రాళ్ళపల్లి వారు ప్రత్యేకించి విమర్శా గ్రంథాలు రాయకున్న విమర్శ నేపథ్యాన్నీ, లక్ష్యాన్ని అక్కడక్కడ వ్యాసాల ద్వారా బయటపెట్టారు. వీటన్నిటినీ ఒకటిగా స్వీకరించి లోతైన అధ్యయనం చేసి అవసరమైన వాటిని పేర్కొనబడింది.
13. శర్మగారి వ్యాసాలు చదివితే వారి భావం, వస్తువు, రచనలు బాగా అవగాహనకు వస్తాయి.
14. నానాటికి కళలపై ఆదరణ తగ్గిపోతున్న కాలంలో శర్మగారి సంగీత సాధన సిద్ధి దారి దీపంగా ఉపయోగపడుతుంది.
15. ఈ కళలపై అనంతకృష్ణశర్మగారు వెల్లడించిన అనేక అభిప్రాయాలు ఈ పరిశోధనలో తెలుపబడ్డాయి. కళల అభివృద్ధికి ప్రభుత్వాల చొరవ చాలా అవసరమని రాళ్ళపల్లి వారు అంటారు. వీటిని అవగాహనతో అర్థం చేసుకోగలిగితే సాధారణ విద్యార్థులకు సైతం సంగీతంపై మిగతా కళలపై మక్కువ కలగక మానదు.

16. రాళ్ళపల్లివారి భాషాశైలి గొప్ప ఉదాత్తమైనదిగా ఉంటుంది. వీరి అభిప్రాయాలు భావి కవులకు, రచయితలకు బాగా ఉపయోగపడగలవు. వీరి హాస్య, వ్యంగ్య వైఖరి విధానాలు అభివృద్ధికి బాటలు నిర్మించే సామగ్రిలా తోడ్పడతాయని తెలుస్తుంది.

17. కట్టమంచి వారు రాళ్ళపల్లి వారు గురువు శిష్యులు అయినా వారి మధ్య అభిప్రాయ విభేదాలు వచ్చిన సందర్భాలు అక్కడక్కడ చోటుచేసుకున్నాయి. ఇటువంటి వాతావరణం కట్టమంచివారే శర్మగారికి కలిగించారని తెలుస్తుంది. ఈ ధోరణి నేటి సాహిత్య లోకానికి ఎంతో అవసరం.

18. సాధారణంగా సాహిత్య రచనలో తప్పులు జరుగుతుంటాయి. వాటిని ఎక్కువ మంది రచయితలు, కవులు పునః పరిశీలన చేసుకోవడంలో జాప్యం జరుగుతుంటుంది. కానీ శర్మగారి లాంటి వారి రచనా కృషి విశేషాలు తెలుసుకోవడం వల్ల ఆయా తప్పులను సరిదిద్దుకోవాలనే ఆలోచన మొదలవుతుంది.

19. అనంతకృష్ణశర్మగారి విమర్శ చదవడం వల్ల అభ్యుదయ భావాలు అలవడతాయి. గుణ దోషాల జ్ఞానం కలుగుతుంది. తులనాత్మక దృష్టి, సునిశిత పరిశీలన దృక్పథం లాంటి గొప్ప లక్షణాలు పరిచయం అవుతాయి.

విలువలతో కూడిన జీవితం గడిపిన రాళ్ళపల్లివారి అనుభవాలు నేటి విద్యార్థి లోకానికి ఎంతో ఉపయోగకరమనీ, ఆదర్శనీయమని విశ్వసిస్తున్నాను.

# విషయసూచిక


పుటలు

కృతజ్ఞతలు v

సంకేత పద వివరణ vii

**ప్రవేశిక** (viii-xvii)

**1.** పరిశోధనాంశం పరిచయం (Introduction) viii
**2.** పరిశోధన ఆవశ్యకత (Necessity of the Research) viii
**3.** పూర్వ పరిశోధనల పరామర్శ (Review of literature) ix
**4.** క్షేత్ర పర్యటన / గ్రంథ సేకరణ (Field-Work/ Books collection) x
**5.** పరిశోధన ఆకరాలు (Research Source ) xi
**6.** పరిశోధన గ్రంథ రచనా పద్ధతి (Method of Research) xii
**7.** అనుబంధాలు (Annexures) xiv
**8.** పరిశోధన లక్ష్యం – ప్రయోజనాలు (Research objects/Results) xv

మొదటి అధ్యాయం

**రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ జీవితం-పరిచయం** (1-31)
**1.0.** నేపథ్యం 1
**1.1.** రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ జననం 1
**1.2.** రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ బాల్యం, విద్యాభ్యాసం 3
**1.3.** కట్టమంచి రామలింగారెడ్డిగారితో పరిచయం 7
**1.4.** సాహిత్య ప్రవేశం 10
**1.5.** మైసూరు మహారాజా కాలేజీలో తెలుగు పండితునిగా ప్రవేశం 12
**1.5.1.** మహారాజా కళాశాల విశేషాలు 13
**1.6.** రాళ్ళపల్లి వారి రచనా వ్యాసంగం 14
**1.7.** మైసూరులో సంగీత సాధన 20
**1.8.** అన్నమయ్య సంకీర్తనల పరిష్కరణ 21
**1.9.** రాళ్ళపల్లి వారి మరి కొన్ని రచనలు 22

**1.10.** రాళ్ళపల్లి వారి పీఠికలు 23
**1.11.** రాళ్ళపల్లి వారి వైవాహిక జీవితం 25
**1.12.** ప్రశంసలు 28
**1.13.** సన్మానాలు, సత్కారాలు 29

రెండవ అధ్యాయం

**రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ రచనలు: సమీక్ష (32-162)**

**2.0.** సృజనాత్మక రచనలు 32
**2.1.** భార్గవీ పంచ వింశతి 32
**2.2.** ఖండకావ్యాలు 33
**2.2.1.** ఖండకావ్య నిర్వచనం 34
**2.2.2.** ఖండకావ్య లక్షణాలు 34
**2.2.3.** తెలుగులో తొలి ఖండకావ్యాలు 36
**2.2.3.1.** కట్టమంచి రామలింగారెడ్డి – ముసలమ్మ మరణము 37
**2.2.3.2.** గురజాడ అప్పారావు – పూర్ణమ్మ 37
**2.2.3.3.** రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ – తారాదేవి 37
**2.3.** తారాదేవి ఖండకావ్యం : విశ్లేషణాత్మక పరిశీలన 38
**2.3.3.** ప్రాథమిక వివరాలు 38
**2.3.4.** తారాదేవి కావ్యంలో కావ్యేతివృత్తం 39
**2.3.5.** తారాదేవి కావ్యంలో పాత్ర చిత్రణ 40
**2.3.5.1.** తారాదేవి 40
**2.3.5.2.** హరసింగు 41
**2.3.5.3.** భద్రసింగు 42
**2.4.** తారాదేవి కావ్యంలో సంభాషణలు 43
**2.5.** తారాదేవి కావ్యంలో భాషాశైలి 45
**2.6.** తారాదేవి కావ్య రచనా వైశిష్ట్యం 47
**2.6.3.** తారాదేవి కావ్యంలో వర్ణనలు 47
**2.6.4.** తారాదేవి కావ్యంలో అలంకారాలు 49
**2.6.4.1.** ఉపమాలంకారం 49
**2.6.4.2.** స్వభావోక్తి అలంకారం 50

| | | |
|---|---|---|
| ***2.6.5.*** | తారాదేవి కావ్యంలో ఛందస్సు | 50 |
| ***2.6.6.*** | తారాదేవి కావ్యంలో రస పోషణ | 52 |
| ***2.6.7.*** | తారాదేవి కావ్యంలో సామాజికాంశాలు | 53 |
| **2.7.** | మిరాబాయి  ఖండకావ్యం : విశ్లేషణాత్మక పరిశీలన | 53 |
| **2.7.3.** | మిరాబాయి కావ్య స్వరూపం | 53 |
| **2.7.4.** | చరిత్రలో మీరాబాయి | 54 |
| **2.7.5.** | మిరాబాయి కావ్యేతివృత్తం | 55 |
| **2.7.6.** | మిరాబాయి కావ్యేతివృత్తంలో మార్పులు | 56 |
| **2.7.7.** | మిరాబాయి కావ్యంలో పాత్ర చిత్రణ | 56 |
| **2.7.7.1.** | మిరాబాయి | 56 |
| **2.7.7.2.** | కుంభరాణా (మీరాబాయి భర్త) | 58 |
| **2.7.7.3.** | ఢిల్లీ పాదుషా | 59 |
| **2.7.7.4.** | మంత్రి (మిరాబాయి మరిది) | 60 |
| **2.7.8.** | మిరాబాయి కావ్యంలో సంభాషణలు | 60 |
| **2.7.9.** | మిరాబాయి కావ్యంలో దేశకాల పరిస్థితులు | 61 |
| **2.7.10.** | మిరాబాయి కావ్య రచనా వైశిష్ట్యం | 62 |
| **2.7.8.1.** | మిరాబాయి కావ్యంలో వర్ణనలు | 63 |
| **2.7.8.2.** | మిరాబాయి కావ్యంలో అలంకారాలు | 63 |
| **2.7.8.2.1.** | ఉపమాలంకారం | 63 |
| **2.7.8.2.2.** | స్వభావోక్తి అలంకారం | 64 |
| **2.7.9.** | మిరాబాయి కావ్యంలో భాషాశైలి | 65 |
| **2.7.10.** | మిరాబాయి కావ్యంలో ఛందస్సు | 66 |
| **2.7.11.** | మిరాబాయి కావ్యంలో రస పోషణ | 67 |
| **2.8.** | తెలుగు సాహిత్యంలో రాళ్ళపల్లి వారి ఖండకావ్యాల స్థానం | 68 |
| **2.9.** | రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ ముక్తక కవితలు | 68 |
| **2.9.1.** | పెనుగొండ కొండ | 69 |
| **2.9.1.1.** | కవిత విశ్లేషణ | 69 |
| **2.9.1.2.** | కవిత చారిత్రక నేపథ్యం | 69 |
| **2.9.2.** | పరిహాసలీల | 71 |
| **2.9.3.** | ముసలివీణ | 72 |

| | | |
|---|---|---|
| **2.9.4.** | సంధ్యావందనము | 73 |
| **2.9.5.** | ఆహ్వానము | 74 |
| **2.9.6.** | విస్మృత వేణుగీతి | 74 |
| **2.9.7.** | శమీపూజ | 75 |
| **2.9.8.** | భారతికి సాధువాదము | 76 |
| **2.9.9.** | ప్రబంధకవి | 77 |
| **2.10.** | రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ అనువాద రచనలు | 77 |
| **2.10.1.** | అజవిలాపము | 78 |
| **2.10.2.** | అభీతి స్తవము | 79 |
| **2.10.3.** | శాలివాహన గాథాసప్తశతీ సారము | 81 |
| **2.10.3.1.** | తెలుగులో *'గాథా సప్తశతి'* సంపూర్ణ అనువాదాలు – వాటి విశేషాలు | 81 |
| **2.10.3.1.1.** | గట్టి లక్ష్మీనరసింహ శాస్త్రి: *'గాథా సప్తశతి'* | 82 |
| **2.10.3.1.2.** | రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ : *'శాలివాహన గాథా సప్తశతీ సారము'* | 82 |
| **2.10.3.1.3.** | వాసిరెడ్డి వేంకటసుబ్బయ్య : *'గాథా సప్తశతి'* | 83 |
| **2.10.3.1.4.** | దీవి సుబ్బారావు: *'గాథా సప్తశతి'* | 83 |
| **2.10.3.1.5.** | కోడూరు ప్రభాకరరెడ్డి : *'గాథాత్రిశతి'*, *'గాథాచతుశ్శతి'* | 83 |
| **2.10.3.2.** | తెలుగులో *'గాథా సప్తశతి'* అసంపూర్ణ అనువాదాలు– వాటి వివరాలు | 84 |
| **2.10.3.3.** | తెలుగులో *'గాథా సప్తశతి'* పై జరిగిన పరిశోధనలు | 85 |
| **2.10.3.4.** | గాథా సప్తశతి అనువాదాలు : వస్తు విశ్లేషణ | 85 |
| **2.10.3.5.** | సంపూర్ణ గాథా సప్తశతీ అనువాదాల వైశిష్ట్యం – తులనాత్మక పరిశీలన | 88 |
| **2.10.4.** | నృత్త రత్నావళి | 98 |
| **2.10.5.** | సుందరపాండ్య విరచిత ఆర్యా | 101 |
| **2.11.** | రాళ్ళపల్లివారి విమర్శ రచనలు | 104 |
| **2.11.1.** | వేమన | 104 |
| **2.11.2.** | నాటకోపన్యాసములు | 120 |
| **2.11.3.** | సారస్వతాలోకము | 128 |
| **2.11.4.** | రాళ్ళపల్లి పీఠికలు | 141 |
| **2.11.5.** | రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు | 152 |

మూడవ అధ్యాయం

## వ్యాసకర్తగా రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ (163-199)


| | | |
|---|---|---|
| **3.0.** | వ్యాసం – నిర్వచనాలు | 163 |
| **i.** | ఇంగ్లీషు నిర్వచనాలు | 163 |
| **ii.** | తెలుగు నిర్వచనాలు | 164 |
| **3.1.** | వ్యాసం – లక్షణాలు | 164 |
| **3.1.1.** | వ్యాసం - భేదాలు | 165 |
| **3.2.** | సాహిత్య వ్యాసం – కొందరు వ్యాసకర్తలు | 165 |
| **3.2.1.** | కట్టమంచి రామలింగారెడ్డి | 165 |
| **3.2.2.** | పింగళి లక్ష్మీకాంతం | 167 |
| **3.2.3.** | రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ | 168 |
| **3.3.** | రాళ్ళపల్లి వారి వ్యాస రచనా ప్రత్యేకతలు | 169 |
| **3.3.1.** | వ్యాసంలో ఆదిభాగం | 170 |
| **3.3.1.1.** | ఆధార గ్రంథాలతో వ్యాసాన్ని ప్రారంభించడం | 170 |
| **3.3.1.2.** | విశిష్ట లక్షణాలతో వ్యాసాన్ని ప్రారంభించడం | 170 |
| **3.3.1.3.** | నేరుగా విషయంతో వ్యాసాన్ని ప్రారంభించడం | 171 |
| **3.3.1.4.** | తులనాత్మకంగా వ్యాసాన్ని ప్రారంభించడం | 172 |
| **3.3.1.5.** | సమకాలీన సాంస్కృతికాంశాలతో వ్యాసాన్ని ప్రారంభించడం | 172 |
| **3.3.2.** | వ్యాసంలో మధ్యభాగం | 173 |
| **3.3.3.** | వ్యాసంలో అంత్యభాగం | 192 |
| **3.4.** | రాళ్ళపల్లి వారి వ్యాస నిర్మాణ వైశిష్ట్యం | 197 |


నాల్గవ అధ్యాయం

## రాళ్ళపల్లి వారి సాహిత్య విమర్శ (200- 261)


| | | |
|---|---|---|
| **4.0.** | తెలుగు సాహిత్య విమర్శ – పూర్వ రంగం | 200 |
| **4.1.** | కట్టమంచి రామలింగారెడ్డి విమర్శ | 203 |
| **4.2.** | రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ – విమర్శ | 206 |
| **4.2.1.** | రాళ్ళపల్లి విమర్శ మార్గం | 206 |
| **4.2.1.1.** | భావము | 206 |

| | | |
|---|---|---|
| **4.2.1.2.** | వస్తువు | 210 |
| **4.2.1.3.** | రచన | 212 |
| **4.2.1.4.** | భావము, వస్తువు, రచనల్లో ముఖ్యాంశాలు | 214 |
| **4.3.** | అభిరుచి విమర్శ | 215 |
| **4.4.** | రాళ్ళపల్లి వారి – స్త్రీవాద దృక్పథం | 220 |
| **4.4.1.** | ఖండకావ్యాల్లో స్త్రీ దృక్పథం | 221 |
| **4.4.2.** | విమర్శలో స్త్రీ దృక్పథం | 222 |
| **4.5.** | రాళ్ళపల్లి వారి వ్యాసాల్లో వ్యక్తిత్వ చిత్రణ | 227 |
| **4.6.** | రాళ్ళపల్లి వారి వ్యాసాల్లో పాత్ర చిత్రణ వైశిష్ట్యం | 230 |
| **4.7.** | రాళ్ళపల్లి వారి దృష్టిలో రసం | 232 |
| **4.8.** | రాళ్ళపల్లి వారి దృష్టిలో అలంకారం | 237 |
| **4.9.** | రాళ్ళపల్లి వారి – సామాజిక దృక్పథం | 238 |
| **4.9.1.** | విమర్శ వ్యాసాల్లో సామాజిక దృక్పథం | 238 |
| **4.9.1.1.** | కవిత్వం – సామాజిక బాధ్యత | 239 |
| **4.9.1.2.** | జానపద సాహిత్యం | 239 |
| **4.9.1.3.** | ప్రబంధ సాహిత్య ఔన్నత్యం | 240 |
| **4.9.1.4.** | ఉత్తమ సంస్కారం | 240 |
| **4.9.1.5.** | ప్రజా పద జనకుడు – క్షేత్రయ్య | 241 |
| **4.9.1.6.** | సాహిత్య సామాజిక సేవ | 241 |
| **4.9.1.7.** | విద్యా విధానం | 241 |
| **4.9.1.8.** | గ్రామీణ దృష్టి | 242 |
| **4.9.1.9.** | నాటకోపన్యాసములు – సామాజిక దృక్పథం | 243 |
| **4.9.1.10.** | సారస్వతాలోకము – సామాజిక దృక్పథం | 245 |
| **4.9.1.11.** | వేమన – సామాజిక దృక్పథం | 246 |
| **4.9.1.11.1.** | కవి – కవిత్వం | 246 |
| **4.9.1.11.2.** | కవి – స్వతంత్ర బుద్ధి | 247 |
| **4.9.1.11.3.** | సామెతలు – నీతులు | 248 |
| **4.9.1.11.4.** | హాస్యం | 248 |
| **4.9.1.11.5.** | సమాజ సంక్షేమం | 249 |
| **4.9.1.11.6.** | హేతువాద దృష్టి | 250 |

**4.9.1.11.7.** మౌలికత – సంఘ సంస్కరణ 250
**4.9.1.11.8.** వేమన కాలం – సమాజం స్థితిగతి 251
**4.10.** రాళ్ళపల్లి వారిపై కట్టమంచి రామలింగారెడ్డి ప్రభావ – విశేషాలు 253
**4.10.1.** కట్టమంచివారు పరిచయానికి ముందు రాళ్ళపల్లి 253
**4.10.2.** కట్టమంచివారి పరిచయం తర్వాత రాళ్ళపల్లి 254
**4.10.3.** రాళ్ళపల్లి సృజన సాహిత్యంపై కట్టమంచి వారి ప్రభావం 255
**4.10.4.** రాళ్ళపల్లి విమర్శపై కట్టమంచి వారి ప్రభావం 256
**4.10.5.** భావనా శక్తి 256
**4.10.6.** భాషాశైలి 258

ఐదవ అధ్యాయం

## సాహిత్య, సంగీత సమన్వయకర్తగా రాళ్ళపల్లి (262–287)

5.0. రాళ్ళపల్లి వారికి తల్లి నేర్పిన సంగీతం 262
**5.1.** రాళ్ళపల్లి వారు గురువులతో నేర్చుకున్న సంగీతం 264
**5.2.** రాళ్ళపల్లి వారు ఇతరులకు నేర్పిన సంగీతం 265
**5.3.** రాళ్ళపల్లి వారి సంగీత రచనలు – పరిశీలన 267
**5.3.1.** గీతము 268
**5.3.2.** స్వర పల్లవి 270
**5.3.3.** వర్ణము 271
**5.3.4.** కృతులు 272
**5.3.5.** తిల్లానాలు 277
**5.3.6.** మంగళాలు 278
**5.4.** అన్నమయ్య సంకీర్తనలు – రాళ్ళపల్లి వారి పరిష్కరణ 279
**5.5**. తెనుగు మీరా 281
**5.6.** రాళ్ళపల్లి వారి సంగీత వ్యాసాలూ – విశేషాంశాలు 282

ఆరవ అధ్యాయం

## రాళ్ళపల్లివారి భాషాశైలి (288–305)

**6.0.** రాళ్ళపల్లి పద్య రచనలు – భాషాశైలి 288
**6.1.** భార్గవీ పంచ వింశతి 288

| | | |
|---|---|---|
| **6.2.** | ఖండకావ్యాలు | 289 |
| **6.3.** | కవితలు | 291 |
| **6.4.** | అనువాదాలు | 292 |
| **6.5.** | రాళ్ళపల్లి గద్య రచన – భాషాశైలి | 295 |
| **6.5.1.** | 1912 నుండి 1917 మధ్య కాలంలో భాషాశైలి | 295 |
| **6.5.2.** | 1918 నుండి 1950 మధ్య కాలంలో భాషాశైలి | 298 |
| **6.5.3.** | 1951 నుండి 1977 మధ్య కాలంలో భాషాశైలి | 298 |
| **6.6.** | రాళ్ళపల్లి భాషాశైలి: హాస్య వ్యంగ్య వైఖరి | 301 |
| **6.7.** | రాళ్ళపల్లి వారి భాషలో అన్యదేశ్య పదాలు | 302 |
| **6.8.** | రాళ్ళపల్లి వారి భాషలో నూతన పదాల సృష్టి | 303 |

**ఉపసంహారం** (306-308)

**ఉపయుక్త గ్రంథ సూచి** (309-315)

**అనుబంధం 1** (316-340)

**వివిధ రచయితలతో ఇంటర్వ్యూలు**

| | | |
|---|---|---|
| **1.** | ఆచార్య ఆర్. వి. యస్. సుందరం | 316 |
| **2.** | డా॥ డి. చంద్రశేఖర్ రెడ్డి | 320 |
| **3.** | ఆచార్య సి. మృణాళిని | 326 |
| **4.** | డా॥ సిహెచ్. లక్ష్మణ చక్రవర్తి | 335 |

**అనుబంధం 2** (341-346)

| | |
|---|---|
| **1**. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ రచనల పట్టిక – వివరాలు | 341 |
| **2**. కన్నడ రచనలు | 342 |
| **3**. రాళ్ళపల్లి వారి ముక్తక కవితలు | 342 |
| **4.** రాళ్ళపల్లి వారి వ్యాసాల్లో చేరనివి | 343 |
| **5**. రాళ్ళపల్లి పీఠికలు' లో చేరినవి | 343 |
| **6**. రాళ్ళపల్లి వారి రచనలపై పత్రికల్లో వచ్చిన వ్యాసాలు | 345 |

**అనుబంధం 3** (347-361)

సదస్సులు మరియు పరిశోధన వ్యాసాలు

**అనుబంధం 4** (362-366)

క్షేత్ర పర్యటనలో భాగంగా తీసుకున్న ఫోటోలు



# మొదటి అధ్యాయం

# రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ జీవితం–పరిచయం

## మొదటి అధ్యాయం

# రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ జీవితం–పరిచయం

## 1.0. నేపథ్యం

తెలుగు సాహిత్య ప్రపంచానికి ఎంతో మంది రచయితలు అమోఘమైన సేవలు అందించారు. అలాంటి ప్రతిభావంతుల్లో శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ పేర్కొనదగినవారు. ఈయన కవి, అనువాదకులు, విమర్శకులు, విద్వాంసులు, సంగీత శాస్త్ర ప్రవీణులుగా ప్రసిద్ధి చెందినవారు. శర్మగారు తెలుగు వచనానికి ఒరవడి దిద్దిన శిల్పి. ప్రాచ్య పాశ్చాత్య ధోరణుల్ని తెలివిగా అర్థం చేసుకుని ఎంతో విజ్ఞానాన్ని పొందారు. దీన్ని వీలైనంత వరకు తమ రచనల ద్వారా వెల్లడించే ప్రయత్నం చేశారు. శర్మగారు సంప్రదాయంగా జీవించినా అభ్యుదయమైన ఆలోచన విధానాన్ని అలవర్చుకుంటూ ముందు నడిచిన మహానుభావులు. తెలుగు సాహిత్యానికి అద్వితీయమైన సేవ చేసిన వీరి జీవిత చరిత్ర సంక్షిప్తంగా తెలుసుకోవడం ముదావాహం.

## 1.1. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ జననం

***ఆ.వె. "చెప్పఁబోవుదానిఁ జప్పిమాటల చేతఁ***
***జెప్పవచ్చుఁ: దాన ముప్పు లేదు:***
***చెప్పవలయు రసము చిప్పిల నీయట్లు***
***కీర్తనీయ చరిత! కృష్ణ శర్మ!"*** [1]

అనంతపురం సీడెడ్ డిస్ట్రిక్ట్ కాలేజి (నేటి ప్రభుత్వ కళాశాల)లో రాళ్ళపల్లివారు వేమన గురించి ఏడు ఉపన్యాసాలు ఇచ్చిన అనంతరం చిలుకూరి నారాయణరావు '' కీర్తనీయచరిత కృష్ణ శర్మ'' అనే మకుటంతో 32 పద్యాలు రాసి రాళ్ళపల్లివారిని అభినందించారు. సుప్రసిద్ధ కవి, సినీ గేయ రచయిత సి నారాయణరెడ్డి ఓ సందర్భంలో రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గురించి ఈ విధంగా ప్రశంసించారు.

***"రాళ్లలో ఒక నవ్య రాగ ముదయిస్తే***
***పల్లిలో ఒక భవ్య భావ ముదయిస్తే***
***రాగభావములు రసయోగాకృతి వహిస్తే***
***ఆ మూర్తి రాళ్ళపల్లి అనంత కృష్ణునిది***
***ఆ స్ఫూర్తి అక్షర శిఖరాగ్ర రోచిష్ణునిది***

---

[1] వేమన. పుట. xv.

**మతము వైష్ణవము అభిమతము శివము"[2]**

అలా కీర్తింపబడిన రాళ్ళపల్లివారు ఇటు సాహిత్యంలోను, అటు సంగీతంలోను చేసిన కృషి స్మరించదగింది. కాబట్టి వీరి గురించి ఆధునిక సాహిత్య ప్రపంచానికి గుర్తుచేయడంలో భాగంగా ఈ విషయాలు పంచుకోవడమయింది.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం తాలుకా కంబదూరు మండల కేంద్రానికి ఏడు కిలో మీటర్ల దూరంలో ఉన్న రాళ్ళపల్లి అనే గ్రామంలో 1893 జనవరి 23వ తేదీన జన్మించారు. వీరి తల్లి శ్రీమతి అలివేలు మంగమ్మ, తండ్రి కర్నమడకల కృష్ణమాచార్యులు. ఈయన పూర్వీకులు రాయదుర్గం సంస్థానానికి ఎన్నో తరాలకు ముందు వలస వచ్చారనీ, వీరి వంశీకులు మంత్ర మూర్తులుగా ప్రసిద్ధి చెందారని ప్రముఖ విమర్శకులు ఘట్టమరాజు అభిప్రాయం.[3] అయితే, రాళ్ళపల్లివారి పూర్వీకులు కొన్నేళ్లకు ముందే తమిళనాడు రాష్ట్రంలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన శ్రీరంగం ప్రాంతం నుండి కర్నూలు జిల్లాలోని కర్నమడకల గ్రామానికి వలస వచ్చినట్లు రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ రెండో కుమారులు ఆర్. ఏ. జయంత చెప్పారు.[4] శర్మగారి తల్లి అలివేలు మంగమ్మ రాళ్ళపల్లి గ్రామ వాస్తవ్యులైన తిరుమల అనంతాచార్యులు, లక్ష్మమ్మల ఏకైక పుత్రిక. కర్నమడకల కృష్ణమాచార్యులు అలివేలు మంగమ్మని వివాహం చేసుకొని రాళ్ళపల్లి లోనే స్థిరపడ్డారు. కృష్ణమాచార్యులకు అటు తండ్రి నుండి, ఇటు భార్య నుండి గొప్ప ఆస్తి సంక్రమించింది. ఈ ఆస్తి రాయదుర్గం, కళ్యాణదుర్గం, హిందూపురం తాలూకాలో కనీసం 2700 ఎకరాలు ఉంటుంది. అక్కడక్కడ ఇనాము భూమి కూడా చాలా వరకు ఉండేది. ఇంత భూమి ఉన్నా వృథా అనే చెప్పాలి. ఎందుకంటే అనంతపురం జిల్లాలో వర్షాలు చాలా తక్కువ. పైగా అది కరువు ప్రాంతం కూడా. ఈ సందర్భంగా విద్వాన్ విశ్వం అనంతపురం జిల్లా గురించి ఒకప్పుడు *'ఆంధ్రప్రభ'* దిన పత్రికలో అన్న మాటలు ఒకసారి గుర్తు చేసుకుందాం *''రాయలసీమలో పిలిచినా పలుకుతుంది క్షామం. అనంతపురం జిల్లాలో పిలవకున్నా పలుకుతుంది క్షామం''*.[5] అలాంటి కరువు కాటకాలకు నిలయమైన అనంతపురం జిల్లాలో ఎంత భూమి ఉన్నా నిష్ప్రయోజనమే. ఈ జిల్లా పరిస్థితి నాటికి నేటికీ ఒక్కటే!

కృష్ణమాచార్యులు, అలివేలు మంగమ్మగార్లకు పదిహేను మంది సంతానం. అందులో ఏడుగురు బాల్యంలోనే మరణించారు. మిగిలిన వారు ఆరుగురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు. వీరిలో మొదటివారు గోపాల కృష్ణమాచార్యులు. ఈయన సుప్రసిద్ధ జ్యోతిశ్శాస్త్ర వేత్త. ప్రసిద్ధ సాహిత్యమాస పత్రిక *'భారతి'*లో కర్నమడకల గోపాల కృష్ణమాచార్యులుగారు రాసే జ్యోతిశ్శాస్త్ర సంబంధమైన వ్యాసాలు తరచుగా ప్రచురింపబడేవి. రెండవ కుమారులు జన్మతః

---

[2] యోగవిద్యా రహస్య వేది రాళ్ళపల్లి– నందవరం కేశవరెడ్డి. పుట. 91. 'మిసిమి' మాసపత్రిక మార్చి సంచిక– 2015.

[3] రాళ్ళపల్లి జీవిత చరిత్ర సంగ్రహము– ఘట్టమరాజు అశ్వత్థనారాయణ. పుట. 119. అనంతరాగం. 1977.

[4] ఆర్. ఎ. జయంతగారితో తిరుపతిలో 4/11/2014న జరిపిన ఇంటర్వ్యూ.

[5] 'రాళ్ళపల్లి జీవిత చరిత్ర సంగ్రహము' అనంతరాగం. పుట.120.

ద్వితీయులు. కానీ అద్వితీయులుగా ప్రసిద్ధి చెందిన రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ. తర్వాత రామాచార్యులు, శ్రీనివాసాచార్యులు, లక్ష్మణా చార్యులు, రంగాచార్యులు. వెరసి రాళ్ళపల్లివారి అక్క యదుగిరమ్మ, చెల్లి సుభద్రమ్మలు కూడా ఉన్నారు. గోపాల కృష్ణమాచార్యులు హిందూపురంలో తహశీల్దారుగా పనిచేశారని, శ్రీనివాసాచార్యులు బెంగళూరులో డి. ఇ. ఓ గా బాధ్యతలు నిర్వహించారని రాళ్ళపల్లి గ్రామ నివాసి అనంతకృష్ణశర్మ వీరాభిమాని 86 ఏళ్ల వృద్ధులైన 'మరిది వెంకటరెడ్డి' చెప్పారు.[6]

శర్మగారిని చిన్నప్పుడే వీరి అమ్మమ్మ రాళ్ళపల్లి లక్ష్మమ్మ దత్తత తీసుకున్నారు. అందువల్లే వీరికి రాళ్ళపల్లి అనే ఇంటి పేరు స్థిరపడింది. లక్ష్మమ్మ కావ్య పురాణ పరిచయం ఉన్న వ్యక్తి. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ పుట్టిన సమయాన్ని లక్ష్మమ్మ నందన నామ సంవత్సరం మాఘ మాసం, శుక్లపక్షం, సోమవారం, రేవతి నక్షత్రం, ద్వితీయ పాదంగా గుర్తించారు. ఈ జన్మ కాలాన్ని రాళ్ళపల్లివారి అన్నగారైన గోపాల కృష్ణమాచార్యులు *'భారతి'* పత్రిక 1961 అక్టోబరు సంచికలో *'అనుజుని జాతకము'* పేరుతో ప్రచురించారు.[7]

## 1.2. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ బాల్యం, విద్యాభ్యాసం

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి బాల్యం అందరి పిల్లలలాగా ఆటపాటలతో గడిచింది. వీరి కుటుంబ సభ్యుల్లో దాదాపు చదువుకున్నవారే ఎక్కువని చెప్పాలి. శర్మగారి తండ్రి సంస్కృతంలో గొప్ప పండితులు. ఇక తల్లికి సంగీత శాస్త్రజ్ఞానం లేకున్నా చక్కగా పాటలు పాడేవారు. తర్వాత వీరి అమ్మమ్మ కూడా వైద్య, జ్యోతిశ్శాస్త్రాల, కావ్య పురాణాల పరిచయం కల విదుషీమణి అని ముందే చెప్పుకున్నాం. రాళ్ళపల్లివారు తల్లి అలివేలు మంగమ్మ దగ్గర ఐదారేండ్ల వయసులో అక్క యదుగిరమ్మతో కలిసి రోజూ సంగీతం నేర్చుకునేవారు. అప్పట్లో రాళ్ళపల్లిలో ఆంజనేయస్వామి గుడిలో రోజూ రామ భజనలు జరుగుతుండేవి. భజన చేసే చిన్న పిల్లల్లో తనదే పై చేయిగా ఉండేదని శర్మగారే చెప్పుకున్నారు.[8] అప్పుడప్పుడు అన్న గోపాల కృష్ణమాచార్యులు ఒక నాట్యాచార్యుని వద్ద పిటీలు (వీణ) వాయించడం నేర్చుకునేవారు. దాన్ని చూసిన అనంతకృష్ణశర్మగారు కూడా పిటీలు నేర్చుకున్నారు.[9] జీవితానికి పనికివచ్చే ఇలాంటి విద్యలను రాళ్ళపల్లివారు ఎంతో భక్తి శ్రద్ధలతో నేర్చుకోవడం బాల్యంలోనే అలవరచుకున్నారని అర్థం చేసుకోవచ్చు.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మకి స్వయంగా తండ్రి వద్దే అక్షరాభ్యాసం జరిగింది. ముఖ్యంగా సంస్కృతంలో *'రామాయణ సంగ్రహము, రఘువంశం, చంపూ రామాయణము, చంపూ భారతము, విశ్వగుణాదర్శ'*లను అభ్యసించారు. తెలుగులో *అచ్చతెనుగు రామాయణము, నీలాసుందరీ పరిణయము, ఆంధ్ర నామ సంగ్రహము* వంటి గ్రంథాలు

---

[6] డిసెంబర్ 27/12/ 2015న రాళ్ళపల్లిలో చేసిన ఇంటర్వ్యూ

[7] అనంత గీతిక 2– అంకే శ్రీనివాస్. సాహిత్య పేజి. 'సూర్య దినపత్రిక' నవంబర్ – 10 – 2014.

[8] 'నా గురువులు' శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి సన్మాన సంచిక. 1963. పుట. 12.

[9] 'రాళ్ళపల్లి జీవిత చరిత్ర సంగ్రహము' అనంతరాగం. పుట. 122.

చదివారు. ఈ విధంగా పదమూడేళ్ల వరకు తండ్రి వద్దే సంస్కృత, ఆంధ్ర గ్రంథాల్ని చదువుకున్నారు.

శర్మగారు చిన్నప్పటి నుండి విద్యాబుద్ధులు చెప్పినవారందరిని *'నా గురువులు'* అనే వ్యాసంలో ఎంత ఆత్మీయంగా స్మరించుకున్నారో చూడండి. *''సాహిత్య సంగీత కళలతో నాకు గల అల్ప పరిచయమునకు కారకులైన గురువులెందరో కలరు. వారిలో చిన్నలు, పెద్దలు సాటివారు పలువురు నాకు వివిధములైన అంతస్తులలో విజ్ఞాన దానము చేసినారు. కాని వారిలో నెల్ల నా హృదయమును తీర్చిదిద్దినవారు, పై రెండు కళలలోను కొందరు గొప్ప ఆదర్శములను నా యెదట నిలిచిన వారును అగు కొందఱు మహనీయులను మాత్రమే ఇక్కడ చుక్కలను చూపినట్లు స్మరించి చూసి ధన్యుడనగుదును.''*[10] అని వినయంగా చెప్పకున్నారు.

రాళ్ళపల్లివారికి మొదటి గురువు వారి పితృపాదులే. వీరి బోధన విధానాన్ని శర్మగారు ప్రత్యేకంగా వారి మాటల్లోనే చూద్దాం.*''శాఖాచంక్రమణము ఎప్పుడును చేయక, శ్లోకార్థ తాత్పర్యములను వారి వలె ప్రశాంతముగా చెప్పగలుగుట ఉపాధ్యాయులలో ఎందరో సాధింప లేని సిద్ధి. కావ్య నాటక రసానుభవము వారికెంత తీవ్రమో అంత అంతరంగమైనది: ఆధ్యాత్మికమైనది. చక్కని కవితకు వారు లోగినవారే: కాని బహిరంగముగా సాత్వికభావముల ప్రదర్శించుట వారి వాడుక కాదు. అదొక అసాధారణమైన ఆత్మ సంయమము వారిది''.*[11] అని అన్నారు. కాళిదాసు రచించిన *'రఘువంశము'* సంస్కృత కావ్యాన్ని, *'ఆంధ్ర నామ సంగ్రహము'* ప్రసిద్ధి తెలుగు నిఘంటువును బాల్యంలో తండ్రి గారి వద్ద చదువుకోడం వల్లే తర్వాతి కాలంలో నారికేళ పాకమైన *'ఆముక్తమాల్యద'*, *'సుందర పాండ్యుని ఆర్య'* అనువాదం వంటివి చేయగలిగారని అంచనావేయవచ్చు. తండ్రిగారి ఈ సుగుణాలను రాళ్ళపల్లివారు తమ బోధనా పద్ధతిలోనూ, విమర్శనా విధానంలోను పుణికిపుచ్చుకున్నారు. 1931 జూలై 7న రాళ్ళపల్లివారి పితామహులైన కృష్ణమాచార్యులు స్వర్గస్తులయ్యారు. ఆ నాటికి అనంతకృష్ణశర్మ ఆంధ్ర సాహిత్య ప్రపంచంలో అగ్రగణ్యమైన స్థానాన్ని సంపాదించుకున్నారని ఘట్టమరాజుగారన్నారు.[12]

అనంతకృష్ణులవారికి తండ్రి సాహిత్య గురువులైనట్లే, తల్లి అలివేలు మంగమ్మ సంగీత గురువులయ్యారు. ఈమెకు శాస్త్రీయమైన సంగీత పరిజ్ఞానం లేక పోయినప్పటికీ, చక్కగా పాడగల శ్రావ్యమైన కంఠస్వరం వారి సొంతం. సంస్కృతాంధ్ర తమిళ, కన్నడ భాషల భజన కీర్తనలు, పెండ్లి పాటలు, జోలలు, పూజ పాటలు, కథా గేయాలూ నిత్యం ఆమె నాలుక మీద నాట్యమాడుతూ ఉండేవి. వీటన్నిటిని కొడుకు అనంతకృష్ణకు, కూతురు యదుగిరమ్మకు రోజూ నేర్పుతుండేవారు. అప్పటికే ఏకసంథగ్రాహియైన శర్మగారు తల్లి నేర్పిన ఆయా పాటలను

[10] నా గురువులు' శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి సన్మాన సంచిక. 1963. పుట.12.

[11] 'నా గురువులు' రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు, 2017. పుటలు.135-136.

[12] 'రాళ్ళపల్లి జీవిత చరిత్ర సంగ్రహము' అనంతరాగం. పుట. 122.

చక్కగా పాడేవారు. ఈ విధంగా రాళ్ళపల్లివారు ఏ బడికి వెళ్లకుండా ఇంట్లోనే చదువు సంధ్యలు అభ్యసించటం పరిపాటైంది.[13]

వయసు పెరిగే కొద్ది రాళ్ళపల్లివారు భక్తి శ్రద్ధలను అలవరచుకున్నారు. ఇక వీరి చదువు మీద ప్రత్యేక శ్రద్ధ వహించిన ముత్తైదువ అమ్మమ్మ లక్ష్మమ్మ. ఈమె కరువు ప్రాంతమైన అనంతపురం జిల్లాలో విద్యా సౌకర్యాలు తక్కువని గమనించింది. చిన్నపిల్లాడైన శర్మగారిని 1906లో విద్యా సౌకర్యాలు మెండుగా ఉన్న మైసూరు ప్రాంతానికి తీసుకెళ్లి చదువు కొనే అవకాశం కల్పించింది. మైసూరుకు వెళ్ళిన మొదట్లో బంధుల ఇంట్లో ఉండేవారు. కొంత కాలానికి అక్కడ పరిస్థితులు శర్మగారికి సరిపడలేదు. దాంతో పరకాల మఠంలో శ్రీ వైష్ణవ విద్యార్థులకు ఉచిత భోజన వసతి సౌకర్యాలు ఉన్నాయని తెలుసుకుని వారం రోజుల్లో అక్కడికి చేరారు.[14]

రాళ్ళపల్లివారు మైసూరు చేరిన కొత్తలో అనంతపురం జిల్లా, పెనుగొండ తాలుకా నల్లూరుకు చెందిన సజ్జయ్య తాతాచార్యుల వద్ద ఒకటిన్నర సంవత్సరం ఉండి *'కిరాతార్జునీయం'* చదివారు. తర్వాత కొంత కాలానికి అక్కడ పరిస్థితులు అనుకులించక పోవడంతో చామరాజేంద్ర సంస్కృత మహా పాఠశాలలో విద్యార్థిగా ప్రవేశించారు. అక్కడ చదివిన గ్రంథాలు *'షడ్భాషాచంద్రిక ప్రాకృత వ్యాకరణ', 'సంస్కృత వ్యాకరణం, అభిజ్ఞాన శాకుంతలం.'* ఇక్కడి నుండి మరి కొంత కాలానికి పరకాల మఠంలో ప్రవేశం పొందారు. ఈ మఠాధిపతులైన యతీశ్వరులు సంస్కృతంలో గొప్ప రచనలు చేశారు. వీరి *'శ్రీ నివాస విలాస చంపువు'* అనే ప్రసిద్ధ సంస్కృత రచనను తిరుపతి వెంకట కవులు తెలుగులోకి అనువదించారు. ఇటువంటి గొప్ప పండితునితో శిష్యరికం చేశారు. ఈ యతీశ్వరులకు శర్మగారంటే ప్రత్యేకాభిమానం. వీరు శర్మగారికి మహా మంత్రోపదేశాన్ని చేసి వైష్ణవ దీక్షనిచ్చారు. పరకాల మఠంలో అప్పుడప్పుడు విద్వత్సభలు జరిగేవి. సంస్కృతంలో అనేక రచనలు చేసిన కవులు, పండితులు ఆయా సమావేశాల్లో పాల్గొనేవారు. అక్కడ మఠాధిపతులు కవి పండితులను సత్కరించేవారు.[15]

నిత్యం సభలు, సమావేశాలు జరుగుతున్న అక్కడ ఏదో సభలో శర్మగారు ఒక సారి ఏవో నాలుగు సంస్కృత వృత్తాలు వ్రాసుకొని సదస్సు చివర్లో చదివారట. అది విన్న యతీశ్వరులు రాళ్ళపల్లివారిని అమితంగా మెచ్చుకున్నారట. ఆ విషయాన్ని రాళ్ళపల్లివారే ఇలా వ్రాసుకున్నారు. *''ఎంతో నిష్కల్మషమైన సంతోషమును తెలుపునంతే. ఆ నాటి నా కవిత జ్ఞప్తిలో లేదు. ఉండవలసిన ఏ గుణము దానికి లేదనుట నాకే తెలియును.''*[16] అన్న మాటలు శర్మగారి హృదయ సౌశీల్యానికి నిదర్శనంగా భావించవచ్చు.

---

[13] 'రాళ్ళపల్లి జీవిత చరిత్ర సంగ్రహము' అనంతరాగం. పుట: 122.

[14] 'రాళ్ళపల్లి జీవిత చరిత్ర సంగ్రహము' అనంతరాగం. పుట: 122.

[15] అనంత గీతిక 2- సాహిత్య పేజి. 'సూర్య దిన పత్రిక' నవంబర్ – 10 – 2014.

[16] 'నా గురువులు' రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుటలు.135-136.

శ్రీ యతీశ్వరులు *'అలంకార మణిహారము'* అనే గ్రంథానికి వ్యాఖ్యానం రాస్తున్న సమయంలో రాళ్ళపల్లివారు అక్కడ ఉండి అందులో పాలుపంచుకున్నారు. అది ఏ విధంగా అంటే అప్పటికి యతీశ్వరులకు అరవై యేళ్లు పైనబడ్డాయి. తర్వాత కంటి చూపు కూడా తగ్గడం వల్ల చదివి వినిపించడానికి రాళ్ళపల్లివారు ఉండేవారు. ఆ సందర్భంలో యతీశ్వరులు చెబుతుంటే రాళ్ళపల్లివారు రాస్తుండేవారట. అప్పుడప్పుడు రాళ్ళపల్లివారు అనేక ప్రశ్నలు అడిగే వారట ఆ సందేహాలకు యతీశ్వరులు వివరణ ఇచ్చే వారంట. ఇందులో ఏమైనా సమంజసమైన విషయాలుంటే వారు స్వీకరించేవారని *'అలంకార మణిహారం'* ఉత్తరార్థంలో రాళ్ళపల్లివారి అభిప్రాయాలు చోటుచేసుకున్నాయని ఘట్టమరాజుగారి అభిప్రాయం.[17]

వేలూరి కృష్ణమూర్తి రాళ్ళపల్లివారి గురించి వ్యాసం రాస్తూ. చాలా అరుదైన విషయాలను తెలియజేశారు. శర్మగారు తమ గురువులైన యతీశ్వరులు *'అలంకార మణిహారం'* రాస్తున్న సందర్భంలో జరిగిన సంభాషణ ఈ విధంగా పేర్కొన్నారు 'యతీంద్రులవారికి తన రచనలో ఉదహరించటానికి శ్రీ మద్రామాయణంలోని ఏదో ఒక వాక్యం అవసరమైంది. ఆ వాక్యాన్ని వెదికి తెలుపమని శిష్యుడు రాళ్ళపల్లి వారికి తెలిపారు. రాళ్ళపల్లి వారు దానిని వెతుకుతూ శ్రీమద్రామాయణంలోని శ్లోకాలను ఒక్కొక్కటే అక్కడక్కడా చదువుతూ పోయారు. ఎంత సేపూ అలా విషయాలను చదువుతూ పోయినప్పటికీ గురువు గారికి కావాల్సిన వాక్యం ఎంతకూ లభించక పోవడంతో ముందుకు వెళ్లాలని పుటలను తిరగవేయ ప్రయత్నించారు రాళ్ళపల్లివారు. అప్పుడు యతీంద్రులవారు రాళ్ళపల్లివారితో 'నిలుపకు, అదే భాగం చదువుతూ పొమ్మన్నారు. అప్పుడు రాళ్ళపల్లి వారు చదువుతున్న విషయ సందర్భం శ్రీరాముని వనవాసం, ఆ విషయమై విలపిస్తున్న కౌసల్యను సుమిత్ర సమాధాన పరుస్తున్న ఘట్టం. ఆ శ్లోకం బహుశ 'విలపంతీం తథాతాంతు కౌసల్యా ప్రమదోత్తమాం' అని ప్రారంభమయ్యే భాగమై వుండాలి. ఆ శ్లోకాన్ని రాళ్ళపల్లివారు నిదానంగా చదువసాగారు. కొంత భాగం చదివిన మీదట ప్రక్కకు తిరిగి గురువు వైపు చూశారు. యతీంద్రులవారి రెండు కళ్ళల్లోనూ నీళ్లు నిండి వుండినవి. బ్రహ్మ సాదృశ్యమైన ఆ కావ్యానందాన్ని, అంత తృప్తి తమ అంతరంగంలో అనుభవించారు ఆ మహానుభావుడు' అని రాళ్ళపల్లి వారు చెప్పిన విషయం ఎందరినో ఆకట్టుకొంది! రాళ్ళపల్లివారు పరకాల మఠం నుండి మరికొంత కాలానికి శ్రీ చామరాజ నగరం రామాశాస్త్రిగారి వద్ద చేరి విద్యనభ్యసించారు. ఈయన సంస్కృతంలో మహా పండితులు. వీరి వద్ద రాళ్ళపల్లివారు *'అభిజ్ఞాన శాకుంతలం, ఉత్తర రామచరిత్ర, ముద్రారాక్షసం, అనర్ఘ రాఘవం, కాదంబరి'* వంటి మహా రచనల్ని సంప్రదాయ బద్ధంగా అభ్యసించి అవగాహన చేసుకున్నారు. రామాశాస్త్రిగారు కవిత్వం చెప్పగల ప్రతిభావంతులే కాని కాళిదాసు, భవభూతి వంటి మహాకవుల కవిత్వానికి ఆదరణ కరువైన పరిస్థితుల్లో తమ

---

[17] అనంతగీతిక 2 సాహిత్య పేజి. 'సూర్య దిన పత్రిక' నవంబర్ – 10 – 2014.

కవిత్వానికి ఇక చోటుండక పోవచ్చునని భావించారు. [18] వీరి సన్నిధిలో శర్మగారు సంస్కృతంలో గొప్ప వ్యుత్పత్తిని పొందారనడంలో సందేహం లేదు. అని కృష్ణమూర్తి గుర్తు చేసిన విషయాలు అక్షర సత్యాలు.

## 1.3. కట్టమంచి రామలింగారెడ్డిగారితో పరిచయం

రాళ్ళపల్లి వారు తెలుగు ప్రాంతం నుండి కర్ణాటక ప్రాంతానికి వెళ్ళారు. అక్కడ రామాశాస్త్రి, శ్రీ పరకాల మఠ యతీశ్వరుల వంటి పండితుల సాహచర్యంతో సంస్కృతం బాగా అలవడింది. అయితే తెలుగులు మాత్రం కొంచెం తక్కువైందని చెప్పవచ్చు. సరిగ్గా అదే సమయానికి అంటే 1910లో కట్టమంచి రామలింగారెడ్డి పరిచయం కావటంతో ఆ లోటు తీరింది. ఈ విషయాన్ని రాళ్ళపల్లివారు *'నా గురువులు'* వ్యాసంలో ఇలా చెప్పుకొన్నారు *''నా తండ్రి గారు ఉపదేశించిన ఆ ఇంత తెలుగు కూడా మలినమై మాసిపోయియుండును. ఆ సమయమున దాని కుత్తేజనము గలిగించి ఉద్ధరించిన పుణ్యము శ్రీ కట్టమంచి రామలింగా రెడ్డి గారిది.''*[19] ఈ మాటలు శర్మగారి కృతజ్ఞతా భావానికి తార్కాణం.

కట్టమంచి రామలింగారెడ్డి అప్పటికి మైసూరు మహారాజా కాలేజిలో ఆచార్యులుగా ఉండేవారు. ఈయన చరిత్ర, తత్వ, తర్క శాస్త్రాలు, ఆంగ్ల సాహిత్యం మొదలైన సబ్జెక్టులు బోధించేవారు. అలాగే కాలేజీ యాజమాన్యాన్ని ఎంతో సమర్థవంతంగా నిర్వహించేవారు. అలాంటి రెడ్డిగారి గురించి రాళ్ళపల్లివారు 'కాలేజి చదువులతో సంబంధం లేని వాణ్ణి కాబట్టి వారి వద్ద పుస్తకం పట్టి చదువుకునే యోగం నాకు లభించలేదు. అది లభించిన శిష్య పరంపరకు వారి యెడ కలిగిన భక్తి గౌరవాభిమానాలు మరియే యుపాధ్యాయుడు సాధింపలేని గొప్ప'వని చెబుతూ....*''విశాలమైన దృష్టి, వికాసశీలమైన వాగ్మిత్వము, హార్దమైన పరిహాసకుశలత, నిశితమైన విమర్శ, నిర్భయమైన అభిప్రాయములు- ఇవి వారి సొత్తులు.''* [20] అని ప్రశంసించారు.

శర్మగారిని కట్టమంచివారికి పరిచయం చేసినవారు శ్రీకందాళ రఘునాథాచార్యులు. వీరు రామలింగారెడ్డి శిష్యులు. రాళ్ళపల్లివారి పెద్ద కూతురు నాగమణికి కందాళ రఘునాథా చార్యుల కుమారునితో వివాహం జరపడంతో శర్మగారికి రఘునాథచార్యులు వియంకులయ్యారు. ఏదైతేనేం రాళ్ళపల్లివారికి కట్టమంచివారు పరిచయం కావటం ఒక మంచి శుభ సందర్భమనవచ్చు. శర్మగారు తెలుగులో మంచి ప్రావిణ్యం పొందడానికి రెడ్డిగారే ప్రధాన కారణం. *'కట్టమంచి వారి వైలక్షణ్యం'* అనే వ్యాసంలో *''నాకూ శ్రీ రామలింగారెడ్డి గారికి కలిగిన బాంధవ్యం కేవలం ఆధ్యాత్మికమైనది. అంటే నా సాంసారిక జీవితంతో ఆయన గానీ, ఆయన దానితో నాకు గానీ పరిచయం లేదనవచ్చు''*[21]. అని ఎంతో సంయమనంతో

---

[18] మైసూరు సంస్థానంలో రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ – వేటూరి కృష్ణమూర్తి. పుట: 88, 'మిసిమి' మాసపత్రిక అక్టోబరు 2014.

[19] 'పదములు క్షేత్రయ్య' రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట.140.

[20] 'పదములు క్షేత్రయ్య' రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట.140.

[21] సి. ఆర్ రెడ్డి పీఠికలు – సం. బి. భాస్కర చౌదరి. పుట. 1.

చెప్పుకున్నారనిపిస్తుంది. తదనంతరం రెడ్డిగారితో కలిగిన గాఢమైన పరిచయాన్ని తెలుసుకొంటే ఎంతో ఆసక్తిని, ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. "*మైసూరు కాలేజికి ప్రిన్స్ పాల్ గా మైసూరు ప్రభుత్వ విద్యాశాఖాధ్యక్షుడుగా పని చేసిన కాలంలో నాకు ఆయనకు తోడి గోష్ఠికి భంగం కలిగింది. పై అధికారులతో ఎక్కువ చనువు సంపాదించుకునే స్వభావం నాది కాదు కనుక, తర్వాత రాజకీయ రంగంలో, ఆంధ్ర విశ్వకళా పరిషత్తు అధ్యక్షుడుగా ఆయన జీవితం నా కందుబాటులో లేనిది. పరిషత్తు పరముగా వేమన గురించి ఉపన్యాసాలు నా చేత చేయించిం దొకటే మరల నన్ను ఆయన వద్ద కాకర్షించింది*".[22] అని సంతోషంగా చెప్పుకొన్నారు.

"*స్వయంగా తనకు ఆధునిక దృష్టి అలవడడానికి కారకులు కట్టమంచి రామలింగా రెడ్డి గారని ఆయన ఎన్నో సార్లు అంగీకరించిన విషయం జగద్విదితమే. ఒక పరిశోధకుడిగా, విమర్శకుడిగా, గ్రంథ పరిష్కర్తగా మాట్లాడుతున్నప్పుడు మాత్రం, కట్టమంచి వారితో ఏకీభవించలేని సందర్భాలు తలెత్తాయి. వారి శక్తియుక్తులను గౌరవించినంత హార్దముగా వారి అభిప్రాయాలను అంగీకరించుట నావంటి వారికి పలుమారు గల్గు భాగ్యము కాదు. అని వ్యంగ్యోక్తి విసురుతూ రంగనాథ రామాయణ కర్తృత్వ విషయంలో కట్టమంచివారితో విభేదించారు.*[23] అని సి. మృణాళిగారు తెలియజేశారు.

పదిహేడేళ్ళు గల శర్మగారిని ముప్పైయేళ్ళున్న కట్టమంచి రామలింగారెడ్డి ఆప్యాయంగా దగ్గరికి తీసుకున్నారంటే కారణం. కట్టమంచివారి ఆంధ్రభాషాభిమానమే అనవచ్చు. కాగా శర్మగారి ప్రతిభాపాఠవాలుకూడానూ. విద్యార్హత దృష్ట్యా కట్టమంచివారు ఉన్నత స్థానంలో ఉన్నప్పటికీ, శర్మగారిని సమస్కంధులుగానే భావించి గౌరవించేవారు. తిక్కన భారతాన్ని ఆకళింపుచేసుకున్న రెడ్డిగారితో శర్మగారు వారానికి నాలుగైదు సాయంత్రాలైనా సాహిత్య చర్చలతో గడిపేవారు. ఇలా దాదాపు మూడేళ్లు చర్చోప చర్చలు చేసి అనేక సందేహాలను ఒకరికొకరు నివృత్తి చేసుకొన్నారు. "*ప్రాత ప్రపంచముననే ప్రాకులాడుతున్న నాకు వారి తోడి సహవాసము ఆధునిక ప్రపంచపు తలుపులు తెరిచి ఆహ్వానించినది.*"[24] అని రాళ్ళపల్లివారు గుర్తుచేసుకొన్నారు. *"He has received from me some insight into western modes of thoughts, feeling and expression which has done much to liberalise his culture which to commence with, was somewhat severely oriental in character."* అని 1914 డిసెంబర్ 15న రాళ్ళపల్లి వారికి ఇచ్చిన యోగ్యతా పత్రంలో రెడ్డిగారు ప్రశంసించారు. వీరిద్దరికి సాన్నిహిత్యం దినదినాభివృద్ధి పొందింది. ఇరుప్రక్కలా మూడవ వ్యక్తికి చొరవలేని ముగ్ధ మధుర సంబంధం మాదని వారి గాఢ మైత్రిని గూర్చి తలచుకొన్నారు. పాశ్చాత్య భావ జాలంతో నిండిన కట్టమంచివారి

---

[22] సి. ఆర్ రెడ్డి పీఠికలు. పుట.7.

[23] సకల (సాహిత్య వ్యాసాలు) పుట . 18.

[24] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు పుట.199.

సాహిత్యాభిప్రాయాల్ని విని శర్మగారు ప్రేరేపితులయ్యారు. దీని మూలంగా నూతన ఆలోచనల్నీ, భారతీయ సాహిత్య శాస్త్ర (విమర్శ) సిద్ధాంతాల్నీ పూర్తిగా నిరాకరింపక సమన్వయ మార్గాన్ని అనుసరించారు రాళ్ళపల్లివారని[25] ఘట్టమరాజు అశ్వత్థనారాయణ పేర్కొన్నారు.

రెడ్డిగారి 'అర్థశాస్త్రము', 'కవిత్వతత్త్వవిచారము' అచ్చుప్రతి సమయంలో రాళ్ళపల్లి వారు చేసిన కృషిని ఇలా ప్రశంసించారు.

ఉ. ***"శ్రీమదనంత కృష్ణులు విశేష గుణాఢ్యులు సంస్కృతాంధ్రభా***
***షా మహనీయ విద్యల విశారద భావులు నాకు దోడుగా***
***బ్రేమయు గారవంబు మెయి పెక్కు విధమ్ములనిల్చి సేయ నే***
***నోమితి గాక లేని యెడ నోర్వగ నేర్తునే కార్యభారమున్"***

ఈ పద్యం రెడ్డిగారు కృతజ్ఞతకు నిదర్శనం. శర్మగారు వీటి ప్రూఫులు దిద్దేపని చేయడం వల్ల ఈ రచనలు శర్మగారివే కాని రెడ్డిగారివి కాదనే వదంతులు కాస్త తీవ్రంగానే వచ్చాయి. అప్పుడు రాళ్ళపల్లి వారు ఈ మాటలను రెండు సందర్భాలలో తీవ్రంగా ఖండించవలసి వచ్చింది. ఈ సందర్భం రాళ్ళపల్లి, కట్టమంచివారి గాఢ మైత్రికి నిదర్శనమని భావించవచ్చు.

శర్మగారు విమర్శపై మూడు రకాల అభిప్రాయాలను వెల్లడించారు. అవి:

1. కావ్యనాటకాదులను శాస్త్రీయమగు పారిభాషిక దృష్టితో చూచి తూచుట యొకదారి,
2. దానియందు తెలిసియో తెలియకయో ప్రతిపాదించిన ఆయా కాలపు సాంఘిక రాజకీయాది విషయముల నెఱుగు కంటితో మూలమట్టుగ పరిశోధించుట రెండవదారి.
3. ఇదిగాక గ్రంథకర్త యొక్క ఆశలు అభిమానములు, రాగ ద్వేషములు మొదలగు జీవన సూత్రములను బైలుపఱుచుట మూడవది.

పై వాటిలో *మొదటి రెండు మార్గములును ఎంత యుపయోగకరములైనను గుమస్తా పనికి చేరినవి. కేవలం విషయ సంగ్రహం మాత్రమే. మూడవది అనుభవ సంగ్రహము. ఒక్క కావ్యమును విషయీకరించుకొని వ్రాసిన మరొక కావ్యమనవచ్చును. ఇట్టి రచనలు తెలుగులో రావడానికి దారితీసిన వారిలో అగ్రేసరులు నేనెఱిగినంత వరుకు కట్టమంచి రామలింగారెడ్డిగారే.*[26] అంటూ శర్మగారు కట్టమంచి వారి విమర్శ గొప్పతనాన్నిక్కడ సాక్షాత్కరింపజేశారు.

రాళ్ళపల్లివారు కట్టమంచి రామలింగారెడ్డి పరిచయం అవ్వక ముందు ప్రాత ప్రపంచంలో ఉండిపోయ్యారు. రెడ్డిగారి పరిచయంతో నూతన అంశాలను ఆకళింపు చేసుకోవడానికి అవకాశం బాగా దొరికింది. ఆ ప్రాచీన విషయాలను ప్రస్తుత సమాజానికి అన్వయించుకో గలిగారంటే దానికి కారణం కట్టమంచి వారేనని రాళ్ళపల్లివారి వ్యాసాలు

---

[25] అనంత గీతిక 3– అంకే శ్రీనివాస్ 'సూర్య దిన పత్రిక' నవంబర్ – 17 – 2014.

[26] ప్రబంధ నాయికలు – పుట్టపర్తి నారాయణ చార్యులు. 'రాళ్ళపల్లి పీఠికలు' పుట. 285–286.

చదివినప్పుడు ఆయా విషయాలు బాగా అర్థమవుతాయి. నిజానికి శర్మగారికి ఏ డిగ్రీలు లేకున్నా రెడ్డిగారు మైసూరు మహారాజా కళాశాలలో తెలుగు పండిత ఉద్యోగంలో నియమించడం రాళ్ళపల్లివారి ప్రతిభాపాండిత్యానికి నిదర్శనం.

## 1.4. సాహిత్య ప్రవేశం

రాళ్ళపల్లివారు చిన్నప్పటి నుండి తండ్రిగారి వద్ద సంస్కృతాన్ని బాగా చదివి అంతో ఇంతో జ్ఞానాన్ని సంపాదించారు. తదనంతరం శర్మగారి చదువుకు వీరి అమ్మమ్మ గొప్ప తోడ్పటునిచ్చారు. ఆనాడు రాళ్ళపల్లివారి కుటుంబంలో చాలా మంది చదువు విలువ తెలిసిన వారే ఎక్కువ. శర్మగారి అమ్మమ్మ లక్ష్మమ్మ ఎప్పుడైతే శర్మగారిని మైసూరుకు తీసుకెళ్ళారో అప్పటి నుండి ఈయన శ్రద్దగా చదువుకున్నారు. ఈ చదువును నిరర్థకం చేయడం ఇష్టం లేక చిన్న చిన్న రచనలు చేయటం మొదలు పెట్టారు. రాళ్ళపల్లివారు తన పదహారేళ్ళ వయసులోనే రచనా వ్యాసంగం ప్రారంభించారు. తొలుత విశ్వగుణా దర్శకర్తయైన వేంకటాధ్వరి వ్రాసిన *'సుభాషిత కౌస్తుభం'* లోని నూరు పద్యాలను తెలుగులోకి అనువదించారు. అయితే, ఈ అనువాదం శర్మగారికి తృప్తినివ్వలేదని చించి వేశారని ఘట్టమరాజు గారు పేర్కొన్నారు[27].

1978లో సాతవల్లి చంద్రశేఖర్ రాళ్ళపల్లివారి సాహిత్యంపై శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం (తిరుపతి) లో పరిశోధన చేశారు. ఇది శర్మగారిపై జరిగిన పరిశోధనల్లో ఇది మొదటిది. ఇందులో సాతవల్లివారు శర్మగారు అనువదించిన *'సుభాషిత కౌస్తుభం'* 1910 వనపర్తిలో అచ్చయింది. కానీ, దాన్ని చించివేయలేదని అన్నారు.[28] దీన్ని రాళ్ళపల్లి వారే తనకు స్వయంగా చెప్పారని కూడా వివరణ ఇచ్చారని అన్నారు. ఈ *'సుభాషిత కౌస్తుభం'* ప్రస్తుతం అలభ్యం అని అంకే శ్రీనివాస్ తేల్చి చెప్పారు.[29]1906లో రాళ్ళపల్లివారిని వీరి అమ్మమ్మ మైసూరుకు తీసుకెళ్లి బంధువుల ఇంట్లో వదిలారని మందే తెలుసుకున్నాం.

అక్కడ కొన్ని రోజులు ఉన్నారు. తర్వాత పరిస్థితులు సరిపడక ఉచిత వసతి గృహంలో చేరారు. మైసూరులో వీరి విద్యాభ్యాసం దినదినాభివృద్ధి అవుతూ వచ్చింది. రాళ్ళపల్లివారు మైసూరులో కొంత కాలం నిరుద్యోగిగా ఉన్నారు. ఆ సమయంలో *'భార్గవి పంచ వింశతి'* (1911) అనే శతకం రాశారు. దీన్ని రాయడానికి కారణం అప్పటి తెలుగు సాహిత్య ప్రభావమని తలపవచ్చు. ఆ రోజుల్లో శతకం రాయటం తెలుగు కవులకు ఆనవాయితీగా ఉండేది. కాబట్టి రాళ్ళపల్లివారు ఆ సంప్రదాయాన్నే పుణికిపుచ్చుకోవడం ముదావహం. అనంతకృష్ణశర్మ రాసిన *'భార్గవి పంచ వింశతి'* ఇరవై ఆరు పద్యాలతో అసంపూర్ణంగా ఉన్న లఘు రచన. ఇది మత్తేభ, శార్దూల వృత్తాలతో కూడినది. దీన్ని అనంతపురం సాధన ముద్రణాలయం వారు అచ్చువేశారు.[30] రాళ్ళపల్లివారు *'భార్గవీ పంచ వింశతి'* రాయడానికి

---

[27] 'రాళ్ళపల్లి జీవిత చరిత్ర సంగ్రహము' అనంతరాగం. పుట. 125-126.

[28] శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి సాహిత్య సేవ – సవిమర్శక సమీక్ష. పుట. 22.

[29] అనంతగీతిక 3 – అంకే శ్రీనివాస్ 'సూర్య దిన పత్రిక' నవంబరు 10 2014

[30] రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ సాహిత్య సేవ సవిమర్శక సమీక్ష. పుట. 22.

కారణం కష్టాలనుండి గట్టెక్కడానికే అని దాన్ని చదివితే అర్థమవుతుంది. 1983లో రాళ్ళపల్లివారిపై రెండవ పరిశోధన జరిగింది. అందులో ''*శర్మగారు మైసూరులో ఉండటంతో స్వగ్రామ మైన రాళ్ళపల్లిలో వ్యవసాయం చక్కగా జరగలేదు. వివాహానంతరం (1911-1912) ఉద్యోగం రాక పూర్వం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవలసి వచ్చింది. గౌరవంబున జీవింప నను(గహింపు మదియే పూర్ణంబగున్ భార్గవీ – అని (పార్థిస్తూ ''శు(కవార పద్యాలు'' అనే పేరుతో పది పద్యాలు రాశారు. వీటితో కొన్ని తరువాత రాసినవి మరికొన్ని కలిపి 'భార్గవి పంచ వింశతి' (1926) గా ము(దితమయ్యాయి.''*[31] అని వి. రమాంజనీ కుమారి వివరించారు.

రాళ్ళపల్లివారి రచనా వ్యాసంగం పరకాల మఠంలో పురుడు పోసుకుందని ఆర్. ఏ. జయంత నేను చేసిన వ్యక్తి గత ఇంటర్వ్యూలో తెలిపారు.[32] ఆ విధంగా రచనలు మొదలు పెడుతున్న కాలంలో 20వ శతాబ్ద ప్రారంభంలో తెలుగులో ఖండకావ్యాల ప్రభావం బాగా ఉండేది. అందులో భాగంగా కట్టమంచి రామలింగారెడ్డి *'ముసలమ్మ మరణము'* 1899లో రాశారు. దీన్ని 1900లో ముద్రించారు. ఈ కావ్యం గురించి పింగళి లక్ష్మీకాంతం ఇలా అన్నారు.'' *ఇది నవ్య సాహిత్యోద్యమానికి వేగు చుక్కల్లో నక్షత్రమువలె తొలి ఖండకావ్యంగా పేర్కొనబడినది.*[33] పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో 1909లో రాయప్రోలు వారి *'లలిత'*, 1910లో గురజాడ వారి *'ముత్యాల సరాలు'* వెలువడ్డాయి. ఇవి పూర్తిగా భావ, వస్తు, రచన ప్రక్రియ ఛందస్సుల్లో సంప్రదాయ భిన్నమైన విలక్షణమైన రాయప్రోలు, గురజాడలు నవ్యకవిత్యోద్యమ యుగకర్తలుగా గుర్తింపబడ్డారు.[34]

ఆ ధోరణితోనే రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ 1911లో *'తారాదేవి'* అనే ఖండ కావ్యాన్ని రాశారు. వారు ఈ కావ్యాన్ని కట్టమంచి రామలింగారెడ్డికి చూపించారట, దాన్ని చదివిన రెడ్డిగారు శర్మగారిని మెచ్చుకున్నారట. తదనంతరం ఈ కావ్యం *'సరస్వతి'* మాస పత్రికలో (కాకినాడ) ప్రచురింపబడింది.[35] దీని తర్వాత ఓ ముప్పై పుటల ''*అల్లసాని పెద్దన పెద్దతనము*'' అనే వ్యాసం రాశారు. ఈ వ్యాసం అల్లసాని పెద్దన మీద కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి చేసిన విమర్శకు బదులుగా రాశారు. కానీ దురదృష్టవశాత్తు కొంత కాలానికి కాశీభట్ల గారు మరణించడంతో ఆ వ్యాసాన్ని ముద్రించటం ఇష్టం లేక తమ దగ్గరే ఉంచుకున్నారట. అయితే ప్రస్తుతం ఈ వ్యాసం *'సారసి'* (జనవరి – మార్చి 1983) అనే ప్రారంభసంచికలో దొరుకుతుంది. అయితే వ్యాసం అసంపూర్ణంగా ఉంది. ఈ *'సారసి'* పత్రిక ప్రధాన సంపాదకులు ఏల్చూరి మురళీధరరావు. 1912లో శర్మగారు కాళిదాసు *'రఘువంశాన్ని'* ఆంధ్రీకరించారట. ఈ అనువాదం కూడా వారికి నచ్చలేదట. అయితే ఈ అనువాదం రామలింగారెడ్డిగారికి బాగా

---

[31] విమర్శకునిగా రాళ్ళపల్లి. పుట. 7.

[32] ఆర్. ఏ. జయంత గారితో తిరుపతిలో 4/11/2014 న జరిపిన ఇంటర్వ్యూ.

[33] గౌతమ వ్యాసాలు. పుట. 162.

[34] రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి సాహిత్యసేవ – సవిమర్శక సమీక్ష. పుట. 23.

[35] 'రాళ్ళపల్లి జీవిత చరిత్ర సంగ్రహము' అనంతరాగం. పుట. 126.

నచ్చి సొంత ఖర్చుతో ప్రచురిస్తానని అన్నారట. ఆయన అప్పటికి మైసూరు విశ్వవిద్యాలయ స్థాపనార్థం వివిధ దేశాల విద్యా విధానాలను పరిశీలించడానికి విదేశాలకు వెళ్ళారు. ఆ సమయంలో జపాన్ లో ఉన్నా కూడా అక్కడి నుండి *'రఘువంశ'* అనువాదాన్ని ముద్రించమని 250 రూపాయలు పంపారట. అయితే రాళ్ళపల్లి వారు ఆ డబ్బును తిరిగి ఇచ్చేశారట. రెడ్డిగారి ప్రోత్సహించినప్పటికీ శర్మగారు *''కాళిదాసు శైలీ సౌభాగ్యాన్ని తను సాధించలేదని అంటూ..* కింది పద్యాన్ని రాశారు.

మ ***"పదపుష్టిన్ బరికించి, శబ్ద విధులం బాటించి యర్థంబులన్***
***గొదుకుల్ పుట్టక తిద్ది, భావములు నిక్కుల్ జూచి, పద్యంబులన్***
***బొదిగింప గల మింతె కాని యిది యేమో తక్కువై తోచు, నా***
***కొదువం దీర్చు కవిత్వ బీజమది మాకుం జిక్కనో చిక్కదో"***

*'రఘువంశం'* కావ్యం 1978 వరకు శర్మగారి వద్దే ఉండేదట. ఈ విషయాన్ని వారి కుమారుడు జయంత గారిని అడిగితే లేదని బదులిచ్చారు. శర్మగారు రాసిని రచనల్లో కొన్ని వెలుగులోకి రాక పోవడం ఆంధ్రానువాద భారతికి తీరని లోటేనని అంకే శ్రీనివాస్ వాపోయారు.[36]

తర్వాత 1912లో *'మిరాబాయి'* అనే ఖండకావ్యం పరకాల మఠంలో ఉన్నప్పుడు రాశారు. ఇది కూడా రెడ్డి గారి ప్రశంసలు పొందింది. *'మానవసేవ'* పత్రికలో తొలిసారి ప్రచురింపబడింది. ఒక సందర్భంలో రామలింగా రెడ్డిగారు యోగ్యత పత్రంలో శర్మగారి ఇలా ప్రశంసించారు. *''Mr. sarma has written two poems in telugu 'Tara' and 'Mirabai' which mark rather new developments in poetic feeling and in Telugu literature.''*[37]

## 1.5. మైసూరు మహారాజా కాలేజీలో తెలుగు పండితునిగా ప్రవేశం

19వ శతాబ్దం ఉత్తరార్థంలో ప్రారంభించబడిన మైసూరు మహారాజా కళాశాలలో గొప్ప విద్వాంసులు పని చేశారు. ఎంతో పేరు మోసిన ఈ కళాశాలకు గొప్ప మేధావి అయిన కట్టమంచి రామలింగారెడ్డి ఇంగ్లీషు, తత్త్వశాస్త్రాల అధ్యాపకులుగా వచ్చారు. భారతీయులంటే హీనంగా చూస్తున్న ఆ కాలంలో సి. ఆర్. రెడ్డి కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం యూనియన్ కు ఉపాధ్యక్షుడుగా ఎన్నికైన ఘనత పొందినవారు. ఈయన మహారాజా కాలేజీలో ఆచార్యునిగా చేరిన కొద్ది సమయంలో మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారు. 1906లో విద్యనభ్యసించడానికి మైసూరుకు వచ్చిన శర్మగారు పేరు మోసిన గురువుల సాహచర్యం వల్ల ప్రతిభా పాండిత్యాలు సంపాదించుకున్నారు. 1910లో రాళ్ళపల్లి వారికి కట్టమంచి రామలింగారెడ్డిగారితో పరిచయం ఏర్పడింది. వీరి స్నేహం నిత్యం సాహిత్య చర్చల్లో మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లింది. దాంతో రెడ్డిగారు శర్మగారిని తమ కాలేజీ 'తెలుగు

[36] అనంత గీతిక 3 సూర్య దిన పత్రిక నవంబర్ 17– 2014.
[37] అనంతరాగం. పుట. 12.

పండితునిగా' పనిచేయడానికి ఆహ్వానించారు. ఈ సందర్భంలో శర్మగారు 'కళాశాలలో *విద్యాబోధన చేయడానికి తనకెలాంటి డిగ్రీలు లేవు''* అని సవినయంగా తెలిపినప్పుడు రెడ్డి గారు నవ్వుతూ ''*మా కాలేజీకి కూడా ఎలాంటి డిగ్రీలు లేవు. మీరు వచ్చి చేరండి. అప్పుడు దానికి డిగ్రీ యివ్వవచ్చని''* అన్నారట,

ఇక్కడ రెడ్డిగారు కేవలం శర్మగారి విద్వత్తును గుర్తించారని మనకు అర్థమవుతుంది. అంతే కాకుండా రెడ్డిగారు డిగ్రీలకు గానీ, సర్టిఫికేట్‌లకు గానీ అంత వెల ఇచ్చేవారు కాదని తెలుస్తుంది. అలా రామలింగారెడ్డి గారి ప్రోద్బలంతో 1912 జూలై12 న మహారాజా కాలేజిలో శర్మగారు పంతొమ్మిదేళ్ళకే తెలుగు అధ్యాపకులయ్యారు. ఈ కళాశాలలో 1912 నుండి 1949 వరకు అంటే 37 సంవత్సరాలు ఎలాంటి ప్రమోషన్లు పొందక 'తెలుగు పండిట్' గా పనిచేశారు. [38] ''*డిగ్రీలు లేని పాండిత్యంబు వన్నెకు రాని యీ పాడు కాలాన పుట్టి*'' డిగ్రీలు పొందినవారి కన్న మిన్నగా వెలుగొందారు శర్మగారు. అయితే పదవిలో ఉన్నతీకరణ లేక పోయింది. రాళ్ళపల్లి వారు పండితులు గానే పదవిలో చేరారు. పండితులుగానే పదవి విరమణ పొందారు. వీరి పాండిత్యాన్ని, ప్రతిభను తెలుసుకున్న ఓ విశ్వవిద్యాలయ అధికారి వేతనం పెంచలేకున్నాను. అయితే ఉద్యోగ స్థాయిని ప్రత్యేకంగా పెంచుతానని చెప్పారంట. దాంతో రాళ్ళపల్లి వారు రాజ్యంలో ఇతర పండితుల ఉద్యోగ స్థాయిని పెంచకుండా కేవలం తమకొక్కరికే ప్రత్యేకత కలిగించుటను శర్మగారు నిరాకరించారట. రాళ్ళపల్లి వారు పదవి విరమణ పొందే నాటికి వీరి నెల జీతం 120 రూపాయలు మాత్రమే.

### 1.5.1. మహారాజా కళాశాల విశేషాలు

మైసూరు మహారాజా కళాశాల్లో శర్మగారు సుదీర్ఘకాలం తెలుగు పండితునిగా పనిచేశారని పైన తెలుసుకొన్నాం. కాబట్టి అప్పట్లో ఆ కళాశాల ప్రాశస్త్యం ఏ విధంగా ఉండిందన్న విషయాల్ని తెలుసుకోడం అవసరం. వాటిని వేలూరి కృష్ణమూర్తిగారి మాటల్లో చూద్దాం. 'ఈ కళాశాలలో విదేశీ భాషలు నేర్చుకుంటున్న విద్యార్థులు కొంతమంది ఉండేవారు. వీరికి పాఠాలు బోధిస్తున్న అధ్యాపకులకు ఎక్కువ జీతాలు ఇచ్చేవారు. కానీ, శర్మగారు ఎప్పుడు వాటి గురించి ఆలోచించకుండా చక్కగా పాఠాలు బోధించేవారు. 1916లో స్థాపించబడిన మైసూరు విశ్వవిద్యాలయంలో 1927 దాకా ఎం. ఏ చేయాల్సిన విద్యార్థులకు మద్రాసు విశ్వవిద్యాలయం వారే పట్టా ప్రదానం చేసేవారు. అయితే మరొక విషయం ఏమిటంటే విద్యార్థులు కన్నడ భాషకు తోడుగా మరొక ద్రావిడ భాషను తమిళం, తెలుగు గానీ, లేదా మళయాళం గానీ ఏదో ఒక్క భాషను చదివి పరీక్ష రాయాల్సిందే నట. మహారాజా కాలేజీలో రాళ్ళపల్లివారి తెలుగు బోధన ఎంతగా ప్రసిద్ధి పొందినదంటే ఎం. ఏ కన్నడం చదివే చాలా మంది విద్యార్థులు తెలుగును రెండవ భాషగా ఎన్నుకోవడానికి వువ్విళ్ళూరేవారు.

[38] మైసూరు సంస్థానంలో రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ మిసిమి మాసపత్రిక. పుట. 88. అక్టోబర్ 2015.

రాళ్ళపల్లి వారి పాఠాలు విన్న విద్యార్థులు నేడు కన్నడ ప్రాంతంలో గొప్ప పేరు ప్రఖ్యాతులు గడించిన వారిలో పేర్కొనదగిన వారు ఉన్నారు. వారిలో కె. వి. పుట్టప్ప (కువెంపు) ఒకరు. ఈయన కన్నడంలో మొట్టమొదటి జ్ఞానపీఠ అవార్డు పొందిన పండితుడు. తర్వాత జి. పి. రాజరత్నం, డి. ఎల్. నరసింహాచారి, త. సు. శ్యామరావు మొదలైన వారందరూ కన్నడ సాహిత్యంలో ఉద్దండులు. వీరందరు శర్మగారి శిష్యులే. వీరితో పాటు కొన్నేళ్ల క్రితం అసువులు బాసిన జి. ఎస్. శివ రుద్రప్ప కర్ణాటకలో మూడవ రాష్ట్రకవిగా ప్రసిద్ధులు. వీరు కొన్ని సంవత్సరాల కాలం హైదరాబాదులో తమ వృత్తి జీవితాన్ని గడిపారు. ఈయన రాళ్ళపల్లివారి దగ్గర సంస్కృతం నేర్చుకునే వారట. ఇంకా తెలుగు దేశంలో శర్మగారికి ఏకలవ్య శిష్యులు ఉండేవారని ప్రతీతి. ఇలా సాహిత్య విద్యార్థులే కాకుండా అప్పటి మైసూరు సంస్థానంలో మంచి పేరెన్నికగన్న సంగీత విద్వాంసుడు బిడారం కృష్ణప్పగారు రాళ్ళపల్లివారిని పండితులని సంబోధించే వారు.[39]

## 1.6. రాళ్ళపల్లి వారి రచనా వ్యాసంగం

అనంతకృష్ణశర్మగారు చేసిన కృషిని ప్రముఖ కవి, అవధాని ఆశావాది ప్రకాశరావు ఒక పద్యంలో ఇలా ప్రశంసించారు.

***అన్నమాచార్యుల అక్షయాక్షరరాశి***
***వినుత పరిశ్రమన్ విశదపరిచి***
***వేమన్న పద్యాల విశ్వాత్మ దర్శించి***
***తెలుగు విమర్శకు విలువ బెంచె***
***సప్తశతీ కృతి సౌరభ శృంగార***
***మాంధ్రికి కాన్కగా నందజేసె***
***పెనుగొండ కీర్తికి ఘన దర్పణంబుగా***
***మేటి రాగము దీర్చి పాటబాడె***
***రాళ్ళపల్లి వంశ రత్న వీణియ పైన***
***తాననంతరాగ తానములను***
***కృష్ణశర్మదోక్తి కేళి మీటిన యట్టి***
***సాహితీ వసంతుని నే ప్రశంసజేతు.*** *(అవధాన దీపిక)*[40]

రాళ్ళపల్లి వారి సాహిత్య, సంగీత కృషినంతటిని గొప్ప కవితాత్మకంగా వివరించడం ఆశావాది ప్రకాశరావుగారి నిశిత పరిశీలనా దృష్టికి, కవిత్వ వైశిష్ట్యానికి పై పద్యాన్ని తార్కాణంగా చెప్పుకోవచ్చు.

---

[39] మైసూరు సంస్థానంలో రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ. మిసిమి మాసపత్రిక అక్టోబర్ 2015. పుట. 90.

[40] ఆశావాది ప్రకాశరావు సాహిత్యానుశీలనం. పుట . 189.

రాళ్ళపల్లివారు మైసూరు సంస్థానంలో గడిపిన సమయంలో అక్కడ మహారాజా కళాశాలలో తెలుగుతో పాటు సంస్కృత రచనలు గావించారు. వీరి రచనలు ప్రముఖ సాహితీ వేత్తల గుర్తింపు పొందాయి. కవిగా రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ రెండు ఖండకావ్యాల తర్వాత 1913లో *''లీలాదేవి''* నవలను కన్నడ భాషనుంచి అనువాదం చేశారు. ఈ నవలను ఆంధ్ర ప్రచారిణీ గ్రంథ నిలయం వారు ప్రచురించారు. యోగీంద్రనాథ చటోపాధ్యాయ బెంగాలీ రాసిన ఈ నవలను బి.వెంకటాచార్యులు కన్నడీకరించారు.

1910 నుండి 1950 మధ్య కాలంలో రాళ్ళపల్లివారు కొన్ని కవితలు రాశారు. ఈ కవితల గొప్పతనాన్ని ఎస్. వి. జోగారావు ఇలా ప్రశంసించారు. ''*కవిత్వం చెప్పడం మానుకున్నారేమి? అని సప్రశ్రమంగా ప్రశ్నించాను. అంటే ఆయన అన్నారు కదా! కొన్నాళ్ళు భ్రమపడి తగుదునమ్మా అని నేనూ తయారైనాను కవిత్వం చెప్పడానికి, కాని కంఠం నుండి వాణి గంటానికి దిగిరానంది.''*[41] కానీ, శర్మగారు రాసిన కవితలు వివిధ సాహిత్య పత్రికల్లో అచ్చయ్యాయి. ఆ కవితలు బాగా గుర్తింపుని పొందినవేనని తెలియజేశారు. వాటిలో '*పెనుగొండపాట, అజవిలాపము, అభీతిస్తవము, ఆహ్వానము, భారతికి సాధువాదము, శమీపూజ, విస్మృత వేణుగీతి* అనే కవితలన్నీ గ్రంథాలయ సర్వస్వము ప్రథమ, ద్వితీయ, తృతీయ సంపుటాల్లో అప్పుడప్పుడు వెలువడ్డాయి.[42]

అంతేకాకుండా ఆ రోజుల్లో అనంతపురం మండలం నుంచి 1917– 1920 ల మధ్య వెలువడిన '*వదరుబోతు*' ప్రముఖ వ్యాసకర్తలలో అనంతకృష్ణశర్మ కూడా ఒకరు. అనంతపురం నుండి వెలువడిన ఈ వ్యాసాలు తెలుగు సాహిత్యంలో సుస్థిర స్థానాన్ని కలిగిన వని పండితుల అభిప్రాయం. 1932లో ముద్రితమైన '*వదరుబోతు*' వ్యాస సంకలనంలో ఏడవ వ్యాసం రాళ్ళపల్లివారే రాశానని అన్నారు. మిగిలిన వ్యాస కర్తలు అగ్రజులైన రాళ్ళపల్లి గోపాలకృష్ణమాచార్యులు, వీరి బంధువైన పప్పూరు రామాచార్యులు రాళ్ళపల్లివారికి యుక్త వయసులోనే సంస్కరణా దృక్పథం అలవడిందనడానికి ఈ '*వదరుబోతు*' వ్యాసాలే ఉదాహరణ.

'*అజవిలాపము*' అనే సంస్కృత కవిత గ్రంథాలయ సర్వస్వము, సం. 3, సంపుటం. 1 లో అచ్చయింది. ఇందులో రఘువంశంలోని అజ మహారాజు విలాపం ఉంది. ఇది ఎంతో హృద్యంగా అనువదింపబడిన కవితనవచ్చు. దీన్ని కాళిదాసు 'రఘువంశం' లోని కొంత భాగానికి అనువాదమని కూడా తెలుస్తుంది.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు రాసిన నాలుగు కవితలు1922లో 'కుసుమ గుచ్ఛములు' అనే శీర్షికతో నాలుగు కవితలు '*ఆంధ్రపత్రిక*' ఉగాది సంచికలో

---

41 'అనంతకృష్ణుడు' మణి ప్రవాళము. పుట. 40.

42 శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి సాహిత్య సేవ – సవిమర్శక సమీక్ష. పుట. 39– 40.

ప్రచురితమయ్యాయి. అవి. 1. పెనుగొండ కొండ. 2. పరిహాసలీల. 3. ముసలి వీణ. 4. సంధ్యావందనం.

రాళ్ళపల్లివారు రాసిన కవితల్లో 'పెనుగొండ కొండ' అనే కవిత సుప్రసిద్ధమైనది. విజయ నగర రాజులు పరిపాలిస్తున్న సమయమది. ఆ నాటి పెనుగొండ చారిత్రక నేపథ్యాన్ని ఈ కవిత ద్వారా అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా 1336-1565 మధ్య కాలంలో దక్షిణ ప్రాంతాన్ని పాలించిన విజయ నగర సామ్రాజ్యం ఉన్నతమైనది. పెనుగొండ పౌరుషాన్ని ఈ పద్య కవితలో కళ్లకు కట్టినట్లు చిత్రించారు.

మరో కవిత 'పరిహాసలీల' ఇందులో భగవంతుని పట్ల భక్తుడు చేసే పరిహాసాలను కవి ఓ లీలగా భావించి పూజా సమయాల్లో చేసే కార్యక్రమాలను పరిహాసంగా తెలియజేశారు.

'ముసలివీణ' కవితలో పెళ్లి సమయంలో ఎవరైనా కచ్చేరికి పిలిచినప్పుడు వీణతో మధుర మైన గానంతో పాటలు పాడినప్పుడు ప్రజలు సంతోషించే విధానాన్ని కవి సహృదయతతో తెలిపారు. దీనివల్ల శర్మగారి సంగీత పరిజ్ఞానం మనకు అవగతమవుతుంది.

'సంధ్యావందనము' కవితలో చీకటి పోయి వెలుగు ప్రసరించే విధానాన్ని కళాత్మకంగా చిత్రించిన తీరు మనోహరంగా ఉంది.

'గ్రంథాలయ సర్వస్వము' లో ద్వితీయ, తృతీయ సంపుటాల్లో ముద్రితమైన కవితలు చాలా బాగున్నాయి. అందులో 'శమీపూజ' ఒకటి. ఈ పద్య కవితను ఉత్పలమాల వృత్తంలో రాశారు. 'శమీపూజ' అంటే సాధారణంగా దసరా పండగ రోజు జమ్మి చెట్టు దగ్గర ఆయుధ పూజ చేస్తాము. ఈ పండగ సందర్భంలో ముఖ్యంగా దత్తమండలాల్లో (అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు, బళ్లారి) గుర్రాలను అలంకరించి సవారి చేస్తారు. అలాగే పిల్లలు చెట్లపై ఉండే జీ రంగులను (ఓ రకమైన రంగుల పురుగు) పట్టుకుని దాని గొంతుకు దారం కట్టి ఆడించు విధానం ఆచారణలో ఉంది. ఈ పండగ సమయాల్లో పురోహితులైన బ్రాహ్మణులు జమ్మి పత్రి తీసుకుపోయి గ్రామంలో ప్రజలకు పంచి దక్షిణాలు పొందుతారు. ఇటువంటి గనమైన సంప్రదాయాలను దసరా పండగను గుర్తు చేస్తూ ఈ 'శమీపూజ' కవిత రాశారు.

'ఆహ్వానము' అనే తెలుగు కవిత 1934లో భారతి పత్రిక అక్టోబర్ లో ప్రచురింపబడింది. ప్రధానంగా చైత్ర మాసం నుండి ఆశ్వీజానికి మార్పు చెందుతున్న సందర్భంలో కొన్ని విషయాలను గుర్తు చేస్తుంది కవిత. హరిహర రాయలు, బుక్క రాయల మధ్య సంభాషణ కూడా ఈ కవిత మొదట్లో తారసిల్లుతుంది.

రాళ్ళపల్లివారు రాసిన 'విస్మృత వేణుగీతి' అనే కవిత 1941 గ్రంథాలయ సర్వస్వము, సంచిక.1, సంపుటి. 3. లో ముద్రితమయింది. కవితలో కనుమరుగైన సంగీతాన్ని కాపాడుకోవాల్సిన అవసరముందన్నారు.

''భారతికి సాధువాదము'' అనే కవిత 1949 జనవరిలో భారతి పత్రికలో అచ్చయింది. భారతి మాసపత్రిక రజతోత్సవం చేసుకొన్న సందర్భంగ శర్మగారు ఆ పత్రిక తెలుగు సాహిత్య

సంస్కృతులకు చేసిన సేవను గుర్తు చేస్తూ, దానికి ఉజ్వల భవిష్యత్తు కలగాలని అభినందించిన కవిత ఇది.

*'ప్రబంధకవి'* అనే కవిత 1950లో గ్రంథాలయ సర్వస్వము (సంచిక:3, సంపుటి:1)లో అచ్చయింది. ఇందులో రాళ్ళపల్లివారు ప్రబంధ కవులు సృష్టించిన సాహిత్యం అర్థం కాదని విమర్శించిన తీరు ప్రధానంగా కనబడుతుంది.

*'అభీతిస్తవము'* అనే కవిత 1962 సెప్టెంబర్ లో *'భారతి'* పత్రికలో ప్రచురించబడింది. ఇది అనువాద పద్యకవిత. సంస్కృతంలో వేదాంత దేశికుని పేరుతో ప్రసిద్ధి చెందిన వేంకటనాథుడు దీనికి కర్త. ఈ కవితలో వేంకట నాథుడు ప్రస్తావించిన చారిత్రక విశేషాలను రాళ్ళపల్లివారు తెలుగులోకి అనువాదం చేశారు. గడిచిపోయిన అష్టగ్రహకూట కాలాన నా ప్రార్థన అంటు దీన్ని అనువాదం చేశారు.

రాళ్ళపల్లివారు తొలిసారిగా 1924లో పరిష్కరించిన గ్రంథం *'శ్రీకృష్ణ భూపాలీయం'*. ఇది 19వ శతాబ్ది ప్రథమార్థంలోని గ్రంథం. దీన్ని రాసింది కుచలకుర్తి చంద్రకవి. ఇతను ఆరువేల నియోగి. అప్పకవి లక్షణాన్ని, రామరాజభూషణుని కవితా మార్గాన్ని అనుసరించి రచించిన కృతి అని శర్మగారి అభిప్రాయం. దీన్ని పరిశీలించిన రాళ్ళపల్లివారు అనేక తప్పులనూ, సందిగ్ధాంశాలను గుర్తించి, పరిష్కరించారు. ఇది అసంపూర్తి గ్రంథమని, 1796-1868 లలో మైసూరు మహారాజు ముమ్మడి కృష్ణరాజేంద్రునికి అంకితం ఇయ్యబడినట్లు అనంతకృష్ణశర్మ తెలిపారు.[43] న్యాయకంటి మాదనామాత్యుని లక్షణ గ్రంథమైన వీర భూపాలీయానికి శ్రీ కృష్ణభూపాలియం అనుసరణం. కానీ శర్మగారు శ్రీ కృష్ణభూపాలియం పరిష్కరించే సమయంలో వీర భూపాలియాన్ని చూడలేదు. అందుకే వీరభూపాలియానికి సంబంధించిన వివరాలు పేర్కొనలేదని సాతవల్లి చంద్రశేఖర్ తమ లఘు సిద్ధాంత వ్యాసంలో ప్రస్తావించారు.[44]

శర్మగారు 1925లో *"శ్రీ మహీశూర రాజ్యాభ్యుదయాదర్శః"* అనే సంస్కృత చంపూకావ్యం రాశారు. ఇందులో ఇతివృత్తం. ఆనాడు మైసూరు సంస్థానాన్ని చామరాజ ఒడయరు తర్వాత నాల్గవ కృష్ణ ఒడయరు పరిపాలించారు. వీరు చేపట్టిన కార్యాలు రాజ్యాభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డాయని రాజ్యంలో చాలా మంది విశ్వసించారు. దాన్ని గమనించిన రాళ్ళపల్లివారు ఆ సంస్థానంలో జరిగిన విద్యా సంబంధమైన మార్పుల్నీ, ముప్పై ఏళ్ళ కాలంలో జరిగిన ప్రజాభివృద్ధికరమైన పనుల్నీ వెరసి హరిజనోద్ధరణ, విద్యాబోధన, ఆర్థికాభ్యుదయం, నీటి సరఫరా, ప్రణాళికాబద్ధ పట్టణాభివృద్ధి, కర్మాగారాలను నెలకొల్పడం లాంటి నన్నిటిని ప్రశంసిస్తూ ఈ కావ్యం రాశారు. ఈ రచన మైసూరు సంస్థానంలో చాలా

---

[43] రాళ్ళపల్లి పీఠికలు. పుట. 349 -350.

[44] శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి సాహిత్య సేవ - సవిమర్శక సమీక్ష. పుట. 127.

మందిని  ఆకర్షించింది. అందుకు గాను సంస్థానం వారు దీనికి ప్రథమ బహుమతి ఇచ్చి గౌరవించారు.[45]

అలా గడుస్తున్న కొద్ది కాలానికి 1928 జనవరి 19వ తేది న (గురువారం) 'ఆంధ్ర పత్రిక' లో ఆంధ్ర విశ్వకళా పరిషత్తు వారు 'వేమన' పై ఉపన్యాసాలను ఇప్పించడానికి ఒక ప్రకటన వెలువడింది. అప్పటి రాళ్ళపల్లివారి స్నేహితులు సి. ఆర్. నరసింహశాస్త్రి ఈ విషయాన్ని శర్మగారికి తెలిపారు. కాని వీరు అంత శ్రద్ద చూపలేదు. చివరకి కట్టమంచి రామలింగారెడ్డిగారి ప్రోద్బలంతో కాదనలేక దరఖాస్తు చేసుకున్నారు. దీనికి శర్మగారు ఎంపిక కావడం జరిగింది. ఆంధ్ర విశ్వకళా పరిషత్తువారు అంతకు ముందు వీరు 1917లో వావిళ్లవారు ప్రచురించిన 'వేమన పద్యములు' అనే గ్రంథానికి పీఠిక రాశారు. అయితే ఇందులో వేమనపై మాట్లాడుతూ… స్థల, కాల నిర్ణయాలపై వాదన చేయక వేమన కవిత్వం, శైలి మొదలైన విషయాల్నీ శర్మగారు సాధికారికంగా  తెలిపారని వి. రమాంజనీ కుమారి చెప్పారు.[46]

నేడు విశ్వవిద్యాలయాల్లో జరిగే పరిశోధనల కన్న గొప్పగా వేమన గురించి పరిశోధన చేయడం రాళ్ళపల్లివారి సునిశిత పరిశీలన విధానానికి నిదర్శనంగా భావించవచ్చు. ఈ పరిశోధనకు కట్టమంచి రామలింగారెడ్డిగారు సలహాలు, సూచనలు ఇచ్చారు. వీటిని శర్మగారు ఎంతో ఓపికగా విని ఆయా అంశాల్ని పరిశీలించారు. కొంతకాలనికి పరిశోధన పూర్తైంది. నిర్వహకులు ఈ పరిశోధనలో తేలిన విషయాల్ని కార్యక్రమం ద్వారా తెలియజేయాలని అనుకొన్నారు. ముందుగా కాకినాడలో ఓ సభను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. అయితే అనివార్య కారణాల వల్ల ఆ కార్యక్రమం అనంతపురం సీడెడ్ డి స్ట్రిక్ట్స్ కాలేజిలో (నేటి ఆర్ట్స్ కళాశాల) జరపాల్సి వచ్చింది. 1928 అక్టోబరు 25 నుండి  ఏడు రోజుల పాటు జరిగిన సభలో రోజుకో ఉపన్యాసం చొప్పున ఏడు ఉపన్యాసాలు ఇచ్చారు. ఆ ఏడు ఉపన్యాసాలూ ఎంతో మంది సహృదయుల ప్రశంసలు పొందాయి. దాంతో ఈ వాటిని  ఆంధ్ర విశ్వకళా పరిషత్తు 1929లో గ్రంథ రూపంలో ప్రచురించింది.[47]

రాళ్ళపల్లివారు అప్పుడప్పుడు ఇచ్చిన ఉపన్యాసాలు, రాసిన వ్యాసాలు వివిధ పత్రికల్లో ప్రచురింపబడి తెలుగు సాహిత్యంలో కీర్తి పతాకాన్ని ఎగురవేశాయి. వాటిలో చెప్పుకోదగినవి 'రాయల నాటి రసికత' 'రాయల వైదుష్యము' 'నాచన సోముని నవీన గుణములు' ప్రధానమైనవి. వీటిని 1932లో అనంతపురం సాధన ముద్రాలయం వారు 'సారస్వతోపన్యాసములు' అనే పేరుతో అచ్చులోకి తీసుకొచ్చారు. తదనంతరం రాళ్ళపల్లివారు వివిధ సందర్భాలలో రాసిన వ్యాసాలు. ఆంధ్ర వాఙ్మయమున నాచన సోమనాథుని కీయదగు స్థానం' 'నిగమ శర్మ అక్క' 'రంగనాథ రామాయణము' 'త్యాగయ్య గారి నాద సుధా రసం'

---

[45] మైసూరు సంస్థానంలో రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ. మిసిమి మార్చి 2015. పుట. 90.

[46] విమర్శకునిగా రాళ్ళపల్లి . పుట. 8.

[47] ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ సాంప్రదాయక రీతి. పుట. 89.

‘తిక్కన తీర్చిన సీతమ్మ’ అనే వాటికి పైన చెప్పిన మూడు వ్యాసాలనన్నిటిని కలిపి 1954లో ‘సారస్వతాలోకము’ పేరుతో త్రివేణి పబ్లిషర్స్ వారు పుస్తక రూపంలో తీసుకొచ్చారు.[48] తర్వాత ఈ పుస్తకాన్ని సి. మృణాళిని గారు ఏడవ ముద్రణగా 2009లో తెలుగు పాఠకులకు అందించారు.

1934 అక్టోబర్ 20, 21న బళ్ళారిలో ధర్మవరం రామకృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావుగార్ల స్మారకోత్సవ సభలో చేసిన ఉపన్యాసాలే ‘నాటకోపన్యాసములు’. ఇవి 1935లో పుస్తక రూపం దాల్చాయి. ఇందులో ప్రధానంగా రెండు వ్యాసాలున్నాయి. మొదటి వ్యాసంలో నాటక లక్షణాల పరామర్శ, నాటక అంగాల చర్చ తర్వాత ఆధునిక నాటకాల సమీక్షతో సాగింది. ఇది నాటకంపై రాళ్ళపల్లివారి దృక్పథాన్ని తెలుపుతుంది. ఇక రెండో వ్యాసం ధర్మవరం, కోలాచలంవారి నాటక విశేషాలను ప్రత్యేకతలను వివరిస్తూ నడిచింది. ఇందులో రాళ్ళపల్లివారు చేసిన ప్రతిపాదన ఏమిటంటే ‘స్త్రీ పాత్రలు స్త్రీలే కాకుండా పురుషులు కూడా వేయవచ్చు’ననే అభిప్రాయం సన్మార్గానికీ, చిత్తశుద్ధికీ, నీతికి నిలయంగా నిలబడింది.[49]

రాళ్ళపల్లివారు బహుభాషా వేత్తగా కూడా అగుపడతారు. వారికి సంస్కృతం, ప్రాకృతం, తెలుగు, తమిళం, ఆంగ్ల భాషల్లో లోతైన పరిచయం ఉంది. దీనికి గుర్తుగా ప్రాకృతంలో హాలుడు సంకలించిన ‘*గాథా సప్తశతి*’ లోని 395 గాథలను తెలుగులోకి అనువదించారు. ఇవి 1931లో ముద్రితమైనాయి. ప్రసిద్ధ జర్మన్ విద్వాంసులు వెబర్ ప్రకటించిన గాథలను అనుసరించి మరో నాలుగు వందల గాథల్ని కూడా ఆంధ్రీకరించారు. వీటిని 1964లో ఆంధ్ర సారస్వత పరిషత్తువారు పుస్తకంగా తెచ్చారు. ఈ గ్రంథాన్ని శర్మగారు గురువు కట్టమంచి రామలింగారెడ్డిగారికి అంకితమిచ్చారు. ఇలా మొత్తం 738 గాథల్ని రాళ్ళపల్లివారు తెలుగు చేయడం జరిగింది. ఈ గాథల్లో ఉండే పల్లె జీవితాన్ని శర్మగారు ఎంతో సహజంగా చిత్రించారు. ఈ అనువాదం సుప్రసిద్ధ విమర్శకులు, సామాన్య పాఠకుల మన్ననలను పెద్ద ఎత్తున చూరగొన్నదం విశేషం.

రాళ్ళపల్లివారు అనువదించిన మరో గ్రంథం సంస్కృతంలో జాయప సేనాని రాసిన ‘*నృత్త రత్నావళి*’ (1969). దీనికి వి. రాఘవన్ గారు సంస్కృత మూలాన్ని పరిష్కరించి ప్రకటించారు. ఈ పుస్తకాన్ని రాళ్ళపల్లివారు తెలుగులోకి అనువదించారు. పోణంగి శ్రీరామఅప్పారావు ఈ గ్రంథానికి ఉపోద్ఘాతం రాశారు. 1969లో ఆంధ్ర ప్రదేశ్ సంగీత నాటక అకాడమి ఈ పుస్తకాన్ని ప్రచురించింది. ప్రధానంగా ఎనిమిది అధ్యాయాలిందులో చోటుచేసుకున్నాయి. మొదటి నాలుగు అధ్యాయాల్లో భరతమార్గానుసారులైన నృత్య విశేషాలను, తర్వాత నాల్గింటిలో దేశి, నాట్య సంప్రదాయాలను గురించి ప్రధానంగా వివరించారు.

---

[48] శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి సాహిత్య సేవ – సవిమర్శక సమీక్ష. పుట. 45.

[49] శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి సాహిత్య సేవ – సవిమర్శక సమీక్ష. పుట. 54.

రాళ్ళపల్లివారి చివరి రచన *'సుందరపాండ్య విరచిత ఆర్యా'* (1970). ఇది సంస్కృత అనువాద రచన. దీన్ని సుందరపాండ్యుడు రాశాడని కచ్చితంగా పరిశోధకులు నిర్ణయించలేక పోయారు. కానీ, ఇందులో ఉన్న పద్యాలు మాత్రం బాగా ప్రసిద్ధి చెందాయి. ఇది ఒక నీతిశాస్త్ర గ్రంథం. అంతకు ముందు వేటూరి ప్రభాకరశాస్త్రి, మానవల్లి రామకృష్ణకవి దీన్ని ప్రకటించారు. ఈ ప్రతులను మొదలుకొని వేరువేరు ప్రతుల్ని చూసి రాళ్ళపల్లివారు ఈ ఉద్గ్రంథాన్ని తెలుగులోకి అనువదించారు. మూలంలో చిన్నచిన్న సవరణలు కూడా చేశారు. కావ్యాన్ని ఆటవెలది, తేటగీతి, కంద పద్యాల్లో పొందుపరచారు. రాళ్ళపల్లివారి ఉత్తమ అనువాద రచనగా ఇది గుర్తింపు పొందింది. ఇది 1970లో శ్రీ రాయల పరిషత్తు ప్రొద్దుటూరు వాళ్లు ప్రచురించారు.[50]

సాహిత్య రంగంలో రాళ్ళపల్లివారి ప్రధాన క్షేత్రం విమర్శ అని చెప్పవచ్చు. వీరు రాసిన విమర్శ రచనలు చాలా మంది పండితుల ప్రశంసలు పొందిన విషయం విదితమే. వీరి విమర్శ దృక్పథానికి పరిణత ప్రజ్ఞకు నిదర్శనంగా ఎస్. వి. జోగారావు చెప్పిన మాటలు ఓ సారి గుర్తు చేసుకొందాం.*''ఒక అపురూపమైన నాన్యతో దర్శనీయమైన విమర్శ ధోరణి, ఆయన యొక్క సముదాత్త వ్యక్తిత్వముద్ర కనిపిస్తాయి.''* [51]అని అభిప్రాయపడ్డారు.

## 1.7. మైసూరులో సంగీత సాధన

రాళ్ళపల్లివారు మైసూరులో శ్రీ కృష్ణ బ్రహ్మతంత్ర పరకాల యతీంద్రుల వద్ద విద్యాభ్యాసం చేసే రోజుల్లోనే సంగీత సాధన మొదలు పెట్టారు. ఎప్పుడో చిన్నప్పుడు తల్లి దగ్గర నేర్చుకున్న సంగీతం మైసూరుకు వెళ్లిన తర్వాత కూడా కొనసాగించారు. మైసూరులో వీరి సంగీత గురువులు బిడారం కృష్ణప్ప, వైణిక శిఖామణి శేషణ్ణ, వాసుదేవా చార్యులు మొదలైన వారు కర్నాటక సంగీతంలో పేరు మోసిన విద్వాంసులుగా ప్రఖ్యాతి గడించిన వారు. క్రీ. శ. 1909 జేష్ఠ శుక్ల ఏకాదశిన ముమ్మడి శ్రీ కృష్ణ వడయరుగారి వర్ధంతి సందర్భంగా మహారాజా దర్బారుహాలులో బిడారం కృష్ణప్పగారు చేసిన సంగీత కచ్చేరితో రాళ్ళపల్లివారు ప్రభావితులైయ్యారు. వారి శిష్యరికం చేసి, శాస్త్రీయ సంగీతంలో తొలి పాఠాలు నేర్చుకున్నారు. గాన విశారద కృష్ణప్పగారు రాళ్ళపల్లివారి సంగీత అభిరుచికి సంతోషించి వారికి నాలుగైదేళ్లు సంగీత విద్యను దాపరికం లేకుండా బోధించారు. బిడారం కృష్ణప్పగారి పరిచయం కలిగే నాటికే రాళ్ళపల్లివారు మైసూరు మహారాజా కాలేజీలో తెలుగు పండితుడిగా పని చేస్తున్నారు. దాంతో సమయం సరిపడక గాత్ర సంగీతంలో తగినంతగా సాధన చేయలేక పోయారు ''గోరు చుట్టుపై రోకటి పోటన్నట్లు'' 1918లో మొదటి ప్రపంచ యుద్ధానంతరం దేశమంతా వ్యాపించిన ''ఇన్ ఫ్లూయెంజా'' జ్వరం రాళ్ళపల్లి వారిని శారీరకంగా దెబ్బతీసింది. ఆ సమయంలో వైద్యుల సలహా మేరకు గాత్ర సంగీత సాధన వదిలి ఫిడేలు సాధన ప్రారంభించారు.

---

[50] సుందరపాండ్య విరచితా ఆర్యా. పుట: 1-70.

[51] 'అనంతకృష్ణుడు' మణి ప్రవాళము. పుట. 40.

క్రీ. శ. 1924లో రాళ్ళపల్లివారికి అనారోగ్యం వల్ల ఏదో వెలితి కనపడింది. ప్రసిద్ధ కన్నడ సాహిత్య వేత్త, రాళ్ళపల్లి వారికి సన్నిహితులైన . వి. సీతారామయ్యగారు తాము రచించిన 'కాలేజిదినగళు' లో (పుట 91, 92) రాళ్ళపల్లివారి అప్పటి మనోవేదనను ఎంత కరుణరసార్ద్రంగా చిత్రించారో గమనించాండి. ''మరో సందర్భం నా హృదయంలో అచ్చొత్తినట్లున్నది. సాధారణంగా నిండుగావుండే రామ మందిరంలో ప్రదోషకాలపు ఒక రోజు సాయంకాలం ఏడు గంటలకు నేను వెళ్లినప్పుడు శర్మగారు ఒక్కరే కూర్చొని పాడుతున్నారు. లోపల దేవుని దీపారాధన చూస్తున్న బిడారం కృష్ణప్పగారి బంధువు లొక్కరు మాత్రం ఉన్నారు. ఆ రోజు వారి గానాన్ని ఒక గంట సేపు విన్నాను. వారితో వున్నది నేనొక్కణ్ణే. వారు నన్ను గమనించారో లేదో నాకు తెలీదు. గొంతు పోయి వారు కష్టపడుతున్న కాలమది. ఊపిరిపీల్చుకోవటంగాని స్వరం పెంచటం కాని, పాటలు పాడటానికి అవసరమైన, అనువైన విధంగా శరీరం వారి అందుబాట్లోవున్నట్లు కనపడలేదు. ఆ రోజు వారు పాడిన గౌళివంతు రాగంలోని 'తెరతీయగ రాదా నాలోని– మత్సరమను తెర' అనే త్యాగయ్య గారి కీర్తనలో మానవ జీవితంలో ఎంత బాధ ఇమిడి వుందో, అంతా అభివ్యక్తమయ్యింది. ఆ రాగము, సాహిత్యము, పాడేవారి పరిస్థితి, ఆ కీర్తనలో సాహిత్యంలోని ప్రత్యంశము. స్ఫుటంగా, విశదంగా, రసానందానికి సహాయంగా, మానసిక వ్యథ, శారీరక క్లేశమును నివేదించు కొనుచున్నట్లుగా కనిపించింది. ఆనాడు త్యాగయ్య గారు – ఈ నాడు శర్మగారు. విశిష్ట పరిస్థితిలో ఏర్పడిన క్లేశము ఏదైనా ఒక కృతిలో ఇంత సంపూర్ణంగా రూపుతాల్చటం. అపురూపం. ఎన్నో సార్లు ఆ కీర్తనను వారే తర్వాత వేరే విధంగా పాడటం విన్నాను. ఆనాటి వారి పాట నా జీవితంలో గొప్ప అనుభూతిగా నిలిచిపోయింది. ఈ యాభై ఏళ్లలో ఎన్నో మార్లు నెమరు వేసికొని నన్ను నేనే మరచి పొయ్యాను. ఆ పాటలోని ప్రతి చరణమూ, కవితగా, కృతిగా, సంగీతంగా కృతార్థమైనట్లుగా అనిపించింది.[52]

## 1.8. అన్నమయ్య సంకీర్తనల పరిష్కరణ

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు మైసూరులో తన విద్యాభ్యాసాన్ని కొనసాగించి, అక్కడే మహారాజా కాలేజీలో తెలుగు పండితునిగా ఉద్యోగం చేశారు. సరిగ్గా 1912 జూలై 2వ తేది నుండి 1949 డిసెంబర్ 19 వరకు అంటే దాదాపు 38 సంవత్సరాలు ఈ ఉద్యోగం చేసి పదవీ విరమణ చేశారు. అప్పటికి శర్మ గారి వయసు యాభై ఆరేళ్లు.

తర్వాత కొన్ని రోజులకి చెలికాని అన్నారావుగారి పిలుపు మేరకు అన్నమయ్య సంకీర్తనలను పరిష్కరించడానికి 1950 అక్టోబర్ లో మైసూరు నుండి తిరుపతికి వెళ్లారు. రాళ్ళపల్లివారు తాళ్లపాక అన్నమయ్య 49 పాటలను స్వర పరిచి ఆంధ్ర వార పత్రికలో ప్రకటించారని' కామిశెట్టి శ్రీనివాసులు శెట్టి గారు తెలిపారు.[53] రాళ్ళపల్లివారు మొత్తం 5

[52] 'రాళ్ళపల్లి జీవిత చరిత్ర సంగ్రహము' అనంతరాగం. పుట. 128–130.

[53] 'తాళ్ళపాక వారి సంకీర్తనలు – రాళ్ళపల్లివారి సేవ' అనంతరాగం. పుట. 193.

ఆధ్యాత్మిక, 6 శృంగార సంకీర్తనల సంపుటాలు రావడానికి సహాయపడ్డారు. వీరు స్వర పరిచిన పాటలు 108, ఎడిట్ చేసినవి 120 ఉండవచ్చునని, వీరు స్వర పరిచిన పాటల్లో ‘ బ్రహ్మ కడిగిన పాదము, నల్లనిమెగనగులు, అనే పాటలు ఎంతో ప్రసిద్ధి చెందాయి. ఇవన్నీ ఆ రోజుల్లో భారతి పత్రికలో ప్రచురింపబడ్డాయి. అని ఆర్. ఏ జయంతగారు వ్యక్తి గత ఇంటర్వ్యూలో చెప్పారు.[54]

అన్నమాచార్యుల కీర్తనలను పరిష్కరించే అవకాశం రావడం రాళ్ళపల్లి వారికి ఓ వరం చెప్పవచ్చు. వారు చిన్నప్పటినుండి చాలా శ్రద్ధగా చదువుకున్నారు కాబట్టి అవకాశాలు వాటంతట అవే వెతుక్కొచ్చాయని అనిపిస్తుంది. ఏదైతే నేమి తెలుగు పండిత పదవి తర్వాత అన్నమయ్య సంకీర్తనల పరిష్కరణ కు పిలుపు రావడం ఆయన కృషికి, ప్రతిభా పాటవాలకు నిదర్శనమనవచ్చు. ఆ విధంగా అనంతకృష్ణశర్మగారు శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయంలోను, తిరుమల తిరుపతి దేవస్థానంలో ఉన్న తాళ్లపాక వారి సంకీర్తనల 11, 12 సంపుటాలను పరిష్కరించారు. ఈ పరిష్కరణ ద్వారా పాఠక లోకానికి ప్రధానంగా తెలిపిన అంశాలు. 1. పీఠిక, 2. రేకుల్లోని పాటల స్వరూపం చెడకుండా పఠన యోగ్యంగా ముద్రించడం. 3. అనుబంధంలో సందిగ్ధ పద, రాగ సంకీర్తన సంఖ్యా సూచిక, సంకీర్తనల అకారాది సూచి లాంటి విషయాలను విపులంగా వివరించే ప్రయత్నం చేశారని స్పష్టమవుతుంది. ఈ సంకీర్తనలను ఆధ్యాత్మిక ప్రపంచానికి తెలపడానికి రేడియో కార్యక్రమాలు ఎంతగానో సహకరించాయి. ఇలాంటి కార్యక్రమాలలో స్వయంగా రాళ్ళపల్లి వారు పాడి వినిపించి అందరిని మైమరిపించారు. ఈ సంకీర్తనలను 1950 నుండి 1957 వరకు ఏడేళ్ల కాలం పరిష్కరించారు. ఈ పరిష్కరణలో శర్మగారికి సహాయ పడిన ఉదయగిరి శ్రీనివాసాచార్యులు, గౌరి పెద్ది రామసుబ్బ శర్మగారిని ఎంతో ఆత్మీయంగా గుర్తు చేసుకోవడం వీరి సహృదయతకు నిదర్శనం.‘‘*సంగీత కళానిధి’యైన శర్మగారు తాళ్ళపాక వారి సంకీర్తనములను పరిష్కరించి, వాటి సొగసులు ఎత్తిచూపి, కొన్నింటికి స్వర ప్రస్తారములు కల్పించిన రీతి అనన్య సామాన్యము. శర్మగారి సంగీత వైదుష్యము, సాహిత్య రాసిక్యము సార్థకమై ఈ కార్యమందు రూపు తాల్చాయి.*’’ [55] అని ప్రముఖ విమర్శకులు ఘట్టమరాజు పేర్కొన్నారు.

## 1.9. రాళ్ళపల్లివారి మరి కొన్ని రచనలు

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు రాయాలనుకున్న రచనలు, రాసిన రచనలు బయటికి రాకుండేవి కొన్ని అక్కడక్కడ కనబడుతున్నాయి. అలాగే వారు చేసిన పాఠ పరిష్కారాలు చెప్పుకోదగినవి. అలాంటి వాటిని ఇక్కడ పరిశీలిద్దాం.

రాళ్ళపల్లివారు భాసుని ‘స్వప్నవాసవదత్త’ అనే నాటకాన్ని అనువదించారట. కాని, ఎందుకో ఇష్టం లేక దాన్ని బయటికి తీసుకురాలేదట. తర్వాత పుట్టపర్తి నారాయణ చార్యులతో

---

[54] ఆర్. ఏ. జయంత గారితో తిరుపతిలో 4/11/2014 న జరిపిన సంభాషణ.

[55] అభ్యుదయ (సంచిక 10, సంపుటి 2, అక్టోబర్ 1978) పుట. 7.

కలిసి ప్రసిద్ధ ప్రాకృత రచన అయిన *'సేతుబంధం'* కావ్యాన్ని ఆంధ్రీకరించాలని సంకల్పించి ఆగిపోయారని అంకే శ్రీనివాస్ తన 'అనంత గీతిక' వ్యాసంలో పేర్కొన్నారు.[56]

శర్మగారు 'పాండు రంగ మాహాత్మ్యము' ను పరిష్కరించి పీఠిక రాయడం గొప్ప విశేషం. దీన్ని ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి 1969లో ముద్రించింది. ఈ పీఠిక రాయటంలో శర్మ గారికి సహకారం అందించింది గౌరిపెద్ది రామసుబ్బశర్మ. శర్మగారు పరిష్కరించిన గ్రంథాల్లో ఇది ఉత్తమమైనదిగా చాలా మంది పరిశోధకులు చెప్తారు.[57]

రాళ్ళపల్లివారు మైసూరులో తెలుగు పండితుడిగా బాధ్యతలు నిర్వహిస్తూనే కొన్ని ప్రత్యేకమైన విషయాలపై దృష్టిని సారించారు. అందులో చెప్పుకోదగినవి ''తాళ్లపాక వారి రచనలు అయిన *'అష్టమహిషీకళ్యాణము'*, *'పరమయోగి విలాసము'* ల ప్రతులను సంపాదించటం. ఈ తాళపత్ర ప్రతులు వీరి ఇంట్లో ఉన్నట్లు మాతామహి లక్ష్మమ్మగారు చెప్పారట. ఇందులో అష్టమహిషీకళ్యాణ ప్రతిని తిరుమల తిరుపతి దేవస్థానం వారికి, పరమయోగి విలాసాన్ని ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారికి రాళ్ళపల్లి వారు ఇచ్చారట. అప్పట్లోనే చంద్రకవి రచించిన శ్రీ కృష్ణభూపాలీయాన్ని కూడా పరిష్కరించారట. తర్వాత ఏదో సందర్భంలో బాగేపల్లి అనంతాచార్యులు అనే కవి రాసిన ఏడు హరికథల్ని, నాలుగు యక్షగానాల్నీ రాళ్ళపల్లివారు సేకరించారట. అయితే పిఠాపురం ఆస్థాన పండితులు పెండ్యాల వేంకట సుబ్రమణ్యశాస్త్రి ఏప్రిల్ 16, 1917న పిఠాపురం నుండి రాసిన లేఖలో, రాళ్ళపల్లివారు మైసూరులో లేనప్పుడు ఇంటికి వచ్చి ఇరవై ఏడు రచనల్ని తీసుకున్నట్లు పేర్కొన్నారు. అవి తిరిగి తమ వద్దకు రాలేదని రాళ్ళపల్లివారు బాధపడ్డారట, అంతేగాక ఇంత వరకూ ఎవరూ గుర్తించని మరికొన్ని గ్రంథాలు తమవద్ద ఉన్నాయని చెప్పారు.

అయితే అవి వెలుగులోకి రావడానికి అవకాశం రాలేక పోయిందని కూడా రాళ్ళపల్లివారు అన్నారట. ప్రస్తుతం వీటిని వెలుగులోకి తీసుకురావలసిన అవసరం నేడు ఎంతైనా ఉందని భావించవచ్చు. రాళ్ళపల్లివారు తాళ్లపాక నిఘంటువు కోసం ప్రణాళికను సిద్ధం చేసుకొన్నప్పటికీ అసమగ్రంగానే నిలిచిపోయిన విషయం ఎక్కువమందికి తెలీదు. అందుకు ఈర్ష్యాద్వేషాలే కారణమని రాళ్ళపల్లివారు చెప్పారని అంకే శ్రీనివాస్ తెలిపారు.[58]

## 1.10. రాళ్ళపల్లివారి పీఠికలు

సమకాలీన సాహిత్యంలోని చాలా సాహిత్య ప్రక్రియలకు పీఠికలు రాసిన ఘనత శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారికి దక్కింది. ఆ రోజుల్లో రచయితలు రాళ్ళపల్లివారితో పీఠికలు రాయించుకోవడం ఓ అదృష్టంగా భావించేవారు. విమర్శను ఒక కళగా భావించే రాళ్ళపల్లివారు ప్రసిద్ధ రచనలు చేయడమే కాకుండా, అనేక గ్రంథాలకు ముందుమాటలు రాయడం మరో విశేషం.

[56] అనంతగీతిక – 4 'సూర్య దిన పత్రిక' నవంబర్ 24– 2014.

[57] రాళ్ళపల్లి పీఠికలు పరిశీలన. పుట. 63–64.

[58] అనంతగీతిక 5 'సూర్య దిన పత్రిక' డిసెంబర్ 1– 2014.

*"చెప్పేదానికి ఒక విషయ ముండాలి*
*అది చెప్ప దగినదై ఉండాలి*
*బాగా స్పష్టంగా చెప్పే శక్తి నీకుండాలి"*

అని రాళ్ళపల్లివారు తన రెండో కుమారుడు ఆర్. ఏ. జయంత గారితో అప్పుడెప్పుడో అన్నారని నేను చేసిన వ్యక్తి గత ఇంటర్వ్యూ ద్వారా తెలిసింది.[59] ఈ విషయం అక్షరాలా నిజమనిపిస్తుంది. ఎందుకంటే రాళ్ళపల్లి వారు సంగీత, సాహిత్య రంగాల్లో విశిష్టమైన గుర్తింపు పొందడానికి కారణం పైన చెప్పిన మాటే కారణమనిపిస్తుంది. ఈయన పేరు మోసిన విమర్శకులవడంవల్ల ఇతర కవి పండితుల రచనలకు గొప్ప పీఠికలు రాయగలిగారు. 1917నుండి 1977 వరకు దాదాపు 120 గ్రంథాలకు పీఠికల రాశారు. ఎక్కడెక్కడో చెల్లా చెదురుగా పడి ఉన్న పీఠికల్ని శ్రీ ఘట్టమరాజు అశ్వత్థనారాయణ, ఆర్వీయస్ సుందరంగార్లు ఎంతో శ్రమ కోర్చి *'రాళ్ళపల్లి పీఠికలు'* (1978) అనే సంకలన గ్రంథంగా తీసుకొని రావడం గొప్ప విశేషమని చెప్పవచ్చు. అంతకు ముందు ప్రముఖ విమర్శకులు జి. యన్ రెడ్డిగారు శర్మగారి పీఠికల గురించి రాళ్ళపల్లి అభినందన గ్రంథం *'అనంతరాగం'* (1977) లో 'రాళ్ళపల్లి రమణీయ పీఠికలు' అనే వ్యాసంలో రాళ్ళపల్లివారు రాసిన స్వీయ పీఠికలు, ఇతరుల గ్రంథాలకు, కావ్య నాటకాలకు, నవల, కథ, వ్యాస, విమర్శ, పరిశోధన మొదలైన గ్రంథాలకు రాసిన పీఠికల విశిష్టతను సాహిత్యానికి అందించారు. ఉదాహరణకు కొన్ని ప్రసిద్ధ పీఠికల పేర్లు గుర్తు చేసుకుందాం. సినారె *'నాగార్జున సాగరం'*, విద్వాన్ విశ్వం 'పెన్నేటి *పాట'*, బాలాంత్రపు రజనీకాంత రావుగారి *'ఆంధ్రవాగ్గేయకార చరిత్రము'* వెరసి *'పాండురంగ మాహాత్మ్యము'*, *'వదరుబోతు'* మొదలైన గ్రంథాలకు రాసిన పీఠికలు రాళ్ళపల్లి వారికి గొప్ప పేరుని తెచ్చిపెట్టాయి.[60]

శర్మగారి వ్యాస వాఙ్మయం చాలా గొప్పది. వీరు వెలువరించిన కొన్ని వ్యాసాలు ఎన్నో చర్చలకు దారి తీసిన సందర్భాలు లేకపోలేదు. *'సారస్వతాలోకము'* (1954) లో ఉన్న ప్రతి వ్యాసం పాఠకులను ఉత్తేజపరిచి, సాహిత్యాభిరుచిని కలిగించిన వ్యాసాలే, ఇందులోని మొదటి వ్యాసం *'రాయల నాటి రసికత'* ఇది కొంత కాలం డిగ్రీ తరగతులకు పాఠ్యాంశంగా ఉన్నదంటే వీరి వ్యాసాలకు ఉండే విశిష్టతను అవగతం చేసుకోవచ్చు. ఈ ఎనిమిది వ్యాసాలే కాకుండా మరికొన్ని సాహిత్య, సంగీత వ్యాసాలు ఇటు ఆంధ్రదేశంలోనూ అటు కర్నాటక దేశంలోనూ ఎంతో పేరు ప్రఖ్యాతులు పొందాయి. ఆ వ్యాసాలన్నీ ఆంధ్ర పత్రిక, భారతి, గ్రంథాలయ సర్వస్వము లాంటి ప్రసిద్ధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ఎమెస్కో బుక్స్ సంపాదకులు డి. చంద్రశేఖర్ రెడ్డి గారు *'రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు'* (2017) పేరుతో 30 వ్యాసాలను పుస్తక రూపంలో తీసుకోరావటం శుభదాయకం.

---

[59] ఆర్. ఏ. జయంత గారితో తిరుపతిలో4/11/2014 న జరిపిన సంభాషణ.

[60] బడిగె ఉమేశ్. రాళ్ళపల్లి పీఠికలు పరిశీలన (2013) అముద్రిత సిద్ధాంత వ్యాసం. పుట 90– 100.

'రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు' అనే కొత్త పుస్తకానికి ప్రముఖ విమర్శకులు ఘట్టమరాజు అశ్వత్థ నారాయణగారు 'గోరంత దీపం' అని చక్కని పీఠిక రాశారు. ఈ పీఠిక చదివితే వ్యాస కర్తగా రాళ్ళపల్లి వారి విశిష్టత బోధపడుతుంది. ఘట్టమరాజు గారికి ఉన్న సునిశిత పరిశీలన, సుస్పష్టమైన వాక్యనిర్మాణం చదివితే ఆశ్చర్య పోతాం. రాళ్ళపల్లి వారి వ్యాసాలను అర్థం చేసుకోవడానికి మార్గం చూపిన ఆ వాక్యాలు చూడండి. ''*శ్రీ మాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారు తెలుగు పద్యకళా రచనలో సిద్ధహస్తులైనట్లే, తెలుగు గద్య రచనలో కూడా మహత్తరమైన సిద్ధుల్ని కరతలామలకం చేసుకొన్న ఘనాపాఠి. తెలుగు సాహిత్య వ్యాసాన్ని ఒక కళాఖండంగా తీర్చిదిద్దిన వ్యాసకర్తల్లో రాళ్ళపల్లి వారు ప్రథమగణ్యులు*''. అని పరిచయం చేస్తూ రాళ్ళపల్లి వారి *'సారస్వతాలోకము'* (1954) లోని వ్యాసాల గొప్పతనాన్ని ఘట్టమరాజు ఈ విధంగా విశ్లేషించారు. ' రాళ్ళపల్లి వారి వ్యాస రచనా కౌశలానికి వారి 'సారస్వతాలోకము' పుస్తకంలోని ఎనిమిది వ్యాసాలు మచ్చుతునకలు. శర్మగారు వ్యాస రచనలకు అంశాన్ని ఎన్నుకొనేటప్పుడు చూపే శ్రద్ధా సక్తులు, విషయాన్ని వింగడించేటప్పుడు కనపరిచే తార్కికత, వ్యాసాంశాన్ని మెలమెల్లగా విస్తరిస్తూ పోయేటప్పుడు ప్రదర్శించే విజ్ఞత, రసికత, సుకుమార హాస్యం, తీక్షణమైన వ్యంగ్యం పఠితల్ని మంత్ర ముగ్ధుల్ని చేస్తాయి.

వ్యాసకర్త అక్కడక్కడ ఇతరేతర విషయాలు ప్రస్తావించినా, అవి శాఖాచంక్రమణం అనిపించకుండా, మూలవస్తువు విశదీకరణకు దోహదం చేయటం విశేషం. రాళ్ళపల్లి వారు వ్యాసం ఆదిమధ్య భాగాల్ని ఎంతో నేర్పుగా నిర్వహించడం ఒక ఎత్తైతే, అంత్యభాగాన్ని కొండంత ఓర్పుగా నడపడం మరో ఎత్తు. వ్యాస విషయాన్ని తలపోలం దాకా సునాయాసంగా, అవలీలగా తీసుకెళ్లి మణిపూసల్లాంటి పదాల్ని పేర్చి, వ్యాసానికి సమగ్రతను, సౌందర్యాన్ని సంతరించి పెడుతుంది ఈ అంత్య భాగం. అంతేకాక, వ్యాస విషయం గురించి విభిన్న కోణాల్లో దర్శింపగలిగే కొత్త చూపు ప్రసాదిస్తుంది. ఇలాంటి నూతనోత్తేజం కలిగించే ఎన్నో వ్యాసాలు రాళ్ళపల్లివారి కలం నుంచి జాలువారటం గమనార్హం.[61] అని అశ్వత్థనారాయణగారు విశ్లేషణాత్మక పీఠిక రాయటం ప్రశంసనీయం.

## 1.11. రాళ్ళపల్లివారి వైవాహిక జీవితం

శర్మగారికి 1911– 1912 ప్రాంతంలో రుక్మిణమ్మతో వివాహం అయింది. ఈమెది కోలారు జిల్లా ద్వార నాయకపల్లి అని ఆర్. ఏ. జయంతగారు వ్యక్తిగత ఇంటర్వ్యూలో చెప్పారు.[62] వివాహం నాటికి రాళ్ళపల్లివారి వయస్సు 18 సంవత్సరాలు. ఆ సమయంలో వీరికి ఉద్యోగం లేకపోవడం వల్ల చాలా కష్టాలను ఎదుర్కొన్నారు. ''రాళ్ళపల్లి వారి భార్య రుక్మిణమ్మ గారిది చల్లని కడుపు. వీరికి ముగ్గురు కూతుళ్లు, ఇద్దరు కొడుకులు. ఈ దంపతులిద్దరు పిల్లాపాపలతో సుఖంగా జీవితం కొనసాగించారు. వీరికి మొదట కూతురు జన్మించింది. ఈమె

[61] గోరంత దీపం' రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట: 5.

[62] ఆర్. ఏ. జయంత గారితో తిరుపతిలో 4/11/2014 న జరిపిన సంభాషణ.

పేరు నాగమణి. ఈమె భర్త కందాళ పార్థనాథశర్మ. పెద్ద కుమారుడు ఆర్. ఏ. ఫణిశాయి. ఈయన బెంగళూరులోని నేషనల్ కాలేజి (జయనగర్) ప్రిన్స్‌పాలుగా పనిచేసి స్వర్గస్తులైనారు. రెండవ కుమారులు ఆర్. ఏ జయంత. వీరు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషు అధ్యాపకులుగా పనిచేసి రిటైర్ అయ్యారు. ప్రస్తుతం జయంతగారి వయసు సుమారు 84 సంవత్సరాలు. తిరుపతిలో తన కూతురు కుమారి దీప్తగారి దగ్గర ఉన్నారు. రెండో కూతురు ప్రభావతి ఈమె కూడా తిరుపతిలో ఉంటున్నారు. మూడో కూతురు డా. హరిణి ఈమె తత్త్వ శాస్త్రంలో డాక్టరేట్ పొందిన ప్రతిభాన్వితురాలు. ఈమె భర్త శ్రీనివాసన్ తో బెంగుళూరులో ఉంటున్నారు.[63]

ఆర్. ఏ. జయంత గారు వారి తల్లిదండ్రుల 70 యేళ్ల దాంపత్య జీవితాన్ని గురించి 'మా నాన్నగారు' అనే వ్యాసంలో ఈ విధంగా చెప్పుకున్నారు. '' మా అమ్మ, అయ్యది మాటలకు అందని అనుబంధం. మా అమ్మ అసాధారణమైన వ్యక్తి. బయటి ప్రపంచంతో ఆమెకు ఏ సంబంధము లేదు. ఐనా జీవితంలో ఆటుపోటులన్నిటిలో ఆమె అయ్యకు తోడు నీడగా ఒక ఆధార స్తంభంగా ఉండేది. ఆమె నిస్వార్థమైన తోడ్పాటువల్లనే అయ్యగారి సాహిత్య వ్యాసంగం, సంగీత సాధన తమకు వచ్చిన కీర్తి మొదలయినవన్నీ సాధ్యమైనాయని అయ్య విశ్వసించేవారని చెప్తూ...''ఒకప్పుడు అమ్మ తీవ్రమైన అనారోగ్యంతో మంచాన పడినప్పుడు, ఆమె మునుపటి మనిషి కాజాలదని తెలిసినప్పుడు అయ్య మానసికంగా అనుభవించిన వేదన ఇంతా అంతా కాదు. సామాన్యంగా ఆయన తమ మనస్సులోని భావాలను పైకి చెప్పుకునేవారు కాదు. ఆ విధంగా చెప్పుకోవడం ఒక దౌర్బల్యమనే భావించేవారు. కానీ, ఈ సందర్భంలో తమ బాధను పైకి చూపకుండా ఉండలేక పోయారు. అని ఆర్. ఏ. జయంత తెలియజేశారు.[64]

ఇంకా రాళ్ళపల్లివారితోనూ, వారి కుటుంబంతోనూ ప్రత్యేక అనుబంధం కలిగిన గౌరిపెద్ది రామసుబ్బ శర్మగారు చెప్పిన విషయాలు రాళ్ళపల్లి వైవాహిక జీవితాన్ని అద్దం పట్టిస్తాయి.''శర్మగారి కుటుంబంలో అందరూ మాతాపితృభక్తి పరాయణులు, మర్యాద దాటని వారు, కుటుంబంలో అందరూ ఆస్తికులు. ఇక రాళ్ళపల్లివారి భార్య రుక్మిణమ్మగారు. ఆమె బయటి ప్రపంచం ఎరుగని ఏకాంత శ్రమ జీవి. ఆమెకు నిద్ర సమయం మాత్రమే విశ్రాంతి కాలం. వీరి కీర్తికి పరిచర మూల స్తంభం. పాత సంప్రదాయాలను బాగా తెలిసిన మనిషి. మంచి పండు టెంకాయలుంటే చాలు; *''వండనలయదు వేపురు వచ్చిరేని, అన్నపూర్ణకు నుద్దియౌ నతని గృహిణి''* అను మాట ఈమె పట్టున అక్షరసత్యము. *ఈమెవలన గృహిణులు నేర్వవలసిన వెన్నో కలవు.''* [65] అంటూ వివరించారు. పై విషయాలు తెలుసుకొన్నాక రాళ్ళపల్లి వారి జీవితంలో భార్య రుక్మిణమ్మ పాత్ర అమోఘమైనదని అర్థం అవుతుంది. ప్రతి మాగాడి విజయం వెనుక ఒక స్త్రీ అని ఊరికే అనలేదు.

---

[63] 'తాళ్ళపాకవారి సంకీర్తనలు – రాళ్ళపల్లివారి సేవ' అనంతరాగం. పుట. 196.

[64] శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ శత జయంతి సంచిక. పుట. 124.

[65] 'రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ' ఆలోచనాలహరి. పుట. 49.

రాళ్ళపల్లి వారి జీవితం గురించి ఆయన రెండవ కుమారుడు ఆర్. ఏ. జయంత మరికొన్ని అభిప్రాయాలు వ్యక్తపరిచారు.[66]

1. వైరుధ్యంగా ఉన్న విషయాలు, వైవిధ్యంగా ఉన్న అంశాలను సమన్వయ పరచటం వారికి ఇష్టం.
2. చెప్పే విషయం చాలా స్పష్టంగా చెప్పటం వారికి అలవడిన విద్య.
3. సంగీతం ఆపాత మధురం, సాహిత్యం ఆలోచనామృతం. కాబట్టి సంగీత,సాహిత్యాలు వారికి రెండు కళ్లలాంటివి.
4. అయ్యగారు భావం, రాగం, తాళం అనే మూడింటిని సమన్వయ పరిచారు. ప్రత్యేకంగా లయను ''కళామయ జీవితం'' అన్నారు.
5. వినడానికి సొంపుగా, మధురంగా ఉన్నవి సంగీత, సాహిత్యాలకు ఉపయోగపడతాయి.
6. ఎప్పుడు ఓ కొత్త విషయం తెలుసుకోవడానికి ప్రయత్నించేవారు. ఉదాహరణకి 'జిలుగులు' అనే పదం చెప్పారు.
7. తెలుగు సాహిత్యంలో 1910 ఆ ప్రాంతంలో అనేక కవితోద్యమాలు పురుడు పోసుకున్నాయి. వాటిని గురించి తెలుసుకున్నారు కాని, ఆకర్షితులు కాలేదు.
8. ఇంట్లో ప్రతి శుక్రవారం పాటలు పాడుతుంటారు.
9. రామాయణం, అభిజ్ఞాన శాకుంతలం, రఘువంశం లాంటి కావ్యాలను అమితంగా ఇష్టపడే వారు.
10. సంస్కృతంలో కాళిదాసుని, తెలుగులో తిక్కనను చాలా ఇష్టపడే వారు. ముఖ్యంగా తిక్కన భాష అంటే చెప్పలేనంత ఇష్టం.
11. ఏ భాషలోనైనా నుడికారాన్ని పట్టుకొనే వారు.
12. ఆడవాళ్లందరికి సంగీతం నేర్పించారు. మమ్మల్ని సంస్కృతం నేర్చుకొండి అని అనేవారు.
13. ఏ పని చేసినా తాను ఆత్మ సంతృప్తి కోసం చేశారు. అందులో భాగంగా తెలుగు, కన్నడ, తమిళం, ఇంగ్లీషు భాషలు స్వప్రయత్నంతో నేర్చుకున్నారు.
14. అయ్యను కవిత్వం గురించి అడిగినప్పుడు ''పద్యాలు రాయవచ్చురా! రాసిందల్లా కవిత్వం కాదు'' అనేవారు.
15. అవధానం గురించి అడిగినప్పుడు ''అష్టావధానం చేయాలని కోరిక ఉండేది అని అనేవారు. వీరు కొప్పరపు సోదర కవుల పద్యాలను ఇష్టపడేవారు. మూడు నాలుగు రోజులు ఒక పద్యం రాయడానికి పట్టేది.
16. కవిగా నేను చెప్పగలిగింది ఏదీ లేదురా! అని అనేవారు.

---

[66] ఆర్. ఏ. జయంతగారితో తిరుపతిలో 4/11/2014న జరిపిన ఇంటర్వ్యూ.

17. వీరు రాసే రాతకు ఒక స్పష్టమైన ఆలోచన విధానం ఉండేది. ఎందుకంటే వీరు రాసే ఏ వ్యాసమైనా ఒకే సారి రాసే వారు తప్ప, పదే పదే రాసేవారు కాదు అని చెప్పారు.

18. 'అయ్య' వస్త్రధారణను పెద్దగా పట్టించుకునే వారు కాదు. గోచిపంచ, ఇష్టపడేవారు. ఎక్కువగా మైసూరు సిల్క్ షర్ట్స్ ధరించేవారు.

## 1.12. ప్రశంసలు

రాళ్ళపల్లివారు చిన్నప్పుడు తెలివైన కుర్రాడిగా ఉండేవారని వారి జీవితం గురించి చదివితే తెలుస్తుంది. ఏదైనా చూస్తే లేదా వింటే అట్లాగే గుర్తు పెట్టుకునేవారట. అలాంటి సందర్భాలను కొన్ని గుర్తు చేసుకొందాం. ''చిన్నప్పుడు తల్లి అలమేలు మంగమ్మ గారు చెప్పిన పాటలు పొల్లు పోకుండా గుర్తుంచుకొనే వారంట. అందుకు వీరిని ఏక సంథగ్రహి అని పరిశోధకులు భావించటం పరిపాటి. శర్మగారి గురించి తిరుమల రామచంద్ర ''మరపు రాని మనిషి' అనే వ్యాసం రాశారు. ఇది 1962లో *'ఆంధ్రప్రభ'* సచిత్ర వార పత్రికలోనూ, 1975లో యువ భారతి పుస్తకంలోనూ ప్రచురింపబడింది. ఇందులో తిరుమల రామచంద్ర రాళ్ళపల్లివారి గురించి చెప్తూ... 'మైసూరులోని పరకాలమఠంలో కవి గండభేరుండ సర్వతంత్ర స్వతంత్ర్యాద్యనేక బిరుదాంచితులు శ్రీ కృష్ణ బ్రహ్మతంత్ర పరకాల యతీంద్రులు, చామరాజ నగరం శ్రీకంఠ శాస్త్రి గారనే మహా విద్వాంసులతో ముచ్చటిస్తున్నారు. అప్పయ్య దీక్షితుల వారి ప్రస్తావన వచ్చింది. వీధిలో ఏదో కలకలం వినిపిస్తే ''ఏమిటో చూడమ్మా'' అని దీక్షితుల వారు కూతురితో అన్నారట! ఆమె వీధిలోకి వెళ్లి తిరిగి వచ్చి తండ్రితో –

***"తురిష్కో నిష్కాశిః తురగఖుర కుద్దాల దళిత***
***క్షమా ధూళీపాళీ చుళుకిత చతుస్సింధు సలిదః***
***స్వదోర్లీలా భగ్న ప్రతిభట వధూటీ పరికరః***
***పత్త్యస్థే కార్తాంతీం దిశమితి హి వార్తా సమజని.***

అని చెప్పిందట! మరికొన్ని చాటువులతోపాటు శ్రీ కంఠశాస్త్రి ఈ శ్లోకాన్ని పరకాల యతీంద్రులకు తెలిపారు. ఆ సమయంలో పన్నెండేళ్ల పిల్లవాణ్ణి యతీంద్రులు 'అనంతూ! ఈ శ్లోకం గుర్తు పెట్టుకోరా! అన్నారట అయితే యతీంద్రులు చెప్పింది ఒక్క సారే కదా! అని అశ్చర్యపడ్డారు. ' మరేం పర్వాలేదు. జ్ఞాపకం పెట్టుకుంటాడు' అని యతీంద్రులవారు బదులిస్తే ఆశ్చర్య పోవడం శాస్త్రి గారి వంతయ్యింద'ని తిరుమల రామచంద్ర చెప్పిన మరొక్క విషయం ''ఆ వటువు గర్భాష్టములోనే సంస్కృతంలో కవిత చెప్పడమే గాక భోజుని చంపూ రామాయణానికి ప్రతిగా మరోక చంపువు చెప్పినాడని, రాజస్థాన కథావళి చదివి తారాదేవి, మిరాబాయి తెలుగు కావ్యాలు రాసినట్లు ఆ శాస్త్రి గారికి ఏమీ తెలుసు అని చెప్పారు.

పై విషయం జరిగిన పన్నెండేండ్లకు అంటే (1917లో) రవీంద్ర నాథ్ ఠాగూర్ మైసూరుకు వచ్చినప్పుడు రాళ్ళపల్లి వారు 25 సంవత్సరాలు కూడా నిండని యువకుడు. రవీంద్రుడు ''భువన మనో మోహిని'' ''జనగణమన'' పాడుతూ వుంటే ఆ యువకుడు వెంట వెంటనే స్వర పరుచుకున్నాడట, అప్పుడు ఆ సన్నివేశాన్ని చూసిన రవీంద్ర నాథ్ ఠాగూర్ ''ఐ కెనాట్ ఇమాజిన్ హౌ దిస్ యంగ్ పండిట్ ఫాలోస్ మి విత్ నోటేషన్'' అని ఆశ్చర్యపోయాడట;[67] ఈ విషయాన్ని రాళ్ళపల్లి రెండో కుమారులు ఆర్. ఏ జయంత గారు కూడా చెప్పారు. ఆర్. ఏ. జయంత ఎనభైఐదేళ్ల వయసులో కూడా ఎంతో ఓపికతో 'ఓయి భువన మనో మోహినీ' అనే పాటను పాడి వినిపించారంటే నాకు చాలా ఆశ్చర్య మేసింది.

ఈ సందర్భంగా మరో గొప్ప సన్నివేశం గుర్తుచేసుకోవాలి. అది ''1927లో ఆంధ్ర కాంగ్రెసు సమావేశంలో భాగంగా రెండో ఆంధ్ర గాయక మహాసభ అనంతపురంలో జరిగింది. శ్రోతలందరూ భోజనానికి వెళ్లడానికి సిద్ధంగా ఉన్న సమయంలో రాళ్ళపల్లి వారిని మాట్లాడడానికి రమ్మన్నారు. అప్పుడు శర్మగారు తన ప్రసంగం ప్రారంభించారు. కాంగ్రెసు నాయకులంతా ఎంత సేపు పడుతుందయ్యా అంటూ ఆందోళనైతూ త్వరగా ముగించవలసిందిగా ప్రార్థించారు. అప్పుడు శర్మగారు మీరెప్పుడు ఆపమంటే అప్పుడు ఆపుతాను. అంటూ...తన ఉపన్యాసం కొనసాగించారు. ఇక పది నిమిషాలు చదివారో లేదో భోజనానికి వెళ్లదలచిన వారు వెళ్లకుండా అలాగే కూర్చుండి పోయారట. మరల పదినిమిషాల తర్వాత రాళ్ళపల్లివారు కాంగ్రెసు నాయకులవైపు తిరిగి చూశారట. వెనుక నున్న దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులుగారు ''చదవవయ్యా, బాగుంది'' అని ప్రోత్సహించారట. అప్పుడు దాదాపు రెండు గంటల సేపు శ్రోతలు మంత్ర ముగ్ధులై విన్నారట. ఆ ఉపన్యాస ప్రతిని తర్వాత పంతులు గారు రాళ్ళపల్లి వారితో తీసుకొని 'గానకళ' పేరుతో (సుమారు 1500 ప్రతులు) భారతిలోనూ, ఆంధ్ర పత్రిక సారస్వతానుబంధంలో ప్రకటించినారట. ఈ వ్యాసం కన్నడంలో కూడా అనువదింపబడి కన్నడిగుల మన్ననలను కూడా చూరగొన్నది.

రాళ్ళపల్లివారు మైసూరులో అధ్యాపకులుగా ఉన్నప్పుడు అప్పుడప్పుడు కవి సమ్మేళనాలలో పాల్గొనేవారు. మైసూరు విశ్వవిద్యాలయ రజతోత్సవ సందర్భంగా జరిగిన కవి సమ్మేళనంలో సంస్కృత కవిత ఒకటి చదివారట! పై ప్రశంసలు రాళ్ళపల్లివారి జీవితంలో మరిచిపోలేని వని చెప్పవచ్చు. శర్మ గారి ప్రతిభ అసాధారణమైనది. అటు సంగీతంలోను ఇటు సాహిత్యంలోను సమానమైన పాండిత్యం కనబరచినది.

## 1.13. సన్మానాలు, సత్కారాలు

అసలు ఒక రంగంలో కృషిచేయడమే చాలా కష్టం. అలాంటిది రెండు సాగరాల వంటి సాహిత్య, సంగీతాలలో నిరుపమానమైన కృషికి గుర్తింపుగా వచ్చిన పురస్కారాలు, బిరుదులు కూడా ఉన్నాయి వాటిని తెలుసుకుందాం.

---

[67] శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ శతజయంతి సంచిక. పుట. 46.

1954లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసినప్పుడు ప్రారంభంలో ప్రార్థన గీతాలాపన చేసే అదృష్టం రాళ్ళపల్లి వారికి దక్కడం గొప్ప విశేషం. 1957లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ఏర్పడినప్పుడు రాళ్ళపల్లి వారు అందులో కార్యవర్గ సభ్యులై నారు. 1961లో మైసూరులో ప్రసన్న సీతారామ మందిరం వారు జరిపిన నాల్గవ సంగీత పరిషత్తుకు రాళ్ళపల్లి వారు అధ్యక్షత వహించారు. అప్పుడు వీరిని 'గాన కళా సింధు' అనే బిరుదుతో సత్కరించారు. ఆంధ్ర ప్రదేశ్ సంగీత నాటక అకాడమీ వారు రాళ్ళపల్లి వారి సేవలను పురస్కరించుకొని వారికి 'గాన కళా ప్రపూర్ణ' అనే బిరుదును ప్రదానం చేసి సన్మానించారు. 1964లో ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు.

1969లో కర్నాటక సంగీత నాటక అకాడమి రాళ్ళపల్లి వారిని బెంగళూరులో ఉచిత రీతిని గౌరవించింది. బెంగళూరులో 18-10-1970న జరిగిన ద్వితీయ సంగీత సమ్మేళనానికి రాళ్ళపల్లి వారు అధ్యక్షత వహించారు. ఆ సభలో 'సంగీత కళారత్న' అనే బిరుదును ఇచ్చారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ రాళ్ళపల్లి వారికి ఫెలోషిప్ నిచ్చి గౌరవించింది. మద్రాసు మ్యూజిక్ అకాడమీ వారు 1974లో 'సంగీత కళానిధి' బిరుదుతో సత్కరించారు. రాళ్ళపల్లి వారు ఆంధ్ర ప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ఉపాధ్యక్షులు గానూ, మద్రాసు సంగీత పరిషత్తు నిపుణుల సంఘ సభ్యులు గానూ కొంత కాలం ఉన్నారు. వీరు అటు సాహిత్యంలోనూ, ఇటు సంగీతంలోనూ చేసిన కృషికి ప్రత్యేకంగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం 1974లో గౌరవ డాక్టరేట్ పట్టానిచ్చి గౌరవించింది. 1979 మార్చి 11వ తేదీ సాయంత్రం 4:15నిమిషాల సమయంలో తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి పి. వి. ఆర్. కె. ప్రసాద్, ఇతరులు ఆకస్మికంగా బెంగుళూరులోని శర్మగారి ఇంటికి స్వయంగా వెళ్ళి, రాళ్ళపల్లి వారిని కలిసి, ఆ వేంకటేశుని ఆస్థాన సాహిత్య సంగీత విద్వాంసులుగా ఎన్నుకున్నామని చెప్పి, స్వామివారి శ్రీ పాదరేణువును కూడా శర్మగారికి అందించారు. ఇది జరిగిన కొంత సమయానికి అంటే 6: 15 నిమిషాలకు రాళ్ళపల్లి వారు ఈ లోకాన్ని విడిచి వెళ్ళారు.[68]

శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ సామాన్య కుటుంబంలో పుట్టి, సంసారసాగరం లోని ఆటు పోట్లు ఎదుర్కొని, తమ జీవితాన్ని కళాత్మకంగా తీర్చిదిద్దుకొన్నారు. గురువుల ఆశీర్వాదంవల్ల సాహిత్య, సంగీత క్షేత్రాల్లో గొప్ప కృషిచేసి కృతార్థులయ్యారు. నిరాడంబర జీవితం గడుపుతూ, తెలుగు సాహిత్య విమర్శకు వొరవడి దిద్దిన ధన్యజీవి రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ.

[68] రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ శత జయంతి సంచిక. పుట. 127.

**ఈ అధ్యాయంలో ముఖ్యాంశాలు**

- రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు అనంతపురం జిల్లాలోని ఓ కుగ్రామంలో 1893 జనవరి 23న జన్మించారు.
- శర్మగారు తల్లి వద్ద సంగీతం, తండ్రి వద్ద సంస్కృత కావ్యాల పరిచయం పొందారు.
- సంస్కృత విద్యాభ్యాసం చేసేందుకని మైసూరు పరకాల మఠ యతీశ్వరుల శిష్యరికం చేశారు. వీరి దగ్గర కావ్య, నాటక, అలంకార శాస్త్రాల్ని శ్రద్ధగా అభ్యసించారు.
- కట్టమంచి రామలింగారెడ్డి పరిచయ భాగ్యం వల్ల తిక్కన భారతంలోని మర్మాల్నీ, వేమన కవిత్వంలోని సుగుణాల్నీ, ఆంగ్ల కావ్య శాస్త్ర లోతుల్నీ బాగా అర్థం చేసుకున్నారు.
- రాళ్ళపల్లివారు భారతీయ సంప్రదాయ సాహిత్య, ఆంగ్ల కావ్య పద్ధతుల్నీ మేళవించుకుని కావ్య విమర్శల్నీ రాయడం ప్రారంభించారు.
- అనంతకృష్ణులవారు పద్య, గద్య రచనలు తెలుగు సాహిత్యంలో ఆణిముత్యాలుగా అభివర్ణించబడ్డాయి.
- శర్మగారు తన జీవిత పర్యంతం ఇటు సాహిత్యాన్ని, అటు సంగీతాన్ని పట్టు వదలని విక్రమార్కుడిలా అభ్యసించారు.
- తాను పొందిన జ్ఞానాన్ని సమాజానికి తెలిపేందుకు రాళ్ళపల్లి వారు ఎక్కడా రాజీపడలేదు.

తర్వాత రాబోయే అధ్యాయంలో రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి రచనలను సమీక్షించుకుందాం.



రెండవ అధ్యాయం

# రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ రచనలు – సమీక్ష

## రెండవ అధ్యాయం

# రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ రచనలు: సమీక్ష

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి జీవితాన్ని, సాహిత్య నేపథ్యాన్ని గత అధ్యాయంలో తెలుసుకున్నాం. ఈ అధ్యాయంలో శర్మగారి రచనల్ని సమీక్షించుకుందాం. ఈయన తెలుగు సాహిత్యంలో సుప్రసిద్ధ రచయిత. వీరి రచనలు సాహిత్య, సంగీత క్షేత్రాల్లో ప్రఖ్యాతి పొందాయి. కాబట్టి ఇవి ఆలోచనామృతాలూ, ఆపాత మధురాలు. వీటిని అస్వాదించే సహృదయులకు విజ్ఞాన దాయకాలూ, చైతన్య దీపికలు. అటువంటి రచనల్నీ సునిశితంగా పరిశీలించి వాటి ప్రత్యేకతల్నీ, విశిష్టతల్ని సుస్పష్టంగా తెలుసుకొంటే శర్మగారి దృక్పథం అవగాహనకు వస్తుంది. రాళ్ళపల్లివారి రచనలు ప్రధానంగా సృజనాత్మక, అనువాద, విమర్శ విభాగాల్లో కొనసాగాయి. వీటన్నిటిని లోతుగా పరిశీలించి వాటి వైశిష్ట్యాన్ని తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం.

### 2.0. సృజనాత్మక రచనలు

రాళ్ళపల్లివారు 1911లో రచనా రంగంలో అడుగుపెట్టారు. అప్పటి సమకాలీన సాహిత్య ప్రపంచానికి అనుగుణంగానే వీరి రచనలు కొనసాగాయి. తొలుత సంస్కృత భాషా ప్రభావంతో మన తెలుగు కవులు పద్య రచనలు చేసేవారు. కాబట్టి శర్మగారు కూడా అలానే మొదలు పెట్టారు. లభ్యమవుతున్న వీరి సృజనాత్మక రచనల్లో *'భార్గవీ పంచవిశతీ'*,(ఇది ఇరవై ఎనిమిది పద్యాల రచన)*'తారాదేవి'* (1911), మిరాబాయి (1913) అనే రెండు ఖండకావ్యాలూ, *'పెనుగొండ కొండ'* , *'పరిహాస లీల'*, *'ముసలి వీణ'*, *'సంధ్యావందనము'* , *'విస్మృత వేణుగీతి'* , *'శమీపూజ'* , *'భారతికి సాధువాదము'*, *'ప్రబంధకవి'* అనే ఎనిమిది ముక్తక కవితల్ని కలిపి సృజనాత్మక రచనలు అందుబాటులో ఉన్నాయి. వీటన్నిటిని సమగ్రంగా సమీక్షించుకొందాం.

సి. మృణాళి రాళ్ళపల్లివారి సృజన సాహిత్యంపై తెలిపిన అభిప్రాయాన్ని సిద్ధాంత గ్రంథం చివరిలో (వివిధ రచయితలతో ఇంటర్వ్యూలు) ప్రశ్నావళి :3, ప్రశ్న : 9 ని చూడు (అనుబంధం 1)

### 2.1. భార్గవీ పంచ వింశతి

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ రాసిన సృజనాత్మక రచనల్లో లభ్యమవుతున్న తొలి రచనా *భార్గవీ పంచవిశంతి'*. ఇది అసంపూర్ణ రచన. దీన్ని రాయడానికి గల కారణాలను ప్రస్తుతం తెలుసుకోవటం అవసరం. శర్మగారు విద్యాభ్యాసం కోసం మైసూరుకు వెళ్ళారు. అప్పటి వీరి వయసు పదమూడేళ్ళు. తొలుత బంధువుల ఇంట్లో ఉండేవారు. ఆ తర్వాత పరకాల మఠంలో చేరి పండితుల వద్ద విద్యనభ్యసించారు. పద్దెనిమిదవ యేట వీరికి వివాహం జరిగింది. అప్పటికీ ఈయనకు ఏ ఉద్యోగం లేదు. ఓ విధంగా చెప్పుకోలేని కష్టాలను అనుభవిస్తున్న సందర్భమది.

ఆసమయంలో రాళ్ళపల్లివారు లక్ష్మీదేవిని ప్రార్థిస్తూ శార్దూలం, మత్తేభ వృత్తాల్లో కొన్ని పద్యాలు రాశారు. వీటిలో తమ బాధాతప్త హృదయాన్ని ఆవిష్కరిస్తూ, నాలుగవ పాదం చివర 'భార్గవీ' అని సంబోధించారు. దీన్ని శతకమని సాతవల్లి చంద్రశేఖర్ తమ సిద్ధాంత వ్యాసంలో పేర్కొన్నారు[1]. కానీ 28 పద్యాలు మాత్రమే లభ్యమవుతున్నాయి. వీటిని 1926లో అనంతపురం సాధన ముద్రాలయం *'భార్గవీ పంచవిశంతి'* పేరుతో ప్రచురించింది. ఉదాహరణకు ఇందులోని కొన్ని పద్యాలను పరిశీలిస్తే శర్మగారి భావాలు తెలుస్తాయి.

మ. ***ఎవరిన్ వేడుదు? నెన్నినాళ్ళనుచు నేనీ బాధలనే బొందుదున్***
***బవలున్ రేయును గంటి కిన్నిదుర నేమార్గంబునందెత్తు? నీ***
***దు విధానన్ సరివారి మోము లెటులన్ జూతున్ జగనాత్మ, నీ***
***వ వచింపంగదె నాకు నిర్భయత బోవం ద్రోవయో భార్గవీ.***

అనే పద్యంలో శర్మగారు నిరుద్యోగిగా జీవితం గడుపుతున్నప్పుడు పడిన బాధల్లో ఎంత హృదయావేదన ఉందో అర్థం చేసుకోవచ్చు.

రాళ్ళపల్లివారు సాహిత్య రచన చేయడానికి కావాల్సిన శక్తిని ప్రసాదించమని ఆ భార్గవీ దేవిని కోరుకొన్న విధానం చూడండి.

మ. ***ధనమే యిమ్మని నిన్ను నేనడుగనో తల్లీ! తలంపం ధనం***
***బనఁ బై నొత్తిన రాజముద్రయె కదా! ప్రాణంబుతో నీ జగం***
***బున నున్నన్ని దినాలుఁ గొందఱయిన న్మోదింపగా గౌరవం***
***బున జీవింప ననుగ్రహింపు మదియే పూర్ణంబగున్ భార్గవీ.***

అని విష్ణుమూర్తి భార్యయైన లక్ష్మీదేవిని వేడుకొన్నారు. ఇలా అన్ని పద్యాలు హృదయ విదారకంగా ఆవిష్కృతమయ్యాయి.

## 2.2. ఖండ కావ్యాలు

ముందు చెప్పుకొన్నట్టు శర్మగారు రాసిన ఖండ కావ్యాలు రెండు అవి *'తారాదేవి'*, *'మీరాబాయి'*. రాళ్ళపల్లివారి రచనల్లో సంపూర్ణంగా లభ్యమవుతున్న తొలి రచన *'తారాదేవి'*. దీన్ని 1911లో రాశారు. ఆ సమయంలో లేదా అంతకు ముందు తెలుగు సాహిత్యంలో ఖండకావ్యాల ప్రభావం ఏమేరకు ఉంది? ఈ ప్రభావం రాళ్ళపల్లివారి ఖండకావ్యాలపై ఏవిధంగా పడింది? మామూలుగా ఖండకావ్యం అంటేఏమిటి? దాని లక్షణాలేలా ఉంటాయి? మొదలైన సాధారణాంశాలను తెలుసుకొని ఈ కావ్యాల లోతులను పరిశీలిద్దాం.

---

[1] రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి సాహిత్య సేవ – సవిమర్శక సమీక్ష, పుట: 22

### 2.2.1. ఖండకావ్య నిర్వచనం

ఆధునిక తెలుగు సాహిత్యంలో ఖండకావ్య రచన ఒక నూతన ప్రక్రియగా ఇరవయ్యో శతాబ్ది ప్రారంభంలో అవతరించింది. కొంతమంది పరిశోధకులు ఈ ప్రక్రియను గురించి కొన్ని నిర్వచనాలను, లక్షణాలను పేర్కొన్నారు.

తెలుగు సాహిత్యంలో ఇరయ్యో శతాబ్దానికి ఒక ప్రత్యేకత వుంది. అదేమిటంటే, అనేక ప్రక్రియలు ఈ కాలంలోనే రావటం. అప్పట్లో వచ్చిన ప్రక్రియల్లో ఖండకావ్య ప్రక్రియను విశేషంగా చెప్పుకోవచ్చు. నవ్య కవిత్వంలో ప్రథమ గణ్యమైనది ఈ ప్రక్రియ. దీనికి ప్రధాన హేతువు ఇంగ్లీషు కవిత్వమే. [2] అని సి. నారాయణరెడ్డి అన్నారు. వీరితోపాటు మరికొందరి అభిప్రాయాలు కూడా పరిశీలించదగినవి.

1. *''ఖండకావ్యం భవేత్కావ్య స్యైకదేశానుసారిచ' అని సాహిత్యదర్పణము మహాకావ్య లక్షణములలో నేక దేశమును గ్రహించి, వ్రాసిన కావ్యము; మేఘదూతాదులు మహాకావ్య ఖండకావ్యములకు 'సంఘాతము లేక సంఘాతకము' అనియు నామాంతరము.''* [3]
2. *''మహా కావ్యములనుండి రసవద్ఘట్టములు కాని, ఒక ఏక విషయమును గురించి వ్రాసిన కొన్ని పద్యములు కాని, విడిగా తీసినచో అవి ఖండకావ్యములగును.''* [4] అని విశ్వనాథ సత్యనారాయణ పేర్కొన్నారు.
3. *''ఉదాత్తమైన మహాకావ్యం కంటె ఈ ఖండకావ్యం తక్షణ హృదయస్పృక్కు, కవి హృదయ జ్వలనములో వెలువడిన రసభావ సంగీతమున కిది తారాస్థాయి.''* [5] అని ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి నిర్వచించారు.

### 2.2.2. ఖండకావ్య లక్షణాలు

ఖండకావ్య ప్రక్రియ పాశ్చాత్య ప్రభావం వల్ల తెలుగులోకి వచ్చిందని ముందే చెప్పుకున్నాం. ఈ పక్రియలో ఆత్మాశ్రయం ప్రధానంగా ఉంటుందన్నారు కానీ, దీనిపై అనేక చర్చలు జరిగాయి. ముఖ్యంగా ఆలంకారికులు చేసిన చర్చలు ప్రముఖమైనవి. వాటిలో కొన్నిటిని చూద్దాం.

సి. నారాయణరెడ్డి తన సిద్ధాంత గ్రంథంలో ఖండకావ్యం గురించి కొందరు పరిశోధకుల అభిప్రాయాలను కింది విధంగా క్రోడీకరించారు.

1. భామహుడు ***'కావ్యాలంకార సంగ్రహము'*** లో కావ్యాన్ని మూడు విధాలుగా విభజించినాడు.1. సర్గబంధము, 2. అభినేయార్థము, 3. అనిబద్ధము. సర్గబంధమనగా వివిధ రస భావాలతో, సుదీర్ఘ కథతో కూడు కొన్న మహాకావ్యం. అభినేయార్థమనగా దృశ్యకావ్యం. అనిబద్ధమనగా అనుస్యూతంగా ఒక కథ లేకుండా భావతీవ్రతను

---

[2] ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు: ప్రయోగములు. పుట. 165.

[3] కావ్యాలంకార సంగ్రహము – సన్నిధానము సూర్యనారాయణ శాస్త్రి. పుట. 270.

[4] 'ప్రక్రియా పరి భాషలో మార్పు అనివార్యం' (వ్యా) సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు. పుట. 396.

[5] 'ప్రక్రియా పరి భాషలో మార్పు అనివార్యం' (వ్యా) సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు. పుట: 396.

ప్రకటించుటయే లక్షణం కాగల ముక్తక రచన. నిబద్ధ కావ్యమనగా ప్రబంధమని, అనిబద్ధ కావ్యమనగా ముక్తకమని తేలినది. ప్రాచీనులు అనిబద్ధ కావ్యాలకు విలువనీయలేదు.

2. వామనుడు ***'కావ్యాలంకార సూత్రవృత్తి'*** 'నానిబద్ధంచకాన్యేకతేజః పరమాణువత' అని సూత్రీకరించాడు.
3. ఆనందవర్ధనుడు ***'ధన్యాలోకము'*** లో ముక్తక ప్రస్థానంలో ముక్తకాలను ప్రబంధ పంక్తిలో కూర్చోబెట్టాడు.
4. విద్యానాథుడు ***'ప్రతాపరుద్రీయము'*** లో ' అసర్గబంధమపి యదుపకావ్య ముదీర్యతే' అని ముక్తక (ఖండ) కావ్యమని కొంత అస్తిత్వమున్నట్లు సూచించాడు. తొలి సారిగా ఖండకావ్య ప్రక్రియను పేర్కొన్న లాక్షణికుడు విశ్వనాథుడు. ఆయన 'వాక్యం రసాత్మకం కావ్యం' అన్న ఆలంకారికుడు కాబట్టి ఖండకావ్య విశిష్టత గుర్తించాడు. ఈతడు 'ఖండకావ్యం' భవేత్కావ్య స్యైకదేశానుసారిచ' అని సూత్రీకరించి దీనికి ఉదాహరణగా 'యథా మేఘదూతాది' అని పలికాడు.

పైన వివరించిన లాక్షణికుల అభిప్రాయాల అనుగుణంగా సి.నా.రెగారు ఖండకావ్యమనగా చిన్న కథ, కొన్ని పాత్రలు, పరిమిత పద్యాలుండి ఆశ్వాస విభక్తం గాని రచన కావచ్చును. లేక ఒక పద్యమో, కొన్ని పద్యాల్లో ఉన్న రచన కావచ్చును.[6] అని సినారె తన సిద్ధాంత గ్రంథంలో తెలిపారు. తర్వాత వచ్చిన పరిశోధకులు కొన్ని అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

- *''మహాకావ్యం కూడా సంకుచితమైన ఏ ఒక్క భావ సామాగ్రినో స్థల కాలాలలోని ఏక దేశాన్నో, కావ్యంలో వ్యక్తమయ్యే వ్యక్తులనో చిత్రించితే అది పరిమితిలో నిబద్ధమైతే అప్పుడది 'ఖండకావ్య' మవుతుంది. లేదా 'కావ్యఖండ' మవుతుంది. ఖండకావ్యం స్వల్పం పరిమాణం కలది. ఇది ఒక భావదీప్తితో పూర్తవుతుంది.''*[7] అని కోవెల సుప్రసన్నాచార్యులు 'సాహిత్యము – ప్రక్రియా వివేకము' అనే వ్యాసంలో అభిప్రాయపడ్డారు.
- *''భామహుడు తన 'కావ్యాలంకార సంగ్రహం' లో కావ్యాన్ని సర్గ బంధం, అభినేయార్థం, అనిబద్ధం అని మూడు విధాలుగా విభజించాడు. ఇందులో అనిబద్ధ కావ్యాన్ని ఒక రకంగా ఖండకావ్యమని చెప్పవచ్చు. ఎందుకంటే పెద్ద కథతోనూ, వివిధ భావాలతోనూ కూడుకున్నది సర్గ బంధమైతే, దృశ్యకావ్యం అభినేయార్థమైతే మిగిలిన అనిబద్ధమే ఖండకావ్యం. ఒక కథ అనేది ప్రత్యేకంగా లేకుండా, కేవలం భావతీవ్రత ప్రకటన మాత్రమే అనిబద్ధమనీ, దాన్నే ముక్తమని కూడా అన్నారని.''*[8] ఖండకావ్య తొలి లక్షణమిదేనని గిరిజా మనోహరబాబు వివరించారు.

[6] ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు: ప్రయోగములు. పుట. 166.

[7] కదంబం 'తెలుగు సాహిత్య ప్రక్రియలు రూపాలు'. పుట. 1.

[8] కదంబం 'తెలుగు సాహిత్య ప్రక్రియలు రూపాలు'. పుట : 167.

- సి. నారాయణరెడ్డి చెప్పిన ఖండకావ్య లక్షణాలను ద్వానాశాస్త్రి ఇలా విభజించారు. 1.కథాత్మకమైనవి. 2. ప్రణయాత్మకమైనవి. 3. ప్రకృతి పరిమైనవి. 4. ప్రబోధాత్మకమైనవి. 5. వర్ణనాత్మకమైనవి.[9] ఈ లక్షణాలను తెలిపారు.
- రాళ్ళపల్లివారు *'క్రొక్కారు మెరుగు'* అనే ఖండ కావ్యానికి ముందుమాట రాస్తూ మహాకావ్యానికి, ఖండకావ్యానికి భేదాలు తెలిపారు. అవి ; ఖండకావ్యాలు మహాకావ్యాల కంటే సులభంగా రాయవచ్చునని తలచుట పొరపాటు. కొన్ని విషయాలు వాని కన్న ఇవి కష్టం. అంటూ.. ఖండకావ్యం గురించి వారి మాటల్లోనే *''ఖండకావ్యాల్లో అతి ముఖ్యమైన విషయాలు తప్ప తక్కిన విషయాలు విస్తరించటానికి వీలు లేదు. ఇది చిన్న కావ్యం కాబట్టి, పరీక్ష ఎక్కువగా ఉండును. ఈ గమనింపు లేక పోతే నగుబాట్లు పాలవుతారు. మనసులో లేని తీవ్రత మాటలలో రాదను విషయము ఖండకావ్య కవులు అనేకులు గమనింపవలసియు గమనింపనిది. ముఖ్యంగా ఖండకావ్యము ప్రవృత్తి నిమిత్తము; కవికి గలిగిన హార్దబావములను తలపులను జిత్రించు నుద్దేశము.''*[10]

పై నిర్వచనాలు, లక్షణాల ఆధారంగా ఖండకావ్యాన్ని ఈ విధంగా నిర్వచించవచ్చు. సమగ్ర మానవ చరిత్రలో ఒక ఘటన గురించి గానీ, లేదా ఒక వ్యక్తి జీవితంలోని సంఘటన గురించి గానీ సంపూర్ణంగా వివరించేది ఖండకావ్యమనవచ్చు. అయితే ఆయా విషయాలను కవితాత్మకంగా, కళాత్మకంగా చెప్పడానికి కవులు పాత్ర పోషణ, రసౌచిత్యం, అలంకారాలు, ఛందస్సు మొదలైన వాటిని ఉపయోగించి, దీనికి సందర్భాను సారంగా వర్ణనలను జోడించి సంపూర్ణ ఖండకావ్యంగా తీర్చిదిద్దుతారు.

### 2.2.3. తెలుగులో తొలి ఖండకావ్యాలు

తెలుగులో తొలి ఖండకావ్యంగా కట్టమంచి రామలింగారెడ్డి రాసిన *''ముసలమ్మ మరణము''* అని చెప్తారు. ఇది 1900 వ సంవత్సరంలో ప్రచురితమైంది. దీన్ని నవ్య సాహిత్యోద్యమానికి వేగుచుక్కగా పింగళి లక్ష్మీకాంతం అభివర్ణించారు.[11] ఇక్కడ మరో విషయం చెప్పుకోవాలి. 1904లో 'కల్పలత' పత్రికలో ప్రచురింపబడిన *'బొండుమల్లెలు'* తొలి ఖండకావ్యమని అంటారు. కానీ, ఇందులో వస్తువు ఆత్మాశ్రయం కాదని సినారె తెలిపిన మాటలు *''ఖండకావ్యంలో కవి భావం చిక్కగా ఉంటుంది. వ్యర్థ పదాలకు, వర్ణనలకు అవకాశం ఉండదు. ఖండకావ్యానికి యోగ్యం కాని వస్తువంటూ లేదు.''*[12]

కట్టమంచి రామలింగారెడ్డి రాసిన *'ముసలమ్మ మరణము'* మొదట్లో ఎవరిని పెద్దగా ఆకట్టుకోలేదు. కానీ, రాయప్రోలు సుబ్బారావు రాసిన *'తృణకంకణము'* తర్వాత రెడ్డిగారి

---

[9] తెలుగు సాహిత్య చరిత్ర. ద్వానా శాస్త్రి. పుట. 305.

[10] రాళ్ళపల్లి పీఠికలు. పుట. 123–125.

[11] గౌతమ వ్యాసాలు. పుట. 162.

[12] తెలుగు సాహిత్య చరిత్ర. ద్వానాశాస్త్రి. పుట. 304.

కావ్యం మీద దృష్టి మళ్ళింది.[13] ఎందుకంటే దానిలో ఉండే వస్తువు రెడ్డిగారి *'ముసలమ్మ మరణము'* కావ్యాన్ని గుర్తుచేసింది. దీని కారణంగా అప్పట్లో దీనికి బాగా ఆదరణ లభించింది. తర్వాత ఈ ప్రభావం రాయప్రోలు సుబ్బారావు, గురజాడ అప్పారావు, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, దువ్వూరి రామిరెడ్డి, గుర్రం జాషువా, దేవులపల్లి కృష్ణశాస్త్రి మొదలైన వారిపై పడినట్లు కనబడుతుంది.

### 2.2.3.1. కట్టమంచి రామలింగారెడ్డి – ముసలమ్మ మరణం

ఈ కావ్యాన్ని 1899లో రాశారు. ఇందులోని ప్రధాన అంశాలు.

- వస్తువు సాంఘికం
- నాయికా నాయకులు సామాన్య కాపు కుటుంబానికి చెందినవారు.
- కావ్యంలోని రసం వీరం
- నాయిక ఉన్నతమైన త్యాగ శీలమే ఇందులో వర్ణించబడింది.
- ఇది నాయిక ప్రధానమైనది.
- కావ్యం సుఖాంతం కాకుండా మరణాంతంగా ముగిసింది.

### 2.2.3.2. గురజాడ అప్పారావు – పూర్ణమ్మ

ఈ కావ్యాన్ని 1910లో రాశారు. ఇందులోని ప్రధాన అంశాలు.

- దీనిపై *''ముసలమ్మ మరణము''* కావ్య ప్రభావం కనిపిస్తుంది.
- వస్తువు సాంఘికం.
- నాయికా ప్రధానం.
- నాయిక మరణానంతరం రచన ముగుస్తుంది.

అనుమాండ్ల భూమయ్య పై తేడాలు చెప్తూ... *''తెలుగులో ఖండకావ్య సృష్టిలో కట్టమంచి తొలి మార్గమని, గురజాడ రెండో మార్గమని, రాయప్రోలు మూడో మార్గమని.''*[14] అభిప్రాయపడ్డారు.

### 2.2.3.3. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ – తారాదేవి

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గారు రాసిన ఖండ కావ్యాలు రెండు. ఇవి కట్టమంచి, గురజాడల కావ్యాల తర్వాత వచ్చినట్లు తెలుస్తుంది. ప్రధానంగా 1911లో వచ్చిన *'తారాదేవి'* ఈ కావ్యంలో వస్తువుపై *'ముసలమ్మ మరణము'*, *'పూర్ణమ్మ'* కావ్యాల్లో ఉన్న ఇతివృత్త ప్రభావం ఉన్నట్లు తోస్తోంది. అయితే శర్మగారు తారాదేవి కావ్యంలో కొన్ని మార్పులు చేసి దాన్ని విషాదాంతంగా కాకుండా సుఖాంతంగా ముగింపునిస్తారు.

- *'తారాదేవి'* లో వస్తువు సాంఘికం.

---

[13] ఆద్యుడు కట్టమంచి. పుట. 46.

[14] ఆద్యుడు కట్టమంచి. పుట. 46-50.

- నాయిక ప్రధానం.
- వీర రస ప్రధానం.
- కావ్యం సుఖాంతంగా ముగుస్తుంది.

ప్రజల క్షేమం కోసం ముసలమ్మ బలి అయ్యింది. కన్యాశుల్క దురాచారాన్ని రూపు మాపడానికి పూర్ణమ్మ తనువు చాలించింది. ఈ రెండు కావ్యాలు సమాజంపై ఎంతో ప్రభావం చూపాయన్నది నిర్వివాదాంశం. అయితే రాళ్ళపల్లివారి 'తారాదేవి' ఖండకావ్యం కూడా ఆ రెండు కావ్యాలంత పని చేసిందనిపిస్తుంది. ఎందుకంటే ఆ రెండు కావ్యాల్లోనూ ఒక స్త్రీ ప్రాణాలను అర్పించి సమాజానికి మంచి చేసింది. కానీ తారాదేవి కావ్యంలో శర్మగారు స్త్రీ ప్రాణాలను కాపాడారని చెప్పవచ్చు. స్త్రీలలో కూడా ఒక అద్భుతమైన శక్తి ఉంటుందని నిరూపించే ప్రయత్నం చేశారు. అంటే ప్రతి దానికి చావు పరిష్కారం కాదని స్ఫురింపజేశారు. మనిషి జీవించి ఉంటే ఏదైనా సాధించవచ్చని హితవుచెప్పారు. మహిళలు పురుషుల కంటే దేనిలోనూ తక్కువ కాదని శర్మగారు వివరించారు. తారాదేవి కావ్యాన్ని నిశితంగా పరిశీలిస్తే, స్త్రీపురుషుల సమానత్వాన్ని ఎంతో ఔచిత్యంతో చాటి చెప్పారని అనిపిస్తుంది.

## 2.3. తారాదేవి ఖండకావ్యం : విశ్లేషణాత్మక పరిశీలన

సాధారణంగా యుక్త వయసులో శృంగార రసంతో కూడిన కవితలు రచిస్తుంటారు. కాని అనంతకృష్ణశర్మ వీర రసంతో కూడిన కావ్యం రాయడం ఆసక్తిని కలిగించేలా ఉంది. దాని వివరాలు తెలుసుకొందాం.

### 2.3.1. ప్రాథమిక వివరాలు

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ 1911లో 'తారాదేవి' ఖండకావ్యం రాశారు. అప్పటికి ఈయన వయసు పద్దెనిమిదేళ్లు. అంత చిన్న వయసులో వీర రసం ఉట్టి పడే కావ్యం రాయడం ప్రశంసనీయం. అందులో ఒక స్త్రీ ధైర్య సాహసాలను తెలపటమంటే అది సామాజిక చైతన్యానికి నిదర్శనమనచ్చు. ఎందుకంటే శర్మగారు సాధారణంగా ఆ మిడి మేలత వయసులో ఏవో ప్రణయ కావ్యాలు రాయాలి కాని, ఇలాంటి స్త్రీల ధైర్య సాహసాలతో కూడిన కావ్యం రాయడమంటే ఆలోచించాల్సిన విషయమే. కాని శర్మగారు రాశారు. కాబట్టి దాని కథను తెలుసుకోవాల్సిందే.

రాళ్ళపల్లివారు 'తారాదేవి' కావ్యాన్ని రాసిన కొత్తలో అప్పటికి పరిచయం ఉన్న కట్టమంచి రామలింగారెడ్డిగారికి చూపించారు. రెడ్డిగారు ఈ కావ్యాన్ని చదివి శర్మగారిని పొగిడి, తమ మిత్రులైన కొచ్చెర్ల కోట వెంకటేశ్వరరావుకు పంపించారు. ఈయన 'సరస్వతి ' మాస పత్రిక సంపాదకుడైన కె. వి. కృష్ణారావుకు ఇచ్చారు. వీరు ఈ కావ్యాన్ని కాకినాడ నుండి వెలువడే 'సరస్వతి' మాస పత్రిక (1911) లో ప్రచురించారు. ఆ రోజుల్లో దాదాపు రెండు వందల ప్రతులు వరకు ఈ కావ్యాన్ని ముద్రించడం విశేషం. పంతొమ్మిది పేజీల్లో ఇమిడిన చిన్న చంపు కావ్యమిది. 175 పద్య, గద్యాలు కల ఈ కావ్యంలో శర్మగారు సందర్భానుసారంగా జాతి,

ఉపజాతి పద్యాలను చక్కగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం ఈ కావ్య ప్రతులు చాలా అరుదుగా లభ్యమవుతున్నందుకు చింతించాలి.

చరిత్రలో 1911 ఆ ప్రాంతం ఆధారంగా గమనిస్తే! తెలిసే అంశాలు ఇలా ఉన్నాయి. ''*రాజస్థాన్ వీర గాథల పురిటి గడ్డ. భారతీయుల్లో అద్భుత మానసిక పరిణామాల్ని తెచ్చిన వీర గాథల్లో 'తారాదేవి' కథ ఒకటి. చిలకమర్తి వారి 'రాజస్థాన్ కథావళి' తెలుగు కవులకి ఉత్తేజ కరమైన వస్తువుల్ని ప్రసాదించింది. రాణా ప్రతాప్, పద్మిని. తారా మొదలైన కథలు తెలుగు వారికి చాలా ఇష్టమైనవి.''*[15] అని తంగిరాల వెంకట సుబ్బారావు అభిప్రాయపడ్డారు.

## 2.3.2. తారాదేవి కావ్యేతివృత్తం

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ రాసిన ఈ కావ్యంలోని  ఇతివృత్తం ఎంతో ఆసక్తిని గొల్పుతుంది. మేవారు రాజ కుమారుడైన 'హరసింగు' ఎంతో ధైర్య, శౌర్య సంపదలు కలిగిన ధీరుడు. ఒక రోజు తన రాజ్య భూ సరిహద్దుల్లోకి అనుకోకుండా ఓ అడవి పంది ప్రవేశిస్తుంది. దానితో ప్రజలందరు భయభ్రాంతులకు గురౌతారు. అందుకు రాజు ఆ పందిని ఎలాగైనా పట్టి చంపాలని తన భటులను ఆదేశిస్తాడు. అంతటితో భటులు ఆ పందిని పట్టుకోవడానికి ఆయుధాలతో బయలుదేరుతారు. చాలా సేపు దాన్ని వెంబడిస్తారు.  అది భటులకు దొరకకుండా అనేక  ముప్పు తిప్పలు పెట్టసాగింది. అలా చివరికి ఓ జొన్న  చేనులోకి వెళ్ళిపోతుంది. అందరు జొన్న చేను చుట్టూ చేరి పందిని ఎలాగైనా పట్టాలని నిశ్చయించుకుంటారు. అయితే వాళ్ళలో ఎవరూ జొన్న చేనులోకి వెళ్లి, పందిని బయటికి రప్పించడానికి సాహసించరు. దాంతో రాజు ఎంతో అవమానంగా భావించి '*ఇంతటి రాజ్యంలో ఒక్కడు ఈ పందిని బయటి రప్పించి చంపే వాడు లేడా*' అని పశ్చాత్తాపడతాడు. ఇలా అందరూ ఆ జొన్న చేను దగ్గర చాలా సేపు ఆలోచిస్తూ ఉండిపోయారు. ఆ రాజ్య సమీపంలోని చిన్న పల్లె నుండి జొన్న చేను కాపలా కోసం యుక్త వయసులో ఉన్న బాలిక వస్తుంది. ఆమె ఓ గట్టు మీద నిలబడి పొలం వైపు చూస్తుంది. అక్కడ సమీపంలో కొంత మంది సైన్యం ఉన్నట్లు తెలుస్తుంది. అలా గట్టు దిగి త్వరగా ఆ సైన్యం దగ్గరికి చేరు కొంటుంది. అక్కడున్న భటులు ఆమెను అనేక రకాలుగా ప్రశ్నించి రాజు దగ్గరికి తీసుకెళతారు.

అప్పుడు రాజు ఈమె వివరాలు అడిగి  విషయాన్ని చెప్తాడు. కాగా ఆ బాలిక వారితో ఈ విధంగా చెబుతుంది. '*మీరంతా చేను బయట కాపలా కాయండి. నేను ఎలాగైనా ఆ పందిని బయటికి పంపిస్తాను. అప్పుడు దాన్ని చంపండ*'ని అంటుంది. దాంతో రాజుతో పాటు భటులందరూ చాలా ఆశ్చర్యానికి గురౌతారు. ఇంతటి సైన్యం ఉన్న ఓ రాజు తర్జన భర్జన పడుతుంటే ఓ యువతి వచ్చి, ఆ పందిని బయటికి ఎల్లగొడతా అనటంతో వారందరూ విస్తుపోతారు. 'సరే చూద్దాం' అనుకుని అందరూ చేను బయట ఉంటారు. సాధారణంగా తారాదేవి ప్రతి రోజు చేనులోకి ఎలా వెళుతుందో అలా లోపలికి వెళ్లి ఆ పందిని బయటికి

[15] 'తెలుగు పలుకుబడుల కాణాచి తారాదేవి' అనంతరాగం. పుట. 165.

రప్పిస్తుంది. అప్పుడు భటులు హుటాహుటినా పందిని చుట్టు ముట్టి చంపుతారు. 'కందం రాసినవాడే కవి, పందిని చంపిన వాడే బంటు' అన్నట్లు.. ఇదంతా చూసిన రాజు ఆశ్చర్యానికి లోనై ఆమెను పిలిచి పేరు అడుగుతాడు. కొన్ని రోజుల తర్వాత ఎలాగైనా ఆ యువతిని వివాహం చేసుకోవాలని అనుకొని మరల ఆమెను కలిసి కుటుంబ వివరాలు తెలుసుకొంటాడు. అప్పుడు ఈ తారాదేవి పక్క రాజ్యం చంద్రవంశ రాజు భద్రసింగు కూతురని తెలుస్తుంది. పైగా ఆమె ఓ క్షత్రియ కన్య అని భావించి, తారా తండ్రిని పిలిపించి జరిగిన విషయం చెప్తాడు. మొత్తం కథ విన్న భద్రసింగు వారి వివాహానికి నిరాకరిస్తాడు. హరసింగు కొన్ని రోజులు ఆలస్యం చేసి తిరిగి కబురు చేస్తాడు. ఈ విషయాన్ని భద్రసింగు భార్య తెలుసుకొని తారాదేవి వివాహానికి ఒప్పు కొంటుంది. అలా హరసింగు, తారాల వివాహం అంగరంగ వైభవంగా జరుగుతుంది. తారాదేవి ధైర్య సాహసాలను చూసి మనసు పడిన రాజు ఆమెను ఎలాగైనా పెళ్లి చేసుకోవాలని అనుకుని దాన్ని సాధిస్తాడు. కొంత కాలం తర్వాత వీరికి మహా వీరుడైన హమీర సింగు పుడతాడు. ఇంతటితో కావ్యం ముగుస్తుంది.

## 2.3.3. తారాదేవి కావ్యంలో పాత్ర చిత్రణ

తారాదేవి కావ్యంలో175 పద్య,గద్యలు ఉన్నాయి. ఇందులో ప్రధానంగా తారాదేవి, హరసింగు, భద్రసింగు. అనే పాత్రలు ప్రముఖమైనవి. వీటిని గురించి స్థూలంగా తెలుసుకొందాం.

### 2.3.3.1. తారాదేవి

ఈ కావ్యంలో 'తారాదేవి' చెప్పుకోదగిన పాత్ర. ఈమెను కవి ధైర్య, శౌర్య సాహసాలకు ప్రతీకగా చిత్రించారు. ఈ అందమైన యువతిని కావ్యానికే వన్నె తెచ్చే విధంగా తీర్చిదిద్దారు. సాధారణంగా రచయిత తారాదేవిని పొలానికి కాపలా ధారిణిగా పరిచయం చేశారు. తర్వాత పొలంలోకి పంది రావటం, దాన్ని ఆమె బయటికి రప్పించటం, దీన్ని రాజు తన భటులు చూసి విస్తువటం, తారాదేవిని హరసింగు వివాహం చేసుకోవడం మొదలైనవన్నీ జరిగి కావ్యం సుఖాంతంగా ముగుస్తుంది. ఈ నేపథ్యంలో కవి తారాదేవి పాత్రను ఎంతో ఆలోచనాత్మకంగా తీర్చిదిద్దారని చెప్పవచ్చు.

కవి కావ్యంలో తారాదేవిని కింది పద్యం ద్వారా పరిచయం చేసిన క్రమాన్ని చూడండి.

ఉ. ***చూట్టును మూగి గుంపులుగ జోన్నలు మెక్కెడు పిట్టలెల్ల న***
***ట్టట్టుగఁ బారునట్టు లొడిసింటను రాళ్ళులు బెట్టి త్రిప్పుచున్***
***గట్టిగ వైదుదుకొ బొలముగాచుచు మంచిక మీద నుండి య***
***ప్పట్టున నోర్తు వీరల యవస్థల బాలిక జూచె వంతటన్*** (పద్యం:12. పుట: 2)

పద్యంలో కవి రాజభటులందరు పందిని పట్టుకోవడంలో ఉండగా, తారాదేవిని జొన్న చేనుకి కాపలా కోసం వచ్చినట్లు సృష్టించాడు. ఇలా ఈమె చేనుకు రావటం సహజంగానే ఉంది.

కానీ అక్కడ చేనులో పంది దూరిన సన్నివేశాన్ని ఆమెకు తెలియకుండా ఉంచాడు. అలా అనుకోకుండా తారాదేవిని కవి కావ్యంలోకి తీసుకోచ్చినట్లు అనిపిస్తుంది.

పందిని చంపిన తర్వాత రాజుగారు తారాదేవి ధైర్య సాహసాలను చూసి విస్తుపోయిన సందర్భాన్ని కవి వచనంలో ఇలా స్పష్టపరిచారు.

***వ. "అపుడు హరసంహుఁడాలలమామణి ధైర్య శౌర్య సాహసానికి లావణ్యాదులన్ గని యమంద విస్మయానందానూరాగాలహరీ మగ్న నిస్పందుండగుట నేమియున్ జేయి నన రాఁక యూరి కుందెనప్పుడప్పుడఁతి యెప్పటియట్లవినీతియుప్పతిల్ల నల్లవల్లన నాతనిని జరి నిర్పికారిగమీర్చి మృధు మధుర స్వరంబున "సెలవైన నేఁబోయిన త్తు నని విన్నవించి యిందుకయు జడియక తడచుక వెడలి పోయె నంతు***

(తారాదేవి: 39 పుట:5)

ఈ వచనం అంత సరళ గ్రాంథికంలో ఉంది. ఇందులో తారాదేవి గురించి మరికొన్ని విషయాలు తెలుస్తాయి. కావ్యంలో రాజు తారాదేవి ధైర్య సాహసాల్ని, అందచందాల్ని చూసి సంతోషంతో మై మరచి పోతాడు. తన మనసులో పరిపరి విధాలుగా ఆలోచిస్తూ స్వైర విహారం చేస్తాడు. ఆ సందర్భంలో తారాదేవి అంతకు ముందు లాగా చాలా వినయంగా మెల్లమెల్లగా రాజు దగ్గరికి వెళ్లి తన తియ్యనైన స్వరంతో మృదు మధురంగా 'సెలవిస్తే నేఁపోయి వస్తాను' అని తెలిపి మెల్లగా వెళ్లిపోయింది.

ఈ విధంగా కవి తారాదేవి పాత్రను కావ్యానికే వన్నే తెచ్చేలా మలిచారు.

## 2.3.3.2. హరసింగు

ఈ కావ్యానికి కథానాయకుడు హరసింగు. ఈ పాత్రను కవి తారాదేవి పాత్రకు అనుగుణంగా తీర్చిదిద్దారు. ఈ హరసింగు పేరుగాంచిన రాజ కుటుంబంలో జన్మించాడు. వీరిది రాజస్థాన్ ప్రాంతం. ఇతని తండ్రి లక్ష్మణ సింగు. ఈయన తన కుమారుణ్ణి చిన్నప్పటి నుండి ఎంతో క్రమశిక్షణతో పెంచాడు. కొన్ని యుద్ధ విద్యలలో తగిన శిక్షణ కూడా ఇప్పించాడు. యుక్త వయసు రాగానే వివాహం చేశాడు. ఇతనికి ఓ కూతురు కూడా కలుగుతుంది. తర్వాత ఇతడ్ని రాజ్యానికి రాజుని చేస్తాడు. ఇలా కొంత కాలం రాజ్యంలోని ప్రజలు సుఖ శాంతులతో జీవితం గడపసాగారు. తర్వాత హరసింగు చుట్టు తిరిగిన కథను మనం ఇతివృత్తంలోనే తెలుసుకొన్నాం.

అయితే కావ్యంలో కవి రాజు పాత్రను ఎలా నిర్మాణం చేశారోనన్న విషయాలు గమనించాలి. సాధారణంగా కవులు తమ ఆలోచనలకు అనుగుణంగా పాత్రలను మార్చుకుంటారు. అలా రాజు పాత్రను రాళ్ళపల్లివారు పరాక్రమానికి ధీటుగా చూపించారు. ఈ కావ్యంలో రాజు పాత్రకు గొప్ప సన్నివేశాన్ని కల్పించి ప్రవేశ పెట్టారనేది ఈ పద్యం చదివితే తెలుస్తుంది.

*చ. అచ్చెరువంది యందగవురా! యనుచున్ దనుఁజూచుచుండగాఁ*
*జెచ్చెర వచ్చినట్లు హరసింగు గనుగొని యంతఁగౌశలం*
*బచ్చుపడంగ నాపడఁతి యల్లన మోమరవంచి ప్రీతిలో*
*హెచ్చ నమస్కరించె నొక యింత మనంబున సిగ్గు దోపగన్*

(తారాదేవి:16 పుట 3)

పందిని వేటాడే సమయంలో అక్కడికి వచ్చిన తారాదేవిని బాగా పరీక్షించి చూసిన రాజు తన మనసులో అనుకుంటున్న విషయాలను కవి చెప్పటంతో రాజు పాత్ర కావ్యంలో కనిపిస్తుంది. అంటే రాజు తారా దేవిని అనుకోకుండా చూసి ఆమె అందచందాలకూ, ధైర్యసాహసాలకు ఆకర్షితుడౌతాడన్న విషయాన్ని కవి ఆలోచించి రాజును కావ్యంలో ప్రవేశపెట్టటం ప్రశంసనీయం.

కావ్యంలో రాజు ముందు తారాదేవిని చూసి, ఆమె గురించి తెలుసుకున్నాక ఎలాగైనా పెళ్లి చేసుకోవాలని అనుకుంటాడు. అప్పుడు ఇలాంటి తెలివి, సాహసాలు కల బాలిక ఈ అడవిలో ఎలా ఉంది. సాధారణంగా స్త్రీలు ఈ విధంగా ఉండటం అరుదైన విషయమని రాజు ఆనుకొంటాడు. తర్వాత వీరి తల్లిదండ్రులను ఒప్పించి వివాహం చేసుకుంటాడు.

హరసింగు తండ్రి లక్ష్మణ సింగుని ప్రతి విషయంలో ఆదర్శంగా తీసుకుని పరిపాలన చేస్తాడు. అందుకే తన రాజ్యంలో ప్రజలు సుఖ శాంతులతో జీవిస్తుంటారు. అలా ఉన్న రాజ్యంలో అడవి పంది వేట రాజుకు కొత్త జీవితాన్ని పరిచయం చేస్తుంది. ఈ విధంగా రాజును కూడా ధైర్య, శౌర్య సాహసాలకు, పరిపాలన దక్షతకు ప్రతీకగా చూపించారిక్కడా. కాబట్టి కవి రాజు పాత్రను సృష్టించడంలో ఔచిత్యాన్ని పాటించారనడంలో కృతకృత్యులయ్యారు.

### 2.3.3.3. భద్రసింగు

చంద్ర వంశానికి చెందిన రాజు భద్రసింగు. చిత్తూరు రాజ్యం పక్కలో మరో రాజ్యానికి కూడా రాజుగా వ్యవహరిస్తుంటాడు. తన కూతురైన తారాదేవిని చిన్నప్పటి నుండి గారాబం చేయకుండా ధైర్య సాహసాలకు ప్రతీకగా తయారు చేశాడు. అందుకు గాను తారాను సొంత ఊళ్లో కాకుండా ఓ చిన్న పల్లెటూరిలో రహస్యంగా పెంచ సాగాడు. తర్వాత జరిగిన కథంత తెలిసిందే.

రాజుగారు తారాదేవితో మాట్లాడి తన తండ్రి వివరాల్ని అడుగుతాడు. అప్పుడు ఆమె చెప్పిన విషయాలను విని ఆమె తండ్రిని తనతో కలువమని ఆదేశిస్తాడు. అలా తారా తండ్రి భద్రసింగు రాజు గారి దగ్గరికి వచ్చి ఉండడాన్ని కవి పద్యంలో ఎలా వర్ణించాడు చూడండి.

*గీ. "ఎంతలీవిగ వచ్చెదు నీతఁడౌర!*
*యుండు నీతఁడె తండ్రియయ్యావిద్య" కనుదుఁ*
*దన్ను నందఱుఁ జూడ నెంతయును వేఁగ,*
*వచ్చి యారీతినప్పుడా భద్ర సింగు,* (తారాదేవి: 112, పుట: 12)

ఎంతో దర్జాగా భద్రసింగు రాజు గారి కొలువుకు వచ్చిన తర్వాత వీరు ప్రవర్తించిన తీరును గురించి పై పద్యం వివరిస్తుంది.

## 2.4. తారాదేవి కావ్యంలో సంభాషణలు

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ ఈ కావ్యంలో సంభాషణలు సన్నివేశాన్ని బట్టి ప్రవేశ పెట్టటం ముదావహం. కొన్ని సంభాషణలు పద్యాల ఆధారంగా పరిశీలిద్దాం.

కథ ప్రారంభంలో రాజు తన సైన్యాన్ని తీసుకుని అడవి పందిని వేటాడటానికి వచ్చేటప్పుడు అక్కడికి ఓ పడుచు పిల్ల వస్తుంది. ఆ సమయంలో రాజుగారికి ఆ బాలికకు జరిగిన సంభాషణకు కింది పద్యం నిదర్శనం.

*క. బాలా! యొక సూకర మీ,*
*చేలన్ పడిదూరె మాకుఁ జిక్కక దానిన్*
*తోలుట కటఁజన మాగుఱ్ఱాలకుఁ*
*దెరవున్నె? తెలుపరాదు తెలిసినన్* (తారాదేవి: 19 పుట: 3)

ఓ బాలిక! ఈ చేనులో అడవి పంది దూరింది. మాకు ఇక్కడ దారులు తెలియటం లేదు నీకు తెలిస్తే చెప్పు అని ప్రశ్నిస్తాడు. అప్పుడు తారాదేవి స్పందించిన క్రమం చూడండి.

*చ. అనపుడు నానెలంత యపుడాతని వల్లనఁ జూచి "గట్టముల్*
*జవనగువే ! మనుష్యులకె చాల శ్రమం బటు పోతమన్నఁ! గా*
*వున సెలవైన నేనె యటు బోయి వరాహమా నిట్టుద్రిప్పెదన్*
*గనుఁగొనుడింకఁ దామిచటఁ గష్టములందఁగ నేల ! యింత గాన్*

(తారాదేవి: 20 పుట: 3)

పై పద్యంలో తారాదేవి రాజుగారిని వారి భటులను చూసి, 'గుర్రాలు మీ భటులు ఆ ప్రదేశానికి వెళ్లాలంటే చాలా కష్టంతో కూడిన పని. కాబట్టి మీరనుమతిస్తే నేనే అక్కడికి పోయి ఆ పందిని ఇటు మరలిస్తాను. చూస్తూ ఉండండి దాన్ని ఎంత ఇబ్బంది పెడతానో' అంటూ రాజుతో తారాదేవి చెబుతుంది. ఈమె మాటలు విన్న భటులు ఏ విధంగా అనుకొన్నారనేది కింది పద్యం చెబుతుంది.

*చ. అదివిని యోధు లెల్ల నవులాడుచు "మేల్ భళి! చేల నేరికిన్*
*బదమిడఁ గాన సాధ్యమట! పల్వురు వీరులు మిన్న కున్న నా*
*డుదియట ! తానునొక్కతె! కడున్ ధృతిఁబందినిఁ జేలదూరి లో*
*బెదరక త్రిప్పఁబోవునట! వింటిరె యిట్టివిచిత్ర మెన్నఁడున్*

(తారాదేవి : 21 పుట: 3)

రాజు గారి భటులు తారాదేవిని చూసి " మేళ్ భళి" చేనులో వెళ్లిన పందిని బయటకు రప్పించుట సాధ్యమా? అంటూ అవహేళన చేస్తారు. కొంత మంది వీరులు ఉరికే ఉన్న మరి కొందరు వీరులు ఆ పందిని రప్పించటం ఆమెకు అవుతుందా? అని అనుమానిస్తారు. అసలు

దానికి ఎంతో ధైర్యం కావాలి. అంతేకాక పొలంలోకి వెళ్లి దాన్ని బయటికి తోలటం సాధ్యం కాని పని. అని భటులు ఒకరి కొకరు సంభాషించు కొన్నారు. తర్వాత రాజు కొంత సేపయ్యాక తారాదేవిని అడిగిన విధానం పద్యంలో చూడండి.

**క. *మావిధి యియ్యది యోమగు,***
***వా! వేటన్ దవిలి యున్న వారగుట నిటన్***
***నీవేలా శ్రమమందగ ? నీవనమున***
***దారిఁ జూపు మింతయెచాలున్.*** (తారాదేవి : 25 పుట:3)

మా పని మాదమ్మ కేవలం దారి చూపించు చాలు అన్నట్లుగా చెప్తూ, వీళ్లందరూ వేట తెలిసిన వారు కాబట్టి నీ శ్రమ ఎందుకు కేవలం దారి చూపించు చాలు అని వివరిస్తారు. కాగా రాజు గారి మాటలు గమనించిన తారాదేవి ఈ విధంగా స్పందిస్తుంది.

*చ. అదివిని రాజపుత్రుఁగని యా తరుణీమణి యిట్లు బల్కె "మా*
*కిది యొక క్రొత్త గాదు మనుజేశ్వర ? పందులు వచ్చు నిత్యమున్*
*నందమునఁ జేనినంతయును నాశముజేఁగ మాకు వీనికిన్*
*బెదరినఁ గార్యమానె? యొక నేరయినన్ దుదఁ జేల నిల్చానే?*

(తారాదేవి : 27 పుట :4)

ఓ రాజా! మాకు ఇది కొత్త కాదు. పందులు నిత్యం ఇక్కడికి వచ్చి పొలాలన్నిటిని నాశనం చేస్తుంటాయి. అందువల్ల మేము వాటికి బెదరిన సందర్భాలు లేవన్న విషయాన్ని చెప్తుంది.

తర్వాత ఈ కావ్యంలో అతి కొద్ది సేపు ఉన్న భద్రసింగు రాజు గారితో సంభాషించిన విధానాన్ని కవి మృదు మధురంగా చిత్రించాడు.

*మ. హరసింగున్ గని యంత నెంతయు మహాహంకారియై ప్రక్కలో*
*సరివాదుల బలెఁ గూరుదుండియుఁ నమస్కారంబునున్ జేయకే*
*"త్వరగాఁ దెల్పుమా రాజ పుత్ర! ననుఁ బిల్వంబంపఁగా నేల ? నే*
*నరుగంగావలె నేరెకార్యమున కష్టం" చుక్ వడిన్ బల్కి నన్*

(తారాదేవి: 113 పుట: 12)

ఎంతో గర్వి అయిన రాజుగారిని చూసి నమస్కారం చేస్తూ... విషయం ఏమిటి తొందరగా తెలపండి నాకు అవతల చాలా పనులున్నాయి. త్వరగా చెప్పండి అన్నాట్లుగా ఇక్కడ రాజుగారితో అంటాడు. తర్వాత రాజు అతని గురించి ఎలా అనుకుంటారు అనేదానికి కింది పద్యం అద్దం పడుతుంది.

*శా. "ఔరా! యెంతటి గర్వమితనికి నంతైనన్ భయంబంది కే*
*యారీతిన్ వినయంబులఃతగువౌనే? కూరుచుండంగ మీ*

***వారాధీశుని ప్రక్క లోన" ననుచున్ వారందఱత్యంతకో***
***పారక్తేక్షణులయ్యు నప్డు హరసింహోన్యంబు నీక్షిందుచున్***

(తారాదేవి :114 పుట: 12)

రాజు భద్రసింగు గురించి ఈ విధంగా అనుకున్నాడు. ''ఎంత గర్వం వీడికి కొంచమైన భయం లేదు. వినయం అంతకంటే లేదు. తర్వాత అందరితో కలిసి కూర్చోన్నాడు. అది చూసిన రాజు కొంచెం ఆగ్రహం చెందుతాడు.

ఈ కావ్యంలో భద్రసింగు ప్రభావం కొంత వరకు ఉందని అనిపించింది. అల భద్రసింగు తన కూతురని పట్టపు రాణిగా చేయాల్సిన బాధ్యత నాకు ఉందని చాలా వినయంగా రాజుగారితో చెప్పుకున్నాడు. ఈ విధంగా కావ్యంలో రాళ్ళపల్లి వారు సమయానుకూలంగా పద్యాల్లో సంభాషణలు కల్పించారు.

## 2.5. తారాదేవి కావ్యంలో భాషాశైలి

భాషాపరంగా కావ్యాన్ని పరిశీలిస్తే! కవి సరళ గ్రాంథికంలోనే ముందుకు నడిపించారు. కథాకథనం సంభాషణ శైలి ఆకట్టుకొనేలా నిర్మితమైంది. కావ్య ప్రారంభంలో ఉన్న పద్యాన్ని చూస్తే భాషా సౌందర్యం బోధపడుతుంది.

చ. ***అదియదె! సూకరంబు గనులెల్లదె! వెల్పడె నీనికుంజనుల***
***ది దెపరునెత్తె! యింతటనె యిక్కడ నెక్కడనో యడంగెరా!***
***యది బెదరింపరా! కటు తరార్పటులన్ మరిలేని పారెరా!***
***యిదె! పురికొల్పు దుక్కల వరె! విడుతూ! తడవేల? బాణముల్***

(తారాదేవి: 1, పుట: 1)

అనే పద్యంలో ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసే దృష్టితో ప్రారంభించారు. ఇలా మొత్తం పద్యాలే కాకుండా అక్కడక్కడ వచనంలో కూడా విషయాన్ని చెప్పే ప్రయత్నం చేశారు. ఉదాహరణకు వచనంలోని మాటలు చూడండి.

వ. ***అప్పుడు హర సంహుఁడతని యెంతయు వినయమ్మున "మిమ్మొకటి యడుగఁదలఁచితిఁ గరుణించి తెల్పవేడెద" నదియేమన*** (తారాదేవి : 116, పుట: 14)

పై వచనం చాలా సరళమైన పదాలతో అర్థవంతంగా నిర్మితమైంది. ఈ విధంగా శర్మగారు భాషశైలి ఆకట్టుకొనేలా ఉందనటం సముచితం.

రాళ్ళపల్లివారు ఈ కావ్యంలో భాషకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారని చెప్పవచ్చు. ఎందుకంటే కావ్యంలో కథా కథనం చాలా విస్తృతమైనది. దీన్ని రాసినప్పుడు రాళ్ళపల్లివారు వయసు పద్దెనిమిదేళ్లు. అప్పటికి కావ్యంలో వాడిన పలుకుబడులు, సామెతలు, జాతీయాలను పరిశీలిస్తే ఆభాషా వైశిష్ట్యం మరింత తెలుస్తుంది.

ఈ కావ్యంలో కవి అడుగడుగునా జన వ్యవహారంలో ఉన్న తెలుగు పలుకుబడులు, సామెతలు నుడికారాలను, జాతీయాలను సందర్భానుసారంగా వాడారు. అప్పటికి వాడుకలో

ఉన్నవాటిని కొంచం మార్పులు చేస్తూ వినియోగించారు. ఉదాహరణకు శర్మగారు ప్రయోగించిన సామెతల్ని చూడండి.

1. తాను ద్రవ్విన గోతిలో దానెబడిన (97 పద్యం)
2. కోరి కొరివితోఁదలఁగోకి కొనుట జెల్లునె? (100 పద్యం)
3. సిరిరా మోకాలొడ్డెడు (142వ పద్యం)
4. శాలీ చేతి గండఁబు గడచే (143 వ పద్యం)
5. ఆవులిస్తే పేగులు లెక్క పెట్టుటా (83వ పద్యం)

ఉదాహరణకు ***'తాను ద్రవ్విన గోతిలో దానెబడిన'*** సామెతను శర్మగారు కావ్యంలో మేవారు రాజ్య పరిపాలకుడైన హరసింగు విషయంలో ఉపయోగించారు. అదిఎట్లంటే!

- కావ్యంలో అడవి పంది జొన్న చేనులోకి ప్రవేశిస్తుంది. అప్పుడు రాజు తన భటులకు ఆ పందిని ఎలాగైనా బయటికి రప్పించండని ఆదేశిస్తాడు. కాని ఆ భటులు ఎవరూ ధైర్యంతో ముందుకు రారు. పైగా అక్కడికి వచ్చిన తారాదేవి అనే యువతి ఆ పందిని నేను బయటికి పంపిస్తా అంటుంది. దాంతో రాజుకు అవమానం జరిగినట్లైయింది. అందుకే కవి 'తాను ద్రవ్విన గోతిలో దానెబడినట్లైం'దనే సామెతను ప్రయోగించాడు.
- **'ఆవులిస్తే పేగులు లెక్కపెట్టుటా'** అనే సామెత కావ్యంలో హరసింగు 'తారాదేవి' లోగల ధైర్యం, ఉత్సాహం, చొరవ లాంటి గుణాల్ని గమనించి 'ఆవులిస్తే పేగులు లెక్కపెట్టేలా ఉందని భావిస్తాడు. దాన్ని పురస్కరించుకొని కవి ప్రయోగం ఉంది.

రాళ్ళపల్లివారు పలుకుబడులను ఔచిత్యంతో కావ్యానికి అనుగుణంగా తీర్చిదిద్దారు. వాటిని కూడా చూడండి.

1. 'దక్కితిర! దేవుడా' యంచు (4 పద్యం)
2. మికమికఁ కన్నులు విడుచుచు (31 పద్యం)
3. పూస గుచ్చినట్లు.....(136 పద్యం)
4. అచట మీరేమి యాడిన నదియె సాగె (146 పద్యం)
5. పోయి వత్తునటులు (అలాపోయొస్తా) (149 పద్యం)

- ఉదాహరణకు **'దక్కితిరా! దేవుడా'** అనే పలుకుబడిని రాజ్యంలోకి ప్రవేశించిన అడవి పందిని రాజభటులు వెంబడించినప్పుడు ఆ పంది ఎన్నో వ్యయ ప్రయాసాలు పడి చివరికి ఓ జొన్న చేనులోకి వెళుతుంది. అప్పుడు పందికి ప్రాణం దక్కినట్లైయింది. ఆ సందర్భంలో కవి 'దక్కితిరా! దేవుడా' అనే పలుకుబడిని ప్రయోగించారు.
- **'పూసగుచ్చినట్లు'** అనే పదబంధం కథానాయకుడు హరసింగు విషయంలో ప్రయోగింపబడింది. హరసింగు తారాదేవి అందచందాల్ని, ధైర్య సాహసాల్ని గమనించిన తరువాత ఆమెను ఎలాగైనా పెళ్ళి చేసుకోవాలని భావించాడు.

అందుకోసం ఈ విషయాన్ని తారాదేవి తండ్రికి తెలిపే పరిస్థితి వస్తుంది. ఆ సందర్భంలో కవి 'పూసగుచ్చినట్లు' అనే పదబంధాన్ని ఉపయోగించాడు.

ఇలా కావ్యాన్ని శర్మగారు భాష విషయంలో చాలా ఆహ్లాదంగానూ, ఉత్కంఠంగానూ నడిపించారని చెప్పవచ్చు.

## 2.6. తారాదేవి కావ్య రచనా వైశిష్ట్యం

అనంతకృష్ణశర్మగారు ఈ కావ్యంలో అద్భుతమైన రచనా వైశిష్ట్యాన్ని కనబరిచారు. ప్రధానంగా రచనా వైశిష్ట్యం తెలుసుకోవాలంటే వర్ణనలు, అలంకారాలు, ఛందస్సు, రసపోషణ ఇతరేతర అంశాలను పరిశీలిద్దాం.

### 2.6.1. తారాదేవి కావ్యంలో వర్ణనలు

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ 'తారాదేవి' ఖండకావ్యంలో కథాకథన శైలికి ఇచ్చినంత ప్రాముఖ్యం వర్ణనలకు ఇవ్వలేదని చెప్పవచ్చు. కానీ అక్కడక్కడ కొన్ని వర్ణనలు ఎంతో ఆసక్తిని కనబరుస్తాయి. తప్పించుకుని పోయిన పందిని చంపడానికి చాలా మంది భటులు జొన్న చేను దగ్గర నానా అవస్థలు పడుతున్న సందర్భంలో అక్కడికి వచ్చిన పల్లెపడుచు తారాను చూచిన రాజు ఆమె అందాన్ని ఎంతో గొప్పగా వర్ణించాడు. సాధారణంగా కావ్యంలో కథాకథనానికే కవి ఎక్కువ ప్రాధాన్య మిచ్చినప్పటికీ ఈ కింది పద్యంలో వర్ణన అద్భుతంగా ఉంది.

సీ. *హిమబిందు సంసక్త కమలంబునుంబోలెఁ*
*జిఱు చెమ్మటన్ మోము జినుగువార*
*నల్లనల్లన వీచు చల్లని లేగాలి*
*నెటి కురుల్ బెదరుచు నీటుగుల్క*
*నుండియు లేనియట్లుండి ముద్దులఁగుల్కు*
*చిఱునవ్వులన్ మోవి చివురులెత్త*
*మొగిలులో గ్రొమ్మించుఁబోలె మాసిన చీర*
*బంగారు నెమ్మేను రంగుమీరఁ*

తే. *పల్లె వాండ్రకుఁదగిన యాభరణములనుఁ*
*దన తనూకాంతి గ్రొత్తరంగును ఘటింపఁ*
*దను సహిత ధైర్య లక్ష్మియో యనఁగ నప్పు*
*డచ్చెలువ వీరిఁజేరఁగ వచ్చి నిలచె"* (తారాదేవి :15. పుట: 2)

తారాదేవిని తొలిసారిగా పరిచయం చేస్తూ రాసిన పద్యం ఎంతో మనోజ్ఞంగా ఉంది. ఇందులో కవి వర్ణించిన తీరు చాలా బాగుంది. తారాదేవిని మంచు బిందువులు పడిన కమలాల్లాగా చిన్న ముఖ కాంతులతో, ఆ చల్లని గాలిలో వంకర కలిగిన వెంట్రుకలతో, భయపడుతూ వస్తూ వున్నప్పుడు ఆమెను చూస్తే ఎంతో ముద్దుగా అనిపిస్తుందని చెప్పాడు. అలాగే ఆమె పెదాలు చిరు నవ్వులు చిందిస్తూ ఉన్నాయని, మాసిన చీర కట్టుకున్న బంగారు

చీరలా ఉందని అన్నారు. ఈమె ధరించిన ఆభరణాలు చూస్తే అచ్చం పల్లెటూరు ఆడపిల్లేనని భావించవచ్చునన్నారు. ఈ సమయంలో ఆమెను చూస్తుంటే సాహస లక్ష్మిలా ఉందని భద్రసింగు అనుకోవడాన్ని కవి గుర్తుచేశాడు. ఈ విధంగా రాజు భద్రసింగుకు తారాదేవి కనింపిచిన విధానాన్ని పై పద్యం తెలుపుతుంది.

కావ్యంలో శర్మగారు తారాదేవిని వర్ణించిన విధానాన్ని పరిశీలించిన తంగిరాల సుబ్బారావు *తెలుగు పలుకుబడుల కాణాచి తారాదేవి'* అనే వ్యాసంలో ఇలా అన్నారు.*"18 ఏళ్లయినా నిండని యువకుడు ఇంత చక్కని పద్యం రాశాడంటే ఆ రోజుల్లో విద్య స్థాయి ఎలా వుండేదో ఊహించవచ్చు."* [16] దీన్ని పరిశీలిస్తే ఆ రోజుల్లో రాళ్ళపల్లివారు ఎంత విలక్షణంగా ఆలోచించేవారో అర్థం చేసుకోవచ్చు.

మరికొన్ని పద్యాల్లో ఆ వర్ణనలు స్వల్ప స్థాయిలో ఉన్నాయి. రాజు పందిని చూచినప్పుడు దాని శక్తి యుక్తుల గురించి తన మనసులో ఎలా భావించాదన్న దాన్ని ఈ పద్యంలో వర్ణింపబడింది.

ఉ. ***పుడమితలంబుఁ జీల్చుకొని భూరితరంబుగ నొక్కె చోటనే***
***పడగల విప్పి వెల్వడిన పాములపిండునుఁ బోలె చోటనే***
***విడిచినదంటులక్ జొఱఁగ భీకరమై తగునిట్టి చేనిలోఁ***
***బడి చను టెట్టులో ? చనినఁబందినిఁ ద్రిప్పుటయెట్లొ? దైవమా ?***

(తారాదేవి: 9, పుట: 2)

'భూమి లోపల ఉన్న బంగారు పైకి పెల్లుబుకినట్లు, ఒక చోట పడగ విప్పిన పాములా దేన్ని లెక్క పెట్టక పంది భయంకరంగా పొలంలోకి దూసుకెళ్ళింది. దాన్ని ఏ విధంగా బయటికి రప్పించాలి దైవమా అంటూ ఆ పందికున్న శక్తి సామర్థ్యాలను కవి ఎంతో పటిష్ఠంగా ఉత్ప్రేక్షాలంకారంలో వర్ణించాడు.

మరో పద్యంలో కవి హరసింగు తారాదేవిని వివాహమాడాలని చిత్తోడుకు వెళ్లే సందర్భంలో అక్కడ ప్రకృతిని వర్ణించిన విధానం ఎంత సౌందర్యంగా ఉందో చూడండి.

ఉ. ***అమ్మహి సంజప్రొద్దునఁ బ్రయాణము సేయంచు నుండువారలన్***
***సమ్మదమందఁజేసే సరసంబుగ నప్పుడె నవ్వు పూవ్వులన్***
***గమ్మని తావులెల్లెడలడల మమ్మనఁ గ్రమ్మెడు పూవుదీనె యీ***
***రమ్ములతోఁడ మెల్లన సరాసరి మంతి నమాదు గాడుపున్***

(తారాదేవి : 77, పుట: 9)

సాయంకాలపు వేళలో రాజుతో పాటు భటులు ప్రయాణం చేస్తూ, దారికిరువైపుల చెట్లకు పూసిన పువ్వులనూ, ఆ చుట్టూ పక్కల అందమైన ప్రదేశాలను చూసి సంతోషానికి లోనయ్యారు. ప్రయాణికులందరూ అక్కడ వీచే గాలిలో విహరిస్తూ, చిరునవ్వులు చిందిస్తూ

[16] అనంతరాగం. పుట. 167.

ముందుకు సాగారు. ఈ విధంగా ఈ కావ్యంలో కొంత వరకు ప్రకృతి వర్ణన కనిపిస్తుంది. శర్మగారు ఈ కావ్యంలో వర్ణనల కంటే కథాకథనానికే ప్రాధాన్యం ఇచ్చారని తెలుస్తుంది.

### 2.6.2. తారాదేవి కావ్యంలో అలంకారాలు

కావ్యంలో అలంకారాలు చాలా ఔచిత్యంతో ప్రయోగించారు. ఇవి కథాకథనంలో బాగా ఇమిడి పోయాయి. ప్రధానంగా ఉపమా, స్వభావోక్తి అలంకారాలు అక్కడక్కడ కనిపిస్తాయి. ఉదాహరణకు కొన్నిటిని పరిశీలిద్దాం.

#### 2.6.2.1. ఉపమాలంకారం

**లక్షణం** : *''ఉపమాయత్ర సాదృశ్య లక్ష్మీరుల్లసతి ద్వయో''*[17]

సాధారణంగా అర్థాలంకారాల్లో ఉపమాలంకారం ప్రధానమైంది. ఇందులో 'పోలిక' ప్రముఖ పాత్ర వహిస్తుంది.

తారాదేవి అందానికి ముగ్ధుడైన రాజు ఆమెను ఎలా పోల్చుకొన్నాడన్నదాన్ని కవి ఉపమాలంకారంలో నిక్షిప్తం చేసిన విధానానికి నిదర్శనమే ఈ పద్యం.

*సీ.* ***ఒడలిపై నిగనిగ లొలికెడి రతనంపు***
***నగలెల్లఁ దోడిగి కొనంగవచ్చుఁ***
***జుంగులొప్పగఁ దీర్చి రంగుగ సరిగంచు***
***పట్టుమేల్చీరెలఁ గట్టవచ్చుఁ***
***దిద్దినదానినే దిద్దులుఁ బవలెల్ల***
***సొగసుల ™జేయుచు సొక్కవచ్చు***
***నొక పనియైనఁ జేయక లీవి నెప్పుడుఁ***
***గుల్కు లెన్ని యా నైనఁ గుల్కవచ్చుఁ***
*తే.* ***"గాని యంతఃపురంబుల కాంతలన్న,***
***నేమి? దీనికిఁ దుంయన్న నేమి? వార***
***అందఋను దీనికొక గోటికైనఁ దుదకు,***
***సరియె? తలకించు దపమును నలుననైన*** (తారాదేవి : 62, పుట: 8)

తారాదేవిలో ఉండే సహజమైన అందాన్ని, ధైర్యాన్ని ఆయా గుణగణాల్ని గమనించిన రాజు ఎన్నో ఉపమానాలతో పోల్చడం ఆకట్టుకునేలా ఉంది. ఇందులో పోలిక ఎంతో సహజ సిద్ధంగా, మనోహరంగా ఉంది. సమాజంలో కొందరు స్త్రీలు ధనమానాలతో, అందచందాలతో కులుకుతుంటారు. కాని తారాదేవి అణిమణిగి సాధారణంగా ఉండే స్త్రీలు ఎంతో మంది ఉండరని హరసింగు భావించాడు. ఈ విషయాన్ని కవి చక్కని ఉపమానాలతో పోల్చి చెప్పడం ముదావహం.

[17] తెలుగు వ్యాకరణము. పుట. 440.

## 2.6.2.2. స్వభావోక్తి అలంకారం

**లక్షణం :** *"స్వభావోక్తిః స్వభావస్య జాత్యాది స్థస్య వర్ణనమ్"* [18]

జాతి, గుణ క్రియాదుల చేత దాని స్వభావాన్ని వర్ణిస్తే అది స్వభావోక్తి అలంకారం.

తారాదేవి రాజుగారి దగ్గరికి వెళ్లినప్పుడు, ఆమె అందాన్ని చూసినప్పుడు రాజులో కలిగిన ఆలోచనలకు రూపమే ఈ స్వభావోక్తి పద్యం.

చ. ***చెలువు నెలంతకుం బ్రకృతి సిద్ధముగా ఒనియింపకుండినన్***
***బలువగ లెన్నియైన నవి భారముమేనికిఁ గాక కాల్పనే?***
***అలిత మనోజ్ఞమా పరిమళంబు స్వభావముగాఁగఁ బూలకున్***
***గలుకయున్న వాని పయిఁ గస్తురి జిల్కిన నేమియయ్యెడున్ ?***

(తారాదేవి: 63, పుట: 8)

తారాదేవి అందాన్ని రాజు వివిధ ఉపమానాలతో పోల్చారు. అందం ఆమెకు సహజ సిద్ధంగా వచ్చిందని అనుకొన్నాడు. భారతమాత మెడలో ఉన్న నగలతో సమానంగా రాజు తారాదేవి అందాన్ని ఊహించుకొన్నాడు. ఆమె మనోహరమైన పలుకులు చూస్తే కస్తూరి చిలికినట్లు ఉంటుందని హరసింగు భావించాడు.

తారాదేవి అందాన్ని చూసిన రాజు ఎలా అనుకున్నాడో తెలిపే పద్యమిది.

ఆ. ***అటునమస్కరింప హరసింగు***
***గనుకొని, యిట్టిరూపమిట్టిదిట్టతనము***
***నిట్టివిని సుకుమారి! యిట్టి లావణ్యంబు,***
***బల్లెపడఁతి కెట్లు జెల్లె?ననుచు.*** (తారాదేవి: 65, పుట: 9)

తారాదేవి జొన్నచేనుకు చేరుకుని రాజు దగ్గరికి వెళుతుంది. అప్పుడు రాజు ఆమె అందాన్ని చూసి, స్వభావాన్ని తలచుకున్నాడు. ఈమెలోని అందం, బలం, లావణ్యం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయని భావించాడు.

ఈ విధంగా అక్కడక్కడ మిగతా పద్యాల్లో కూడా ఆయా అలంకారాలు చోటు చేసుకున్నాయి.

## 2.6.3. తారాదేవి కావ్యంలో ఛందస్సు

*'తారాదేవి'* ఛందోబద్ధ పద్య నిర్మాణంతో తీర్చిదిద్దబడిన కావ్యం. కాగా ఇది మొత్తం 195 పద్య, గద్యాలతో నిర్మితమైంది (175 పద్యాలు, 16 గద్యాలు మొత్తం 195) రాళ్ళపల్లివారు *'తారాదేవి'* ఖండకావ్యంలో జాతి, ఉపజాతి పద్యాలను సందర్భానుసారంగా ప్రయోగించి కావ్యాన్ని శోభాయమానం చేశారు. పద్య రచనల్లో ఛందస్సు గొప్ప శిల్పానికి దోహదం చేస్తుంది. ఈ దృష్టితో పలువురు పరిశోధకులు వెల్లడించిన అభిప్రాయాలు పరిశీలించడం సముచితం.

---

[18] తెలుగు వ్యాకరణము. పుట. 461.

పరిమి రామనరసింహం తమ గ్రంథంలో "కావ్యంలో కవి చెప్పదలుచుకున్న విషయాన్ని ఒకానొక ప్రయోజనాన్ని ఆశించి ఒక ప్రణాళికలో ఒదిగేలా నిర్వహిస్తాడు. దీన్ని మనం కథన శిల్పమనోనిర్మాణమని నిర్వచించవచ్చు."[19] అని పేర్కొన్నారు.

"గణ యతి, ప్రాసలు, వాక్య, పద, అక్షర నిర్మాణాలను భావ దీప్తి కెట్లు పోషకమవుతామో చెప్పటమే ఛందః శిల్పమని."[20] బి. మంగమ్మ నిర్వచించారు.

విశ్వనాథ సత్యనారాయణ శిల్పం గురించి చెబుతూ "శిల్ప మనగా చేయుటయని కాదు. సౌందర్యమా పద్య రచన యందు భాసించుట, పద్యమెత్తుగడ, దింపు గడ బాగుండుట ప్రాస, యతి స్థానముల యందు కొన్ని రమ్యములైన శబ్దములు ప్రయోగించి, పద్య మంతయు బాగుగ నున్నదనిపించుట, పద్యము ధార శుద్ధి కలిగియుండుట– ఇట్టివి పద్యమునకు సహజమైన సౌందర్యమును సంపాదించు లక్షణమని"[21] వివరించారు. ఈ విధంగా శర్మగారి పద్య రచనా శిల్పాన్ని పై లక్షణాలతో సమన్వయం చేయటం ద్వారా ఆయా అంశాలను అర్థం చేసుకోవచ్చు.

ఉత్పలమాల, చంపకమాల వృత్తాల్లో సుకుమార భావాలు, శృంగారాది మధుర రసాలు వెల్లడించవచ్చు. రౌద్రాది రసాలను శార్దూల వృత్తంలో పొదిగింపవచ్చు. ఇది పద్యకావ్య నిర్మాణంలో ఆనవాయితిగా ఉన్న నియమం. అయితే రాళ్ళపల్లి వారు ఈ కావ్యంలో ఉపయోగించిన ఛందస్సు రకాలను పరిశీలించడం వల్ల వారి ఔచిత్యం తెలుస్తుంది.

ච. ***అలజడి యింతలేక పవలంతయు నెచ్చటకైనఁ బోయి పి***
***ల్లలకని శాలికాండకములన్ గొన ముక్కులఁ గొంచు కారికా***
***దె లలిత పక్షులెంత యునుఁ దీరని నంత మొప్పఁ గూయుచున్***
***గలకలమంచుఁ జేరెఁ దమకంబునఁ గూండ్లకు గుంపుగుంపుగాన్***

(తారాదేవి: 79, పుట:9)

ప్రకృతిని పై చంపకమాల వృత్తంలో ఎంతో మనోహరంగా వర్ణించారు. ఏ మాత్రం అలజడి లేకుండా పక్షులు పగలంతా ఎక్కడెక్కడో తిరుగుతుంటాయి. తమ పిల్లలకోసం ఆహారాన్ని వాటి కొన ముక్కలతో పట్టుకొచ్చి పెడుతుంటాయి. పిల్లల ఆలనా, పాలనల్నీ తల్లులు ఎంతో ప్రేమగా రక్షించటం అనేది సహజ సిద్ధమైన ధర్మం. ప్రకృతి ధర్మంగా భావించే ఈ సన్నివేశాన్ని కవి కళ్లకు కట్టినట్లు వర్ణించటం గమనార్హం.

తారాదేవి తండ్రి భద్రసింగు హరసింగు దగ్గరికి వచ్చినప్పుడు భద్రసింగు ప్రవర్తనను శర్మగారు శార్దూల పద్యంలో ఎలా వర్ణించారో చూడండి.

శా. ***"ఔరా! యొంతటి గర్వమీతనికి నింతైనన్ భయంబంద కే***
***యీరీతిన్ వినయంబులే తగవౌనే? కూరుచుండగ మీ***

[19] ఆంధ్ర మహాభారతం శైలీ పరిశీలనం. పుట. 81.

[20] తిక్కన నాటకీయ శిల్పము. పుట. 54.

[21] జ్ఞానానంద కవి అమ్రపాలి పరిశీలన. పుట. 74.

*వారాధీశుని ప్రక్కలోన" ననుచున్ వారందఱత్యంతకో*
*పారక్తేక్షణులయ్యు నప్డు హరసింహాన్యంబు నీక్షించుచున్*

(తారాదేవి: 114, పుట:13)

భద్రసింగు ప్రవర్తనను చూసిన హరసింగు తన మనసులో భద్రసింగు గురించి వీడికి ఎంత గర్వం. ఇంతైనా భయం లేదు, వినయం అంతకంటే లేదు. ఇతని ప్రవర్తనను చూసి భటులు కోపగ్రస్తులయ్యారు. తర్వాత హరసింగు దాన్ని చూసి సంతోషించాడు.

ఈ విధంగా రాళ్ళపల్లి వారు గొప్ప ఛందః శిల్పంతో కావ్యాన్ని తీర్చిదిద్దడం జరిగింది.

## 2.6.4. తారాదేవి కావ్యంలో రసపోషణ

అన్ని కావ్యాల్లోలాగానే తారాదేవి కావ్యంలో కూడా రసం ప్రధాన పాత్ర పోషించింది. ఇందులో వీరం అంగిరసంగా ఉంటే శృంగారం అంగరసంగా ఉంది. కావ్యంలో పందిని వెంబడించిన తారాదేవి ధైర్యం వీరం, ఉత్సాహానికి ప్రతీకగా ఉంది. *"వీరరస ముత్తమనాయకము. దీనికి స్థాయి భావముత్సాహము."* [22] అని రామరాజభూషణుడు పేర్కొన్నాడు. ఈ కావ్యంలో ప్రధాన రసాలను పరిశీలించడం వల్ల ఆయా అంశాలు స్పష్టంగా బోధపడుతాయి.

చ. *ఖర తర విగ్రహోద్ధుర విఘర్షణ దంటులు వ్రాలిపోవనా*
*ఘురఘుర రాస భీతినిఁ గకానికఁ బిట్టలు పారిపోవ భీ*
*కరగతిఁ బందివచ్చె "భళి? కామిని శౌర్య" ఎటంచు వీరులా*
*దరమునఁ జూచుచుండ వనితామణి వెన్క న దానిఁదోలఁగన్*

(తారాదేవి: 32, పుట: 4)

రాజుగారి భటుల వద్ద నుండి తప్పించుకున్న పంది వేగంగా ఆ జొన్నదంటుల మధ్య ప్రవేశిస్తుంది. ఈ సన్నివేశం ఎంతో ఉత్కంఠ భరితంగా ఉంటుంది. పంది వెళ్లే వేగానికి ఆ పొలంలో ఉండే పిట్టలు భయపడి ఎగిరిపోతున్నాయి. అలాంటి సందర్భంలో తారాదేవి జొన్నచేనులోకి ధైర్యంగా వెళ్లడం ఆమె వీరత్వానికి గుర్తు. ఆ సమయంలో అక్కడున్న భటులు ఆమె పరాక్రమాన్ని చూసి నిశ్చేష్ఠులౌతారు. ఈ విధంగా ఈ కావ్యంలో వీర రసం ఉత్సాహంగా వర్ణింపబడింది.

కావ్యంలో అంగిరసానికి అంగరసం కూడా ఎంతో సంయమానంతో పొదిగింపబడింది. ఉదాహరణకు

తే. *ఎన్ని మారులు కంటియ య్యింతి! నొక్క,*
*తియ్య మాటైనఁ బల్కమైతిమి తలంప*
*నిప్పుడునుఁ గూడ నూరికి నిట్లె చనిన,*
*చనలఁ గనుగొని యకట! యేమనరు జనులు?* (తారాదేవి : 68, పుట: 8)

[22] కావ్యాలంకార సంగ్రహం. పుట. 438.

తారాదేవిని ఎన్నో సార్లు చూడాలనిపిస్తుంది. దగ్గరున్నంత సేపు చాలా మాట్లాడాలనుకున్నాం. ఈ క్షణం కూడా ఆమె వెళ్ళిన దారిని కనుక్కోవాలనిపిస్తుందని రాజు అనుకుంటాడు. కాని అక్కడ ప్రజలు ఏమనుకుంటారోననే సంకోచం కూడా ఉంటుంది. ఇక్కడ తారాదేవి అందం హరసింగును ఎంతగానో ఆకర్షించిన క్రమం కనబడుతుంది. ఇందులో సున్నితమైన శృంగార భావన ఉంది.

ఇలా కావ్యంలో అంగి రసమైన వీరానికి మిగతా రసాలు అంగ రసాలుగా తోడ్పడ్డాయి.

## 2.6.5. తారాదేవి కావ్యంలో సామాజికాంశాలు

శర్మగారు 'తారాదేవి' కావ్యాన్ని గొప్ప సామాజిక నేపథ్యంతో రాశారు. స్త్రీ ఔన్నత్యాన్ని చాటి చెప్పే క్రమంలో ఇది ప్రముఖంగా నిలిచే కావ్యం. ఎందుకంటే 1911 కంటే ముందు వచ్చిన ఖండ కావ్యాలను గమనిస్తే, స్త్రీ ని త్యాగ మూర్తిగా చూపించడం జరిగింది. పైగా మహిళ సమాజ ఉద్ధరణకు తన ప్రాణాల్ని సైతం ఫణంగా పెట్టేలా తీర్చిదిద్దిన సందర్భం కనబడుతుంది. కట్టమంచివారి '*ముసలమ్మ మరణము*' ఈ విషయాన్నే తేటతెల్లం చేసింది. కాగా అణిచివేతకు చిహ్నంగా అంటే, దురాచారాలను నిర్మూలించాలనే సంస్కరణ భావంతో గురజాడ వారి పూర్ణమ్మ మరణించింది. ఈ విధంగా ఈ కావ్యాలు నాయికా ప్రధానాలుగా ఆనాడు విరివిగా వచ్చాయి. ఇక్కడ రాళ్ళపల్లివారి 'తారాదేవి' కూడా నాయిక ప్రధానంగా ఉన్న కావ్యం. ఇందులో పురుష పాత్రలు ఉన్న స్త్రీల చుట్టే కథంతా ఉంటుంది. ఇందులో రాజులు సైతం స్త్రీ ఉద్ధరణకు పాటుపడ్డారు. దీన్ని బట్టి ఆలోచిస్తే అప్పట్లోనే స్త్రీ స్వేచ్ఛను కాంక్షించిన కవిగా రాళ్ళపల్లివారు కనబడతారు. అంతేకాకుండా ఈ కావ్యంలో భద్రసింగు తన భార్య మాట విని 'తారా' ను హరసింగుతో వివాహానికి ఒప్పుకోవటం జరిగింది. దీన్ని బట్టి చూస్తే భర్తలు భార్యల మాటకు ఎంత గౌరవం ఇచ్చారన్నది తెలుస్తుంది. ఇలా మహిళల ధైర్య సాహసాలకు ప్రతీకగా ఈ తారాదేవి ఖండకావ్యం నిలుస్తుంది. దీన్ని బట్టి శర్మగారి సామాజిక దృక్పథం సమ సమాజానికి ఉపయోగ పడే ఆలోచనగా భావించవచ్చు.

## 2.7. మిరాబాయి ఖండకావ్యం : విశ్లేషణాత్మక పరిశీలన

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ రాసిన ఖండకావ్యాల్లో రెండవది మిరాబాయి. చరిత్రలో మోదాంతమైన మీరాబాయి కథను శర్మగారు విషాదాంతంగా మార్చి గొప్ప కావ్యంగా తీర్చిదిద్దారు. ఖండకావ్యాలు వెలువడుతున్న తొలిరోజుల్లో వచ్చిన కావ్యాల్లో 'మిరాబాయి' కూడా ఒకటని చెప్పవచ్చు. మామూలుగా చరిత్రలో 'మీరాబాయి' అని ఉంటే రాళ్ళపల్లి వారు మాత్రం 'మిరాబాయి' అని రాశారు. దీని కారణాలు ఎక్కడా పేర్కొనలేదు.

## 2.7.1. మిరాబాయి కావ్య స్వరూపం

శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ 1912లో మైసూరు పరకాల మఠంలో ఉన్న రోజుల్లో '*మిరాబాయి*' అనే ఖండకావ్యం రాశారు. ఇది 1913లో రాజమహేంద్రవరం నుండి వెలువడే '*మానవసేవ*' మాస పత్రికలో ప్రచురింపబడింది. ఇరవై ఐదు పుటలు గల ఈ

కావ్యంలో 178 గద్య పద్యాలున్నాయి. (గద్యాలు- 12, పద్యాలు- 166). ఈ కావ్యానికి రాళ్ళపల్లి వారే పీఠిక రాసుకున్నారు. ఈ కావ్యాన్ని శ్రీకృష్ణుడికి అంకితం ఇచ్చారు.

శర్మగారు కావ్య పీఠికలో ఈ కథని చిలకమర్తి లక్ష్మీనరసింహం ఆంగ్లం నుండి (Tod's annals of rajasthan) అనువదించిన *'రాజస్థాన కథావళి'* నుండి తీసుకున్నానని గుర్తుచేశారు. ఈయన మోదాంతంగా ఉన్న ఈ కథను విషాదాంతం చేసి తెలుగు సాహిత్యానికి అందించారు.

అనంతకృష్ణశర్మ ఈ కావ్యాన్ని భారతదేశ రాజధాని నగరమైన ఢిల్లీ వర్ణనతో ప్రారంభించారు. చిత్తూరు నగర వైభవాన్ని చాలా గొప్పగా ఆవిష్కరింపచేశారు. కావ్యానికి సంప్రదాయబద్ధంగా భక్తితో కూడిన కరుణ రసాన్ని ఆపాదించి హృదయానికి హత్తుకొనేలా చేశారు. శ్రీకృష్ణ భగవానుడిని వర్ణించిన ఖండకావ్యంగా దీన్ని పేర్కొనవచ్చు. కావ్యంలో సున్నితమైన హాస్యం పాఠకుల్ని పులకింపజేస్తుంది. ఛందస్సు, అలంకారాలు కావ్యానికి శోభను చేకూర్చేలా ఉన్నాయి. సందర్భానుగుణంగా అక్కడక్కడ ఉన్న సంభాషణలు కావ్యాన్ని ఆద్యంతం చదివింపజేస్తాయి. ఇలా ప్రత్యేకంగా శర్మగారు మిరాబాయి కావ్యాన్ని రాయటానికి చాలా జాగ్రత్తలు పాటించారని చెప్పవచ్చు.

## 2.7.2. చరిత్రలో మీరాబాయి

చరిత్రలో మీరాబాయి ఒక రాజపుత్ర యువరాణి. ఈమె అసలు పేరు 'మిహిరాబాయి' అంటే సూర్య ముఖి అని అర్థం. ఈ పేరు లోక వ్యవహారంలో 'మీరాబాయి'గా మారి ఉండవచ్చు. మీరాబాయి క్రీ.శ 1503- 1573లో రాజస్థాన్ లో వెలుగొందిన దివ్య జ్యోతి. ఈమె తండ్రి రతన్ సింగ్ రాథోడ్. తల్లిదండ్రుల ప్రభావంతో చిన్నప్పటినుండి ఈమెలో శ్రీ కృష్ణ భగవానుడి భక్తి బీజాలు పడ్డాయి. దానితో ఆమె తన మనసు నిండా కృష్ణుడినే తన దివ్య స్వరూపంగా నిలుపుకొంది. చిన్నతనంలో ఒక సాధువు ఇచ్చిన కృష్ణని విగ్రహాన్ని మిరాబాయి ఆరాధిస్తుండేది. యుక్త వయసు రాగానే చిత్తోడు ప్రభువైన మహారాణా సంగ్రామ సింహుడి పెద్ద కుమారుడైన కుంభరాణాతో ఆమె వివాహమైంది. అత్తవారింటికి వెళ్తూ మీరా కృష్ణ విగ్రహాన్ని తనతో తీసుకెళ్ళి పూజించ సాగింది. ఈ పద్ధతి అత్తింటి వారికి నచ్చేదికాదు.

మిరాబాయి భర్త చనిపోయిన తర్వాత మరిది విక్రమ సింహుడు రాజైనాడు. ఆమె మీద అతడు కొన్ని ఆంక్షలు విధించాడు. ఒకనొక సందర్భంలో మీరాబాయి కీర్తి అక్బరు చక్రవర్తి చెవిని పడింది. అతడు భక్త శిరోమణియైన మీరాను దర్శించాలని కుతూహల పడ్డాడు. ఒక హిందూ రత్న వర్తకుడి వేషంలో చిత్తోడు వచ్చి మీరా దర్శనం చేసుకొంటాడు. ఈ విషయం విక్రమ సింహుడికి తెలుస్తుంది. తమ ఆగర్భ శత్రువైన అక్బర్ తమ నగరంలో ప్రవేశించటాన్ని విక్రమ సింహుడు అవమానంగా భావిస్తాడు. అక్బర్ తమనగరంలో ప్రవేశించడానికి మీరాబాయే కారణమని అనుమానించాడు. దానితో మీరాబాయిని చంపేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశాడు. కాని అవన్ని విఫలమైనాయి. చివరికి మీరాబాయిని విక్రమ సింహుడు

'యమునలో పడి చావు' అని కటువుగా పలికాడు. విరక్తయైన మీరా యమునా నదిలో దూకింది. శ్రీ కృష్ణుడి దయవల్ల ఆమె బతికి బయటపడింది. తర్వాత మీరాబాయి బృందావనంలో చేరి గిరిధర గోపాలుని సేవించి, కొంతకాలానికి ద్వారక చేరింది. అక్కడే అనేక మధుర భక్తి గీతాలు రచించింది. అలా భక్తి శ్రద్ధలతో కృష్ణుడిలోనే లీనమైంది. నేటికి ఆమె సమాధి ద్వారకాలో ఉన్నది.[23]

## 2.7.3. మిరాబాయి కావ్యేతివృత్తం

రాజస్థాన్ లోని ఓ రాజవంశంలో పుట్టిన దివ్య కన్య' మిరాబాయి'. ఈమె చిన్నప్పటినుండి శ్రీకృష్ణుడిని ఆరాధించేది. తల్లిదండ్రులు మిరాబాయికి యుక్త వయసుకు రాగానే వివాహం చేయాలని అనుకొన్నారు. దాంతో చిత్తోడు రాజవంశ రాణా సంగ్రామసింహ పెద్ద కుమారుడు కుంభరాణా(భోజ్ రాజ్)తో పెళ్లి చేస్తారు. పుట్టింటి నుండి మొగునింటికి వచ్చిన 'మిరాబాయి' వారితో ఇమడలేక పోతుంది. ఎందుకంటే ఈమె చిన్నప్పటి నుండి శ్రీ కృష్ణుడిని పూజించేది. కుంభరాణా కుటుంబంలో మాత్రం దుర్గాదేవిని ఆరాధించేవారు. దీనిమూలంగా మిరాబాయిని అనేక ఇబ్బందులకు గురౌతుంది. ఇక ఆమె వారిని ఇబ్బంది పెట్టకుండా విష్ణుమూర్తిని సేవిస్తుంటుంది. మిరాబాయి శ్రీ కృష్ణుడిని తన భర్తగా భావించేది. ఆ దేవుని పై భక్తి పాటలు రాసి వాటిని రాగయుక్తంగా నగర విధుల్లో పాడి ప్రజలందరిని మైమరిపించింది. దీనిమూలంగా అక్కడి ప్రజలు మిరాబయిపై ఆరాధనను పెంచుకొన్నారు. ఈ విషయాలన్ని రాజుగారికి తెలుస్తాయి.

ఇలా ఉండగా ఒక రోజు సత్రంలో భక్తులు 'మిరాబాయి' గురించి గొప్పగా కీర్తిస్తుంటారు. ఈమె వీణ గానానికి అక్కడి ప్రజలు మైమరిచేవారు. దీన్ని ఢిల్లీ పాదుషా వింటాడు. వెంటనే ఆమెను చూడడానికి కుతూహలంతో, గోసాయిలతో పాటు మారు వేషంలో చిత్తోడు రాజధానికి బయలుదేరతాడు. అలా ఆ నగరానికి వచ్చి 'మిరాబాయి'ని దర్శించుకొంటాడు. పైగా ముత్యాల హారాన్ని కృష్ణుడికి అర్పించమని చెప్పి మిరాబాయి కి ఇచ్చి పాదుషా తన రాజ్యం వెళతాడు. విషయం తెలుసుకున్న రాజుగారు ఆగ్రహాన్ని వ్యక్తంచేస్తాడు. తురుష్కుడు తన రాజ్యానికి వచ్చి 'మిరాబాయి' కి ముత్యాలహారాన్ని ఇవ్వడాన్ని జీర్ణించుకోలేకపోయాడు. అయితే చివరికి ఏదో విధంగా మీరాబాయి చంపాలని నిర్ణయించుకొంటాడు. రాజు (కుంభరాణా) తమ్ముడు అప్పటికి మంత్రి కాబట్టి అతన్ని పిలిచి 'మిరాబాయి' ని అడవులకు తీసుకొని పోయి చంపమని ఆజ్ఞాపిస్తాడు. రాజాజ్ఞ ప్రకారం మంత్రి తన కర్తవ్యాన్ని చేయడానికి 'మిరాబాయి' ఉండే కోటకు వెళ్లి, ఆమెను తీసుకొని అడవిలో వదిలి వెళ్లిపోతాడు. మిరాబాయి అడవిలో ఏకాంతంగా కూర్చొని బాగా ఆలోచించి ఆత్మహత్య చేసుకోవాలనుకొంటుంది. చివరికి మిరాబాయి కృష్ణుడిని ఆరాధిస్తూ యమునా నదిలో దూకి చనిపోతుంది.

[23] కోడూరు పుల్లారెడ్డి, అక్షరం చిలికిన వేళ (వ్యాస సంకలనం), పుటలు. 105-107.

## 2.7.4. మిరాబాయి కావ్యేతివృత్తంలో మార్పులు

చరిత్రలో ఉన్న మీరాబాయి కథని శర్మగారు రెండు మార్పులు చేసి ఈ ఖండకావ్యం రాశారు. ఆ మార్పుల్లో మొదటిది ; 'మిరాబాయి' యమునలో దూకటానికి కారణమైన వాడు ఆమె మరిదికాక ఆమె భర్తేనని చెప్పారు. పైగా కావ్యంలో విక్రమ సింహుడి పేరే లేదు. పెనిమిటికి పట్టిన అనుమానపు పెనుభూతానికి బలైపోయిన అబలలు ప్రాచ్య, పాశ్చాత్య వాఙ్మయాల్లో ఎందరో కనిపించటం పరిపాటి. రాళ్ళపల్లివారు మీరాబాయిని ఆ అభాగినులకు ప్రతినిధిగా నిలిపే ప్రయత్నం చేశారు.

**రెండోది ;** మీరాబాయి జీవితాన్ని నదీగర్భంలో మునిగిపోయ్యేలా అనుశ్రుతిగా వచ్చే కథను బట్టి ఆమె జీవిత కథను ముగించి వేసి దానిని విషాదాంత చేశారు. ఒక అన్యాయపు క్రూరత్వాన్ని హృదయ స్పర్శిగా తెలిపేందుకు నిరపరాధిని దుర్మరణం పాలు చేయటం పాశ్చాత్య సంప్రదాయం. కాబట్టి ఒక మహా భక్తురాలు జీవితాన్ని ఇతివృత్తంగా స్వీకరించారు. కాగా అలౌకిక భగవన్మహిమలను నిరూపించటానికీ వెనుదీశారు. ఇది కూడా పాత కొత్తల మేలుకలయిలా ఉంది. శర్మగారు కావ్యంలో ఢిల్లీ పాదుషా అని అన్నారు. కాని 'అక్బరు' అనలేదు. పాదుషా గోసాయి వేషంలో వస్తాడు. రత్న వ్యాపారి కంటే గోసాయికి ఆమె దర్శనావకాశం ఎక్కువ అనే ఉద్దేశంతో ఈ మార్పు చేసి ఉండవచ్చు. శర్మగారు సృష్టించిన పాత్రలలో మంత్రి పాత్ర చెప్పుకోదగినది. ఇతని పాత్ర వాల్మీకి 'రామాయణము' లో సీతా పరిత్యాగ ఘట్టంలోని లక్ష్మణుడికి సమానమైందిగా ఉంది. అరణ్యం మధ్యలో మీరాను వధించమని రాణా ఆజ్ఞ కాగా ఈ మంత్రి ఆమెను విడిచి వచ్చాడే గాని వధించలేదని చన్నాప్రగడ తిరుపతిరావు పేర్కొన్నారు.[24]

## 2.7.5. మిరాబాయి కావ్యంలో పాత్ర చిత్రణ

'మిరాబాయి' కావ్యంలో మీరాబాయి, కుంభరాణా (భోజ్ రాజ్), మంత్రి (మీరాబాయి మరిది) ఢిల్లీ పాదుషా పాత్రలు చెప్పుకోదగినవి. వాటిని చూద్దాం.

### 2.7.5.1. మిరాబాయి

మిరాబాయి శ్రీ కృష్ణుని భక్తురాలు. ఎల్లప్పుడూ ఈ గోపాలుని ధ్యానంలో లీనమై ఉంటుంది. తల్లిదండ్రులు చిన్నతనంలో మిరాబాయికి ఓ సాధువు దగ్గర కృష్ణుని విగ్రహాన్ని ఇప్పించారు. అప్పటి నుంచి మిరాబాయి శ్రీకృష్ణుణ్ణి ఆరాధిస్తూ కాలం గడుపుతుంది. ఆ ఆరాధనను కింది పద్యం ద్వారా కవి పరిచయం చేశాడు.

ఉ. *కోమలవల్లకీధ్వనులకున్ నునువన్నెలు వెట్టు నుస్వర*
*శ్రీ మహితంబుగా నితరచింత వీడి యపారభక్తి నా*

[24] 'మిరాబాయి' అనంతరాగం. పుట. 172.

*భామల మిన్న నిశ్చలతఁ బాడుచు నుండెడు సొంపు నయ్యె ! నే*
*నే మనువాఁడ! దానిఁ దరమే పొడిమాటల నింత యంతనన్ ?*

(మిరాబాయి: 16, పుట: 4)

మిరాబాయి సుమధుర గానం అందరినీ ఆకట్టుకొంది. వేరే వ్యాపకాలు అమిత ఆరాధన భావంతో మీరాబాయి శ్రీ కృష్ణుడి భక్తిలో లీనమైవుంటుంది. ఈమె భక్తి భావాల విషయంలో ఎవరిని ఖాతరు చేయదు. వీణ పట్టుకొని నగర వీధుల్లో విహరిస్తూ పాటలు పాడి ప్రజలను ఆనందానికి గురి చేస్తుంది. అలాంటి సందర్భాన్ని కవి ఈ పద్యం ద్వారా ఎలా పరిచయం చేశాడో చూడండి.

తే. *వీణఁ గొని దాసి యొకతె వెన్వెంట రాఁగఁ*
*బరిజనంబులు మును బరాబరులు నేయ,*
*మెల్లమెల్లన మానసం బుల్లసిల్ల*
*వచ్చి యచ్చోటునకు మిరాబాయి యపుడు.*

(మిరాబాయి: 63, పుట:11)

గుడిలో పూజలు ముగించుకొని వీణను తీసుకొని పుర విధుల్లోకి వచ్చి శ్రీ కృష్ణుడిపై పాటలు పాడేది. దాంతో ప్రజల్లో భక్తి భావాలు ఒక ప్రవాహంలా ప్రవర్తిల్లేవి. ఈ జీవితానికి శ్రీ కృష్ణుడినే భర్తగా భావించి తనువు చాలిస్తుంది.

మిరాబాయి రాజుగారు హింసలకు గురి చేస్తున్నారు. ఈ హింసల నుండి ఏనాడైనా విముక్తి అవుతానని ఆశపడ్డానో కానీ, నీకు నాపై ప్రేరణ కలగలేదు. కనీసం నీ పాదాల దగ్గరైనా కొంత చోటివ్వమని ప్రార్థిస్తుంది.

శా. *నీ కళ్యాణమయస్వరూపమును నే నిక్కంబు దర్శింపఁగా*
*నే కాలంబున కైనఁగల్గు నని యెంతే నాసమై నుంటి, నీ*
*కా కారుణ్యము లేకపోయె! నిఁక నాకా యిట్టులయ్యెన్, దుదన్*
*నాకున్ నీ చరణంబులందు నెడ మైనం గొంత యీఁజాలవో!*

(మిరాబాయి:158, పుట: 25)

ఇలా అనేక విషయాలను కృష్ణుడికే చెప్పి వాదులాడుతుంటుంది. పైగా అప్పుడప్పుడు పొగుడుతూ మనసు నిండా ఆ భగవంతుడిని తలస్తూ కీర్తిశేషురాలైంది మిరాబాయి.

మిరాబాయి ప్రతిభాపాటవాలను కవి ఎలా వర్ణించాడో ఈ పద్యాన్ని చదివితే తెలుస్తుంది.

ఉ. *ఆయత సద్గుణాళి శ్రవణామృతకోమల గానచాతురిన్*
*బాయనికృష్ణభక్తి సతిమంజులసత్కవిత్ దలంపఁగా*
*నాయవనీశుకన్నఁ బదియంతలు మిన్న యనం దగున్ 'మిరా*
*బాయి' యనంగ రాణి యగు భామిని సర్వసతీలలామయై.*

(మిరాబాయి: 13, పుట: 4)

శ్రీకృష్ణుడిని నీడగా భావించే భక్తురాలు మిరాబాయి. ఈమె కంఠం ఏంతో శ్రావ్యమైనది. చెవులకు ఇంపు కలిగిస్తుంది. ఇంత గొప్ప కవితా శక్తి కలిగిన మిరాబాయిని కవి గుర్తింపు పొందిన పండితులతో సమానంగా భావించాడు.మిరాబాయి స్వరూప, స్వభావాల్ని పురస్కరించుకుని కవి ఈమెను ఓ రాణిలాగా తలపింపజేశారని పై పద్య భావం.

మిరాబాయి రాజుకు భయపడ కుండా ఎంతో ధైర్యంతో ఉండేది. పైగా ఓర్పుతో భర్తపెట్టే చిత్రహింసలను భరించేది. ఇంతకు ముందు చెప్పుకొన్నట్లు 'మిరాబాయి' జీవితాన్ని కవి విషాదాంతంగా ముగించాడు. ముఖ్యంగా ముసలమ్మ, పూర్ణమ్మల్లాగానే మిరాబాయి జల సంద్రంలో దూకి ప్రాణాలను తీసుకొంటుంది. అనాదిగా పురుష జాతికి స్త్రీ జాతి సౌశీల్యం పట్ల గల అనుమానపు పెను భూతానికి బలియైన అభాగినిగా మిరాబాయి పాత్రను పరిచయం చేశాడు కవి.[25]

## 2.7.5.2. కుంభరాణా (మీరాబాయి భర్త)

చిత్తోడు రాజవంశానికి చెందిన రాణా సంగ్రామ సింహ పెద్ద కొడుకు ఈ కుంభరాణ. ఇతన్ని భోజ్ రాజ్ అని కూడా పిలుస్తారు. కావ్యంలో స్త్రీ పట్ల రాజు వ్యవహరించిన తీరును కవి ఈ పాత్ర ద్వారా చూపించాడు. ఆనాడు రాజులు భార్యల్నీ ఒక భోగ వస్తువుగానే భావించారని కావ్యం చదివితే అవగతమౌతుంది. పాదుషా ఢిల్లీ నుండి చిత్తోడ్ నగరానికి వచ్చి మీరాబాయిని దర్శించుకొంటాడు. ఓ ముత్యాల సరాన్ని కృష్ణుడికి అర్పించమని విన్నవించి వెళతాడు. ఈ విషయం తెలుసుకున్న రాజు తన గర్భ శత్రువు నా రాజ్యానికి రావడాన్ని జీర్ణించుకోలేక పోయాడు. దానితో మీరాను అనేక ఇబ్బందులకు గురిచేసి, చివరికి ఆత్మహత్య చేసుకొనేలా చేస్తాడు. మొదట మిరాబాయిని చూసి మనసు పడిన రాజు చివరికి క్రూరత్వానికి పాల్పడి ఈమెను కష్టాలకు గురిచేయడాన్ని కవి నిరసించాడు. ఈ పద్యంలో రాజుల దౌష్ట్యాన్ని కళ్లకు కట్టించాడు కవి.

**తే.** *"నమ్మఁజాల" నటంచును నమ్మకున్న*
*ఢిల్లియనునియొద్ద నుడిందది హార*
*మిది యకారణముగ దీని కెట్లు వచ్చె*
*ననుచు మది వెన్క ముందు నుయ్యాల లూఁగ"*

(మిరాబాయి: 106, పుట: 18)

మిరాబాయి రాజ్యంలో చేసే భక్తి కార్యక్రమాలు తెలుసుకుని భార్యని కూడా చూడకుండా చాలా దురుసుగా ప్రవర్తించడం కనబడుతుంది. మరో పద్యంలో కూడా ఇలా దురుసు తనాన్ని చూడవచ్చు.

[25] 'మిరాబాయి' అనంతరాగం. పుట. 170.

క. ***పుట్టలు మోసమునకుఁ దా***
***నెట్టుల నైనను జగంబు నే తలకిందం***
***బెట్టుదురు! మంకు బూదిం***
***గొట్టుదు రిఁక మగ లకండ్ల కుం గద వనితల్!*** (మిరాబాయి: 107, పుట: 18)

రాజులు దౌష్ట్యం స్త్రీల పట్ల ఏవిధంగా ఉంటుందో పై పద్యం చదివితే అర్థమైతుంది. ఈ విధంగా మిరాబాయిని ఢిల్లీ పాదుషా గోప్యంగా చూసిపోయిన విషయాన్ని తెలుసుకుని రాజు ఆగ్రహంతో మంత్రిని పిలిచిన సందర్భాన్ని కవి పద్యం ద్వారా తెలిపారు.

ఈ విధంగా కుంభరాణా పాత్రను కవి రాజుల నిరంకుశానికి ప్రతీకగా తీర్చిదిద్దారు.

## 2.7.5.3. ఢిల్లీ పాదుషా

*రాళ్ళపల్లి వారు ఈ పాత్రను చరిత్రలో ఢిల్లీ చక్రవర్తి అక్బరు అని కాకుండా ఢిల్లీ పాదుషా అని మాత్రమే అన్నాడు.*[26] ఇతను గోసాయి (భక్తుడు) వేషంలో 'మిరాబాయి' ని దర్శించడానికి వస్తాడు. ఇలా మారు వేషంలో వచ్చినట్లు చిత్రించడం వల్ల కావ్యాని శోభ కలిగింది. మిరాబాయి భక్తితో పాడే కీర్తనల్నీ విని జనంలో నుంచి ముందుకు వచ్చి ''తల్లీ! నీ దర్శనం భాగ్యం కలగడం చాల సంతోషమ''ని అంటాడు. తర్వాత ఆమె గాన మాధుర్యాన్ని ఎంతగానో పొగిడి ఓ పూల దండను ఇచ్చి, దీన్ని శ్రీ కృష్ణుడికి అర్పించమని చెప్పి వెళ్ళిపోతాడు.

భక్తులందరూ ఢిల్లీలో ఓ సత్రంలో కూర్చొని వారు చూసిన ప్రదేశాల గురించి, కొందరు రాజులు గురించి మాట్లాడుతుంటారు. ఆ సందర్భంలో ఓ భక్తుడు ఉత్సాహంగా లేచి తను చూసిన చిత్తోడు నగర వైవిధ్యాన్ని చెప్పాడు. అంతేకాకుండా మిరాబాయి అనే కృష్ణుడి భక్తురాలి గురించి వారికి తెలుపుతాడు. అది విన్నా ఢిల్లీ పాదుషా ఆమెను చూడాలనుకొంటాడు. వెంటనే ఆ భక్తుల వెంట మారువేషంలో వెళ్ళి, మిరాబాయి ని ఆమె పాడే మధుర గీతాలను విని తరించి పోతాడు. ప్రారంభంలో మీరాబాయిని ఢిల్లీ పాదుషా తన మనసులో తలచుకొన్న విధానాన్ని ఈ పద్యం ద్వారా కవి తెలిపారు.

ఉ. ***ఏనును నాసతీమణియహీనయయంబును వించు నెట్టు ల***
***మ్మానినిఁ జూడఁ గల్గుమఁ జుమా? యని కౌతుక మొప్ప నెంతయుం***
***బూనిక మైఁ ఆతోడునకుఁ బోయి సతిన్ గనులారఁ గంటి, నా***
***గానము వింటీ, ధన్యములు కన్నులు వీనులు నంటి నేటికిన్,***

(మిరాబాయి: 23, పుట: 5)

ఆమె గానాన్ని విని పరితపించి పోయిన ఢిల్లీ పాదుషా 'మిరాబాయి' చూడాలని తహతహలాడటం గమనించదగింది.

[26] 'మిరాబాయి' అనంతరాగం. పుట. 172.

### 2.7.5.4. మంత్రి (మిరాబాయి మరిది)

శర్మగారు సృష్టించిన పాత్రలలో చెప్పుకోదగింది మంత్రి పాత్ర. చరిత్రలో మిరాబాయి మరిది ఒక విధంగా ఉంటే, ఈ కావ్యంలో రాళ్ళపల్లివారు మరో విధంగా *"సీతా పరిత్యాగ ఘట్టంలో లక్ష్మణుడికి ప్రతికృతి. కాని అరణ్య మధ్యంలో మీరాను వధించమని రాణా ఆజ్ఞకాగా, ఈ మంత్రి ఆమెను వదిలి వచ్చాడే గాని వధించలేదు.*[27] అని చన్నాప్రగడ తిరుపతిరావు భావించారు.

కావ్యంలో హృదయ విధారకమైన ఘట్టంలో శర్మగారు మంచి పద్యాన్ని ఎలా వర్ణించారో తిలకించండి.

**_మ. ఇది యేనీతి పథంబు రాజునకు ? నొక్కింతేని యుం దప్పు లే_**
**_క దయా హీనత సాధుశీల యగు నీకాంతామణిం జంప గా_**
**_నది యెబ్బంగిఁ దలంచె నీ నృపతి? యేనా యిసనా ల్సేయ నేఁ_**
**_గుదు? నయ్యో! యవి వేక సేవ తలఁపన్ ఘోరంబు ముమ్మాటికిన్_**

(మిరాబాయి: 113, పుట: 19)

అన్నగారైన కుంభరాణ ఆదేశించిన మాటలను మీరాబాయి మరిది తు.చ తప్పకుండా అనుసరించాడు. ఎంత దారుణమైన నిర్ణయం తీసుకొన్నాడు కదా అని మరిది మీరాబాయితో పచ్చాత్తాపడుతాడు. ఈ విధానం వల్ల కావ్యం కొంచం రసవంతంగా తీర్చిదిద్దబడింది. ఈ పాత్ర కావ్యానికి మంచి ఆదరణను కలిగించిందనవచ్చు.

### 2.7.6. మిరాబాయి కావ్యంలో సంభాషణలు

'మిరాబాయి' ఖండకావ్యంలో సంభాషణలు ఆకట్టుకొనేలా ఉన్నాయి. కావ్య ప్రారంభంలో సంతోషంగా ఉన్న ఓ భక్తుడు (గోసాయి) తాను చూసిన ప్రదేశాల గురించి ఆనందంతో తన తోటి భక్తులతో చెప్పే సంభాషణను కింది పద్యంలో చూడవచ్చు.

**_ఉ. ఎన్నియొ పట్టణంబుల మహీస్థలిఁ గంటిని గాని, యందుఁ బే_**
**_రెన్నికఁగాంచి వైభవసమృద్ధులతోఁగడు రాజభూమికిన్_**
**_వన్నె గడించునొక్క పురం పర్యముఁ గంటి నయారె! మొన్న, మీ_**
**_రన్నగరంబు పేరు వినియైనను నుందురు చూడ కుండినన్._**

(మిరాబాయి: 10, పుట: 3)

లోకంలో అనేక పట్టణాల్ని చూశాను. కానీ వాటి అన్నింటిలోనూ ఎంతో వైభవంతో ప్రఖ్యాతి పొందిన ఒక పట్టణాన్ని చూశాను. మీరు వాటిని చూడక ఉండవచ్చునని ఆ నగర గొప్ప తనాన్ని ఊరించేలా చెప్తాడు. అప్పుడు ఆ నగరాన్ని ఎలాగైనా చూడాలని ఇతర భక్తులకు ఆసక్తి కలుగుతుంది.

---

[27] 'మిరాబాయి' అనంతరాగం. పుట. 172.

తండ్రులకు తండ్రివి కదా! మేమందరు నిన్నే నమ్ముకున్నాం. ఒక్కసారైనా పలకరించు, అలా ఊరికే వుండటం నీకు తగునా, ఓ యశోదమ్మ పుత్రుడా! అంటూ... శ్రీ కృష్ణుడితో మిరాబాయి సంభాషించు విధానం చూడండి.

ఉ. ***అయ్యల కెల్ల నయ్యవు గదా! యని నిన్నెద నమ్మియున్నన***
***న్ని య్యెడ నోక్క మా అయిన నే మయినా? వని పల్క రింప వే***
***మయ్య! పరాకు సేయఁ దగునా మది నింతగ? మాయశోధగ***
***నన్నయ్య! తలంప నీ కిది ఘనం బగు నయ్య ? కృపాపయోనిధీ!***

(మిరాబాయి:71, పుట: 13)

శ్రీ కృష్ణుని గొప్పతనాన్ని తన్మయత్వంతో కీర్తించిన పద్యమిది. పైగా అనంతకృష్ణశర్మగారి పద్య రచనకు గొప్ప తార్కాణంగా నిలిచే పద్యంగా భావించవచ్చు. శ్రీ కృష్ణుని గొప్పతనాన్ని మీరాబాయి ఆ కృష్ణుని కోసమై పరితపించే వారి హృదయావేదనను కవి తాదాత్మ్యంగా వర్ణించాడు. 'అయ్యలకెల్ల నయ్యవు గదా!' అనడం వల్ల ఈ సృష్టి అంతటికి కారకుడు శ్రీ కృష్ణుడే అని ఈయన భగవత్తత్త్వాన్ని ఎంతో ఔచిత్యమంతంగా వర్ణించాడు. 'యశోదర' పెంచిన కన్నయ్య అనడం ద్వారా నిత్యం శ్రీ కృష్ణునితో గడిపే మీరాబాయి తన్మయత్వం కూడా వ్యక్తమవుతుంది.

అలాగే, మీరాతో మరిది అడవులకు వెళ్లే సందర్భంలో సంభాషించిన క్రమాన్ని ఈ చిన్న పద్యం తెలుపుతుంది.

ఆ. ***"ఇట్టినట్టడవిని నీయమ నొంటిగ***
***నెట్టు లేను విడిచి యేఁగువాఁడ!***
***నెదుర నిలిచి దుఃఖ మెట్టు లీయబలకు***
***వృద్ధినేయువాఁడ నింక?" ననుచు*** (మిరాబాయి: 139, పుట: 23)

## 2.7.7. మిరాబాయి కావ్యంలో దేశకాల పరిస్థితులు

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ ఈ కావ్యంలో దేశకాల పరిస్థితులను చాకచక్యంతో పొందుపరిచారు. ఉత్తర భారతదేశంలోని ఢిల్లీని. రాజస్థానంలోని చిత్తోడు ను ఈ కావ్యంలో ముఖ్యమైన ప్రదేశాలు. ఢిల్లీ పాదుషా చిత్తోడుకు వచ్చి, అక్కడి ప్రదేశాలను, ప్రజలను చూసి ఆనందిస్తాడు. వివిధ దేశాల నుంచి మిరాబాయిని చూడ్డానికి వచ్చి, ఆమె మధుర భక్తికి ముగ్ధుడై ఏదో ఒక బహుమతి ఇచ్చి వెళ్లేవారు. సంగతిని వర్ణంచిన పద్యం.

ఉ. ***వత్తురు దేశ దేశముల వారు ముదంబున నామెగానమున్***
***మెత్తురు, పట్టువస్త్రములు మేలిమిసొమ్ము లుపాయనంబుగా***
***నెత్తురు బామినీమణికిఁ గృష్ణ పదాంబుజన భక్తికిన్***
***జిత్తమునందు విస్మయముఁ జెంది నుతింతురు మాటిమాటికిన్***

(మిరాబాయి: 21, పుట: 5)

అనేక దేశాలనుండి భక్తులు పెద్ద ఎత్తున వచ్చి మిరాబాయి ఆరాధన చేస్తారు. అంతేకాక ఆమె గానాన్ని ఇష్టపడి పట్టువస్త్రాలు, సొమ్ములు కానుకగా సమర్పిస్తారు. మీరాబాయికి ఉండే కృష్ణ భక్తిని ప్రజలు మాటిమాటికి తలుచుకుంటుంటారని కవి భావన.

కావ్యంలో సామాన్య ప్రజలూ, రాజులు గురించి ప్రధానంగా పేర్కొనబడింది. రాజులు స్త్రీలను ఒక భోగ వస్తువుగా చూచేవారిని తెలుస్తుంది. 'మిరాబాయి' ని ఒక అభాగినుల కన్యగా కవి చూపించారంటే, ఆనాడు రాజవంశాల్లో కూడా స్త్రీ లకు స్వేచ్ఛ ఉండేది కాదని చరిత్రలో మీరాబాయి కాల పరిస్థితుల్ని పరిశీలిస్తే అర్థమౌతుంది. మిరాబాయి భక్తికి సామాన్య జనం కూడా కదిలి పోవడం ఆశ్చర్యానికి గురిచేసే అంశం.

సైన్యమంతా ఢిల్లీనుండి చిత్తోడుకు మిట్ట మధ్యాహ్నం బయలుదేరుతారు. ఈ సమయంలో ఎండలు వీరికి చెమటలు పట్టిస్తాయి. వీరికి ఆ ప్రదేశంలో ఎదో కొంత ఆహారం దొరికుతుంది. దాన్ని అందరూ సమానంగా పంచుకుని తింటారు. అలా అక్కడక్కడ సేద తీరి ప్రయాణం చేసే సందర్భాన్ని గుర్తుచేసే పద్యం.

క. *ఎక్కడ రవి తల కెక్కిన*
*నక్కడ నిల్చుచును గూడి యాపల్లియలన్*
*జిక్కన భైక్షము నందఱు*
*వెక్కసముగ మెక్కి మరల వెడలుచు నంతన్* (మిరాబాయి: 39, పుట: 9)

పై పద్యాన్ని దేశకాల పరిస్థితులకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

అలా భక్తులు ప్రయాణం చేస్తున్నప్పుడు మధ్యలో ఓ కుమ్మరి వాడు కుండలు చేస్తు కనిపిస్తాడు. ఆ పని గొప్పతనాన్ని చూసి వారు ఆశ్చర్యానికి లోనైతారు ఈ సన్నివేశాన్ని కవి ఉత్పలమాల పద్యంలో చక్కగా పొదిగింపజేశారు. .

ఉ. *నిక్కపుఁదిమ్మరీడుఁ బలె నేర్చునఁ దాను దురుష్కుఁ డయ్యూ, వా*
*రెక్కడ నెప్పు దేపనుల నెట్లొనరించెద రట్లు నేసి యా*
*టక్క రిచక్రవర్తి కపటంబున వారలఁ గన్ను బ్రాముచున్*
*మ్రొక్కలు గాంచె నౌర! దొరబుద్ధులు దొడ్డలు వో తలంపఁగన్!*

(మిరాబాయి: 41, పుట: 9)

ఈ విధంగా కావ్యంలో సందర్భాను సారంగా దేశకాల పరిస్థితులను చాలా ఔచిత్యంతో వివరించడం జరిగిందని అర్థమౌతుంది.

## 2.7.8. మిరాబాయి కావ్య రచనా వైశిష్ట్యం

'తారాదేవి' కావ్యంలో కొనసాగిన రచనా వైశిష్ట్యం లాగానే 'మిరాబాయి' కావ్యంలో కూడా కవి తమ రచనా విశిష్టతను పాటించారు. ఉదాహరణకు కొన్ని వర్ణనలు చూద్దాం.

### 2.7.8.1. మిరాబాయి కావ్యంలో వర్ణనలు

సాధారణంగా కావ్యాల్లో అష్టాదశ వర్ణనలు ఉంటాయి. ఈ కావ్యంలో కూడా వర్ణనలు విరివిగా చోటు చేసుకున్నాయి. వాటిలో ఉదాహరణకు నగర వర్ణనను పరిశీలిద్దాం. కొంత మంది గోసాయిలు (భక్తులు) ఓ సత్రంలో కలిసి తాము చూసిన ప్రదేశాల వైభవాన్ని చర్చించుకుంటారు. అందులో ఉత్సాహవంతుడైన ఓ భక్తుడు తాను చూసిన నగరాన్ని తన మాటల్లో వర్ణించిన దాన్ని శర్మగారు చంపకమాల పద్యంలో ఎంత చక్కగా కూర్చారో తిలకించండి.

చ. *కదలనినీటఁ గుల్కెడు నగడ్తలు, చెల్వపుఁబూవుఁదోఁట లిం*
*పొదవెడు సౌధ రాజములు నొప్పఁగ నప్పుర రాజ మెంతయున్*
*జదురగు నొక్క పర్వత విశాల శిలాస్థలి పైన నుండి సం*
*పదఁ బొలుపారు చుండుఁ దలమానిక మై నగరంబు లన్నిటన్*

(మిరాబాయి:11,పుట:3)

ఈ నగరంలో ఒక పక్క కదలని అగడ్తలు, మరో పక్క పూల తోటలతో కూడిన సుందర వనాలు కను చూపుమేర విస్తరించి ఉన్నాయి. చిత్తోడు ప్రాంతంలో ఒక పర్వతం ఉంది. అందులో సంపదలు సమృద్ధిగా దొరుకుతాయి. అందుకది గొప్ప నగరంగా పేరు పొందింది. అక్కడ దేవాలయంలో చీకటి పడగానే పూజలు ప్రారంభమై తెల్లవారు జాము వరకు కొన సాగుతున్నాయన్నది పద్యంలో ఉన్న విషయం. భగవంతుడైన శ్రీ కృష్ణుని వర్ణన కావ్యంలో కొట్టవచ్చినట్లు కనబడుతుంది.

### 2.7.8.2. మిరాబాయి కావ్యంలో అంకారాలు

'మిరాబాయి' కావ్యంలో కవి ఎంచుకున్న అలంకారాలు కావ్యానికి శోభను చేకూర్చాయి. కావ్య పరమార్థాన్ని వ్యక్తం చేయటానికి తోడ్పడే విధంగా ఈ అలంకారాలు రూపొందాయి. అందులో ఉపమా,స్వభావోక్తి అలంకారాల ఇమిడిపోయిన క్రమాన్ని తెలుసుకొందాం.

#### 2.7.8.2.1. ఉపమాలంకారం

కావ్యంలో ఉపమాలంకారంలో చాలా పద్యాలు ఉన్నాయి. అందులో ఉదాహరణకు ఒకటి చూద్దాం.

సీ. *ఒక ప్రక్కఁ బడమటి కొదిగి వెన్నెలఁ*
*జిల్కు చందురుఁ గని కనుల్ సల్లవాఱు*
*విచ్చురేకులమొగ్గ లిచ్చు సౌరభముచే*
*నాసాపుటంబు లానంద మొందఁ*
*జిలచిల మందుఁ గూసెడు ఝిల్లికలగుంపు*

*వీనుల కమృతంపు వెల్లి గురియఁ*
*బొదలసందున మెల్లఁ బొంచి ఐచ్చు సమీర*
*మంటి యంటక మేను హాయి గొలుప*

తే. *నెచటఁగన్న బ్రశాంతమై యింపు గుల్కు*
*బిగము చెదిమాదసములకు శాంతి గఱపు*
*విపులకుతుకంబు మెయి ఢిల్లి విడిచి వార*
*లదలిత్రోసను జని రనాయాసులగుచు* (మిరాబాయి: 45, పుట: 8)

పడమర దిక్కున వెన్నెల చిందిస్తుంది. ఆ దృశ్యం కళ్ళకు మిరుమిట్లు గొలిపేలా ఉంది. ముక్కు రంధ్రాలు పూల రేకుల్లగా విచ్చుకొని ఆనందం చెందాయి. ఎడ తెరిపు లేకుండా మంచు కురుస్తే జల్లికల గుంపులో శబ్దం చెవులకు ఎంతో హాయిని కలిగించింది. అమృతం కురుస్తుండగా ఆ పొదల సందున మెల్లగా పొంచి వచ్చే వాయును శరీరానికి హాయినిచ్చిందని ఈ పద్య భావార్థం. ఇక్కడ కనురెప్పల్ని పూల రేకులతో పోల్చటం జరిగింది. మీరాబాయి కనురెప్పలు ఉపమేయం కాగా పూలరేకులను ఉపమానంగా భావించాలి.

ఇలా మిగతా అంశాలను కూడా సాదృశ్యంగా చెప్పడం వల్ల ఈ పద్యంలో ఉపమాలంకారం చోటు చేసుకుంది.

## 2.7.8.2.2. స్వభావోక్తి అలంకారం

కన్నులతో చూస్తూ, చెవులతో వింటూ నిలిచిన ఆవు, మీరాబాయి పాటలు వింటూ పాలు తాగడం మరిచి పోయింది. ఉదాహరణకు సంక్రాంతి పండగ సందర్భంలో గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని గంగిరెద్దులు సంగీతానికి చిందులు వేస్తాయి. ఆవు మోకాలిపై నిలబడి నృత్యం చేస్తుంటే ప్రజలు నిలబడి చూస్తూ ఆనందంతో పరవశించి పోవడం సర్వసాధారణమే కదా! ఈ సందర్భాన్ని కవి స్వభావోక్తి అలంకారంలో తెలుపడం జరిగింది.

సీ. *కనుదోయి నరమోడ్చి వినుచు నిల్చినగోవు గీతామృతములఁ జొక్కించువానిఁ*
*జనుద్రావ మఱచి యొయ్యన నిక్కి కనులేగఁ గడకంటఁ బ్రీతిమై కాంచువాని*
*వలకాలి పైన డాపలికాలి నరమోపి తాళంబు మెల మెల్లఁ దార్చువాని*
*జిఱునవ్వు వెన్నెల ల్చిందులాడుచు నుండి చూపఱమమల నచ్చుపడువాని*

(మిరాబాయి: 53, పుట:10)

జాతి, గుణ భేదాల్ని ఉన్నదున్నట్లు వివరించి తెలుపడం పై పద్యంలో కనబడుతుంది. అందుకే దీన్ని స్వభావోక్తి అలంకారమని అర్థం చేసుకోవచ్చు. కావ్యంలో సందర్భాన్ని బట్టి శబ్దాలంకారాలూ, అర్థాలంకారాలూ విరివిగా చోటు చేసుకున్నాయి.

## 2.7.9. మిరాబాయి కావ్యంలో భాషాశైలి

శర్మగారు కావ్యాన్ని సరళ సుందర భాషలో రాశారు. 'నవ్యతాసూచకములైన సలక్షణమైన భాషతోనే'[28] కావ్యాన్ని రూపొందించారని చన్నాప్రగడ తిరుపతిరావు చెప్పిన మాటలు అక్షర సత్యాలు. మామూలుగా రాళ్ళపల్లివారి భాష సరళంగా ఉంటుందని వారి వ్యాసాలు చదివితే అర్థమైతుంది. ఈ కావ్యంలో అక్కడక్కడ కొన్ని విషయంలో విధానంలో చెప్పబడ్డాయి. ఎక్కువగా పద్యాల్లో రాశారు కాబట్టి ఇందులో సంస్కృత పదాలు విస్తృతంగా చోటు చేసుకొన్నాయి. ఉదాహరణకు కొన్ని చూద్దాం.

క. ***తనువును విడునఁగఁ జింతిం***
***పను, విడిచెద, నీవు నిజము మది నెపుడైనన్***
***గనుఁగొనిన నెంత వంతల***
***కును లోనయ్యెదనొ యనియె కుందెద నాథా*** (మిరాబాయి: 152, పుట: 24)

ఇందులో కరుణ రసంతో మిరాబాయి తన శరీరాన్ని విడువడానికి ఏమాత్రం బాధపడనని కృష్ణుడితో చెప్పింది. కానీ, నువ్వు ఈ నిజాన్ని ఎప్పటికైనా తెలుసుకుని, మనసులో కలత పడతావన్న సందేహం తనకుందని వాపోయింది.

మరికొన్ని పద్యాల్లో అక్కడక్కడ తెలుగు పదాలు కూడా స్పష్టంగా కనిపిస్తాయి. ఉదాహరణకు ఒక పద్యం.

క. ***కను చీఁకటి యగుదాఁకం***
***బనివడి పయనంబు సేసి పార్శ్వంబులఁ జి***
***క్కినచెట్లక్రింది నిద్రం గొని***
***నడచిరి మరలఁ గోడికూఁత యగుతఱిన్.*** (మిరాబాయి: 50, పుట: 9)

సైన్యం చీకటి పడే దాక అలసిపోకుండా ప్రయాణం చేసి, మార్గమధ్యంలో చెట్లు కింద నిద్రించి, కోడి కూతలతో మళ్లీ ప్రయాణం చేస్తున్న క్రమాన్ని కళ్ళకు కట్టించారీ పద్యంలో.

జాతీయాలు, సామెతలు, పలుకుబడులు భాషా వ్యవహారానికి ఆయువు పట్టు వంటివి. వాటిని రాళ్ళపల్లివారు కావ్యంలో సందర్భోచితంగా ఉపయోగించారు. శర్మగారి భాష గురించి తిరుమల రామచంద్ర చెప్పిన మాటలు ఎంతో సముచితమైనవిగా తోస్తాయి. "*రాళ్ళపల్లి వారు తెలుగు తేనియను తాగి తేర్చినారు. కన్నడ కస్తూరిని అందుకొనినారు. తమిళ రంగమును తనదిగా చేసికొనినారు. సంస్కృతి సురభిని పొది విపట్టుకొనినారు. తర్వాత వీరి వాక్య నిర్మాణం పదప్రయోగం, అలంకారాలు, మాండలికాలు, జాతీయాలు, నుడికారాలు, సామెతలు మొదలైనవి శైలీ నిర్మాణ సాధనాలే.*"[29]

---

[28] 'మిరాబాయి' అనంతరాగం. పుట. 170.
[29] రాళ్ళపల్లి పీఠికలు పరిశీలన. పుట. 147-148.

ఈ కావ్యంలో సందర్భాను సారంగా కవి కొన్ని సామెతలను ప్రయోగించారు. వాటిని చూద్దాం.

- ***."దొర బుద్ధులు దొడ్డలు వో తలంపగన్"*** (పుట 9) అనే సామెతను ఉపయోగించడానికి కారణం మహమ్మదీయుల మనసును కుమ్మరి వాని నైపుణ్యం లాంటిది. వారు ఎప్పుడు ఏపని చేస్తారో ఎవరికీ తెలీదు. కాని రాజు గారిని నిరంతరం పూజిస్తారు. అలా రాజు బుద్ధుల ఎక్కడికి పోతాయని చెప్పిన సందర్భానికి తార్కాణమే ఈ సామెత.
- ***"తడిసినంతయు నింక బుడమికి భారంబు"*** (పుట 24) మిరాబాయి అడవుల్లో ఉన్నప్పుడు ఏమీ చేయాలో అర్ధంకాక ఇక తాను బతికినంత కాలం అనుమానం పెరుగుతుంది తప్ప తరగదుని పలికిన సందర్భాన్ని గుర్తుచేస్తుంది. ఈ సామెత.

## 2.7.10. మిరాబాయి కావ్యంలో ఛందస్సు

'మిరాబాయి' ఛందోబద్ధమైన కావ్యం. దీన్ని 10 గద్యలు, 168 పద్యాలతో రాసి, గొప్ప శిల్పాన్ని ప్రదర్శించిన ఖండకావ్యంగా కవి రూపొందించాడు. 'మిరాబాయి' ఖండకావ్యంలో ఉత్పలమాల, చంపకమాల, శార్దూలం, మత్తేభం, కందం, తేటగీతి, ఆటవెలది, సీసం పద్యాలు చోటు చేసుకొన్నాయి. ఉదాహరణకు కొన్ని పద్యాలను గమనించండి.

ఉ. ***"సందడి యయ్యెడుం బిదపఁ, జక్కఁగ నారమణీమతల్లి న***
***స్పందత సేవఁ జేసికొను భాగ్యము దక్కదు గాన నిప్డెము***
***మ్మందుగఁ జోటు సూచికొనఁ బోలు" నటంచు సమీప భూమి నిం***
***పొందుగఁ గూరు చుండి యెదు రొప్పరికించుచు నేది యుండఁగన్,***

(మిరాబాయి:52, పుట:10)

పై ఉత్పలమాల పద్యంలో మీరాబాయి పాదాల కదలికల్నీ ప్రజలు చూస్తూ ఆరాధించారు. అంతేకాదు ఆమెకు సేవ చేసుకోవడం గొప్ప భాగ్యం అనుకొన్నారు. భక్తులందరూ గుడి దగ్గరికి చేరుకొని ఆమెను పూజింపసాగారు. ఈ పద్యంలో **"సమీప భూమి నిం పొందుగఁ"** అనే ప్రయోగంలో కవి గొప్ప ఔచిత్యాన్ని పాటించారు. పద్యం ఎత్తుగడలో **" సందడి యయ్యెడుం బిదపఁ"** అనడంలో ప్రత్యేకత ఉంది.

చంపకమాల వృత్తంలో రాసిన పద్యంలోని విశేషాలను చూడండి.

చ. ***వినయము మీఱఁ దన్ను గని వేగము ప్రక్కకు నిల్చి మొక్కు న***
***య్యనఘనచరిత్రఁ గన్గొని ప్రియంబుగ నల్లనఁ జేయి బట్టి, "యం***
***గన! యదునాథు సేవను దగం బొనరించి తె? నీదు సేవ మె***
***చ్చెనె హరి?" యందు నాదరము నేసి పదంపడి బుజ్జగించుచున్***

(మిరాబాయి: 89, పుట: 15)

కవి భక్తి రసాదులను పండించిన తీరు ఇందులో ఉంది. ఎల్లప్పుడూ నీకు వినయంతో పూజ చేస్తామని చెప్పటంలో వారి భక్తితత్త్వం స్పష్టంగా తెలిసింది. దీన్ని బట్టి చూస్తే మీరాబాయిని ఎంతో ఆరాధన భావంతో కొలిచారో అర్థమౌతుంది.

ఇష్టదేవతా స్తుతి గొప్పగా కనబడుతుందనే శార్దూల పద్యం అద్భుతంగా రాయబడింది.

*శా. కాలిందీతటి నిల్చి, రాలును గరంగం జేయు నావేణురా*
*గాలాపంబునఁ జొక్కి లోకముల కాయాసంబు వోకార్చు నా*
*శ్రీ లావణ్యమయ స్వరూపమును, రాశీ భూత కారుణ్యమున్*
*లీలాఖేలము, నామనః పటమునన్ జిత్రించు నశ్రాంతమున్*

(మిరాబాయి:1, పుట: 1)

యమునా నది ఒడ్డున నిల్చిన రాళ్లను సైతం కరింగించే వేణు రాగాలను ఆలపించడం, సమస్త లోకాలకు ఆయుస్సు చేకూర్చే ఆ ముఖ కాంతిని పద్యం గుర్తు చేస్తుంది. శ్రీ కృష్ణుడి దయ, కరుణతో పాటలు నా మనసులో విరివిగా వచ్చేటట్లు దీవించు. అని శర్మగారు ఇష్టదేవతా స్తుతి చేశారు. ఈ విధంగా చిన్న చిన్న పాదాలతో కూడిన తేటగీతి పద్యాలు, విన సొంపుగా ఉండే కంద పద్యాలు. అందరికి తెలిపిన ఆటవెలదులను కవి కావ్యంలో విసుగు లేకుండా పొందుపరిచారు.

## 2.7.11. మిరాబాయి కావ్యంలో రస పోషణ

కావ్యానికి శోభనూ, ఆదరణను కలిగించడంలో రసం ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఈ కావ్యంలో భక్తితో కూడిన కరుణ రసం తొణికిసలాడుతోంది. మిరాబాయి పాడే పాటల్లో భక్తి రసం ఉట్టి పడుతుంది. దీన్ని చూసినా, విన్న బౌద్ధులు, జైనులు, శివుని భక్తులు, రాక్షసులు మొదలైనవారు కృష్ణుడి పాదాలను పూజచేస్తారు. అటువంటి భక్తి రసంతో కూడిన ఒక పద్యాన్ని చదవండి.

తే. *భక్తి రస ముట్టిపడు నామెపాట వినిన*
*బౌద్ధచార్వాక జైన కాపాలికాది*
*జనులు గూడ ముకుందుని చరణభక్తి*
*నెగడి రన నాసతిని వేఱ పొగడవలెనె!* (మిరాబాయి: 22, పుట 5)

ఈ భక్తికి కరుణ రసం కలిసిన విధానం రాజు గారి పాత్రలో తప్ప అన్ని పాత్రల్లో కనపడుతుంది. ఓ కృష్ణా నీకు సన్మానం చేయటం, పూజించటం మరువం. శుక్ల పక్షం రోజు కనిపించే చంద్రుడిలా నీ ముఖం కాంతివంతంగా ఉంటుంది. అందుకు భక్తి పారవశ్యంతో మేము నీకు పూజలు చేస్తాం. అనటంలో భక్తి కరుణ రసాల సంగమాన్ని కవి ఔచిత్యంగా పోషించారు.

ఈ విధంగా కవి కావ్యంలో మిరాబాయి, ఢిల్లీ పాదుషా, మంత్రి పాత్రలతో భక్తి, కరుణ రసాలను ఇనుమడింప చేశారు. రాజు పాత్రలో మాత్రం బీభత్స రసాన్ని అద్భుతంగా

చూపించారు. రాజు తన గర్భ శత్రువు ఢిల్లీ పాదుషా తన రాజ్యానికి వచ్చి వెళ్లినప్పుడు కోపంతో మిరాబాయి ని చంపమని మంత్రికి ఆజ్ఞాపిస్తాడు. రసాన్ని కావ్యానికి తగినట్లుగా రాళ్ళపల్లివారు మలిచే ప్రయత్నం చేశారు.

## 2.8. తెలుగు సాహిత్యంలో రాళ్ళపల్లివారి ఖండకావ్యాల స్థానం

తెలుగు సాహిత్యంలో ఖండకావ్యాలు వెలువడుతున్న కాలంలో రాళ్ళపల్లివారి ఖండకావ్యాలైన *'తారాదేవి' 'మిరాబాయి'* వచ్చాయి. వీటిలో *'తారాదేవి'* (1911) *'సరస్వతి'* మాసపత్రిక (కాకినాడ)లో అచ్చయింది. అప్పటి దీని ప్రతులు 200. కాగా *'మిరాబాయి'* (1913) *'మానవసేవ'* పత్రికలలో వరుసగా ప్రచురింపబడింది. దీని ప్రతులు 300. మాత్రమే కాబట్టి ఎక్కువ ప్రచారానికి నోచుకోలేక పోయాయని ఊహించవచ్చు. సమకాలీన విమర్శకులు కూడా వీటిని గుర్తించినట్లు కనబడదు. పైగా ఈ రెండు ఖండ కావ్యాలు తర్వాతి కాలం పాఠకులకు అందుబాటులో లేకపోవడం వల్ల వెలుగులోకి రాలేదనిపిస్తుంది. రాళ్ళపల్లివారి పై మొదట పరిశోధన చేసిన సాతవల్లి చంద్రశేఖర్ కూడా తమ సిద్ధాంత వ్యాసంలో *" తెలుగు సాహిత్యంలో ఈ రెండు కావ్యాలకు వ్యాప్తి, ఆదరణలు లభించక పోవడం శోచనీయం.*[30] అని వాపోయారు. కాబట్టి ఆయా కారణాలన్నీ ఊహగానాలని మాత్రమే గమనించాలి.

రాళ్ళపల్లివారి కావ్యాల కంటే ముందు తెలుగులో వెలువడ్డ ఖండకావ్యాలు కొన్ని ఉన్నాయి. వాటిలో కట్టమంచి *'ముసలమ్మ మరణము'* (1900), రాయప్రోలు *'లలిత'* (1909) గురజాడ *'పూర్ణమ్మ'* (1910) మొదలైనవాటిని ప్రధానంగా పేర్కొనవచ్చు. ఆనాడు ఈ కావ్యాలు పెద్ద ఎత్తున ప్రజల ఆమోదం పొందిన విషయం తెలిసిందే. ఈ ఖండ కావ్యాలకు విస్తృత ప్రచారం రాకపోవడానికి మరిన్ని కారణాలు ఉండవచ్చు.

## 2.9. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ ముక్తక కవితలు

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గుర్తుకువస్తే విమర్శకుడు, పరిశోధకుడు, సంగీతవేత్త అని అనుకోవడం పరిపాటి. కాని కవిగా వీరికి రావాల్సినంత గుర్తింపు రాలేదు. అయితే, శర్మగారి సృజనాత్మక సాహిత్యం చదివితే వీరిలో గొప్ప భావుకత ఉన్న కవి కనిపిస్తాడు. పైన తెలుసుకొన్నట్లు వీరి ఖండకావ్యాలైన *'తారాదేవి', 'మిరాబాయి'* లకు తెలుగు సాహిత్యంలో అంతగా గుర్తింపు రాలేక పోయినా, ఇవి ఆనాటి నుండి ఈనాటి వరకూ ఉన్న సమాజాన్ని మేల్కొలిపేవిగా అగుపడతాయి.

రాళ్ళపల్లివారి కలం నుండి 1910– 1950ల మధ్యకాలం కొన్ని కవితలు వెలువడ్డాయి. సరిగ్గా అప్పుడే భావకవిత్వం బాగా విస్తరిస్తున్న సమయం. కాబట్టి సాధారణంగా ఎవరైనా ఆ ప్రభావానికి లోనుకాక తప్పదు. కానీ, శర్మగారు మాత్రం అటువైపు మొగ్గు చూపలేదు. ఆకారణంగానో లేదా ఆయన ఇష్టానుసారంగానో కొన్ని భావ కవితలు రాశారు. వీటిని చదివితే శర్మగారి వ్యక్తిత్వం చక్కగా బోధపడుతుంది. కొన్ని నియమబద్ధమైన ఆధ్యాత్మిక

---

[30] రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి సాహిత్య సేవ– సవిమర్శక సమీక్ష. పుట. 23.

జీవితం గడిపేవారి వ్యక్తిత్వం ఎలా ఉంటుందో అర్థమౌతుంది. శర్మగారు ఈ కవితల్లో అంతరించి పోతున్న కళలను కాపాడు కోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. పైగా ఆనాటి సమాజ జీవనం ఏవిధంగా ఉండేదో గోచరిస్తుంది. వీరు రాసిన కవితల్ని కొందరు సాహిత్య వేత్తలు పలుమార్లు ప్రశంసించడం పరిపాటి.

దొరికిన ఆధారాలను బట్టి రాళ్ళపల్లివారి కలం నుండి జాలువారిన కవితా కుసుమాలు మొత్తం తొమ్మిది. అవి; పెనుగొండ కొండ (1922), పరిహాస లీల(1922), ముసలి వీణ(1922), సంధ్యావందనము(1922), ఆహ్వానము(1934), విస్మృత వేణుగీతి(1941), శమీపూజ(1941), భారతికి సాధువాదము (1949), ప్రబంధకవి (1950)

శర్మగారు రాసిన పైకవితల్లో *పెనుగొండ కొండ, పరిహాసలీల, ముసలివీణ, సంధ్యావందనము* అనేవి ఆంధ్రపత్రిక (దుందుభి) 1922 ఉగాది సంచిక మే నెలలో *'కుసుమగుచ్ఛాలు'* అనే శీర్షికతో ప్రచురితమయ్యాయి. ప్రధానంగా ఈ కవితల్లోని ఆధ్యాత్మిక, రాజకీయ, సాంఘిక నేపథ్యాలను లోతుగా పరిశీలించడం వల్ల ఆయా విషయాలు అవగాహనకు వస్తాయి.

## 2.9.1. పెనుగొండ కొండ

అనంతకృష్ణశర్మ రాసిన కవితల్లో లభ్యమవుతున్న తొలి కవిత *'పెనుగొండ కొండ'*. దీన్ని కవి 1921లో రాశాడు. కానీ 1922లో అచ్చయింది. తొలుత ఇది కవితగా ఉంది. తర్వాత పాటగా ప్రచారంలోకి వచ్చింది. రాళ్ళపల్లివారు దీన్ని మోహన రాగం త్రిపుట తాళంలో పాడి ప్రాచుర్యం కల్పించారు. రాయలసీమ ప్రాంతంలో అనేక మంది ఈ పాటను పాడేవారు. దీని నేపథ్యంలోకి తొంగి చూస్తే ఎన్నో విషయాలు బోధపడతాయి.

### 2.9.1.1. కవితా విశ్లేషణ

రాళ్ళపల్లివారికి అపారమైన కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టిన కవిత పెనుగొండ కొండ. ఇందులో కవి విజయనగర చక్రవర్తుల వేసవి విడిది అయిన పెనుగొండ ఘనతను వర్ణించాడు. తెలుగు వీరులు తమ కత్తులను సాన పెట్టిన బండగా ఈ ప్రాంతాన్ని కీర్తించినాడు. ఇక్కడ నిర్మితమైన కోటగోడలు శత్రువుల రక్తధారలతో తడిసి ముద్దయ్యాయని తెలిపారు. విజయనగర రాజపుత్రులు అపారమైన శౌర్యాన్ని ప్రదర్శించిన వీరుల గడ్డగా పెనుగొండను కవి ప్రస్తుతించాడు. దీన్ని రాజధానిగా ఏలిన విజయనగర చక్రవర్తి తిరుమల రాయలు. ఈయన కాలంలో *'వసుచరిత్ర'* లాంటి రసవంతమైన కావ్యాలు వెలువడటం వల్ల పెనుగొండ ఘనకీర్తి దశదిశలా వ్యాపిందిందని కవి భావించాడు.

### 2.9.1.2. కవిత చారిత్రక నేపథ్యం

- కవిత పేరు *'పెనుగొండకొండ'*. ఆంధ్రదేశంలో పెనుగొండ అనే పేరుతో రెండు ప్రదేశాలున్నాయి. ఒకటి పశ్చిమ గోదావరి జిల్లాలో ఉండగా, రెండోది రాయలసీమలోని

అనంతపురం జిల్లాలో ఉంది. రాళ్ళపల్లివారు రాసిన 'పెనుగొండ కొండ' అనే కవిత అనంతపురం జిల్లాలో ఉన్న పెనుగొండే అన్నది ఇక్కడ స్పష్టం.

- విజయనగర రాజులు 1336 నుండి 1646 వరకు ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాలను పరిపాలించారు. అప్పట్లో వీరు పరిపాలన సౌలభ్యం కోపం అనెకొంది, హంపి, పెనుగొండ, చంద్రగిరి, వేలురు ప్రాంతాలను రాజధానులుగా ఏర్పాటు చేసుకొన్నారు. అందులో మూడవ రాజధాని పెనుగొండ. బహుమని సుల్తానులు విజయనగర సామ్రాజ్యంపై దండెత్తి ముఖ్య ప్రాంతాలను ఆక్రమించారు. దాంతో విజయనగర రాజులు రాయలసీమలోని పెనుగొండ ప్రాంతానికి వచ్చి తలదాచుకొన్నారు. ఆ సమయంలో ఈ ప్రాంతం నుండే వీరి పరిపాలన కొనసాగింది.
- పెనుగొండనే విజనయనగర రాజులు వేసవి విడిదిగా ఉపయోగించుకొన్నారు.
- శత్రుదుర్భేద్యమైన దుర్గంగా ప్రసిద్ధికెక్కిన పెనుగొండ ఇటు ఆంధ్రదేశంలోనూ, అటు కర్నాటకలోనూ చారిత్రక నేపథ్యమున్న ప్రాంతం.
- విజయనగర రాజుల రెండవ రాజధానిగా ఉన్న పెనుగొండను 'ఘనగిరి' అని కూడా పిలుస్తారు.
- సాహితీ సమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయలు ప్రతి యేట వేసవిలో పెనుగొండకు వచ్చి, సేద తీరేవారు. కాగా అధికారాలను కూడా ఇక్కడి నుండే చలాయించేవాడు. ఈ ప్రాంత విశిష్టతను తెలుగు సాహిత్యంలో చాలా మంది కవులు ఆయా రచనల్లో ప్రశంసించారు.
- 'పెనుగొండ కొండ' కవితలో వీరరసం ఉట్టి పడుతుంది. ఉదాహరణకు మూడు చరణాలున్న ఈ కవితలో లేదా పాటలో మొదటి చరణం పరిశీలించండి.

***రంధ్రముల ప్రహరించుశత్రుల***
***రక్తధారల త్రావిత్రేచిన***
***ఆంధ్ర కన్నడ రాజ్యలక్ష్మల***
***కరిది నీలపుదండ యీ పెనుగొండ కొండ''*** [31]

ఈ కవితలో ఉన్న మూడు ఖండికల్లోనూ కట్టలు తెంచుకొనే పౌరుషం ఉంది. కాగా రాజకీయ నేపథ్యం, విగత వైభవం, ప్రాంతీయ చైతన్యాన్ని కవి కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు.

రాళ్ళపల్లివారి 'పెనుగొండ కొండ' కవితను చదివిన దేవులపల్లి రామానుజరావు *''రసపుముద్దయైన ఆ కవిత నా రక్తాన్ని ఉడికించింది.''*[32]. అని అభిప్రాయపడ్డారు. దీన్ని బట్టి ఈ కవిత గొప్పతనం ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రాంతంలో అన్ని వర్గాల ప్రజలు

[31] ఆంధ్రపత్రిక ఉగాది సంచిక 1922 మే. పుట. 12.

[32] "విద్వన్మణి' అనంతరాగం పుట.150.

సామాజిక జీవితంలో ఎటువంటి భేద భావాలు లేకుండా జీవిస్తారన్న క్రమాన్ని కవి చెప్పకనే చెప్పారనిపిస్తుంది.

టి.వి. నాథముని అయ్యంగార్ ''పెనుగొండ అన్నపుడు మనకు స్ఫురణకు వచ్చేది *గ్రామము కాదు; ఈ గ్రామానికి సమీపంలో ఉన్న పశ్చిమమున పడమటి కనుమలవోలె ఉన్నతమైన గొప్పదుర్గము.''*[33] అని ఈ కవిత చారిత్రక నేపథ్యాన్ని గుర్తుచేశారు.

రాళ్ళపల్లివారి 'పెనుగొండ కొండ' అనే గేయం తెలుగు సాహిత్యానికి మంచి పేరు తెచ్చిపెట్టింది.

## 2.9.2. పరిహాసలీల

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ రాసిన కవితల్లో రెండవది 'పరిహాసలీల'. ఈ కవితలో కవి అజ్ఞానంలో ఉన్న భక్తుల్నీ భగవంతుడు ఎలా పరిహాసం చేశాడనే దాన్ని చక్కగా తెలిపారు. పూర్తిగా వ్యంగ్య ప్రధానమైన రచన సంప్రదాయానికి చెందిందీకవిత. భావకవిత్వానికి పొత్తు కుదరని కాలంలో కవి సాధనకు, ఆరాధనకు ఆటంకాలు చాలా ఉంటాయి. వాటన్నిటిని తలచుకుని కవి వాపోయిన క్రమం ఇందులో ప్రధానంగా కనిపిస్తుంది. ఉదాహరణకు కవితలోని కొన్ని పంక్తుల్నీ పరిశీలిద్దాం.

***"పూలఁ బూజింపమని నిద్ర మేలుకొలిపి***
***తట్టలోఁ గాయ మొగ్గలు పెట్టినావు!***
***నిశ్చలంబుగ మదిని ధ్యానింపు మనుచు***
***కుంటి ముక్కాలిపీట జేకూర్చినావు!***
***పరవశంబుగ గొంతెత్తి పాడుమనుచుఁ***
***దెగిన తుంబురఁ జేతి కందిచ్చినావు!!***
***అణుచుకోలేని పేరాసలను ఘటించి***
***ప్రణయ మధుర విఘ్నముల పాల్పఱచి దయితి!***
***యీవు నవ్వుచు నన్ను నవ్వించే దేల."***

(ఆంధ్రపత్రిక ఉగాది సంచిక : మే, 22, 1922)

చేతికి బంగారు పళ్లెం ఇచ్చి, అందులో వికసించని పూల మొగ్గలు పెట్టినావు. సక్రమంగా కూర్చోని పూజించమని మూడు కాళ్ల పీటను ఇచ్చావు. మనసులో నిశ్చితంగా ధ్యానించమని తెగిపోయిన తుంబురని చేతిలో పెట్టి, కంఠమెత్తి పాడమన్నావు. మనసులో దాచుకోలేని కోరికలకు ఆటంకం కలిగించి, నీవు నవ్వూతూ, నన్నూ నవ్విస్తూ అపహాస్యం చేస్తావెందుకు? అని భగవంతుణ్ణి భక్తుడు ప్రశ్నిస్తూ పరిహాసం చేసిన విధానం ఇక్కడ గమనించవచ్చు.

[33] ఆంధ్రపత్రిక ఉగాది సంచిక మే 22– 1922. పుట. 12.

ఈ కవిత ఆంతర్యాన్ని గురించి ఎస్. చంద్రశేఖర్ మాట్లాడుతూ 'ఇందు 'నిద్రమేల్కొలుపుట' ఉద్యమారంభమని, 'మధుర ప్రణయం' అన్నపదం నాటి ఉద్యమంలో బాగా నలుగుతున్న పదమని, 'నన్ను నవ్విస్తూన్నావు' అని కవి అనుకోవడంలో నిర్లిప్తత ధ్వనిస్తుందని'[34] అభిప్రాయపడ్డారు.

### 2.9.3. మురళీవీణ

అనంతకృష్ణశర్మ శాస్త్రీయ సంగీతానికి ఇచ్చే ప్రాధాన్యం ఎలా ఉంటుందో ఈ కవిత చదివితే తెలుస్తుంది. ఇందులో భావ కవితా ఛాయలు కొట్టవచ్చినట్లు కనిపిస్తాయి. కవితను మొత్తం కాకుండా అందులో కొన్ని పంక్తులను తిలకిద్దాం.

***"పటహ కోలాహలము సౌఖ్యంబు చెడిన***
***రస పిపాసార్థుడుగా నన్ను గొసరి కొసరి***
***పెండ్లియింటి 'కచ్చేరి' కిఁబిలుతురేల"***

అంటూ ప్రారంభమైన కవితను చదివితే! అర్థమయ్యేది. పెండ్లియింటిలో కచ్చేరికి నన్ను పిలవకండి అని చెప్పకనే చెప్పాడు కవి. ఎందుకంటే! తప్పేట దరువులతో హంగామా చేసే సమయంలో కచ్చేరికి పిలవద్దు. ఆ శబ్దాలను వినే ఓపిక నాకు లేదు. వీణామ తల్లి కూడా దాన్ని భరించడాని ఇష్టపడదు. శరీరం కంపించే సాధనకు వీణామ తల్లి ఓర్చుకోదు. ఆ సమయంలో వచ్చే బిరుదులను కూడా స్వీకరించదు. ఆ తల్లి మూగ మాటలకు, అందులో దాగి ఉన్న భావాల సొగసుకు పులకరిస్తుంది. అలాంటి మనసుని అక్కరకు చేర్చుకుంటుంది. కాని అర్థం లేని కోలాహలాలను చూసి తట్టుకోదు. అందుకు పెండ్లింటిలో కచ్చేరికి ఎందుకు పిలుస్తారంటూ... సంగీతానికి ఉండే విలువను రాళ్ళపల్లివారు తెలిపారు

ఆధునిక సమాజంలో సంగీతం చాలా మార్పులకు లోనౌతూ వస్తున్నది. ఈ మార్పులను ఆహ్వానించాలి. కానీ దేని ప్రాధాన్యం దానిదే అన్న విషయాలు ఎప్పటికప్పుడు గుర్తెరగాలి. భావకవిత్వంలోని ధ్వనికి నిదర్శనంగా ***"నాదు వీణామ తల్లి సూక్ష్మ సంగీతమును చవిచూడగలవె"*** అని ప్రశ్నించాడు కవి.' కలహ కోలాహలము, మద్దెల సద్దులు' అన్న వాటిలో వ్యంగ్యంగా సమకాలీన సాహితీ స్థితిని స్ఫురింపజేస్తుందీకవిత.

శర్మగారు కవితలో ***"ముఖముఖంబులకు నా మురళీవీణ/ జీవితంత్రుల బలిమి ద్రెంచికొనలేదు"*** అనటంలో భావకవుల సరసకు వెళ్లారనిపిస్తుంది. ఉదాహరణకు శంకరాభరణం సినిమాలో 'బ్రోచేవారెవరురా' అనే పాటను 'దాసు' అనే వ్యక్తి ఆధునిక సంగీతానికి అనుగుణంగా పాడి అపహాస్యం చేస్తుంటాడు. దాన్ని చూసిన శంకరాభరణం (సోమయాజులు) గారు ఆ పాట విలువను గుర్తుచేస్తాడు. ఇలా సంగీతాన్ని ఏ సమయంలో ఎలా ఉపయోగించాలో తెలుసుకోవాలని 'మురళీవీణ' కవిత ద్వారా కవి తెలియజెప్పాడు.

[34] రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి సాహిత్య సేవ– సవిమర్శక సమీక్ష. (అముద్రితం) పుట. 29.

ఓ సందర్భంలో రాళ్ళపల్లివారు కళల గురించి మాట్లాడుతూ...''*ఇప్పటి పద్ధతిలో ఏకాగ్రత లేకపోవడం, అసలు కళలో ఏకాగ్రత ప్రధానం అంటూ కళలకు ప్రాధాన్యం ఇవ్వండని*''[35] నొక్కి చెప్పారు. కాబట్టి 'ముసలివీణ' కవితలో ఉన్న నేపథ్యాన్ని గమనిస్తే కళలకు ప్రాముఖ్యం ఇవ్వడమే కాకుండా, వాటిని కాపాడుకోవడం ఎంత అవసరం. అనే విషయాన్ని సుస్పష్టం చేశారు.

## 2.9.4. సంధ్యావందనము

రాళ్ళపల్లివారు ఈ కవితలో సంధ్యావందనము చేయాల్సిన ఆవశ్యకత ఎంతో బాధ్యతగా గుర్తుచేశారు. ఈ కవిత 1922లో ఆంధ్రభారతి పత్రికలో వచ్చిందన్న విషయం మొదట్లోనే తెలుసుకొన్నాం. అసలు 1922 అంటే అంది స్వాతంత్ర్యోద్యమ కాలం. అప్పుడు భారతీయులు బ్రిటిష్ వారితో స్వాతంత్రంకోసం పోరాటాలు చేసే సమయం. ఈ పోరాటం ఫలించాలంటే కొన్ని శక్తులు భారతీయులకు కావాలి. వాటిని పొందడానికి 'సంధ్యావందనం' చేయాలని కవి ఈ కవిత ద్వారా తెలిపారు. ఐదుపాదాలు గల ఈ పద్య రచనలో ఉదహరణకు ఓ పాదాన్ని చూడండి.

1. ***"సంధ్య వార్పంగ రందు – కాలంబు వ్యర్థమయి పొవులెందు***
***వింధ్య హిమగిరులనుండి – యర్ఘ్యంపు వెల్లువలు పాఆరనిందు"***

(ఆంధ్ర పత్రిక ఉగాది సంచిక మే, 1922లో మొత్తం అందుబాటులో ఉంది )

ఈకవితలో ఉన్న సారాంశాన్ని స్థూలంగా తెలుసుకొనే ప్రయత్నం చేస్తే దాని ఆంతర్యం బోధపడుతుంది. పూర్వం హిందు సంప్రదాయంలో రోజుకి మూడు సార్లు సంధ్యావందనం చేసేవారు. దీన్ని త్రికాల సంధ్య అని కూడా అంటారు. వింధ్య పర్వతాలు, హిమాలయ పర్వతాలనుండి పుట్టి, ప్రవహించే నదుల్లోకి దిగి, దోసిళ్లతో నీళ్ళు తీసుకుని స్వాతంత్ర్య పోరాటం కోసం కావాల్సిన శక్తి, సామర్థ్యాలను, తేజస్సులను, ప్రసాదించమని దేవున్ని మనస్ఫూర్తిగా ప్రార్థించాలి. ఇదే సంధ్యావందనం అంటే.

ఈ ప్రార్థన వల్ల భారతీయులకు కటిక చీకటి, నిరాశ నిస్పృహలు తొలగిపోతాయని కవి భావించాడు. సంధ్యా సమయంలో ఆకాశం వివిధ రంగులతో మిరమిట్లు గొలిపేలా ఉంటుంది. ఉదయకాలంలో భగభగమండే అగ్నిలా, పరశురాముడి గండ్ర గొడ్డలి పౌరుషంలా నిద్ర మేల్కొని ప్రకాశిస్తాడు సూర్యుడు. ఈ సమయంలో సముద్రపు అలలు ఓంకార నాదాలతో అన్ని వైపులా తొంగి చూస్తాయి. అప్పుడు మరచిపోయిన మంత్రం జ్ఞప్తికి వస్తుంది. ఇది ఆ సూర్య భగవానుడి వల్లే జరిగిందని కవి ఆలోచన.

భారతదేశానికి బ్రిటిష్ వారి నుండి సంపూర్ణంగా విముక్తి లభించాలని కోరుతూ కవి ఈ కవిత రాశారనిపిస్తుంది. ఈ సంధ్యావందనం చేయడం వల్ల భారతీయులకు గొప్ప తేజస్సుతో

[35] రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ శత జయంతి సంచిక. పుట. 48.

పాటు బుద్ధి, మనో, దేహ బలాలు చేకూరి స్వాతంత్రోద్యమంలో ధైర్యంగా పోరాడ గలరని ఆకాక్షించాడు కవి. మొత్తం ఐదుపాదాలున్న ఈ కవిత పాడుకోవడానికి అనువుగా ఉంటుంది.

## 2.9.5. ఆహ్వానము

శర్మగారి కలనుండి వెలువడిన ఈ కవిత 1934 అక్టోబర్ లో భారతి పత్రికలో ప్రచురితమైంది. దీని విషయంలోకి వెళితే, ఆంగ్లేయుల పాలనలో భారతీయులు అనేక కష్టాలు ఎదుర్కొన్నారు. ఆ కష్టాల్నీ సమర్థవంతంగా నివృత్తి చేసుకోవడం మన కర్తవ్యమని కవి ఈ కవితలో ఆకాంక్షిచిన విధానం స్వయంగా తిలకిస్తేనే బాగుంటుంది.

*"మాసిపోవని చైత్రమాస తారుణ్యము వలసినప్పుడు వలతురేని,*
*నలుదిక్కులందు తేనెల జల్లు పూవుల నిండు నవ్వులను మన్నింతు రేని,*
*సాజాత్యవైజాత్య సంశయాభిన్నమౌ నేకాధికారి మిచ్చింతు రేని,*
*కంటకములకు వెరువక, కష్టమనక – దూర మీదారియని వెన్కద్రొక్క కుండ*
*రండు సురభిళ వాఙ్మయారామమునకు – భారతీపూజ సేయ నుదారులార ".*

(సాధన – 25-8-1934)

చైత్ర మాసం వసంత ఋతువులో చెట్లన్నీ విరబూసిన పూలతో కళకళలాడుతుంటాయి. కాగా తేనె జల్లులు కురిపిస్తూ ఆనందంగా ఉంటాయి. అప్పుడు మనసుకు ఎంతో ఆనందం కలుగుతుందని కవి వర్ణించాడు. స్వదేశీయులను విదేశీయులు ఇబ్బందులకు గురి చేసినప్పుడు ముళ్లదారిలా ఉంటుందని చెప్తూ...ముళ్లదారిని కష్టమని తలచుకోకుండా, రండి ఈ సువాసనలున్న సాహిత్యంలోకి సరస్వతి పూజచేసే గొప్పవారందరూ. అంటూ కవి హృద్యంగా ఆహ్వానించాడు.

## 2.9.6. విస్మృత వేణుగీతి

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ రాసిన ఈ కవిత *'గ్రంథాలయ సర్వస్వము'* (1941) సంచిక. 1, సంపుటి.3 లో అచ్చయింది. *'విస్మృత వేణుగీతి'*. అంటే, మరచిపోయిన పిల్లన గ్రోవి పాట. అని అర్థం. ఇది మొత్తం ఆరు వృత్తపద్యాల్లో నిర్మితమైంది. ప్రతి పద్యాన్ని హృదయానికి హత్తుకొనేలా చెప్పడం కవి ప్రతిభకు తార్కాణంగా ఉంది. ఉదాహరణకు ఓ పద్యాన్ని పరిశీలిద్దాం.

మ. *అనివార్యంబగు పూర్వవాసన దృఢంబై యుండుటన్, వీనులున్,*
*గనులున్ నల్లడఁ ద్రిప్పి చూచెడిని లేఁగల్; మాతృగర్భంబు నం*
*దు నిలీనంబగు ప్రాంత గీత మది వీనుల్ విందుగా సోఁకి నం*
*తనెకన్ చెల్ చెడఁద్రొక్కి,గంతులిడుచున్ దాఁటిం పయత్నిం పవే?*

ఈ విస్మృత వేణుగీతలోని పద్యాలన్ని ఎంతో సరళంగా ఉంటాయి. అన్ని పద్యాలను ఇక్కడ పేర్కొనకుండా వాటి భావార్థాల్ని మాత్రమే సంక్షిప్తంగా తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం.

తాళానికి అనుగుణంగా కళలను మలచుకోవడం పరిపాటి. దాన్ని లాలిత్యం చూసి మురిసిపోతాం. ''ఓ సూర్య భగవానుడా! ఇలాంటి విద్యలన్నీ కులమతాలనే చిక్కులు లేకుండా ఉన్నాయని విని ఎన్ని రోజులైందో కదా'' అని మొదటి పద్యం భావం.

గుంపులు గుంపులుగా ఉన్న పశువులు మందలు స్వప్నాల్లాంటి గజ్జెల ధ్వనులను వింటూ, యమునానది పచ్చిక బయళ్లలో సేదతీరుతున్నాయి. ఇలాంటి ప్రదేశాల్లో పశువుల కాపరులు వీణను వాయిస్తూ ఆనందంగా విహరిస్తుంటారని మరో పద్యంలోని భావం.

ఇంకొక పద్యం 'ఈ పిల్లన గ్రోవి శబ్దాలు ఎక్కడో ఉన్న జింకల చెవుల్నీ తాకగానే, అవి చెంగు చెంగునా ఎగురుతాయి. దాంతో అడ్డంలా ఉన్న పొలాల గట్లు చెల్లాచెదురై పోతాయని చెబుతుంది.

ఈ మధురమైన వీణ, గట్టి మద్దెల దరువుల శబ్దాలను విన్న మొండివాడికి కూడా ఆనందం కలిగిస్తుంది. ఈ వీణా ధ్వనులు మూలమూలల ఉన్న మూగ జీవుల్నీ కదిలిస్తాయి. ఇలాంటి సన్నివేశాలు అరణ్యాలలో అక్కడక్కడ కనిపిస్తుంటాయని పద్య తాత్పర్యం.

చివరి సీస పద్యంలో 'యమునానదిలో నిత్యం వస్తున్న అలలు, అప్పుడే మొలకెత్తిన మొక్కలు, పాలు తాగే శిశువు, లేత చిగురాకుల రుచి చూసిన కొంగలు, కోకిలలు ఎర్రని కంఠాలు, పండు వెన్నెల చుక్కలు బూర వాయిద్యానికి ఆనంద పరవశమైతాయి. అని మరచిపోయిన సంగీత వాద్య వీణ గురించి కవి అద్భుతంగా వర్ణించాడు. సంగీతం నేటి సమాజంలో మరుగున పడుతున్న దుస్థితిని మనం చూస్తున్నాం. దాన్ని కాపాడుకునే బాధ్యత ఎంతైనా ఉందన్న విషయాన్ని కవి ఇందులో తెలిపారు. ఇలా ప్రకృతి ధర్మాన్ని, కళల జౌన్నత్యాన్ని నిరంతరం రక్షించుకోవాలని *'విస్మృత వేణుగీతి'* అనే కవిత ద్వారా కవి ఆకాంక్షించాడు.

## 2.9.7. శమీపూజ

అనంతకృష్ణశర్మ రాసిన ఈ కవిత *'గ్రంథాలయ సర్వస్వము'* (1941) సంచిక: 2, సంపుటం:1.లో ముద్రించబడింది. శమీపూజ అంటే జమ్మిచెట్టుకు చేసే పూజ అని అర్థం. ఈ కవితలో గ్రామీణ ప్రజల పండగ ఆచారాలు ప్రస్ఫుటంగా చెప్పబడ్డాయి. భారతీయ సంప్రదాయం ప్రకారం దసరా పండగా రోజు గొప్ప భక్తి శ్రద్ధలతో జమ్మి చెట్టుకు ఘనంగా పూజ చేసే విధానానికి ఈ కవిత అద్దం పడుతుంది. ఇది కూడా వృత్త పద్యాల్లోనే రాయబడింది. మొత్తం ఐదు పద్యాల్లో ఉదాహరణకు ఒకటి చూద్దాం.

ఉ. ***"రంగులు పూసి తెచ్చిన తురంగములెక్కి సవారి చేసి నీ***
***ముంగలఁ బందెమాడఁ దలపోయను; నీ ముది గొమ్మలందు మీఁ***
***దంగమనీయమౌ మరకతంబుల పోల్కి వెలుంగ పచ్చ జీ***
***రంగులఁ బట్టి యాడుటకు రానిటు చేర శమీమహీజమా!"***

దసర పండగా నాడు దాదాపు అన్ని ప్రాంతాల్లో గుర్రప్పందేలాట ఆడటం సర్వసాధారణం. గుర్రాలను రంగులతో అలంకరించి కన్నుల విందుగా స్వారీ చేస్తారు. పిల్లలు పండగ సమయంలో చెట్లపై ఉన్న జీరంగులను పట్టుకుని, వాటి మెడకు దారాలు కట్టి ఆనందంగా ఆడుకుంటారు. గ్రామాల్లో ఉండే బ్రాహ్మణులు జమ్మిచెట్టు ఆకులను తుంచి, గ్రామ వీధుల్లోకి వచ్చి ప్రజలకు ఆ పత్రిని ఇచ్చి శుభాకాంక్షలు చెప్తారు. కాగా వారితో దక్షిణలు కూడా ఇప్పించుకుంటారు. ఇది నేటికి గ్రామీణ ప్రాంతాల్లో ఉండే సంప్రదాయం.

మిగతా నాలుగు పద్యాల తాత్పర్యాలను తెలుసుకొనే ప్రయత్నం చేదాం. భగ్న భారత పరాక్రమవంతులు తమ తమ ఆయుధాలను జమ్మిచెట్టు చుట్టూ ఉంచి పూజిస్తారు. తర్వాత మనసులో పుట్టే కోరికలను తీర్చుకోవడానికి మంత్రాలను జపిస్తారు. దీని వల్ల ప్రజలు కోరికలు నెరవేరుతాయని భావిస్తారు.

భూత, భవిష్యత్, వర్తమాన కాలాల్లో ఉండే మంచి నలుదిక్కుల వ్యాపించింది. ఈ దసరా నాడు చేసే పూజలు మనిషికి ఆనందాన్ని కలిగిస్తాయి. గాండీవానికున్న అల్లెత్రాడు సంగీతాన్ని వినిపిస్తుందని కవి ఎంతో ఔచిత్యంతో చెప్పడం ముదావహం.

రాళ్ళపల్లివారి శమీపూజ కవిత గురించి కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ స్పందిస్తూ... *"వారి శమీపూజ, పెనుగొండ కొండ మొదలైన కవితలు తెలుగులో చావవు. అటువంటి గొప్ప మేధావి కవిత్వాన్ని వదిలివేసే ననగా ఆంధ్ర సరస్వతి దుఃఖించ వలసిన విషయం."*[36] అని అభిప్రాయపడ్డారు.

### 2.9.8. భారతికి సాధువాదము

ఈ అనే శీర్షికతో రాళ్ళపల్లివారు పది ఆటవెలది పద్యాలు రాశారు. ఇది భారతి, జనవరి. 1949లో అచ్చైయ్యింది. ఇందులో పాతికేళ్ళు పూర్తి చేసుకొన్న ప్రసిద్ధ 'భారతి' పత్రిక పురోభివృద్ధిని కొనియాడారు. ఈ పత్రిక నాణ్యత, స్థాపక నిర్మాత ఓపిక, బాధ్యత చాలా గొప్పవి. దీని పటిష్టతా వెరసి అది నింపే చైతన్యం మెచ్చుకోదగ్గవి. అంతేకాకుండా ఆయా అంశాలకు కల్పించే ప్రాధాన్యం అందరికి సమ్మతంగా ఉంటుంది. కాగా పత్రిక సూక్ష్మ దృష్టి, నిష్పాక్షిక ధోరణి వంటి అనేక లక్షణాలను ఎకరు పెడుతు శర్మగారు శ్లాఘించారు. ఆ ఆణిముత్యాల్లాంటి వాటిలో ఉదాహరణకు ఒకటి...

ఆ. ***కళల సొంపు, శాస్త్రముల తెంపు, సౌభ్రాత్ర***
***కలన పెంపు, జాతి గౌరవంబు***
***నింపుఁ దెలుగువారి కెల్ల నెత్తిన చేయి***
***దించకుండ వెల్లడించినావు*** .

పద్యంలో తెలుగువారి కళల సౌందర్యాన్నీ, శాస్త్రాల తెగువనీ, సోదరత్వంతో జ్ఞానాన్ని పెంచీ, జాతికి గౌరవాన్ని నింపి, తెలుగువారికి అండగా ఉండి కావాల్సిన వాటిని సంపూర్ణంగా

[36] రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ శతజయంతి సంచికలో ఉల్లేఖింపబడింది. పుట. 59.

వెల్లడించిందని 'భారతి' పత్రిక ఔన్నత్యాన్ని కవి చాటిచెప్పాడు. ఇందులో ఉన్న ప్రతి పద్యం మనసుకు హత్తుకొనేలా ఉంటుంది. ఆద్యంతం పత్రికా వైశిష్ట్యాన్ని తన దైన శైలిలో ప్రశంసించారు.

### 2.9.9. ప్రబంధకవి

రాళ్ళపల్లివారు రాసిన కవిత 1950లో *'గ్రంథాలయ సర్వస్వము'* (సంచిక: 3, సంపుటి: 2) లో ప్రచురితమైంది. ఈ కవితలో ప్రబంధ సాహిత్యాన్ని విమర్శించడం జరిగింది. ఓ వృద్ధుడైన ప్రబంధ కవితో సంభాషించిన విధానం ఇక్కడ కనబడతుంది. 'ఎంతో పాండిత్యం సంపాదించావు. కానీ మా అభిరుచుని తెలుసుకోలేక పోయావు. మాకు అర్థం కాని పద్యాలను విరివిగా రాశావు. పైగా వాటిని వినిపించడానికి అనేక చోట్లకు తిరుగుతావు. తేట తెలుగు రచనల్నీ ఆశించేమమ్మల్ని తాటాకు ప్రతులను చూడమంటావు. మీ భాషలో గొప్పతనాన్ని చూసే కళ్ళు ఇప్పుడు మాలో ఎవ్వరికి ఉన్నాయి. లోతైన భావాల్నీ, తుదిమొదలు లేని అనేకార్థాల్నీ, నోరే తిరగని పద్యాల్నీ పెద్ద ఎత్తున రాస్తావు. కానీ వీటి అర్థాలను తెలుసుకోవడానికి ఈ కాలంలో ఎవ్వరున్నారు. వీటిని మరిచిపోకుండా ఏదైనా గొప్ప మార్గాన్ని చూపించమని' ప్రబంధ కవుల రచనలను దృష్టిలో పెట్టుకొని రాసిన కవితలో కొన్ని పంక్తులిలా...

***"ఇంత వృద్ధుడవంతయు నెరిగినావు – తెలిసికో జాలవేమి మా తెలివిలేమి?***
***అర్థమేకాని పద్యములల్ల నేల? - వీధి వీధుల విను వారి వెదక నేల?***
***అచ్చు తేటలకాసించు నట్టి మమ్ము – తాటి యాకుల కంతలో దార్చ గలవె?***
***పూత లేనట్టి వ్రాతలో పొలుపు నెరుగు – కన్నులెవ్వరికున్న వీకాలమందు"?........***

అంటూ.. కవిత ఎంతో ఆసక్తి కరంగా ముందుకు వెళుతుంది.

ఈ విధంగా రాళ్ళపల్లి వారి కవిత్వంలో భావాలు ఎంతో బలంగా రూపొందిన సందర్భం అడుగడుగునా కనబడుతుంది. వీరి కవితల్ని సంపూర్ణంగా చదివితే ఇప్పుడు పైన తెలిపిన అంశాల కంటే ఎక్కువ విషయాలు తెలుస్తాయి. వీరు రాసిన కవితలు సంప్రదాయమైనవీ, విలువల్నీ కాపాడేవీ, కళల్నీ రక్షించేవి, సమాజం పట్ల బాధ్యతను గుర్తు చేసేవని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. రాళ్ళపల్లివారి కవిత్వం ఎంతో ఆహ్లాద భరితంగా, ఆనంద దాయకంగా వెరసి విజ్ఞానాత్మకంగా ఉందని నిర్ద్వందంగా చెప్పవచ్చు. వీరి కలం నుండి మరిన్ని కవితలు వెలువడి ఉంటే బాగుండేది. ఇంత మంచి కవిత్వం రాసిన రాళ్ళపల్లివారు తర్వాత రోజుల్లో కవిత్వం రాయక పోవడం తెలుగు సాహిత్యం చేసుకొన్న దురదృష్టమనే చెప్పాలి.

## 2.10. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ అనువాద రచనలు

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ స్వతంత్ర రచనలు చేయడంతో పాటు అనువాద రచనలు కూడా చేశారు. ప్రధానంగా ప్రాకృత, సంస్కృత భాషలనుండి తెలుగు భాషలోకి కొన్ని రచనల్ని తీసుకొచ్చారు. శర్మగారి అనువాదాల్లో మొదటిది *'సుభాషితకౌస్తుభం'*. ఇది అలభ్యం.

లభ్యమౌతున్న శర్మగారి అనువాద రచనలు ఐదు అవి ; అజవిలాపము (1918), వేదాంత దేశికుని అభీతి స్తవము (1961), శాలివాహన గాథా సప్తశతీసారము (1964), నృత్తరత్నావళి (1969), సుందర పాండ్య విరచిత ఆర్యా (1970)వీటి ప్రత్యేకతల్నీ, అనువాద సౌష్టవాల్నీ స్థూలంగా తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం.

## 2.10.1. అజవిలాపము

లభ్యమౌతున్న శర్మగారి తొలి అనువాద రచన *'అజవిలాపం'*. ఇది *'గ్రంథాలయ సర్వస్వము'* (1918) (సం.3, సం.1) పత్రికలో *'శోకమైన శ్లోకము'* అనే శీర్షికతో అచ్చయింది. ఇది ముప్పై పద్యాల కల్పవల్లి. ఆటవెలది, తేటగీతి, కందపద్యాల్లో నిర్మించబడింది. దీని ప్రాథమిక సమాచారం ఇలా ఉంది. రఘువంశంలో అజమహారాజు ఒకరు. ఈయన పృథు మహారాజు కొడుకు. పైగా రఘు మహారాజుకి మనుమడు. ఈయనకు యుక్తవయసు రాగానే విదర్భరాజు కూతురు ఇందుమతితో పెళ్ళి చేశారు. ఈ వివాహం చేసుకోవడానికి అజ మహారాజు భయంకరమైన యుద్ధాలు చేయాల్సివచ్చింది.[37] పెళ్ళి చేసుకున్న నవ దంపతులు ఆనందమయ జీవితాన్ని గడుపుతున్న సందర్భంలో ఇందుమతి తన ప్రాణాలను కోల్పోతుంది. అప్పుడు అజమహారాజుకు విపరీతమైన దుఃఖ కలుగుతుంది. ఆ సందర్భంలో పడిన బాధ వర్ణనాతీతం. ఈ శోకాన్ని కాళిదాసు సంస్కృతంలో *'రఘువంశము'* కావ్యంగా తీర్చిదిద్దాడు. దీని ఆధారంగా శర్మగారు కొన్ని పద్యాలను అనువాదం చేసి *'అజవిలాపము'* అని పేరు పెట్టారు. ఆటవెలది, తేటగీతి పద్యాలతో ఇది ఎంతో రమణీయంగా ఉంది. అజుడు పడిన బాధను శర్మగారు హృదయానికి హత్తుకొనేలా తెలిపారు.

స్వయంవరంలో వివాహం చేసుకున్న ఇందుమతి అకాలమరణాన్ని జీర్ణించుకోలేని అజమహారాజుకు కలిగిన బాధను శర్మగారు ఈ పద్యం ద్వారా తెలిపారు.

తే. ***ఈ కుసుమమాలికయ చంపు నేని, యేల***
***నన్నుఁ జంపద యెదు నిడికొన్నఁ గాని?***
***విషము సమృతంబయగు నొక్క వేళ, నమృత***
***మేని యంవిషయంబగునే యీశ్వరేచ్ఛ!*** (గ్రంథాలయ సర్వస్వము, పుట: 4)

అజమహారాజు మాట్లాడుతూ ' తన భార్య చనిపోయి నన్ను కూడా చంపిందని ఆవేదన చెందాడు. ఓ సందర్భంలో విషం అమృతంగా, అమృతం విషంగా మారుతాయి అంటూ, ఇదంతా ఆ ఈశ్వరుని మాయ అని మహారాజు పశ్చాత్తాపానికి గురై సాంత్వనం చెందుతాడు.

మరో పద్యంలో కవి అజమహారాజు విరహన్ని చూడండి.

తే. ***కొయిలలయందు ముద్దుఁబల్కులు, మరాళ***
***కాంతలందు మదాలసగతులు, లేఁడి***

[37] https://te.wikipedia.org/wiki

***కన్ని యలయందుఁ జలకటాక్షములు, పవన***

***చలితలతలందు విభ్రమ విలాసములు*** (అజవిలాపము: పుట : 4)

ప్రకృతిలో ఉన్న జీవరాసులను పేర్కొంటూ, గొప్ప ఉపమానాలతో ఆలంకారికంగా రాసిన పద్యమిది. వసంత కాలంలో కోయిలలు మధురమైన కంఠంతో చేసే ధ్వనులు ముద్దుపలుకులని భావించాడు. అందమైన మగువల గుసగుసలను జింకల కళ్ళల్లో కలాపాలను, ఆ మేఘాల గర్జనలను మరిచి ఆకాశానికి వెళ్ళాయంటున్న ఆ శోకాతప్తాన్ని కవి స్పృశింపజేశారు.

కాళిదాసు కవిత్వం ఎంతో గొప్పగా ఉంటుందని శర్మగారు చెబుతూ, దానికి ఎవరూ సాటిరారు. ఆయనలా రాయాలంటే పునర్జన్మ ఎత్తాలని కింది పద్యంలో స్పష్టపరిచారు.

***మ. "పదపుష్టిం బరికించి శబ్దవిధులం బాటించి యర్థంబులన్***

***గొదుకుల్ పుట్టక తిద్ది, భావముల నిక్కుల్ సూచి పద్యంబులన్***

***బొదిగింపన్ గల మింతె కాని యదియేమోతక్కువై తోచునా***

***కొదువం దీర్చు కవిత్వ బీజమది మాకుం జిక్కునో చిక్కదో"*** [38]

ఈ విధంగా శర్మగారు తనకు తానే కొన్ని కట్టుదులను విధించుకొని కొన్ని రచనలను బయటికి పెట్టకుండా చింపివేశారని తన రెండో కుమారులు ఆర్. ఏ. జయంత నవంబర్ 4, 2014న నేను చేసిన వ్యక్తిగత ఇంటర్వ్యూలో చెప్పారు.

అనంతకృష్ణశర్మ రాసిన ఈ 'అజవిలాపము' లోని పద్యాలన్నీ మనసుకు హత్తుకొనేలా ఉన్నాయి.

## 2.10.2. అభీతి స్తవము

రాళ్ళపల్లివారి మరో అనువాద రచన 'అభీతి స్తవము'.(స్తోత్రము) దీన్ని సంస్కృతంలో వేదాంత దేశికులు రాశారు. ఈయన రామానుజుల విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని నమ్మిన వ్యక్తి. తమిళ, సంస్కృత భాషలల్లో అనేక గ్రంథాలు కూడా రచించిన గొప్ప పండితుడు. వీటిలో వైష్ణవ క్షేత్రాలలో ఆయా దేవుళ్లపై ఉండే స్తోత్రాల విశిష్టత ఉంది. ఈ స్తోత్రాలన్నీ భక్తి శ్రద్ధలకు నిదర్శనంగా రచింపబడ్డాయి. ఎన్నో దార్శనిక విశేషాలను తెలియజేయటంలో ఈయన సిద్ధహస్తులు. చిన్నా, పెద్ద క్షేత్రాల స్తోత్రాలను వేదాంత దేశికులు లోతుగా చర్చించారు. ఇవన్నీ విజ్ఞానానంద దాయకాలుగా ఉండటం విశేషం.[39]

రాళ్ళపల్లివారు అనువాదం చేసిన ఈ కవిత 1921 సెప్టెంబర్ లో భారతి పత్రికలో ప్రచురింపబడింది. ఇందులో 30 పద్యాలు ఉన్నాయి. దీని పూర్వ వృత్తాంతం పరిశీలిస్తే! తెలిసే కొన్ని విషయాలు ఇలా ఉన్నాయి. 14వ శతాబ్దంలో మహమ్మదీయులు శ్రీరంగ క్షేత్రంపై దండెత్తి ఆక్రమించారు. ఆ ఘటనలో చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ సమయంలో

[38] రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మసాహిత్య సేవ – సవిమర్శక సమీక్ష. పుట. 38.

[39] భారతి పత్రిక 1922 సెప్టెంబర్ . పుట. 25.

ఉత్సవ మూర్తిని భూవిగ్రహాలతో తీసుకొని పోయారు. అప్పుడు ఆ మూర్తిని రక్షించటం అక్కడివారికి సహసమైంది. ఆనాటి వీర వైష్ణవులు మహమ్మదీయుల నుండి శ్రీ రంగాన్ని విడిపించి, మరల శ్రీ రంగనాథున్ని ప్రతిష్ఠించిన మహాకార్యం శాసనబద్ధమై ఉంది. ఇది హిందువులకు విప్లవ కాలంగా భావించబడింది. ఆ విప్లవ సమయంలో తప్పించుకొని బైటపడినవారిలో ఈ వేంకటనాథ మహాకవి ఒకరు. శ్రీ రంగనాథుని పునః ప్రతిష్ట సిద్ధికి ఈయన ప్రయత్నం బాగా పనిచేసింది. ఈ శాసనం కూడా ఈయన రచించిందే. ఈ మహా భయానక కాలంలో అభయ ప్రార్ధనగా వేదాంత దేశికుడు 'అభీతి స్తవము' అనే గొప్ప కావ్యాన్ని రాశాడు. దీన్ని రాళ్ళపల్లివారు తెలుగులోకి అనువదించారు.

శర్మగారు ఈ అనువాదం వృత్త పద్యాల్లో నిక్షిప్తమై ఉంది. ప్రతీ పద్యంలోనూ శ్రీరంగనాథుణ్ణి ధ్యానించినట్లు వుంటుంది. ప్రస్తుతం వేదాంత దేశికుడు రాసిన గ్రంథం అందుబాటులో లేదు. కాబట్టి శర్మగారి అనువాదంలో ఉన్న విశేషాలను మాత్రమే తెలుసుకొందాం. అనువాదం చేయాలంటే కవికి మూల, లక్ష్య భాషలలో అపారమైన జ్ఞానం ఉండాలన్నది విధితమే. అలాంటి జ్ఞానం రాళ్ళపల్లివారికి సంపూర్ణంగా ఉందని చెప్పవచ్చు. అనంతకృష్ణులవారు ఇందులో శ్రీరంగనాథున్ని ధ్యానించిన పద్ధతిని చూడవచ్చు.

***చ. "అది మదిఁగొల్చు వారి కభయంబిదు; నొల్ల నివారికిన్ భయం***
***బది గలిగించుఁ; దక్కటి భయాభయదాతలు దాని లెంక; ల***
***య్యది విధి శంభు శక్రముఖలందఱ మీఱిన తేజ; మిందిరా***
***హృదయ సఖంబు; దాని భజియింతుమ చింత్యము రంగధుర్యమున్"***

(అ. స్త: పుట: 25)

ప్రతి ఒక్కరికి భయం సహజంగానే ఉంటుంది. శ్రీరంగనాథుణ్ణి మనసులో ధ్యానిస్తే ఆ భయం పోతుందనీ. కాబట్టి చేతిలో శంఖ చక్రాలు ధరించిన శ్రీరంగనాథుణ్ణి తలచుకొంటే మంచిదౌతుంది. అలాగే హృదయంలో మనస్ఫూర్తిగా ధ్యానిస్తే మరిన్ని శుభాలు కలుగుతాయని పద్య భావార్థం.

శ్రీరంగనాథుడిని పూజించే క్రమంలో మరో పద్యాన్ని శర్మగారు ఇలా అనువదించారు.

మ. ***"రవిచంద్రాగ్నుల రూపమై, తమము బాఱం ద్రోవఁగాఁ జాలి, స***
***ర్వ విధాస్త్రంబుల నాత్మలోఁ గొని, సుర ప్రద్వేషులం జీల్చుచున్,***
***దివిజాళిం దన వెంట ద్రిప్పెడు ప్రథాదీప్రంబు చక్రంబు శ్రీ,***
***ధవ! నీదౌ పెనువీటిలో నడుపుఁగాతన్ ధర్మచక్రస్థితిన్***

(అభీతి స్తవము: పుట: 33)

సూర్య చంద్రుల వంటి రూపం కలిగి ఉండటం వల్ల శ్రీ రంగనాథుడు తమ భక్తుల పాలిట చంద్రుని చల్లదనాన్ని ప్రసరించినట్లు వెలుగు ఒకేలా ఉన్న వాటిలో వ్యత్యాసాలున్నాయి. ఈ పద్యంలో దేవుని దీవ్య స్వరూపాన్ని ఆవిష్కరించారు.

ఈ విధంగా రాళ్ళపల్లివారు ఇందులో పద్యాలన్నిటిని ఎంతో రమణీయంగా, రసవంతంగా రచించారు. ఆకట్టుకొనే పదాల పొందిక, చక్కనైన అలంకారాల సౌష్టవంతో శర్మగారు ఈ అనువాదాన్ని రక్తికట్టించారు.

## 2.10.3. శాలివాహన గాథాసప్తశతీ సారము

*'గాథాసప్తశతి'* అనే గ్రంథాన్ని 17వ శాతవాహన రాజైన హాలుడు ప్రాకృత భాషలో సంకలితం చేశాడు. ఈ గ్రంథం ప్రపంచ సాహిత్య చరిత్రలో గొప్ప పేరు ప్రఖ్యాతులు పొందింది. 19వ శతాబ్దంలో సాహిత్య విద్వాంసుల దృష్టిని బాగా ఆకర్షించింది.1870లో తొలిసారి వెబర్ అనే జర్మన్ పండితుని వల్ల జర్మన్ భాషలోకి అనువాదమయ్యింది. అప్పటి నుండి ఈ గ్రంథం అనేక భాషల్లోకి తర్జుమా కాబడింది. ఈ గాథల్ని సాహితీవేత్తలూ, లక్షణ గ్రంథకర్తలు తమ పుస్తకాల్లో ఉదహరించడం మొదలు పెట్టారు. *'గాథాసప్తశతి'* సౌందర్యానికి ఆకర్షితులైన ఎంతో మంది తెలుగు కవులు, రచయితలు దీన్ని సంపూర్ణంగానూ, పాక్షికంగాను అనువదించ సాగారు. ముఖ్యంగా రాళ్ళపల్లివారు *'గాథాసప్తశతి'*లోని 700 గాథల్ని తెనిగించి *'శాలివాహన గాథాసప్తశతీ సారము'* అనే పేరు పెట్టారు. దీన్ని 1964లో ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రచురించింది.

ప్రస్తుతం శర్మగారిలాగా కొందరు రచయితలు *'గాథాసప్తశతి'* ని సంపూర్ణంగా అనువదించడం జరిగింది. వీటన్నిటిని స్థూలంగా పరామర్శించడం వల్ల ఆయా అనువాద కౌశలాలు తెలిసి వస్తాయి.

గాథాసప్తశతిని తొలి సారిగా తెలుగులోకి ఎవరు అనువాదం చేశారని ప్రశ్నించుకుంటే, స్ఫురించేది శ్రీనాథ మహాకవి. ఈయన 'నూనూగు మీసాల నూత్న యౌవ'నమున శాలివాహన సప్తశతినుడివితి' అన్నారు. కానీ ఆ గ్రంథం సంపూర్ణంగా లభించలేదు. కీ. శే. మానవల్లి రామకృష్ణ కవి తన నన్నెచోడుని *'కుమార సంభవము'*(1912) పూర్వభాగం నాల్గవ ఆశ్వాసంలో మూడు పద్యాలు ఉటంకించినట్లు శర్మగారు సూచించారు.[40]

అయితే ఇంతటి ప్రసిద్ధి చెందిన గాథాసప్తశతి సంపూర్ణ అనువాదాలు మొట్టమొదటగా ఎవరు చేశారు? అలాగే పాక్షిక అనువాదాలు ఎవరు చేశారు?అనే విషయాలను స్థూలంగా తెలుసుకోవడం వల్ల ఆయా అంశాలు స్పష్టంగా బోధపడతాయి.

### 2.10.3.1. తెలుగులో '*గాథాసప్తశతి*'సంపూర్ణ అనువాదాలు – వాటి విశేషాలు

దొరికిన ఆధారాలను బట్టి చూస్తే తెలుగులో ఇంతవరకు *'గాథాసప్తశతి'* ని సంపూర్ణంగా అనువదించిన వారిలో గట్టి లక్ష్మీనరసింహశాస్త్రి, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, వాసిరెడ్డి వేంకటసుబ్బయ్య, దీవి సుబ్బారావు, కోడూరు ప్రభాకరరెడ్డి పేర్లు వినిపిస్తాయి. వీరి అనువాదాల ప్రాథమిక సమాచారాన్ని తెలుసుకొని తదుపరి అంశాలను పరిశీలించడం సముచితం.

---

[40] శాలివాహన గాథాసప్తశతీ సారము పీఠిక – రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ. పుట. xxv.

### 2.10.3.1.1. గట్టి లక్ష్మీనరసింహశాస్త్రి: *'గాథా సప్తశతి'*

గట్టి లక్ష్మీనరసింహ శాస్త్రి *'గాథాసప్తశతి'* ని 1946లో సంపూర్ణంగా అనువాదం చేశారు. దీన్ని కళ్యాణి ప్రెస్ అకాడమీ, తెనాలి వారు *'గాథా సప్తశతి'* (హాల శ్రీ శాతవాహన ప్రాకృత గాథా సప్తశతికి ఆంధ్రానువాదము) అనే పేరుతో 1956లో తొలిసారిగా ప్రచురించారు. ఈ పుస్తకాన్ని ఆద్యంతం పరిశీలిస్తే వీరు అనువదించిన తీరు తెన్నులు తెలుస్తాయి. శాస్త్రిగారు ఈ అనువాదానికి తీసుకున్న ఆధారాలను ఇలా పేర్కొన్నారు.''*గాథాసప్తశతి'* మధురానాథశాస్త్రి వ్యాఖ్యను అనుసరించి తన అనువాదం కొనసాగుతుందని దీని రాయడానికి ప్రేరణ ఈ గాథల్లో ఉన్న ఉదాత్తమైన విషయాల్ని బయటికి తీయాలనే ఆసక్తే ప్రధాన కారణమని చెప్పుకున్నారు.''[41] 217 పుటలు కలిగిన ఈ పుస్తకం ఏడు శతకాలుగా (అధ్యాయాలు) విభజించారు. మొత్తం 700 గాథల్ని పొందుపరిచారు. ఈ అనువాదాన్ని వీరు ఉపజాతి, వృత్తపద్యాల్లో పూర్తిచేశారు. ప్రతి పద్యానికి ముందు భావార్థాన్నిచ్చి తర్వాత గాథ అనువాదం ఇవ్వడం జరిగింది.

### 2.10.3.1.2. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ:*'శాలివాహన గాథాసప్తశతీ సారము'*

గట్టిలక్ష్మీ నరసింహశాస్త్రి కంటే ముందే రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ 395 గాథల్ని అనువాదం చేశారు. వీటిని 1931లో అనంతపురం శ్రీ సాధన ముద్రణాలయం *'శ్రీ శాలివాహన గాథా సప్తశతీ సారము'* అనే పేరుతో అచ్చులోకి తీసుకొచ్చింది. తర్వాత కొంత కాలానికి శర్మగారు మరిన్ని గాథల్ని అనువదించారు. ఇవి మొత్తం 738 గాథలు అయ్యాయి. వీటన్నిటిని కలిపి సంపూర్ణంగా 1964లో ఆంధ్ర సారస్వత పరిషత్తు *'శ్రీ శాలివాహన గాథా సప్తశతీ సారము'* పేరుతో ప్రచురించింది. శర్మగారు ఈ పుస్తకంలో 395 గాథలకి హాలుని ప్రాకృత గ్రంథాన్ని పరిశీలించి, మూల సౌష్ఠవం చెడిపోకుండా తెలుగు చేశారు. తర్వాత 1870లో వచ్చిన వెబర్ (webar) పండితుని అనువాదం లోని గాథల్ని కూడా తర్జుమా చేశారు. శర్మగారు తన అభిరుచికి అనుగుణంగా ఉన్న వాటిని మాత్రమే అనువదించినట్లు తమ గ్రంథ పీఠికలో తెలిపారు.[42] ఈ గ్రంథానికి కట్టమంచి రామలింగారెడ్డి పీఠిక రాశారు. రాళ్ళపల్లివారు ఆటవెలది, తేటగీతి, కందం అనే ఉపజాతి పద్యాలతో ఎంతో సరళంగా అనుదించారు. అక్కడక్కడ కొన్ని గాథలకి పాదసూచికలు ఇచ్చి వాటి విశేషాలను ఉటంకించారు. అలాగే ప్రతి గాథకి ప్రాకృత భాషలోని సంఖ్యను ఇచ్చారు. మొత్తం నాలుగు భాగాలుగా విభజించిన ఈ పుస్తకం 201 పుటలల్లో ఇమిడి ఉంది. ఈ పుస్తకాన్ని శర్మగారు తమ గురువు కట్టమంచి రామలింగారెడ్డిగారికి అంకితమిచ్చారు.

---

[41] గాథా సప్తశతి. గట్టి లక్ష్మీనరసింహ శాస్త్రి . పుట. 18.

[42] శాలివాహన గాథా సప్తశతి సారము. పుట. Xxviii.

### 2.10.3.1.3. వాసిరెడ్డి వేంకటసుబ్బయ్య : *'గాథా సప్తశతి'*

వాసిరెడ్డి వేంకటసుబ్బయ్య 700 గాథలను తెలుగులోకి అనువదించారు. వీటికి అనుబంధంగా ప్రాకృత, సంస్కృత భాషా గాథలను కలిపి పొందుపరిచారు. ఈ గ్రంథం *'గాథా సప్తశతి'* పేరుతో 1968లో అచ్చులోకి వచ్చింది. దాదాపు 309 పుటల గ్రంథమిది. రచయిత ఇందులో గాథల్ని ఏడు శతక భాగాలుగా విభజించారు. ప్రాకృత గాథలతో పాటు తెలుగు పద్యాలకు అకారాది సూచికను కూడా జతచేశారు. గాథలన్నీ ఆటవెలది ఛందస్సులో ఉన్నాయి. అలాగే ప్రతి గాథకి ముందు భావార్థం ఇచ్చి, తర్వాత అనువాద గాథని పొందుపరిచారు. అయితే ఈయన ఏ పుస్తకాల ఆధారంగా ఈ అనువాదం చేశారన్న విషయాన్ని తెలుపలేదు.

### 2.10.3.1.4. దీవి సుబ్బారావు: *'గాథా సప్తశతి'*

దీవి సుబ్బారావు ఏకంగా 820 గాథల్ని అనుదించారు. మొత్తం కోటి గాథల్లో ప్రాచుర్యంలో ఉన్న వాటిని తీసుకోవడం వల్ల 700 కంటే ఎక్కువ దొరికి ఉండవచ్చు. వీటిని సులభమైన వచనంలోకి తీసుకోరావడం విశేషం. గాథల్ని మొత్తం 2012లో *'ప్రాకృత గాథా సప్తశతి'* అనే పేరుతో పుస్తక రూపంగా తీసుకొచ్చారు. ఈయన గాథలన్నిటిని ఏడు శతక భాగాలుగా విభజించారు. సుబ్బారావు వివిధ వ్యాఖ్యాతల గ్రంథాల్లోని గాథలనూ, తెలుగు ప్రాంత మూల ప్రతిలోని గాథలనూ, ప్రాచీన ఆలంకారిక పుస్తకాల్లోని గాథలన్నిటిని తేలికైన వచనంలో రాశారు. అందులోని లఘుటీక పేర్లూ, ఆయా కవులూ, కవయిత్రుల నామాలను స్పష్టంగా పొందుపరిచారు. అంతేకాకుండా గాథల సంఖ్యకు అనుమానాలకు తావివ్వకుండా పేర్కొన్నారు. వీరి అనువాదం వచన కవిత్వం చదివినంత హాయిగా ఉంటుంది.

### 2.10.3.1.5. కోడూరు ప్రభాకరరెడ్డి : *'గాథాత్రిశతి', 'గాథాచతుశ్శతి'*

కోడూరు ప్రభాకరరెడ్డి *'గాథా సప్తశతి'* ని *'గాథాత్రిశతి'* (2013) *'గాథాచతుశ్శతి'* (2016) అనే పేర్లతో ప్రచురించారు. ఈయన అనువాదం ముందు వారి కంటే భిన్నంగా ఉంది. రాళ్ళపల్లివారి గ్రంథాన్ని ప్రధాన ఆకరంగా పెట్టుకొన్నారు. అంతేకాదు గాథాసప్తశతిపై వచ్చిన గ్రంథాలన్నిటిని దాదాపుగా పరిశీలించారు. ఈయన అనువాదంలో ప్రతీ గాథకి ప్రాకృత రూపాన్నీ సంస్కృత ఛాయను ఇచ్చారు. ఒక్కో గాథ సందర్భాన్నీ, భావాన్ని కూడా స్పష్టంగా పేర్కొన్నారు. అలాగే ప్రాకృత గాథలోని విశేషార్థాన్ని వివరించారు. పలువురి విద్వాంసుల అభిప్రాయాల్నీ క్రోడీకరించారు. సంస్కృత, తెలుగు, ఉర్దూ, హిందీ మొదలైన కవుల కవితల్ని అక్కడక్కడ ఉదహరించారు. రెడ్డిగారు ప్రతి గాథకు ఇంగ్లీషు అనువాదం కూడా సంతరించి పెట్టారు. పద్యానికి అర్థాన్ని స్ఫురింపజేసే శీర్షికను కూడా స్పష్టించారు. ఈ విధంగా ప్రాచీన కావ్యాల్నీ ఆస్వాదించలేని పాఠకులు కూడా సులభంగా అర్థం చేసుకొనే విధంగా వీరి అనువాదం రూపొందిందని చెప్పవచ్చు.

## 2.10.3.2. తెలుగులో'గాథాసప్తశతి'అసంపూర్ణ అనువాదాలు–వాటి వివరాలు

ప్రసిద్ధ *'గాథా సప్తశతి'* ని తెలుగులో కేవలం ఐదుగురు రచయితలు మాత్రమే సంపూర్ణంగా అనువాదం చేసినట్లు పైన తెలుసుకొన్నాం. అయితే ఈ ఉద్గ్రంథానికి ఎంతో మంది సహృదయులు ఆకర్షితులైనారు. అనేక మంది కవులు, రచయితలు, విమర్శకులు ఈ గాథల్ని తమ అభిరుచి మేరకు అసంపూర్ణంగా అనువదించినప్పటికీ అనువదించిన వాటితోనే పేరు ప్రఖ్యాతులు గడించారు. వాటి విశేషాలను ఇక్కడ తెలుసుకొందాం.

- *'గాథాసప్తశతి'* లో ఉన్న గాథలు కాళిదాసు లాంటి మహాకవులను సైతం ఆకర్షించించాయనడంలో అతిశయోక్తి లేదు. అయితే మన తెలుగులో ఓం ప్రథమంగా శ్రీనాథుడు ఈ గాథల్నీ అనువాదం చేసినట్లు తెలుస్తుంది. కానీ వీరి గాథలు అందుబాటులో లేవు. ప్రస్తుతం అందులో మూడు పద్యాలు మాత్రమే కీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రి ప్రకటించిన క్రీడాభిరామంలో కనిపిస్తున్నాయని కోడూరు ప్రభాకరరెడ్డి తన *'గాథాత్రిశతి'* లో తెలిపి వాటిని ఉదహరించారు.[43]
- పెదకోమటి వేమభూపాలుడు 100 గాథల్ని, స్వామి శివశంకరులు 100 గాథల్ని తెలుగు చేశారు. మదాచార్య రఘునాథ చక్రవర్తి గొల్కొండ పత్రికలో, శే. సం. రాఘవయ్యంగార్ తమ *'అలంకార మంజరి'* లో, శ్రీమాన్ వేదాల తిరువేంగళాచార్యులు, పంతుల లక్ష్మీ నారాయణశాస్త్రులు తమ *'ధ్వన్యాలోకంలో'*కొన్ని గాథల్ని అనువాదం చేశారని పి. టి. యన్ రామచంద్రాచార్య పేర్కొన్నారు.[44]
- వేటూరి ప్రభాకర శాస్త్రి 25 గాథల్నీ, కూచిభట్ల ప్రభాకర శాస్త్రి, వీర రాఘవశాస్త్రి సోదరులు 312 గాథల్నీ, యల్. ఎన్. కే. వెంకటచార్య 300 గాథల్నీ, తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రి 100 గాథాల్నీ, దిగుమర్తి సీతారామస్వామి 104 గాథల్నీ అనువాదం చేశారు. నరాల రామిరెడ్డి *'గాథాత్రిశతి'* లో 300 గాథల్ని అనువాదించి 2012లో ప్రచురించారు. ఇవన్నీ పద్యానువాదాలుగా కనిపిస్తాయి. తిరుమల రామచంద్ర 'ప్రాచీన గాథలు' పేరుతో అనుదిస్తే అది వచనానువాదంగా ప్రసిద్ధి చెందింది. పోలవరపు కోటేశ్వరరావు *'నాటి గాథలు- నేటి కథలు'* పేరుతో అనువాదం చేశారు. తల్లావఝ్ఝల పతంజలిశాస్త్రి *'అడవిపూలు'* గా వచన కవితానువాదం చేశారు. పాలంకిసత్య *'శృంగార గాథాలహరి'*, *'ఆనాటి గాథలు'* గా అందించిన వాటిలో కొన్ని గాథలున్నాయి. కసిరెడ్డి వెంకటరెడ్డి 'ఆంధ్రప్రదేశ్' మాసపత్రికలో అనేక గాథలను కథనరూపంలోకి తెచ్చారు. అందులో 13 గాథలు *'అమాస పున్నాలు'* పుస్తకంగా వచ్చాయని టి. సతీష్ తన ఎం.ఫిల్ సిద్ధాంత వ్యాసంలో పేర్కొన్నారు.[45]

---

[43] గాథాత్రిశతి (భూమిక) పుట. 37–38.

[44] భారతి పత్రిక (గాథాసప్తశతి అనువాదాలు) 1964 మే. పుట:43.

[45] గాథా సప్తశతి – శృంగారేతర రసాలు (టి. సతీష్. అముద్రిత సిద్ధాంత వ్యాసం) పుట : 8–9.

### 2.10.3.3. తెలుగులో *'గాథా సప్తశతి'* పై జరిగిన పరిశోధనలు

- గాథా సప్తశతిపై అనేక పరిశోధనలు జరిగాయి. వాటిని స్థూలంగా తెలుసుకొందాం. లభ్యమౌతున్న ఆధారాలను బట్టి *'గాథాసప్తశతి'* పై పరమానంద్ శాస్త్రి తొలి పరిశోధన చేశారు. దీన్ని హిందీ సప్తశతి అనువాదం పాటు 1965లో ప్రచురించారు. తర్వాత హరిరాం దీనిపై *'మహాకవి హాల్ ఔర్ గాహాసత్తసఈ'* పేరుతో 1976లో పిహెచ్.డి., పరిశోధన చేశారు. విదేశాల్లో కూడా 'HERMAN TIECKEN' (నెదర్లాండ్) పిహెచ్.డి., చేశారు. మన తెలుగు ప్రాంతంలో కె. కమల సంస్కృత విభాగంలో 'Everyday life in Ancient India As Depicted in Prakrit Literature' అనే పేరుతో ఉస్మానియా విశ్వవిద్యాలయానికి తమ పిహెచ్.డి., సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. అనపాటి సుబ్బరాయుడు 2001లో *'గాథాసప్తశతి – సౌందర్య గాథ'* అనే శీర్షికతో శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పరిశోధన చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉషాశ్రీ చౌహన్ అనే పరిశోధకురాలు 'తెలుగులో *గాథా సప్తశతి – ఒక పరిశోధన*' పేరుతో 2010లో ఎం. ఫిల్. చేశారు.[46]
- టి. సతీష్ *'గాథా సప్తశతి – శృంగారేతర రసాలు'* అనే అంశంపై ఎం.ఫిల్., పరిశోధన చేసి హైదరాబాదు విశ్వవిద్యాయానికి 2012లో సమర్పించారు. ఇందులో పరిశోధకుడు శృంగారేతర రసాల చర్చను లోతైన దృష్టితో పరిశీలించారు. అలాగే ఇంతవరకు శ్రీనాథుడు అనువదించిన పద్యాలు మూడే లభ్యమయ్యాయని ముందే తెలుసుకున్నాం కానీ వీరి సిద్ధాంత గ్రంథం చదివితే ఐదు పద్యాలు లభ్యమవుతున్నాయన్న సంగతి అర్థమవుతుంది.[47]
- ఇలా అనేక మంది *'గాథా సప్తశతి'* పై ఎన్నో వ్యాసాలు కూడా రాశారు. నేడు రాస్తున్నారు. *'గాథా సప్తశతి'* పై విస్తృతంగా పరిశోధన చేసిన వారిలో తిరుమల రామచంద్ర ప్రముఖులు. వీరు వెలువరించిన *'గాథాసప్తశతిలో తెలుగు పదాలు'*, *'ప్రాచీనాంధ్ర గాథలు'* అనే గ్రంథాలు ఎంతో ప్రసిద్ధి పొందాయి.

### 2.10.3.4. గాథా సప్తశతి అనువాదాలు : వస్తు విశ్లేషణ

*'గాథా సప్తశతి'* పై ఇప్పటికి ఎంతో మంది కృషిచేశారన్న విషయాల్ని స్థూలంగా తెలుసుకొన్నాం కదా. అయితే ఇందులో ఉన్న వస్తువు వైవిధ్యాన్ని పరిశీలిస్తే ఆయా అంశాలు మరింత స్పష్టంగా బోధపడుతాయి. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, గట్టి లక్ష్మీనరసింహశాస్త్రి, వాసిరెడ్డి వేంకటసుబ్బయ్య, దీవి సుబ్బరావు, కోడూరు ప్రభాకరరెడ్డిలాంటి ఉద్ధండ పండితుల అనువాదాలు చదివిన తర్వాత ఇందులో ఉన్న ఇతివృత్తం ఉత్తమమైందని అర్థమౌతుంది. మొత్తం కోటి గాథల్లో ఆంధ్ర శాతవాహన రాజు హాలుడు తనకు నచ్చిన ఏడు వందల గాథల్నిఒక చోటుకు చేర్చారని ప్రతీతి. ఈ గ్రంథంలో హాలుడు రాసిన పద్యాలు కేవలం 46 మాత్రమే

[46] గాథా సప్తశతి – శృంగారేతర రసాలు. పుటలు: 14-15.
[47] గాథా సప్తశతి – శృంగారేతర రసాలు. పుటలు. 69-74.

వున్నాయని, మిగతా గాథల్ని అనేక మంది కవులు, కవయిత్రులు రాశారని తెలుస్తుంది (కవయిత్రులు పది మంది ఉన్నారు వారి పేర్లు; అణులచ్చి, ఆసులద్ది, పవాయా, భేజ్జా, మాధవి, రేవా, రోహా, వద్దావహీ, వోహా, ససిస్సహ).

*''గాథా సప్తశతి''* లోని విషయవైవిధ్యం, రస సౌందర్యం ఎంతో మంది విమర్శకులు దృష్టిని ఆకట్టుకొన్న సంగతి విధితమే. అయితే కొందరి అభిప్రాయాలను ఇక్కడ చూద్దాం.

ఈ గాథల సౌందర్యాన్ని గురించి కట్టమంచి రామలింగారెడ్డి, రాళ్ళపల్లివారి *'శాలివాహన గాథా సప్తశతి సారము'* పీఠికలో *''ఒక్క పద్యమే వ్రాయవలెను. అది మెఱుగుతీగవలె మనల గ్రమ్మి యుండు నంధకారమును ఒక్కక్షణము పోఁద్రోలి నూతన లోకమును హఠాత్తుగ గోచరింపఁ జేయవలయును. ఆ లోకము ఒక్క నిమిషము మాత్ర మెదుటనున్న నేమి? దాని రామణీయకము జీవమునంతయు నాక్రమించి చచ్చువఱకును తదేక ధ్యానములో మునుఁగునట్లొనరించును''*[48] అన్న మాటలు విన్న తర్వాత తప్ప చదవాలనిపిస్తుంది.

మరో అభిప్రాయాన్ని చూడండి. *''ఈ గాథలలో గ్రామీణ జీవన సౌందర్యం, సాంఘిక జీవనం, శృంగారం మాత్రమేకాదు –మథించేకొద్దీ వెలికితీయగల సాహిత్య సంపద పరిశోధక మిత్రులకు లభ్యమవుతుంది.''*[49] అని విమర్శకురాలు జి. అరుణకుమారి అన్నారు. ఇలా ఎంతో మంది విమర్శకులు గాథ సప్తశతిలోని గాథలను చదివి వాటిని వేనోళ్ళ పొగడినవారే ఎక్కువ.

ఉదాహరణకు కొన్ని గాథల్లోని విశేషాలను సోదాహరణంగా పరిశీలిస్తే ఆయా సొగసులూ, సోయాగాలు మనకు కూడా అర్థమవుతాయి.

సాధారణంగా భర్త తన భార్యపై ఎంతో ప్రేమను కలిగి ఉంటాడు. జీవితంలో సగభాగమైన భార్య మరణించినప్పుడు భర్త బాధ వర్ణనాతీతం. ఆ పరిస్థితిని తెలిపే ఓ గాథను గమనించండి.

***ఆ. వె. ప్రీతి పాత్రమైన పెండ్లాము సచ్చిన***
***యింటిపాడు సూచి యేడ్వలేక,***
***చనఁడు పొలము విడిచి పనిలేకయున్నను***
***పామరుండు చూడు పల్లెకాపు: ౧౩౧*** (రాళ్ళపల్లి, పుట: 33)

ప్రాణానికి ప్రాణమైన భార్య తనకు దూరమైనప్పుడు భర్తకు ఏమీ తోచదు. పైగా తన ఇంట్లో ఒంటరిగా ఉండలేడు. ఏ పని లేకపోయిన పొలంలోనే కాలం గడుపుతున్నాడు ఓ పేద రైతు. అన్నీ తెలిసినా నీవుకూడా జీవించి ఉన్న నన్ను విడిచి తిరుగుతున్నావని ఓ నాయిక పరిహాసం చేస్తుంది. ఇటువంటి హృద్యమైన గాథలు లెక్కకు మించి ఉన్నాయి. వీటిని చదివితే ఆశ్చర్యమేస్తుంది, ఆనందం కలుగుతుంది, ఎన్నో ఆలోచనలు తలుపులు తడాతాయి. కొన్ని

[48] శాలివాహన గాథా సప్తశతీ సారము (పీఠిక) పుట. Xiii.
[49] గాథాచతుశ్శతి –కోడూరు ప్రభాకరరెడ్డి, ('సిరిచందనం' అనే ముందుమాట నుండి) పుట. 22.

గాథలైతే మన ఊహాలకు అందవు. అక్కడక్కడ సూక్తుల్లాంటి మాటలు చదువరులను మంత్ర ముగ్ధుల్ని చేస్తాయి. ఈ అనువాదాల్లో అప్పటి ప్రాకృత భాషకు అనుగుణంగా తెలుగును ఎంచుకున్న విధానం చాలా సహజంగా ఉంది. పైగా నిరక్షరాస్యులకు కూడా సులభంగా అర్థమవుతాయి. శృంగార వర్ణనలు ఉన్నా అవి పెద్దగా అశ్లీలం అనిపించవు. గాథలన్నీ ఓ కళాత్మక జీవితాన్ని సంతరించుకుని రూపొందాయి. ఈ సృష్టిలో స్త్రీ పురుష సంబంధం ఎప్పటికీ నిషిద్ధం కాదు. అప్పటి ప్రజలు ఎలాంటి అరమరికలు లేకుండా హాయిగా మాట్లాడుకొని ఆరోగ్యంగా జీవించారు. ఆనాటి ప్రజల జీవిత గాథల్ని చదివితే అంతా ప్రేమ వలయంలో విహరించినట్లు తెలుస్తుంది.

మరో గాథలో ఉన్న సంగతిని చూడండి. భర్తతో గొడవపడి విడిపోయిన స్త్రి కొన్ని రోజులకు భర్తతో కలవాలనీ, ఆయనతో మాట్లాడాలని పరితపించి పోతుంది. ఈ విరహబాధను ఆమె పతికి తెలుపమని ఒక పథికుని చెబుతున్న సందర్భాన్ని గుర్తుచేసే గాథ.

భర్త దూరమైనప్పుడు చిక్కిశల్యమైన భార్య స్థితిని వర్ణించిన పద్యమిది.

**ఆ. వె. *ఊఁరఁ గొడుకు లేకయుండఁగాఁ గోడలు***
***వచ్చి కాళ్ళ మ్రొక్క వంగినపుడు***
***గాజులెల్ల జారఁగాఁ జూచి కడుఁగోప***
***కత్తెయయ్యు నేడ్చె సత్తగారు:*** ౩౭౨ (రాళ్ళపల్లి, పుట: 93)

భర్త ప్రవాసంలో ఉన్నప్పుడు కోడలు అత్త పాదాలకు నమస్కరించింది. అప్పుడు ఆమె చేతిగాజులు జారి కింద పడిపోయాయి. ఇది చూసిన అత్త కోడలి పరిస్థితిని తలచుకొని ఏడుస్తుంది. ఇక్కడ కోడలు భర్త దగ్గర లేడనే బెంగతో సన్నబడింది. దాంతో ఆమె చేతులకున్న గాజులు వదులై జారి కిందపడ్డాయి. కొడకుపై కోడలికి ఉన్న ప్రేమానుబంధాన్ని గ్రహించి అత్త బాధపడింది. ఈ సంఘటన పాఠకుల మనసుల్ని ఆలోచింపజేస్తుంది.

ఇలా మొత్తం గాథల్ని నిశితంగా పరిశీలిస్తే ఏదో మనసుకు హాయిని కలిగించే కవిత్వం చదివినట్లు ఉంటుంది. ప్రతి గాథ సంభాషణ రూపంలో వుంటుంది. కోడలు అత్తతోనో, ప్రేయసి ప్రియునితోనో, ఎవరో ఒకరు ఇంకొకరితో ఏదో చెబుతున్నట్లు వుంటాయి. పల్లె దృశ్యాల్ని, అలాగే ప్రజల జీవన విధానాల్ని మన కళ్ళముందు కదలింపచేసే వర్ణనలు అమోగంగా ఉన్నాయి. ఇవి అన్ని స్థాయిలలోని ప్రజలకు అన్వయమైనట్టు అనిపిస్తుంది. ఈ గాథలన్నీ ధ్వని ప్రధానమైనవిగా తోస్తాయి. దేన్నీ వాచ్యం చేసి చెప్పవు. అందుకే ఆనందవర్ధనుడు, మమ్మటుడు లాంటి ఆలంకారికులు తమ గ్రంథల్లో ఈ గాథల్నీ ఉదాహరణలుగా వాడుకున్నారు. అంతేకాకుండా ఇవి కాళిదాసు లాంటి మహాకవుల్ని కూడా ప్రభావితం చేశాయంటే ఈ గాథల్లో ఎంత ఉత్కృష్టత ఉందో అవగాహన చేసుకోవచ్చు.

ఇంకో గాథలో వదినా, మరిదిల సంబంధాలు విడిపోయినప్పుడు విలువలు కలిగిన వదిన తన మరిదికి చేసిన ఉపదేశం హృదయానికి హత్తుకుంటున్నది.

ఆ.వె. *మలిన చిత్తుఁడైన మరఁదికి నిల్లాలు*
*చిన్న నవ్వు దోఁపఁ జెప్పుచుండు*
*రామువెంటఁ దిరుగు సౌమిత్రి చరితంబు*
*గోడమీఁద వ్రాసికొన్నదాని ౨™* (రాళ్ళపల్లి, పుట: 7)

ఒక పెద్ద ముత్తయిదువ నవవధువుకు ఉత్తమ ఇల్లాలి ధర్మాలను బోధిస్తున్నది. 'అశుద్ధ మనస్కుడైన మరిది మదమెక్కి వదినపై మరులుకొనగా గోడమీద లిఖించిన చిత్రాల్లో శ్రీరామచంద్రుని తమ్ముడు లక్ష్మణుడి చిత్రాన్ని చూపించి ఆతని కథను మరిదికి వివరిస్తున్నది ఓ ఇల్లాలు. పవిత్రమైన మానవ సంబంధాల్ని అపవిత్రం చేయకుండా ఉండాలని గుర్తు చేసిందీగాథ.

మన నాగరికథలన్నీ నదీ వ్యవస్థల్లో పుట్టినవే కాబట్టి ఆయా పరిసరాల్లో జరిగిన విషయాలు ఈ గాథల్లో పెద్ద మొత్తంలో లిఖింపబడ్డాయి. ఈ గాథల ద్వారా ముఖ్యంగా ఆ కాలపు ఆచార వ్యవహారాలు తెలుస్తాయి. ముట్టైన స్త్రీలు ముఖానికి నేయిలో పసుపు కలిపి రాసుకొనేవారు. శీలవంతులైన ఇల్లాండ్రు వుండేవారు. అలా కానివారు కూడా వుండేవారు. బీదరికం ప్రబలంగా వుండేది. అప్పట్లో వ్యవసాయం ముఖ్యవృత్తి. బందిపోటు దొంగల బెడద ఎక్కువ. వీరు స్త్రీలను అపహరించుకొని పోతుండేవారు. బహుభార్యాత్వం ప్రబలంగా ఉండేది. సతీసహగమనం అనే మూఢాచారం అమల్లో ఉండేది. బతుకు తెరువు కోసం వలసపోవటం ఎక్కవగా జరిగేది. ఇలాంటి ఎన్నో అంశాలు ఈ గాథాల్లో నిక్షిప్తమైనాయి.

ఇలాంటి గాథలపై రాళ్ళపల్లివారి చూపు పడడం వారి అభిరుచికి నిదర్శనం. ప్రాకృత భాష రావడంతో ఈ గాథలపై వీరి మనసు మళ్ళింది. గాథసప్తశతి అనువాదాల్లో రాళ్ళపల్లివారి అనువాదం విశిష్టమైందని పండితుల అభిప్రాయం. మూలానికి అనుగుణంగా వీరి తెలుగు అనువాదం కొనసాగింది. శర్మగారి అనువాదం చూశాకే చాలా మంది పండితుల దృష్టి దానిపై మళ్ళిందనవచ్చు. దీంట్లో కొంతమంది సప్తశతులను దర్శించారు. మరికొందరు వారి ఇష్టప్రకారం వాటిలో కొన్ని గాథల్నీ మాత్రం అనువాదం చేసి తమ ప్రతిభా పాండిత్యాల్ని చాటుకున్నారు. నేటికి కూడా యువ రచయితలు, పరిశోధకులు ఈ గాథల్నీ ప్రస్తుతించడం పరిపాటిగా మారింది.

## 2.10.3.5. సంపూర్ణగాథాసప్తశతీ అనువాదాలవైశిష్ట్యం–తులనాత్మక పరిశీలన

రాళ్ళపల్లివారు అనువాదం చేసిన గాథల ఆధారంగా మిగతావారి అనువాదాలను పరిశీలించడం వల్ల వారి వారి అనువాద సౌష్టవాన్ని అర్థం చేసుకోవచ్చు. ఉదాహరణకు ప్రాకృతం, సంస్కృతం, తెలుగులలో ఉన్న వాటిని సోదాహరణంగా తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం.

ప్రాకృతగాథ: **కిం రుఅసి ఓణఅముహీ ధవలాఅంతేసు సాలిఛేత్తేసు।**
**హరిఆలమండిఅముహీ ణడి వ్వ సణవాడిఆ జాఆ॥**

**సంస్కృతగాథ:** ***కిం రోది ష్యవనతముఖీ ధవళాయమా నేషు శాలిక్షేత్రషు***
***హరితాలమండితముఖీ నటివ శణవాటికాజాతా***

(మూలం వాసిరెడ్డి వారి పుస్తకం పుట: 184)

**రాళ్ళపల్లి వారి అనువాదం :**

***ఆ. పండి తెల్లఁబాఱు వరితోటలను జూచి***
***యేల మొగము వంచి యేడ్చెదమ్మ?***
***చూడు జనుపచేను సొగసెక్కె నరిదళం–***
***బలఁదుకొన్న యాట వెలఁది వోలె. ౭***

(మహిందుఁడు. ౧–౯) (పుట: 2)

(రహస్య సంకేత స్థానముగా నుండిన వరితోఁటను ఇంకఁ గొన్నాళ్ళలోనే కోసి వేయుదురే యని నాయికకు దుఃఖము. జనుపచేను పెరిగి పచ్చుచున్నది భయపడవద్దని సఖియూరడింపు)

**భావం:** ప్రేయసి ప్రియులు తమ ప్రణయాన్ని కొనసాగించేందుకు ఓ వరి పొలాన్ని సంకేత స్థలంగా నిర్ణయించుకొని రోజూ అక్కడ కలుస్తుంటారు. అయితే ఆ వరి చేను కోతకు రావడంతో వారి కలయికకు భంగమవుతుందని ఓ నాయిక బాధ పడుతుంటుంది. ఆ నాయిక చెలికత్తె వచ్చి ''బాధ పడకు సుమా! మీరు కలిసేందుకు పక్కన మరో జనప చేనుంద''ని ధైర్యం చెప్తున్న సందర్భాన్ని పై గాథ తెలియజేస్తుంది. ఈ గాథనే మిగతా అనువాదకులు ఏవిధంగా అనువదించారో గమనించండి.

**గట్టి లక్ష్మీనరసింహశాస్త్రి :** ***పండి వెలివాఱి వరిపైరు లెండినంత***
***వంతఁబడె దేల యిటు మోము వంచి నీవు?***
***పొలఁతి! వారి తాలమండితముఖము మెఱయ***
***జనపచేనదె నటివలె గొనబు మివులు.*** (పుట: 3)

(వరిచేను సంకేత స్థలంగా ఒక పల్లవాధరికి ఒక పల్లవుని కొంత కాలము గడచెను. వరిపైరు లెస్సగా పండి కోతకు రాగా సంకేత భంగ విధురయై, సంకేత స్థలమును తెలియబఱుచుచు, సఖురాలు నాయికతో)

**వాసిరెడ్డి వేంకటసుబ్బయ్య :** ***వరిపొలాలు పలుకఁ బాఱుచుండఁగ దేని***
***కీవు మొగము వాల్చి యేడ్చె? దదిగొ!***
***విరిసె జనుపచేను హరితాళమున మోము***
***చాయ మీఱు రంగసాని వోలె.*** (పుట: 3)

(తమ సంకేతమునకు భఁగము వాటిల్లెనే యని దుఃఖపడుచున్న నాయిక నూఱడించుచు సంకేతాంతరమును సూచించు నాయికా సఖురాలి సమయి సముచిత ప్రసంగము.)

**దీవి సుబ్బారావు :**

***కోతకొచ్చిన***
***తెల్లటి వరి పొలాలు చూసి***
***ఎందుకు దుఃఖిస్తావు?***
***ముఖానికి పసుపురంగు పూసుకున్న***
***నాట్యకత్తెలా***
***పక్కనే జనపచేను పైకి వస్తోంది గదా!*** (పుట: 9)

**డా॥ కోడూరు ప్రభాకరరెడ్డి :** కలమ పంట – జనుపచేను

**తే.** ***పండువారుచున్న కలమపంట జూచి***
***ఏల మదిలోన కుములుచు నేడ్చెదీవు***
***అలిది యలదిన నటివోలె వెలుగుచున్న***
***జనుప చేనది పొలుపారు కనుమ చెలియ!*** (పుట: 44)

(సంకేత స్థలంగా ఎంచుకున్న వరిపొలం పండిపోయి కోతకు సిద్ధంగా ఉంటే దుఃఖిస్తున్న నాయికకు సంకేత స్థలాంతరాన్ని తెలియజేస్తూ చెలి ఆమె నోదార్చుతున్నది.

పండిపోయిన వరిపంటను చూసి ఎందుకు నీలో నీవే కుంగుతావు? పసుపు రాసుకొన్న నాట్యకత్తెలాగా అక్కడ జనుపచేను ఎదిగి వస్తున్నది చూడు!

రహస్యసంగమ సంకేత స్థలంగా నాయికానాయకులు ఏర్పరచుకొన్న వరి పండిపోవటంతో ఇంక కొన్నాళ్ళకు దానిని కోసే స్తారని నాయిక దుఃఖిస్తుంటే జనుపచేను నాట్యకత్తెలా బిరబిరా పెరిగి వచ్చింది. దుఃఖించవద్దని ప్రాణసఖిని ఓదార్చుతున్నది నెచ్చెలి.

'హరిజాలమండితముఖీ' అనే పాఠాంతరం స్వీకరిస్తే కోతుల సముహంతో ఉండే జనుపచేను నిశ్చయంగా మీ సంకేత స్థలంగా అనువుగా ఉంటుంది. దుఃఖించవద్ద అంటున్నది చెలి.)

పై పద్యాల భావార్థం దాదాపు ఒకటే అయినా వీరందరూ పాటించిన పద్యరచనా విధానంలో తేడాలు ఉన్నాయి. ముఖ్యంగా రాళ్ళపల్లి వారి పద్యాన్ని ఆధారంగా చేసుకుని మిగతా వారి అనువాదాలను పరిశీలించడం జరుగుతుందని ముందే చెప్పుకొన్నాం కదా. దాని ప్రకారంగానే ఈ కింది విషయాలు చూద్దాం.

ప్రాకృతంలో **'ధవలాఅంతేసు'** అని, సంస్కృతంలో **'ధవళాయమానేషు'** అన్న మాటలకు శర్మగారు **'పండి తెల్లఁబాఱు'** అని తెలుగు చేశారు. దీనికి గట్టి లక్ష్మీనరసింహం **'పండి వెలివాఱి'** అని, వాసిరెడ్డి వేంకటసుబ్బయ్య **'పలుకఁ బాఱు'** అని, దీవి సుబ్బారావు **'కోత కొచ్చిన తెల్లటి'** అని, కోడూరు ప్రభాకరరెడ్డి **'పండు వారుచున్న'** అని ప్రయోగించారు.

వీటిలో **'పలుక బాఱు, కోత కొచ్చిన, పండు వారుచున్న'** అన్న మాటల్లో మాండలిక ప్రభావం కనిపిస్తుంది. సామాన్య రైతులు వివిధ ప్రాంతాల్లో వరి 'పంట చేతికొచ్చాక' దాన్ని

రకరకాల పేర్లతో పిలుస్తారు కాబట్టి ఆ ప్రభావం రచయితల అనువాదాల్లో చోటు చేసుకొందని తోస్తుంది.

రాళ్ళపల్లివారు పద్యంలో **'జనుపచేను'** అనే పదం వాడారు. దీనికి ప్రాకృతంలో **'సణవాడిఆ'** అని సంస్కృతంలో **'శణవాటికా'** అన్న ప్రయోగాలు ఉన్నాయి.

ప్రాకృతంలో **'సాలిఛేత్తేసు'** అన్న పదానికి రాళ్ళపల్లివారు **'వరితోటలు'** అనే పదం వాడారు. ఈ ప్రయోగం సామాన్య పల్లె ప్రజలు వాడే భాషని స్ఫురింపజేస్తుందని చెప్పవచ్చు.

తర్వాత అనువాదకులు ఇదే పదాన్ని ఎలా అనువదించారో చూడండి.

గట్టివారు – **వరిపైరు**

వాసిరెడ్డి వారు – **వరిపొలాలు**

దీవి సుబ్బారావు – **వరిపొలాలు**

కోడూరు ప్రభాకరరెడ్డి – **కలమ పంట**

పై పద ప్రయోగాలన్నీ దాదాపు రాళ్ళపల్లివారి అనువాదానికి సమీపంగా ఉన్నాయనిపిస్తుంది. ఒక్క కోడూరు ప్రభాకరరెడ్డి మాత్రం భిన్నంగా అచ్చ తెలుగు పద ప్రయోగం చేసి విలక్షణతను చాటుకున్నారు. అయితే ఇక్కడ **'వరితోటలు'** అన్న ప్రయోగం అందరికి సులభంగా అర్థమౌతుందన్నది గమనార్హం. దీన్ని బట్టి చెప్పొచ్చేదేమిటంటే శర్మగారు మూలానికి ఏమాత్రం తీసిపోకుండా తమ అనువాదాన్ని కొనసాగించారు. ఆనాడు తెలుగు ప్రజలు వాడే పదజాలాన్ని శర్మగారు తమ అనువాదంలో ప్రయోగించడం వల్ల ఇది అందరిని ఆకట్టుకొంటుంది. అందుకే ఆనాటి నుంచి ఈ నాటి వరకు శర్మగారి గాథాసప్తశతికీ గొప్ప పేరు ప్రఖ్యాతులు ఉండడం గమనార్హం.

మరొక్క ఉదాహరణను చూడండి.

**ప్రాకృతగాథ:** ***ఆలోఅంతి పులిందా పవ్వఅసిహరట్టిఆ ధుణుణిసణ్ణా/***
***హత్థిఉలేహిం వ వింఝం పూరిజ్జంతం ణవబ్భేహిం//*** ***హలిఅస్స***

**సంస్కృతం:** ***ఆలోకయంతి పులిందాః పర్వత శిఖరస్థితా ధనుర్నిషణ్ణాః***
***హ స్తికులైరివ వింధ్యం పూర్యమాణం నవాభ్రైః***

(వాసిరెడ్డి వేంకట సుబ్బయ్య. పుట: 200)

**రాళ్ళపల్లివారు: ఆ.** ***చెంచుమగలు ముదముచేఁ జూచుచున్నారు***
***విండ్ల నూని శిఖరవీథి నిలిచి.***
***మత్తగజములట్లు క్రొత్తమేఘములు పైఁ***
***బ్రాఁకుచున్న వింధ్యపర్వతమును.*** ౮౯

(హాలియుడు–హాలికుఁడు ? ౨–౧౮)

**గట్టివారు:** ***ధనువులం బూని, గిరిరాజుతలను నిలిచి,***
***శబరు లదె చూచుచున్నారు, ప్రబలకరుల***

*చేతఁబోలెఁ, గాఱు మొయిళ్ళ చేతఁ గ్రమ్మి*
*క్రుమ్మఁబడుచున్న వింధ్యనగమ్ము వంక.* (పుట: 37) ౧౬

**వాసిరెడ్డివారు: ఆ.** *గున్న యేన్గులట్ల క్రొక్కాఱుమబ్బులు*
*పొదువుచున్న వింధ్యభూధరమ్ముఁ*
*గోయదొరలు కొండ కొమ్ములందున విండు*
*లూఁది యదిగొ! చూచుచున్నవారు* (పుట: 31, పద్యం: 16)

(పూర్వోదాహృత గాథార్థమునే భంగ్యంతరమునఁ బ్రదర్శించి వర్షాగమోల్లసితులై ధనుష్పాణులగు శబరవీరుల వీరవిహార వైఖరులఁ బ్రశంసించు నొక నాగరిక పౌర ప్రసంగము.)

**దీవి సుబ్బరావు :** *విల్లంబులు చేతబట్టుకొని*
*కొండ ఎగువన వుండే కోయలకు కన్పించినవి*
*ఏనుగుల మందలా*
*వింధ్య పర్వతం చుట్టు ముట్టిన కొత్తమబ్బులు.* (పుట: 40, హాలికుడు)

**డా॥ కోడూరు ప్రభాకరరెడ్డి :**
*కోలలను దాల్చి కొండల కొమ్ములందు*
*నిలచియున్నట్టి శాబర నివహమెల్ల*
*కరిఘటల గుంపు బోలుచు కారుమబ్బు*
*లావరించిన వింధ్యాద్రి నరయు చుండ్రి!* (పుట.81)

(మదగజగణాలను తుండాలను పోలిన మబ్బులు వింధ్య పర్వతాలపైన విస్తరించే దృశ్యాన్ని పర్వత శిఖరాలపైన నిలబడిన ధనుర్ధారులైన చెంచువాళ్ళు వీక్షిస్తున్నారు.)

హలియుడు/ హాలికుడు అనే ప్రాకృత భాషాకవి వింధ్యగిరి శిఖరాలపై నిలబడి ఆవరిస్తున్న గుంపులుగుంపులుగా వున్న నల్లని మబ్బుల్ని పుళిందులు చూస్తున్న దృశ్యాన్ని కన్నులపండువుగా చిత్రించాడు. దీన్ని కేవలం ప్రకృతి సౌందర్య వీక్షణంగా భావిస్తే అమందానందం కలుగుతుంది. అలా కాకుండా నాయికా నాయికలకు అడ్డుగా భావించే సందర్భాన్ని వూహిస్తే, అది మన ప్రాచీన కవుల విలక్షణమైన దృష్టిగా భావించవచ్చు.

ప్రాకృత కవి– ధుణుణిసణ్ణా: (ధనుర్నిషణ్ణాః) అనే ధరించే వాళ్ళు అనే అర్థాన్ని స్ఫురింపజేస్తుంది. ఇక్కడ రాళ్ళపల్లివారు **'విండ్లనూని'** అని అనడంలో చెంచులు విండ్లపై చేతులు పెట్టి, వాటిపై తమ చిబుకాన్ని – గడ్డాన్ని వూన్చిన విలక్షణమైన భంగిమను ఊహింపజేస్తుంది. గట్టి లక్ష్మీనరసింహశాస్త్రి: **'ధనువులం బూని'** అని ప్రయోగించగా, వాసిరెడ్డి వేంకటసుబ్బయ్య: **'విండులూఁది'** అన్నారు. వీరి ప్రయోగం దాదాపు రాళ్ళపల్లివారి ప్రయోగానికి దగ్గరగా ఉంది. దీవి సుబ్బారావు: **'విల్లంబులు'** అన్న అచ్చ తెలుగు పదం వాడారు.

కోడూరు ప్రభాకరరెడ్డి: 'కోలలను దాల్చి' అనే ప్రయోగం చేశారు. ఈ ప్రయోగాల వల్ల శబరులు విల్లమ్ముల్ని ధరించారన్న సామాన్యార్థం స్ఫురిస్తుంది.

ఇదే గాథలో రాళ్ళపల్లి **'క్రొత్త మేఘాలు పైకెగ బ్రాఁగు చున్నాయన్న'** ప్రయోగానికి గట్టి లక్ష్మీ నరసింహ శాస్త్రి: **'గాఱు మొయిళ్ళచేత'** అనే ప్రయోగం చేశారు. వాసిరెడ్డి వారు: **'క్రొక్కాఱు మబ్బులు పొదువుచున్న'** అను ప్రయోగం చేసి రాళ్ళపల్లివారిని అనుసరించారు. దీవి సుబ్బారావు: **'చుట్టు ముట్టిన కొత్తమబ్బులు'** అన్న అనువాదం గమనిస్తే పై ప్రయోగాలకు విపర్యయంగా రాశారనిపిస్తుంది. డా. కోడూరు ప్రభాకరరెడ్డి: **'కారుమబ్బు లావరించిన'** అన్న మాటలు వాడారు. దీనికి ప్రాకృతంలో – **'పులిన్దా పవ్వఅసివారట్టిఆ'** అని సంస్కృతంలో – **'పులిన్దా పర్వతా శిఖారాస్థితా'** అన్న ప్రయోగాలు ఉన్నాయి. ఈ ప్రయోగాల్ని గమనిస్తే, శర్మగారు మూలానికి చాలా దగ్గరగా అనువాదం చేశారని స్పష్టంగా బోధపడుతుంది.

పై పద్యాన్ని అనువదించేటప్పుడు శ్రీ శర్మగారు శబరులు కారుమబ్బులు ఆకాశాన్ని ఆవరించే సందర్భంలో ఆయా పదాలకు లాక్షణికార్థం స్ఫురింపచేసి అనువాద పద్య సౌందర్యాన్నే ఇబ్బడి ముబ్బడి చేశారంటూ.. సుప్రసిద్ధ విమర్శకులు ఘట్టమరాజు అభిప్రాయపడ్డారు.[50] అయితే తర్వాత అనువాదకులు అనంతకృష్ణశర్మగారిని కొంత వరకు అనుకరిస్తూ వచ్చారు. కొందరు ఆధునికులు మాత్రం తమ అనువాదాల్లో కొంత విలక్షణతను పాటించారన్నది అక్షర సత్యం.

రాళ్ళపల్లివారు పద్యంలో ఒక చోట మూలంలో లేని **'ముదముచే'** అని చేర్చి కమనీయమైన దృశ్యానికి మెరుగులు దిద్దే ప్రయత్నం చేశారు.

ఇంకోక ప్రయోగంలో మన అనువాదకుల ప్రతిభ చూడండి. గట్టి లక్ష్మీనరసింహశాస్త్రి– 'గ్రమ్మి **క్రుమ్మబడుచున్న'** దీవిసుబ్బారావు – **'చుట్టుముట్టిన కొత్తమబ్బులు'** కోడూరు ప్రభాకరరెడ్డి– **కారుమబ్బులు వింధ్య పర్వాతాన్ని** ఆవరించాయని అంటే, శర్మగారు – **కొత్తమేఘాలు పైకెగబ్రాకు** చున్నాయన్నారు. అలాగే వాసిరెడ్డి వెంకటసుబ్బయ్య– **క్రొక్కారు మబ్బులు పొదువుచున్న** అనే ప్రయోగాలు చేశారు. అయితే గట్టి లక్ష్మీ నరసింహశాస్త్రి, దీవి సుబ్బరావు, కోడూరు ప్రభాకరరెడ్డి వారు మాత్రం స్థిరంగా ఉన్న దృశ్యాన్ని తిలకించారు. రాళ్ళపల్లివారు, వాసిరెడ్డివారు మాత్రం కదులుతున్న దృశ్యాన్ని చూశారని భావించవచ్చు.

ప్రాకృత కవి **'హత్థి ఉలేవాం'** అని అంటే సంస్కృత కవి **'హస్తికులైరివ'** అన్నాడు. రాళ్ళపల్లివారు –**'ఏనుగుల గుంపులాగా'** అన్న అభిధార్థంలా కాక **'మత్త గజములట్లు'** అంటూ ఆ ఏనుగుల విశృంఖలత్వాన్ని ఆపాదించి విలక్షణ సౌందర్యాన్ని స్ఫురింపజేశారు. దీనికి గట్టి లక్ష్మీ నరసింహం శాస్త్రి – **ప్రబలకరుల చేతిఁబోలె**, వాసిరెడ్డి వారు– **గున్నయేనుగులట్లు,** దీవి సుబ్బరావుగారు– **ఏనుగుల మందలా**, కోడూరు వారు– **కరిఘటలగుంపు** అనే ప్రయోగాలు

[50] గాథాచతుశ్శతి సమీక్ష మిసిమి మాసపత్రిక డిసెంబర్ 2016. పుట. 89.

చేశారు. ఏది ఏమైనా మూలాన్ని అనుసరించి ఎవరి ప్రతిభను వారు చాటుకున్నారనిపిస్తుంది. అయితే కొందరూ రాళ్ళపల్లివారిని అనుసరించిన క్రమం కూడా లేకపోలేదు. శర్మగారు మాత్రం మూలానికనుగుణంగా తమ అనువాదాన్ని కొనసాగించారు. మిగతా వాళ్ళు వారి అనువాదాల్లో అక్కడక్కడ మార్పులు చేసుకుంటూ ముందు వెళ్ళారు.

రాళ్ళపల్లివారు తాము ముందు (1931) చేసిన అనువాదానికి, తర్వాత (1964) చేసిన అనువాదానికి మెరుగులు దిద్దుతూ పరిపూర్ణత్వాన్ని ప్రసాదించేందుకు పాటుపడ్డారన్న విషయం ఈ కింది పద్యాన్ని గమనిస్తే స్పష్టమైతుంది. ఇటువంటి ధోరణి చాలా మంది రచయితల్లో కొరవడి ఉంటుంది. ఈ విధానం కవులకు, రచయితలకు ఎంతో అవసరమని శర్మగారు చెప్పకనే చెప్పినట్లు అనిపిస్తుంది.

ప్రాకృతం: *బహలతమా హఅరాఈ అజ్జ పడతో పఈ ఘరం సుణ్ణమ్/*
*తహ జగ్గేసు సఅజ్జిఅ ణ జహా అమ్హే ముసిజ్జామో//*

సంస్కృతం: *బహలతమా హతరాత్రి రద్య ప్రోషితః పతి గృహం శూన్యం*
*తథా జాగృహి ప్రతివేశిన్న యథావయం ముష్యామహే*

(వాసిరెడ్డి వేంకట సుబ్బయ్య. పుట: 233)

ఆ. *కనులు కానరాని కటిక చీకటి రేయి*
*వలసపోయె మగడు : వట్టియిల్లు*
*దొంగ లెవ్వరైన దోతురుసుమ్ము; ని*
*ద్రింపవలదు ప్రక్కయింటి వాడా!*

(1931– పుట: 49) (అహయుఁడు ౨౧౮)

అని మొదటి అనువాదంలో కనిపిస్తుంది. దీన్నే తర్వాత అనువదించవలసి వచ్చినప్పుడు ఎలాంటి మార్పులు చేసి రాశారో చూడండి.

ఆ. *ఊరలేదు మగడు కారుచీకటికమ్మి*
*నట్టిపాడురేయి: వట్టియిల్లు*
*దొంగలెవరైనా దోతురు సుమ్ము; ని*
*ద్రింపవలదు ప్రక్కయింటి వాడా!* (1964– పుట: 66) (అహయుఁడు ౨౮౭)

శర్మగారు తన కవితలను గాని అనువాదాలను గాని పదేపదే గుర్తుకు తెచ్చుకొని వాటిలోని లోపాలను ఎప్పటికప్పుడు సంస్కరించుకుంటారన్న విషయం పైపద్యం వల్ల తేటతెల్లమౌతుంది. రాళ్ళపల్లివారు అనువాదంలో అనేక పద్యాలను ఇలా మార్చుకొనే ప్రయత్నం చేసినట్లు ఆ రెండు పుస్తకాలను పరిశీలిస్తే తెలుస్తుంది. అనంతకృష్ణలవారు అవకాశం చిక్కినప్పుడల్లా తమ రచనలకు మెరుగులుదిద్దే లక్షణాన్ని అలవర్చుకొన్నారు. అందువల్లే వీరి రచనలు సాహిత్యంలో ప్రఖ్యాతి గడించాయి. ఇలాంటి మనస్తత్వం నేడు కవుల్లో, రచయితల్లో, విమర్శకుల్లో ఉంటే మరింత నాణ్యమై సాహిత్యం రాగలదు.

**పై పద్యానికి భావం :** పక్క ఇంట్లో ఉన్న ఓ కామునికి వినబడేట్లు యుక్త వయసులో ఉన్న నాయిక అంటున్న మాటలు. ఏ విధంగా వున్నాయంటే...

నా భర్త పరదేశంలో వున్నాడు. చుట్టూ చీకటిగా వున్న ఇంట్లో వుండడానికి భయంగా వుంది. అంతేకాక దొంగలు ఎవరైనా నన్ను దోచుకుంటారనిపిస్తుంది. పక్క ఇంటి చిన్నవాడా! నిద్రపోవద్దు సుమా! అనటంలో వ్యంగ్యార్థం దాగుంది. ఇక్కడ నాయిక చెప్పకనే చెప్తుంది నా భర్త లేడు నువ్వు ఎప్పుడైనా మా ఇంటికి రావచ్చని స్ఫురింపజేసింది. ఆనాడు బతుకు తెరువు కోసం అనే మంది పరదేశం వలస వెళ్ళటం సర్వసాధారణాంశం. ఈ విధానం నేడు కూడా ఉందన్నది నిత్య సత్యం. ఈ కారణంగా వయసులో ఉన్న ఆడవారు సాంగత్యం కోసం పరాయి వారిని ఆశ్రయించాల్సి వస్తుందని పై గాథలో చెప్పబడింది.

ఇదే పద్యాన్ని మిగతా రచయితలు ఎలా అనువదించారో పరిశీలిద్దాం.

**గట్టి లక్ష్మీనరసింహ శాస్త్రి:**

*కారులు గ్రమ్ము చీఁకటులు గట్టిన కోటల కాళరాత్రి, సం*
*భారముతోడ నేఁడె యజమానుఁడు నూరికిఁ బోయె, నింబ నె*
*వ్వారును లేరు, మేలుకని భద్రముగాఁ గనిపెట్టి మమ్ముఁ బా*
*లేరుఁడ! చూచుచుండు మొక లేశములోపము రాక యుండఁగాఁ*

(ఇంటిపాలేరుగా ఉండి తనకు ప్రేమ పాత్రుడైన కోడెగానితో ఇంటి యజమానురాలు స్వయముగా) (పుట: 107)

**వాసిరెడ్డి వెంకట సుబ్బయ్య:**

*ఆ. భర్త యూరలేఁడు ప్రబలాంధతమస మీ*
*పాడురేయి శూన్యభవన మిప్ప*
*డాత్మవంచనంబె యగుఁగానఁ బొరుగింటి*
*వాఁడ! కన్ను మూయవలదు! నీవు.* (పుట: 87)

**దీవి సుబ్బరావు :**

*మగడు పొరుగూరు వెళ్ళాడు*
*కటిక చీకటి రాత్రి*
*ఇంట్లో ఒక్కదాన్ని*
*దొంగలెవరైనా వచ్చి దోచుకుంటారేమో*
*పక్కయింటి పడుచువాడా!*
*నిద్రపోకుండా మేల్కొనివుండు* (అహయుడు) (పుట: 94)

**డా॥ కోడూరు ప్రభాకరరెడ్డి :**

పక్కింటి పడుచువాడా, నిదురపోకు!

---

*చెలుడు పరదేశి, గాటంపు చీకటలమె*

*అబలనొంటిని, గృహము శూన్యమ్ము సుమ్ము*
*దొంగలెవర్వరు నన్నిట దోచుకుండ*
***మేలుకొనుమయ్య ప్రక్కింటి మేలిమగడ!*** – అభవుడు (పుట: 207)

పక్కింటి కాముకునికి వినబడేటట్లు నాయిక అంటున్న మాటలు.

'నా భర్త ప్రవాసంలో ఉన్నాడు. అంధకార బంధురమైన ఇంట్లో ఒంటరిగా బెరుకు బెరుకుగా కాలం గడుపుతున్నాను. దొంగలు నన్ను దోచుకుంటారని భయంగా ఉంది. ప్రక్కింటి చిన్నవాడా! నిద్రపోవద్దు సుమా!

పడుచుదాని భర్త ఇటీవలే పరదేశం వెళ్ళాడు. ఇప్పుడిప్పుడే తిరిగిరాడు. చుట్టు ప్రక్కలంతా కటిక చీకటి. అతని రాకపోకలు ఎవ్వరూ గమనించే అవకాశం లేదు. కామిని ఇంట్లో ఒంటరిగా ఉంది. తోడెవ్వరూ లేరు కాబట్టి దొంగలెవరైనా ఆమెను దోచుకుంటారేమోనని భయంగా ఉంది అంటున్నది. అందువల్ల నిద్రపోకుండా మేలుకొనే ఉండమంటుంది. ఎప్పుడైనా నిరభ్యంతరంగా తన ఇంటికి రావచ్చని ధ్వని గర్భితంగా చెబుతున్నదామె.

ఈ సందర్భంలో 'దొంగలు దోచుకుంటారని భయంగా ఉంది. అనేది సరసంగా లేదని 'మనలను మనమే మోసగించుకొనకుండ' అని అర్థాన్నిచ్చే కొన్ని వాఖ్యలు ఆమోదయోగ్యమనిపిస్తాయి. ఎందుకంటే 'నేను ఒంటరిని, జంటగా నీవురా, ఈ రాత్రి సురత సుఖం అనుభవించకుంటే మనలను మనమే మోసగించు కొన్నట్లవుతుంది' అని వెలిచవులు మరగిన మగనాలి అంతరార్థం.

ప్రాకృతంలో : **'పఈ ఘరం సుణ్ణమ్'** అని అంటే సంస్కృతంలో **'పతిర్గృహం శూన్యమ్'** అని ఉంటే, రాళ్ళపల్లివారు **'ఊరలేదు మగడు'** అని మూలార్థానికి చాలా దగ్గరగా సరళమైన తెలుగు పదాలతో అందంగా అనువాదం చేశారు. గట్టి లక్ష్మీ నరసింహశాస్త్రి **'యజమానుఁడు నూరికిఁబోయే'** అని ప్రయోగం చేశారు. కానీ ఇందులో గ్రాంధిక భాష వుంది. వాసిరెడ్డి వేంకట సుబ్బయ్య **'భర్త యూర లేదు'** అని చెప్పడం చూస్తే కొంత వరకు తెలుగు పదాలను ఉపయోగించారు. దీవి సుబ్బారావు మాత్రం **'మగడు పొరుగూరికి వెళ్ళాడు'** అని వచనంలోకి తీసుకొచ్చారు. కోడూరు ప్రభాకరరెడ్డి **'చెలుడు పరదేశి'** అనే విశిష్ట భాషా పద ప్రయోగం చేశారు.

మరో పదాన్ని గమనిస్తే రాళ్ళపల్లి వారి విలక్షణత మరింత స్పష్టమవుతుంది.

ప్రాకృతం: **హ అరాఈ అజ్జ,** సంస్కృతం: **హత రాత్రిరద్య** అని ఉంది. దీనికి రాళ్ళపల్లివారు : **'నట్టి పాదురేయి వట్టియిల్లు'** అని అంటే, గట్టివారు: **'గ్రమ్ము చీకటులు గట్టిన కోటల కాళరాత్రి'** అని, వాసిరెడ్డి వారు: **'ప్రబలాంధ తమసమీ పాదురేయి'** అని, దీవి సుబ్బారావు: **'కటిక చీకటి రాత్రి'** అని, కోడూరు ప్రభాకరరెడ్డి: **'గాటంపు చీకటలయె'** అని అనువాదం చేశారు. కానీ ఈ అనువాదకులల్లో దీవి సుబ్బారావుగారు మాత్రం రాళ్ళపల్లి వారి

అనువాదానికి కొంచెం దగ్గరగా ఉన్న ప్రయోగాన్ని చేశారు. మిగతా వాళ్ళు కొంచెం విశిష్ట పద ప్రయోగాలు చేసి వారి వైశిష్ట్యాన్ని ప్రదర్శించారు.

పై ప్రయోగాలన్నింటిలోకెల్ల రాళ్ళపల్లివారి ప్రయోగం ఎంతో ఆదర్శనీయంగా ఉండటం పరిపాటి. శర్మగారు ఇట్లాంటి పద ప్రయోగాలు అనువాదంలో ఎన్నో ప్రయోగించారు. దీనికి కారణం అన్నమయ్య, తిక్కన, వేమన లాంటి వారి సాహిత్యాన్ని రాళ్ళపల్లివారు సమగ్రం అధ్యయనం చేయడమేనని అనిపిస్తుంది. ''*పద్యముల మాధుర్య సౌలభ్యములతోఁదుల్యమై తెనుఁగుఁదనము శర్మగారి యనువాదమున వాఁకలు గట్టినది. తెలుఁగు మాటలు గుదిగుచ్చిన తెలుఁగు సామెతలు కుండ పోఁతగాఁ గ్రుమ్మరించిన తెనుఁగు దనము కాదు;రాదు. ఏ భాషను మాటాడు వారికయిన భావములు ప్రకటించు ప్రత్యేక విధాన ముండును. అది నుడికారమునఁ, గారకమున గోచరించును. తెలుగు భాషకు జీవశక్తి యనఁదగు ''తనము'' కలదు. తెలుఁగుఁదనము గుట్టు మట్టులు తెలిసిన నేఁటి కొలఁది మంది* కవులలో *శర్మగారొకరు''.*[51] అని ప్రఖ్యాత విమర్శకులు నాగళ్ళ గురుప్రసాదరావు అభిప్రాయం.

'*గాథాసప్తశతి*'ని ఆధునికుల్లో తొలుత అనువాదం చేసింది రాళ్ళపల్లి వారేనని ముందే తెలుసుకొన్నాం. అయితే దీనిలో ఉన్న 700 గాథాల్ని మొట్ట మొదట సంపూర్ణ అనువాదం చేసింది మాత్రం గట్టి లక్ష్మీనరసింహ శాస్త్రి. కాగా ఈ గాథల సారాన్ని సామాన్య ప్రజానీకం వరకు చేర్చిన ఘనత మాత్రం శర్మగారిదేనని చెప్పవచ్చు. అప్పటి వరకు హాలుని గాథల సారం కేవలం పండితులకు మాత్రమే పరిమితమైంది. కాని రాళ్ళపల్లి వారి అనువాదంతో పామరులకు కూడా చేరువై జనరంజకమైంది. శర్మగారి ప్రతిభా పాండిత్యాలకూ, సునిశిత పరిశీలనకూ, సులలితమైన భాషాప్రయోగానికి ఈ అనువాదం నిదర్శనంగా నిలుస్తుంది. వీరి పరిశ్రమ వల్ల '*శాలివాహన గాథా సప్తశతి*' 1931లో వెలుగు చూసిందంటే అందుకు ఈయన పడిన శ్రమ అంతా ఇంత కాదని చెప్పవచ్చు.

రాళ్ళపల్లివారి గాథాసప్తశతిని పురస్కరించుకొనే కల్లూరు రాఘవేంద్రరావు చెప్పిన మాటలు వింటే ఈ గ్రంథ ప్రాముఖ్యమేమిటో బోధపడుతుంది. ''*రాళ్ళపల్లి ఈ అనుసృజనలో ఆయన అచ్చతెనుగు నుడికారాలను కుండపోతగా గుమ్మరించారు. అయితే... దురదృష్టకర విషయం ఏంటంటే... ఈ అమూల్య గ్రంథం నేడు అలభ్యం.''*[52] అని వాపోయారు. కాబట్టి దీని ముద్రణకై ఏ సాహిత్య సంస్థలు కాని, వ్యక్తులు గాని చొరవ తీసుకొని ముద్రిస్తే ఆ సంపద తరతరాలకు ఉపయోగపడగలదని విజ్ఞప్తి.

'*గాథా సప్తశతి*' పై నేటికీ ఎంతోమంది కవులు, రచయితలు, విమర్శకులు వివిధ దృక్పథాలతో ఆయా రచనలు చేస్తూ వస్తున్నారు. ఉదాహరణకు ఇటీవల కనకదుర్గ స్త్రీవాద

[51] అనంతరాగం. పుట. 186-187.

[52] తెలుగు వెలుగు ఏప్రిల్ 2018. పుట. 75.

దృక్పథంతో 'గాథాసప్తశతిలో బాధ సప్తశతులు' అని వ్యాసం రాస్తూ... *"స్త్రీ పురుష సంబంధాలలోని అసమనైతిక సంస్కృతివల్ల బాధాతప్త హృదయులైన మహిళలు తమ వ్యథను ధ్వని పూర్వకంగా, ప్రశ్నారూపంగా, దృష్టాంతాలుగాను వ్యక్తీకరించుతూ నిరసన గళాన్ని వినిపించారు."*[53] అని అభిప్రాయ పడ్డారు. దీన్ని విమర్శిస్తూ బొల్లోజి బాబా 'హాలుని గాథాలకు పొసగని వ్యాఖ్యానం' అనే వ్యాసంలో *"గాథా సప్తశతిలో శృంగారరస ప్రధాన గాథలు కూడా ఉన్నాయి. వ్యాసకర్త ప్రతిపాదించినట్లు ఇదేమి అసమనైతిక సంస్కృతికి అద్దం పట్టే రచన కాదని, వివిధ గాథలు ఆనాటి స్త్రీ పురుషుల అన్యోన్యతను చూపుతాయిని జాగ్రత్తగా గమనిస్తే తెలుస్తుంది."*[54] అని ప్రతి విమర్శ చేశారు. దీనికి మరల కనకదుర్గగారు స్పందించి 'గాథల్లో స్త్రీ కోణమూ ఉంది' అనే వ్యాసం రాశారు. అందులో *"వేశ్యా వ్యవస్థ ఉన్న సమాజంలో కుటుంబం మహిళలు స్త్రీ పురుష సంబంధాలలోని సంక్లిష్టతలకు బాధితులై తమ మనోవేదనను గ్రంథంలోని 700 ముక్తకాలలో దాదాపు 25 శాతంపైగా గాథలలో వ్యక్తం చేస్తే, మరో 25 శాతం గాథలలో స్త్రీలు సందర్భాను సారంగా చెప్పిన సంసారాలలోని సర్దుబాటు ధోరణి, భర్తల తప్పుకు నిలదీయటాలు, ప్రకృతి వర్ణనలలో భాగంగా ధ్వనింప చేస్తే స్త్రీల వ్యథలు స్పష్టంగా ఉండగా గ్రంథంలో అదే ప్రధాన సామాజిక విషయం అవుతుంది."*[55] అని అభిప్రాయపడ్డారు.

ఇలా ఎన్నో వాదోపవాదాలకు తావిచ్చిందీ *గాథా సప్తశతి*. తెలుగు సాహిత్య ప్రపంచంలో చర్చనీయాంశంగా మారిన ఈ మూడు వ్యాసాలు గమనించిన తర్వాత తెలిసిన విషయం ఏమిటంటే. కనకదుర్గగారు స్త్రీవాద దృక్పథంతో స్త్రీలను పురుషులు నిర్లక్ష్యం చేస్తున్న గాథలే ఈ సప్తశతుల్లో ఎక్కువగా ఉన్నాయని తెలిపే ప్రయత్నం చేశారు. బొల్లోజి బాబాగారు గాథా సప్తశతిలో కేవలం స్త్రీవాద కోణం మాత్రమే కాదు ప్రకృతి వర్ణనలు, దేవతల స్తుతి, అన్యోన్యదంపతుల మధ్య సరస సల్లాపాలు, పల్లెజీవుల ప్రణయోదంతాలు, వివిధ జీవితానుభవాల్లాంటి భిన్న పార్శ్వాలు చిన్న చిన్న ఉదంతాల రూపంలో చెప్పబడ్డాయని వివరించు కొంటూ పోయారు. ఇలా నేటికీ *'గాథా సప్తశతి'* పై అనేక చర్చలు జరుగుతూనే ఉన్నాయి. జరగాల్సిన అవసరం కూడా ఉంది.

ఈ గాథా సప్తశతిలోని గాథలన్నీ గ్రామీణ జీవిత ప్రతిబింబాలు. సరస శృంగార, సుకుమార హాస్య, ధ్వన్యార్థ రసరమ్య గీతాలు. వీటిని జనరంజకం చేయడానికి అనువాదకులు చేసిన కృషి విశేషాలు భావితరాలను ఆదర్శనీయామృతాలు.

## 2.10.4. నృత్త రత్నావళి

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ 1969లో *'నృత్తరత్నావళి'* అనే గ్రంథాన్ని సంస్కృతం నుండి తెలుగులోకి అనువాదించారు. 13వ శతాబ్దానికి చెందిన జాయప సేనాని ఈ గ్రంథాన్ని సంస్కృతంలో రచించాడు. ఈయన దీన్ని రాయడానికి భరతుని 'నాట్యశాస్త్రము, సర్వజ్ఞ

---

[53] ఆంధ్రజ్యోతి 'వివిధ' 2016 సెప్టెంబర్ 26

[54] ఆంధ్రజ్యోతి 'వివిధ' 2016 అక్టోబర్ 10

[55] ఆంధ్రజ్యోతి 'వివిధ' 2016 నవంబర్ 21

సోమేశ్వరుని 'మానసోల్లాసము' నామాంతరం గల '*అభిలషితార్థ చింతామణి*' పుస్తకాలను ఆధారంగా చేసుకొన్నారు. కాగా ఆనాటి విద్యావంతుల అనుభవాలను సైతం ఇందులో ఉదహరించారు.[56]

సంస్కృత భాషలో లిఖితమైన ఈ గ్రంథ ప్రతులు మద్రాసు ప్రాచ్యలిఖిత భాండాగారంలోనూ, తంజావూరు సరస్వతీ మహలులోనూ, వివిధ తాటాకు ప్రతులలోనూ, ఏషియాటిక్ సొసైటి ఆఫ్ బెంగాల్ మొదలైన చోట్ల అసమగ్రంగా ఉండేవి. రాఘవన్ వాటన్నిటినీ సునిశితంగా పరిశీలించి ఆంగ్ల భాషలోకి తీసుకొచ్చారు.

అయితే, ఈ నాట్య శాస్త్రానికి చెందిన ఈ పుస్తకం తెలుగు భాషలో లేదన్న అసంతృప్తి ఆనాటి పండితుల్లో బాగా ఉండేది. అందుకు ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు శ్రీమాన్ రాళ్ళపల్లివారి దృష్టికి తీసుకొచ్చారు. పైగా వారినే దీన్ని తెలుగులోకి అనువదించాలని అభ్యర్థించారు. అప్పుడు శర్మగారు ''*మూల గ్రంథమున అందందు కొన్ని చిన్న సవరణలు చేయదగునని తోచినది. అట్లు చేసిన సవరణలు అక్కడక్కడ స్పష్టము*''[57] అన్న మాటలు గమనార్హమైనవి. రాళ్ళపల్లివారు పరిపరి విధాల ఆలోచించి ఈ '*నృత్త రత్నావళి*'ని తెలుగు భాషలోకి తర్జుమా చేశారు. 1969లో సాహిత్య అకాడమీ ఈ పుస్తకాన్ని ముద్రించింది. ''*నృత్యశాస్త్ర విజ్ఞానానికి తెలుగువారు సమర్పించిన ఆణిముత్యం ఈ 'నృత్తరత్నావళి' ఈ లక్షణ గ్రంథం ఈ తరం ఆలంకారికులకు, నృత్యశాస్త్ర విద్యార్థులకు, కళాకారులకు ప్రామాణిక వాచకంగా ఉపకరిస్తుంది.*''[58] అని తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షురాలు ఆవుల మంజులతగారు భావించి 2007లో శ్రీ పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి పునర్ముద్రణలోకి తీసుకొచ్చారు.

ఈ పుస్తకాన్ని ఆద్యంతం పరిశీలిస్తే నృత్య శాస్త్రానికి సంబంధించిన చాలా విషయాలు తెలుస్తాయి. పోణంగి శ్రీరామ అప్పారావు శర్మగారి '*నృత్త రత్నావళికి*' సుదీర్ఘమైన పీఠిక రాస్తూ ''*ఆది మానవులు ఆనంద విషాద సమయాల్లోనూ, సుఖ దుఃఖాలలోనూ వేసే చిందులే నృత్తానికి మూల రూపం.*''[59] అన్నారు. కాబట్టి ఈ పుస్తకం ఎంత విలువైందో అర్థం చేసుకోవచ్చు. ఇందులో నృత్యకళ, ఆంగికాభినయం, నృత్త, నృత్య, నాట్యాల సూక్ష్మసూక్ష్మేతర భేదాలను, నాట్యకళ చరిత్రను, భరతాది పూర్వ రచయితలనూ, జాయప సేనాని విశిష్టతనూ, ఆంధ్ర నాట్య రంగాలు మొదలైన విషయాల గురించి సుమారు డబ్బై పుటల్లో వివరించారు. ''*నృత్తరత్నావళి'లో నృత్త–నాట్య–నృత్య మధ్య తేడాలు తెలుసుకోదగినవి. పూర్వకథయుక్తంగా పూజనీయమైన నాటకమే నాట్యము; భావాభినయ హీనమైనది నృత్తము;*

---

[56] అనంతరాగం. పుట. 203.

[57] నృత్తరత్నావళి – ఉపోద్ఘాతం. పుట. 2.

[58] నృత్తరత్నావళి (ముందుమాట). పుట. 1.

[59] నృత్తరత్నావళి. పుట. 7.

*రసభావవ్యంజనాది యుక్తమైనది నృత్తము.'*[60] అని అప్పారావుగారు పీఠికలో పేర్కొని గ్రంథ ఔన్నత్యాన్ని చాటి చెప్పారు.

ఈ గ్రంథం ఎనిమిది అధ్యాయాలుగా విభజించబడింది. మొదటి అధ్యాయంలో నృత్తము దాని పుట్టుపూర్వోత్తరాలు కూలంకషంగా తెలుపబడ్డాయి. ప్రధానంగా కృతి ప్రారంభం, నృత్త-నృత్య- నాట్యాల విశేషాలు, లాస్యాంగ వివరాలు పేర్కొనదగినవి. రెండవ అధ్యాయంలో నృత్తం దృష్టిలో ఆంగికాభినం – అంగో పాంగపత్యంగ సహితంగా వర్ణితమైనది. మూడవ అధ్యాయంలో చారీ – మండలాలు, స్థాపక-ఆసన – శయనాది విధులు, వ్యాయామ వైశిష్ట్యాలతో కూడిన అంశాలు ఉన్నాయి. నాల్గవ అధ్యాయంలో భరతాధులు చెప్పిన 'మార్గ' భేదానికి సంబంధించినవి వివరాలు కనిపిస్తాయి. ఇవి మొత్తం గతానుగతికాలైనప్పటికి వీటి నిర్వచనాలలో జాయప సేనాని మౌళికతను గుర్తించాడు. ఐదవ అధ్యాయంలో దేశి విధానం చెప్పబడింది. ఇందులో ప్రధానంగా దేశిస్థానకాలు, ఉత్ప్లుతికరణాలు, భ్రమరులు తెలుపబడ్డాయి. ఆరవ అధ్యాయంలో దేశిపాదం, పాటమణులు, చారులు, లాస్యాంగాలు, గతి తేడాలు వివరించబడ్డాయి. ఏడవ అధ్యాయంలో పేరిణి లాంటి పదిహేను నృత్య భేదాలు రచింపబడ్డాయి. కాగా శిక్షాపద్ధతి, వాద్య పద్ధతి, నర్తకీ – నర్తక – ముఖరి- ప్రతి ముఖరి- వాద్యబృంద- ముఖ్యగాయక సంప్రదాయాలు పొందుపరచబడ్డాయి. అంతేకాకుండా నృత్త-నృత్తాలను ప్రదర్శించే మండప లక్షణాలు, దీనిని చూసే సభాపతి – సభ్యుల లక్షణాలు కూడా పరిచయం చేయబడ్డాయి. ఎనిమిదవ అధ్యాయంలో ప్రేక్షాగానాన సభాపతి – సభ్యుల విన్యాసాలు ప్రధాన నర్తకి నైపథ్య విధానాలు, బృంధ విన్యాసాలు, వాద్యాల మేళవింపు వెరసి నృత్య ప్రారంభం, నర్తకిని బహూకరించు విధానాలు సమగ్రంగా చర్చించబడ్డాయి.

శర్మగారు మొదట నాలుగు అధ్యాయాల్లో భరత మార్గానుసారులైన నృత్య విశేషాల్ని తెలిపారు. మిగతా నాలుగు అధ్యాయాల్లో దేశి నాట్య సంప్రదాయాల్ని పొందుపరిచారు. *''ఈ నృత్త రత్నావళి భారతీదేవి సన్నిధిలో తెలుగువారు వెలిగించిన నందాదీపములలో మొదటిది.''* [61] అని శర్మగారు అభివర్ణించారు. ఇక్కడ నందాదీపము అంటే వెలుగు తున్న దీపమని అర్థం. ఈ గ్రంథ విశిష్టతను ఈ మాటలు బట్టి అవగతం చేసుకోవచ్చు.

అనంతకృష్ణులవారి *'నృత్తరత్నావళి'* పై శ్రీ వేదము వెంకటరాయశాస్త్రి (జూనియర్) వ్యాసం రాస్తూ అన్నమాటలు గమనార్హాలు. *''ఈ నృత్త రత్నావళి నృత్తము లేక వట్టి నృత్యము, కాగా సామాన్యుల పరిభాషలో నాట్యమును మాత్రమే చెప్పునదిగానున్నది. ఇందు సంగీత కావ్యనాటకాది విషయములకు బొత్తిగా చోటులేదు.''*[62] అని విమర్శించారు. కాని ఈ గ్రంథంలో ఎడమ వైపు మూల పాఠాన్నీ, కుడివైపు తెలుగు అనువాదాన్ని చూస్తే ఎంతో

---

[60] నృత్తరత్నావళి. పుట. 7.

[61] నృత్త రత్నావళి – ఉపోద్ఘాతము. పుట. i)

[62] 'నృత్తరత్నావళి' గ్రంథంపై రాసిన వ్యాసం. అనంతరాగం. పుట. 203.

సరళంగా ఉందని తిరిగి ఈయనే మెచ్చుకొంటూ "*శ్రీ శర్మగారి యనువాదము మూలమును పఠింపఁగోరువారికి మహోపకారకము.*'[63] అని గుర్తు చేశారు.

ఈ '*నృత్త రత్నావళి*' లో పూర్వకాలం నుంచి జరుగుతున్న నృత్త విశేషాలు సుస్పష్టంగా వివరించబడ్డాయి. సమాజంలో కొన్ని వర్గాలకు చెందిన ప్రజలు కళలనే ఆధారంగా చేసుకొని జీవించేవారు. ప్రధానంగా కొందరు స్త్రీలు రాజాస్థానాల్లో నృత్త ప్రదర్శనలు చేసి జీవనం గడిపేవారు. ఒకరకంగా వీరి జీవితాలు దుర్భరంగా ఉండటం విధితమే. ఎటువంటి భేదాలు సాదృశ్యాలు లేకుండా కళలు అన్ని వర్గాల ప్రజలకు దాసోహమైనాయని రాళ్ళపల్లివారి '*నృత్తరత్నావళి*' గ్రంథ ద్వారా వెల్లడించారు. ఈ గ్రంథం కేవలం నృత్యశాస్త్రం చదివే వారికే కాదు కళలను ఆస్వాదించే ప్రతి ఒక్కరికి ఆణిముత్యమే అని అభివర్ణించవచ్చు.

## 2.10.5. సుందరపాండ్య విరచిత ఆర్యా

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ రచనల్లో చివరి రచన *సుందరపాండ్య విరచిత ఆర్యా*. దీన్ని 1970లో అనువదించారు. అదే యేట శ్రీ రాయల సాహిత్య పరిషత్తు (ప్రొద్దుటూరు, కడప) ఈ పుస్తకాన్ని ప్రచురించింది. సుందరపాండ్యుడు అనే ప్రాచీన కవి సంస్కృతంలో ఈ గ్రంథాన్ని రాశాడు. పూర్వం దీన్ని వేటూరి ప్రభాకరశాస్త్రి, మానవల్లి రామకృష్ణకవి లాంటి గొప్ప పరిశోధకులు పరిష్కరించి ప్రకటించారు. వీరు రెండు వేరు వేరు ప్రతులను గ్రహించి 114 ఆర్యలు మూలంగానూ, 33 ఆర్యలను అనుబంధంగానూ ప్రచురించారు. అయితే రాళ్ళపల్లివారు ఈ రెండింటిని కలిపి తర్జుమా చేశారు. ఇందులో మొత్తం 150 పద్యాలు ఉన్నాయి. మూల పద్యాలు, అనువాద పద్యాలు క్రమానుసారంగా పొందుపరచబడ్డాయి. ఈ పుస్తకానికి శర్మగారే స్వీయ పీఠిక రాశారు.

ఇక పుస్తకం వివరాలును చూద్దాం. అనంతకృష్ణులు 'ఆర్య'కన్న ముందు *అజవిలాసం, అభీతిస్తవము, శాలివాగాథా సప్తశతీసారము, నృత్తరత్నావళి* అనే గ్రంథాలను సంస్కృతం, ప్రాకృత భాషలనుండి తెలుగులోకి తీసుకొచ్చారు. ఒక భాషనుండి మరో భాషలోకి అనువాదం చేయాలంటే ఆయా భాషలపై పట్టు తప్పని సరి. ఈ విషయంలో రాళ్ళపల్లవారు ఎంతో సమర్థులన్నదాన్ని చెప్పనక్కరలేదు. ఈ అనువాదంలో శర్మగారు పూర్వ పరిశోధకులు ఇచ్చిన పదాలనూ, వాక్యాలనూ అక్కడక్కడ బ్రాకెట్లలో పేర్కొన్నారు. అలాగే మూల పాఠంలో చిన్న చిన్న సవరణలు చేసి అనువాదానికి విశిష్టత తెచ్చిపెట్టారు. ఇలాంటి సవరణలు 'ఆర్యా' పుస్తకంలో పాదసూచికలుగా అక్కడక్కడ ఉదహరించడం జరిగింది. అంతేకాకుండా ఈ పద్యాలను అకారాది క్రమంలో పొందుపరిచారు.

150 పద్యాలున్న '*సుందరపాండ్య విరచిత ఆర్యా*'లో వరుసగా పాదాలు 12, 18, 12, 15 మాత్రలుండే జాతి పద్యాలు ఉన్నాయి. వీటికి అనుగుణంగా రాళ్ళపల్లివారు అనుదించేటప్పుడు ఆటవెలది, తేటగీతి, కంద పద్యాలను ఉపయోగించి తీర్చిదిద్దారు. ఈ

---

[63] నృత్తరత్నావళి' గ్రంథంపై రాసిన వ్యాసం. అనంతరాగం. పుట. 203.

గ్రంథం గురించి కఱ్ఱా వేంకట సుబ్రహ్మణ్యం తెలిపిన విషయాలు గమనించదగినవి. ''సుమారు వేయెండ్ల నాటి నీతి గ్రంథం ఇది. ఎంతో మంది తెలుగు కవులకు ఉపయోగపడింది. అప్పట్లో ఈ ఆర్యలను కంఠస్థం చేసిన వారు అనేకులు కలరు. కానీ సుందర పాండ్యుడు ఎవరన్న విషయం ఎక్కువ మందికి తెలియదు. ఈ విధంగా కర్త ఎవరో తెలియకున్నా రచనలు మాత్రము బాగా ప్రసిద్ధి చెందడం కవి ప్రతిభకు నిదర్శనమనచ్చు. భారతీయ సాహిత్యంలో వేదాలకున్న ప్రశస్తి ఈ ఆర్యలకు కూడా ఉందని.''[64] ఆయన అన్నారు.

సుందరపాండ్యుని ఆర్యల్లో భావమందు తీపి, బంధమందు బిగువు చాలా చక్కగా కుదిరింది. అంతేగాకుండా లలితకోమలమైన నుడికారాల సొంపు, ప్రసన్న మధురమైన శైలి ఉండడం విశేషం. ఇలాంటి గ్రంథంపై రాళ్ళపల్లివారి చూపుపడటం వారి అభిరుచికి తార్కాణం. ఈ అనువాదంలో శర్మగారు వాడిన పదబంధాలు సంతృప్తినిస్తాయి. ''*ఇది ధర్మశాస్త్రముగాదు. స్వర్గనరకాల పేరాసలు– బెదరింపులు – ఇందులేవు. శృంగారమును సూదంటురాయిగా ప్రయోగించి లాగు చక్కందము ఇక్కడ కానరాదు. ముక్తిని పరిశీలించు ముడిసరుకు సోఁకులేదు. ఇది వట్టి నీతికోశము. ఎంతో లోకానుభవము పరిశీలిన గలవాని హితబోధ. సాధారణ జీవితమును ప్రశాంతమదురముగా ఒడుదుడుకులులేక సాగించు నెమ్మది త్రోవ దీని ప్రమేయము.*''[65] అని శర్మగారు ఈ గ్రంథ పీఠికలో అన్న మాటలివి.

ఈ గ్రంథం గురించి కె. వి. రాఘవాచార్య చెప్పిన మాటలు ''*ఈ కావ్యాన్ని అనువదించేటప్పుడు రాళ్ళపల్లివారు వాడిన లలితమైన సూక్తులకు ఆలవాలమైన భావముల ఆర్జవము, ఔచిత్యమునకు అనుగుణమైన పదప్రయోగము, తెనుగుదనము గూర్చే పలుకుబడులతో శర్మగారి అనువాదము సౌందర్య శోభితమై ఉంది.*''[66]

ఈ '*సుందరపాండ్య విరచిత ఆర్యా*' గురించి 1971లో భారతి పత్రికలో వచ్చిన వ్యాసంలో ఓ ''*మూలములో సంస్కృత రచన అలతి పదముల కూర్పు బిగువుతో నుండి, విమర్శకు అభిప్రాయ పడినట్లు అతిప్రాచీనరచన యనిపించుచున్నది. 'ఇమాం కాంచన హీస్థాం... స్నాపయంతి పధూమిప' అని యున్న చివరి యార్యాశ్లో కమునుబట్టి, ఈ గ్రంథము 'తమిళసంగము' చేత బంగారు పీటమీద కనకాభిషేకము పొందినదని పూర్వ పీఠికాకారులు చేసిన యూహకు యోగ్యముగా నున్నది గ్రంథరచన.*''[67] అన్న విషయం తెలుస్తుంది.

సమాజంలో మాటకారికి వదరుబోతుకి మధ్య ఉండే తారతమ్యాన్ని శర్మగారు ఎలా అనువదించారో చూడండి.

**మూలం:** ***అల్పాక్షరరమణీయం***
***యః కథయతి నిశ్చితం సవై వాగ్మీ;***

---

[64] అనంతరాగం. పుట. 207.

[65] సుందరపాండ్యవిరచిత ఆర్యా. పుట. 4–5.

[66] రాళ్ళపల్లి అనంతకృష్ణ శతజయంతి సంచిక (1893–1993) పుట. 68.

[67] భారతి పత్రిక 1961 మార్చి. పుట.72.

*బహువచనమల్పసారం*
*యః కథయతి విప్రలాపీ సః*

**అనువాదం : ఆ.** *అక్షరములు తక్కువై నిశ్చితముగ ర-*
*మ్యముగఁ బలుకువాఁడు మాటకారి:*
*చేవ చాలనట్టి చిలిపిమాటలు పెక్కు*
***పలుకువాఁడు సుమ్ము వదరుఁబోతు*** (పద్యం:8, పుట:11)

పై పద్యంలో మటాకారికి, వదరుబోతుకు ఉంటే తేడాలను కవి తెలిపాడు. సమాజంలో మానవులు కొందరు తక్కువమాట్లాడి ఎక్కువ ఆలోచిస్తారు. అలాగే కొందరు ఎక్కువ మాట్లాడి ఇబ్బంది పెట్టే వాళ్లు ఉంటారు. ఇలాంటి వారిలో ఎవరు గొప్ప అనే అర్థంలో ఉన్న సంస్కృత పద్యాన్ని శర్మగారు ఎంతో సరళ సుందరంగా అనువదించారు. మొదటి రెండు పాదాలు ఒక అర్థాన్ని, మరో రెండు పాదాలు వేరే అర్థాన్ని స్ఫూరింప జేసేలా ఉంది.

మరో పద్యంలో ఆకాశంలో ఉన్న చందమామను కవి అద్భుతంగా వర్ణించే సందర్భం ఆకట్టుకునేలా ఉంటుంది.

**మూలం:** *రజనికరః ఖలు శీతోః*
*రజనికరా చ్చందనో మహాశీతః;*
*రజనికర చందనాభ్యాం*
*సజ్జన వచనాని శీతాని*

**అనువాదం:** *చందమామ చలువః చందన పంకంబు*
*చందమామ కంటెఁ జాలఁ జలువ;*
*చందమామకంటెఁ జందనపంకంబు*
***కంటె సాధు సూక్తి కరముఁ జలువ.*** (పద్యం:14, పుట:13)

పై పద్యంలో మూడు అంశాలున్నాయి. మొదటి పాదం ఒక అంశాన్ని, రెండవ పాదం ఒక అంశాన్ని, మూడు నాలుగు పాదాలు కలిపి మరో విషయాన్ని చెబుతున్నాయి. అయితే రాళ్ళపల్లివారి అనువాదం మొదటి పాదం సగంలో ఒక అంశాన్ని, మూడు నాలుగు పాదాల్లో వేరే అంశాన్ని వచ్చేటట్లు చేశారు. మూల శ్లోకాన్ని యథాతథంగా అనుసరించడమే కాకుండా చక్కనైన తెలుగు పదాల సొంపులతో, లయబద్ధమైన నడకతో ఉన్న ఈ పద్యం మనసుకు హత్తుకుంటుంది.

ఉదాహరణకు: సంస్కృతంలో **'రజనికరునికంటే'** అనే పదాన్ని **'చందమామ'** దగ్గరి బంధువు. **'మహశీతము'** అంటే **'చలువా'** అని కచ్చితమైన అనువాదం చేశారు. అలాగే మూడు నాలుగు పాదాలు ఎక్కడా విరుపు లేకుండా సాగిన ఈ పద్యం లయబద్దతకు నిదర్శనంగా రచించారు.

ఈ కావ్యం వ్యక్తి తన జీవితంలో అలవరుచుకోవాల్సిన అనేక అంశాలను కళ్లముందు ఉంచుతుంది. మంచి గుణాలనూ, చెడు గుణాలనూ వేరు చేసి చూపిస్తోంది. మన కర్తవ్యాలనూ, ధర్మాధర్మాలనూ వెరసి కార్యాచరణనూ స్పష్టంగా గుర్తుచేస్తోంది. ఇదే ఈ కావ్యపరమప్రయోజనం. సుందరపాండ్యుని విశ్వశ్రేయమైన మంచి వాక్యాలను రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ తెలుగులోకి తీసుకోరావడం తెలుగువారు చేసుకొన్న భాగ్యం. ఈ అనువాదంలో రాళ్ళపల్లివారు సంస్కృత పదాలకు అనుగుణంగా వాడిన తెలుగు పదాలు ఎంతో సుందరమైనవిగా కనబడతాయి. ఎక్కడా కూడా భావం చెడిపోకుండా, అర్థం అస్తమించకుండా చాకచక్యంతో, నిశితమైన పరిశీలనా దృష్టితో అల్పాఅక్షరాలలో అనల్పార్థాన్ని స్ఫురింపజేశారు శర్మగారు.

## 2.11. రాళ్ళపల్లి వారి విమర్శ రచనలు

రాళ్ళపల్లివారి విమర్శ రచనల్లో *'వేమన'* (1929), *'నాటకోపన్యాసములు'* (1935) *'సారస్వతాలోకము'* (1954), *'రాళ్ళపల్లి పీఠికలు'* (1979) ఇటీవల 2017లో ఎమెస్కో బుక్స్ పబ్లికేషన్స్ *'రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు'* అనే పేరుతో ప్రచురించారు. శర్మగారి అముల్యామైన సాహిత్య కృషిని వెలుగులోకి తీసుకొచ్చారు. వీటిటన్నిటిలో ఆయా అంశాలను లోతుగా తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం.

### 2.11.1. వేమన

1928లో ఆంధ్ర విశ్వకళా పరిషత్తు వేమనపై పరిశోధన చేయాలని సంకల్పించి అనంతరం ఆ పనిని రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారికి అప్పగించి. ఈ పరిశోధనను శర్మగారు దాదాపు ఆరునెలల్లో పూర్తి చేసి, వారికి సమర్పించారు. ఆంధ్ర విశ్వకళా పరిషత్తు 1928 లోనే ఓ వారం రోజుల పాటు వేమనపై ఉపన్యాసాలు ఇవ్వడానికి సమావేశం ఏర్పాటు చేశారు. ఇవి అనంతపురంలోని సీడెడ్ డిస్ట్రిక్ట్ కాలేజ్ (నేటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల) లో జరిగాయి. అందులో శర్మగారు వేమనపై రోజుకొక ఉపన్యాసం చొప్పున ప్రసంగించారు. వాటిని ఆంధ్ర విశ్వకళా పరిషత్తు 1929లో *'వేమన'* అనే పేరుతో ఒక పుస్తకంగా కూడా ప్రచురించింది. శర్మగారు కట్టమంచి రామలింగారెడ్డి ప్రోద్బలంతోఈ పరిశోధన కొనసాగించారు. ఈ గ్రంథంలో ఏడు ఉపన్యాసాలున్నాయి. అవి వరుసగా 1. ఉపోద్ఘాతము. 2. వేమన కాల దేశములు. 3. వేమన సంసార స్థితిగతులు. 4. వేమన కాలమందలి మత ధర్మముల స్థితి. 5. వేమన యోగసిద్ధి – మతధర్మముల స్థితి. 6. వేమన వంటివారు. 7. వేమన కవిత్వము, హాస్యము, నీతులు అనే సుదీర్ఘమైన వ్యాసాల ఉద్గ్రంధమిది. వీటిలోని విషయాల్ని స్థూలంగా తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం.

- **వేమనలో తొలి వ్యాసం ఉపోద్ఘాతము**

*'వేమన ఆంధ్రులలో సాటిలేని వ్యక్తి'*[68] అంటూ ప్రారంభమైన ఈ వ్యాసం వేమన గురించి ఎన్నో విషయాన్ని మన ముందుంచింది.

ఆ బ్రహ్మదేవుడే అద్వితీయమైన ప్రతిభతో వేమనను సృష్టించారని రాళ్ళపల్లివారు అన్నారు. తత్త్వవేత్తలు, కవులు, విద్వాంసులు మొదలైన మహానుభావులు ఈ సమాజంలో కోకొల్లాలు. కాని వీళ్ళలో ఎక్కువ మంది సంకోచ స్వభావులై ఉండి ఉంటారు. అంతెందుకు బాధ్యత మరిచి నాకెందుకులే అనుకొనే వాళ్ళే ఈ సమాజంలో ఎక్కువ. 'నాకీయలేదని' తిట్టేవారే కాని, 'నీవు చెడిపోతున్నావని' తిట్టినవారు చాలా అరుదని వ్యాసకర్త అన్నారు. అయితే వేమనపై వారిలో చేరడనీ, వేమన భిన్నమైన మనస్తత్వం కలిగిన వాడని, సమాజంలో ఈయన తీసుకొచ్చినంత చైతన్యం మరెవరూ తీసుకోరాలేకపోయారని రాళ్ళపల్లివారు ఉద్ఘాటించాడు.

వేమన సామాన్య ప్రజలకు దగ్గరవ్వడానికిగల బలమైన కారణాలను ఉన్నాయని శర్మగారు చెబుతూ… కందుకూరి వీరేశలింగం, సి. పి. బ్రౌన్ మొదలైన వాళ్ళు వేమనను కవిగా గుర్తించలేక పోవడాన్ని తప్పుబట్టారు. సుమారు 2264 పద్యాలు వేమన రాసి ఉండవచ్చని తేల్చిచెప్పారు. కాని కొందరు పరిశోధకులు వేమన రాయని పద్యాలను కూడా వేమన ఖాతాలో వేయడం సరికాదని అన్నారు. వేమన మతాన్ని, స్వభావాన్ని, కవిత్వాన్ని, భాషను ఏమాత్రం గమనించకుండా తమ పరిశోధనలు కొనసాగించడం బాధాకరమని అన్నారు. ఒక వేళ ఏవైన పద్యాలు రాసినా అందులో ఎన్నో తప్పులను రాయటం జరిగిందన్నారు. తెలుగు సాహిత్యంలో *'అప్పకవీయము', బాలవ్యాకరణము'* ఎన్ని దెబ్బలు తిన్నాయో, వేమన పద్యాలు కూడా అన్ని దెబ్బలు తిన్నాయని శర్మగారు నొక్కి వక్కాణించారు. వేమన తన రచనలో ఏ నియమానికి లోబడినవాడు కాదని, పెద్దగా ఛందో పరిజ్ఞానం కూడా వేమనకు లేదని రాళ్ళపల్లివారి అభిప్రాయం.

వేమన తత్త్వదృష్టితో రాసిన కొన్ని పద్యాలు మనకు అర్థం కావు. అంతేకాక ఇందులో కొన్ని పద్యాలు అసలు వేమనవై ఉండవు. వేమన 619 ఆటవెలదుల్నీ, 102 కందాల్నీ, 324 తేటగీతుల్నీ రచించారని రాళ్ళపల్లివారు గుర్తించారు. వేమన పద్యాలను అక్కడక్కడ శైలిమార్చి రాసినా ఇట్టే గుర్తుపట్టవచ్చన్నారు. ఎందుకంటే వేమన రాసే విధానం సులభంగా గుర్తుపట్టడానికి అవకాశముందన్నారు. ఇప్పటి వరకు పరిశోధకులుగాని, విమర్శకులుగాని వేమన పద్యాలను లోతుగా పరిశీలించక పోవడం దురదృష్టమని అన్నారు.

వేమన పద్యాలపై ఆధునికులు చేసిన సవరణల్ని దృష్టిలో పెట్టుకొని ఇష్టమెచ్చినట్లు అనువాదం చేయటం మరేం బాగా లేదంటూ…*''స్వచ్ఛందముగా పరువెత్తుబిడ్డల కాళ్ళకు సంకెళ్ళు తగిలించుట వంటి.''*[69] దని అభిప్రాయపడ్డారు. వేమన పద్యాల్లో ఉన్న మకుటం

---

[68] వేమన. పుట. 3.

[69] వేమన. పుట. 12.

గురించి లోతైన పరిశోధనకావించిన శర్మగారు 'విశ్వదాభిరామ' అన్నది మాత్రమే నిజమైందని చాలా స్పష్టం చేశారు.

వేమన పద్యాలు ఇలా ఉంటే మేలని అన్నవారు ఎక్కువ కాని, ఇలానే ఉండవచ్చునని చెప్పినవారు చాలా అరుదుగా ఉన్నాయని శర్మగారు చెప్పారు. వ్యాసం చివర్లో తెలుగువారి ఔదార్యాన్ని తప్పుబడుతూ, పొరుగుదేశం సి.పి. బ్రౌన్ కు ఉన్నంత చొరవ బాధ్యత తెలుగువాళ్ళకు లేదంటూ రాళ్ళపల్లివారు ఈ ఉపోద్ఘాతంలో ఎన్నో విషయాలను మన కళ్ళముందుంచే ప్రయత్నం చేశారు.

- **వేమన కాల దేశములు**

ఈ వ్యాసంలో రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ వేమన దేశ, కాలాల గురించి లోతుగా చర్చించారు. దీని కోసం పురాణం, చరిత్ర మార్గాలను ఆధారంగా చేసుకొని వేమన రాయలసీమ ప్రాంతానికి చెందిన వాడని నిరూపించే ప్రయత్నం చేశారు.

ఇంగ్లీషువారు భారతీయులకిచ్చిన విజ్ఞానంలో చరిత్ర ఒకటి. ఇది మంచి పద్ధతని శర్మగారు అన్నారు. ఈ ధోరణి తెలుగువారిలో కూడా కొంత వరకు ఉందని భావించారు. ప్రాచీనులకు, ఆధునికులకు మధ్య వుండే పరిశోధన తారతమ్యాలను తెలిపారు. ప్రాచీనులు దేన్నైనా తేలికగా నమ్ముతారని, ఆధునికులు కారణం లేకుండా దేన్నీ నమ్మరని రాళ్ళపల్లివారు అన్నారు. కానీ ప్రాచీనులు కచ్చితమైన విషయాలను తెలిపే ప్రయత్నం చేస్తారు. అదే ఆధునికులు మాత్రం అతి వినయం ధూర్త లక్షణంగా ప్రవర్తిస్తారని అభిప్రాయపడ్డారు. ''*ప్రాచీన పురాణములలో వస్తుస్థితిని ముంచివేయునన్ని విషయములు లభించుచుండఁగా, ఆధునికుల చరిత్రలలో అసలు సత్యమే పూర్ణముగా లభింపక తునకలు తునకలుగా*''[70] ఉంటుందని ఒకటే మాటలో చెప్పారు.

వేమన దేశ కాలాదులను అంచనా వేయడానికి పరిశోధకులు పురాణ, చరిత్ర పద్ధతులను ఎంచుకుని ఎవరికి ఏది తోస్తే అది చెప్పటానికి ప్రయత్నించారు. అది ఎలాగంటే వేమనను పురాణ కారుల ఒక దృష్టితో చూస్తే, చరిత్రకారులు మరో దృష్టితో చూడటం జరిగిందన్నారు. మిగతా శాస్త్రాల వారు పరిశీలిస్తే మరో పద్ధతిలో చూపిస్తారని శర్మగారు అన్నారు. పురాణకారులవి అతిశయోక్తులెక్కువైతే, చరిత్రకారులవి అసత్యాలధికమని అన్నారు. ఇలా ఎవరికి ఏది తోస్తే అది చెప్పటం వల్ల నిక్కమైన నిజాలు తుడిచి పెట్టుకొని పోతాయని ఉద్ఘాటించారు.

ప్రారంభంలో వేమన పరిణామం ఎలా ఉండేదన్న అంశాలను వ్యాసకర్త స్పష్టంగా వెల్లడించారు. తర్వాత పురాణ అంశాలను, చరిత్ర విషయాలను తులనాత్మకంగా పరిశీలించి యథార్థాలను నిగ్గుతేల్చారు. వేమన మీద ముందు పరిశోధన చేసిన వారు వేమన కొండవీటి రెడ్డిరాజులకు సంబంధించిన వాడని చెప్పారు. కాని ఇది నిజం కాదని శర్మగారి వాదన. అలాగే

[70] వేమన (పుట:25)

వేమనకు ప్రబంధ కవులకు చాలా తేడాలున్నాయని అన్నారు. వేమన జన్మస్థలం చెప్పడానికి కింది పద్యాన్ని ప్రస్తావించారు.

*"ఆ. ఊరు కొండవీడు ఉనికి పశ్చిమవీధి*
*మూగచింతపల్లె మొదటి యిల్లు*
*ఎడ్డెరెడ్డికులమదేమని తెల్పుదు"* ॥విశ్వ॥ (పుట:30)

వేమన సమాధి ఉన్న కటారుపల్లి ప్రాంతాన్ని సందర్శించిన రాళ్ళపల్లివారు నిజాలను బయటపెట్టారు. వేమన సంసార జీవితానికి సంబంధించిన యథార్థ స్థితిగతులను వ్యాసంలో స్పష్టం చేశారు. పూర్వ పరిశోధకులు కొందరు పురాణాలలో ఉండే అంశాలనే ఆధారంగా చేసుకొని పరిశోధన కొనసాగించారన్నారు. కొండవీడుకు చెందిన వేమన, కటారుపల్లికి చెందిన వేమన వేరని రాళ్ళపల్లివారు తేల్చారు. శర్మగారు సుమారు ఎనభైఐదేళ్ళ వయస్సున్న నల్లచెఱువు చెన్నయ్యను, షేక్ అలం అనే వ్యక్తులను కలిసి వేమన గురించి కొన్ని విషయాలను తెలుసుకొన్నారు.

వేమన ప్రాంతానికి చెందిన విషయాన్ని ఎన్. గోపిగారు తమ సిద్ధాంత గ్రంథంలో ఇలా పేర్కొన్నారు.

*ఊరు కొండవీడు ఉనికి పశ్చిమ వీధి*
*మూక చింతపల్లె మొదటి వీడు*
*అరశి చూడ బయలు ఆది ముక్తిశివుడయా* [71] ॥విశ్వ॥
(డి. 1769.171)

పై పద్యంలో రెండవ పంక్తికి పాఠ భేదం ***'మూక చింతపల్లి మొదటి వీడు'*** అని ఉండగా రాళ్ళపల్లివారి పాఠంతరం ***'మూగ చింతపల్లి మొదటి యిల్లు'*** అని ఉంది. దీన్ని బట్టే శర్మగారు మూగ చింతపల్లే వేమన ఊరై ఉండవచ్చునని భావించారు.[72] అయితే ఎన్. గోపిగారు ***'మూక చింతపల్లి మొదటి వీడు'*** అనే పాఠాంతరం చెప్పారు. ఇది అన్వయ ధ్యేయంగా ఈ పాఠాంతరాన్ని అంగీకరించారు.[73]

ఆరుద్రగారు కూ॥ వేమన ప్రాంతానికి సంబంధించిన పద్యాన్ని ఉదహరించారు. అది.

*ఊరుకొండవీడు ఉనికి పశ్చిమవీధి*
*మూగసేతకెల్ల మొదటియిల్లు*
*యరసి చూడ చూడ నదియుక్తి మార్గమే*
*విశ్వదాభిరామ వినురవేమ* [74] (D.174–ప. 467)

[71] ప్రజాకవి వేమన. పుట. 109.

[72] వేమన. పుట. 26

[73] ప్రజాకవి వేమన. పుట. 111.

[74] మన వేమన. పుట. 105.

ఈ పద్యంలో ***'మూగసేతకెల్ల'*** అని ఉంది. ఇదే పేరు రాళ్ళపల్లివారు ఉదహరించిన దానిలో ***'మూక చింతపల్లి'*** అని ఉంది. ఎన్. గోపిగారు ఉదహరించిన పద్యంలో కూడా ఈ ***'మూక చింతపల్లి'*** అనే ఉంది. కాబట్టి వేమన ప్రాంతం విషయంలో ఎన్నో భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికి అనంతకృష్ణశర్మగారు మాత్రం రాయలసీమలోని మూగ చింతపల్లే నని తేల్చి చెప్పారు.

అక్కడక్కడ వేమన రాయని పద్యాలను కొందరుదహరించారని శర్మగారన్నారు. 'వేమన సూక్తి రత్నాకరము' 'బాల చక్రవేమ భవ్యనామ' అనే మకుటంతో రెండు పద్యాలున్నాయని అవి వేమన పద్యాలు కావని అన్నారు. వేమన కాలాన్ని పరిశోధకులు క్రీ. శ.1780– క్రీ.శ.1869 గా గుర్తించారని చెప్పి, వేమన కుటుంబ సమాచారాన్ని సైతం శర్మగారు ప్రస్తావించారు. వేమన దాదాపు 89 సంవత్సారాలు జీవించినట్లు పరిశోధకులు రాయడం సందేహాలకు తావిచ్చిందని అనుమానం వ్యక్తం చేశారు. వేమన కాల నిర్ణయంలో కాంబెల్, సి. పి. బ్రౌన్ దొరలిరువురి నిర్ణయాన్ని శర్మగారు తప్పుబట్టారు.

ఇక వేమన నివసించిన ప్రాంతం అనంతపురం జిల్లా కదిరి తాలుకాలోని కటారుపల్లి అయివుండొచ్చని శర్మగారు నిరూపించే ప్రయత్నం చేశారు. దీనికి అనేక కథనాలను వ్యాసంలో పేర్కొన్నారు. ఉదాహరణకు *'కదిరి తూర్పునందు'*[75] అనే పాఠాంతరాన్ని పరిశోధకులు తప్పుగా అర్థం చేసుకున్నారని శర్మగారు ఉద్ఘాటించారు. ఈ పాఠాంతరాన్ని సరిగా అర్థం చేసుకోకుండా వేమన ప్రాంతంపై సందిగ్ధ ప్రదేశాలను మన ముందుంచటం తప్పని చెప్పారు. ఇలా పురాణాలకు సంబంధించిన విషయాల్ని తమ ఉపన్యాసంలో సోపపత్తీకరించాడు వ్యాసకర్త.

మరో కొణంలో వేమన గురించి చారిత్రక పరిశోధన చాలా విరివిగా జరిగిందని దాన్ని కూడా పరిశీలించాలని రాళ్ళపల్లివారు అన్నారు. ఈ విషయంలో సి. పి. బ్రౌన్, వంగూరి సుబ్బారావు, బండారు తమ్మయ్య లాంటి హేమా హేమీలు పరిశోధన చేసి అనేక అంశాలు తెలిపారు. కాని వీటిలో కొంతవరకు వాస్తవం లోపించడం పరిపాటని అన్నారు. వంగూరి సుబ్బారావు వేమన గురించి చెప్పిన అంశాలు 'కుక్కతోక పట్టుకొని గోదావరీదినాడు' అన్నట్లు ఉన్నాయని పునరుద్ఘాటించారు. కొందరు వేమనను శ్రీ కృష్ణదేవరాయల సమకాలికుడని చెప్పగా, మరికొందరు కాలాన్ని అంచనా వేయడానికి *'మల్హణ చరిత్రము'* (ఎడపాటి ఎర్రన) *'నాగరఖండ'*, (తురగా రాజకవి) *'తోభ్య చరిత్రము'*. (పింగళి ఎర్రనార్యుడు) లలో వేమనను పేర్కొనటంతో 15వ శతాబ్దం వాడుగా తోచే అవకాశముందన్నారు. కాని ఇది ఊహాజనితమైందే తప్ప నిజం కాదు. 16, 17 శతాబ్దపు కాలం వాడని మరికొందరంటే ఇది కూడా సరైంది కాదని బహుశా వేమన 18వ శతాబ్దానికి చెందిన వాడని శర్మగారు అభిప్రాయపడ్డారు.

---

[75] వేమన. పుట.35.

వేమన రాసిన పద్యాల్లో ముస్లిముల పెత్తనం వల్ల ఆనాడు హిందువులు పడిన కష్టాలు అక్కడక్కడ చోటుచేసుకోవడం జగిందని శర్మగారు అన్నారు. శ్రీకృష్ణ దేవరాయల కాలంలో ఇది ప్రబలంగా కనిపిస్తుందని చెప్పారు. తర్వాత కొంత కాలానికి ముస్లిముల ప్రాబల్యం తగ్గిన విధానం కూడా తారసపడుతుందని, దీని వల్ల వేమన కాలాన్ని తెలుసుకొనే అవకాశం ఉందని రాళ్ళపల్లివారు  చెప్పారు. అప్పట్లో వేమన వైష్ణవ ఖండనం తీవ్రంగా చేసినట్లుందని కొన్ని కారణాలు కూడా చూపించారు. దీనివల్ల వేమన దత్తమండలాల ప్రాంతానికి చెందినవాడని ఒక నిర్ణయానికి వచ్చారు. ముఖ్యంగా సి. పి. బ్రౌన్, వంగూరి వంటి వారు వేమన ప్రాంతాల గురించి భిన్నాభిప్రాయాలు వెల్లడించారని శర్మగారు అన్నారు. ఒక సందర్భంలో వంగూరి వారు బ్రౌను, కాంబెలు దొరల నిర్ణయాన్ని స్వదేశాభిమానమేనంటూ...''నా స్వదేశాభిమానము సత్యమునే *మఱుఁగుపఱుచునంత దట్టముగ ముదిరి బలిసినదని నే నింకను అనుకోనలేదు.''*[76] అని శర్మగారు అభిప్రాయపడ్డారు.

దత్తమండలాలలో వేమనకు ఉన్నంత గుర్తింపు మరెవరికీ లేదని రాళ్ళపల్లివారి అభిప్రాయం. ఇతని శిష్యులు కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలలో కూడా విస్తరించటం విశేషమన్నారు. వేమన వాడిన పదాలు మంకు, తారాడు, సంబళము, దుడ్డు, బిత్తలి మొదలైన వాటివల్ల ఈయన దత్తమండలాలకు చెందిన వాడనన్న వాదాన్ని శర్మగారు బలపరిచారు. వేమన ప్రాంతాన్ని నిర్ణయించడానికి మరో ప్రధాన కారణం బసివిని పద్ధతి. ఈ బసివిని విధానం కేవలం కర్ణాటక ప్రాంత ప్రభావంతో దత్తమండాలాల్లో ఎక్కువగా ఉందని శర్మగారు గుర్తుచేశారు. అంతేకాక కాలజ్ఞానం చెప్పే పద్ధతి కూడా తెలుగు ప్రాంతంలో ఉందని, ఈ ప్రభావం వేమనలో కలదని చెప్పారు. ఇంతకంటే ఆధారాలతో వేమన వేరే  ప్రాంతానికి చెందినవాడని నిరూపిస్తే! వేమనను నేనే పల్లకిపై తీసుకెళ్ళి అక్కడ కూర్చోబెడతానని వ్యాసకర్త చమత్కరించారు.

ఈ విధంగా రాళ్ళపల్లివారు వేమన దేశకాలాదులను నిర్ణయించడానికి ప్రయత్నించిన తీరు వీరి పరిశోధన ఘటిమకు నిదర్శనమనచ్చు.

- **వేమన సంసార స్థితిగతులు**

ఈ ఉపన్యాసంలో రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ వేమన సంసార స్థితిగతులను తెలియజేశారు. వేమన సంసారాన్ని 'మాయ'తో పోల్చాడని కొందరు అన్నారు. కానీ శర్మగారు ఈ మాయను మాయలాగానే ఉండనీకుండా దొరికిన ఆధారాలను బట్టి కొంత పరిశోధించటం జరిగింది. వేమన రాసిన పద్యాలే ఈయన సంసార స్థితిగతులను తెలుపుతాయని ఆయా విషయాల్ని తెలిపారు.

వేమన ఏ ప్రబంధ, పురాణ కవుల్లాంటివాడు కాదు. ఆనాటి సభ్య సమాజానికి ఓ వైతాళికుడి లాంటివాడు. స్వానుభావం ఇతని ఆయుధం. దీన్నే జీవనగుణంగా భావించాడని

[76] వేమన. పుట. 41.

వేమన మనస్తత్వాన్ని బట్టి వ్యాసకర్త అంచనా వేశారు. వేమన కులం గురించి ఎన్నో కథనాలు వినిపిస్తున్నాయని చెప్పిన వ్యాసకర్త చివరికి ఈయన కాపు కులానికి చెందినవాడని నిర్ధారించారు. వేమన తల్లిదండ్రులు చదువుకోలేదు. అయినా చదువుకున్న పండితులు వీరి ఇంటికి రావటం వల్ల అక్కడ జ్ఞాన వాతావరణం నెలకొని ఉండేది. ఈ ప్రభావం కొద్దో గొప్పో వేమనపై పడింటుందని శర్మగారు చెప్పారు. అదే సమయంలో వేమనకు అభ్యుదయ భావాలు కూడా అలవడ్డాయని శర్మగారు గుర్తుచేశారు.

వేమన చదువుతో పాటు సంగీత విద్యను కూడా నేర్చుకున్నాడు. చిన్నప్పటి నుండి వేమన శివభక్తి తత్పరుడు కావటం వల్ల ఆ పూజావిధానంలో ఉండే తంత్రాలన్నీ వేమన కొంతవరకు తెలుసుకున్నాడు. తన చుట్టూ ఉండే హిందు సమాజాన్ని సునిశితంగా పరిశీలించి, అక్కడున్న దుర్గుణాలను తమ పద్యాల్లో నిరసించాడని శర్మగారు తెలిపారు. దేవునికి లేనిపోని నైవేద్యాలు పెట్టడం, బలులివ్వటం వంటి దురాచారాలను రూపుమాపడానికి వేమన ఒడిగట్టాడు. వేమన చిన్నప్పటి నుండి సంప్రదాయ వాతావరణంలో పెరగటం వల్ల కొన్ని భావాలను అణుచుకున్నాడు. కాని రాను రాను ఆ భయాలనుండి బయటపడి సమాజ శ్రేయస్సును కోరుకున్నవాడని రాళ్ళపల్లివారు అన్నారు.

వేమన రాసిన పద్యాల్లో 'తల్లిదండ్రుల మీద దయలేనివాడు పుట్టినా గిట్టినా ఒకటే', 'పట్టుపట్టరాదు పట్టువిడువరాదు' మొదలైన పద్యాల్లెన్నింటిలోనో వేమన వ్యక్తిత్వ వికాసాన్ని మన ముందుంచుతున్నాయని వ్యాసకర్త అన్నారు. వేమన పద్యాలను జాగ్రత్తగా పరిశీలిస్తే, సమాజ వికాసం, పరిణామం బాగా అవగతమవుతుంది. పద్దెనిమిదవ శతాబ్దంలో హిందువుల దురాచారాలు సమాజాన్ని అస్తవ్యస్తం చేసిన విధానం కనిపిస్తుందని శర్మగారు గుర్తించారు. ఆనాడు వేశ్యావృత్తి చాలా ప్రబలంగా ఉండేదని దానికి వేమన కూడా బానిసై పోయాడని అన్నారు. అంటే వేమనకు చిన్నప్పటినుండే మంచి చెడుల మధ్య తారతమ్యం తెలుసు కాబట్టి ఒకానొక స్థాయిలో ఇలాంటి వ్యసనాలకు అలవాటుపడినప్పటికీ వాటినుండి తొందరగానే బయటపడగలిగారు. వేమన తన జీవితంలో అన్ని పరిణామాలను చూసి దేనికి ఏది పరిష్కారమో తానే స్వయంగా యోచించుకొనేవారు. ఇలా ఆలోచించేవారు సమాజంలో చాలా తక్కువ మంది ఉంటారని అనంతకృష్ణులవారి అభిమతం.

వేమన చాలా దుర్భరమైన జీవితాన్ని గడిపినట్లు శర్మగారు వ్యాసంలో చెప్పారు. ఉదాహరణకు వేమన వేశ్యాలోలుడు కావడం వల్ల సంసారం చాలా దెబ్బతినటం జరిగింది. ఇంటి పెద్దలు వేమనకు వివాహం చేసి చెడ్డ తిరుగుడును ఆపడానికి ప్రయత్నం చేశారు. కాని అది ఎక్కువ కాలం నిలువలేదు. కొంతకాలానికి వేమన తనకు భార్యతప్ప మరేది లేదనుకుని ప్రేమా వ్యామోహాలు పెంచుకున్నారు. అయితే భార్య మాత్రం ఇతని పట్ల అంటీ ముట్టనట్లుగానే ఉండటాన్ని వేమన గుర్తించగలిగాడన్న లోతైన అంశాలను వ్యాసంలో చూడవచ్చు.

వేమన చాలా సున్నితమైన మనస్తత్వం కలిగినవాడని వ్యాసకర్త అభిప్రాయం. వేమన అనుభవాలన్నీ పద్యాల్లో ఉండడం పరిపాటి. ఒక్కో సందర్భంలో వేమన తినడానికి తిండికూడా లేని పరిస్థితులను కూడా ఎదుర్కొన్నాడు. ఆకలి అనేది మనిషికి సహనం కోల్పోయేలా చేస్తుందని వేమన అనుభవ పూర్వకంగా తెలుసుకొన్నాడు. అసలు మనిషికి జీవితంలో ధనం అనేది చాలా అవసరమని ఉద్బోధించిన వేమన 'ధనము వెంటరాదు ధర్మంబు చేయరో' అని ఉద్బోదించారు. దీన్ని గమనిస్తే సమాజంలో ప్రజలు ఎంత బాధ్యతా రాహిత్యంగా ఉన్నారన్నది తెలుస్తుంది. లోకంలో ప్రతి ఒక్కరు ఇచ్చిపుచ్చుకోవాలని చెప్తూ, ఇచ్చేవాడికి ఇప్పించుకొనేవాడు లోకువన్నట్లు అనంతకృష్ణులవారు సూచించిన పద్యమిది.

> **"ఆ. ఇచ్చువానిచెంత నీయనివాఁడున్న**
> **చచ్చుఁగాని యీవి సాఁగ నీఁడు**
> **కల్పతరువు క్రింద గ్రచ్చచెట్లున్నట్లు..."** (పుట: 65)

వేమన ఏ సందర్భంలో ఉన్నా, అక్కడేదైన జరిగినా తన పద్యాల్లో ఇట్టే అల్లేయగలిగిన ప్రతిభా సంపన్నుడు. అదికూడా ప్రజలకు అర్థమయ్యే భాషలోనే చెప్పటం వేమన ప్రత్యేకత. వేమన పద్యాలను పరిశీలించిన సంస్కరణ వాదులను కూడా కొన్ని సందర్భాల్లో విస్తుపోక తప్పలేదు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో సమాజం అప్పుడప్పుడే పురోభివృద్ధి సాధిస్తున్న సమయమది. సత్యాలను తెలుసుకొని మెలిగేవారు బహుకొద్ది మంది మాత్రమే ఉంటారు. అలాంటి సందర్భంలో కూడా వేమన ఎంతో జ్ఞానాన్ని ప్రదర్శించడం ప్రశంసనీయమని వ్యాసకర్త తెలిపారు. ఇలాంటి సాంకేతిక అంశాలకు సంబంధించి కొందరు పద్యాలకు అర్థాలను మార్చేందుకు ప్రయత్నించడం పొరపాటన్నారు. అప్పుడప్పుడు సి. పి. బ్రౌన్ కూడా సాంకేతికత ఉన్న పద్యాలకు సరైన వ్యాఖ్యానం చేయలేదని విమర్శించారు. అయితే కొందరు ఆ వేమన పద్యాలకు మంచి అర్థవివరణ ఇచ్చారు. ఉప్పు, కర్పూరం ఎలా కరిగిపోతాయో అలా వేమన కూడా కరిగిపోయి పద్యాలు రాశాడని శర్మగారు అన్నారు. ఇంకా వేమన కొంత కాలం కంసాలి కులం వాళ్ళతో గడిపిన సందర్భాలను కూడా వ్యాసంలో స్పృశించారు.

ఈ విధంగా రాళ్ళపల్లివారు వేమన సంసార స్థితిగతులను పరిశోధనాత్మకంగా, పటిష్ఠమైన ఆధారాలతో ఈ ఉపన్యాసంలో వెల్లడించారు.

- **వేమన కాలమందలి – మతధర్మముల స్థితి**

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ ఈ ఉపన్యాసంలో వేమన కాలంలోని మతధర్మాల స్థితిని ఎంతో పరిశోధనాత్మక దృష్టితో ఆవిష్కరింపజేశారు.

వేమన కాలంలో చాతుర్వర్ణ్య వ్యవస్థ అమల్లో ఉండేదని, ఈ నిచ్చెనమెట్ల సమాజంలో ఆధిపత్య వర్గాలదే పైచేయని, ఛాందసమైన భావాలు నెలకొన్న ఆకాలంలో పై వర్గాల వారు కింది వర్గాలవారిని హీనంగా చూసేవారని, దాంతో అట్టడుగు ప్రజలు ఎన్నో ఇబ్బందులు

పద్దారని, దీనంతటికి కారణం అప్పుడు వెలసిన మత సిద్ధాంతాలే కారణమని శర్మగారు ఈ వ్యాసంలో గుర్తుచేశారు.

ఆనాడు వైష్ణవం, వీరశైవం, శాంకరము లాంటి మతాలు బాగా ప్రచారంలో ఉన్నాయి. ఎవరి ఆధిపత్యాన్ని వారు చాటుకోవడానికి శత విధాల పరితపిస్తున్న సందర్భం నెలకొని ఉండేది. ద్వైతం, అద్వైతం సమాజంపై ఎంతో ప్రభావాన్ని చూపాయి. ఇంకా చిన్న చిన్న గ్రామదేవతలు, ఊరి దేవతలు కూడా తమ అస్తిత్వాన్ని నిలబెట్టుకోవడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్న కాలమది. సరిగ్గా వేమన ఆ కాలంలోనే జీవనం గడిపాడు. కాబట్టి వేమన ఆ ప్రభావానికి లోనుకాక తప్పలేదు. ఈ పరిస్థితుల్లో వేమన ఎలా మెలగగలిగారు? లేదా వేమనను ఆపరిస్థితులు ఎలా మార్చగలిగాయన్న అంశాల్ని కూలంకషంగా తెలిపారు.

రాళ్ళపల్లివారు వేమనకు ఇంటి పోరుకన్న వీధిలోని పోరు ఎక్కువ ఉండేదని చెప్తూ, అప్పటి మతధర్మాల స్థితి గతులను కళ్ళముందుంచారు. అలాగే ప్రాచీన కాలానికి, నేటికాలానికి చాలా భేదాలను చూపించారు. అవి: నాడు మోక్ష మార్గాన్ని ప్రధానంగా భావించేవారని, నేడు ఆర్థిక సంబంధాలే ఎక్కువని గుర్తుచేశారు. ప్రాచీనులు ధర్మాన్నే ప్రధాన కేంద్రంగా భావించేవారు. ఆధునికలు హోదాలను ప్రముఖంగా చూస్తున్నారని శర్మగారు ఉద్ఘాటించారు. శర్మగారు మనసుకి సంబంధించిన ఆలోచనా విధానాన్ని చాలా చక్కగా చెప్పే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా ధర్మానికి, న్యాయానికి మధ్య ఉన్న తారతమ్మాలను చాలా స్పష్టంగా వివరించారు. నిజానికి న్యాయం అనేది మానవులకు సామాన్యమైందిగా ఉంది. అదే ధర్మం అవాంతర విషయాలకు చెంది ఉంటుందంటూ...*"పంచములను కూడా మనవంటి మనుషులుగా భావించి దగ్గరకు చేర్చుట న్యాయము. కాని హిందువుల ధర్మము కాదు"* [77] దీన్ని బట్టి న్యాయం ఎన్నో మార్పులకు లోనౌతుందని శర్మగారు అన్నారు. ధర్మమనేది మార్పులకు లోనుకాదని వివరిస్తూ, వ్యాసకర్త న్యాయం అనేది సమాజానికి అత్యంత ఉపయోగకరమని చెప్పాడు. ఆధునికులపై ప్రాచీనులు ఎన్నో విషయాల్లో గొప్పగా ఉన్నారని శర్మగారి అభిప్రాయం. కాని ఇద్దరి మనోభావాలు మాత్రం ఒకటేనన్నది మరువకూడదన్నారు. ప్రాచీనుల సంకల్పబలాన్ని నేటి సమాజం అలవరుచుకోవాలని వ్యాసకర్త ఆకాంక్షించారు.

అధర్మం నడుస్తున్న కాలంలో వేమన జీవించారు కాబట్టి అప్పటి దురాగతాలను రూపుమాపడానికి ఎంతో కృషి చేయడం జరిగిందని రాళ్ళపల్లివారు అన్నారు. ధర్మాన్ని గుడ్డిగా నమ్మే ఛాందసమైన భావాలు ఎప్పటికీ సమాజం మార్పుని కోరుకోవని భావించిన వేమన సంఘ సంస్కరణకు పూనుకొన్నారని చెప్పారు. ఇలా వేమనలో మార్పు రావడానికి ఈ సమాజమే దోహదం చేసిందని పునరుద్ఘాటించారు. వేమన వీరశైవుడిగా ఉన్నప్పుడు ఆయన ఆలోచనల్లో తేడాలుండేవని శర్మగారు వివరించారు. ఒక్కో సందర్భంలో వేమన అద్వైత వేత్తగా కనిపిస్తాడు. ఇవన్నీ ఆయనలో జరిగిన క్రమమైన మార్పులకు నిదర్శనం. కాని ఒక్కో సందర్భంలో వేమన

---

[77] వేమన. పుట. 73.

అద్వైతాన్ని ఒప్పుకోక పోవడం పరిపాటి. మరికొన్ని సందర్భాల్లో బ్రాహ్మణత్వాన్ని ఈసడించుకోడం కూడా జరిగింది. దీనివల్ల వేమన సమాజపు కాంక్షను కోరుకున్నాడే తప్ప మరేమీలేదని శర్మగారు పరిశోధనాత్మకంగా నిరూపించారు.

ఆకాలంలో కొందరు మత మార్పిడులకు కూడా పాల్పడినారు. పై వర్గాల వారు తమ తమ కుల మతాల అధిక్యాన్ని కాంక్షించారు. కొన్ని సందర్భాల్లో తామే ధీరులమని భుజాలు తడుముకున్నారు. దీని వల్ల హోదా, ఔదార్యం మరింత పెరిగాయి. చాతుర్వర్ణ్యవ్యవస్థలో న్యాయానికి కాలం లేకుండా పోయిన సందర్భాలు వేమన కాలంలో మనకు ప్రత్యేకంగా కనిపిస్తాయన్న అంశాల్నీ శర్మగారు ప్రస్తావించారు. ఇట్లాంటి సమాజంలో వేమన మనుగడ కొనసాగించడం కత్తి మీద సాములాంటిదని కూడా గుర్తించారు. అయితే వేమన శైవాన్ని, అద్వైతాన్ని మతాలను కూడా ఆయా సందర్భాల్లో నిరసించడం జరిగింది. అంతేకాదు మిగతా కులాల, మతాల దుర్గుణాలను వేమన ఎప్పటికప్పుడు ఖండిస్తూవచ్చారు. శివభక్తులు చేసే ఆడంబరాలు వేమనకు నచ్చనప్పుడు 'చిత్తశుద్ధి లేని శివపూజ ఏలరా' అని ప్రశ్నించాడు. వైష్ణవులు కూడా నచ్చని సమయంలో సున్నితమైన మాటలతో దూషించాడు. కొందరు బ్రాహ్మణులు సమాజంలో ఎంతో ఉన్నతులమని భావించడం తగదని చెప్పారు. ఇలా వేమన కళ్ళకు చెడ్డగా కనిపించిన ప్రతిదాన్ని నిర్ద్వందంగా ఖండిస్తూ వచ్చాడని రాళ్ళపల్లి వారన్నారు.

భగవంతుని చింత మానవులకు చాలా ఎక్కువగా ఉంటుందని వేమన చెప్పాడు. ప్రజలందరూ దేవునిపట్ల ఎంతో వ్యామోహన్ని పెంచుకోవడం చూసిన వేమన కొన్ని మతాలకు దగ్గర కావాల్సి వచ్చిందని వ్యాసకర్త వివరించారు. ఏమతంలోకి చేరినా కొంతకాలమే ఉండగలిగారు. ఇలా నిలవడానికి కారణం అందులో ఉన్న మలినాలను పోగొట్టడానికే తప్ప మరి దేనికి కాదని శర్మగారు చెప్పారు. సాధారణంగా శైవులు, వైష్ణవులు యోగులుగా కూడా ప్రసిద్ధులు. కాని అద్వైతులకు ఈ యోగసిద్ధి అనేది అబ్బలేదు. ఈ యోగసిద్ధి అనేది చాలా కష్టమైంది. దీనికి దీక్ష, పటుత్వం ఉండితీరాలి. అప్పుడే అది ఫలిస్తుంది. మిగతా వాళ్ళు దీన్ని అనుసరించలేదు. అందుకే యోగుల జీవితాలు చాలా కలగాపులగంగా ఉంటాయి. ఒక రకంగా కుక్కలు చింపిన విస్తరిలాగా అయిపోతాయని ఇలాంటి ఎన్నో ఒడిదుడుకులను వేమన ఎదుర్కొని యోగి అయ్యాడని అనంతకృష్ణశర్మ చెప్పారు.

వీరశైవ మతం అనేది బ్రాహ్మణ ఆధిక్యాన్ని తగ్గించడానికి పుట్టిందన్న రాళ్ళపల్లివారు దీనిపై లోతైన చర్చచేశారు. సమాజంలో అభ్యుదయ భావాన్ని విస్తరించాలని సంకల్పించిన వేమనకు చాలా ఇబ్బందులు ఎదురైయ్యాయి. ఆఖరికి ఇతని భార్య కూడా వదిలి వెళ్ళిన సందర్భాలు చోటు చేసుకోవడం జరిగింది. అయినా వేమన తాను అనుకున్నది చేసి తీరాడు. కొంత దయనీయ పరిస్థితుల్లో వేమనను దరికి చేర్చుకున్నవారు మాత్రం కంసాలి వృత్తివారని చెప్పారు. వీరి గురించి తన పద్యాల్లో వేమన గొప్పగా చెప్పాడని వ్యాసకర్త తెలిపారు. శైవులు అనుసరించే సంప్రదాయాలు ఎంతో ఆదర్శనీయమైనవని వేమన భావించినట్లు శర్మగారు

గుర్తుచేశారు. ఆకరికి వేమనను కంసాలి వాళ్ళు కూడా అనేక ఇబ్బందులకు గురిచెయ్యడం పరిపాటని శర్మగారు చెప్పారు.

ఈ విధంగా వేమన కాలమందలి మతధర్మాల స్థితిని లోతైన పరిశీలిన చేసి వేమన ఏ మతాన్ని ఆచరించాడన్న సత్యాసత్యాల్ని రాళ్ళపల్లివారు సమూలంగా బయటపెట్టగలిగారు.

- **వేమన యోగసిద్ధి – మతప్రచారము**

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ ఈ ఉపన్యాసంలో యోగవిద్య విశేషాలను, వేమన మతసిద్ధాంతాలను లోతైన దృష్టితో పరిశీలించారు. అసలు వేమనకు ఈ యోగ విద్య ఎవరివల్ల అబ్బింది.? దీనిమూలంగా వేమనలో వచ్చిన మార్పులేమిటి.? అలాగే వేమన సమాజంలో తీసుకొచ్చిన చైతన్యం ఎలాంటిదనే అంశాలను సూక్ష్మంగా పరిచయం చేశారు. వీటిని తెలిపేందుకు శర్మగారు పతంజలి యోగాభ్యాసం, కఠోపనిషత్తు, హఠప్రయోగ ప్రదీపిక, శివయోగ, రాజయోగ లాంటి విశేషమైన ఉద్గ్రంథాల్లో ఉన్న యోగ విశేషాలను స్పృశించారు.

ఈ యోగ అనేది మానవుని శరీరానికి, మనసుకి ఎంతో ప్రశాంతతను కలిగిస్తూ, నియంత్రణలో ఉంచేందుకు ఉపయోగపడుతుంది. దీనివల్ల మనిషి పరిపూర్ణతను సాధించవచ్చునని రాళ్ళపల్లివారు తెలిపారు. ఈ విద్యలో ప్రవేశించిన వ్యక్తి ధర్మాన్ని పాటించి, దుర్గుణాల్ని వదలాలి. అలాగే యోగ్యతను పెంచుకొని, అయోగ్యతను విడనాడాలి. ఇంకా అహింస, దొంగతనం మొదలైన చెడ్డపనులను చేయకుండా ఆపుతుందీ విద్య. ఈ యోగం సామాన్యంగా వచ్చేదికాదు. దీనికి అనేక నియమాలను పాటించాలని ఉంటుందని శర్మగారు తెలిపారు.

లంబికా శివయోగి గురించి శర్మగారు తెలిపిన విషయాలు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. లంబికా అంటే 'దవడ' అని అర్థం. ఈ దవడను తన నాలుకతో ముట్టుకొనేది ఈ హఠయోగుల్లో కఠినమైన విద్య. దీనివల్ల ఆకలి, నిద్ర, దప్పిక, చావులాంటివి దరిచేరవని అన్నారు. దీన్ని చేయాలంటే నాలుకను కోసుకోవాలి. ఇట్లాంటి కఠినమైన నియమాల్ని పాటించిన లంబికాశివయోగి ఆవిద్యలో ఎంతో వున్నతిని సాధించారు.[78] ఈ విద్యను వేమనకు నేర్పటానికి శివయోగి ఉపక్రమించారు. అయితే వేమనకు ఈ విద్యను నేర్చుకోవటం ఇష్టం లేకపోయిందట. అయినా వారి గురువు రాజయోగ విద్యను బలవంతంగా బోధించారట. అందుకు వేమన రాజవిద్యను తన పద్యాల్లో కూడా ప్రస్తావించడం జరిగిందని వ్యాసకర్త తెలిపారు.

రాజయోగ విద్యవల్ల తత్వజ్ఞానం పొందిన వేమన కొన్ని సందర్భాల్లో త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణువు, శివుణ్ణి విమర్శించాడని, దీనిలో శివుణ్ణి మాత్రం తక్కువ నిందలతో దూషించినట్లు పద్యాలు చెప్తున్నాయని రాళ్ళపల్లివారు తెలియజెప్పారు. ఈ తత్వజ్ఞానం వల్ల వేమనకి అద్వైతం అలవడింది. ఈ సిద్ధాంతాన్ని సి.పి. బ్రౌన్ కూడా అంతగా అర్థం చేసుకోలేదని

---

[78] వేమన. పుట.114.

వాపోయారు. యోగా విద్యవల్ల వేమన బైరాగుల్లో చేరాడని గుర్తించిన రాళ్ళపల్లి వేమనలో ఉండే బైరాగికి, మామూలుగా బైరాగులకు చాలా తేడావుందని చెప్పారు. బైరాగులు ఎక్కువ ప్రజలను మోసం చేస్తుంటారు. కాని వేమన అలాంటి బైరాగికాదని స్పష్టంచేశారు. యోగవిద్యను అభ్యసించడానికి ఏ అడవులకో, వెళ్ళాల్సిన అవసరం లేదు. ఇంటిదగ్గర ఉండే చేసుకోవచ్చు. కాని పట్టణాలు అంత అనుకూలం కాదని వేమన అభిప్రాయం. బ్రహ్మచర్యాన్ని పాటించడం, కామాన్ని అణుచుకోడం ఈ హఠయోగ విద్యలో భాగమని వీటిని పెద్దగా పట్టించుకోవడం అవసరం లేదని వేమన తత్వంగా కనబడుతుందని శర్మగారు అన్నారు.

స్త్రీలకు పూర్వం నుండి సమాజంలో ప్రాధాన్యం ఇవ్వడం వేమనకు గిట్టలేదు. ఎందుకంటే వేమన అప్పుడప్పుడు స్త్రీలతో కలహాలు పెట్టుకొని చాలా కటువైన అనుభవాలను ఎదుర్కొన్నాడని శర్మగారు చెప్పారు. ఈ విషయాలన్నీ పద్యాల్లో ప్రముఖంగా కనిపిస్తున్నాయని గుర్తుచేశారు. తర్వాత వేమన లాంటివారు స్త్రీలనుకూడా శిష్యులుగా తయారుచేసి ఉంటే బాగుండేదని శర్మగారు అన్నారు. అసలు స్త్రీలను ఎవరైనా శిష్యులుగా తయారు చేశారా? అని కూడా వ్యాసకర్త ప్రశ్నించారు. వేమన ఎన్నో విషయాల్లో చురుకుగా ఉండి స్త్రీలను విషయంలో సరిగా లేకపోవడాన్ని శర్మగారు తప్పుబట్టారు.

శర్మగారు వ్యాసంలో వేమన మత సిద్ధాంతాలను వివరిస్తూ, ఈయన తొలుత వీరశైవాన్ని స్వీకరించి, హఠయోగాన్ని తిరస్కరించి, రాజయోగం చేపట్టి, హరిహర సుగుణోపాసన చేసి అద్వైతాన్ని పొందిన పరిణామాల్ని గుర్తుచేశారు. తంత్ర విద్యను నేర్చుకొని తాంత్రికుడిగా మారి అద్వైతంతో మంచి సంబంధాలను కొనసాగించాడు వేమన. అయితే దక్షిణ భారతదేశ తాంత్రికులతో ఈయనకు సంబంధాలు లేవని తేల్చిచెప్పారు. ఒక సందర్భంలో ''*అసలతని మత సిద్ధాంతాలు చదువుకున్న వారికే యర్థంకావు*''[79] అని చెప్పటం వేమన గురించి ఎన్నో కథనాలు వాడుకలో ఉండటమేనన్న విషయాలే కారణాలని శర్మగారు ఊహించారు.

ఈ ఉపన్యాసంలో శర్మగారు వేమన వ్యక్తిత్వంపై లోతైన అవగాహనతో ప్రసంగిస్తూ తెలిపిన విషయాలు ఎంతో ఆలోచింపజేస్తాయి. వేమన హఠయోగ, రాజయోగ విద్యలను నేర్చుకొని, అనేక ప్రాంతాల్ని పర్యటించి లోతైన జీవితానుభవాన్ని పొందడం జరిగింది. సమయం వచ్చినప్పుడల్లా వాటిని బయటపెట్టడానికి సుముఖత చూపాడు వేమన. ఎవరైనా మాటవినకపోతే 'మనిషికోమాట పశువుకో దెబ్బ' అనే సామెతని సందర్భానుసారంగా చెప్పి ప్రజల్లో చైతన్యాన్ని కలిగించాడు వేమన. ఈయన ఇంటి నుండి బయటికి వచ్చినప్పుడు అనేక కష్టాలను అనుభవించాడు. వేమన అంతరంగంగా శుభ్రంగా ఉన్నా బహిరంగంగా మాత్రం అపరిశుభ్రంగానే కనిపించేవాడు. దీనివల్ల వేమనను వెర్రివాడని, మొండివాడని, ఓ యోగి అని రకరకాలుగా సమాజం ఛీత్కరించింది. ఈ ధాటికి తట్టుకోలేక వేమన చివరికి తంజావూరు

---

[79] వేమన. పుట. 115.

ప్రాంతాన్ని చేరుకొన్నారు. అక్కడ కంసాలి వాళ్ళతో కొంతకాలం గడిపాడు. కాని ఈయన తత్వాలను విన్న ప్రతిఒక్కరు ఆశ్చర్యపోయేవారు. కొందరు శిష్యులుగా కూడా ఆయనకు తయారయ్యారు. వేమన శైవుడిగా సమాజానికి గొప్ప మేలుచేశాడు. ఇట్లాంటి మనిషిపై సమాజంలో కొన్ని మంచి, చెడ్డ కథనాలు ప్రచారంలో ఉన్నాయి. వాటిలో ఏది ప్రామాణికం ఏదీ అప్రామాణికమన్నది కొంతవరకు సందిగ్ధమే. కాని తుంగ వేమన మాత్రం కటారుపల్లిలో సమాధి అయినట్లు శర్మగారు ఆధారాలతో నిరూపించారు. ఈ స్థూల అంశాలు వేమన యోగసిద్ధిని, మతసిద్ధాంతాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతాయని మాత్రం గట్టిగా చెప్పారు.

- **వేమనవంటివారు**

సమాజంలో వేమనలాంటి వారే కొందరు సంఘసంస్కర్తలు ఉన్నారని రాళ్ళపల్లివారు ఈ ఉపన్యాసంలో తెలియజేశారు. ప్రధానంగా సర్వజ్ఞమూర్తి కన్నడ వచనకారులు, తిరువళ్ళువరు, పోతలూరి వీరబ్రహ్మము, ఏగంటివారు, ఆనందవరద రాజయోగి, ముత్యాల నారసింహయోగి మొదలైనవారు కనబడుతున్నారు. వారి జీవితాలను వేమన జీవితంతో తులనాత్మకంగా పరిశీలించే ప్రయత్నం చేశారు. అంతేకాక సమాజంలో వీరందరూ తీసుకొచ్చిన మార్పుని కండ్లకు కట్టినట్లుగా శర్మగారు చూపించారు. రాజ్యంలో రాజులు, ప్రజలు సక్రమమైన మార్గంలో లేకపోతే ఆ రాజ్యం సుభిక్షంగా నడవదు. దీనివల్ల చాలా నష్టాలు జరిగే అవకాశం కూడా ఉంది. ఇలాంటి వాటిని ఈ సంఘ సంస్కర్తలు తమతమ రచనల ద్వారా రూపు మాపడానికి గొప్ప ప్రయత్నం చేశారని వ్యాసకర్త వివరించారు. ఈ సంఘ సంస్కర్తులు అన్ని ప్రాంతాల్లోనూ, మతాల్లోనూ ఉంటారన్నారు. ముఖ్యంగా హిందూమతంలో ఎక్కువ మంది కనిపిస్తారని శర్మగారి అభిప్రాయపడ్డారు. అందులో వేమన కూడా ఒకరని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

ఈ వ్యాసంలో పరిచయం చేసిన వారు వేమనతో ఏవిధంగా పోల్చవచ్చన్న అంశాలను కూడా వ్యాసకర్త తెలిపిన విషయాలిలా ఉన్నాయి. సర్వజ్ఞమూర్తి కన్నడ ప్రాంతానికి చెందిన ఓ విజ్ఞాని. కులాంతర వివాహం చేసుకున్న తల్లిదండ్రులకు పుట్టాడు. ఇతని కాలం పదహారవ శతాబ్దం. అంటే వేమన కన్న ముందువాడని అర్థం చేసుకోవచ్చు. వేమన ఇతన్ని అనుసరించినట్లు ఆధారాలున్నాయని శర్మగారన్నారు. ఇంకా వీరిద్దరూ అనుసరించిన విధి, విధానాలు దాదాపు సమానంగా ఉన్నాయన్నారు. వేమన జీవిత పరిణామాన్ని నిర్ణయించడానికి ఎన్ని చిక్కులు ఎదురయ్యాయో అన్ని చిక్కులు సర్వజ్ఞుని జీవితంలో కూడా కనిపిస్తాయన్నారు. ఈయన వేమనకంటే ఎక్కువ సంఘ సంస్కరణ చేసినట్లు తోస్తుందన్నారు. సర్వజ్ఞుడికి సమాజం మీద ప్రీతి ఉన్నా వేమన తెచ్చినంత ప్రభావం తీసుకోరాలేక పోయారన్నది ముఖ్యమన్నారు. వేమనకు ఆటవెలదులపై ఎక్కువ మక్కువ చూపిస్తే, సర్వజ్ఞుడు మాత్రం సంగీతంలో ప్రతిభను కనబరిచాడు. ఇతను రాజుకు సేవ చేసిన వ్యక్తైతే, వేమన అలా చేయని వారుగా కనిపిస్తాడు.

వేమన లాగా ఇతను కూడా వీరశైవ మతానికి చెందిన వాడని శర్మగారు చెప్పారు. సర్వజ్ఞుని సిద్ధాంతాలు గమనించదగినవని రాళ్ళపల్లివారు అన్నారు. జాతిని బట్టి వ్యక్తికి మర్యాద ఇవ్వటం తప్పని భావించిన సర్వజ్ఞుడు కొందరు పూజలు ఆడంబరంగా చేయడం చూసి, పేదవారు అలా చేయలేరు కదా? అని ప్రశ్నించిన సందర్భాలను వ్యాసకర్త బయటపెట్టారు. ఇతను కూడా హరిహరతత్త్వాన్ని నమ్మినవాడు కాని శివునిపై ఎక్కువ వ్యామోహం చూపించాడని గుర్తుచేశారు. పండితులకన్న యోగులు తెలివైన వారని ఉద్ఘాటించిన విధానాన్ని తెలిపారు. సర్వజ్ఞుడు కూడా అద్వైతాన్ని ఎక్కువగా నమ్మినట్లు చెప్పి, వీరి సాహిత్యంలో ధారాళమైన శైలి, అందరికి అర్థమయ్యే భాష, మరువలేని ఉపమానాలు, నవ్వించే హాస్యపు హొయలు ముద్దబంగారంగా ఉంటాయని వివరించారు. వేమన లాగా ఈయన కూడా సర్వమతాల్లో ఉన్న దుర్గుణాలను ఎండగట్టడం ప్రధానంగా కనిపిస్తుందని రాళ్ళపల్లివారు తెలియజేశారు.

మరోకరు తిరువళ్ళువరు ఈయన తమిళనాడు ప్రాంతానికి చెందినవాడని, ఈయనకు వేమనకు ఎక్కువ సంబంధాలు కనిపించవని శర్మగారన్నారు. ఇతను ఒకటవ శతాబ్దానికి చెందినవాడని, 'కురళ్' అనే ప్రసిద్ధ పుస్తకం రాశాడని, ఇందులో 'కురళ్' ఛందస్సు ఉపయోగించాడని, 'కురళ్' అనేది ఆటవెలదిలో లాంటిదన్నారు. ప్రధానంగా ఈ గ్రంథంలో ధర్మ, అర్థ, కామ, మోక్షాలైన పురుషార్థాల ప్రస్తావన ఉందన్నారు. ఇతనికి వేదాంతపరమైన జ్ఞానం తక్కువగా ఉన్నట్లు ఆధారాలను బట్టి చెప్పారు. వేమనకు ఉన్నంత కవితా శక్తి ఇతనికి లేకపోయినా, కొంచెం పరవాలేదనిపించేలా కవిత్వం రాశారన్నారు. అసలు ఈయనకు వేమనకు పోలికలు లేకపోటం గమనార్హమన్నారు. తిరువళ్ళువరు ఎక్కడా వైరుధ్యం లేకుండా సర్వమతాల సమ్మేళనాన్ని పాటించారని అనంతకృష్ణశర్మ పేర్కొన్నారు.

ఆంధ్రప్రాంతంలో వేమన తెచ్చిన చైతన్యాన్ని పోతలూరి వీరబ్రహ్మేంద్ర స్వామి తీసుకొచ్చారని శర్మగారు తెలిపారు. సంఘసంస్కరణకు నడుంబిగించిన వారిలో బ్రహ్మంగారొకరని, కడపజిల్లా కందిమల్లయ్యపల్లెలో ఒ కంసాలి కుటుంబంలో పుట్టి, చిన్నప్పటినుండి పాలేరుపని చేసి, వీలు కుదిరినప్పుడు తనకున్న జ్ఞానంతో అనేక తత్త్వాలను బోధించడం వీరబ్రహ్మంగారి ప్రత్యేకతన్నారు. ఈయన చెప్పిన కాలజ్ఞానాలు యథావిధిగా జరగటంతో అనేకమంది ప్రజలు వీరి మాటలకు ప్రభావితులయ్యారని, ఈయన సన్యాసిలా కాకుండా గొప్ప సంస్కారిలా ఉండటం విశేషమన్నారు. వీరికి ఐదుమంది సంతానం. దూదేకుల సిద్ధయ్య ఈయనకు గొప్ప శిష్యుడు. బ్రహ్మంగారు చిన్నప్పటినుండి విగ్రహారాధనను, జాతి భేదాలను ఖండించి ప్రజలకు హితోపదేశం చేశారని ఉద్ఘాటించారు. ఆంధ్రప్రాంతంలో వీరబ్రహ్మంగారు తెచ్చిన చైతన్యానికి ప్రజలు దాసోహులైయ్యారని రాళ్ళపల్లివారు వ్యాసంలో పేర్కొనటం గమనార్హం.

శర్మగారు తమ పరిశోధనలో భాగంగా మద్రాసు ప్రాచ్యకళా గ్రంథ భాండాగారంలో 'ఏగంటి' వారి గురించి పలు విషయాలు ఉన్నాయని చెప్పారు. అయితే ఇతనికి వేమనకు

ఎక్కువ సంబంధాలు లేవని గుర్తుచేశారు. ఈయన కూడా అద్వైత సిద్ధాంత ప్రభావంతోనే రచనలు చేశాడన్నారు. పండితులు ఈయన్ను అంతగా గమనించలేదని, పామరులు వీరి ప్రతిభా పాటవాలను గుర్తించి ప్రశస్తికి తెచ్చారన్న అంశాలను రాళ్ళపల్లివారు సమగ్రంగా తెలియజేశారు. ఇతనిలో కూడా భాషా శక్తి, శయ్యా సౌభాగ్యం గొప్పగా ఉన్నాయని వంగూరి సుబ్బారావుగారు తమ పరిశోధనలో గుర్తుచేయడం ముదావాహమన్నారు.

ఆనంద పరమ రాజయోగి *'సదానంద యోగిశతకము'* రాశాడని, అందులో రెండు తేటగీతి పద్యాలను ఉదహరించి ఇవి వేమన పద్యాల్లా ఉన్నాయని రాళ్ళపల్లివారు చెప్పారు. ముత్యాల నారసింహయోగి *'జీవతత్త్వ ప్రబోధ కుసుమావళి'* లో కందపద్యాలు రాశాడని గుర్తుచేశారు. ఇక ఉపన్యాసం ముగిసేముందు రామకృష్ణ పరమహంస జీవిత సంగ్రహన్ని పరిచయం చేస్తూ, పరమహంస వివేకానందుడులాంటి శిష్యులను దేశానికి అందించిన ధన్యజీవని చెప్పారు. ఈయన కేవలం భారత దేశంలోనేకాక, ప్రపంచ దేశాల్లో పేరు ప్రఖ్యాతులు గడించడం ప్రశంసనీయమని రాళ్ళపల్లివారు వివరించారు.

పైవిధంగా రాళ్ళపల్లివారు వేమనతో సర్వజ్ఞుడికి, తిరువళ్ళువరు, ఏగంటివారు, పోతలూరి వీరబ్రహ్మం మొదలైన వారితో ఉన్న సంబంధాలను, పోలికలను తులనాత్మకంగా ఈ వ్యాసంలో పరిశీలించడం జరిగింది.

- **వేమన కవిత్వము, హాస్యము, నీతులు**

అనంతకృష్ణశర్మ ఏడవ ఉపన్యాసంలో వేమన కవిత్వం, హాస్యం, నీతులను ఎంతో చక్కగా పరిశీలించారు. వేమన కవిత్వాన్ని రాబోయే తరాలు చదివి అర్థం చేసుకొని మానసిక వికాసాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని ఆకాంక్షించారు. వేమన అందించిన ఈ జ్ఞానం సామాన్యమైనది కాదని ప్రతి ఒక్కరు దీన్ని చదివితే ఎంతో లాభపడతారని ఉద్ఘాటిస్తూ తెలిపిన అంశాలను స్థూలంగా పరిశీలిద్దాం.

ఇతరుల క్షేమమే తనలక్ష్యంగా పద్యాల్లో హృదయావిష్కరణ చేసిన వేమనని మన పరిశోధకులు పేరులేని కవుల్లో తోసేయడం బాధాకరమని శర్మగారన్నారు. వేమన మనసుకు ఏది ఆనందాన్నిస్తుందో, ఏది బాధను కలిగిస్తుందో దాని గురించి పద్యాల్లో స్పష్టంగా వెల్లడించారు. ముఖ్యంగా ఆనాటి ప్రజల జీవితాల్లోని బహిరంగ, అంతరంగాలను పరిశీలించడానికి వేమన చైతన్యంగా పనిచేశారని వ్యాసకర్త తెలిపారు. వేమన అంతరంగాన్ని ఒప్పుకొన్నప్పటికీ బహిరంగాన్ని దాపరికం లేకుండా తప్పుబట్టారు. వేమన కవిత్వాన్ని, హాస్యాన్ని, నీతులను శర్మగారు చాలా జాగ్రత్తగా విడమర్చి చెప్పే ప్రయత్నం చేశారు. వేమన భాష, ఛందస్సులపై కొంతవరకు శ్రద్ధాసక్తులు చూపినా కవిత్వంపై అంతశ్రద్ధా చూపలేదని ఒక పద్యాన్ని ఇలా ఉదహరించారు.

*"ఆ. <u>పైరు నిడిన వాని ఫలమే సఫలమగు,</u>*
*<u>పైరు నిడనివాఁడు ఫలము గనునె?</u>*

***పైరు నిడని వాఁడు బహుసౌఖ్యవంతుఁడౌ....”***[80] ఇలాంటి పద్యాలు వేమన రాయకపోయినా నష్టం లేదని వ్యాసకర్త అభిప్రాయపడ్డారు. ఈ వ్యాసంలో వేమన కవిత్వాన్ని శర్మగారు విమర్శనాత్మక ధోరణితో పరిశీలించారు.

ఈ ఉపన్యాసంలో వ్యాసకర్త కవిత్వానికుండే లక్షణాలను స్పష్టంగా వివరించారు. సాధారణంగా ఒక వస్తువును గురించి తనకు కలుగే భావాలను, తన భాష మూలంగా ఇతరుల మనసుకు హత్తుకునేటట్లు చెప్పటం కవిత్వమని, భావము, వస్తువు, రచనలు ఎంత గొప్పగా ఉంటే అంత ఆకట్టుకోగలదని శర్మగారన్నారు. ఈ భావం అనేది రచనకుగాని, కవిత్వానికిగాని ప్రాణభూతమైనదని వ్యాసకర్త భావించాడు. వేమన కవిత్వం ఇంత ఆదరణ పొందడానికి ప్రధాన కారణం ఈయనలో ఉండే భావాల తీవ్రతేనని గుర్తుచేశారు. నిజంగా వేమన కవిత్వంలో భాష, ఛందస్సు, లయ, శైలి వేటికవే అల్లుకొని క్రమంగా కుదిరిన సందర్భాలను కింది పద్యంలో సూచించారు.

***“ఆ. ఆకులన్ని దిన్న మేక పోతులకేల***
***కాక పోయెనయ్య కాయసిద్ధి?***
***లోకులెల్ల వెఱ్ఱి పోకిళ్ళఁబోదురు....”***[81] (223)

వేమన పద్యాలు అర్థం కావటమే కాదు వాటిలో ఎంతో లోతైన అర్థాలు దాగుంటాయన్నది సత్యమని అనంతకృష్ణులవారన్నారు. తెలుగు మాట్లాడే ప్రతిఒక్కరికి వేమన పద్యాలు చక్కగా అర్థమవుతాయని ఒక పద్యాన్ని ఇలా ఉదాహరించారు.

***“ఆ. పసుల వన్నెవేఱు పాలేకవర్ణమౌ***
***పుష్పజాతివేరు పూజయొక్కటి***
***దర్శనములు వేరు దైవం బదొక్కటి....***[82] (2480)

వేమన కవిత్వంలో హాస్యం ఉన్నత స్థాయిని ఆక్రమించిందని శర్మగారు చెప్పారు. హాస్య ప్రాముఖ్యాన్ని వివరించి వేమన పద్యాల్లో చొప్పించిన హాస్యం గొప్ప చమత్కరంతో కూడి ఉందని భావించారు. వేమన తిట్టుతూనే హాస్యాన్ని పండించి ప్రజలను మెప్పించగల దిట్టగా కనిపిస్తారని గుర్తుచేస్తూ....

***“ ఆ పాల సాగరమున పవ్వళించినవాఁడు***
***గొల్లయిండ్ల పాలు గోరనేల***
***ఎదుటివారి సొమ్ములెల్ల వారి తీపు”***[83] (2509).

అనే పద్యాన్ని ఉదహరించారు. ఈ విషయాన్ని అర్థంచేసుకుంటే ఒక పక్క తిట్లు, మరో పక్క హాస్యం పరస్పరం సంస్కరణకు దారితీసేవిగా ఉన్నాయన్నారు.

---

[80] వేమన. పుట.144.

[81] వేమన. పుట. 155.

[82] వేమన. పుట. 157.

[83] వేమన. పుట. 159.

శ్రీనాథుడు, తిక్కన లాంటివారికన్న వేమన గొప్ప సాహిత్యాన్ని సృష్టించారని రాళ్ళపల్లివారి అభిమతం. వేమన ఏది చెప్పినా దానికొక న్యాయం ఉంటుంది. ఆయన చెప్పే విషయాలు ఎక్కడి నుండో ఊడి పడవు. మన ఇంటి చుట్టుపక్కల్లోని వస్తువుల్నే వారు ఉదాహరణలుగా స్వీకరించి చెప్పాల్సిన అంశాన్ని సూటిగా సుత్తిలేకుండా చెబుతారు. వేమన కవిత్వంలో హాస్యంతో పాటు నీతులు చాలా గొప్పగా ఉంటాయి. ఇవి ప్రజలకు ఎంతో మేలు చేయగలవని శర్మగారు చెప్పారు. లోకంలో ఉన్న మంచి చెడ్డల విలువ తెలిసిన వేమన ఏది చెప్పినా దానికొక బలమైన కారణం ఉంటుందన్న విషయాన్ని మరువరాదు. ఆనాడు దుఃఖంలో ఉన్న ప్రజల ఉపశమనానికి వేమన చెప్పిన నీతి బాగా ఉపయోగ పడటం గమనార్హం. అప్పట్లో సాంఘిక దురాచారాలైన బహుభార్యత్వం, వరకట్నం, తల్లిదండ్రుల మీద ప్రేమ లేకపోవడాన్ని వేమన తన పద్యాల్లో ఖరాఖండిగా తప్పుబట్టారు. ఈ ధోరణే వేమన నీతికి గొప్ప ప్రతీకగా నిలుస్తుందని శర్మగారు అభిప్రాయ పడ్డారు. సహృదయులు ఏ సందర్భంలో వేమన పద్యాలు విన్నా తిరిగి చూడవలసిందేనని చెప్పారు. అంతటి ప్రభావం ఈయన కవిత్వంలో ఉంటుందని దాని రుచులు విన్నవారికి, కన్నవారికే తెలుస్తాయి తప్ప మరొకటి లేదన్నారు శర్మగారు.

వేమన పద్యాల్లోని కవిత్వాన్ని, హాస్యాన్ని, నీతులను లోతుగా పరిశీలించి రాళ్ళపల్లివారు *''ఇతని పద్యములందు అనన్య సాధారణమైన సారళ్యము, ధారాళత, చెక్కడపు పని, నిర్లక్ష్యము మొదలగు కవితాగుణములు నిండి యుండును''*[84] అని తిలోదకాలందించారు.

రాళ్ళపల్లివారి 'వేమన' పరిశోధనపై సిహెచ్. లక్ష్మణ చక్రవర్తి అభిప్రాయాలు(వివిధ రచయితలతో ఇంటర్వ్యూలు) ప్రశ్నావళి:4, ప్రశ్న: 3 లో చూడు (అనుబంధం –1)

## 2.11.2. నాటకోపన్యాసములు

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ రాసిన 'నాటకోపన్యాసములు' అనే గ్రంథం 1935లో ప్రచురితమైంది. 78 పుటలుగల దీనిలో రెండు సుదీర్ఘమైన వ్యాసాలున్నాయి. వాస్తవానికి కర్ణాటక ప్రాంతం బళ్ళారి నగరంలో ధర్మవరం రామకృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావు గార్ల స్మారకోత్సవాలలో శర్మగారు చేసిన ఉపన్యాసలే ఈ గ్రంథంగా రూపుదాల్చాయి. అనంతకృష్ణులవారిని మేధావి అనడానికి చక్కని తార్కాణంగా ఈ పుస్తకం నిలుస్తుంది. ఇంత విస్తృతమైన వ్యాసాల్లో రాళ్ళపల్లి వారు వెల్లడించిన అంశాలు చాలా విలువైనవి.

రాళ్ళపల్లివారు మొదటి వ్యాసంలో నాటక ప్రక్రియ గురించి ఆమూలాగ్రం తెలిపారు. ఇందులో నాటక లక్షణాలను, నిర్వచనాలను, దాని ప్రాశస్త్యాన్ని తార్కిక బుద్ధితో పరిశీలించారు. కళ ప్రాధాన్యాన్ని గుర్తుచేస్తూ దాని మూలాల్ని పేర్కొన్నారు. అంతేకాకుండా నాటక రచయితలు, నటీనటులు, ప్రేక్షక మహాశయుల ఆలోచనలు, అక్కడ జరిగే ప్రతిక్రియలను చాలా స్పష్టంగా తెలిపారు. అలాగే నాటకాల్లో పోషించినా రసాలను, పాత్ర

---
[84] వేమన. పుట. 166.

చిత్రణలను లోతుగ పరిశీలించారు. వ్యాసకర్త ఈ వ్యాసంలో స్వభావవాదులు చెప్పిన కొన్ని అభిప్రాయాలతో విభేదించారు. ఎన్నో ఆధారాలను చూపుతూ, సునిశితమైన ఆలోచనతో చేస్తూ చెప్పిన విషయాలు ఆమోదయోగ్యమైనవి.

*"ప్రపంచమున జరుగుతున్నవి, జరుగునట్టివి నటీనటుల అనుసరణీయమే నాటక కళ"*[85] అని రాళ్ళపల్లివారు నాటకాన్ని సర్వ కళల సమ్మేళనమనీ చెప్పారు. ఈ కళలన్నీ వేటికవి స్వతంత్రాలు కావు. ఒకదానితో ఒకటి పరస్పరం సంబంధం కలిగివుంటాయి. అసలు ఇలా ఉంటేనే కళలకు ఒక స్వరూపమూ, రూపమని అన్నారు.

వ్యాసకర్త శాస్త్రానికి, కళకు తేడాలుంటాయని ప్రస్తావిస్తూ, *"ఒక వస్తువు నందలి భిన్న భాగముల వేర్పాటు శాస్త్రము. భిన్న పదార్థముల నొక్కచోట చేర్చి చేయుట కళ"*[86] అని స్పష్టపరిచారు. ప్రాచీనులు చెప్పిన ఈ అభిప్రాయాలనే ఆధారంగా చేసుకొని భిన్న కళల సమాహారమే నాటకప్రక్రియ అని శర్మగారు పునరుద్ఘాటించారు. స్వభావవాదులు కళను స్వతంత్రంగా ఉండాలని చెప్పారు. కానీ శర్మగారు కళ అనేది పరస్పర సహాయ వాదమేనవి అన్నారు. నాటకం అనేక కళలు మిళితమైతేనే రక్తికడుతుందని గుర్తుచేశారు. కళను బహిర్గతం, అంతర్గతమని రెండు రకాలుగా చెప్పి అందులో మొదటిది సులభమని, రెండోది కష్టమని వివరించారు. కష్టమైన అంతర్గత కళను ఎవరైతే ప్రదర్శిస్తారో అది గొప్పదని తెలిపారు. నాటకానికి నృత్తము, అనుకరణ చాలా ముఖ్యమని చెబుతూ అనేక విషయాలను మన కళ్ళముందుంచే ప్రయత్నం చేశారు.

రాళ్ళపల్లివారు నాటక ప్రక్రియలో శాంతి గురించి వెల్లడించిన అభిప్రాయాలు గమనార్హమైనవి. ఈ శాంతి అనేది మన సోమరి తనంకాదు. ఏదైన వస్తువుపై ఏకాగ్రత నిలపటమే శాంతగా భావించారు. ఇది నాటకంలో చాలా అవసరం అంటూ. *"మన చిత్త వృత్తాన్ని వస్తు విశ్లేషణ మగు అంతరంగముల వఱకు ఈడ్చుకొని పోయి విడిచి తాము వెనుకబడెను. కళావంతుని ముఖ్యమగు పని ఆ చిత్తవృత్తిని ఆచోట ఏకాగ్రత నిలుపుటయే."*[87] నని నాటకాన్ని మానవుని చిత్తవృత్తికి సంబంధించిన వేదాంతంగా శర్మగారు అభివర్ణించారు. వ్యాసకర్త దృష్టిలో శాంతి అనేది సుఖ ఇంద్రియాలకు చెందిందని చెప్పవచ్చు. దీన్ని సామ్యమని, వైషమ్యమని విడగొట్టి లోతుగా పరిశీలించారు. నాటకానికి రచయిత, నటులు, ప్రేక్షకులు మూడు స్తంభాల్లాంటి వారని తెలియజేశారు.

రచయితకు నాటకంలో ఏది ఎప్పుడు ఎక్కడ ప్రవేశ పెట్టాలి అనే విషయాలు తెలిసుండాలి. ఒక పద్యాన్ని గాని, పాటను గాని ప్రవేశ పెడితే ఆ సందర్భానికి ఈ పద్యం తగినట్లు ఉంటేనే నాటకం రక్తి కడుతుందనే స్పృహను శర్మగారు కలిగించారు. ముఖ్యంగా నాటక రచయితకు ఈ విచక్షణ జ్ఞానం చాలా అవసరమని వారు చెప్పారు. అయితే, ఇప్పుడున్న

---

[85] నాటకోపన్యాసములు. పుట. 8.

[86] నాటకోపన్యాసములు. పుట. 4.

[87] నాటకోపన్యాసములు. పుట. 13.

నాటక కర్తలు పెద్దగా కష్టపడకుండా ఎక్కడ ఏది కనిపిస్తే అది గ్రహించి నాటకాలు రాస్తున్నారు. కాబట్టి అవి అంతగా రక్తి కట్టవని అన్నారు. నాటకంలోని వస్తువుపై స్పృహ ఉన్నా, అప్పుడప్పుడు రాగతాళాల్లో కూడా తప్పులు జరగుతాయన్నారు. ఏదో కొంత మంది మాత్రమే గొప్ప ఆలోచనలతో నాటకాలను రాస్తున్నారని శర్మగారు గుర్తుచేశారు.

నాటకంలో నటించేవారు అనుకరణను ప్రధానంగా భావించి నటించే పాత్రల పట్ల, మాట్లాడే మాటల పట్ల కాని ఏమాత్రం అవగాహన లేకుండా ఉండటాన్ని శర్మగారు తప్పుబట్టారు. అసలు కవి ఆలోచన, కథ విధానం, పాత్ర వైశిష్ట్యం ఎక్కడికి పోయినా వారికి చింతవుండదని విమర్శించారు. కానీ స్థానం నరసింహారావు లాంటి ఏ కొద్ది మంది మాత్రమే ఆ విలువల్ని అర్థం చేసుకోగలగటం పరిపాటి.

ఇక ప్రేక్షక మహాశయుల గమనింపులు చెప్పనేల అంటూ వ్యాసకర్త ఇలా అన్నారు. నాటకం చూసే ప్రేక్షకులు ఒక్కొక్కరు ఒక్కో ఆలోచనతో ఉంటారు. ఒకరికి పద్యం ఇష్టమైతే, మరొకరికి గద్యం ఇష్టమవుతుంది. కొందరు నటీనటుల పాత్రలపై మక్కువ చూపితే, మరికొందరు ఆ నాటక ప్రాంగణాన్ని ఆ హంగులు ఆర్భాటాలను ఇష్టపడుతారు. ఇలా ఎన్నో భిన్న పార్శ్వాలతో ఆలోచించే ప్రేక్షకులను ఒప్పించటం చాలా కష్టమని రాళ్ళపల్లి వారన్నారు. కొందరైతే మరీ మొండి పట్టుతో అక్కడ కచ్చితంగా ఆపద్యం ఉండాలి, లేదా ఆ రాగమే రావాలని భీష్మించుకొని ఉంటారు. ఇది వారి వారి స్వభావాలపై ఆధారపడినదని శర్మగారు అన్నారు. ''నా *మనవి యేమనఁగా: స్వభావము అనునది అమేయము, అగాధము. దాని మేర యింతే యని యెఱుఁగ నెవరితరమును గాదు.''*[88] కళ ఎంతో లోతైనదని మన మనోభావాలకు పరీక్షపెట్టారని రాళ్ళపల్లివారి అభిప్రాయం.

కొందరు మధ్యవర్తి వివేకులు నాటకాలను గంభీరాలని (పూర్వ చారిత్రక విషయాలు), తేలికైనవని (సమకాలీన విషయాలని) రెండు రకాలుగా విభజించారు. అయితే, ఇది ఏమాత్రం సమంజసంగా లేదని శర్మగారు తెలిపారు. ఇది కేవలం విభాగ ప్రియులకు, విమర్శకులకు, లాక్షణికులకు తృప్తిగా ఉంటుంది తప్ప రసికులకు సరిపోదన్నారు. అసలు నేటి జీవితం రేపటికి చరిత్ర, మర్నాటి కది పురాణమని గుర్తుచేస్తూ, రసాన్ని అనుభవించే విధానంలో ప్రాచీనులకు మనకు పెద్దగా తేడాలు లేవని ఎన్నో అంశాలను తులనాత్మకంగా పరిశీలించారు. అందులో ఆకలి, మాతృప్రేమ, మనోబలం అలాగే బహిరంగ అంతరంగ స్వభావాలు మానవుల జీవితాల్లో సర్వసాధారణమేనంటూ, లక్ష్యం ఒక్కటే అయినా ఎంచుకున్న మార్గాలు వేరన్న సత్యాన్ని బయటపెట్టారు. ఇది నాటకంలో కూడా సర్వసాధారణమైనవనీ యథార్థమైన విషయాలను గుర్తుచేసి ఆలోచనల్లోకిదించారు. ఇదే నిజమైన కళ అని అనంతకృష్ణశర్మ పునరుద్ఘాటించారు. చిన్న విషయాలను పరిగణలోకి తీసుకొని ఆధునిక, సమకాలీన అంటూ కాలాల మధ్య కేవలం మాటలు, అభినయంతో నిర్వహించటం తగదన్నారు. అంతేకాక సమకాలీన జీవితాలను

[88] నాటకోపన్యాసములు. పుట. 24.

ఆశ్రయించి నాటకాలు తేలికగా ఉండాల్సిన పనిలేదు. రచయితలకు, నటించే నటులకు పాత్రపైగాని, నాటకంపై గాని స్పృహ లేకపోతే నాటకాలు పల్చబడతాయి. అంతేకాకుండా ఉండాల్సిన అంశాలున్నప్పుడు అవి గంభీరాలు, తేలికలు ఎలా నిర్ణయిస్తారని ప్రశ్నించారు. పౌరాణిక, చరిత్రక నాటకాలను చూస్తే నాకు నవ్వు వస్తుందనీ, ఏ పద్యం ఎక్కడ పెట్టారో తెలీదని స్వభావవాదుల అభిప్రాయాలతో రాళ్ళపల్లివారు విభేదించారు.

ఈ వ్యాసంలో రాళ్ళపల్లివారు స్త్రీ పాత్రలు స్త్రీలే వేయాలన్న అభిప్రాయాలను సమూలంగా ఖండించారు. స్వరూపం, స్వరం, నడక మొదలైన వానిలో స్త్రీలకు, పురుషులకు విస్పష్టమైన భేదం ఉంది. కనుక మగవాడెంత తంటాలుపడ్డా పరకాయ ప్రవేశం చేయలేదు. అందుకు స్త్రీ పాత్రలు స్త్రీలే ధరించాలన్న స్వభావవాదుల అభిప్రాయాలతో విభేదిస్తూ "*కళ అనేది వ్యక్తికిఁ జేరినదిగాని జాతికి చేరినది గాదు*"[89] అని నటన ప్రకారం స్త్రీలుగా పుట్టినంత మాత్రన స్త్రీత్వం ఉంటుందని అనుకోవడానికి వీలు లేదని అన్నారు. వీరిలో చాల మందికి అభినయించడం రానివారున్నారని శర్మగారు చెప్పారు. పైగా పురుషుల్లో కూడా ఈ విధానం ఉండవచ్చునని గుర్తుచేశారు. ఎవరిలోనైన అభినయశక్తి ప్రధానమని అన్నారు. ముఖ్యంగా పాత్రలో పరకాయ ప్రవేశం చేస్తే స్త్రీ పాత్రలు పురుషులు కూడా వేయవచ్చని చెప్పారు.

ఇలా స్త్రీ పాత్రలను చక్కగా నిర్వహించే మహానుభావుల్లో స్థానం నరసింహారావు, మైసూరు కామణ్ణగార్లు చెప్పుకోదగిన వారని తెలిపారు. "*పురుషుడు స్త్రీ భూమికను ధరించి, ఉత్తమముగా నిర్వహించుటలో ప్రతిభ అధికముగా వ్యక్తమగుట సత్యమే*"[90] అని పోణంగి శ్రీరామ అప్పారావు తమ సింద్ధాంత గ్రంథంలో పేర్కొన్నారు. అసలు రంగస్థలంలో ఎవరి పాత్రలు ఎవరు వేశారన్నది సమస్యకాదు నటన ముఖ్యమని తేల్చిచెప్పారు. ముసలివాడు, దుష్యంతుడు, హనుమంతుడు లాంటి పాత్రలను నటించడానికి స్వయంగా వారే కావాలంటే కష్టం కదా? అని పునరాలోచింపజేశారు. అంతేకాకుండా స్త్రీ పాత్రలు స్త్రీలే నటించడం వల్ల కళకు మేలిమేమి లేదని, అభినయ సంఖ్య పెంచడమే తప్ప మరోటికాదని, అలాగే పురుష పాత్రలను స్త్రీలు నటించడం అంత ఆమోదయోగ్యం కాదని ఎన్నో అభిప్రాయాలను శర్మగారు తెలియజేశారు.

రాళ్ళపల్లివారు స్త్రీలు నాటక రంగంలో ఉండటం నీతికి భంగమన్నారు. స్వభావవాదులు 'స్త్రీ పురుషుల పరస్పరాకర్షణ శక్తి దూరదూరంగా ఉన్నప్పుడే ఉండును గాని, వారికి సామీప్యవర్తనం అధికమైతే అది కృషిస్తుందని అంటే, శర్మగారు దీనిని పూర్తిగా ఖండిస్తూ, ఇలాగన్నారు. స్త్రీ పురుషుల మధ్య ఉన్న పరస్పర సంబంధం ఒక స్థాయిలో నశించినా, మరో స్థాయిలో ఉధృతమౌతుందని తిరిగి చెప్పారు. నీతి అనేది సామాన్య మనుషుల దేహాలను ఆరోగ్యంగా ఉంచడానికి పనికి వస్తుందిని ఉగ్గడించారు. అలాగే, పరపురుషుడు

---

[89] నాటకోపన్యాసములు. పుట. 26.

[90] తెలుగు నాటక వికాసము. పుట. 612.

పరస్త్రీతో ఎంతవరకు వ్యవహరించును? ఏ మేరకు మీరినా అది నీతికి భంగమేకదా? అని విలువల్ని తెలిపారు. కొన్ని పరిష్కార మార్గాలు దొరికేంతవరకు స్త్రీలు మగవారితో నటించడకుండా ఉండటం ఆరోగ్యకరమని ఆయాన అన్నారు. వీలైతే స్త్రీలకు ప్రత్యేక అభినయ కళా మార్గాలను ఏర్పాటుకై అన్వేషిస్తే మంచిదని రాళ్ళపల్లివారు అభిప్రాయపడ్డారు.

ధర్మవరం రామకృష్ణమాచార్యులు తమ 'సరసవినోదినీసభ' లో, కోలాచలం శ్రీనివాసరాయలు 'సుమనోరమసభ' నాటకాల్లో స్త్రీ పాత్రలను ప్రవేశపెట్టకుండా నాటకాన్ని నడిపించారని రాళ్ళపల్లివారు ప్రశంసించారు. కానీ, కోలాచలం వారు తమ '*ప్రపంచ నాటక చరిత్ర*' లో *''ఇంగ్లీషు స్త్రీలు చదివినంత మనస్త్రీలు చదివినప్పుడు, అలాగే, వారియంత నాగరికతను మనము సాధించినప్పుడు మన స్త్రీలు నాటక రంగంలో నటించవచ్చుని''*[91] అన్న అభిప్రాయంతో విభేదిస్తూ, ఇలా సమాధానమిచ్చారు. నీతితో పోలిస్తే, చదువు వేరు సంస్కారం వేరని అంటూ, ఈ రంగంలో ఎక్కువ నీతి మంతులు ఉన్నారా? అన్న సందేహాన్ని వ్యక్తంచేశారు. ఇలా స్త్రీపురుష సంబంధాల గురించి పునరాలోచింపజేసి, కోలాచలం వారి ఆలోచనలను పూర్వపక్షం చేశారు. వ్యాసం చివర్లో అనంతకృష్ణశర్మ ఇరవయ్యో శతాబ్దపు కాలం నాటికి స్త్రీపురుషుల సంబంధాల్లో ఎటువంటి తకరారులు లేకుండా జీవిస్తే మంచిదని, మరీ ఎక్కువ స్వేచ్ఛను కలిగి ఉండకుండా కొంత నీతి నియమాలను పాటించి ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించుకోవడానికి తోడ్పడాలని కోరుకున్నారు.

రెండవ వ్యాసంలో శర్మగారు ధర్మవరం రామకృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరాయల నాటకాలను తులనాత్మకంగా పరిశీలించారు. ధర్మవరం రామకృష్ణమాచార్యులు 'సరసవినోదినిసభ',కోలాచలం శ్రీనివాసరాయలు 'సుమనోరమసభ' అను నాటక సమాజాలను స్థాపించి మన తెలుగు నాటక ప్రక్రియను ఎంతో ఉన్నత స్థాయికి తీసికెళ్ళగలిగారని చెప్పారు. తర్వాత ధర్మవరం వారు తొలి నాటకకర్త అనే విషయంపై చర్చిస్తూ సరైన ఆధారాలు లేవని స్పష్టపరుస్తూ, ఈ ఇద్దరి నాటక కారులకు కొన్నినెలలు మాత్రమే తేడాలున్నాయని అన్నారు.

ఈ నాటక కారులిరువురూ ఆంగ్ల సాహిత్యాన్ని ఆకళించుకొని సమకాలీన సమాజాన్ని మేలుకొలిపే ప్రయత్నం చేసిన వాళ్ళుని అభిప్రయపడ్డారు. తెలుగువారు నాటక ప్రక్రియలో విశేషమైన కృషిచేశారని కొనియాడారు. ధర్మవరం, కోలాచలం గార్లు అనేక నాటకాలు రాశారని తెలుపుతూ, ఈ నాటకాలు ఏయే పద్ధతుల్లో రాశారన్న అంశాలను సంశోధించారు. అసలు నాటక కారులిద్దరు పాటించిన పద్ధతులు మూడు అవి: 1. ప్రాచ్య, పాశ్చాత్య నాటక పద్ధతులను అనుసరించటం. 2. తమ నాటకాలను తామే ఆడింపవలసిన భారం వహించటం. 3. జనులకు నీతిని బోధించాలనే ఉద్దేశ్యం ఉండటం.

[91] నాటకోపన్యాసములు. పుట. 33.

ప్రాచ్య, పాశ్చాత్య నాటక పద్ధతుల అనుసరణమనే అంశంలో ధర్మవరం, కోలాచలం వారిరువురు మూల తత్త్వాలను పాటించటంలో సమఉజ్జీలుగా ఉన్నప్పటికీ భాషవిషయంలో వారి మధ్య భేదాలుండటం గమనార్హం. నేటికాలపు నాటకాలతో వీరి నాటకాలను పోలిస్తే అక్కడక్కడ మార్పులు చోటుచేసుకొన్నాయని ప్రస్తుతించారు. మరో క్రమంలో ప్రాచ్య, పాశ్చాత్యుల పద్ధతుల్ని పాటించిన వీరు నాటకాల్లో కేవలం స్వాతంత్ర పూజ చేయటం బాగలేదని విమర్శించారు. అయితే, పద్య, గద్య నాటకాలను అనుసరించకుండా తమదైన శైలిని ప్రతిభ చాతుర్యాన్ని ఉపయోగించి 'ఓపేరా' అనే కొత్త రూపకాలను తీసుకొచ్చి నాటక ప్రక్రియకు వన్నెతెచ్చారని పొగిడారు.

ప్రాచ్య, పాశ్చాత్యులు నాటకాల్లో పద్య, గద్యాలను పాటించడం సర్వసాధారణమేనని శర్మగారు అన్నారు. ఇలాంటివి నాటకాన్ని రక్తిగట్టించ గలవని నమ్మకంతో ధర్మవరం వారు పద్యగద్యాలకు తోడుగా పాటలను కూడా ప్రవేశపెట్టి నాటకాన్ని మరింత రక్తిగట్టించే ప్రయత్నం చేశారని చెప్పారు. ఈ విషయంలో శ్రీనివాసరాయలు కొంచెం వెనకబడ్డారని అనంతకృష్ణశర్మ తెలిపారు. నాటకాల్లో సందర్భాను సారంగా పద్యాలను, పాటలను ప్రవేశపెట్టకుండా కొన్ని చోట్ల రసభంగం చేయడం సమంజసం కాదని గుర్తుచేస్తూ ''కులముచెడినవారికి కూడు *పెట్టినట్లు, మడుగు గ్రంథమంతయు ముగిసిన తరువాత తుదలో సతికించి పొమ్మన్నారు.''*[92] అని రాళ్ళపల్లివారు అభిప్రాయపడ్డారు.

ఓ సందర్భంలో శర్మగారు ఇద్దరి నాటకాల్లో మూలంలో ఉన్న పద్యాలను, పాటలను చూడకుండా ఎవరో చెప్పగా విని తప్పుగా అర్థం చేసుకొన్నానన్న విషయాన్ని ఎంతో వినమ్రంగా ఒప్పుకొన్నారు. అప్పటి నన్నయ, తిక్కనల కావ్యాల్లో ఉండే రచనా విధానాన్ని కాకుండా ప్రబంధ కావ్యాల్లో ఉన్న శైలిని ఈ నాటక కారులిద్దరు పాటించారని వ్యాసకర్త గుర్తించారు. ప్రధానంగా కోలాచలం వారు ఈ రసధారను ఎక్కువగా ఉపయోగించారని గుర్తుచేశారు. వీరి *శీలదిత్య, శిరోమణి, పాదుకాపట్టాభిషేకము* వంటి నాటకాల్లోని కొన్ని ఉదాహరణాలను పేర్కొన్నారు.

పాశ్చాత్య నాటక పద్ధతులను ఉపయోగించి తెలుగు నాటకాలకు మేలిమి తెచ్చారని ప్రశంసించడమే గాక, నాటకాలను అంకాలు, రంగాలు అని విభజించారు రాళ్ళపల్లివారు. ఈ విధానంలో దేశకాలదులను కూడా కలుపుకొంటూ ఎప్పటికప్పుడు మార్పులను తీసుకోరావడంలో సిద్ధహస్తులయ్యారని అన్నారు. నాటకంలో నాంది, ప్రస్తావనలు ప్రముఖమైనవని, వీటివల్ల జరిగే ప్రయోజనం ఎంతో ఉందని చెప్పారు. రాళ్ళపల్లి వారు నాటకాన్ని చూడడానికి వచ్చే సభ్యుల మనస్తత్వాలను కళ్ళకుకట్టినట్లు చూపించారు. ఒక్కో సభ్యుడు ఒక్కో విచిత్రమైన ప్రవర్తనను కనబరచటం చూస్తే వింత అనిపిస్తుందని గుర్తు చేశారు. అసలు నాటకంలో 'ప్రస్తావన' ప్రాధాన్యాన్ని గుర్తించి దాని స్థానంలో మరో దాన్ని ప్రవేశపెట్టలేదని వ్యాసకర్త అభిప్రాయపడ్డారు.

[92] నాటకోపన్యాసములు. పుట. 43.

నాటకంలో రంగస్థలంపై చూపని సన్నివేశాల విషయంలో పాశ్చాత్యుల ఆలోచనల్ని మనవారు కొన్నిటిని తిరస్కరించారు. అయితే, స్త్రీ పురుష ముద్దుముచ్చట్లు మాత్రం అక్కడక్కడ చూపించారు. ఈ విషయంలో కృష్ణమాచార్యులు కొంత చాతుర్యాన్ని ప్రదర్శించడం జరిగిందన్నారు. ''*నామట్టుకేమో కృష్ణమాచార్యులు ఆ యింత చాపల్యమునుగూడ అణఁచుకొనియుండిన బాగుగానుండెడిది.*''[93] అని తెలిపారు.

శర్మగారు నాటకంలో కొన్ని పాత్రల స్వభావం భూత, భవిష్యత్, వర్తమాన కాలాల్లో చూపడం సాధ్యం కాకపోవటంతో ప్రాచ్య అలంకారికులు విష్కంభం, ప్రస్తావన లాంటివి తీసుకొచ్చారని చెప్పారు. వీటిని ఉపయోగించుకోవటంలో మన తెలుగువారు విఫలమయ్యారని ఉద్ఘాటించారు. శోకాంత నాటకాలు మన సంస్కృతి నుండి రాలేదని వివరించారు. కృష్ణమాచార్యులు నాటకాలు 1. విషాద సారంగధర 2. ముక్తావళి 3. అజామీళ చరిత్రము 4. చంద్రహాస చరిత్రము అనే నాటకాల్లోనూ, శ్రీనివాసరాయలు 1. రామరాజు 2. సుల్తానా చాందుబీ 3. శిలాదిత్య వంటి నాటకాలను శోకాంతాలుగా గుర్తించారు. అయితే, కొన్ని నాటకాలు మోదాంతం నుండి ఖేదాంతాలుగా మార్చారని ఈ మార్పు నాటక సమాజం వారు చేశారని కోలాచలంవారు మాత్రం తమ నాటకాలను మోదాంతాలుగానే తీర్చిదిద్దారని తేటతెల్లంచేశారు. కృష్ణమాచార్యులు వారి నాటకాలన్నిటిలోకల్లా '*సారంగధర*' పది శోకాంత నాటకాలు ప్రవహింప చేసిన రసధారను ఈ నాటకం ఒక్కటే చేసిందంటే అతిశయోక్తికాదని రాళ్ళపల్లివారన్నారు. అలాగే ఈ నాటకంలో ఉండే ఇతి వృత్తాన్ని మన కళ్ళముందు నిలబెట్టారీ ఉపన్యాస వ్యాసంలో. మూలంలో శోకాంతంగా ఉన్న నాటకాన్ని మార్పులు చేసి శాంతంగా మార్చటం సమంజసంగా లేదని కృష్ణమాచార్యులు వాపోయినా సందర్భాన్ని రాళ్ళపల్లి వారు గుర్తుచేశారు. ఇక్కడ వ్యాసకర్త ఈ నాటకం గురించి మాట్లాడుతూ విషాదం ఎక్కువగా ఉండే మానవులు నీతిమంతులుగా మారుతారన్న ఆలోచన సరైనది కాదని అభిప్రాయపడ్డారు. కాగా రసమనేది హద్దులు మీరితే ఆనందం పరమావధికి చేరదని శర్మగారు వ్యాసంలో భావించారు.

పాశ్చాత్య నాటకాల్లో ఒక పాత్ర చేసిన తప్పుని మరో పాత్రమీద తోసే విధానాన్ని నిరసిస్తూ శర్మగారిలా అన్నారు. ''*కోడిపుంజులను, పొట్టేళ్ళను పోట్లాడించి యవి కాళ్ళు మెడలు తెంచుకొని తలబుఱ్ఱలు పగులఁగొట్టుకొని చావుబ్రతుకులలో నుండఁగా చూచి యానందించువారికి వీరికిని మన స్తత్త్వమం దెక్కువ భేదములేదు*''[94] దీంతోపాటు దుఃఖాంతంగా ఉన్న నాటకాల్ని సుఖాంతంగా మార్చటాన్ని కూడా తప్పుబట్టారు. ఇది నాటకకర్త చేసేదికాదని కేవలం పద్ధతి లోపమని చెప్పారు. కొందరైతే ఎటువంటి స్పృహ లేకుండా నాటకాలు ముగించటం చూస్తున్నామని, ఇది గమనలోపం తప్ప మరోటికాదని ఉద్ఘాటించారు.

---

[93] నాటకోపన్యాసములు. పుట. 64.

[94] నాటకోపన్యాసములు. పుట. 62.

రాళ్ళపల్లి వారు సారంగధర నాటకాన్ని లోతైన దృష్టితో పరిశీలిస్తూ, కృష్ణమాచార్యుల చేసిన మార్పు నాకు రుచించలేదని అన్నారు. ఈ సారంగధర, చిత్రాంగి పాత్రలను శోకాంత సందర్భహితంగా మార్చటం బాగాలేదని చెప్పారు. కోలాచలం వారి *'రామరాజు చరిత్ర'* నాటకం మొదలైన వాటిలో పాత్రల స్వభావాలను మార్చటం సరికాదన్నారు. అసలు నాటకాల్లో పాత్రలు చేసే తప్పులు తర్వాత్తర్వాత వాటిని తప్పులను దిద్దుకొనేలా ఉండాలంటూ ''*నడతను శుభ్రముగా నుంచుకొనుటకు నవకాశము బ్రతుకులో నున్నది. చచ్చిన నేమిగలదు?*''[95] ఇలా ఎన్నో విషయాల్లో పాశ్చాత్య నాటక పద్ధతులను రాళ్ళపల్లివారు పరిశీలించటం గమనించవచ్చు.

తమ నాటకాలను తామే ఆడించాల్సిన విషయంలో నాటకకారులిరువురు చాలా కష్టపడ్డారని శర్మగారు అన్నారు. వీరిద్దరూ నాటకాలను రాయడమేకాదు వాటిల్లో నటించే నటులకు అభినయాలు కూడా చేయించి, అన్ని పనులను వారే గమనించేవారంటే అది మాములు విషయం కాదు. కొందరూ నటులు కేవలం అభినయం మాత్రమే చేస్తారు తప్ప, దాని ప్రాధాన్యమేమిటో చివరికి దీనివల్ల ఎటువంటి సందేశం బయటికెళ్తుందన్న స్పృహ వీరికి ఉండదని చెప్పారు. అప్పుడు కర్తలకు దీని పట్ల పడే భారం అంతాఇంత కాదని వ్యాసకర్త అభిప్రాయం. ముఖ్యంగా కోలాచలం వారి నాటకాల్లో నటులు కొంచెం తెలివైనవారున్నప్పటికి, కృష్ణమాచార్యుల వారి నాటకాల్లో బొత్తిగా లేకపోడం కనబడుతుందన్నారు. నటీనటులు కొంచెం చదువుకున్న వారు ఉంటే మంచిదని, లేదంటే నాటకం చూసే సభ్యులు చిత్ర విచిత్రంగా ప్రవర్తిస్తారని శర్మగారు హెచ్చరించారు. ఉదాహరణకు కోలాచలం వారి *'ద్రౌపదీ వస్త్రాపహరణ'* నాటకంలో కొన్ని సన్నివేశాలను ఉదాహరణకుకొన్ని గుర్తుచేశారు. వీరి నాటకాలల్లో కొన్ని పాత్రల స్వభావాలను మార్చి యాదృచ్ఛికం చేశారే తప్ప, ఈయన సొంతంగా చేసిన మార్పులు కాదని రాళ్ళపల్లివారు అభిప్రాయపడ్డారు.

*'సరసవినోదినిసభ' 'సుమనోరమ'* వాళ్ళు నాటకాల్లో కొంత హాస్యాన్ని సృష్టించారు తప్ప సహజంగా లేదన్నారు. ఈ హాస్యం కోసం సంస్కృతం నాటకాల్లో విదూషకుడి పాత్రను తీసుకోరావడం జరిగిందని చెప్పారు. కోలాచలం వారు తక్కువ హస్యాన్ని కల్పిస్తే, కృష్ణమాచార్యులు మాత్రం ఎక్కువ హాస్య రసాన్ని పోషించడం జరిగిందన్నారు.

నీతిని బోధించే విషయాల్లో కోలాచలం వారే ముందున్నారు. కానీ ఈ నీతి చూసే వాళ్ళకు ప్రత్యేక్షంగా కనిపించకుండా పరోక్షంగా లీనమై ఉంటే మరింత కళాత్మకత పెరిగేదని రాళ్ళపల్లి వారు స్పష్టపరిచారు. కొన్ని సందర్భాల్లో ఈ హాస్యం అకస్మాత్తుగా వచ్చిపడినట్లు ఉంటుందని చెబుతూ, ''*పిలవని పేరంటం వలె సహించటం కష్టమని*''[96] చమత్కరించారు.

[95] నాటకోపన్యాసములు. పుట: 65.

[96] నాటకోపన్యాసములు. పుట. 77.

ఇలా హాస్యాన్ని కృష్ణమాచార్యులు తెచ్చిపెట్టినట్లు పెడతారు కానీ సహజంగా ఉండదని కొన్ని కారణాలను ఉదాహరణల సహితంగా చూపించారు.

రాళ్ళపల్లివారి నాటకోపన్యాసముల'ను సమీక్షిస్తూ సజ్జాజు లక్ష్మీనరసింహారావుగారన్న ఈ మాటలు ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. ''రాళ్ళపల్లివారు పైపై పరామరిక యనుచు కూర్చిన *'నాటకోపన్యాసము' ల లోతులెంత తరచి చూచినను అందవు. ప్రాచీన లాక్షణికుల, నాటక కర్తల హృదయము నెరుగుటచే లభించిన సంస్కారముతో శర్మగారీ రచనము చేయుటవలన దీనికింత చేవగల్గినది''*[97] అని ప్రస్తుతించారు. ముందు చెప్పుకొన్నట్లు ఈ గ్రంథం ఆనాటి సమకాలీన సమాజన్నే కాదు ఈ నాటి సమాజాన్ని కూడా ఆలోచింపజేస్తుందని అర్థం చేసుకోవచ్చు.

## 2.11.3. సారస్వతాలోకము

రాళ్ళపల్లివారు రాసిన విమర్శ గ్రంథాల్లో ఇది అగ్రగణ్యమైనది. ఇందులోని *'రాయలనాటి రసికత', 'రాయల వైదుష్యము', 'నాచనసోముని నవీన గుణములు'* అనే వ్యాసాల్ని తొలుత 1932లో అనంతపురం సాధన ముద్రణాలయం వారు 'సారస్వతోపన్యాసములు' అనే పేరుతో ప్రచురించారు. తర్వాత శర్మగారు *'నిగమశర్మ అక్క', 'రంగనాథ రామాయణము', 'ఆంధ్రవాఙ్మయమున నాచనసోముని కీయదగిన స్థానము', 'త్యాగయ్యగారి నాథ సుధారసము', తిక్కన తీర్చిన సీతమ్మ'* అనే ఐదు వ్యాసాలను వెలువరించారు. ముందు 1932లో రాసిన మూడు వ్యాసాలనూ, తర్వాత వచ్చిన ఈ ఐదు వ్యాసాలనూ కలిపి 'సారస్వతాలోకము' అనే పేరుతో త్రివేణి పబ్లిషర్సు, మచిలిపట్నం వారు 1954లో ముద్రించారు. మరల సి. మృణాళిని 2009లో ఈ పుస్తకాన్ని మృదులా ప్రచురణల ద్వారా అచ్చులోకి తీసుకొచ్చారు. ఇది సుమారు మూడు నాలుగు ముద్రణలు పొందటం జరిగింది. ఇందులో ఉన్న వ్యాసాల్లోని సాహిత్యాంశాలను శర్మగారు ఏ విధంగా వ్యక్తం చేశారనేది ప్రస్తుతం పరిశీలనార్హం.

- **రాయల నాటి రసికత**

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ ఆముక్తమాల్యద, మనుచరిత్రము, పారిజాతాపహరణము అనే మూడు ప్రబంధాల ఆధారంగా 'రాయలనాటి రసికత' అనే గొప్ప వ్యాసం రాశారు. ఇందులో 16 వ శతాబ్దం నాటి ప్రజల రసిక జీవితాన్ని కళ్ళకుకట్టినట్లు చిత్రించారు. రాయల కాలం నాటి ప్రజల జీవన రసికతను సమకాలీన ప్రజల జీవితంతో పోల్చి చెప్పటంలో వ్యాసకర్త సిద్ధహస్తులయ్యారు. అంతేకాకుండా అక్కడక్క హాస్యపు హొయలనూ, వ్యంగ్యబాణాలను వేసి రసిక జీవనం పట్ల పాఠకులకు ఆసక్తిని కలిగించారు.

వ్యాసకర్త దృష్టిలో రసికుడనగా ''*తన మనస్సునకానందమునిచ్చు భోగముననుభవించుటలో కష్ట సుఖములుగాని, లాభ నష్టములుగాని, తుదకు*

[97] అనంతరాగం. పుట.188-192.

*ధర్మాధర్మములుగాని యెక్కువగా లెక్క పెట్టక పని చేయువాడు"* [98] ఈ నిర్వచనమాధారంగానే ప్రబంధ కాలం నాటి ప్రజల రసిక జీవితంలోని వివిధ పార్శ్వాల్ని శర్మగారు తెలియజేశారు.

అనంతకృష్ణలవారు ఈ వ్యాసంలో ప్రవృత్తి, నివృత్తి అనే భోగాల్ని గురించి వివరించారు. ప్రవృత్తి భోగమనగా ఇంట్లో అనుభవించే సుఖాలనీ, నివృత్తి భోగాలనగా ఆధ్యాత్మిక జీవితానికి చెందినవనీ సూచించారు. ఇంట్లో అనుభవించే భోగాలు వస్త్రం, ఆభరణం, గంధం, పుష్పం, తాంబులం, శయ్య మొదలగునవని చెప్తూ, అదనంగా అన్న, పాన, స్నానాలనే మరో మూడు భోగాలను పరిచయం చేశారు. వ్యాసకర్త ఈ భోగాలను అనుభవించటంలో ఆనాటి రాజులు, ప్రజలు ఏవిధంగా కృతకృత్యులయ్యారనే చక్కగా తెలిపారు. కాగా ఈ నాటి ప్రజల ఎందుకు కృత్యులు కాలేక పోతున్నారన్న అంశాల్ని మంచి సమన్వయంతో చర్చించారు. ఈనాటి వారితో పోల్చుకొంటే ప్రబంధ కాలపు ప్రజల ఆలోచనా విధానం అన్ని విషయాల్లోనూ మేలైనది. వారు ఏది అనుకుంటే దాన్ని తప్పక సాధించారని రాళ్ళపల్లివారు గుర్తుచేశారు.

రాయల కాలపు ప్రజలు ఇళ్ళ నిర్మాణంలో వంటగది, స్నానపుగది, ఆరు బయట ఉద్యానవనం లాంటి ఎన్నో ప్రత్యేకతలను పాటించి గృహనిర్మాణం చేసుకోవడాన్ని శర్మగారు ప్రశంసించారు. ఆనాడు కోపగృహ విధానం గురించి రాళ్ళపల్లివారు ఈ విధంగా చమత్కారించారు. *"అప్పటి గృహరచనలో అన్నిటి కన్న గొప్ప వింత యేమనగా కోపగృహము. కోపగించుకొన్నవారు ముఖ్యంగా యజమానిపై యజమానురాలికి కోపము వచ్చినప్పుడు ఆ కోపము తీరు వరకు లేక ఎవరైన తీర్చు వరకు ఆ ఇంటిలోనుండి తలుపు బిగించుకొందురట. ఏ బుద్ధిమంతుడు దీనిని కల్పించెనో కాని యిది చాలా మంచి పద్ధతి"* [99]

ఇక వస్త్రాభరణాలూ, అలంకరణ విషయాల్లో అప్పటి స్త్రీ పురుషుల్లో పెద్దగా తేడాలు ఉండేవి కావు. ఏవో కొన్ని ఆభరణాల్లో ఆయా భేదాలుకనింపించేవి. అవి కూడా స్త్రీలు ధరించే ముక్కెర, పురుషులు పెట్టుకొనే కీరిటం లాంటివి మాత్రమేనని అనంతకృష్ణశర్మ చెప్పారు.*"ఉన్న ఇద్దరికి సొమ్ములుండును లేకున్న నిద్దరికి లేదు అంతేకాని ఆర్జించు శ్రమంతయు నొకరిది, అలంకరణమంతయు నొకరిది అను తకరారు లేకుండును."* [100] అని ఆనాటి ఆభరణాల ప్రాధాన్యాన్ని తెలిపాలి.

పై తేడాలు ప్రబంధ కాలంలోనే ఉండేవి. కాని అవి కాలక్రమంలో ఈ అలంకరణాల్లో చాలా మార్పులు చోటు చేసుకోవటం ముదావహమన్నారు. ముఖ్యంగా ఈనాడు స్త్రీలు అలంకరణకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం పెరిగింది. ఈ ధోరణి అనేక సమస్యలను తెచ్చిపెట్టిందని శర్మగారు వ్యంగ్యంగా గుర్తుచేశారు.

---

[98] సారస్వతాలోకము. పుట. 2.

[99] సారస్వతాలోకము (పుట:5-6)

[100] సారస్వతాలోకము పుట. 8

సుగంధ ద్రవ్యాలైన యాలకులనూ, తాంబూలనూ మొదలైన వాటిని వివిధ ప్రత్యేక సమయాల్లో వినియోగించిన ప్రబంధ కాలపు ప్రజలు అదృష్టవంతులని శర్మగారి అభిప్రాయం. కాగా ఆనాడు స్త్రీ, పురుషులిద్దరు తాంబూలం వేసుకొనేవారు. అంతేకాక సువాసనలు వెదజల్లే పువ్వుల పరిమాళాలను ప్రజలు ఎంతో ఇష్టంగా అనుభవించడం కూడా జరిగింది. కాని క్రమక్రమంగా ఈ సంతోషాలు కొన్ని వర్గాల వారికే సొంతమవుతున్న పరిస్థితిపై రాళ్ళపల్లివారు నిర్వేదం వ్యక్తం చేశారు.

శర్మగారు ప్రత్యేకంగా చెప్పిన మూడు భోగాలు అన్న, పాన, స్నానాలు. వీటిని ఆనాటి సామాన్య ప్రజలు కూడా కొద్దివరకు అనుభవించగలిగారని చెప్పారు. అయితే, నేటికాలంలో ఇవి ధనవంతులకు మాత్రమే అందుబాటులో ఉన్నయన్న విషయాన్ని తప్పబట్టారు. అలాగే, ఆరోగ్య విషయాల్లో కూడా నాటికి నేటికి చాలా వ్యత్యాసాలున్నాయని శర్మగారు అన్నారు.

ఆనాటికాలంలో కవులు తమ కావ్యాల్లో స్త్రీని భోగ వస్తువుగా చిత్రించిన విధానాన్ని వ్యాసకర్త ఇలా అన్నారు. *‘‘స్త్రీలను వర్ణించు సన్నివేశమెట్టిదైనను మనకవుల దృష్టి పడకటింటిలో వేచియున్న పెండ్లి కొడుకు దృష్టియే కాని వేరుండదు.’’*[101] అయితే రాజులు అనేక మంది స్త్రీలను తమ ఉంపుడు గత్తెలుగా ఉంచుకొని రసిక జీవితాన్ని గడిపిన సందర్భాలు చాలా ఉన్నాయనటం పరిపాటి. దీని వల్ల పురుషులకు ఆనాడు సంఘంలో బాగా గౌరవం ఉందంటూ... *‘‘ఆడవారిని గెలుచుటయు ఆదిల్ ఖానుని గెల్చుటయు నొకే పౌరుషముగా భావించిరి.’’*[102] కాని నాడు భోగ వస్తువుగా ఉన్న స్త్రీ నేడు భోగ్య వస్తువుగా మారటం జరిగిందని వ్యాసకర్త కాలంలో వస్తున్న మార్పులను మన కళ్ళముందుంచే ప్రయత్నం చేశారు.

ఈ విధంగా ప్రవృత్తి, నివృత్తి అనే రెండు భోగాల ఆధారంగా ‘రాయలనాటి రసికత’ను తెలిపిన రాళ్ళపల్లివారు ఈ రెండు భోగాలను అనుభవించటంలో ఆనాటి ప్రజలే గొప్పవారని నొక్కి వక్కాణించారు..

ఈ వ్యాసాన్ని రాళ్ళపల్లి వారి రచనా కౌశలానికి తార్కాణంగా అభివర్ణించవచ్చు. ఇది ఆసక్తికరంగా ప్రారంభమై లోతైన విషయాల్లోకి లాక్కెళ్లింది. పైగా ఆలోచనాత్మకంగా ముగించటం ఈ వ్యాసకర్త ప్రత్యేకత. ప్రారంభం ఆసక్తికరంగా మొదలైతే, మధ్యభాగం ఎన్నో విషయాల్ని చర్చించింది. చివరిభాగాన్ని ఆలోచనాత్మకంగా ముగించటం శర్మగారి వ్యాస రచన కౌశలానికి నిదర్శనంగా భావించవచ్చు.

- **రాయల వైదుష్యము**

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ ఈ వ్యాసంలో శ్రీకృష్ణ దేవరాయల పరిపాలన విధానాన్నీ, వ్యక్తిత్వాన్నీ ఆయన చేపట్టిన విజయ యాత్రల్నీ అవలోకనం చేశారు. రాయలు కట్టించిన కట్టడాల్నీ, చేసిన ఉపదేశాల్నీ, పాటించిన గొప్ప పద్ధతుల్ని నేటి సమాజం ఎంతవరకు అర్థం

---

[101] సారస్వతాలోకము. పుట. 16.

[102] సారస్వతాలోకము. పుట. 17.

చేసుకోగలిగింది? ఇంకా అర్థం చేసుకోవాల్సిన ఆవశ్యకత ఏమిటి అనే అంశాలను సంపూర్ణంగా తెలిపారు.

సమాజంలో గొప్ప వ్యక్తుల్ని గౌరవించటం పరిపాటిగా వస్తున్న సంప్రదాయం. అలా కాకుండా ఆ గౌరవంతో పాటు గొప్ప వ్యక్తులు చేపట్టిన మంచి పనుల్నీ, వారి ఆలోచనా ధోరణులను ఎంతవరకు అనుసరిస్తున్నామని వ్యాసంలో ప్రశ్నించారు. మహాత్ములైన రాజుల ఆలోచనల్ని వారు అనుసరించిన గొప్ప మార్గాల్ని ఎప్పుడైతే గౌరవిస్తామో అప్పుడు ఆ వ్యక్తుల ఆత్మ శాంతిస్తుందని సభా ముఖంగా గుర్తుచేశారు.

రాళ్ళపల్లివారు ఈ వ్యాసంలో శ్రీకృష్ణ దేవరాయల గొప్పతనం ఈ నాటి వారికి ఆదర్శనీయమూ, అనుసరణీయమని ఉద్ఘాటించారు. రాయలంటే ఏ పురాణ పురుషుడో, జగదేక వీరుడో కాదు. మనలాంటి సామాన్య మానవుడేనని గుర్తుచేశారు. ఇలాంటి సామాన్య మానవుడు ప్రజల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రామాలు చేపట్టి దేదీప్యమానం చేసాడో చూడండి. రాయలు తన పాలన కాలాన్ని స్వర్ణయుగమని అనిపించుకున్న మహానుభావుడుగా కీర్తించబడ్డాడని శర్మగారు అన్నారు. సుదీర్ఘమైన ఈ వ్యాసం చదివిన పాఠకులు ఉత్తేజితులయ్యే విధంగా శర్మగారు ఉపన్యసించారు.

- **నాచన సోమన నవీన గుణములు**

అనంతకృష్ణశర్మ ఈ వ్యాసంలో నాచన సోముని నవీన గుణాలను సంపూర్ణంగా సోదాహరించారు. కవిత్య తత్త్వాలైన భావము, వస్తువు, రచనల ఆధారంగా ఈ చర్చను కావించారు. ప్రాచీన కాలం నుండి నేటి వరకు కావ్యాల్లో ఈ తత్త్వాల ప్రాధాన్యం ఎట్టిదో వివరిస్తూ, సోమనాధుని నవీన గుణాలను పరిశీలించారు.

శర్మగారు వాల్మీకి, వ్యాస, కాళిదాసాది సంస్కృత మహాకవులూ, నన్నయ, తిక్కనాది తెలుగు మహాకవుల కావ్యాల్లో భావము, వస్తువు, రచనలు ఏవిధంగా రూపుదిద్దుకున్నాయో ప్రస్తావించారు. కాగా 14వ శతాబ్దం నాటి సోమనాధుడు మాత్రం భావాని కంటే , వస్తువూ, రచనకే ఎందుకు ప్రాధాన్యం ఇచ్చారనే అంశాల్ని స్పష్టం చేశారు.

రాళ్ళపల్లివారు నాచన సోముని నవీన గుణాలను వివరించే ముందు భావము, వస్తువు, రచనలను విడమరచిని చెప్పారు. భావము: అనగా మానవునిలో సహజంగా కలిగే ప్రేమ, కోపము, అసహ్యము, అలక్ష్యము, దయ మొదలైనవవి. వస్తువు; అనగా ప్రకృతిలో కనిపించే జాతి, గుణము, క్రియాదులని. రచన; అనగా పై రెండింటిని వివరించే కళా ధర్మమని వివరంగా తెలిపారు.

రాళ్ళపల్లివారు భావ, వస్తు, రచనా తత్త్వాలను ప్రాచీన కవులు తమ కావ్యాల్లో ఎలా వెల్లడించారనే వ్యాసంలో చూడవచ్చు. ఒక వేళ వస్తువు ఎక్కువై, భావము తక్కువైతే అది రక్తి కట్టదని చెప్పిన అభిప్రాయం చూడండి. ''*భావములతో నేమాత్రమును సంబంధములేని వట్టి*

*పదార్థముల కూర్పు ఎండిన వరగు గంపకెత్తినట్లుండును.''*[103] ఇట్లాంటి సందర్భాలు కూడా సాహిత్యంలో అక్కడక్కడ ఉన్నాయని శర్మగారు గుర్తుచేశారు. దీన్ని బట్టి కావ్య సృష్టికి భావ, వస్తు, రచనలు మూడూ అవసరమని అన్నారు.

ఎఱ్ఱన సమకాలికుల్లో *'ఉత్తర హరివంశము'* మను కావ్యాన్ని రాసిన నాచన సోమన అగ్రగణ్యుడనీ మానవల్లి రామకృష్ణకవి, కందుకూరి వీరశలింగం పంతులు, వేలూరి శివరామశాస్త్రి మొదలైన మహాపండితులు ప్రశంసించారు. దీనికి ప్రధాన కారణం ఆ కావ్యంలో పాటించిన రచనా పద్ధతియేనని రాళ్ళపల్లి వారు అభిప్రాయపడ్డారు.

*'ఉత్తరహరివంశము'*లో సోమనాథుడు అద్భుతమైన వర్ణనలతో, సందర్భానుసారంగా లోకోక్తులను కూర్చుతూ , శబ్దాలంకారాలను పొదుగుతూ తన రచనా వైశిష్ట్యాన్ని ప్రదర్శించారు. అంతేకాకుండా అంత్యప్రాసలు, అనుప్రాసలు, అలంకారాలతో కావ్యాన్ని రక్తి కట్టించటంలో సోమన తనదైన ముద్ర వేసుకున్నారని రాళ్ళపల్లి వారు తెలియజేశారు.

ఇలాంటి రచనా నైపుణ్యమే అతని నవీన గుణసనాథతకు నిదర్శనమంటూ...''*నాచన సోమనాథుడు సంస్కృత వాఙ్మయమున గొప్ప పండితుడగుటచే అందలి ప్రాచీనమైన పద్ధతిని వదలి వస్తుపద్ధతిని– అంతకన్న నవీనమగు శబ్దార్థ రచనా పద్ధతిని — తెలుగు భాషలో ఎక్కువ ప్రచారమునకు తేచ్చేందుకు ప్రయత్నించి తరువాతి వారికి మార్గదర్శకుడైయ్యేడు. ఇదే యితని 'నవీన గుణ సనాథ బిరుదమునకు మూలము'*[104] అని రాళ్ళపల్లివారు గుర్తుచేశారు.

సోమన కావ్యంలో ఏదైన ఒక భావాన్ని చెప్పేందుకు ఒక అర్థం కావాల్సినప్పుడు దానికి ఎన్ని పదాలు అవసరమవుతాయో అన్ని పదాలను కూర్చగలడు. అంతేకాక మరో అర్థాన్ని చెప్పాల్సి వచ్చినప్పుడు కావాల్సినన్ని వాఖ్యాల్ని సృష్టించగలడు. ఈ రెండింటిలో సోమన అందవేసినచేయ్యి అని అన్నారు.

అనంతకృష్ణశర్మ సోమన తన *'ఉత్తర హరివంశము'* లో *'నవీన గుణసనాథుడు'* అను బిరుదుని తన వ్యక్తిత్వానికి ఆపాదించుకున్నాడు. అయితే, అది కేవలం అతని రచనకు సంబంధించినది మాత్రమేకాని వ్యక్తికి కాదు అని స్పష్టం చేశారు.

సాహిత్య పరిణామాన్ని దృష్టిలో పెట్టుకొని, కాల ప్రభావంతో మార్పులను భేరిజు వేస్తూ, ప్రాచీన కవులైనా కవిత్రయంలో భావానికి ప్రాధాన్యం ఎక్కువనీ, నాచన సోమనాథులలో వస్తు రచనలకు ప్రాముఖ్యం అధికమని రాళ్ళపల్లి ఆ వ్యత్యాసాన్ని తెలిపారు. అలాగే, నాచన సోమన మొదలైన ఈ నాటి వారు ఔచిత్యాన్ని పాటించకుండా పాండిత్యాన్ని ప్రదర్శించారని వ్యాసకర్త అభిప్రాయం వ్యక్తం చేశారు.

---

[103] సారస్వతాలోకము. పుట. 45.

[104] సారస్వతాలోకము. పుట. 53.

నాచనసోమనాథుడు తన రచనల్లో భావానికి ప్రాధాన్యమిచ్చిన సందర్భాలు ఎక్కువగా ఉన్నాయి. కానీ వస్తు రచనలకూ ప్రాముఖ్యమిచ్చిన సందర్భాలు మరీ ఎక్కువగా ఉండటాన్ని శర్మగారు సంయమానంతో తెలిపారు.

ఆ కాల సాహిత్యంలో ఇది గొప్ప నవీనతమైతే సద్యః పరనిర్వృతిని ఇచ్చే శక్తి తక్కువైనా తృప్తిని, ఆశ్చర్యాన్ని గలిగించి మనల నుల్లాస పరుచే సామర్థ్యం నాచన సోముని కవిత్వానికి ఉందంటూ *''దీనికి లొంగని వాడు లేడు. కాని లోతుగా ఆలోచిస్తే ఇంతకంటే మంచి కళ ఇంకొకటి కలదని తల పని వాడు లేడని''*[105] రాళ్ళపల్లి వారి తమ వ్యాసాన్ని ముగించారు.

- **నిగమశర్మ అక్క**

రాళ్ళపల్లివారు ఈ వ్యాసంలో తెనాలి రామకృష్ణుడు సృష్టించిన 'నిగమశర్మ అక్క' అనే పేరు లేని పాత్రను అద్భుతంగా పరిచయం చేశారు. ప్రాచీన సాహిత్యంలో పేరు లేని పాత్రలకు ఉండే ప్రాశస్త్యాన్ని శర్మగారు మన కళ్ళముందుంచారు. కాగా తెనాలి రామకృష్ణుని పాత్ర చిత్రణ నైపుణ్యాన్ని వ్యాసంలో ఉగ్గడించారు. తెనాలి వారి ఇతర రచనలకన్న 'పాండురంగ మాహాత్మ్యము'లోని 'నిగమశర్మ అక్క' పాత్ర చెప్పుకోదగ్గదని శర్మగారు ప్రశంసించారు.

*'పాండురంగ మాహాత్మ్యము'*లో నిగమశర్మ ఒక సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన యువకుడు. ఈ నిగమశర్మ యవ్వనంలో అనేక వ్యసనాలకు లోనై, తమ ఇంటి పరువు ప్రతిష్ఠలను మంటలో కలుపుతాడు. ఈ వార్తను తెలుసుకున్న నిగమశర్మ అక్క తన పుట్టింటికి వచ్చి ఇల్లుని, తమ్ముణ్ణి చక్కబెట్టె ప్రయత్నం చేసే సన్నివేశాన్ని అనంతకృష్ణశర్మ కళ్ళకు కట్టినట్లు చిత్రించటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

'నిగమశర్మ అక్క' పాత్రను తెనాలి రామకృష్ణుడు ఓ తెలుగు వారి ఆడపడుచుకు నిదర్శనంగా భావించాడు. అసలు కుటుంబంలో బాధ్యత గల స్త్రీ కేవలం తన మొగునింటికే పరిమితం కాకుండా, పుట్టింటి బాగోగులు కూడా చెక్కబెట్టే విధానం గౌరవంగా ఉందని శర్మగారు ప్రశంసించారు.

అనంతకృష్ణశర్మ ఈ వ్యాసంలో *''ఈ చల్లని తల్లి పేరేమో తెనాలి రామకృష్ణ కవి మనకు తెలపలేదు.''*[106] అని ప్రస్తావించారు. తెలుగు సాహిత్యంలో 'నిగమశర్మఅక్క' పాత్రకు పేరు లేకపోయినా, ఎంతో పేరు ప్రసిద్ధులు తెచ్చిపెట్టిందని వ్యాసకర్త శ్లాఘించారు. అంతేకాకుండా బ్రాహ్మణ కుటుంబాల్లో జీవన విధానం ఏవిధంగా ఉంటుందన్న విషయాన్ని తెనాలి రామకృష్ణుడు నిగమశర్మఅక్క పాత్ర ద్వారా తెలియజేశారని శర్మగారు వ్యాసంలో పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఉండే బ్రాహ్మణులకు పూర్వం చాలా గౌరవం ఉండేదన్న విషయం నిగమశర్మ కుటుంబం నిరూపించింది. తండ్రి సభాపతి 'వేదములు పోసిన గాదె' ఊర్లో జరిగే తతంగాల్లో ఈయన భాగస్వామ్యం మిళితమై ఉండేదన్న సత్యాన్ని వెల్లడించారు. అయితే, నేతి

---

[105] సారస్వతాలోకము. పుట. 62.

[106] సారస్వతాలోకము. పుట. 63.

బీరకాయ లాంటి నిగమశర్మ వల్ల జరిగిన అవమానం మచ్చగా మారింది. ఈ చెడ్డ పేరు తన కుటుంబానికే అవరోధమవుతుందని అక్క భావించింది. ఇక తన చాతుర్యంతో పరిస్థితులను అనుకూలంగా మార్చుకొని, తమ్మునికి బుద్ధి చెప్పి పెళ్ళి చేసి ఇంటి గౌరవాన్ని నిలబెట్టగలిగింది. అంటే ఇక్కడ స్త్రీలు కూడా ఎంతో బాధ్యత కలిగి ఉంటారని చెప్పటం వ్యాసకర్త ఉద్దేశ్యం. స్త్రీలలో కూడా మంచి తెలివితేటలు ఉంటాయని చెప్పిన ప్రముఖుల్లో శర్మగారు కూడా ఒకరని చెప్పవచ్చు. అత్త వారింటికి వెళ్ళిన ఆడపడుచు పుట్టింటివారి క్షేమ సమాచారాలు పట్టించుకోవడం మన తెలుగు సంస్కృతికి నిదర్శనంగా ఉందని రాళ్ళపల్లివారు మెచ్చుకొన్నారు.

నిగమశర్మ అక్క విశ్వ ప్రయత్నాలు చేసి పుట్టింటి కాపురం చక్కదిద్ది, తమ్మునికి నాలుగు మంచి మాటలు చెప్పి తాత్కాలికంగా పరిస్థితులను మార్చగలిగింది. అయితే, ఇన్ని మంచి మాటలు విన్న నిగమశర్మ నాలుగు రోజులు బుద్ధిగా ఉండి, చివరికి ఇంటిల్లీపాది నిద్రిస్తున్న సమయంలో ఇంట్లో ఉన్న నగలతో పాటు వాళ్ళ అక్క ముక్కుపుడక కూడా తీసుకొని పారిపోతాడు. అప్పుడు అక్క *'క్రొత్తగా చేయించుకొన్న ముక్కర పోయెనే యని'*[107] బాధ పడుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని రాళ్ళపల్లి వారు *'పరిహాసము పవిత్ర వస్తువుని కూడా గమనింపదేమో'*[108] అని రామకృష్ణ కవి ఆలోచనను తప్పుబట్టారు. ఇంటి పరువు నిలబెట్టాలనే ఉద్దేశంతో వచ్చిన నిగమశర్మ అక్క తన ముక్కర పోవడం వల్ల బాధ పడింది ఈ విషయాన్ని చెప్పడంలో కవి ఔచిత్యం దెబ్బతిన్నదని రాళ్ళపల్లివారు అభిప్రాయపడ్డారు. కాని అక్క ఇక్కడ తమ తమ్ముడు చెడిపోయాడనో, తన ప్రయత్నం వ్యర్థం అయ్యిందనో మథన పడుతుందే తప్ప నగలపై వ్యామోహం చూపించడం ఏమాత్రం పొంతు కుదరని ఆలోచనగా శర్మగారు భావించారు.

ఈ విధంగా తెలుగు సాహిత్యంలో తెనాలి రామకృష్ణుడు సృష్టించిన నిగమశర్మ అక్క పాత్ర రాళ్ళపల్లి వారి వ్యాసం ద్వారా మనందరికి మరింత ఆత్మీయమైనదిగా పరిచయమైంది.

- **రంగనాథ రామాయణము**

ప్రాచీన తెలుగు కావ్యాల గురించి, కర్తృత్వం గురించి లోగడ ఎన్నో వాదోపవాదాలు జరిగాయి. అలాంటి వాటిలో రంగనాథ రామాయణం కూడా ఒకటి. దీన్ని వేటూరి ప్రభాకరశాస్త్రి, గన్నవరపు సుబ్బరామయ్య తోడ్పాటుతో పరిష్కరించారు. ఈ కావ్యాన్ని ఆంధ్ర విశ్వకళా పరిషత్ వారు 1942లో ప్రచురించారు. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ 'రంగనాథ రామాయణము' పరిష్కృత గ్రంథాన్ని 1943లో మే నెల భారతి పత్రికలో ఘాటూగా సమీక్షించారు.

---

[107] సారస్వతాలోకము. పుట-71.

[108] సారస్వతాలోకము. పుట-71.

ఈ గ్రంథానికి పింగళి లక్ష్మీకాంతం, కట్టమంచి రామలింగారెడ్డి అభిప్రాయాలకు అనుగుణంగానే పీఠిక రాశారు. అయితే, రెడ్డిగారికి అది సంతృప్తి కలిగించలేనందుకు తానొక అనుబంధ పీఠికను వెలయించారు. కానీ, రంగనాథ రామాయణ పరిష్కకర్తలుగా ప్రభాకరశాస్త్రిగారు, గన్నవరపు సుబ్బరామయ్యగార్ల పేర్లు పేర్కొనలేదు. ఈ పేర్లు పింగళి వారి పీఠికలో మాత్రమే కనబడతాయి. కాబట్టి రాళ్ళపల్లివారు ఈ దోషాన్ని ఎత్తి చూపారు. కాగా రంగనాథ రామాయణ గ్రంథ సంపాదనకు పాఠపరిష్కారానికి సంబంధించిన విషయాలు లేకపోవడాన్ని తప్పుబట్టారు. ముఖ్యంగా శర్మగారు కొన్ని పాఠాల్నీ సవరించి మరికొన్ని ప్రశ్నలను లేవనెత్తారు.

అనంతకృష్ణశర్మ యుద్ధకాండంలోని సులోచన వృత్తాంతాన్ని పరిశోధక ద్వయం ముఖ్య భాగంలో చేర్చితే పీఠికాకర్త పింగళివారు  అనుబంధంలో చేర్చడం సమంజసం కాదన్నారు. అంతేకాక  దీనికి కొన్ని ఉదాహరణలు చూపిస్తూ సులోచన ఈ పరిష్కర్తల్ని బాగా ఆకర్షించిందని చమత్కారించారు. సులోచన వృత్తాంతం రంగనాథ రామాయణానికి అనుబంధంగా ఉంది.  కానీ ఇందులో  భాషాశైలికి రంగనాథ రామాయణంలోని భాషాశైలికి చాలా తేడాలున్నాయని కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. పీఠికా కారులిద్దరు చేసిన తప్పులను వారు సమర్థించుకున్నారే తప్ప వాటిని ఒప్పుకోలేదు. మూలంలో ఒకటి ఉంటే వీరు పీఠికల్లో మరోలా రాయటం సరికాదన్నారు. ఇది పూర్తిగా అవగాహన లోపమేనని రాళ్ళపల్లి వారు ఉద్ఘాటించారు. రంగనాథ రామాయణ కర్తృత్వం గురించి వ్యాసకర్త లోతుగా చర్చించారు. పింగళివారు కట్టమంచివారు పీఠికల్లో, అనుబంధ పీఠికల్లో రామాయణ కర్త గోనబుద్ధారెడ్డేనని తేల్చి చెప్పారు. కానీ రాళ్ళపల్లివారు రంగనాథుడనే కవి ఈ రామాయణాన్ని రచించి గోనబుద్ధారెడ్డి పేరిట ప్రకటించి ఉండవచ్చని భావించారు. రాజాస్థానల్లోని ఆశ్రిత కవులు తాము కావ్యాలు రాసి తమ పోషకుల పేర ప్రకటించడం అరుదేమి కాదన్నారు.

అనంతకృష్ణశర్మ రంగనాథ రామాయణ కర్తృత్యం గురించి చెబుతూ బ్రాహ్మణ బ్రాహ్మణేతర కవుల ప్రస్తావన తెచ్చిన రెడ్డిగారి అభిప్రాయాలతో విభేదించారు. అప్పకవి *'ధరణీసురుడు ప్రశాంతుడు ....... కవియన బరుగున్'*[109] అన్న మాటకు రెడ్డిగారు చేసిన వ్యాఖ్యానం తప్పని అన్నారు.

*'నానృషిః కురితేకావ్యం'*[110] అనే మాటకు అనువాద ప్రాయమైన అప్పకవి ఉద్దేశ్యాన్ని రెడ్డిగారు తప్పుగా అర్థం చేసుకున్నారన్నారని రాళ్ళపల్లి విమర్శించారు. ఋషి అంటే ప్రశాంతత, ప్రతిభ, వ్యుత్పత్తులు కలవాడేకాని బ్రాహ్మణ జన్ముడే అని భావించకూడదని గుర్తుచేశారు. ప్రాచీన బ్రాహ్మణ కవులు కొందరు శూద్రకవులను తమ కావ్యాల్లో స్తుతించక పోవడానికి కారణం అభిరుచి భేదమే కానీ కులం కాదన్నారు. బ్రాహ్మణ కవులు కన్న గొప్ప

---

[109] సారస్వతాలోకము. పుట. 84.

[110] సారస్వతాలోకము. పుట. 85.

వాడైన రామరాజ భూషణుని బ్రాహ్మణకవులు నెత్తి మీద పెట్టుకో లేదా అని నిర్ద్వందంగా ప్రశ్నించారు.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ రంగనాథ రామాయణాన్ని 'రంగనాథ కృతము' అని చెప్పిన లక్ష్మీకాంత గారి అభిప్రాయంతో ఏకీభవించలేదు. రంగనాథ రామాయణ కావ్య సమీక్షలో ఈయన కావ్య కర్తృత్యం గురించి పీఠికా కర్తలైన పింగళి, కట్టమంచి గార్ల అభిప్రాయాలను నిర్మోహమాటంగా ఖండిస్తూ, అత్యంత ప్రతిభవంతుడైన రెడ్డిగారితో తన విభేదాన్ని ఈ విధంగా వ్యక్తం చేశారు. *''వారి శక్తి యుక్తులను గౌరవించినంత హార్ధముగా వారి అభిప్రాయములను అంగీకరించుట నా వంటి వారికి పలుమారు గల్గు భాగ్యము కాదు. అవి చాలమటుకు అపూర్వములు, స్వచ్ఛందములు, విప్లావకములు''* [111] 'ఈ మాటలు చదివిన రెడ్డిగారు మూడురోజులు పాటు ధుమధుమలాడారట అప్పుడు ఆంధ్ర విశ్వకళా పరిషత్తు గ్రంథాలయాధ్యక్షులైన అబ్బూరి రామకృష్ణారావు శాంత పరిచారని రాళ్ళపల్లివారి ద్వారా స్వయంగా విన్న ఘట్టమరాజు అశ్వత్థ నారాయణ తమ వ్యాసంలో పేర్కొన్నారు.[112]

రాళ్ళపల్లి వారు ఈ విధంగా రంగనాథ రామాయణం గురించి సుదీర్ఘ చర్చ చేస్తూ, రంగనాథుడే ఈ రామాయణం రాసి ఉండవచ్చునేమోనన్న అభిప్రాయాన్ని వెలుబుచ్చారు.

- **ఆంధ్ర వాఙ్మయమున నాచన సోమనాథునికీయదగిన స్థానము**

రాళ్ళపల్లివారు నాచన సోముని కంటే ఎర్రన గొప్ప కవియని భావించారు. కాని మానవల్లి రామకృష్ణకవి, వేలూరి శివరామశాస్త్రి, నడకుదుటి వీరరాజు మొదలైన పండితులు నాచన సోమనాథునికే పెద్దపీట వేశారు. ఎర్రన నాచన సోమన కంటే అగ్రపూజకు సమర్థుడని రాళ్ళపల్లివారు ఈ వ్యాసంలో తమ ప్రతిక్రియను నిరూపించారు.

ఈ నాచన సోముని విషయంపై తెలుగు సాహిత్య విమర్శలో చాలా కాలం చర్చలు, వాదోపవాదాలు జరిగాయి. రాళ్ళపల్లివారి వాదాన్ని సమర్థించిన వారు నాగపూడి కుప్పుస్వామయ్యగారొక్కరు మాత్రమే. ఈ వ్యాసంలో రాళ్ళపల్లివారు నడకుదుటి వీరరాజు పంతులు చేసిన కొన్ని శబ్దచర్చలతో ఏకీభవించి, మరికొన్నిటితో విభేదించారు. అలాగే, కవిత్వం విషయంలో కూడా నాచన సోమన కంటే ఎర్రనే గొప్పగా రాశాదని చెప్పారు. ఈ విధంగా వీరిద్దరి ఆలోచనలు ఏలా ఉన్నాయన్నదాన్ని కింది మాటల్లో పరిశీలించండి.''*ఇట్లు మాయిరువురకును మార్గములు వేరు. పెద్దల వాక్యములు స్థాపింప చుచువారు వారు. నారుచికి పెద్దల వాక్యములు సరిపోవునా యని చూడ ప్రయత్నించువాడను నేను.*[113] అని తమ దృక్కోణ భేదాల్ని శర్మగారు ఆవిష్కరించారు.

---

[111] సారస్వతాలోకము. పుట-73.

[112] అనంతరాగం. పుట. 129.

[113] సారస్వతాలోకము. పుట-96.

అనంతకృష్ణశర్మ నాచన సోముడినీ, ఎఱ్ఱన సమకాలికునిగానే భావించారు. కాగా నాచన సోమన ఎఱ్ఱన 'హరివంశము' ను చూసి దానికన్నా బాగా రాయాలని అకోవడం జరిగిందన్నారు.

శర్మగారు రసాన్ని కావ్యానికి ప్రాణమని చెప్పారు. కానీ కావ్యగుణాలైన అలంకారాలు, రీతులు, పాకములు మొదలైన విషయాలు శిల్పానికి సంబంధించినవని తెలిపారు.

రాళ్ళపల్లి వారు రసదృష్టితో ఉభయుల కవిత్వాన్ని పరిశీలించి చెప్పిన మాటలు పరిశీలించ దగినవి–''రసపోషణ దృష్టి యెఱ్ఱన కన్న సోమునికి తక్కువయని నాకు తోచెడిని''[114] అని పలు ఉదాహరణలు ఇచ్చారు. ఈ వ్యాసంలో శర్మగారు ఎఱ్ఱన సోమన పద్యాలను తులనాత్మక పరిశీలన చేశాడు ఉదాహరణకు...

ఎఱ్ఱన హరివంశములోని పద్యాలివి;

ఉ. *ఎక్కడి బిడ్డ నీకు? నిటు లెంతము గట్టిడి వేయుగంబులం*
*బొక్కెడు రోటితో బలియు బుత్రుని ద్రాళులగట్టు నాడు వా*
*రక్కట గల్గ రట్లనగ, నారడివోయె గుమారుదేవునన్.*
*మిక్కుటమైన ద్రాకులవె మీదబడన్ వడి దా బెనంగెడున్'*

మ. *అనినం దల్లడమంది మేను విరియబడన్ వడి దా బేనంగెడున్'*
*మిని విస్రస్తములౌ పటాంచలము ధమ్మిల్లంబు దూలగ,లో*
*చన పద్మంబుల బాష్పధార లెసగన్ సంభ్రాంతి బాదద్వయం*
*బును దొట్రిల్లగ బారె గోపికలు నుద్భూతార్థలై తోజనన్'*

ఉత్తరహరి వంశములో నిరుద్ధుడు చిత్రరేఖచే అపహరింపబడగా అతన్ని ఆడవారు ఎలా అనుకొన్నారో కింద చూడండి.

*చెందమ్మి విరులలో జిందు తేనెల వోలె*
*గన్నుల బాష్పంబుకణము లదర*
*వలుద చీకట్లో వ్రాలు చుక్కలు వోలె*
*వేణీ భరమ్ముల విరులు వ్రేల*
*దూల తీగల వెంట దూగు తేటు వోలె*
*నసదు నెన్నడుముల నారులొలయ*
*రాపు జక్కవల జేరని చంద్రికలు వోలె*
*జన్నుల ముత్యాల సరులు పెనగ*
*ముద్దు మోము లల్లార్చుచో మూపులందు*
*గర్ణ భూషణ జాలంబు గళవళింప*
*మార్చి మార్చి చేతుల వ్రేళ్ళు మడిచికొనుచు*

[114] సారస్వతాలోకము. పుట–101.

*'నింక నెట్లమ్మ' యనుచు నయ్యింతులేడ్వ* (ఉ. హ. ఆ. 5. 276) [115]

వీరి రెండు పద్యాలను తులనాత్మకంగా పరిశీలించిన రాళ్ళపల్లివారు ఎర్రన పద్యంలో 'రసధార' ఎక్కువగా ఉన్నదని నాచన సోమన పద్యంలో చమత్కారం అధికంగా ఉందని తేల్చి చెప్పారు.

నడకుదుటి వీరరాజు సోమన ఎర్రన కంటే గొప్పవాడని చాలా గట్టిగా చెప్పినప్పటికీ శర్మగారు పరిశీలనాత్మకంగా ఇలా అన్నారు. *''అసలు ప్రాచీన మహాకవుల నొకరితో నొకరిని పోల్చుటయె అసంగతమని కొందరు పండితులు తలచెదరు కానీ నాకా మతమున గౌరము లేదు* ''[116] అంటే తనదైన ఆలోచనను చెప్పటం రాళ్ళపల్లి వారి ఉద్దేశమని ఇక్కడ గ్రహించవచ్చు.

రాళ్ళపల్లి వారు నాచన సోముని కవిత్వంలో నిరర్థకాలైన దీర్ఘ సమాసాలు, అసంబద్ధమైన వర్ణనలు ఎర్రన కవిత్వంలో కంటే ఎక్కువగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. వ్యాసం చివరలో ''*రసికుల కెర్రన యందలి అభిమానమెన్నడును కృశింపదు. చిత్ర కర్మచే నెవరి మనసులు రంజిల్లునో వారికెర్రన కన్న సోముడు మేలుగా తోచును*'' అన్న అభిప్రాయం వ్యక్తపరిచారు.

రాళ్ళపల్లివారు ఆంధ్రకవిత్వంలో ఎర్రన తర్వాతనే నాచన సోమన అని దృఢంగా తెలిపిన విషయం స్పష్టంగా అవగతం చేసుకోవచ్చు.

- **త్యాగయ్య గారి నాద సుధారసం**

శర్మగారు ఈ వ్యాసంలో త్యాగయ్యగారి రామభక్తి, కవిత, గానం అనే మూడు అంశాల్ని లోతుగా పరిశీలించారు.

సౌరాష్ట్ర వెంకట రమణ భాగవతులు రాసిన త్యాగయ్య జీవిత సంగ్రహమాధారంగా రాళ్ళపల్లివారు త్యాగయ్య వంశచరిత్రను తెలిపారు. త్యాగయ్య తండ్రి సాహిత్యంలో విద్వాంసులైతే, తాత, ముత్తాతలు సంగీతం, భక్తి విషయాల్లో పేరు పొందారు. ఈ ప్రభావంతోనే త్యాగయ్యకు విద్య అబ్బిందని వివరించారు.

రాళ్ళపల్లివారు త్రివేణి సంగమమైన త్యాగయ్య భక్తి, కవిత, గానాలనొక్కొక్కదాన్ని నిశితంగా పరిశోధించారు. త్యాగయ్యలో ఉండే రామభక్తి అనన్యసామాన్యమైనదని, ఇది మామూలు మనుషులకు సాధ్యం కాదని అన్నారు. ''*భాహ్యమైన మూర్త్యారాధనము కంటే త్యాగరాజుగారదికము నంతర్యామ్యర్చనే కావించిర'*ని[117] వేటూరి ప్రభాకరశాస్త్రి అభిప్రాయపడ్డారు. త్యాగయ్య చిన్నప్పటి నుండి పురుష దేవుళ్లైన విష్ణువు, శివుడు, స్కందుడు, విఘ్నేశ్వరుడునూ, స్త్రీ దేవతలైన పార్వతీదేవి, సీతాదేవి, లక్ష్మీదేవి లాంటి వారిని పూజించాడు. అక్కడక్కడ త్యాగయ్య రాసిన కీర్తనల్లో ఈ దేవుళ్ళ ప్రస్తావన కనిపిస్తుంటుందని వ్యాసకర్త

[115] సారస్వతాలోకము. పుట-102-103.

[116] సారస్వతాలోకము. పుట- 95.

[117] వ్యాస ప్రభాకరము. పుట. 260.

చెప్పారు. ముఖ్యంగా త్యాగయ్యగారికి రామభక్తి నిలువెల్లా కొలువుధీరి ఉందన్న విషయాన్ని వ్యాసంలో స్పష్టపరిచారు.

రాజులు, పాలేగాళ్ళు, దోపిడీ దారుల నుండి సామాన్య ప్రజలను రక్షించమని త్యాగయ్య అనేక సంధర్భాలల్లో దేవుణ్ణి కోరుకుంటూ, భక్తి భావనతో కీర్తనలు రాశారు. లోక కళ్యాణం కోసం త్యాగయ్య భక్తి మార్గాన్ని ఎంచుకుని అనేక మందిని చైతన్యపరిచారు. దీన్ని అన్ని వర్గాలు స్వీకరించి పాటించాయి. ప్రత్యేకంగా త్యాగయ్యలో స్మార్త సంప్రదాయం ఉంటుందని, దీన్ని అనుసరించడం అంత సులభం కాదని రాళ్ళపల్లి వారు గుర్తుచేశారు.

త్యాగయ్యగారి రెండవ పార్శ్వమైన కవిత్వం గురించి రాళ్ళపల్లివారి అలోచన విమర్శనాత్మకమైనదిగా కనిపిస్తుంది. త్యాగయ్య దేన్నైనా అవలీలగా అల్లేయగలడు. సాహిత్య లక్షణాలు లోతుగా తెలిసిన మహాపండితు. వీరి రచనల్లో కృత్రిమంగా మీద వేసుకున్న భావాలు లేనే లేవని తేల్చి చెప్పారు. కానీ తమిళ ప్రాంతంలో ఉండటం వల్ల వీరి కవితల్లో కొంచం భావదోషం కనిపిస్తుందంటూ *''ఐతే, త్యాగయ్యగారి జీవితంలో ఆ శక్తికి భాషలోగాని, భావాల్లోగాని తగినంత యేర్పులు, తీర్పులు చేసే అవకాశం వీరి సంస్కారంలో చాలక ఈయన కవిత పల్లెటూరి పడుచువలె అకృత్రిమంగా నిలిచింది.''*[118] అని వ్యాసకర్త తన అభిప్రాయాన్ని వ్యక్తీకరించారు. అంతేకాకుండా వీరిలో సంస్కృత భాష కూడా సన్నగిల్లిందనీ, దీనిక్కారణం త్యాగయ్య చదవటం కన్న వినింది గ్రహించి వర్ణించటానికి ప్రాధాన్యం ఇచ్చారే తప్ప చదివి రాసింది తక్కువని అన్నారు. *''త్యాగయ్యగారి కవిత ఈ ఆశుతరగతిది. ఆశ్చర్యము కలిగించే ముక్కలెన్ని ఉన్నా అఖండత చాలనిది''*[119] దీనికి ఎన్నో కారణాలను శర్మగారు సూచించారు.

త్యాగయ్య మూడో పార్శ్వమైన గానం గురించి శర్మగారు వ్యక్త పరిచిన అభిప్రాయాలు కూడా ఎంతో ముఖ్యమైనవి. దానిలో ఒకటి ఇలా*''అది మహా ప్రసాదం. దాని వైశాల్యం, గాంభీర్యం, విలాసం, వైదగ్ధ్యం – అనిర్వచనీయమైనవి''*[120] అంటూ త్యాగయ్యగారి గానాన్ని రాళ్ళపల్లివారు ప్రశంసించారు.

గురువు గారైన శొంఠి వెంకటరమణయ్య పరిచయంతో త్యాగయ్యకి అనేక కచ్చేరిలు చేసే అవకాశం దొరికింది. దీని వల్ల వీరి గానం అనేక ప్రాంతాలకి విస్తరించిందని రాళ్ళపల్లివారు చెప్పారు. త్యాగయ్య నాదజీవనానికి భాష శరీరంగానూ, ఎన్నో చోట్ల వట్టి వేషంగానూ పరిణమించి ఒదిగి నిలిందని' చెప్పటంలో త్యాగయ్య గొప్ప విద్వాంసులని రాళ్ళపల్లివారి భావన.

త్యాగయ్యగారి గాన మాధుర్యానికి అనేక మంది ఏకలవ్య శిష్యులు తయారయ్యారంటే అతిశయోక్తికాదన్నారు. త్యాగయ్య కలం నుండి జాలువారిన రసగుళికల్లాంటి కీర్తనలు ఎంతో ఆధ్యాత్మికతను పెంపొందించాయన్నారు. వీరి కీర్తనల్లో రాగతాళానికి అనుగుణంగా

---

[118] సారస్వతాలోకము. పుట: 112.

[119] సారస్వతాలోకము. పుట: 114.

[120] సారస్వతాలోకము. పుట: 115.

పాటలున్నాయి. అయితే, అక్కడక్కడ వాటి భావాల్లో భావుకత కొరవడిందని శర్మగారు అన్నారు. త్యాగయ్యగారి కీర్తనల్లో మన తెలుగు సంస్కృతి సంప్రదాయాలు మెండుగా పెంపొందించటం వీరి ప్రతిభా పాటవాలకే సాధ్యమని శర్మగారు ప్రశంసించారు. వ్యాసకర్త ముగింపులో త్యాగయ్య సృష్టించిన గాన మాధుర్యం వర్ణాలకు అతీతమైనదిగా సూచించారు. ఇలాంటి విషయాన్నే భూసురపల్లి వెంకటేశ్వర్లు మాటల్లో చూడండి. *''ప్రపంచవ్యాప్తంగా దక్షిణభారతీయులు ఏదేశంలో ఏ నగరంలో ఉన్నా అక్కడ త్యాగరాజు ఆరాధన జరుగుతున్నట్టే!''*[121] త్యాగయ్య నాధ సుధారసం ఎంతో మంది శిష్యులకు దారి చూపించిదనీ దాన్ని కాపాడాల్సిన బాధ్యత భావి తరాలకుందని అనంతకృష్ణుల వారి అభిమతం.

- **తిక్కన తీర్చిన సీతమ్మ**

ఈ వ్యాసంలో రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ *'నిర్వచనోత్తర రామాయణము'* లో సీతమ్మ పాత్రను తిక్కన ఎంత గొప్పగా తీర్చిదిద్దారనే విషయాల్ని కళ్ళకుకట్టినట్లు చిత్రించారు. వ్యాస ప్రారంభంలో రామాయణ, భారతాలు సమాజంపై ఎంతో ప్రభావాన్ని చూపాయన్నారు. మూల రామాయణంలోని ప్రధాన విషయాల్ని చెడపకుండా అక్కడక్కడ కొన్ని మార్పులు చేసి తిక్కన నిర్వచనోత్తర రామాయణం రాయడం విశేషమన్నారు.

తిక్కనకు భారతం మీదున్న ఏకాగ్రత రామాయణం మీద లేదని వ్యాసకర్త అభిప్రాయం. అయితే వాల్మీకి, భవభూతి, కాళిదాసు, పినవీరన, కంకంటి పాపరాజుల రామాయణాల్లో కంటే సీతమ్మ పాత్రను తిక్కన ఆదర్శనీయంగా తీర్చి దిద్దటం ప్రశంసనీమని శర్మగారన్నారు.

ప్రధానంగా వాల్మీకి రామాయణంలోని సీతా పరిత్యాగ ఘట్టానికి, తిక్కన నిర్వచనోత్తర రామాయణంలోని సీతాపరిత్యాగ ఘట్టానికి గల తేడాలను గుర్తించిన వ్యాసకర్త ఆ విశేషాల్ని సోదాహరణంగా పొందుపరిచారు.

వాల్మీకి రామాయణాన్ని ధర్మదృష్టికి దగ్గరగా చిత్రిస్తే, దీనికి తిక్కన రసపోషణ దృష్టిని కలిపి కావ్యవైశిష్ట్యాన్ని పెంపొందించారు. ప్రధానంగా తిక్కన సీతాపరిత్యాగ ఘట్టంలో చోటు చేసుకున్న కథలను హృదయనికి హత్తుకొనేటట్లు చెప్పటం వీరి రసాభ్యుచిత బంధానికి నిదర్శనమని రాళ్ళపల్లివారి భావన.

తిక్కన కథలో అక్కడక్కడ మార్పులు చేసి సీతమ్మను ఒక ఆదర్శ మూర్తిగా, ధర్మపత్నిగా, గొప్ప పతివ్రతగా చూపించటంలో తన చాతుర్యాన్ని చాటుకోవటం తెలుగు ప్రజలను ఆకట్టుకొందని శర్మగారు అన్నారు.

తిక్కనగారు మూల రామాయణంలో వాల్మీకి చెప్పిన కొన్ని విషయాల్ని దాటి వేయడమేకాకుండా ఎక్కడ ఏది చెప్పాలో అది చెప్తూ ముందుకెళ్ళారన్నారు. ఉదాహరణకు మూలంలో పది పద్యాల్లో ఉన్న సీతారాముల పరిణయ వృత్తాంతాన్ని తిక్కన అరవై పద్యాల్లో విస్తరించి మరింత రసపోషణ నైపుణ్యాన్ని ప్రదర్శించారని అనంతకృష్ణశర్మ చెప్పారు.

---

[121] ప్రముఖ వాగ్గేయకారులు. (భూసురపల్లి వెంకటేశ్వర్లు) పుట. 58.

రావణ కథను అర్ధభాగం వరకు చెప్పిన తిక్కన సీతా రాముల కథలను కూడా అదే ధోరణిలో కొనసాగించారు. అయితే,ఇక్కడ రావణుడు సీతను గౌరవించాడనీ, రాముడు సీతను ఇబ్బందులకు గురిచేశారని తిక్కన కొన్ని సందర్భాల్లో రాముని హృదయాన్ని కూడా హత్తుకొనేటట్లు చేశారు. ఉదహరణకు సీతమ్మను లక్ష్మణుడు అడవులకు తీసుకెళ్ళే సందర్భంలో రాముడు లక్ష్మణునితో తన బాధను సీతకు అర్థమయ్యటట్లు వివరించమని చెప్పటం గమనార్హమన్నారు.

ఇంకా సీతమ్మకు భూదేవికున్నంత సహనం ఉన్నట్లు తిక్కన చిత్రించారు. సీతపై ఎన్ని అపనిందలు వేసిన వాటిని భరించి అధికమించిందని చెప్పారు. అదే ఈ నాటి స్త్రీలలో ఎంతమంది విడాకులిచ్చి వేరే పెళ్ళిళ్ళు చేసుకోవటం లేదని చెప్తూ వ్యాసకర్త తిక్కన తన సీతమ్మను ఆదర్శ భార్యగా మన కళ్ళముందుంచటం తెలుగు సంస్కృతీ సంప్రదాయాలకు నిదర్శనమని భావించారు.

రామాయణపై అనేకమంది కవులు అనేక విధాలుగా వర్ణిస్తూ రచనలు చేయడం పరిపాటిగా శర్మగారన్నమాటలు "*దీనిని ముఖ్యంగా రాముని దృష్టితో అనుభవించినవాడు భవభూతి. అట్లే సీతాదేవి దృష్టితో చూచి వేదన పడిన వాడు తిక్కనామాత్యుడు; వాల్మీకి మహర్షిది ప్రధానంగా ధర్మదృష్టి యని చెప్పబనిలేదు*"[122] ఒకటే మాటలో అనంతార్థన్నిచ్చేలా చెప్పారు.

ఈ విధంగా రస దృష్టి, ధర్మ దృష్టి అన్యోన్యంగా ఉన్నంత కాలం సీతారాముల నాటకం జరుగుతూ ఉంటుంది కాని దీనికి అంతం లేదని రాళ్ళపల్లివారు తెలిపారు.

## 2.11.4. రాళ్ళపల్లి పీఠికలు

శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ 1917 నుండి 1978 మధ్యకాలంలో సుమారు 120 గ్రంథాలకు పీఠికలు రాశారు. ఘట్టమరాజు అశ్వత్థనారాయణ, ఆర్. వి. యస్. సుందరంగార్లు 76 పీఠికలను సేకరించి '*రాళ్ళపల్లి పీఠికలు*' పేరుతో ఒక సంకలనంగా తీసుకోరావటం ఒక గొప్ప విషయం. 1979లో అచ్చయిన ఈ గ్రంథం ప్రస్తుతం అందుబాటులో లేదు. సుమారు 382 పుటలున్న ఈ గ్రంథంలో శర్మగారి పీఠికల్ని ప్రక్రియల ఆధారంగా విభజించారు. అవి: 1. ప్రాచీన కవిత్వం 2. ఆధునిక కవిత్వం 3. నాటకాలు 4. నవలలు – కథలు 5. వ్యాసములు, విమర్శలు – పరిశోధనలు 5. ఇతరాలు వీటిలో ప్రాచీనానికి సంబంధించినవి 16 పీఠికలు, ఆధునికరచనలకు రాసినవి 33, నాటకాలకు వెలువరిచినవి 3, నవలలు, కథలకు రాసినవి 3, వ్యాసం, విమర్శ, పరిశోధనలకు సంబంధించినవి 14, ఇతర గ్రంథాలకు రాసినవి 7 కలవు. ఇవి మొత్తం 76 పీఠికలు.

ఇవే కాకుండా ఇంకా అలభ్యంగా ఉండేవి సుమారు యాభైవరకు ఉండవచ్చు. ఇవి దొరక పోవడం దురదృష్టకరం. ఈ పుస్తకానికి . జి. ఎన్. రెడ్డి ముందుమాట రాస్తూ, శర్మగారి

---

[122]సారస్వతాలోకము (పుట:129)

పీఠికా విధానాన్ని, అభినందన సమితి సభ్యుల కృషిని మెచ్చుకున్నారు. రెడ్డిగారు శర్మగారి గురించి అన్న ఈ మాటలు ఎంతో విలువైనవిగా తోస్తాయి. "*అవి విషయ ప్రధానములు, విమర్శతత్త్వ సమన్వితములు, సమీక్షా ప్రాయములు, వైయక్తిక వచన రచనా శిల్పవిలక్షణములు. ఎవరో రచయిత కోరికను మన్నించి మర్యాదకోసమో, మొహమాటానికో నాల్గు మాటల్లో తన అభిప్రాయాన్ని వ్రాసినా అందులోనూ ఒక మెలకువో, ఒక మురిపెమో, ఒక చిన్న మెరుపో ప్రతిబింబితమై వుంటుంది. పెద్దపీఠికల్లో విషయౌన్నత్యం, అభిప్రాయ గాంభీర్యం, పటుత్వం తప్పని సరసవాక్కు, శైలీ సంపన్నత ప్రధాన లక్షణాలు. నిజానికి రాళ్ళపల్లి వారి పీఠికలు ఒక నిర్మితి కల్గి సుందరంగా, శిల్పశోభితంగా రూపొందివుంటాయి*"[123] అని రాళ్ళపల్లివారి పీఠికా రచనా వైదగ్ధ్యాన్ని అంచనా వేశారు. అలాగే గ్రంథ సంపాదకులు శర్మగారి పీఠికల్ని సంవత్సరాల పరంగా పొందుపరిచి ఉంటే బాగుండేదన్న సూచన "*ఇట్టి కూర్పు ఒక విధంగా మంచిదే అయినా పీఠికా రచనల్లోను విమర్శనా విధానంలోను రాళ్ళపల్లివారిలో క్రమంగా రూపొందిన పరిణామ స్వరూపం ఇట్టి కూర్పు వల్ల సుగమం కాదు. చారిత్రక దృష్టిగల విమర్శకులు కాలక్రమాన్ని పాటించని ఈ కూర్పు పద్ధతిని గొప్పగా మెచ్చక పోవచ్చు*"[124] అని అభిప్రాయపడ్డారు.

జి. యన్. రెడ్డి అభిప్రాయం ఒక దృష్టితో సమంజసమే అయినా! అంత అవగాహనకు తావియకపోవచ్చు. ఎందుకంటే రచన ప్రాధాన్యాన్ని బట్టి పీఠికాకర్త ఆలోచన విధానం ఉంటుంది కాబట్టి. ఈ గ్రంథంలోని పీఠికల వరుస క్రమం ఆధారంగా సాహిత్య పరిణామాన్ని, పీఠికాకర్త ఆలోచన ధోరణిని రెండిటిని అవగాహన చేసుకునే అవకాశం కూడా ఉంది. ఏది ఏమైనప్పటకి రెడ్డిగారు చెప్పిన సంవత్సర పరిణామం, సంపాదకులు సూచించిన ప్రక్రియ విభజన రెండూ ఉపయుక్తమైనవే.

రాళ్ళపల్లివారి పీఠికల్లోని విశేషాంశాలను పరిశీలించే ముందు 'పీఠిక' అంటే ఏమి? దాని నిర్వచనం ఏమిటన్న విషయాల్ని పరిశీలిద్దాం.

తెలుగు పీఠికలపై 1990లో పరిశోధన చేసిన డి. చంద్రశేఖర్ రెడ్డి అభిప్రాయంలో పీఠిక నిర్వచనం ఇలా ఉంది "*ఒక గ్రంథానికి ముందు ఆధారాలు, చరిత్ర, పరిధి, ప్రణాళిక, పద్ధతి, ప్రయోజనం, లక్ష్యం మొదలైన వాటిని వివరిస్తూ, సహకరించిన వారికి కృతజ్ఞతలు చెప్తూ, ఆ గ్రంథాన్ని అర్థం చేసుకోవడానికి అవసరమయ్యే అధిక సమాచారాన్ని అందించే ప్రత్యేక వ్యక్తిత్వం కలిగిన రచన పీఠిక. ఇది వచన రూపంలోగాని పద్య రూపంలోగాని ఉండవచ్చు. గ్రంథ కర్తగాని, ఇతరులు గాని రాయవచ్చు*"[125]

పై నిర్వచనానికి తగినట్లుగానే శర్మగారి పీఠికలు మనకు గోచరిస్తాయి. అసలు పీఠికలు రాయటంలో ఒక్కొక్కరు ఒక్కో పద్ధతిని అనుసరిస్తుంటారు. శర్మగారికి కూడా ఒక ప్రత్యేకమైన

---

[123] రాళ్ళపల్లి పీఠికలు. పుట. iii.

[124] రాళ్ళపల్లి వీఠికలు. పుట. xiii.

[125] తెలుగు పీఠిక. పుట. 33.

పద్ధతి ఉంది. దాన్ని తెలుసుకోవాలంటే ఇందులోని పీఠికల్ని పరిశీలించాల్సిందే. తెలుగులో వేటూరి, విశ్వనాథ, శ్రీశ్రీ. కుందుర్తి పీఠికలు మొదలైనవారివి ప్రత్యేకమైనవిగా కనిపిస్తున్నాయి. వీటితో పాటు శర్మగారి పీఠికలు కూడా విశిష్టమైనవని విమర్శకులు భావించారు.

- **ప్రాచీన కవిత్వం**

ఈ సంకలనంలో శర్మగారు రాసిన ప్రాచీన కవిత్వ పీఠికలు ముందు వరుసలో ఉన్నాయి. అవి. *'వేమన పద్యములు'*, *'అధ్యాత్మ సంకీర్తనలు'* (సంపుటము 7,8,9,10,11), *'శృంగార సంకీర్తనలు'* (సంపుటములు 12,13,19,20,22), *'తాళ్ళపాక పాటలు'* (సంపుటము 1, 2), *'శ్రీమదాంధ్ర భాగవతము'*, *'పాండురంగ మాహాత్మ్యము'* అని మొత్తం 16 పీఠికలున్నాయి. వీటిని పరిశీలించి శర్మగారికి ప్రాచీన తెలుగు కవిత్వం పట్ల ఆలోచనా దృక్పథాన్ని అర్థం చేసుకోవాలి.

1917లో వావిళ్ల రామస్వామి అండ్ సన్స్ వారు ప్రచురించిన *'వేమన పద్యములు'* అను గ్రంథ పీఠికలో శతక కవుల లక్షణాలను తెలిపి, వేమన దేశకాలాదులను అంచనా వేశారు. వేమన లాంటి వారు సమాజంలో మరి కొందరున్నారు కాని వేమనంతటి గుర్తింపు వీరికి రాలేదని తేల్చి చెప్పారు. వేమన పద్యాల్లోని విషయాన్ని నిశితంగా పరిశీలించి, ఇవి నాలుగు వేదాల్లాంటివని అన్నారు. పీఠికా కర్త వేమన కులం పై ఉన్న అపోహలను తొలగించి ఈయన కాపు కులానికి చెందినవాడని ఉద్ఘాటించారు. వేమనకాలంపై కూడా ఒక స్పష్టమైన అభిప్రాయం లేనందువల్ల బహుశ వేమన 17వ శతాబ్దానికి చెంది వుంటాడని శర్మగారు అన్నారు. వేమన పద్యాల్లోని పదజాలాన్ని బట్టి ఈయన రాయలసీమ ప్రాంతానికి చెందిన వాడని కూడా నిర్ణయించారు. తర్వాత వేమన స్వభావాన్ని తెలుపుతూ ఈయన ఎవరినీ నొప్పించేవాడు కాదని, వినయ సంపన్నుడని గుర్తుచేశారు. వేమన సమాజంలో ఉండే దుర్గుణాలను ఎప్పటికప్పుడు ఎండగట్టిన గొప్ప సంఘసంస్కర్త అని శర్మగారన్నారు. అసలు తెలుగు సాహిత్యంలో వేమనకు వచ్చినంత పేరు ప్రఖ్యాతులు ఏ కవులకూ రాలేదని రాళ్ళపల్లివారు అన్నారు.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ 1949 నుండి 1957 వరకు అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలను పరిష్కరించే బాధ్యతను చేపట్టారు. అందులో భాగంగా అన్నమయ్య కీర్తనలకు చెందిన కొన్ని సంపుటాలను పరిష్కరించి వాటికి పీఠికలు రచించారు. ఈ పని చేయడానికి శర్మగారికి గౌరిపెద్ద సుబ్బరామశర్మగారు సహాయకులుగా ఉన్నారని పీఠికలో గుర్తుచేశారు. సుమారు 12 సంపుటాలకు వీరు పీఠికలు రాసినట్లు ఈ సంకలనం వల్ల తెలుస్తుంది. కొన్ని సందర్భాల్లో తాళ్ళపాక వారి పాటలకు కూడా ముందుమాటలు రాశారు. ప్రధానంగా అన్నమయ్య అధ్యాత్మ, శృంగార సంకీర్తలు లభ్యమైన సమాచారాన్ని ప్రతి పీఠికలో తెలపటం జరిగింది. తాటాకు ప్రతులు, రాగీ రేకుల స్థితిగతులను చెప్పి, అందులో ఉన్న పదాల చర్చను సరిచేసి, వీలైతే పాఠాంతరాలను ఇచ్చి, కొత్తవాటిని సృష్టించి చేర్చిన సందర్భాలను

గుర్తుచేశారు. సంగీత పండితులైన రాళ్ళపల్లివారు ఎన్నో విలువైన అభిప్రాయాలను ఈ పీఠికల్లో వెల్లడించారు. అన్నమయ్య అధ్యాత్మ, శృంగార సంకీర్తనలు బయటికి తీయడానికి రాళ్ళపల్లివారు ఎంతో శ్రమపడ్డారని పీఠికలవల్ల తెలుస్తుంది. ఈ మధురమైన, ప్రశాంతమైన ఆధ్యాత్మ వాతావరణం సృష్టించడంలో శర్మగారు సిద్ధహస్తులైయ్యారని ఈ పీఠికలు చదవితే స్పష్టంగా బోధపడుతుంది.

1954లో రాసిన *'శ్రీమదాంధ్ర భాగవతము'* పీఠికలో పోతన భాగవత విశిష్టతను గుర్తుచేస్తూ, వావిళ్ళ వారి ముద్రణ వివరాలను ఉదాహరణలుగా పేర్కొన్నారు. ఈ గ్రంథ ప్రచురణకర్త జక్కా సుబ్బరాయల వారి ఆశయాలను తెలిపారు. పీఠిక రాయడానికి తమకు తోడ్పడిన ఆకరాలను చాలా స్పష్టంగా వివరించారు. పోతన భాగవతం మీద ఇప్పటి వరకు ఎన్నో రాతప్రతులు వెలువడ్డాయని అందులో కొన్నిటిని ప్రస్తావిస్తూ, జరిగిన పొరపాట్లను ఎత్తి చూపారు రాళ్ళపల్లివారు. మూలంలో ఉన్న భాగవతాన్ని అనువాదకులు తమ తమ ప్రతిభా పాండిత్యాలతో తీర్చిదిద్దిన క్రమాన్ని కూడా పీఠికలో చూపించారు. అంతేకాదు ఇందులోనే జీవితానికి చెందిన కొన్ని ప్రాథమిక అంశాలను స్థూలంగా తెలిపారు.

1967లో రాసిన *'పాండురంగ మాహాత్మ్యము'* పీఠిక ఎంతో సుదీర్ఘమైనది. సుమారు 36 పుటల్లో రచించబడింది. దీంట్లో విలువైన విషయాలను శర్మగారు పేర్కొన్నారు. మొత్తం 12 రాత ప్రతులను పరిగణలోకి తీసుకొని బయట పెట్టిన అంశాలు గమనించదగినవి. సూచించిన ముఖ్యమైన రాతప్రతుల వివరాలు.

- 1887లో కొండూరి అనంత చార్యులు పరిష్కరణ. దీనికి టీకా రాసిన తెన్మఠం వేంకట నరసింహ చార్యులు రాశారు. ఇది చదవడానికి చాలా ఇబ్బందిగా ఉందన్నారు.
- 1918లో తణుకులో *'పాండురంగ మాహాత్మ్యము'* పై ఒక రాతప్రతి ముద్రితమైంది.
- 1952లో మద్రాసు వావిళ్ళవారు ఆధ్వర్యంలో బులుసు వెంకట రమణయ్య టీకాతో ప్రచురితమైంది. ఇది పర్వాలేదనిపించే రాతిప్రతి అని చెప్పారు.

చిన్నయసూరి ప్రకటన ఒకటి వెలువడిందట దాన్ని శర్మగారు చూడలేదని అన్నారు. ఇలా పైన పేర్కొన్న రాతప్రతులలో ఉన్న విషయాలన్ని అతృప్తికరంగా ఉండడం గమనించారు. ఈ క్రమంలో కొన్ని ఆకరాలను సేకరించి వాటి స్థితిగతులను సూక్ష్మంగా పరిశీలించారు. వీటిలో వేదం వారి కూర్పు సంతృప్తికరంగా ఉందని చెప్పారు. వీటిలో కొన్నిటిని మూలంలో చూపించి మరికొన్ని ఆకరాలను అడుగున ఉదహరించారు. రాతతప్పులను స్పష్టపరిచి, తెలిసిన వాటిని ఉటంకించారు. తెలియని వాటిని ప్రశ్నగుర్తులతో సూచించారు. ఈ పద్ధతి భవిష్యత్తు పరిష్కర్తలకు ఎంతో ఉపయోకరమని చెప్పారు. పీఠికలో ప్రధానంగా ఎనిమిది పాఠాంతరాలను పేర్కొన్నారు. అవి; *"3-24 వచనంలో "వనకేళి పలాశ దోహదంబు నగుటకు" అని ముద్రిత పాఠము. దీన్ని బులుసువారు అర్థము లేనిదని అన్నారు. కాని దీని శర్మగారు ఇలా వివరించారు.*

*'కేశ' శబ్దానికి సంగతి లేదు. 'పలాశ' అనగా మొరళిగాదు. సరైన పాఠము 'అవకేళి పలాశి దోహదంబు'. 'అవకేళి' – ఫలము లేని గొడ్డు. 'ఫలాశి' చెట్టు వంధ్యో ఫలో కేశచ'. పలాశి ద్రుమాగమః అని అమరుని యను శాసనము పండని చెట్టుకు ఎరువు పెట్టుట వంటిదని భావము. ఇట్లుయినది నిగమశర్మ భార్య యౌవనము.''*[126] అని ఉంది. మిగతా వాటిలో కూడా పద ప్రయోగాలు వాటి వివరణలు ఉన్నాయి.

తెనాలి రామకృష్ణుని దేశకాలాదులను ఆసాంతం పీఠికలో చర్చించారు. ముందుగా రామకృష్ణుని కుటుంబ పుట్టు పూర్వోత్తరాలను, వారి సాహిత్య ప్రస్తానాన్ని గుర్తుచేశారు. అలాగే అప్పట్లో ఉన్న శైవ, వైష్ణవ మత ప్రభావాలను చర్చించి, వీటి ప్రభావం రామకృష్ణునిపై కూడా పడిందని ఉద్ఘాటించారు. రామకృష్ణుని రచనలు: *'ఉద్భటారాధ్య చరిత్రము'*– శైవ సంప్రదాయం. *'పాండురంగ మాహాత్మ్యము, 'ఘటికాచల మాహాత్మ్యము'* అను రెండు రచనలపై వైష్ణవ సంప్రదాయం ఉందన్నారు. వాటి చారిత్రక నేపథ్యాలను క్షుణ్ణంగా పీఠికలో చర్చించారు. తర్వాత *'ఉద్భటారాధ్య చరిత్రము'* రచనాకాలాన్ని కొందరు 1525– 1535 మధ్యకాలం నాటిదన్నారు. కాని ఇది సరైనది కాదని 1515–1533 మధ్యకాలమని నిర్ణయించారు. *'ఘటికాచల మాహాత్మ్యము'* రామకృష్ణుని చివరి రచనగా ఉందని చెప్పి, బహుశ ఇది ఈయన రచన కాకపోవచ్చని అనుమానం వ్యక్తంచేశారు. *'పాండురంగ మాహాత్మ్యము'* రామకృష్ణుని రచనల్లో ఉన్నతమైన స్థానాన్ని పొందిందని ఈ విధంగా ప్రశంసించారు. *''తక్కిన రెండు కావ్యములలో కావవచ్చు ధార, పలుకుబడి, చౌరవ పాండిత్యము మొదలగు గుణాలన్నియు ఇందులోను సహృదయులు చూడగలరు.''*[127] తెనాలి రామకృష్ణుని పై మూడు రచనలేకాదు *'హరిలీలావిలాసము', 'కందర్పకేతువిలాసము'* అను రచనలు కూడా ఉన్నాయని ఇవి అలభ్యాలని చెప్పారు. ఈ విధంగా వీరి రచనలన్నిటిని పరిశీలించిన తర్వాత ఈయన్ను శ్రీనాథునితో పోల్చారు. కాని వీరిరువుకి తెలుగు సాహిత్యంలో రావాల్సినంత పేరు ప్రఖ్యాతలు రాలేదని చెప్పారు.

అయితే రామకృష్ణుని లోపాన్ని ఎత్తి చూపిన విధానం గమనార్హం. *''వేరు వేరుగా అందచందములు లోతుపాతులను గల పద్యములెన్నో రచించిను మొత్తము గ్రంథమునకు గాంభీర్య గౌరవములను సంపాదించు వివేచనమును విశ్రాంతియు వలసినంత వీరలవర్చుకోలేదు. వీరికి లేనిది నేర్పు కాదు ఓర్పు.''*[128] అని విమర్శించారు. ప్రత్యేకంగా *'పాండురంగ మాహాత్మ్యము'* లోని రచన వైశిష్ట్యాన్ని, వస్తువైవిధ్యాన్ని అభివర్ణిస్తూ, ఇది 16 శతాబ్దంలో వెలువడిందని ఆకాలంలో రాజుల ప్రభావం, మితిమీరిన వర్ణనల గారడి దీని పై కూడా పడింది. కాని విజయనగర పాండురంగుడు ప్రత్యేకత ఇందులో సంతరించుకోవడం చెప్పుకోదగిందన్నారు. ఈ ప్రబంధంలోని కథలు నిగమశర్మ, సుశీల, ఆయుతుని కథలు

---

[126] రాళ్ళపల్లి పీఠికలు. పుట. 86.

[127] రాళ్ళపల్లి పీఠికలు. పుట. 100.

[128] రాళ్ళపల్లి పీఠికలు. పుట. 102.

రసికులను ఎంతగానో ఆకర్షించాయి. ఇక దీంట్లోని పాత్ర చిత్రణ అద్భుతంగా ఉందని.''*ఇందు కవి చూచినయే బోమ్మగాని మన హృదయాకాశమున తళుక్కని మెరయక మరుగు పడదు''*[129] మరి ముఖ్యంగా నిగమశర్మోపాఖ్యాన ఘట్టం పొందిన ప్రశంస అంతా ఇంతకాదని పీఠికలో శర్మగారు వివరించారు.

- **ఆధునిక కవిత్వం**

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ *'క్రొక్కారు మెఱుగు'* ఖండకావ్యాల సంపుటికి 1930లో రాసిన పీఠికలో ఖండ కావ్యానికి, మహాకావ్యానికి ఉండే భేదాలను సుస్పష్టం చేశారు. మహాకావ్యాల్లాగా, ఖండకావ్యాల్లోను వస్తువు బలంగా ఉంటుందన్నారు. కాలమేదైన వస్తు ప్రాధాన్యం ముఖ్యమన్నారు. ఖండకావ్య లక్షణాలను క్షుణ్ణంగా తెలిపి, ఇది ఎక్కువ కాలం నిలబడని ప్రక్రియన్నారు. కాలమేదైన వచ్చే రచనల్లో వస్తువు ముఖ్యమంటూ ''*గొప్ప వస్తువు నందలి గాంభీర్యము చిన్న వస్తువు కుండదు. చిన్నదానికి గల చెలువము గొప్పదానికి రాదు.''*[130] వెల్లాల ఉమామహేశ్వరరావు, పాళ్ళూరు సుబ్బణాచార్యులు, మఠం వాసుదేవమూర్తి గార్లలోని ప్రతిభా పాటవాల్ని అంచనా వేసిన విధానం గమనించదగింది. ఉమామహేశర్వరరావు రాసిన *'ఆంధ్రవీరుడా'* కావ్యంలో ఆంధ్రులను ఉద్యమానికి ఉసిగొల్పినారు. దీని ప్రభావం పక్క ప్రాంతాలపై కూడా పడి మేలుకొల్పిందని వివరించారు.

*'రక్షకుదు ప్రాపు'* లో హిందువుల అన్యాయాలను భరించలేని దళితులు క్రైస్తవంలోకి మారటం ప్రధానంగా కనిపిస్తుందన్నారు. 'మారుక్కు' 'బిడ్డనేల కొట్టితివి' లాంటి ఖండకావ్యాలను పరిశీలించి, వీటిల్లో వస్తువు డొంక లేకుండా ధారాళంగా ఉందని చెప్పారు. ఇలా వీరి రచనలు ఆసాంతం పరిశీలించిన రాళ్ళపల్లివారు వీరి ముగ్గురిలో భావనా బలం ఎక్కువగా ఉంది. కాని అక్కడక్కడ ఉద్రేకం ఉట్టిపడుతుందని వివరించారు. మఠం వాసుదేవ మూర్తిగారు రాసిన *'తల్లిబిడ్డ' 'అర్చన' 'స్వయంకృతాపరాధము'* అను రచనలను పరిశీలించి వీరిలో కూడా భావనా బలం తగిన విధంగా ఉందన్నారు. వీరు రాసిన ప్రతి చిన్న మాటలో ఏదో గొప్ప అర్థం దాగివున్నట్లు కనిపిస్తుందని, తాత్త్విక దృష్టి వీరిలో ఎక్కువగా ఉందని గుర్తు చేశారు. పాళ్ళూరు సుబ్బణాచార్యుల రచనా విధానం ఉమామహేశ్వరరావు, వాసుదేవమూర్తి మధ్య నడకలాగా ఉంటుందన్నారు. పాళ్ళూరివారి రచనల్లో నిర్వేదం ప్రధానంగా ఉందంటూ...కవిత్వ దృష్టిని ఇలా వివరించారు.''*స్పష్టత యనునది కవిత్వమునకు జీవధర్మమనుట ఆధునిక భావకవులనేకులు మరిచిన విషయము.''*[131] సాహిత్యంలో ఎవరు గొప్ప కవులో వారిని అనుకరించడం వదిలి స్వయంగా ఆలోచించినప్పుడు రచనలు బాగుంటాయన్నారు.

---

[129] రాళ్ళపల్లి పీఠికలు. పుట. 105.

[130] రాళ్ళపల్లి పీఠికలు. పుట. 124.

[131] రాళ్ళపల్లి పీఠికలు. పుట. 129.

1943లో *'శివభారత'* మను కావ్యానికి రాసిన ఉపోద్ఘాతంలో శర్మగారు ముందు *'క్రొక్కారు మెఱుగు'* సంపుటికి రాసిని పీఠికలో మహాకావ్యాలు రాసేకాలం పోయిందన్నారు. కాని ఈ మాట తొందర పడి అన్నానని తన తప్పుని సరిచేసుకొంటున్నట్లు ప్రకటించారు. *''ఆధునికాంధ్ర సాహిత్యమందు నాకుఁగల యల్పానుభవములో మహాకావ్యమను పేరు కింత తగిన గ్రంథమును నేఁజూడలేదు. దీని రాశీయు పెద్దది. గుణము అంతకన్న పెద్దది''*[132] దని *'శివభారతం'* గురించి అభిప్రాయపడ్డారు. దీన్ని గమనించిన తర్వాత మన చరిత్ర వట్టి కొండ గుర్తుల గుంపని విమర్శించారు. అసలు శివభారతంలో చరిత్రలో కంటే మంచి విషయముందని ప్రశంసించారు. కవికి ఉద్రేకం కన్న ఓర్పు చాలా ముఖ్యమని ఉద్ఘాటించారు. ఇలాంటి ఓర్పు నేర్పు తిక్కనలో ఎక్కువగా ఉన్నాయన్నారు. కాగా గడియారం శేషశాస్త్రిలో కూడా కొంతవరకు ఈ ధోరణి కనిపిస్తుందని తెలిపారు. భారత కథలాగా శివాజి కథ కూడా ప్రతి హిందువుని కదిలిస్తాయని నొక్కి చెప్పారు. ఇందులోని కావ్య సౌందర్యాన్ని శర్మగారు మెచ్చుకుని, చదివిన వారికి వివేకం తప్పక కలుగుతుందని అన్నారు.

సి. నారాయణరెడ్డి ఔచిత్యం ఉన్న గొప్ప కవి అని *'నాగార్జునసాగరం'* మంగళాశాసనంలో శర్మగారు పేర్కొన్నారు. ముఖ్యంగా కావ్య రచనలో పాటించిన పద్ధతులను, కథా వస్తువును కళ్ళకుకట్టినట్లు ఈ పీఠికలో వివరించారు. ఈ గ్రంథాన్ని నారాయణరెడ్డి గేయకావ్యమన్నారు. కాబట్టి లోతుగా పరిశీలించి దాని లక్షణాలు గుర్తుచేశారు. కావ్యంలో కాలాన్ని, నాదాన్ని ప్రాచీనులు పాఠకులకే వదిలారు. కానీ ఆధునికులు కాలాన్ని ఉంచుకొని, నాదాన్ని మాత్రం పాఠకులకు వదిలారు. ఈ పద్ధతి అంత మంచిది కాదని శర్మగారి అభిప్రాయపడ్డారు. కొందరు కవులు గేయానికి ఛందస్సు, యతి ప్రాసలు, అలంకారాలను జోడించి లాక్షణికుల మెప్పు గడించటం చేస్తున్నారు. అది అంత సమంజసం కాదన్నారు. గేయానికి నాద, తాళాలు కలిపితే పాట తయారైతుందని దీనికే అలంకారాలు కలిపితే భాష అలవడుతుందని చెప్పారు. కాని ఇది తాత్కాలిక ఆనందాన్ని మాత్రమే ఇవ్వగలదని చెప్పారు. అయితే సి. నారాయణరెడ్డి రాగ, తాళాలకు లయను కలిపి కవితను రచనగా మార్చుకొని తీర్చిదిద్దారని ప్రశంసించారు. నారాయణరెడ్డి లయ తెలియడానికి రెండు ఖండికలను పీఠికలో పొందుపరిచారు. అందులో ఒకటి చూడండి.

***"ఇక్ష్వాకు వంశక్షి***
***తీంద్ర చంద్రుల కీర్తి***
***కౌముదుల నల్గడల***
***కలయ విరసిననాడు"*** (పుట: 160)

పై గేయ లక్షణాలను క్షుణ్ణంగా తెలిపి, తెలుగులో మాత్ర ఛందస్సు వివరాలను సుస్పష్టం చేశారు. ప్రధానంగా సినారెగారు ఈ కావ్యాన్ని ఖండగతిలో నడిపించి జీవం పోశారని

[132] రాళ్ళపల్లి పీఠికలు. పుట. 138.

ఉగ్గడించారు. ''*భావములన్నియు చతుష్పదములుగానో ద్విపదములుగానో ముగిసి నడుచుట ఈ గేయకావ్యమున కందమిచ్చిన ముఖ్యమూర్తి.''*[133] అని ఒక్కమాటలో కావ్య నిర్మాణాన్ని వివరించారు. ఇందులో ప్రధానంగా బౌద్ధమత ప్రభావం ఉందన్నారు. కథానాయకుడు పద్మదేవుడు, కథానాయిక శాంతశ్రీ. ఈమె జీవితం ఇద్దరి గురుదేవుల (గురుదేవుడు, పద్మదేవుడు) మధ్య పరవశంగా నలిగినదని నొక్కి చెప్పారు. నారాయణరెడ్డి కావ్యంలో విభిన్న సందర్భాలను, భావ భేదంతో, సంయమనంతో మధురమైన భాషలో రమణీయంగా చిత్రించారని శర్మగారు ప్రస్తుతించారు.

రాయలసీమ కన్నీటి గాథను విద్వాన్ విశ్వం 'పెన్నేటి పాట' కు రాసిన పీఠికలో రాళ్ళపల్లివారు హృదయ విదారకంగా తెలిపారు. ఒప్పుడు రాయలసీమ సకల సంపదలకు నిలమై వెలిగిందని, ప్రస్తుతం ఈ ప్రాంత దుస్థితి ఎంతో దుర్భలంగా ఉందంటూ ''*అందందు సహజముగా ఎగజిమ్మి చుండిన 'తలపరిగలు– నీటిబుగ్గలు, వట్టివాయి విడుచుకొని క్రమముగ మన్ను మూసికొన్నవి. అడవులన్నియు వంటచెఱకులై పొగబాఱిపోయినవి. ఇక మనుషుల మాట చెప్పనేల? ఆంగ్లేయుల దొరతనములో ఈసీమ యెన్ని విధముల ఎండవచ్చునో అన్ని విధములను ఎండినది: ఎండింపబడుతున్నది. ప్రజల పరవశత, అధికారుల అలక్ష్యము, ఇరుగు పొరుగు వారి స్వార్థపరత, వీనికితోడు దైవము దయ దప్పుట, ఇన్ని కలిసి నేటి రాయలసీమ రూపుగొన్నది.''*[134] కావ్య వస్తువుని దృష్టిలో పెట్టుకొని వాల్మీకి రామాయణం ఎంతో ప్రశాంతంగా మధురంగా ఉంది. కాని విశ్వంగారు రాసిన 'పెన్నేటిపాట' మాత్రం హృదయ నిర్వేదనతో నిండిఉందని శర్మగారు అన్నారు.

ఈ వేదనకు భాష, భావం, అర్థం, ఛందస్సు వాటంతటవే ఇమిడి పోవటం విశేషమన్నారు. కావ్య కథలో రంగడు, గంగమ్మ అనే ఇద్దరు భార్యా, భర్తలు. వీరు రోజు కష్టపడి కూలి పని చేసుకొని జీవనం సాగిస్తుంటారు. కొన్ని రోజుల తర్వాత గంగమ్మ గర్భం దాల్చి, ప్రసవానికి అష్టకష్టాలు పడుతుంది. ఆ సమయంలో సరైన సదుపాయాలు లేక రంగడు ఏమీ చేయలేక నిస్సహాయుడైపోతాడు. దీనంతటకి కారణం ఈ ప్రాంతంలో ఉండే కరువు కాటకాలేనని శర్మగారు ఈ పీఠికలో గుర్తుచేశారు. బాధపడుతు కుర్చొంటే సమస్యలు కరగవని వాటికి ఎదురీదాలని ప్రోత్సహిస్తూ, రానున్న రోజుల్లో జీవితం ఆశావాహకంగా ఉంటుందని పునరుద్ఘాటించారు.

*'ద్రోణప్రశస్తి'* పీఠికలో దీపాల పిచ్చయ్యశాస్త్రి భారతంలోని ద్రోణాచార్యుడి విచిత్ర వ్యక్తిత్వాన్ని ఎంతో హృదయగతంగా ఉందని శర్మగారన్నారు. సత్వరజో గుణాల్లో ద్రోణుడు ఏది ఎప్పుడు ప్రదర్శిస్తాడో తెలియదన్నారు. ''*ద్రోణాచార్యుడు గొప్పవాడే, అసాధారణ వ్యక్తియే. మేధావియే కాని ఆదర్శమూర్తి కాదు, కనుకనే మన ప్రాచీనులెవరును అతనిని ఆరాధ్యమూర్తిగా*

[133] రాళ్ళపల్లి పీఠికలు. పుట. 162.
[134] రాళ్ళపల్లి పీఠికలు. పుట. 166.

*పరిగ్రహింపలేదు. భీష్మునికి మనలోగల గౌరవము ఆధ్యాత్మకోన్నతి ద్రోణునికి లేదు. గొప్ప వారందరు మంచివారుకారు. అను తత్త్వమును మహాభారతము ద్రోణపాత్ర మూలమున మనకు తెలిసినది.''*[135] ద్రోణుని మనస్తత్వాన్ని మన ముందుంచారు. భారతంలో ద్రోణుని గురించి నన్నయ ఇచ్చిన పాఠాంతరాన్ని పీఠికలో ప్రస్తావించారు.

- **నాటకాలు**

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మకి నాటకప్రక్రియపై గొప్ప అభిప్రాయాలున్నాయని ఇంతకు ముందు *'నాటకోపన్యాసములు'* అనే గ్రంథం ద్వారా తెలుసుకొన్నాం. ఆ పరిజ్ఞానాన్ని దృష్టిలో ఉంచుకొని కొందరు నాటక రచయితలు శర్మగారితో పీఠికలు రాయించడం పరిపాటి. ఏదైతేనేం వారు పీఠికలు రాయటంలో సుప్రసిద్ధులు కాబట్టి నాటకాలకు కూడా అభిప్రాయాలు రాయడం జరిగింది. వీరు పీఠికలు వెలువరించిన నాటకాలు వరుసగా *'ముద్రా రాక్షసము', 'ధ్రువవిజయము', 'శ్రీశైల మల్లికార్జున మహాత్మ్యము'* అనేవి. పేర్కొనదగినవి.

అవధానం చంద్రశేఖరశర్మ *'ముద్రా రాక్షసము'* ఉపోద్ఘాతంలో రాళ్ళపల్లివారు సంస్కృత వాఙ్మయంలో విశాఖదత్తుడు *'ముద్రా రాక్షసము', 'దేవీచంద్రగుప్తము'* అను నాటకాలు చెప్పుకోదగినవి. ఇలాంటి నాటకాలను తెలుగులోకి అనువదించిన వారు చాలా తక్కువ. అట్టి వారిలో చంద్రశేఖరశర్మ ఒకరని శర్మగారు చెప్పారు. వీరి కావ్యగుణాలు భావాన్ని మీరని భాష, భాషను తీర్చిదిద్దిన బంధమని వివరించారు. అక్కడక్కడ భావం సాగదీయబడినా అర్థానికి ఎక్కడ భంగం కలగనీయలేదని ఖండితంగా చెప్పారు. ఉదాహరణకు కొన్ని పాదాలను కూడా పీఠికలో చూపించి, కొన్ని చోట్ల మరింత మెరుగ్గా అనువదించాల్సిందని సూచన చేశారు.

తెలుగువారికి ఇష్టమైన వ్యావహారిక భాషలో ప్రాచీన సంస్కృత నాటకాలను అనుసరించి వచ్చిన నాటకం *'ధ్రువవిజయము'* అని అనంతకృష్ణశర్మ చెప్పారు. ఇందులోని పద్యగద్యాలు ఆపాతమధురమైనవని అన్నారు. ఇలాంటి నాటకాన్ని వంగీపురము కృష్ణమాచార్యులు మంచి భావన పరిణితితో అస్వాదనీయంగా తీసుకోరావటం శుభసూచకంగా శర్మగారు భావించారు.

పైడి లక్ష్మయ్య రాసిన *'శ్రీశైల మల్లికార్జున మాహాత్మ్యము'* నకు స్థాపన పేరుతో రాసిన ముందుమాటలో లక్ష్మయ్య సాహిత్య పిపాసను, వారి రచన దృష్టిని, ఈ నాటక ప్రాముఖ్యాన్ని శర్మగారు కళ్ళకుకట్టించారు. ఈ నాటకం వీరికి మంచి గుర్తింపు తెచ్చిపెట్టిందని చెప్పారు. కాగా అక్కడక్కడ గాంభీర్యం కనిపిస్తుందని ఇది నాటకానికి అంత ప్రయోజనం కాదని తెలిపారు. కొంత అశ్రద్ధ కూడా కనిపిస్తుందని తన అభిప్రాయాన్ని వెల్లడించారు. నాటకంలో రాయలసీమ, తెలంగాణ పలుకుబళ్ళను సందర్భానుసారంగా ప్రయోగించడం బాగుందన్నారు. ''*ఇక మీద రాగలిగిన-రావలసిన అనేక రచనలలో* లక్ష్మయ్యగారు ఇంకను

---

[135] రాళ్ళపల్లి పీఠికలు. పుట. 253.

*ధైర్యముతో ఆభాషా జీర్ణోద్ధారకార్యము కూడా, దేవాలయ జీర్ణోద్ధరణకార్యము వలెనే సాగించురు గాక''*[136] అని ప్రోత్సాహకర వాక్యాలతో ముగించారు.

శర్మగారి పీఠికల్లో ముక్కాలు మువ్వీసం పురుషుల గ్రంథాలకు రాసిన పీఠికలే అధికంగా ఉన్నాయి. కాని ఒక్కటి మాత్రం స్త్రీ రచనకు రాసిన పీఠిక చోటుచేసుకుంది. బహుశా వీరికి అవకాశం రాలేకపోవడం ప్రధాన కారణంగా ఉండవచ్చు. ఏదైతేనేం ఆచంట శారదాదేవిగారు రాసిన 'పగడాలు' కథా సంపుటి గొప్ప పీఠికనే వెలయించారు. ఇందులో ప్రధానంగా దైనం, ధైర్యం వేషం తెలుస్తాయి. జీవిత నేపథ్యంలో ముందు చూపే అవ్యవస్థే ఈ పగడాలని ఒక్కమాటలో చెప్పారు. ఇది పట్టుకోవడానికి చిన్నదైనా ఎత్తిన పుస్తకం కిందకు దించకుండా చదివించగల శక్తి దీనికి ఉందని పునరుద్ఘాటించారు.

- **వ్యాసములు – విమర్శలు – పరిశోధనలు**

విమర్శలో, పరిశోధనలో సుప్రసిద్ధులైన శర్మగారు ఆ విభాగంలో రాసిన పీఠికలు విమర్శ రంగానికే మంచి ఆలోచనను కలిగించేవిగా కనిపిస్తున్నాయని చెప్పవచ్చు.

1932లో రాసిన 'వదరుబోతు' ప్రస్తావనలో 'అనంతపురంలో ఒకరిద్దరి హృదయాల్లో కలిగిన ఆలోచనలే ఈ వదరుబోతు వ్యాసాలని' శర్మగారన్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో వచ్చిన ఈ వ్యాసాల్లో ఆ స్వాతంత్ర్య దృక్పథం కనిపించదు. సమకాలీన సమాజంలో పేరుకుపోయిన అన్యాయాలు, అక్రమాలను ఖండించడమే వీటి ఉద్దేశ్యంగా రచయితలు భావించారన్నారు. ఆంగ్లంలో అడిసన్ దొర రాసిన స్పెక్టేటర్ వ్యాసాలు అప్పట్లో ఒక దుమారం రేపిన వ్యాసాలని గుర్తుచేస్తూ, వీటిని 1913 పానుగంటి వారు 'సాక్షి' వ్యాసాలు పేరుతో తెలుగులోకి తీసుకొచ్చారు. అయితే ఇవి కొంతమందిని మాత్రమే ఆకర్షించాయి. కానీ స్టీలు రాసిన టాట్లర్ వ్యాసాలు తెలుగులో 'వదరుబోతు' వ్యాసాలుగా ఆంధ్ర పత్రికలో ప్రచురింపబడి ఎక్కువమందిని ఆలోచింపజేశాయన్నారు.

వ్యాసకర్తలు పేర్లు బయటికి చెప్పుకోవడానికి ఇష్టపడలేదు. ఇప్పటికీ ఈ వ్యాసాల రచయితలు పేర్లు తెలీదని రాళ్ళపల్లి వారన్నారు. ముఖ్యంగా ఈ వ్యాసకర్తలు సమాజంలో అధికారులు, వయోవృద్ధులు పాటించే కొన్ని పద్ధతులు సమాజానికి దుర్వినియోగమని భావించటం జరిగిందన్నారు. అంతేకాకుండా ఈ రచయితలు సామాన్యులేకాని విశిష్టులు కారని, కేవలం సంఘంలోని లోపాలను బయటపెట్టే ఉద్దేశ్యంతోనే పని చేశారని వారి కర్తవ్యాన్ని పీఠికలో స్పష్టంగా వివరించారు. రాద్ధాంతాలు చేసేవి 'సాక్షి'వ్యాసాలైతే, మధురంగా ఉండి, ధ్వని ప్రాధాన్యాన్ని కలిగించేవి 'వదరుబోతు'వ్యాసాలను వీటి మధ్యగల తేడాలను చాలా వివరంగా తెలిపారు. ఈ వదరబోతు జన్మించింది, సన్యసించింది అనంతపురం నందేనని శర్మగారు చెప్పారు.

---

[136] రాళ్ళపల్లి పీఠికలు. పుట. 272.

పుట్టపర్తి నారాయణచార్యుల *'ప్రబంధనాయికలు'*కు రాసిన ఉపోద్ఘాతంలో శర్మగారు విమర్శ మూడు రకాలని అభిప్రాయపడ్డారు. ''*కావ్యనాటకాదులను శాస్త్రీయమగు పారిభాషిక దృష్టితో చూచి తూచుట యొకదారి; దానియందు తెలిసియో తెలియకయో ప్రతిబింబించిన ఆయాకాలపు సాంఘిక రాజకీయాది విషయముల నెఱుగు కంటితో మూల ముట్టుగ పరిశోధించుట రెండవదారి; ఇవిగాక గ్రంథకర్త యొక్క ఆశలు; అభిమానములు, రాగద్వేషములు మొదలగు జీవనసూత్రములను గ్రహించి వాని యావిష్కరణ పద్ధతులు, అందుచే మన హృదయమందు గలుగు సంవాద వివాదములను బైలుపఱచుట మూడవది. పై రెండు మార్గములు ఎంత యుపయోగకరములైన గుమాస్తాపనికి చేరినవి, విషయ సంగ్రహము మాత్రమే. మూడవది అనుభవ సంగ్రహము.*''[137] ఈ సూత్రంపై ఆధారపడి నారాయణచార్యుల *'ప్రబంధనాయికలు'* గ్రంథం ఉందని లోతైన పరిశీలిన ద్వారా రాళ్ళపల్లివారు తెలిపారు. ప్రధానంగా దీనిలో పెద్దన, తిమ్మన, సూరన, భట్టుమూర్తి లాంటి వారు సృజించిన ప్రంబంధ నాయికల తీర్పు ఎంతో కమనీయంగా, రసభరితమై ఉందని రాళ్ళపల్లివారు చెప్పారు.

జానపదులు వాఙ్మయాన్ని ప్రజ్ఞతో పరిశీలించి బయటికి తెచ్చేవారిలో తూమాటి దొణప్పగారు ఒకరని *'జానపద కళాసంపద'* గ్రంథానికి పీఠికరాస్తూ శర్మగారు చెప్పారు. దొణప్పగారు తన *'జానపద కళాసంపద'* గ్రంథంలో రాయలసీమ యాసలోనే అందరిని మెప్పించడం గొప్ప విషయమని శర్మగారు కొనియాడారు. ''*రాయలసీమ బాస వట్టివాతలు పెట్టుకుంటా నిసర్గమైన నింపు సొంపులను దార బోసుకుంటావుంది. ఇక్కడ పుట్టి పెరిగిన చదువరులే తమ రాతకోతల్లో ఆ యాసే ఆ వేసమే పూసుకుని గడ్డ కెక్కుతున్నా రెందరో. వాండ్లలో కొందరికైనా ఇప్పుడిప్పుడు అక్కడక్కడ స్వ- స్వీయాభిమానాలు తలచూపుతున్నందుకు మెచ్చుకోవలసిన వున్నది.*''[138] అని అన్నారు.

ప్రాచీన ఆధునిక వాగ్గేయకారుల్లో భరతాచార్యుని మొదలుకొని బాలమురళీకృష్ణవరకు గల పరామర్శే ఈ గ్రంథమని శర్మగారు *'ఆంధ్రవాగ్గేయకారులు'* ల పీఠికలో వివరించారు. గ్రంథ రచయిత బాలాంత్రపు రజనీకాంతరావుగారి కుటుంబ వివరాలను, వీరి రచనా దృక్పథాన్ని ఆసాంతం చర్చించారు. ''*పరిశుద్ధమైన పరిశోధన దృష్టితో ఈ రచన సిద్ధమైనదని ఒక్కమాటలో దీని గౌరవమును చెప్పవచ్చు.*'' [139] ఇంకా లోతైన పరిశీలన చేసి అక్కడక్కడ లోపాలు ఉన్నాయని కూడా చెప్పారు. *'ఆంధ్రవాగ్గేయకారులు'* అనే పేరు పెట్టినా లీలాసుకుడు లాంటి కొందరి ఆంధ్రేతరుల ప్రస్తావన కూడా ఇందులో ఉందన్నారు. క్షేత్రయ్య, త్యాగయ్యలు వాడిన కొన్ని రాగాల వివరాలు ఇందులో పేర్కొనలేదని శర్మగారు గుర్తించి ఉదహరించారు. భైరవి రాగం – ఆనంద భైరవిగా మారటం అసాధ్యమేమి కాదని పీఠకాకర్త తెలిపారు.

[137] రాళ్ళపల్లి పీఠికలు. పుట. 289.
[138] రాళ్ళపల్లి పీఠికలు. పుట. 328.
[139] రాళ్ళపల్లి పీఠికలు. పుట. 303.

అక్కడక్కడ కొన్ని లోపాలున్నా రజనీకాంతరావుగారు రాసిన ఈ గ్రంథం ఆహ్వానించదగిందని చెప్పారు.

శర్మగారు అనేక పుస్తకాలకు రాసిన ప్రతీ పీఠికా చెప్పుకోదగింది. పాఠకులు రాళ్ళపల్లివారి మాటలు చదివితే తప్పకుండా మూల గ్రంథాన్ని చదవాలనే కోరిక కలుగుతుంది. శర్మగారి *"ఈ పీఠిక రాయడానికి కలిగిన సందర్భాలను, ఆయా రచయితలతో ఉన్న సాన్నిహిత్యాన్ని చెప్తూ, గ్రంథంలోని గుణదోషాలను క్షుణ్ణంగా తెలిపి, రచయితలను మరో రచన చేయడానికి గొప్ప ప్రోత్సాహన్నిచ్చిన సందర్భం ఎక్కువ పీఠికల్లో ఉంది."*[140] అని బడిగె ఉమేశ్ తన ఎం.ఫిల్ సిద్ధాంత వ్యాసంలో అన్నారు.

శర్మగారు 1917లో రాసిన తొలి పీఠిక *'వేమన పద్యములు'* నుండి 1977లో రాసిన *'త్యాగశిల్పము'* వరకు ఆసాంతం పరిశీలిస్తే, ఏదో పీఠిక రాయలనే ఆలోచనతోనో, మొహమాటానికో రాయకుండా ఆయా ప్రక్రియల్లోని రచనా దృక్పథాన్ని బట్టి తనదైన ఆలోచనతో నిష్పక్షపాతంగా, నిర్మోహమాటంగా తమ అభిప్రాయాలను వెల్లడించిన ధోరణి ప్రతి పీఠికలో కనిపిస్తుంది. శర్మగారు సురవరం ప్రతాపరెడ్డిగారి *'ఆంధ్రుల సాంఘీక చరిత్ర'* గురించి ఓ ఉత్తరం రాసి పంపితే, ఆ వాక్యాలను రెడ్డిగారు తమ పుస్తకం చివర్లో ప్రచురించుకున్నారు. అంటే శర్మగారు రాసిన వుత్తరాల్లో కూడా ఎన్నో విలువైన సూచనలుంటాయని దీనివల్ల తెలుస్తాయి. రాళ్ళపల్లివారు తమ పీఠికల్లో గుణా దోషాలను చాలా సున్నితంగా తెలిపారు. వీటిని చదివితే వారు అనుసరించిన పద్ధతులు అవగతమవుతాయి. రాళ్ళపల్లివారు పీఠికలు తెలుగు సాహిత్యంలో ఎన్నో గొప్ప ఆలోచనల్ని రేకెత్తించిన రసగుళికలూ, చిరస్మరణీయాలునూ.

రాళ్ళపల్లివారి పీఠికల వైశిష్ట్యాన్ని డి. చంద్రశేఖర్ రెడ్డి మాటల్లో (వివిధ రచయితలతో ఇంటర్వ్యూలు) ప్రశ్నావళి : 2, ప్రశ్న 15 లో చూడు (అనుబంధం – 1)

### 2.11.5. రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు

శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు ఇటు సాహిత్యంలోనూ, అటు సంగీతంలోనూ సమాన ప్రతిభా పాండిత్యాలు కలిగిన సవ్యసాచి. వీరు ఈ రెండింటిలో గొప్ప విమర్శ వ్యాసాలు వెలువరించారు. ఆనాటి నుండి ఈనాటి వరకూ చెల్లాచెదురుగా పడివున్న శర్మగారి వ్యాసాల్ని ఒక చోటికి చేర్చి ఉద్గ్రంథంగా తీసుకోస్తే ఉపయోగకరంగా ఉంటుందని కొందరు ఔత్సాహికులు భావించి, శర్మగారి వ్యాసాలను సేకరించి పెట్టుకొన్నారు. వీటిన్నిటిని ఎమెస్కో సంస్థ 2017 జూన్ లో *'రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు'* పేరుతో వెలుగులోకి తెచ్చింది. ఈ గ్రంథం 368 పుటల్లో ఇమిడివుంది. దీంట్లో ఇరవై సాహిత్య, పది సంగీత వ్యాసాలున్నాయి. వీటిని అధ్యయనం చేస్తే ఎన్నో విలువైన అంశాలు తెలియడమే కాదు వ్యాసాలు రాసే పద్ధతి, అభిప్రాయాలు వెల్లడించగల నేర్పు అలవడతాయి. ఈ గ్రంథానికి

---

[140] రాళ్ళపల్లి పీఠికలు పరిశీలన. పుట. 110.

ఎమెస్కో సంపాదకులు డి. చంద్రశేఖర్ రెడ్డి ముందు మాట రాస్తూ, ''*ఆయనలో సంప్రదాయంపై గౌరవంతో పాటు ఆధునికతను స్వీకరించగలిగే సహృదయం ఉండడం విశేషం.*''[141] అని శర్మగారిని ప్రశంసించారు.

ఈ అపూర్వమైన వ్యాసాలకు ఘట్టమరాజు అశ్వత్థనారాయణగారు 'గోరంత దీపం' మనే శీర్షికన సుదీర్ఘమైన సమీక్షా వ్యాసం రాశారు. ఇందులో ఆధునిక సాహితీ వేత్తలు, విద్యార్థులు, పరిశోధక మిత్రులు శర్మగారి వ్యాస వాఙ్మయాన్ని అర్థంచేసుకోనేందుకు కావాల్సిన దారులను వివరించారు. అంతేకాదు ఈ వ్యాసాలను మనం రాయడానికి అనుసరించాల్సిన పద్ధతులను పందువలిచి పెట్టినట్లు ఎలా చెప్పారో చూడండి.''*వ్యాసం ఎలా రాయాలో, దాని ఆది, మధ్య, అంతాలు ఏవిధంగా వుండాలో అసలు ఆశయమేమిటో, స్పష్టంగా, సులభంగా అభిప్రాయాలు వెల్లడించాలంటే ఏం చేయాలో, తెలుగు నుడికారం అంటే ఏమిటో తెలుసుకోవాలంటే, దారి చూపేందుకే ఈ రాళ్ళపల్లి వ్యాసాలు మీ ముందుకు రావడం.*'' [142] అని శర్మగారి వ్యాస ఉద్దేశ్యాన్ని స్పష్టం చేశారు. రాళ్ళపల్లివారు చేసిన కృషి గోరంత అయినా సాహిత్యానికి కది కొండంత వెలుగుని ప్రసాధించిందని పై అభిప్రాయన్ని బట్టి తెలుస్తుంది.

శర్మగారి వ్యాసాల్లోని స్థూలాంశాలను గమనిస్తే కొన్ని ముఖ్యమైన విషయాలు తెలుస్తాయి. ఈ వ్యాస సంకలనంలో మొదటి వ్యాసం ***'కవిత'.*** దీన్ని శర్మగారు 1912లో రాశారు. ఇదే తొలి వ్యాసమని విమర్శకులు భావించారు. రాళ్ళపల్లివారు కవితా రచనకు సంస్కృతాంధ్ర భాషా పాటవం, ఛందో వ్యాకరణ జ్ఞానం, ఔచిత్యం, సారళ్యం మనే నాలుగు అంశాలు ప్రముఖమైనవంటారు.''*మనం మాటడుకొను మాటలనే విలక్షణమగు రీతిఁ బద్య రూపమునఁగాని, వచన రూపమునఁగాని చెప్పుట కవిత.*''[143] అని శర్మగారు నిర్వచించారు. ఈ కవిత అనేది అంత సులభంగా అలవడదని ఆయన చెప్పారు. అంతేకాదు వేమనకున్నంత కవితధార శ్రీ కృష్ణదేవరాలకు లేదని వివరిస్తూ, దీనికి సహజమైన గుణం, మథనపడే హృదయం చాలా అవసరమన్నారు.

ఆనాడు తెలుగు సాహిత్యంలో అనేక చర్చలకు తావిచ్చిన శర్మగారి విశిష్ట వ్యాం ***"ఆంధ్ర వాఙ్మయమున నాచన సోమనాథునికీయదగిన స్థానము".*** నడకుదుటి వీరరాజు, కందుకూరి వీరేశలింగం, చిన్నయ సూరి, బహుజనపల్లి సీతారామాచార్యులు లాంటి ఉద్దండులు ఎర్రన కంటే నాచన సోమనాథుడే గొప్పవాడని భావించారు. కాని, వీరందరి ఆలోచనా విధానం సరైంది కాదని నాచన సోమన కంటే ఎర్రనే కవితారచనలో రెండాకులు ఎక్కువేనని రాళ్ళపల్లివారు ఈ వ్యాసంలో నిరూపించారు. వ్యాసకర్త ఎర్రన, సోమనల ఇద్దరి రచనలైన *'హరివంశము', 'ఉత్తర హరివంశము'*ను నిశితంగా పరిశీలించి అందులో ఊర్వశీ చిత్రణలోని నరకాసురుల సంవాదం, ఉషానిరుద్ధుల ప్రణయ కవితా ప్రజ్ఞను తులనాత్మకంగా

[141] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 4.
[142] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 22.
[143] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 28.

పరిశీలించారు. ఎర్రన కవిత్వంలో పాత్రచిత్రణా నైపుణ్యం, రసపోషణ విధానం, ఔచిత్య నిర్వహణలు అలాగే, శైలీ రామణీయకాలు ఎక్కువగా ఉన్నాయని, నాచన సోమనుని కవితలో అనవసర అలంకారాల ప్రస్తావన, దీర్ఘసమాసాల కూర్పు, భావార్థాల్లో నిగూఢత నిండి ఉన్నాయన్నారు. వీటిని వ్యాసంలో ఉదాహరణాలాధారంగా చూపించి నిరూపించారు.

రాళ్ళపల్లివారు సంప్రదాయ విలువలను నిష్ఠగా పాటించే వారైనా వాటిని గుడ్డిగా నమ్మే స్వభావం మాత్ర కనబడదని ***'అప్పకవి కవితా సిద్ధాంతములు'*** వ్యాసం చదివితే తెలుస్తుంది. శర్మగారు ఇందులో ఎన్నో మౌలికమైన ఆలోచనల్ని మన ముందుంచారు. అంతేకాదు ఎక్కువగా లక్ష్య, లక్షణాల మధ్యగల తేడాలను సుస్పష్టం చేశారు. కవులు తమ భావనా బలం కోల్పోవడానికి లాక్షణికుల సంప్రదాయాలే కారణమని ఉద్ఘాటించారు. అప్పకవి చెప్పిన కొన్ని సిద్ధాంతాలతో శర్మగారు విభేదించారు. నియమాలు లేనివాటిని కూడా నియమాలున్న గుంపులో ప్రవేశపెట్టి కలగపులగం చేయటం సరికాదన్నారు. దీనివల్ల పాఠకులు సులభంగా అర్థం చేసుకోక ఇబ్బందులు పడతారని భావించారు. అప్పకవి కవిత్వాన్ని అలంకార ప్రధానమేకాని రసప్రధానం కాదంటే, శర్మగారు అలంకారాలు రసపోషణకు దోహదం చేయాలికాని, ఆధిపత్యం చేయకూడదంటారు. అప్పకవి పదాల కూర్పు ద్వారా కవుల్ని ఏడు రకాలుగా విభజించడం ఆమోదయోగ్యం కాదన్నారు. కవిత్వానికి జీవకళ అయిన ధ్వనిని అప్పకవి పట్టించుకోలేదని శర్మగారు సమాధానం చెప్పారు. అప్పకవి అర్థ ప్రధానం కవిత్వం కంటే శబ్ద ప్రధానమైన చిత్ర, బంధ, గర్భ కవిత్వానికి చోటు కల్పించడం తప్పని చెప్పారు. మొత్తం మీద వ్యాసమంతా అప్పకవి చెప్పిన అన్ని అభిప్రాయాలతో శర్మగా ఏకీభవించకుండా తమదైన అభిప్రాయాన్ని వ్యక్తం చేసిన ధోరణి కనబడుతుంది.

***'ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహము'*** అను వ్యాసాన్ని రాళ్ళపల్లివారు కన్నడ సాహిత్య పాఠకుల కోసం కన్నడ భాషలో రచించారు. ఇందులో తెలుగు సాహిత్య చరిత్రను సంక్షిప్తంగా తెలిపారు. అంతేకాదు ఈ భాష ఆశించినంత అభివృద్ధి చెందక పోవడానికిగల కారణాలను స్పష్టపరిచారు. ముఖ్యంగా తెలుగులో ఉన్న జానపద సాహిత్యం ఎంతో గొప్పదని కొనియాడుతూ, వాటి లక్షణాలను కళ్ళకు కట్టినట్లు తెలిపారు శర్మగారు. వేయి సంవత్సరాల తెలుగు సాహిత్యాన్ని చిన్న వ్యాసంలో సంక్షిప్తంగా చెప్పటం వారి పాండిత్యానికి నిదర్శనంగా భావించవచ్చు. ఈ వ్యాసంలో ఆధునిక సాహిత్య తెలుగు రచయితల ప్రతిభా విశేషాలను ప్రత్యేకంగా స్పృశించి భవిష్యత్తుకు ప్రోత్సాహన్నందిచారు. వ్యాసంలో ప్రత్యేకంగా ఆదికవి, శిథిలమతావేశం, రాజాశ్రయం, శాస్త్ర సాహిత్యాలు, పురాణయుగం, కవిత్రయం, చిత్రకవిత్వం, పామర సాహిత్యం, ఆంగ్ల సాహిత్య సుడిగాలి అనే శీర్షికలిచ్చి ఆయా అంశాలను నిశితంగా సమీక్షించారు. కన్నడంలో ఉన్న ఈ వ్యాసాన్ని శంకరగంటి రంగచార్యులు అనువాదం చేసి 1990 ఫిబ్రవరి, భారతి పత్రికలో ప్రచురించారు. ఇది కేవలం కన్నడ వాళ్ళకోసమేకాదు. తెలుగువాళ్ళకు కూడా ఎంతో ఉపయోగకరమని చెప్పవచ్చు.

'జయకర్ణాటక' విజయనగర ప్రత్యేక సంచిక నుండి అనువాదమైన ***'రాయలనాటి తెలుగు సాహిత్యము'*** వ్యాసం 1937 ఫిబ్రవరి భారతిలో ముద్రితమైంది. ఇందులో శర్మగారు రాజకీయ, సాంఘిక, ధార్మిక, సాంస్కృతిక నేపథ్యంలో వచ్చిన తెలుగు కవిత్వాన్ని స్థూలంగా వివరించారు. ముఖ్యంగా అష్టదిగ్గజ కవులు సృష్టించిన సాహిత్యం ఎంతో గొప్పదని, వీరు లేకపోతే తెలుగు భాషకు ఆదరణ తక్కువైయ్యేదని అంటారు. ప్రధానంగా దీనంతటికి కారణం రాయల చొరవేనని ఉద్ఘాటించారు. ఈ వ్యాసంలో విస్తృతంగా చెప్పాల్సిన అంశాలను సంక్షిప్తంగా చెప్పటం సమంజసం కాదని ప్రముఖ విమర్శకులు ఘట్టమరాజు అశ్వత్థనారాయణ ''*రసవంతమైన, చమత్కారజనితాలైన కావ్యాలు వెలువడ్డాయే కాని ''వివేచనాపూర్ణమైన సాహిత్యమా కాలమున తక్కువయని ఒక్కమాటలో'' చెప్పి చేతులు దులుపు కొన్నారు రాళ్ళపల్లివారు. ''*[144] అని విమర్శించారు.

యథార్థంగా జీవితానుభవం నుండి పుట్టి, భావాలు బలంగా ఉండి, రసరమ్యమైన జానపద కవిత్వం ఎంతో ప్రశంసనీయమైనదని *'కన్నడ జానపద సాహిత్యం'* అనే వ్యాసంలో శర్మగారు రాశారు. ప్రాచీన మార్గ సాహిత్యం పట్ల ఉన్న ప్రేమానురాగాలు జానపద సాహిత్యం కూడా మీద రాళ్ళపల్లి వారికి ఎక్కువగా ఉంటుందని ఈ వ్యాసం నిరూపించింది.

నెల్లూరులో జరిగిన నాటకకళా పరిషత్తు సమావేశంలో చేసిన అధ్యక్షోపన్యాసంలో ముఖ్యమైన విషయాలే ***'నాటకకళ : నేటి మన నాటకములు'***. వ్యాసం. దీంట్లో రాళ్ళపల్లివారు నాటకాలు రసప్రధానంగా లేనందువల్ల ప్రేక్షకుల ఆదరణ తక్కువైందన్నారు. ఇప్పట్లో నాటకాలు వినోదం కోసమే అన్నట్లుగా ఉన్నాయి కాబట్టి, వీటికన్న సినిమాలు గొప్ప ఆనందాన్ని అందిస్తున్నందున ప్రేక్షకులు నాడు సినిమాల వైపు మొగ్గు చూపుతున్నారని అభిప్రాయపడ్డారు. ఈ వ్యాసం చివర్లో శర్మగారు చెప్పిన ఈ మాటలు ''*రసిక పారిషదులు చేయు ప్రయత్నము చేత రసిక జీవనము పునరుద్ధారము కావలిసియున్నది. సంఘము సహృదయము కావలసిన యున్నది. రుచులును అభిప్రాయములును శోధన కావలసియున్నది*''[145] గమనార్హం.

శర్మగారు మద్రాసులో చేసిన ప్రసంగం ఆధారంగా రాసిన ***'త్యాగరాజయ్య సాహిత్యము'*** అను వ్యాసం నిలుస్తుంది. ఇది 1940 ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో ప్రచురితమైంది. ఇందులో వ్యాసకర్త త్యాగయ్య భక్తి నిర్దుష్టమైనదిగా భావించారు. అంతేగాక, ఈ ప్రత్యేకమైన భక్తి నిలువెల్ల వ్యాపించి ప్రసరించిందని ఉద్ఘాటించారు. త్యాగయ్య రాసిన కవిత్వాన్ని నిశితంగా పరిశీలించి వీరు సంగీతానికిచ్చినంత స్థానం సాహిత్యానికి ఇవ్వలేక పోయారని అభిప్రాయపడ్డారు. దీనికి ప్రధాన కారణం ఈయన తమిళ ప్రాంతంలో ఉండటమే కారణమన్నారు. త్యాగయ్య చేసిన కృషిని, మేలుని మనం జీవితాంతం మరవకూడదని

---

144 రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట:15.

145 రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట: 130.

గుర్తుచేశారు. *''త్యాగయ్యకుఁగల అపారమైన గాన విద్యా పాండిత్యమే నాకుఁ జూడఁగా పాటను నేర్చినంత శ్రద్ధతో అతఁడు మాటను నేర్వలేదు.''*[146] అని అన్నారు.

1942లో రాసిన **'పదములు – క్షేత్రయ్య'** అనే వ్యాసం ప్రత్యేకమైంది. దీనిలో శర్మగారు తెలుగు సాహిత్యంలో ఛందస్సుకు ఇచ్చినంత ప్రాధాన్యం పదకవితా సాహిత్యానికి ఇవ్వకపోవడం బాధకరమన్నారు. అసలు వ్యాసకర్త దృష్టిలో పదములనగా *''శృంగారమయమై, ఎక్కువ విలంబకాలమందు, క్వచిత్తుగా మధ్యమ కాలమందు నడుచుచు, పల్లవాను పల్లములు మూడింటికి తక్కువగాని చరణము గలిగి, ప్రాచీన రక్తిరాగములో చేయబడిన గేయ రచన పదములు.''*[147] అని నిర్వచించారు. వ్యాసంలో పదకవితా పితామహుడైన అన్నమాచార్యుని జీవిత ప్రస్థానాన్ని స్థూలంగా పరిచయం చేశారు. తెలుగు పదాల్లో శృంగారం ఎక్కువగా ఉండేందుకు కారణం రాజులకు రసిక ప్రియులు కావడమేనని చెప్పారు. తెలుగు పదకవితకు పితామహుడు అన్నమయ్యే, కాని జనకుడు మాత్రం క్షేత్రయ్యేనని అభిప్రాయపడ్డారు. తెలుగు సాహిత్యంలో క్షేత్రయ్య పదాల్లో ఉండే రసికత ఇంకొకరిలో కనిపించదని శర్మగారన్నారు. క్షేత్రయ్య పదాల్లోని మాధుర్యాన్ని తెలుసుకున్న అరవలు, కన్నడిగులు, మలయాళం వారు ఎంతో అభిమానంతో తెలుగు భాషను నేర్చుకున్న సందర్భాలు కలవని అనంతకృష్ణశర్మ గుర్తుచేశారు. ఈ పదాల్లో ఎక్కువ శృంగార ఛాయలు ఉండటంవల్ల చాలా మందిని ఆకర్షించాయని చెప్పారు. అలాగే వీరి పదాల్లో సాహిత్యపు సొంపు ఎంతో గొప్పగా ఉందని శర్మగారు ప్రశంసించారు.

ఆధునికాంధ్ర సాహిత్య పుట్టుక, పరిణామ వికాసాలను శర్మగారు ***'ఆధునికాంధ్ర సాహిత్యపు వేగము'*** అను వ్యాసంలో తెలియజేశారు. మన ప్రాచీన పండితుల ఆలోచనా ధోరణుల్ని విమర్శనాత్మకంగా పరిశీలించారు. 19వ శతాబ్దంలో కందుకూరి వీరేశలింగంగారు చేసిన కృషిని కొనియాడి పాశ్చాత్య సిద్ధాంతాలను గుడ్డిగా పాటించడం అంత సమంజసం కాదన్నారు. *''ఇటీవల వచ్చు తెలుగు సాహిత్యమును నిరాశకు సంబంధించి విసుగు హెచ్చుగా స్ఫురించుచున్నది''*[148] అని మన భాష భవిష్యత్తుని వివరించారు. గొప్ప భావాన్ని నింపుకున్న తెలుగు సాహిత్యం ఎక్కువ ఉన్నతిని సాధించింది. కాని శాస్త్ర సాహిత్యం అంతగా వృద్ధి సాధించకపోవటం గమనార్హమన్నారు. భారతదేశంలోని భాషల పరిస్థితిని గమనించిన వ్యాసకర్త మరి దగ్గరగా తమిళ, కన్నడ భాషల్ని గమనించి వీటి పరిస్థితి మరి అధ్వాన్నంగా ఉందన్నారు. మన వాళ్ళు ఆంగ్లసాహిత్యాన్ని ఎక్కువగా ఆదరించడం వల్లా తెలుగును మరిచిపోతున్నారని వాపోయారు. అసలు తెలుగువారు సమకాలీన ధోరణుల్ని పసిగట్ట లేకపోవటం విచారకరమని రాళ్ళపల్లివారు భావించారు.

---

[146] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట:133.

[147] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట.139.

[148] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట.162.

శర్మగారు ***'అన్నమాచార్యుని కవిత'*** లో అన్నమయ్య గొప్ప భావనా శక్తి కలవాడని చెప్పారు. అన్నమయ్య తన మనసులో తీవ్రమైన భావాల్ని యధార్థంగా తెలిపారని ఉద్ఘాటించారు. అన్నమయ్య సంకీర్తనల్లోని పదాలకు, పద్యాలకు మధ్య ఉన్న తేడాలను స్పష్టపరిచారు. ''*ఆయన రచించిన శృంగార పదాలు ఒక విశాల విశ్వం వంటివని*'' [149] కొనియాడారు.

**'కట్టమంచివారి వైలక్ష్యణ్యం'** వ్యాసంలో అనంతకృష్ణశర్మ కట్టమంచి రామలింగారెడ్డితో గల అనుబంధాన్ని ఇలా గుర్తుచేశారు. ''*ఇరు పక్కలా మూడవ వ్యక్తికి చొరవ లేని ముగ్ధ మధుర సంబంధం మాది.*''[150] రెడ్డిగారు మైసూరు మహారాజా కళాశాలలో ప్రొఫెసర్ గా ఉన్నప్పుడు రాళ్ళపల్లివారిని తెలుగు పండితునిగా ఎంపిక చేసి వీరి జీవితానికి భరోస కల్పించారు. కాగా శర్మగారు తెలుగు సాహిత్యంలో పేరు రావడానికి ఆయన అందించిన ప్రోద్బలం అంతా ఇంత కాదు. రెడ్డిగారి శిష్యుల్లో శర్మగారు ప్రథమ గణ్యులని చెప్పవచ్చు అందుకు శర్మగారికి రెడ్డిగారిపై గురు భావన అమితంగా ఉంది. దానిని ఈ వ్యాసంలో మనసార చెప్పుకొన్నారు. ముఖ్యంగా రెడ్డిగారికున్న ప్రతిభా పాండిత్యాలను చాలా గొప్పవని రాళ్ళపల్లివారు కొనియాడారు. వీరికి రాజనీతి, తత్త్వశాస్త్రాలతో లోతైన అవగాహన ఉండేదన్నారు. ఇక ఆయన మనస్తత్వం సాధారణంగా అది ఎవరికి అంతుచిక్కదని అన్నారు.

అప్పుడప్పుడు రెడ్డిగారిలో గాంభీర్యం, హాస్యం, వాగ్మితలు వర ప్రసాదంగా వచ్చినట్లుండేవని చెప్పారు. కట్టమంచివారు భారతాన్ని బాగా ఇష్టపడేవారు. అంతేకాదు భారతం ఆయనకు కంఠతా వచ్చేదని తెలిపారు. ఇక తెలుగు సాహిత్యంలో రెడ్డిగారికి తిక్కనపై ప్రత్యేక అభిమానం కలదన్నారు. తర్వాత '*కవిత్వత్త్వ విచారము*' అనే విమర్శ గ్రంథాన్ని వెలువరించడం గమనార్హమన్నారు. ఎంతో పాండిత్యమున్న రెడ్డిగారు చేయాల్సినంత కృషి చేయలేకపోయారని శర్మగారు వాపోయారు. అప్పుడప్పుడు రెడ్డిగారి భావాలతో విభేదించినప్పుడు స్నేహ భంగం కలిగి కొన్ని రోజులు మాటలు లేకుండా ఉన్నామని కాని వారికి నాపైగాని, నాకు వారిపైగాని వాత్సాల్యం ఘదిలంగా ఉందని శర్మగారు గుర్తుచేశారు. ఇలా అనేక విషయాలను ఈ వ్యాసంలో రాళ్ళపల్లివారు నెమరు వేసుకున్నారు.

1960లో భారతి నవంబరులో అచ్చైన ***'తిమ్మావజ్ఝలవారి "తెలుగు మఱుఁగులు"*** వ్యాసంలో రాళ్ళపల్లివారు కావ్యాలపై పాఠపరిష్కరణ చేసిన తిమ్మవజ్ఝలవారిని ప్రశంసించారు. నన్నయ పద్యభాగం 'ధనుంజయ ప్రవరుకరమ్మన్' అను మూల పాఠాన్ని 'ప్రవరకరమ్ము' అని చేసిన తప్పు అనర్థాలకు దారి తీసిందన్నారు. దీన్ని ఆధారంగా చేసుకుని పాఠపరిష్కరణ చేసేటప్పుడు విద్వాంసులు భాషా వ్యాకరణ ఛందోజ్ఞానం పుష్కలంగా సంపాదించుకొని వుండాలనీ, సహృదయంతో పాటు అనుభవం కూడా కలిగి ఉండాలని రాళ్ళపల్లివారు

[149] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 170.
[150] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 172.

అభిప్రాయపడ్డారు. ఎన్నో అర్థాలు ఇమిడి ఉన్న పాఠాంతరాలను సూచించాలంటే అందులో లీనమవ్వాలన్నారు. ఇది అంత సులభం కాదని కూడా చెప్పారు. నన్నయ, తిక్కన, నన్నెచోడుడు లాంటివారి రచనల్లోని పాఠాంతరాల్లో వావిళ్ళవారు చేసిన మార్పులను ఎత్తి చూపారు. అలాగే తిమ్మవఝ్ఝలవారు చేసిన నాలుగు పాఠాంతరాల్లో తప్పులనిపేర్కొని '' *కోదండరామయ్య గారు ఈ వ్యాసంగము నింకను పెంచి తెలుగు మణుగులు వెలికిదెచ్చి లోకమున కుపకరింతురుగాక.''*[151] అని అన్నారు.

అనంతకృష్ణలవారు తనకు చిన్నప్పటి నుండి పాఠాలు బోధించి తాను ఉన్నత శిఖరాలకు వెల్లటానికి సహకరించిన ప్రతి ఒక్కరిని భక్తి శ్రద్ధలతో ***'నాగురువులు'*** అను వ్యాసంలో తలచుకున్నారు. ఈ వ్యాసం 1961లో శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ సన్మాన సంచికలో ప్రచురితమైంది. ముఖ్యంగా తనకు చిన్నప్పుడు సాహిత్య పాఠాలు నేర్పిన తండ్రి కర్ణమడకల కృష్ణమాచార్యులుగారిని, సంగీతం చెప్పించిన తల్లి అలమేలు మంగమ్మ గారిని మనసారా స్మరించుకున్నారు. మైసూరులో ఎన్నో ఇబ్బందులు పడుతున్న సందర్భంలో తన మఠంలో చేర్చుకొని సంస్కృత కావ్యాల్ని, నాటకాల్ని అవపోసన పట్టించిన శ్రీకృష్ణ బ్రహ్మతంత్ర పరకాలమఠ యతీంద్రుల్నీ, చామరాజనగరం రామాశాస్త్రిగార్ల సాన్నిహిత్యాన్ని రాళ్ళపల్లివారు మెచ్చుకొన్నారు. తనకు తెలుగు పండితునిగా ఉద్యోగం ఇచ్చి, పాశ్చాత్య, తెలుగు సాహిత్యం, కవిత్వం వంటి రుచులను చూపించిన కట్టమంచి రామలింగారెడ్డి గారిని ప్రత్యేకంగా స్మరించుకొన్నారు. శర్మగారు సంగీతం లోతుగా నేర్చుకోవడానికి తోడ్పడిన బిడారం కృష్ణప్ప, వీణ శేషణ్ణగార్లను మనస్పూర్తిగా తలచుకొని పులకరించి పోయారు.

***'నృసింహపురాణ పాఠశోధన'*** మను వ్యాసంలో రాళ్ళపల్లివారు నృసింహపురాణం ప్రథమాశ్వాసంలోని ముప్పైఐదు పాఠాంతరాలను పేర్కొని అందులోని గుణ దోషాలను సూచించారు. అసలు పాఠాంతరాలు సూచించే పండితులు కవి చిత్తవృత్తిని అవగాహన చేసుకోవడమేకాక, కావ్యం లోతుపాతుల్నీ వాటి కాలాలను, సంప్రదాయాలను అర్థంచేసుకోవాలని నొక్కి చెప్పారు. ఈ వ్యాసంలో కొన్ని పాఠాంతరాలు ఈ విధంగా. '... బ్రహ్మవాదియై పరగిన హంసముం బిలిచి' అను పద్యపాదంలో 'బ్రహ్మవాదియై' పదానికి బదులుగా 'బ్రహ్మవాహమై' అని కానీ, 'బ్రహ్మవాజియై' అని సవరిస్తే అర్థవంతంగా వుంటుందని వ్యాసకర్త అభిప్రాయం. మరో పాఠాంతరం ఈ విధంగా.. హరిదాస్యసంపత్తి కరులు శ్రీకరులెల్ల' అనే పద్యపాదంలోని 'హరిలాస్య సంపత్తి కరువులు కరులెల్ల' సహస్రమ్' లోని శ్లోకాల్ని ఉదాహరిస్తూ శివపార్వతుల లాస్యం లాగానే శ్రీ మహావిష్ణువుల లాస్యాన్నీ ప్రస్తావించి, ఎర్రన పద్యానికి వినూతమైన అర్థాన్నికల్పించారు. అంతేకాక, ముందు ఈ నృసింహపురాణాన్ని పరిష్కరించిన పండితులు బ్రహ్మశ్రీ వేలూరి శివరామశాస్త్రి, దివాకర్ల వేంకటావధానిగార్లు మంచి పాఠపరిష్కరణ చేశారని మెచ్చుకున్నారు. ''నృసింహపురాణ

[151] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 192.

*పాఠశోధన' వ్యాసం రాళ్ళపల్లివారి హృదయ సంపన్నతను, సూచీముఖ గరిమను, వైదుషీ పాటవాన్నీ, అభివ్యంజనా సౌకుమార్యాన్నీ తెలియచేస్తుంది''*[152] అని ప్రముఖ విమర్శకులు ఘట్టమరాజు కొనియాడారు.

రాళ్ళపల్లివారి విమర్శను నిశితంగా అధ్యయనం చేస్తే హాస్యం, వ్యంగ్యం తప్పక తారసపడతాయన్నదానికి నిదర్శమైన వ్యాసం ***'నన్ను గురించిన నిడుదవోలు వారి చెనుకు'***. నన్నెచోడుడు గ్రంథ పీఠిక సందర్భంలో శర్మగారి గురించి నిడుదవోలు గారు రెండు పర్యాయాలు విమర్శించినప్పుడు ఆయా లోపాలను నిరూపించమని బదులుగా ఈ వ్యాసం రాశారు. మొత్తం పాఠాంతరాలను నిశితంగా పరిశీలించిన నిడుదవోలు వారితో విభేదించారు. ఇది తెలుగు సాహిత్యంలో దుమారం రేగిన వ్యాసంగా గుర్తింపు పొందింది. ఈ వ్యాసం 1969 భారతి నవంబర్ లో ప్రచురితమైంది.

***'నన్నయయా? రాజరాజనరేంద్రుడా?'*** అను వ్యాసంలో శర్మగారు ఆంధ్ర మహాభారతంలోని మూడు పర్వాలను నన్నయ రాయలేదనీ, రాజరాజ నరేంద్రుడే రాశాడని చిలుకూరి నారాయణరావు అభిప్రాయపడగా దీన్ని పూర్తిగా ఖండించారు. చూడ్డానికి చిన్న వ్యాసమైన శర్మగారు ఎంతో మేధోగతంగా వివరించిన తీరుని మనం వ్యాసంలో చూడవచ్చు.

అలాగే, ***'ధనంజయ ప్రవరకరమ్ము – బలియిడు వీనిన్', 'వాల్మీకి గేయ పరిస్పందము'*** వ్యాసాల్లో వ్యాసకర్త తమ ఆలోచన విధానాలను స్పష్టంగా వెల్లడించినట్లు గమనించవచ్చు. ఇలా శర్మగారి మొదటి వ్యాసం నుండి ఇప్పటి వరకున్న వ్యాసాలను పరిశీలిస్తే, ఎన్నో అంశాలు తెలిశాయి. వీరి వ్యాసాలను చదివిన కొద్ది విజ్ఞానం కలుగుతుంది తప్ప తరగదు. శర్మగారి 'వేమన, సారస్వతాలోకము' లాంటి పుస్తకాలను చదివిన పాఠకుల, విమర్శకుల నుంచి మంచి ప్రతిస్పందన వచ్చింది. కాబట్టి ఈ వ్యాసాలు చదివితే అలాంటి అభిప్రాయాలు రావచ్చు, రాకపోవచ్చు. ఏదైతేనేం ఈయన వ్యాస విమర్శనం తెలుగు సాహిత్యంలోనే ప్రత్యేకమైందని చెప్పవచ్చు. అక్కడక్కడ ఆవేశాభిప్రాయాలు చెప్పిన క్రమక్రమంగా పూర్తిగా తగ్గి చల్లారిన క్రమం కనిపిస్తుంది. అంతేకాక, తన మనసుకు నిజంగా తప్పని అనిపిస్తే, దాన్ని సరిదిద్దుకోవడానికి సైతం వెనకాడని తత్త్వం వీరిది. శర్మగారి సరళ గ్రాంథిక భాష సహృదయులకు ఏ మంత కష్టమని పించదు. శర్మగారు మొదట రాసిన వ్యాసాల్లో అరసున్నాలు, శకటరేఫలు ఎక్కువగా వాడినా రానురాను వ్యవహారిక భాషను అలవర్చుకోవడం కనిపిస్తుంది. ఎక్కువ వ్యాసాల్లో హాస్యం, వ్యంగ్యం, చమత్కారం సందర్భాను గుణంగా ప్రయోగించడం వారికి వెన్నతో పెట్టిన విద్య. విషయం ప్రాచీనులదైన ఆకట్టుకునేలా చెప్పడం శర్మగారి ప్రత్యేకత. అక్కడక్కడ వ్యాసాల్లో చెప్పిన లక్ష్య, లక్షణ – ఓర్పు, నేర్పు లాంటి ప్రత్యేకతలు అందరి రచయితల్లో ఉండవు కాని ఈ లక్షణాలే రాళ్ళపల్లివారిని అంత స్థాయికి తీసికెళ్ళాయని చెప్పవచ్చు.

---

[152] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 18.

రాళ్ళపల్లివారు సాహిత్యంతో పాటు సంగీతాన్ని కూడా ఎంతో ఇష్టంతో అధ్యయనం చేసిన ప్రతిభాశాలి. అందులో భాగంగానే సంగీతం గురించి తమ అభిప్రాయాలను వ్యాసాల్లో వెల్లడించారు. ముఖ్యంగా వీరి సంగీత ప్రౌఢిమను కర్ణాటక వారు ఆకళించుకున్నంత మన వారు అర్థం చేసుకోలేక పోయారనే చెప్పాలి. ఈ పుస్తకంలో సంగీతం గురించి పది వ్యాసాలుండటం విశేషం.

ఆయా సంగీత వ్యాసాలు వరుసగా *'కీర్తిశేషులైన వైణిక శిఖామణి శేషణ్ణగారు, ఆంధ్ర గాయక జనసభ, భారతీయ సంగీతమందలి దక్షిణోత్తరమార్గములు, కర్ణాటక గానశైలి పవిత్రత, నిన్నటి సంగీతము– ఇరువురు సంగీతకోవిదులు, స్వభాషాభిమానమునకు సంగీతముతో ఏమి గొడవ?, సంగీత సాహిత్యాలు: అక్షరరమ్యత, మన సంగీత వాద్యాలు, ఆంధ్రులు – సంగీతము, సంగీతము.* అనేవి పేర్కొనదగినవి.

రాళ్ళపల్లివారు వీణ శేషణ్ణగారు మరణించిన సందర్భంగా ***'కీర్తిశేషులైన వైణిక శిఖామణి శేషణ్ణగారు'*** అను వ్యాసం రాశారు. ఇందులో శేషణ్ణగారి ప్రతిభా పాండిత్యాలను సవివరంగా చెబుతూ.*''శేషణ్ణగారి చావు అట్టిది. సమృద్ధిగా సంపాదించెను. మహారాజు లున్నచోటికి మేనా పల్లకీలతో సంచరించెను; చేతఁబట్టిన వీణవాద్యముపై తన యెదుట నితరులు చేయివేయలేనట్లు, సీమసీమలలోను సింహస్వప్నముగాఁ దిరిగెను. వైణిక శిఖామణి బిరుదమును దక్కించు కొనియెను.''*[153] ఇలా శర్మగారు శేషణ్ణగారి కృషిని తెలిపారు.

***'ఆంధ్ర గాయకజన సభ'*** వ్యాసం 1927 నవంబర్ లో అనంతపురంలో సమావేశ సందర్భంగా చేసిన అధ్యక్షోపన్యాసము. దీన్ని భారతి పత్రిక జనవరి 1928లో ప్రచురించింది. ఈ వ్యాసంలో నానాటికి తగ్గిపోతున్న సంగీతాభిరుచిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరికి ఉందని ఉద్ఘాటించారు. అంతేకాక, నేడు పాటలు పాడుటలో, ఉన్న ఆసక్తిని శర్మగారి మాటల్లోనే. *''ఉపన్యాసవేదికలపై, పాఠపీఠములపై విధిలేక చదువవలసి వచ్చునప్పుడు, పద్యమును పదినాళ్ళు ఎండలో నెండించిన వంగ వరుగువలె చేసి, గద్యము కన్నను నీరసముగా గొణఁగుట నాగరకాచారమైనది. ఇట్లుండ నిఁక పాటలు నేర్పువారెవరు? నేర్చుకొనువారెవరు?''*[154] అని ప్రశ్నించటం గమనార్హం.

రాళ్ళపల్లివారు హిందుస్థానీ సంగీతాన్ని తండ్రితో పోల్చి, కర్నాటక సంగీతాన్ని తల్లితో పోల్చిన విధానం ***'భారతీయ సంగీత మందలి దక్షిణోత్తర మార్గములు'*** అను వ్యాసంలో కనిపిస్తుంది. ఆద్యంతం ఈ వ్యాసంలోని శర్మగారి అభిప్రాయాలు అందరినీ ఆలోచింపజేస్తాయి.

---

[153] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 270.
[154] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 279.

***'కర్నాటక గానశైలి పవిత్రత'*** లో హిందుస్తానీ రాగాల్ని కర్నాటక సంగీతంలో వాడడం మంచిదకాదని వ్యాసకర్త అభిప్రాయపడ్డారు. అంటే పేరు పొందిన కొద్దిరోజులకే ధనవంతుడు కావాలను కోవడం అత్యాశవుతుందని పునరుద్ఘాటించాడు.

మొదటి వ్యాసంలో వీణ శేషణ్ణగురించి తెలిపారు. అయితే ***'నిన్నటి సంగీతము – ఇరువురు సంగీత కోవిదులు'*** లో కూడా వీరి పరిచయం ఉంది. బిడారం కృష్ణప్పగారిని మరో సంగీత కోవిదుని గాత్రం కూడా గొప్పదని ఈ వ్యాసంలో కొనియాడారు. వీరిద్దరి బాణీలను తులనాత్మకంగా అధ్యయనం చేసి ఎవరి ప్రత్యేకత వారిదన్నారు.

తెలుగు కీర్తనల్ని తమిళప్రాంతంలో పాడకుండా కేవలం తమిళకీర్తనలకే ప్రాముఖ్యమివ్వాలన్న ఆలోచనను శర్మగారు ***'స్వభాషాభిమానమునకు సంగీతముతో ఏ గొడవ'*** వ్యాసంలో ఖండించారు.

అక్షరాలు సంగీతానికి గొప్ప గుర్తింపుని అందాన్ని తీసుకోరాగలవని ***'సంగీత సాహిత్యాలు: అక్షరరమ్యత'*** లో శర్మగారు తెలియజేశారు. జయదేవుని అష్టపదులకు వచ్చిన కీర్తి ప్రతిష్ఠలు కేవలం అక్షరరమ్యత వల్లే సాధ్యమైందని పునరుద్ఘాటించారు. భాషపై వాగ్గేయకారులకి మంచి పట్టు ఉండాలని, అంతేకాదు ఎక్కడ ఏ శబ్దం ఉపయోగించాలో స్పష్టంగా తెలిసి ఉండాల్సిన అవసరం ఉందని ఈ వ్యాసం ద్వారా స్పష్టపరిచారు.

శర్మగారు ***'మన సంగీత వాద్యాలు', 'ఆంధ్రులు సంగీతము', 'సంగీతము'*** అను వ్యాసాల్లో సంగీతానికి ఇవ్వవలసిన ప్రాముఖ్యాన్ని ఎంతో బాధ్యతగా చెప్పారు. భారతీయ వాద్యాల్లో ఎన్నో సంగీత వాద్యాలు మరుగున పడిపోయాయని అన్నారు. ముఖ్యంగా వీణ, వేణువు, మృదంగం, సన్నాయి లాంటి వాద్యాలు ఎంతో గొప్పవని పేర్కొన్నారు. విదేశీ వాద్యమైన ఫిడేలు ప్రాముఖ్యాన్ని ప్రత్యేకంగా గుర్తు చేశారు. ఇలా ఎన్ని వాద్యాలుంటే సంగీతం అంత వృద్ధిలోకి రాగలదన్నారు. సంగీతంలో ఉద్దండులైన సర్వజ్ఞ సింగమ నాయుడు, రామామాత్యుడు, అహోబల పండితుడు, గోవిందుడు మొదలైన మహనీయుల ప్రతిభా విశేషాల్ని మనమూ తెలుసుకొని, ఇతర భాషలవారికి కూడా తెలపటం అవసరమని ***'ఆంధ్రులు: సంగీతము'*** లో తెలిపారు. ఎరుకల కాంభోది, తిలక్ కామోద్ లు, ఏలపాటలు తెలుగు వాళ్ళరాగాలు. ఇవి గొప్ప గుర్తింపు తెచ్చిపెట్టాయని అన్నారు. భారతదేశంలోని సంగీత మూలాల్ని అన్వేషిస్తూ, ఆంధ్ర సంగీత ప్రాధాన్యాన్ని ప్రస్తావించారు. హిందుస్తానీ సంగీతం శ్రోతృరంజకమైందని, కర్ణాటక సంగీతం చిత్తరంజకమైందని అన్నారు. ప్రాచీన కవులైన నన్నయ, తిక్కనలు సంగీతానికి ప్రాధాన్యం ఇవ్వలేదని భావించారు. నాగరికులతో పాటు గిరిజనులు, జానపదుల సంగీతాలు మన భారతీయ సంగీతంలో ఉండటం మంచిదన్నారు. విజయనగర రాజుల వల్ల దాక్షిణాత్య సంగీతమనే పేరు వచ్చిందని శర్మగారు తెలిపారు. తెలుగు భాష కర్ణాటక సంగీతంలో పేరు పొందటం దాని ఇంపుసొంపులేనని నొక్కివక్కాణించారు.

అసలు సంగీతమనేది దేశ కాలాలకు, జాతి మతాలకు అతీతమైనదిని రాళ్ళపల్లివారు *'సంగీతము'* అను వ్యాసం ద్వారా తెలియజేశారు.

ఈ విధంగా అనంతకృష్ణలవారు వీణ శేషణ్ణ, బిడారం కృష్ణప్ప, లాంటి ఉద్దండ సంగీత విద్వాంసుల సాన్నిధ్య, సాహిత్యాల వల్ల రసార్ద్రతానుభవాన్నీ, సంస్కారాన్నీ పొంది, తమ వ్యక్తిత్వాన్ని గొప్పగా మలుచుకోగలిగారు.

## ముఖ్యాంశాలు

- రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి తారాదేవి, మిరాబాయి ఖండకావ్యాలు సమకాలీన రచనలకు భిన్నమైన విశిష్టత కలవి.
- వీరి ముక్తక కవితలు పదికి లోపే ఉన్నా అవి భవ్యమైన కల్పనలూ, ప్రాంతీయ అస్తిత్వ శోభితాలు, తెలుగు నుడికారానికి ఆటపట్టులు.
- అనంతకృష్ణలవారి అనువాద రచనలు మూల వైశిష్ట్యాన్ని తెలియజేస్తూ సహజ సందర శైలిలో వెలువడ్డాయి.
- శర్మగారి విమర్శా గ్రంథాలూ, పీఠికలు ఆయా ప్రక్రియల్లో గొప్పవిగా రూపొందాయి.
- రాళ్ళపల్లివారి రచనల పూర్వాపరాల్నీ సంక్షిప్తంగా, లోతుగా, తులనాత్మకంగా ఈ అధ్యాయంలో పరిశీలించడం జరిగింది.

రాబోయే అధ్యాయంలో వ్యాసకర్తగా రాళ్ళపల్లివారి ప్రస్థానాన్ని పరిచయం చేసుకుందాం.



# మూడవ అధ్యాయం

## వ్యాసకర్తగా రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

## మూడవ అధ్యాయం

# వ్యాసకర్తగా రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ రచనా వ్యాసంగం ఎంతో విస్తృతమైంది. తెలుగు సాహిత్య ప్రపంచంలో వీరి వ్యాసాలకు అద్వితీయమైన స్థానం ఉంది. ఈయన వ్యాసరచనకు ఎన్నుకొనే అంశాలు ఎంతో వైవిధ్యంతో కూడి ఉంటాయి. శర్మగారు వ్యాసం రాయడానికి ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. ఉన్న ఆధారాలను బట్టి చెప్పాల్సిన విషయాల్ని స్పష్టంగా వెల్లడిస్తారు. వీటిని చదివిన సహృదయ పాఠకులు శర్మగారిని వేనోళ్ళ ప్రశంసించారు. ఈ విషయాలన్నీ గత అధ్యాయాల్లో స్థూలంగా తెలుసుకున్నాం. ఈ అధ్యాయంలో రాళ్ళపల్లి వారి వచన రచనల్లో వ్యాసాల గురించి విశ్లేషించుకుందాం. అయితే వీరి వ్యాసాల్లోని ప్రత్యేకతల్ని తెలుసుకునే ముందు తెలుగులో వ్యాసం నిర్వచనాలను, లక్షణాలను, దాని రకాలను స్థూలంగా పరిశీలించుకోవాలి. ఇప్పటివరకు వ్యాసాన్ని చాలా మంది చాలా రకాలుగా నిర్వచించి, లక్షణీకరించే ప్రయత్నం చేశారు. కాబట్టి వాటిని తెలుసుకున్న తదనంతరం శర్మగారి వ్యాస రచనా వైశిష్ట్యాన్ని సోదాహరణంగా పరిశీలించడం జరుగుతుంది.

### 3. 0. వ్యాసం – నిర్వచనాలు

'వ్యాసం' అనేది ఆంగ్లం నుంచి తెలుగులోకి దిగుమతి అయిన ప్రక్రియ. ఈ 'వ్యాస' శబ్దానికి ఇంగ్లీషు, తెలుగు భాషల్లో ఆయా విద్వాంసులిచ్చిన నిర్వచనాలు కింది విధంగా చూడవచ్చు.

### i. ఇంగ్లీషు నిర్వచనాలు

1. *"As a form of literature the essay is a composition of moderate length, usually in prose, which deals in an essay, cursory way with a subject, and in strictness, with that subject only as it affects the writer"*[1]

   (ఒక విషయం గురించి స్థూలంగా కానీ, సూక్ష్మంగా కానీ, తగిన పరిమితిలో పరిశీలనాత్మక దృష్టితో రాయబడ్డ వచన రచన వ్యాసం.)

[1] Essay & Essayists – En Britannica. VOL NO:8, P. 716.

2. *"Any relatively brief literary composition on a restricted topic. It is one of the principal division of literature along with poetry, drama and fiction."*[2]

(ఒక నిర్దిష్టమైన విషయం గురించి సాధ్యమైనంత సంక్షిప్తంగా రాయబడ్డ ప్రక్రియ వ్యాసం. కవిత్వం, నాటకం, కథా సాహిత్యంలాంటిదే ఇది కూడా ప్రధానమైన సాహిత్య ప్రక్రియ.)

## ii. తెలుగు నిర్వచనాలు

1. *"ఏ విషయములనైన తెలుసుకొని, దానియందలి అంశములను విభజించి, వివరించి చెప్పుట వ్యాసమని చెప్పవచ్చు."*[3]
2. *"తాను చెప్పదలచిన విషయాలను గురించిన సంపూర్ణ పరిజ్ఞానము కలిగి, చెప్పదగిన పరిమితినెరిగి, చెప్పగలిగిన భాషాధికారముండి, తనవలెనే నేతృత్వముగల సభ్యుల ఆమోదమును పొందగల ప్రసంగమును చేసినవాడే వక్త అనిపించు కొనును. అట్టిగుణ సంపద కలిగిన యుపన్యాసకుడు సభ్యులు తన యెదుట లేకున్నను ఉన్నట్లే భావించుకొని, వ్యాసమునే ఉపన్యాసముగా తలపోయుచు వ్రాయ గలిగినప్పుడు సాహిత్య ప్రియులు పఠింపదగిన వ్యాసము నిర్వహించబడును."*[4]
3. *"ఏదో ఒక విషయాన్ని ఎన్నుకొని దాని చర్చించడమో దానికి సంబంధించిన ఒక కొత్త కోణాన్ని పరిచయం చేయడమో ఒక కొత్త వాదనని లేవనెత్తడమో చేస్తూ వచనంలో సాగే ప్రక్రియ."*[5] వ్యాసమని నిర్వచించబడ్డాయి.

పై పండితులిచ్చిన నిర్వచనాలను గమనించిన తర్వాత 'వ్యాస' శబ్దాన్ని ఈ విధంగా రాసుకోవచ్చు. ఒక విషయాన్ని వివిధ కోణాల్లో నిశితంగా పరిశీలించి, సంక్షిప్తంగా, ఒక క్రమపద్ధతిలో

## 3.1. వ్యాసం – లక్షణాలు

వ్యాసాన్ని కొలకలూరి ఇనాక్ తమ సిద్ధాంత గ్రంథంలో ఈ విధంగా లక్షణీకరించారు. *"వ్యాసంలో వచనత్వం, అవిశాలత్వం, విశృంఖలత్వం, మిత్రత్వం, హాస్యత్వం, సృజనత్వం, అసంపూర్ణత్వం, వ్యక్తిత్వం, ప్రధానం లక్షణాలుగా స్వీకరించవచ్చు. ఇందులో కొన్ని లక్షణాలు లోపించినా ఆ రచన వ్యాసమవుతుంది."*[6]
విమర్శకులు వ్యాసానికి చెప్పిన లక్షణాలు[7] కింది విధంగా ఉన్నాయి.

---

[2] The Encyclopeadia Americana. VOL. NO. 10, P. 589.

[3] విజ్ఞాన సర్వస్వము. పుట. 468.

[4] సాహిత్య శిల్ప సమీక్ష. పుట. 182–183.

[5] తెలుగు సాహిత్య విమర్శదర్శనం. పుట. 1054.

[6] తెలుగు వ్యాస పరిణామం. పుట. 99.

[7] తెలుగు సాహిత్య విమర్శదర్శనం. పుట. 1054.

1. *విషయ ప్రధానమై ఉండడం.*
2. *సంక్షిప్తంగానూ, అదే సమయంలో సమగ్రంగానూ ఉండడం.*
3. *విషయ ప్రాధాన్యతనూ, వాటి మధ్య సంబంధాలని బట్టి విషయాలు ఒక క్రమంలో ఉండడం.*
4. *ఏదో ఒక విషయాన్ని చెప్పేదిగా ఉండడం.*

### 3.1.1. వ్యాసం – భేదాలు

విషయ ప్రాధాన్యాన్ని బట్టి వ్యాసాన్ని కింది విధాలుగా వర్గీకరించవచ్చును. సాహిత్య వ్యాసాలు, కళా సాంస్కృతిక వ్యాసాలు, భాషా వ్యాకరణ వ్యాసాలు, సాంఘిక వ్యాసాలు, చారిత్రక వ్యాసాలు, రాజకీయ వ్యాసాలు, వైజ్ఞానిక వ్యాసాలు మొదలైనవి.

రాళ్ళపల్లి వారు సాహిత్య, సంగీత సంబంధమైన వ్యాసాలు రాసిన వాళ్ళలో ప్రముఖులు. వీరి వ్యాసంగం 1912 నుండి 1977 వరకూ కొనసాగింది. శర్మగారు సాహిత్యం, సంగీత వ్యాసాలను ఆధారంగా చేసుకొని పైన తెలిపిన అనేక రకాల అంశాలను ఆయా వ్యాసాల్లో స్పృశించే ప్రయత్నం చేశారు. ఈ విషయాలు రెండవ అధ్యాయంలో సూచనా మాత్రంగా పరిచయం చేసుకున్నాం.

## 3.2. సాహిత్య వ్యాసం – కొందరు వ్యాసకర్తలు

తెలుగు సాహిత్య వ్యాసానికి ఒక ప్రత్యేకత ఉందన్న విషయం విదితమే. సాహిత్యంలో ఏదైన ఒక రంగాన్ని ఎన్నుకొని అందులో ఏదో ఒక అంశాన్నీ, లేదా అనేక అంశాల్ని చర్చించడం పరిపాటి. ఈ క్రమంలో సాహిత్య వ్యాసం వివిధ కోణాల్లో రూపొందుతుంది. ఇలాంటి వైవిధ్య భరితమైన లక్షణాలతో సాహిత్య వ్యాసం కొనసాగుతుంది. మన తెలుగు సాహిత్యంలో విశిష్టమైన వ్యాసాలు రాసినవారిలో ప్రధానంగా మానవల్లి రామకృష్ణ కవి, చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి, కట్టమంచి రామలింగారెడ్డి, కొమఱ్ఱాజు లక్ష్మణరావు, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, పింగళి లక్ష్మీకాంతం మొదలైన వారు పేర్కొనదగినవారు. ఆనాడు వీరు రాసిన వ్యాసాలు సాహిత్యానికి ఎంతో మేలు చేకూర్చడమే కాకుండా దారి దీపాలుగా నిలిచాయి.

ముఖ్యంగా కట్టమంచి రామలింగారెడ్డి, పింగళి లక్ష్మీకాంతం వంటి ఉద్దండ పండితులు సాహిత్య కృషి చేస్తున్నప్పుడు రాళ్ళపల్లి వారు కూడా ఆ పనిలో నిమగ్నమై ఉన్నారు. కాబట్టి ఈ సమకాలీనుల వ్యాస విధానాలను, భాషా శైలులను సోదాహరణంగా తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని భావించి కింది వివరాలు పొందుపరచడం జరుగుతుంది.

### 3.2.1. కట్టమంచి రామలింగారెడ్డి

కట్టమంచి రామలింగారెడ్డి తెలుగు సాహిత్య విమర్శను మలుపు తిప్పిన సుప్రసిద్ధ విమర్శకులు. ఈయన సృజనాత్మక రచనలు రాయడంతో పాటు గొప్ప విమర్శ రచనలు కూడా

వెలువరించారు. ప్రత్యేకించి ఈయన రాసిన విమర్శ *'వ్యాస మంజరి'* (1947), *'పంచమి'* (1954) గ్రంథాలలో సంకలింపబడ్డాయి. *'వ్యాస మంజరి'* లో పూర్వ కవి ఖండము, అభి జన ఖండము, భాషా ఖండము, ఆధునిక కవితా ఖండము, సాంఘిక ఖండము అను ఐదు భాగాలున్నాయి. *'పంచమి'* లో రంగనాథరామాయణం, ప్రాచీనము –వికృతులు, ద్రౌపది–సీత, అవాల్మీకములు, భాసుఁడు  అనే వ్యాసాలున్నాయి. ఈ రెండు పుస్తకాలను లోతుగా పరిశీలిస్తే ప్రాచీన సాహిత్య విశేషాలు కొద్ది వరకు బోధపడతాయి. అంతేకాదు రెడ్డిగారి జీవిత విశేషాలు, వారు చేసిన సాహిత్య కృషి కూడా అవగతమవుతుంది. వీరి వ్యాసాలు పాశ్చాత్య పద్ధతుల్లో ఉండటం ఒక విశేషం. కాగా వీరి వ్యాసాల్లో భావము, వస్తువు, రచనలు ప్రత్యేక అంశాలతో కూడి ఉండడం గమనార్హం. కట్టమంచివారి వ్యాసాలపై కొందరు పరిశోధకులు వెల్లడించిన అభిప్రాయాలను పరిశీలిస్తే, వారి వ్యాస రచనా విధానం సుస్పష్టంగా తెలుస్తుంది.

'కట్టమంచి వారి వైలక్ష్యణ్యం' అను వ్యాసంలో రాళ్ళపల్లి వారు చెప్పిన ఈ మాటలు రెడ్డిగారి ప్రతిభా పాటవాలకు అద్దంపట్టే విగా ఉన్నాయి. *''ఉజ్జ్వలమైన సర్వంకషమైన ప్రతిభ, అసాధారణమైన తర్క కౌశలం, ఎదుటి వారిని నోరు మూయించే వాగ్మిత, వశీకరించే హాస్య చాతుర్యం, గంభీరమైన రసభావానుభవశక్తి – ఇవి ఆయనకు ఆజన్మసిద్ధమై వచ్చిన వరప్రసాదాలు.''*[8] చీమకుర్తి శేషగిరిరావు కట్టమంచివారి వ్యాసరచనా వైశిష్ట్యాన్ని ఇలా అభివర్ణించారు. *'అతని భాష తేటతెల్లము; నుడికారమును బిగు మానమును దాని ప్రత్యేక లక్షణములు వాక్యములు ఆశుగములవలె తీక్షణములు; శైలి పటిష్టము.''*[9] రామలింగారెడ్డి వ్యాస మంజరికి ముందుమాట రాసిన పింగళి లక్ష్మీకాంతం *''ఈయన వ్యాసములలో అర్థమెంత గంభీరముగా నుండునో, శైలి అంత సురుచిరముగా నుండును.''* [10] అని చెప్పడమే కాకుండా నూతన పదాలను సృష్టించటం, అన్యదేశ్య పదాలను వాడటం, వాటి పూర్వాపరాలను దృష్టిలో ఉంచుకోవటం లాంటివి కట్టమంచివారికి వెన్నతో పెట్టిన విద్యలాంటిదని ప్రశంసించారు. 'విమర్శ రంగంలో ఆధునిక తెలుగు భాషా వికాసం పారిభాషిక పదజాలం' అనే వ్యాసంలో ప్రముఖ విమర్శకులు  దార్ల వెంకటేశ్వరరావు కట్టమంచి వారి భాషను ఇలా అభివర్ణించారు. *'తెలుగులో ఆధునిక విమర్శ సి. ఆర్. రెడ్డితోనే ప్రారంభమైందని కొంతమంది పరిశోధకులు అంటున్నా, ఆయన భాష విషయంలో గ్రాంథికాన్నే ఆశ్రయించారు.''*[11]

ఉదాహరణకు దువ్వూరి రామిరెడ్డివారి *'కృషీవలుడు'* కావ్యానికి కట్టమంచి వారి ముందుమాటల్లో రెడ్డిగారి వ్యాసరచనా శైలి ఎలా ఉందో కొన్ని వాక్యాలు చూడండి. *'ఆంధ్ర వాఙ్మయమునఁ బ్రకృతము ప్రసిద్ధికి వచ్చుచుండెడు గణ్యములగు నూతన సృష్టులలో నీ కావ్య మొకటి. విషయమందును భావము లందును నిధి మన దేశముయొక్క*

---

[8] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 173.

[9] తెలుగు విజ్ఞాన సర్వస్వము. పుట. 534.

[10] గౌతమ వ్యాసాలు. పుట. 104.

[11] బహుజన సాహిత్య దృక్పథం. పుట. 162.

*నవజీవితమునకుంజేరినది. అచ్చటచ్చట. శైలియందును దూరోపములు మొదలగు నలంకారముల యందును బ్రాచీన వాసన యింకను గొంత వదల వలపి యున్నటుల తోచెడిని.''*[12] ఈ విధంగా రెడ్డిగారి వ్యాసరచనా శైలి గ్రాంథికాన్నే అనుసరించిందన్న అభిప్రాయాలు ఆమోదమైనవిగా తోస్తాయనవచ్చు.

## 3.2.2. పింగళి లక్ష్మీకాంతం

కవిగా, విమర్శకుడుగా, పరిశోధకులుగా, సాహిత్యాచార్యుడుగా పేరు మోసిన పింగళి లక్ష్మీకాంతం కలం నుండి వెలువడ్డ వ్యాస సంకలనాలు *'గౌతమ వ్యాసములు'* (1989), *'నా రేడియో ప్రసంగములు'* (1954 నుండి 1961 మధ్య కాలంలో ఇచ్చిన రేడియో ప్రసంగాలు) ప్రసిద్ధమైనవి. ఈ గ్రంథాల్లోని వ్యాసాలను నిశితంగా పరిశీలిస్తే వీరి భాషా శైలి, వ్యాసరచనా పద్ధతులు బోధపడతాయి. ముఖ్యంగా *'గౌతమ వ్యాసములు'* గ్రంథంలో *ఆంధ్ర వాఙ్మయ స్థూల రూపము, ఆంధ్ర నాటక కళా పరిషత్తు: అధ్యక్షోపన్యాసము, ద్విపద భారతము, రంగనాథ రామాయణము, మాని కొండ రామాయణము, వ్యాసమంజరి, ముసలమ్మ మరణము– ఇత్యాదులు, ప్రభావతీ ప్రద్యుమ్నము – దాని మూలములు, పల్నాటి వీర చరిత్ర* అనే తొమ్మిది వ్యాసాలున్నాయి.

అలాగే *'నా రేడియో ప్రసంగములు'* లో కూడా తొమ్మిది భిన్న విషయాలకు చెందిన వ్యాసాలున్నాయి. వాటిలో నాలుగు సంస్కృత సాహిత్యం పై వచ్చిన వ్యాసాలు, రెండు తెలుగు సాహిత్యానికి చెందిన వ్యాసాలు మిగతా మూడు అలంకార శాస్త్రానికి సంబంధించినవి. ఇవి ఎక్కువగా సరళ గ్రాంథిక భాషలోనే రాయబడ్డాయి. ఉదాహరణకు కట్టమంచివారి వ్యాస మంజరికి రాసిన ముందుమాటలో లక్ష్మీకాంతంగారి భాషను పరిశీలించండి. *''ఆధునిక కవిత్వములోనైనను, సరసతతోపాటు నియబద్ధత కలదానినే ఈయన కొనియాడును గాని, విశృంఖల విహార మొనర్చుదానిని మెచ్చడు. సముచిత నియమపరిపాలనము నిరర్థక బంధ విచ్ఛేదము, ఆ స్వతంత్రతా తిరస్కారము ఇవియే ఈయన పదింపదిగా సాంఘికాచార విషయమునను, కావ్య మర్యాధవిషయమునను బోధించు ధర్మములు. ఈయన యుపన్యాసములలో వ్యాసములలో, ఈ ధర్మత్రయమే యాత్మగా భాసించుచుండును.''* [13] ఈ విధంగా వీరి వ్యాసరచన శైలి నిర్మితమైంది.

పలువురు ప్రముఖులు పింగళి లక్ష్మీకాంతం భాషను పురస్కరించుకొని అన్న మాటలు ఈ సందర్భంగా పరిశీలించదగినవి. నాగళ్ళ గురు ప్రసాదరావు *''లక్ష్మీకాంతము పరిపక్వత కాంచిన వచన రచయిత. ధారాళమైన గమనము. సమత, స్పష్టత, ఔచిత్య మెరిగి పద ప్రయోగము మున్నగు గుణములతో అతని గ్రాంథిక వ్యావహారిక వచన రచనలు సుందరముగా ఉండును.''*[14] అని అన్నారు. తర్వాత *'నా రేడియో ప్రసంగములు'* అనే పుస్తకాన్ని సమీక్షించిన

---

[12]సి. ఆర్. రెడ్డి పీఠికలు. పుట. 159.

[13] గౌతమ వ్యాసములు. పుట. 104.

[14] తెలుగు విజ్ఞాన సర్వస్వము. పుట. 558.

రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు *''ఈ వ్యాసాల్లో వాక్యాలన్నీ సరళంగా ఉన్నాయి. నెమ్మదిగా నడుస్తాయి. ఒక స్పష్ట చిత్తుడైన ఆచార్యుడు చెప్పినట్టుంటాయి. కాని ఉద్విగ్న హృదయుడైన రచయిత రాసినట్టు ఉండవు. రాసే విషయం పట్ల ఖచ్చితమైన అవగాహన, అధికారమూ ఉన్న రచయిత రాస్తేనే విషయ సేకరణ ఇలా ఉంటుంది.''* [15]అని అభిప్రాయపడ్డారు. 'పరిశోధకుడుగా పింగళి లక్ష్మీకాంతం' అనే వ్యాసంలో దార్ల వెంకటేశ్వరరావు లక్ష్మీకాంతంగారి భాషా శైలి గురించి అంచనా వేసిన క్రమం ఈ విధంగా ఉంది. *''ప్రశ్న సమాధానాల రూపంలో ఉండటం, కథనాత్మక పద్ధతిలో సంభాషణగా కూడా ఉండటం వంటి ప్రయోగాలు అక్కడక్కడ కనిపిస్తున్నాయి. సంస్కృత ప్రభావం వల్ల యత్తదర్థక ప్రయోగాలు విరివిగానే ఉన్నాయి.''*[16]

పై అభిప్రాయాలను వల్ల పింగళి లక్ష్మీకాంతం వ్యాసాలు వస్తువు కేంద్రంగా, లోతైన విశ్లేషణ కలిగి, పటిష్టమైన భాష, స్పష్టమైన శైలితో కూడి సాధికారంగా ఉంటాయని తెలుస్తున్నది.

### 3.2.3. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

ప్రముఖ వ్యాసకర్త, విమర్శకులైన రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ వ్యాస రచనా వాఙ్మయం విస్తృతమైంది. ఇప్పటికి వీరి కలం నుండి వెలువడిన వ్యాసాలు నాలుగు గ్రంథాల ద్వారా అందుబాటులో ఉన్నాయి. అవి: *వేమన* (1929), *నాటకోపన్యాసములు* (1935), *సారస్వతాలోకము* (1954), *రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు* (2017). అనేవి ప్రధానంగా పేర్కొనదగినవి. రాళ్ళపల్లి వారి వ్యాసాలు ఎంతో పరిశోధనాత్మకంగా ఉంటాయి. గొప్ప ఆలోచనాత్మక ధోరణితో వీరి వ్యాస వాఙ్మయం కొనసాగడం విశేషం. కొలకలూరి ఇనాక్ తమ సిద్ధాంత గ్రంథంలో శర్మగారి వ్యాస వాఙ్మయంపై చెప్పిన మాటలు గమనించండి. *''వ్యాస వస్తువును స్పష్టంగా ఆలోచించి, హేతుబద్ధమైన క్రమంతో విభజించి, ఒక్కొక్క విషయం గ్రహించి, ఉప పత్తులతో పెంచి, ఉత్తమ శైలిలో అక్షర రూపం అనుగ్రహించి, భాష గ్రాంథిక వ్యావహారికాలలో ఏదయినా, వాగ్వ్యహారానికి దగ్గరగా ఉన్న పలుకుబడితో సజీవాంధ్రంలో వ్యాసం రూపొందించుటం రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ సాహితీ దక్షతను చాటుతుంది.''*[17] అని అన్నారు.

*''రాళ్ళపల్లి వారి వచనంలో హృద్య శైలి, కావ్య రామణీయకం అనే రెండు రీతులు ముచ్చటగా కలిసిపోయి ఉంటాయ''ని.''*[18] గంగి శెట్టి లక్ష్మీనారాయణ తమ 'అనంత చాంద్రీమయ కీర్తి రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ' అనే వ్యాసంలో అన్నారు. ఘట్టమరాజు 'గోరంత దీపం' అనే ఉపోద్ఘాతం వ్యాసంలో *''శర్మగారు వ్యాస రచనలకు అంశాన్ని ఎన్నుకొనేటప్పుడు చూపే శ్రద్ధాసక్తులు, విషయాన్ని వింగడించేటప్పుడు కనపరిచే తార్కికత,*

[15] రసజ్ఞశిల్పి. పుట: 136.
[16] వీచిక. పుట. 121.
[17] తెలుగు వ్యాస పరిణామం. పుట. 196.
[18] ఆధునికత – సమకాలికత. పుట. 115.

*వ్యాసాంశాన్ని మెల్లమెల్లగా విస్తరిస్తూ పోయేటప్పుడు ప్రదర్శించే విజ్ఞత, రసికత, సుకుమార హాస్యం, తీక్షణమైన వ్యంగ్యం పఠితుల్ని మంత్ర ముగ్ధుల్ని చేస్తాయి.''*[19] యని స్పష్టంగా చెప్పారు. ఈ విధంగా శర్మగారి వ్యాస వాఙ్మయ లక్షణాల్ని విమర్శకులు ఆయా సందర్భాల్లో అంచనా వేసే ప్రయత్నం చేశారు. శర్మగారి వ్యాస రచనా శైలిని సోదాహరణంగా పరిశీలించడం ద్వారా ఆయా వివరాలు మరింత అవగాహనకు వస్తాయి.

ఈ విధంగా ప్రాచీన తెలుగు కావ్యాలపై కట్టమంచి రామలింగారెడ్డి, పింగళి లక్ష్మీకాంతం, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మలు విరివిగా వ్యాసాలు రాశారు. ఈ ముగ్గురూ అందించిన సాహిత్య సంపద మరిచిపోలేనిది. వ్యాసం రాయడానికి ఎన్నుకొనే అంశం నుంచి దాన్ని వింగడిస్తూ, విశ్లేషించే పద్ధతి వరకూ వెరసి భాషా శైలిలలో వీరు తమ విలక్షణతను చాటుకొన్నారు. కట్టమంచి, పింగళి వార్లు చివరకు గ్రాంథిక భాషలోనే తమ వ్యాసంగాన్ని కొనసాగించారు. అయితే రాళ్ళపల్లి వారు ప్రారంభంలో గ్రాంథిక భాషను వాడినా క్రమేణా శిష్టవ్యావహారికాన్ని ప్రయోగిస్తూ, రానురాను రాయలసీమ మాండలిక భాషలోనే తమ వ్యాసాలను వెలువరించిన విధానం కనబడుతుంది. దీన్ని సోపపత్తికంగా శర్మగారి భాషా శైలిలో ప్రత్యేకంగా పరిశీలించబడుతుంది.

## 3.3. రాళ్ళపల్లి వారి వ్యాస రచనా ప్రత్యేకతలు

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ రాసిన వ్యాసాలు నాలుగు గ్రంథాల్లో సంకలింపబడ్డాయన్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా ఈయన రాసిన వ్యాసాల్ని చదివిన వారికి విసుగురాకుండా ఉంటుంది. ఇది వీరి వ్యాసాల్లో ఒక ప్రత్యేక లక్షణంగా కనబడుతుంది. ఈయన వ్యాసాన్ని రాయడానికి ఎన్నుకొనే వస్తువు, పాటించే పద్ధతులు ప్రత్యేకమైనవి. శర్మగారు వ్యాసాన్ని ఎంతో కళాత్మకంగా నిర్వహించగల శక్తి సామర్థ్యాలు కలిగి వారు. వీరి వ్యాసాలను ఆది, మధ్య, అంతాలుగా విభజించి పరిశీలిస్తే, కొన్ని విశిష్టతలు తెలుస్తాయి. రాళ్ళపల్లి వారి వ్యాసాలను ఘట్టమరాజు లోతుగా పరిశీలించి చెప్పిన మాటలు *''రాళ్ళపల్లి వారు వ్యాసం ఆది మధ్య భాగాల్ని ఎంతో నేర్పుగా నిర్వహించడం ఒక ఎత్తై తే, అంత్య భాగాన్ని కొండంత ఓర్పుగా నడపడం మరో ఎత్తు.''*[20] ఈ క్రమంలో పరిశీలన కొనసాగించటం వల్ల కొన్ని లక్షణాలు బయటికి వచ్చే అవకాశం ఉందని భావించి ఈ ప్రయత్నం చేయడం జరుగుతుంది. రాళ్ళపల్లి వారి వ్యాసాలను నిశితంగా పరిశీలించిన తర్వాత వారు ఈ వ్యాస ప్రారంభం ఏ విధంగా ఉంటుందన్న దాన్ని పరిశీలించాలనిపించింది. ఆయా వ్యాసాల్లో ప్రారంభాన్ని గమనించిన తర్వాత శర్మగారి వ్యాస ప్రారంభాన్ని కొన్ని శీర్షికలుగా విభజించుకోవచ్చు అని అనిపించింది. ఈ విభజన కింది చూడండి.

**1.** ఆధార గ్రంథాలతో ప్రారంభించడం.

---

[19] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 6.

[20] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 6.

**2.** విశిష్ట లక్షణాలతో మొదలు పెట్టడం.

**3.** నేరుగా విషయ ప్రవేశం చేయటం.

**4.** తులనాత్మకంగా ప్రారంభించడం.

**5.** సమకాలీన సాంస్కృతికా శాలతో ప్రారంభించడం.

పై భేదాలను ఒక్కొక్క దాన్ని విడిగా పరిశీలిస్తే ఆయా ప్రత్యేకతలు స్పష్టమవుతాయి.

### 3.3.1. వ్యాసంలో ఆది భాగం

శర్మగారు వ్యాసాలను ప్రారంభించటాన్ని ఆది భాగంగా తీసుకొని, కొన్ని వ్యాసాల్ని ఇక్కడ పరిశీలించడం జరుగుతుంది. అసలు ఈయన వ్యాసాన్ని మొదలుపెట్టే పద్ధతి ఎలా ఉంటుందో దీని ద్వారా సోదాహరణంగా అవగతం అవుతుంది.

### 3.3.1.1. ఆధార గ్రంథాలతో వ్యాసాన్ని ప్రారంభించడం

'రాయలనాటి రసికత, తిక్కన తీర్చిన సీతమ్మ' అనే వ్యాసాలు ఈ విభాగం కిందికి వస్తాయి. శర్మగారు 'రాయల నాటి రసికత' లో ప్రబంధ కాలం నాటి ప్రజల రసిక జీవనాన్ని తెలపడానికి మూడు గ్రంథాలను ఆధారంగా తీసుకొని వ్యాసాన్ని ప్రారంభించిన విధానం ఇలా...''*రాయలకాలపు జనుల జీవితమును సాక్షాత్తుగా తెల్పుగ్రంథము లేవియు లేవనుట యందరు ఎరిగిన విషయమే. పరంపరగా ఆ విషయమును స్పృశించు గ్రంథము లనేకములు గలవు. వానిలో ముఖ్యమైనవి మూడు; 'ఆముక్తమాల్యద, మనుచరిత్రము, పారిజాతాపహరణము.'* [21] అని ఆయా పుస్తకాలను ప్రస్తావిస్తూ వ్యాసాన్ని మొదలు పెట్టారు. కాగా 'తిక్కన తీర్చిన సీతమ్మ' అనే వ్యాసాన్ని కూడా వాల్మీకి, వ్యాసులు రాసిన *'రామాయణము'* , *'భారతము'*లనే ఉద్గ్రంథాలను పేర్కొని ''*ఒక విధంగా చూస్తే తిక్కనగారి రచనలో పాత్రపోషణమనే కావ్య ధర్మాన్ని విమర్శించడం న్యాయం కాదనిపించును. ఎందుకంటే: ఆయన రచించిన 'ఉత్తర రామాయణం', భారతము' రెండు ఎరువు సొత్తులే. అందలి పాత్రలన్నీ వాల్మీకి, వ్యాసుల కైవాడపు తీర్పులు; ఒక్కటైనా తిక్కన క్రొత్తగా సృష్టించలేదు.''*[22] అని అంటూ, వ్యాసంలోకి ప్రవేశించారు. ఇలా ఆధార గ్రంథాలను ముందుగా ప్రస్తావించి వ్యాసాల్ని రాయటం శర్మగారి వ్యాసాల్లో ఒక పద్ధతిగా కనబడుతుంది.

### 3.3.1.2. విశిష్ట లక్షణాలతో వ్యాసాన్ని ప్రారంభించడం

రాళ్ళపల్లి వారి వ్యాసాల్లో ఇది ఒక ప్రత్యేకమైన పద్ధతి అనవచ్చు. ఇందులోకి 'త్యాగయ్యగారి నాద సుధా రసం' అనే వ్యాసం వస్తుంది. త్యాగయ్య రాసిన కీర్తనల్లో రామ భక్తి, కవిత, గానమనే మూడు తత్త్వాలు త్రివేణి సంగమంగా విలసిల్లాయని వ్యాసకర్త భావించిన క్రమం వ్యాసం మొదట్లోనే కనిపిస్తుంది. కాబట్టి విశిష్టమైన లక్షణాలను ఇక్కడ గుర్తుచేశారని

---

[21] సారస్వతాలోకము. పుట. 1.

[22] సారస్వతాలోకము. పుట: 118.

అనిపించింది. ఆ వాక్యాల్నీ శర్మగారి మాటల్లోనే '' *త్యాగయ్యగారు ప్రపంచానికి ప్రసాదించిన వరం గంగానది వలె మూడు మార్గాలతో ప్రవహించింది. శ్రీరామ భక్తి, కవిత, గానం ఈ మూడు తత్త్వాలున్ను పూర్వ జ్ఞానార్జితమైన పుణ్యము చేతనే తప్ప మనుష్య ప్రయత్నంతో గాని ఆకస్మికంగా కాని లభించేవి కానంత గొప్పతనంతో ఇంచు మించుగా ఉన్నాయి. అయినా వంశ పరంగా ఇంటి సొత్తుగా కూడా ఆయన పాలికి దొరికినవి చెప్పటానికి కావలసినంత సాక్ష్యం ఉన్న''*[23] దని వ్యాసంలోకి వెళ్లడం జరిగింది.

### 3.3.1.3. నేరుగా విషయంతో వ్యాసాన్ని ప్రారంభించడం

'*నాటకోపన్యాసములు*' (1935) గ్రంథంలోని తొలి వ్యాసం, '*వేమన*' (1929) లోని మొదటి ఉపన్యాసమైన 'ఉపోద్ఘాతము' అనేవి ఈ విభాగంలోకి తీసుకోవచ్చు. '*నాటకోపన్యాసములు*' లో ముప్పై ఐదు పుటలు గల మొదటిది నాటక ప్రక్రియ విధివిధానాల సమూలంగా చర్చించించిన వ్యాసం. ఆయా అంశాలను చెప్పటానికి రాళ్ళపల్లి వారు ఎటువంటి చర్చలు చేయకుండా నేరుగా విషయంలోకి ప్రవేశించారు. ఉదాహరణకు ''కావ్యేషు *నాటకం రమ్యమ్'' అని మన పెద్దలు తలంచిరి అందుకు తగినట్లు సాహిత్యమును నాటకములు చదువుట పరమావధిగా భావించారు.''*[24] అనే మాటతో వ్యాసాన్ని ప్రారంభించారు శర్మగారు. వేమన గ్రంథం మొదటి ఉపన్యాసము 'ఉపోద్ఘాతము' లో కూడా ''*వేమన ఆంధ్రులలో సాటిలేని వ్యక్తి. అతీంద్రియములైన తత్త్వములను దెలిసికోవలెనను నాశ, వాని ననుభవ పూర్వకముగా సాధించు సాహసము. తనకుఁ దెలిసిన దానిని నిర్భయముగా ప్రపంచమునకు బోధించు ధైర్యము, దానికి సాధనమైన యిరుప్రక్కలందును మఱుఁగులేని మంచి పదునుగల చురకత్తి వంటి కవితా శక్తి, దానికి మెఱుఁగిచ్చునట్టి సంకేత దూషితము కాని ప్రపంచ వ్యవహారములందలి సూక్ష్మ దృష్టి, గాయపు మందు కత్తికేసి కొట్టినట్లు తిట్టుచూనే నవ్వించే 'హాస్యకుశలత' ఇలన్నియూ వేమన్నను సృష్టి చేయునప్పుడు బ్రహ్మదేవుఁడు ప్రయోగించిన మూల ద్రవ్యములు.''*[25] అంటూ నేరుగా విషయంలోకి వెళ్ళారు.

ఇంకొక వ్యాసంలో ''*భారతదేశమందు సంగీత కళ పరమ ప్రాచీనమైన వానిలో నొకటి. పదమూడవ క్రీస్తు శతాబ్దము మొదటిలో నుండిన నిశంక శార్ఙ్గదేవుడు ప్రాచీన సంగీత మతప్రవక్తులని పార్వతీ పరమేశ్వరులాదిగా ముప్పది తొమ్మిది మందిని పేర్కొని 'అన్యేబహవః పూర్వే' అని చెప్పినాడు.''*[26] అంటూ '*సంగీత రత్నాకరము*' అనే గ్రంథంలోని మాటలను ఉటంకిస్తూ, నేరుగా విషయంలోకి ప్రవేశించారు. 'అన్నమాచార్యునికవిత', 'కట్టమంచి వారి వైలక్షణ్యం' వ్యాసాలు కూడా నేరుగా ప్రారంభమవుతాయి. శర్మగారి వ్యాస రచనా వైశిష్ట్యానికి ఇదొక విశిష్టతను చేకుర్చే విషయమని అభివర్ణించవచ్చు.

---

[23] సారస్వతాలోకము. పుట. 105.

[24] నాటకోపన్యాసములు. పుట. 2.

[25] వేమన. పుట. 3.

[26] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 350.

### 3.3.1.4. తులనాత్మకంగా వ్యాసాన్ని ప్రారంభించడం

ఈ విభాగంలోకి *'నాటకోపన్యాసములు'* లోని రెండవ వ్యాసం, *'రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు'* గ్రంథంలోని 'నిన్నటి సంగీతము: ఇరువురు – సంగీత కోవిదులు', 'సంగీత సాహిత్యాలు: అక్షర రమ్యత' అనే వ్యాసాలు వస్తాయి. శర్మగారు *''నాటకములు తెలుగులో వ్రాయుటకు పునాది వేసిన యగ్రేసరులలో కీర్తిశేషులగు ధర్మవరము రామ కృష్ణమాచార్యులును, కోలా చలము శ్రీనివాస రాయలును గణనీయులు.''*[27] అని *'నాటకోపన్యాసములు'* పుస్తకంలోని రెండో వ్యాసాన్ని మొదలు పెట్టారు. 'నిన్నటి సంగీతము – ఇరువురు సంగీత కోవిదులు' అనే వ్యాసంలో సంగీత గురువులైన వీణ శేషణ్ణ, బిడారం కృష్ణప్పలను పరిచయం చేస్తూ...*''నేనెఱిగిన సంగీత కోవిదులలో నెల్ల కీర్తిశేషులగు మైసూరు వీణశేషణ్ణ గారును, బిడారం కృష్ణప్పగారును మహాపురుషులు. వైణిక శిఖామణి యని వారును, గాన విశారదుడని వీరును బిరుదు గడించిన వారు.''*[28] అని శర్మగారు తులనాత్మకంగా వ్యాసాన్ని రచించటం జరిగింది. 'సంగీత సాహిత్యాలు: అక్షర రమ్యత' లో సంగీత, సాహిత్యాలకు గల తేడాలను గుర్తు చేయడానికి ఎంచుకున్న మార్గం ఎలా ఉందో శర్మగారి మాటల్లోనే గమనించండి *''సంగీతానికి, సాహిత్యానికి స్నేహమెంత ప్రాచీనమో స్పర్ధ గూడా అంతే ప్రాచీనం. ఈ రెండూ మొదటి నుంచీ ఒకటి కొకటి ఎంతో సహాయంగానే సంసారం చేస్తూ ఉండినా, ఒక దాన్ని మరొకటి అడగదొక్కవలెననే పోటీ ఎప్పుడూ మరచినట్లు కానరాదు.''*[29] ఇలా కొన్ని వ్యాసాలను రాళ్ళపల్లి వారు తులనాత్మక దృష్టితో వ్యాసాన్ని ప్రారంభించారు.

### 3.3.1.5. సమకాలీన సాంస్కృతికాంశాలతో ప్రారంభించటం

ఈ కోవలోకి 'వేమన కవిత్వము, హాస్యము, నీతులు', 'వేమన కాలమందలి మతధర్మాల స్థితి' అనే వ్యాసాల్ని గుర్తించడం జరిగింది. సంఘంలో సాధారణాంశాలైన సాంఘిక, రాజకీయ, మత విషయాలను స్థూలంగా గుర్తుచేస్తూ, వ్యాసంలోకి వెళ్ళిన సందర్భాలు శర్మగారు రాసిన కొన్ని వ్యాసాల్లో కనిపిస్తాయి. *''వేమనకు ఇంటి సంసారము నందు కలిగియుండ వచ్చునట్టి పరిణామములను కొన్ని యిదివరలో నూహించితిని దీనికన్నను పెద్ద సంసార మొకటున్నది. సంఘము, ఆలుమగలు కలహము, బిడ్డల నిష్ప్రయోజకత్వము, దారిద్ర్యము మొదలగున వెన్ని యుండినను వేమన వంటివాని యుక్కుమనసు అంతగా చెదరి యుండదు.''* [30] అని వ్యాసాన్ని ప్రారంభించారు. మరో వ్యాసమైన 'వేమన కవిత్వము, హాస్యము, నీతులు' అనేదాన్ని ప్రారంభించిన విధానం కూడా పై దానిలాగానే ''వేమన కవులని

---

[27] నాటకోపన్యాసములు. పుట: 36.

[28] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 315.

[29] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 328.

[30] వేమన. పుట. 72.

*పేరు సంపాదింపని కవులలోఁ జేరిన వాడని పేరు వచ్చుటకు రెండు హేతువులు: ప్రజయొక్క యభిరుచి నెఱిఁగి వారికి తృప్తిగా వ్రాసినవానికి వచ్చును; కవియొక్క గొప్పతనము నెఱుఁగఁగల ప్రజ యున్నను వచ్చును. వేమన విషయమం దీ రెండును లేకపోయినవి.''*[31] అని సమకాలీన సమాజ దుస్థితిని గుర్తు చేసిన వాక్యాలతో వ్యాసం వాఙ్మయంలోకి ప్రయాణించడం జరిగింది.

ఇలా విషయ ప్రాముఖ్యాన్ని బట్టి రాళ్ళపల్లి వారి వ్యాసాల ఆది భాగాన్ని నిర్మాణం చేసుకోవడాన్ని కొత్తదనంగా భావించవచ్చు.

### 3.3.2. వ్యాసంలో మధ్యభాగం

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ రాసిన వ్యాసాల్లో కొన్నిటిని ఎంపిక చేసుకొని ఆది భాగాన్ని పరిశీలించడం జరిగింది. ఇప్పుడు మధ్య భాగాన్ని పరామర్శించాలి. అన్నట్టుగా ఇక్కడ ఆది భాగానికి శీర్షికలు ఇచ్చినట్లు మధ్య భాగానికి ఇవ్వడానికి కుదరదు. ఎందుకంటే వ్యాసం మధ్య భాగమంతా విషయ గతంగా ఉంటుంది కాబట్టి. అందుకోసం ఆయా వ్యాసాల్లో మధ్య భాగాన్ని శర్మగారు ఎలా విస్తరించి రాశారనే అంశాలను మాత్రమే స్థూలంగా తెలుసుకోవడం జరుగుతుంది.

రాళ్ళపల్లి వారి కలం నుండి జాలువారిన రమణీయమైన వ్యాసం ***'రాయల నాటి రసికత'***. సుదీర్ఘమైన ఈ వ్యాసంలో మధ్యభాగం ఎంతో విస్తృతంగా నిర్మితమైంది. శర్మగారు ముందుగా 'రసికత' శబ్దాన్ని నిర్వచించి, ఆనాటి ప్రజలనుభవించిన భోగాలను కళ్ళకు కట్టినట్లు చిత్రించారు. ఈ భోగాలను ప్రవృత్తి, నివృత్తులని రెండు రకాలుగా విభజించారు కాగా పెద్దలు చెప్పిన ఇల్లు, వస్త్రము, ఆభరణము, గంధము, పుష్పము, తాంబూలము, శయ్య, స్త్రీ అనే ఎనిమిది ప్రవృత్తి భోగాలకు అన్న, పాన, స్నానాదులనే మూడు భోగాలను చేర్చి తమ పరిశోధన దృక్పథాన్ని చాటుకున్నారు. ఈ భోగాల అనుసరణలో ప్రాచీనులకు, ఆధునికులకు ఉన్న తారతమ్యాల్ని శర్మగారు తులనాత్మకంగా అధ్యయనం చేశారు.

ఆనాటి ప్రజలు ఇండ్లను ఆహ్లాదకరమైన ప్రదేశాల్లో కట్టుకోవడమే కాకుండా ఆయా ఋతువులకు అనుకూలంగా నిర్మించుకోవడం ప్రశంసనీయమని శర్మగారన్నారు. ముఖ్యంగా అప్పటి ధనవంతులు ఇళ్ళలో కోప గృహాలనేవి ప్రత్యేకంగా ఉండేవి. వీటిని ఏ బుద్ధిమంతుడు నిర్మించాడో కాని తక్కిన వారు ఎటువంటి 'తకరారు' లేకుండా తమ పనులు చేసుకోవచ్చని రాళ్ళపల్లి వారు చమత్కరించారు. వ్యాసకర్త అలంకారం, వేషం, ఆభరణాలు, ఆహారపు అలవాట్లలో ఆనాటివారు అల్ప తృప్తులు కారని అన్నారు. స్త్రీ, పురుషులిద్దరు వీటికి సమాన ప్రాతినిధ్యం వహించారు. తల వెంట్రుకలను పెంచుకోవడంలో వీరు సమానంగా ఉన్నప్పటికి కొంతకాలం తర్వాత స్త్రీలు మాత్రమే ఉంచుకోవడం జరిగిందన్నారు. కాగా రాను రాను స్త్రీ, పురుషులు పాశ్చాత్య ఫ్యాషన్ లో పడి సంప్రదాయాన్ని సంస్కరించారని వ్యంగ్యంగా చెప్పిన ఈ

---

[31] వేమన. పుట. 142.

మాటలు *''వికారమను భావము నేడు ప్రబలినది దానికి తోడు పాశ్చాత్య దాస్య ధ్వజమైన పాపట మగవారందరి తలకెక్కుటయే కాక, స్త్రీలకు గూడ నందందు వెండ్రుకల కత్తిరించుకొను వేడుక తలచూపుచున్నది''*[32]

కస్తూరి, పునుగు, జవ్వాజి, పచ్చ కర్పూరము, కుంకుమపువ్వు, శ్రీగంధము, అగరు, పన్నీరు మొదలైన సుగంధాలను వాడటంలో ఆనాటి ప్రజలు విజ్ఞతను ప్రదర్శించారని వ్యాసకర్త వివరించారు. కానీ నేడు ప్రజలు ఈ సుగంధాల వాడకం తగ్గించి ఏవో విచిత్రమైన వాటిని ఉపయోగించి అనారోగ్యం పాలవుతున్నారని హెచ్చరించారు. రకరకాల పుష్పాలను కాలానుగుణంగా అప్పటి ప్రజలు వినియోగించి ఎంతో ఆనందాన్ని అనుభవించారని అంటూ, నేడది కనిపించటం లేదని వాపోయారు.

రాళ్ళపల్లి వారు ఈ వ్యాసంలో హాస్యాన్ని, వ్యంగ్యాన్ని సమపాళ్ళలో పండించిన మేటి కాపు. రాయలకాలపు రసిక ప్రజలు ఎంతో ఇష్టంగా వేసుకునే తాంబూలాలకు, నేడుపయోగించే తాంబూలాలకు ఎన్నో తేడాలున్నాయంటూ *''రమణీ ప్రియదూతిక తెచ్చియిచ్చు కప్పురవిడెము' లేకున్న కవిత్వము సాధ్యము గాదని పెద్దన చెప్పెను. ఇట్టి తాంబూలములోని యితర పరిమళ ద్రవ్యము లన్నియు దీసివైచి నేడు అనేకులు వానికి బదులుగా పొగాకును చేర్చుకున్నారు. నేటి వారనగా ప్రాత పద్ధతికి జేరిన వారనుట. క్రొత్త నాగరక తరుణులలో ననేకులకు తాంబూలము తల దిరిగించును గదా! కాని పొగాకు పొగ మాత్రము వారికి తిరుగుతున్న తలను నిలుపును''*[33] అని పొగాకు ఆరోగ్యకరమైంది కాదని వ్యంగ్యంగా భాణాలు వేశారు శర్మగారు.

అప్పటి ఆచారాల్లో బహు భార్యత్వం, వేశ్యా వృత్తులు ప్రబలంగా ఉన్నా, నేడు చాలా వరకు మనలో అవి సమసి పోవడం ఆహ్వానించదగిన మార్పని శర్మగారన్నారు. కేవలం ప్రాచీనకాల పద్ధతులనే వ్యాసకర్త ప్రశంసించలేదు. ఆధునికులు కూడ కొన్ని భోగాల్లో ఆదర్శనీయులుగా వున్నారని చెప్పటం ఈయన విచక్షణ దృక్పథానికి నిదర్శన మనవచ్చు.

శర్మగారు ఈ వ్యాసంలో కేవలం అప్పటి ప్రజల ప్రవృత్తి జీవితాలనే కాకుండా నివృత్తి జీవనాన్ని కూడా పరిశీలించిన ద్రష్టగా కనిపిస్తారు. ఆనాటి ప్రజలు అనేక యుద్ధాలు చేసి, రాజ్యాలను గెలిచి, దేశాలను సంరక్షించి, ఎన్నో చెరువులను, కాలువలను తవ్వించి, అక్కడక్కడ గొప్ప దేవాలయాలు కూడా నిర్మించి చిరజీవులైనారని ఉద్ఘాటించారు.

రాళ్ళపల్లి వారు సందర్భాను సారంగా మూడు ప్రబంధాల్లోని పద్యాలను ఉటంకిస్తూ, ఎక్కడ విసుగు లేకుండా సున్నితమైన అంశాలను కళ్ళకుకట్టించిన తీరు ఈ వ్యాసం మధ్యలో ఆకట్టుకునేలా రచించారు.

---

[32] సారస్వతాలోకము. పుట. 7.

[33] సారస్వతాలోకము. పుట. 18.

***'తిక్కన తీర్చిన సీతమ్మ'*** లో రామాయణ, భారతాల ప్రాశస్త్యాన్ని గుర్తు చేసిన రాళ్ళపల్లి వారు వాల్మీకి, వ్యాసులు సృష్టించిన పాత్రల ఎంతో గొప్పదని కొనియాడారు. ఈ పాత్రల గొప్ప తనాన్ని గమనించిన పండితులు వాటి ఔన్నత్యాన్ని సమాజానికి తెలపాలని ఆకాంక్షించారన్నారు. అందులో భాగంగానే తిక్కన సీతమ్మను ప్రజల ఆలోచనలకు అనుగుణంగా తీర్చిదిద్దారని చెప్పారు. తిక్కన భారతం లాగా రామాయణాన్ని ప్రజల దగ్గరికి చేర్చలేక పోయారని అపోహ వుండటం సరికాదన్నారు. ఎందుకంటే మూలంలో ఉన్నదానికి ఎటువంటి భంగం రాకుండా తిక్కన జాగ్రత్త పడ్డారని తెలిపారు. *'నిర్వచనోత్తర రామాయణము'* లోని సీత చుట్టూ ఉన్న కథలను విశ్లేషించి తిక్కన వాల్మీకి దీనికి 'సీతాయన'మని పేరు పెట్టి ఉంటే బాగుండు కదా! అని అనుకున్నారని శర్మగారు సూచించారు. తిక్కన తీర్చిన ఈ సీతమ్మ 'రసానుభవదృష్టికి, ధర్మ దృష్టికి ప్రధానమైన ఘట్ట' మని రాళ్ళపల్లి వారు అభివర్ణించారు. అనవసర నిందలకు సీతమ్మను బలిచేసిన రాముడి ఆలోచన ఎంతవరకు సమంజసమన్నారు. కాగా తిక్కన సమాజాన్ని దృష్టిలో పెట్టుకునే ఆయా అంశాలు రాశారని వ్యాసకర్త చెప్పారు. తిక్కన మూలాలను నిశితంగా పరిశీలించి సీతమ్మ పాత్రను అశేష ప్రజానీక హృదయాలకు హత్తుకొనేటట్లు తీర్చిదిద్దారని వ్యాసకర్త ప్రశంసించారు.

రాళ్ళపల్లి వారు ఈ వ్యాస మధ్యభాగంలో తిక్కన *'నిర్వచనోత్తర రామాయణము'*, వాల్మీకి *'రామాయణము'*, భవభూతి *'ఉత్తర రామచరిత'* లలో ఉన్న సీతమ్మ కథల సన్నివేశాలను తులనాత్మకంగా అధ్యయనం చేశారు. పైగా తిక్కన చేసిన మార్పులను సోదాహరణంగా చూపించారు. ఆనాడు ధర్మం మూడు పాదాలతో నడిచిందనడానికి సీతమ్మకు జరిగిన అన్యయమే నిదర్శనమని శర్మగారు మూలాధారంగా చెప్పారు. సీతమ్మ పడిన కష్టాలు తిక్కన హృదయాన్ని కదిలించడం వల్ల మూలంలో ఉన్నదానికి తగినట్లు తన ఆలోచనలను జోడించి కథను పెంచి పోషించారని రాళ్ళపల్లివారు వివరించారు. రాముడు సీతను అడవులకు వెళ్ళమని ఆజ్ఞ విధించినప్పటి నుండి సీతమ్మకు జరిగిన అన్యాయాలను ఎత్తి చూపుతూ తిక్కన తన రామాయణాన్ని సీత పక్షం చేశారని రాళ్ళపల్లివారు ఉద్ఘాటించారు.

మూల రామాయణంలోని చాలా సన్నివేశాలను తిక్కన అక్కడక్కడ మలుపు తిప్పిన సందర్భాలను సోపపత్తికంగా శర్మగారు వ్యాసంలో పేర్కొన్నారు. తెలుగులో పిన్నవీరన్న, పాపరాజు, సంస్కృతంలో కాళిదాసులు చేయనటువంటి మార్పులు తిక్కన తన రామాయణంలో చేశారని రాళ్ళపల్లివారు ఈ పద్యాన్ని ఉదహరించారు.

చ. ***"తన మది నొక్క యుమ్మలిక దక్కిన మంచిది; దాని బాపగా***
***నని తలపోసి చేయుపని కక్కట యేనును లోనుగానె? నా***
***కు నెరుగజెప్పి పొమ్మనుటకుందగనె. మొగమాట లేక మ***
***న్నన యెడవైన రాజుల మనంబుల ద్రిప్పక బల్మి గల్గునే'***

(సారస్వతాలోకము పుట: 127)

తిక్కన సీత పాత్రచేత రాజుల ఆలోచన ఎలా ఉంటుందో కదా? అనే ప్రశ్న వేయించడం వారి ఔదార్యానికి నిదర్శనమని రాళ్ళపల్లివారు ఉగ్గడించారు.

ఈ విధంగా తిక్కన తన *'నిర్వచనోత్తర రామాయణము'* లోని సీతా పరిత్యాగ ఘట్టంలో ఏయే మార్పులు చేశాడో వాటిని రాళ్ళపల్లివారు పరిశోధనాత్మకంగా, తులనాత్మకంగా ఈ వ్యాస మధ్యభాగంలో పరిశీలించారు.

***'త్యాగయ్య గారి నాదసుధారసం'*** అనే వ్యాస మధ్యభాగంలో త్యాగయ్యకు అలవడిన సంగీతం, సాహిత్య, భక్తి తత్త్వాలు కుటుంబ సమేతంగా వచ్చినా వాటిని నిలబెట్టుకోవడానికి త్యాగయ్య చేసిన కృషి ఎంతో గొప్పదని శర్మగారన్నారు. అంతేకాకుండా ఆ తత్త్వాలు వారిలో ప్రవర్తిల్లిన తీరును స్పష్టంగా విశదీకరించారు.

త్యాగయ్య భక్తి, సాహిత్యం, సంగీతాలు త్రివేణి సంగమంగా వర్ధిల్లాయని ఒక్కోదాన్ని లోతుగా పరిశీలించి తెలిపిన అభిప్రాయాలు గమనించదగినవి. *''త్యాగరాజుగారి కీర్తనలన్నియు లోతుతఱచి చూచినచోనిట్టి యనుభవముల నాధ బ్రహ్మావతారములే''* నని[34] వేటూరి ప్రభాకరశాస్త్రి అన్నారు.

త్యాగయ్యకు చిన్నప్పుడే తండ్రి రామబ్రహ్మంగారు రామనామోపదేశం చేయటం వల్ల ఆయనకు రాముని మీద అమితమైన భక్తి ప్రపత్తులు ఉన్నాయని అన్నారు. అలాగే పార్వతీ దేవిపై కూడా త్యాగయ్య భక్తి భావనలు పెంచుకొన్నారని తెలిపారు. త్యాగయ్య తన కీర్తనల్లో రాజులు, జమీందార్లు, పాళేగాళ్ళ, దోపిడిదార్లు మొదలైనవారు చేసిన అఘాయిత్యాలను దుయ్యబట్టిన క్రమం కనిపిస్తుందని ఈ కింది పద్యాన్ని ఉదహరించారు.

***'దుర్మార్గ చరాధముల దొర నీవన జాలరా'***
***'జేనెడుదరము నింప నేనరుల పొగడితినా'*** (సారస్వతాలోకము పుట: 111)

త్యాగయ్య ఇలాంటి సంఘ సంస్కరణ భావాలున్న కీర్తనలే ఎక్కువగా రాసి సమాజ అభివృద్ధికి తోడ్పడ్డారని శర్మగారు తెలిపారు. అంతేకాదు త్యాగయ్యగారిది స్మార్త సంప్రదాయమని దీంట్లో సొంత మార్గాలెక్కువని, ఇది అందరికీ అలవడటం అంత సులభం కాదని, దీనికి కావాల్సినంత శ్రమ, దీక్ష, పట్టుదల ఉండాలని రాళ్ళపల్లివారు ఉద్ఘాటించారు.

*'కృత్రిమంగా మీద వేసుకున్న భావాలు ఆయన రచనల్లో లేనేలేవనవచ్చును. కొన్ని సాంప్రదాయికపు మాటలు తప్ప అన్నీ నిండుగా బ్రతికిన భావాలే. దీనికి తోడు తన యిష్టమెట్లు వస్తే అట్లు వ్యవహరించే ధైర్యమూ, స్వాతంత్ర్యమూ ప్రబలంగా ఉండినది. దీనితో రచనకు ఒక నవ్యత ఏర్పడి, భావాలకొక విలాసమూ, భాషకు ధారాళత వచ్చి వినేవారి నాకర్షించగల'*[35] దని రాళ్ళపల్లివారు. త్యాగయ్య కవిత్వం గురించి అన్నారు. త్యాగయ్య తమిళ ప్రాంతంలో ఉండటం వల్ల భాషలో కొంత పటుత్వం కొరవడిందని కూడా చెప్పారు. ఇక వీరి భావాలు చాలా చోట్ల

[34] వ్యాస ప్రభాకరము. పుట. 268.
[35] సారప్వతాలోకము. పుట. 112.

పొంతన కుదరకుండా ఉన్నాయన్నారు. ముఖ్యంగా ఈ కవితా రచనకు అనేక విషయాలను తెలుసుకోవడమే కాక దీనికి అభ్యాసం ప్రధానమంటూ, అవి త్యాగయ్యలో కొంత తగ్గినట్లనిపించిందని శర్మగారన్నారు. ఇలా త్యాగయ్యగారిలో కవిత కుంటు పడడానికి పలు కారణాలను లోతుగా పరిశీలించి తమ అభిప్రాయాలను నిర్మొహమాటంగా వెల్లడించారు.

త్యాగయ్యలో ఉండే గానం ఎంతో పవిత్రమైనదని, తర తరాలకు అది మహాప్రసాదమని ప్రశంసించారు. శొంఠి వెంకట రమణయ్య, రామకృష్ణానందస్వామి వంటి గురువుల అనుగ్రహం వల్ల వచ్చిన అవకాశాలను త్యాగయ్య సద్వినియోగం చేసుకొని గురువులను మించిన శిష్యుడైయ్యాడని శర్మగారు చెప్పారు. త్యాగయ్య నాదత గురించి శర్మగారు సునిశితమైన పరిశీలన చేసి, వీరి నాదత భాషా రచనకు దూరమైందని, అక్కడక్కడ దీనికి భాష శరీరంగా ఉన్నా, ఎన్నో చోట్ల అది వట్టి వేషంగా పరిణమించిందని చెప్పారు. కాని వీరి పాట ఎల్లలను దాటి ప్రవహించిందని గుర్తుచేస్తూ ...

***'నీ దయ చే రామ నిత్యానందుడనైతి***
***నాద బ్రహ్మానంద రసాకృతిగల నీదయచే***
***వరమృదుభాష, సుస్వరమయి భూష***
***వరత్యాగరాజ వాక్సేలావృత'*** (సారస్వతాలోకము పుట: 116)

ఇలాంటి పాటలెన్నో త్యాగయ్య గొప్ప పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టాయని ప్రశంసించారు. ఇటువంటి గొప్ప వాటిని ఏ కులానికో, మతానికో, ప్రాంతానికో అంటగట్టటం సరికాదని శర్మగారన్నారు. మొత్తం అశేష ప్రజానీకానికి త్యాగయ్యగారందించిన సంస్కృతీ సంప్రదాయాలు ఎంతో అవసరమని శర్మగారు చెప్పారు. త్యాగయ్య అటు కర్నాటక, తమిళనాడు ఇటు తెలుగు ప్రాంతాలు ఇంచుమించు దక్షిణ భారతదేశాన్నంతటినీ భక్తి, సాహిత్య, సంగీతాలతో ప్రభావితం చేశారని ఉద్ఘాటించారు.

***'నాటకోపన్యాసములు'*** (1935) అనే గ్రంథంలో రెండు సుదీర్ఘమైన వ్యాసాలున్నాయి. మొత్తం 78 పుటల్లో ఉన్న ఈ పుస్తకంలో మొదటి వ్యాసం 35 పేజీల్లో నిక్షిప్తమైంది. ఈ వ్యాస మధ్యభాగంలో రాళ్ళపల్లివారు నాటక ప్రక్రియ విధి విధానాలను సునిశితంగా పరిశీలించారు.

నాటకం ఒక గొప్ప కళ అని, ఇది కేవలం ఒక కళగా కాకుండా అనేక కళల సమాహారమని వ్యాసకర్త స్పష్టపరిచారు. అంతే కాక నాటక కర్తలు, నటీనటులు మరియు ప్రేక్షకుల ప్రవర్తనలు ఎలా ఉంటాయన్న అంశాలను వివరంగా తెలిపారు. మరీ ముఖ్యంగా నాటకంలో స్త్రీ పాత్రలను స్త్రీలు వేయకూడదని నొక్కి వక్కాణించారు. ఈ వ్యాసంలో చర్చించిన కొన్ని ముఖ్యమైన వివరాలు ఇలా ఉన్నాయి.

చిత్రకళ, విగ్రహకళ, కవిత్వం మొదలైన కళలలో అనేకం మిళితమై ఉంటాయి. ఇవి ఒకదాని కొకటి తోడ్పడుతూ వాటి ఔన్నత్యాన్ని చాటుకుంటాయని రాళ్ళపల్లివారన్నారు. ఇలా నాటకంలో కూడా వివిధ కళలుంటాయని, అవన్నీ అభినయానికి సహాయపడతాయని

తులనాత్మకంగా వివరించారు. ఈ నాటకంలోని కళల ఔన్నత్యాన్ని వ్యాసంలో చాలా లోతైన దృష్టితో విశదీకరించారు. అభినయం అనేది పై చెప్పిన కళలలో ఇమిడి ఉన్నా నాటకంలో సింహభాగాన్ని కలిగి ఉంటుందని శర్మగారు చెప్పారు.

ప్రాచీనులు శాస్త్రాన్నీ, కళను లోతైన దృష్టితో పరిశీలించినవారని, ముఖ్యంగా అభినయ కళకు కవిత్వం, సంగీతం, తాళ, లయలు చాలా ఉపయోగపడుతాయని వీటన్నిటినీ ప్రాచీనులు శాస్త్రీయంగా నమ్మినవారని శర్మగారు గుర్తుచేశారు. ప్రాచీనులు నాటకాన్ని ఎంతో భక్తి శ్రద్ధలతో ఆదరించి, దాని విశిష్టతను పెంపొందించారని *''నాటకము జనుల జీవిత మందలి యవస్థల యనుకరణమే తప్ప వెఱ్ఱి వెంగళయ్య చేష్ట కాదుకదా! ఇట్లు ప్రశ్నించుట అనుభవ రసికుల దృష్టి కాదు; వివేక ప్రధానులగు విమర్శకుల దృష్టి. మొదటిది హృదయమును నమ్మినది. రెండవది మెదడు నాశ్రయించి.''*[36] నదనే రెండు ప్రశ్నలాధారంగా రాళ్ళపల్లివారు నాటకకళ ప్రాశస్త్యాన్ని పరిశీలించే ప్రయత్నం చేశారు.

నాటక ప్రక్రియలో ఉన్న నృత్తము, పాటలు, పద్యాలు వంటివి రాను రాను కనుమరుగవ్వడం చింతాజనకమని వ్యాసకర్త ఏకరువు పెట్టారు. ఇలా నాటకాల్లో అనేక మార్పులు రావడానికి కారణం పాశ్చాత్య సంప్రదాయమేని అన్నారు. స్వాతంత్ర వాదులు కళలు వేటికవే స్వతంత్రాలనటం రాళ్ళపల్లివారు సరికాదంటారు. అసలు కళలనేవి పలు రకాల కళలతో ఏకమైతేనే రక్తి గట్టించగలవని సూచించారు.

ముఖ్యంగా స్వభావ వాదులు స్త్రీ పాత్రలను స్త్రీలే వేయ్యాలని భావించడాన్ని శర్మగారు తప్పుబట్టారు. *''ప్రకృతిలో పదార్థాల భావాలను, క్రియలను అనుకరించుటయే నాటక''*[37] మని ప్రాచీనులన్నారని శర్మగారు గుర్తు చేశారు. ఇలా కళలన్నీ అనుకరణాలు కాబట్టి నాటకంలో స్త్రీ పాత్రలను పురుషులు కూడా వేయవచ్చుని తేల్చి చెప్పారు. నాటక కళలో ఎదుటి వారి భావాలను రంగస్థలంపై యథావిధిగా చూపడం మాత్రమే ప్రధానమని సున్నితంగా తెలిపారు. ముఖ్యంగా నాటకంలో కావాల్సింది ఆయా పాత్రలను అభినయించడానికి ఏకాగ్రత మాత్రమేనని, ఇది ఉంటే నాటక ప్రక్రియలో విజయవంతులైనట్లేనని తెలియజేశారు.

రాళ్ళపల్లి వారు వ్యాసంలో సామ్యం, వైషమ్యాల మధ్య గల తేడాలను సంక్షిప్తంగా తెలిపారు. నాటకంలో ఏకాగ్రచిత్తం చాలా ముఖ్యమైందని చెప్పిన తాడిపత్రి రాఘవా చార్య చెప్పిన అభిప్రాయంతో ఏకీభవించారు. సుఖం ఇంద్రియాలకు చెందినదని, ఆనందం ఆధ్యాత్మికమైందని అన్నారు. సుఖాన్ని అనుభవించిన కొలది విరక్తి వస్తుందని, ఆనందాన్ని అనుభవించిన కొలది ఇంకా పొందాలనే ఆకాంక్ష ఉంటుందని స్పష్టంగా వివరించారు. కళ సహజమైనదనీ, దీనికి అనుకరణ బీజంగా ఉంటుందని చెప్పారు.

---

[36] నాటకోపన్యాసములు. పుట. 6.

[37] నాటకోపన్యాసములు. పుట. 10.

నటనలో బహిరంగ ప్రవర్తన చేయడం ప్రధానం కాదు. అంతరంగ ప్రవర్తనలో ఇమిడిపోగలిగే శక్తి నటులకు ఉన్నప్పుడే నటన మెప్పు పొందగలదని శర్మగారు తెలిపారు. నాటకానికి అభినయం ప్రధానం కాబట్టి. నటించేవారు స్త్రీలా, పురుషులా, పెద్దలా, చిన్నలా అన్నది ముఖ్యం కాదని వ్యాసకర్త సూచించారు. ఈ స్వభావ వాదులు నాటక ప్రాముఖ్యాన్ని లోతుగా పరిశీలించక పోవడం విచారకరమని అన్నారు.

నాటక కర్త బాధ్యత నాటకానికి ఎంతో ముఖ్యమైందని శర్మగారు అన్నారు. అంటే నాక కర్తలు నాటకంలో వాచక, అభినయాలకు పనికి వచ్చే భాషను మాత్రమే అందించగలరని, ఇంకా నాటకంలో పద్యాలు, పాటలను ఎక్కడెక్కడ పొందు పరచాలనేదాన్ని చక్కగా నిర్దేశించే భారం వీరి పైనే ఉంటుందని తెలిపారు. అలాగే, నటుల కర్తవ్యం కూడా నాటకానికి ఎంతో ప్రాముఖ్యంను తెచ్చిపెడుతుందన్నారు. కొందరు నటులు ఏదో గుడ్డిగా నటిస్తున్నారని, ఆయా పాత్రల నేపథ్యాలను కూడా అవగతం చేసుకోని స్పృహలో ఉన్నారని విమర్శించారు. ముఖ్యంగా నాటకం దేన్ని ఆశిస్తుందో కూడా గమనించకుండా అభినయం చేయటం బాగలేదన్నారు. ప్రేక్షకులు భిన్న అభిరుచులను కలిగి ఉండటం కూడా నాటక కర్తలు గమనించాలని గుర్తు చేశారు. చిత్ర విచిత్ర మనస్తత్వాలతో ప్రేక్షకులు నాటక మందిరంలోకి వచ్చి, నానా గోల చేస్తుంటారనే సున్నితమైన విషయాలను కూడా వ్యాసంలో పేర్కొన్నారు. ఎన్నో నాటకాలను శర్మగారు ప్రత్యక్షంగా పరిశీలించినట్లు చెప్పుకొని, ఆయా నాటకాల్లోని కొన్ని సందర్భాలను వ్యాసంలో చక్కగా తెలియ చేశారు. భారతీయ ఆలంకారికులు నాటక ప్రక్రియ ప్రాధాన్యాన్ని వివిధ గ్రంథాల్లో పేర్కొన్నారని రాళ్ళపల్లి వారు గుర్తు చేశారు. నాటక ప్రక్రియలో నాటక కర్తలు, నటులు, ప్రేక్షకులు ఎంతో బాధ్యతతో వ్యవహరించడం ముఖ్యమని చెప్పారు. ఎంత బాధ్యతతో ఉంటే అన్ని కళలను మనం కాపాడుకోగలమని వ్యాసకర్త పునరుద్ఘాటించారు.

స్వభావ వాదులకు శర్మగారు మనవి చేసిన అభిప్రాయం ‘‘*స్వభావము అనునది అమేయము, అగాధము. దాని మేర యింతే యని యెఱుఁగ నెవరితరమును కాదు; మఱి సాధ్యమైనంత దాని లోతును జూచుటయే కళలపని*’’[38] అని కళా ప్రాముఖ్యాన్ని తెలియచేశారు.

నాటకంలో స్త్రీ పాత్రలు స్త్రీలే వేయ్యాలనేది ఈ వ్యాసంలో ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకున్న అభిప్రాయం. దీన్ని శర్మగారు ఎంతో చాకచక్యంతో పరిశీలించారు. కళ – నీతి అని విభజించి తులనాత్మకంగా అధ్యయనం చేశారు. కళ అనేది వ్యక్తికి చేరినది. కాబట్టి ఎవరైనా నటించవచ్చు. కానీ నీతికి భంగం కలగకుండా జాగ్రత్త పడడం ప్రధానమన్నారు. ఒక స్త్రీ పర పురుషునితో నటించినప్పుడు నీతికి ఖచ్చితంగా భంగం కలగటం ఖాయమని శర్మగారు తెలిపారు. అందుకే స్త్రీ పాత్రలు స్త్రీలే వెయ్యటం వల్ల ప్రత్యేకంగా కలిగే ప్రయోజనం ఏమీ ఉండదని తేల్చి చెప్పారు. దీనివల్ల స్త్రీ పాత్రలు పురుషులు కూడా వేసి నాటకాన్ని రక్తి

[38] నాటకోపన్యాసములు. పుట. 24.

గట్టించవచ్చని అన్నారు. స్త్రీ పాత్రలలో చక్కగా ఒదిగిపోయిన స్థానం నరసింహరావు లాంటి వారు చెప్పుకోదగినవారని రాళ్ళపల్లివారన్నారు.

ఈ విధంగా రాళ్ళపల్లివారు ఈ వ్యాస మధ్యభాగంలో నాటక ప్రక్రియ గురించి ఎన్నో విలువైన అంశాలను సోదాహరణంగా తెలియజేశారు.

**'వేమన'** (1929) గ్రంథం లోని మొదటి ఉపన్యాసమైన 'ఉపోద్ఘాతము' ఎంతో సుదీర్ఘమైన వ్యాసం. దీని మధ్యభాగంలో రాళ్ళపల్లివారు ఆంధ్ర ప్రాంత పరిస్థితులనూ, అక్కడి ప్రభావాలను గ్రంథాల, వ్యక్తుల పరంగా మతాలకనుగుణంగా ఉండే విషయాలను ఆసాంతం పరిశీలించారు. అలాగే, ఈ వ్యాసంలో వేమన పద్యాల సంఖ్య ఎంత? వాటి పూర్తి వివరాలు తెలిపే ప్రతులు ఎవరు రాశారో తెలిపి, వాటి స్థితిగతులను లోతుగా చర్చిస్తూ, తమదైన ఆలోచనా దృక్పథాన్ని సూక్ష్మంగా తెలియజెప్పారు.

ఆంధ్ర ప్రాంతంలో ప్రసిద్ధ మతప్రవర్తకులు జన్మించలేదని, బుద్ధుడు, శంకరాచార్యులు, రామానుజచార్యులు, ఆనందతీర్థాచార్యులు, నింబార్కాచార్యులు, వల్లభాచార్యులు, బసవేశ్వరుడు లాంటివారి ప్రభావం ఈ ప్రాంతంలో లేదని శర్మగారన్నారు. ఆంధ్రుల తత్త్వాలను తెలుసుకోవడంలో వెనకబడ్డానికి కారణం ఇక్కడి ప్రాంత స్థితిగతులేనన్నారు. ఈ ప్రదేశంలో వీరశైవం, అద్వైతం వెలసి నిలబడ్డాయని చెప్పారు. కులమతాల పట్టింపులు బ్రాహ్మణులకు ఎక్కువగా ఉండేవి. కాని ఎటువంటి సిద్ధాంతాలకు వీరు ఆకర్షితులుకాలేక పోవటం గమనార్హమన్నారు. వీటి ప్రభావం ఇతర కులాలపై పడటం అనివార్యంగా జరిగిందని గుర్తు చేశారు. ఆ పరంపరలో వేమన వీరశైవానికి, అద్వైతానికి దగ్గరై సమాజంలో ఎంతో చైతన్యం తీసుకొచ్చారని రాళ్ళపల్లి వారు ఉద్ఘాటించారు.

తెలుగులో త్యాగరాజు, రామదాసు, పోతులూరి వీర బ్రహ్మం, ఏగంటివారు,(యేగంటి) సదానంద యోగి, తాళ్ళపాక కవులు ఇలా ఎందరో సమాజ ఉద్ధరణకు నడుంబిగించిన వారున్నారు. కాని వేమనకు వచ్చినంత గుర్తింపు వీరికి రాలేకపోయిందని శర్మగారు కొన్ని కారణాలను వ్యాస మధ్యభాగంలో చర్చించారు. వేమన స్వభావం ఎంతో సున్నితమైనదని, తానేదైన చూస్తే దాన్ని ఎదుటివారికి చెప్పటంలో గొప్ప నైపుణ్యాన్ని ప్రదర్శించారని అన్నారు. చెప్పే విషయంలో తిట్లున్నా అవి గిలిగింతలు పెట్టే హాస్యంతో కూడి ఉండటం గమనార్హమని అన్నారు. శర్మగారు వ్యాసంలో వేమన నైపుణ్యాన్ని ఇలా అభివర్ణించారు. "*అతనివి చిటుకలో ముగింపఁగల చిన్న పలుకులు; అచ్చ తెనుఁగు పద్యపు నడక; గుండుదెబ్బవలె గుఱి తప్పని చిక్కని చెక్కిన మాటలు, నోరుగల తెలుఁగు వారందఱును నేర్వవచ్చును.*"[39] అని వేమన పద్యాల ప్రాముఖ్యాన్ని వివరించారు.

వేమన తన చుట్టూ అస్తవ్యస్తమై ఉన్న సమాజాన్ని చూసి చలించి పోయాడని, దాని ఉద్ధరణకోసం ఏదో ఒకటి చేయ్యాలని తపన పడిన గొప్ప తత్త్వ వేత్తని రాళ్ళపల్లి వారన్నారు.

---

[39] వేమన. పుట.7.

పద్యాన్ని ఎంచుకొని ఎవరు తీసుకోరాలేనంత మార్పు వేమన తీసుకొచ్చాడని ప్రశంసించారు. అంతేకాక శర్మగారు వ్యాసంలో వేమన పద్యాల పుట్టు పూర్వోత్తరాలను పరిశోధనాత్మకంగా చర్చించటం గమనించదగింది. 'The verses of vemana', 'వేమన సూక్తి రత్నాకరం' వంగూరి సుబ్బారావుగారి 'వేమన', వావిళ్ళవారి పీఠిక, వేటూరి ప్రభాకరశాస్త్రి చెప్పిన విషయాలు మొదలైన గ్రంథాలాధారంగా వేమన పద్యాల స్థితిగతులను పరిశీలించారు.

రాళ్ళపల్లి వారు వేమన పద్యాలపై వచ్చిన రాత ప్రతులను వ్యాసంలో ఉదహరించారు. అవి;

1. బరంపురం తారక బ్రహ్మానుభవి పూడి పెద్ది సాంబశివరావుగారు వేమన పద్యాలపై వెలువరించిన పుస్తకాలు.
2. జ్ఞానానందయోగి 'తత్త్వార్థబోధిని'.
3. వావిళ్ళ వారి వ్రాత ప్రతి.
4. కరూరు బంగారయ్య గారి 'వేమనార్యుని పద్యపదశబ్దార్థము.
5. బ్రౌను దొరగారు రాసిన ఆంగ్ల పరివర్తనము.

వీటి ఆధారంగా వేమన పద్యాల సంఖ్యను, పద్యాల్లోని భావాలను బట్టి వీటిని వేమన రాశాడా? లేదా వేరే వాళ్ళు కల్పించారా? అన్న విషయాలను ఎటువంటి అరమరికలు లేకుండా తెలిపారు. కొన్ని ఉదాహరణలు కింది విధంగా...

వేమన పద్యాల్లో ఆయన జీవిత విశేషాలను, యోగ రహస్యాలను ఇలా ఎన్నో విషయాలను సమాజ బాగుకోసం తెలియజెప్పారని రాళ్ళపల్లి వారన్నారు. ఈయన పద్యాలు సుమారు నాలుగు వేలకు మించి ఉండవచ్చని కాలక్రమంలో అవి మూడు వేలుకు దిగాయని సూచించారు. ఈ పద్యాలను పుస్తకాల్లో తెచ్చే ప్రయత్నం చేసిన వారు వేమనపై అభిమానంతోనో లేక తమ సొంత అలోచనలు కొంత ఉండాలనో పలు మార్పులు చేయడం కనిపిస్తుందన్నారు. ఇలా చేయడాన్ని శర్మగారు నిరసించారు. వేమన పద్యాల్లోని స్వభావాన్ని, మతాన్ని, కవిత్వ ధర్మాన్ని, భాషను ఏమాత్రం గమనించకుండా ఉండడం విచారకరమన్నారు. వేమన రాయని పద్యాలను కూడా పుస్తకాలకెక్కిచడాన్ని వ్యాసకర్త తప్పుబట్టారు. ఉదాహరణకు వేమన రాయని పద్యాన్ని వ్యాసంలో పేర్కొన్నారు.

మ. ***"తిలలం దైలము, పాలవెన్న, శిలలం దెల్లంబుగా లోహ ము***
***జ్జ్వల దీపాంకురమందు కజ్జలము, కాష్ఠశ్రేణియందగ్ని భూ***
***తల ఖాతంబున నీరు గల్గుటయుఁ దథ్యంబంచు నూహించి తాఁ***
***దలఁపన్ యత్నము సేయకున్నఁ దగునే ధర్మంబు వేమాహ్వయా"***

(వేదాంత సిద్ధాంతము, పే. 108)

ఈ పద్యం వేమనదే కాదు అయినా రాత ప్రతిలో చూపడం గమన లోపమని శర్మగారన్నారు. ఇలా వేమన పద్యాల్లో జరిగిన తప్పులన్నిటిని వ్యాసకర్త వీలైనంత వరకూ తెలియజేశారు.

*'రామాయణము', 'బాలవ్యాకరణము', 'అప్పకవీయము'* ఎన్ని దెబ్బలు తిన్నాయో అన్ని దెబ్బలు వేమన పద్యాలు తిన్నాయని రాళ్ళపల్లి వారన్నారు. 'గురము' అనే పదానికి 'గృహము' అని వేమన మాత్రమే వాడడం విశేషమని శర్మగారు భావించారు. ఇక ఆధునికులు వేమన పద్యాలను చిత్ర విచిత్రంగా సవరించడానికి ప్రయత్నం చేయడాన్ని పురస్కరించుకొని ఇలా చేయడం వేమన ప్రతిష్ఠను తగ్గించడమేనన్నారు. *'కల్లు కిచ్చునట్లు చల్లకీయఁగ లేరు'* అన్నదాన్ని *'కల్లున కిడునట్లు'* గా దిద్దారని ఇలాంటివనేకం కనిపిస్తున్నాయని రాళ్ళపల్లివారు తెలిపారు. వేమన తత్త్వాన్ని కూడా అవగాహన చేసుకోకుండా లెక్కలేనన్ని రాత ప్రతులను, దిక్కు మొక్కు లేని పాఠాంతరాలను చేయడాన్ని వ్యాసకర్త విమర్శించారు. కొంత వరకు వావిళ్ళవారు వేమన పద్యాలను చక్కగా అచ్చులోకి తీసుకొచ్చారని కొనియాడారు.

శర్మగారు వేమన పద్యాలకు మకుటమైన 'విశ్వదాభిరామ వినుర వేమ' కు చెందిన పాఠాంతరాలను వ్యాసంలో లోతైన దృష్టితో పరిశీలించారు. 'విశ్వధాభి, విశ్వదాభి, విశ్వతాభి' అను మూడు పాఠాంతరాలు దీనికి ఉన్నాయన్నారు. *'విశ్వతాభిరామ'* యను పాఠాంతరాన్ని *గ్రహించి 'విశ్వతా= ప్రపంచత్వము- అనగా, సర్వమును తానైయుండుటు – దానిచే నభిరాముఁడు'*[40] అనే అర్థాన్ని (వావిళ్ళవారి ప్రతి పీఠిక. పుటxviii) పేర్కొన్నానని గుర్తు చేశారు. ఇలా వేమన వాడిన మకుటానికి అనేక పాఠాంతరాలు వస్తున్నాయన్నారు. 'విశ్వదాభిరామ' అనే పాఠాంతరానికున్న అర్థం 'విశ్వమును, ప్రపంచమును, ఇచ్చువాడు– విశ్వదుఁడు –భగవంతుడు అతని అభిరాముడు – ప్రీతి పాత్రుడు' అన్నది కొంత వరకు సమంజసమైందన్నారు. తర్వాత 'అభిరామయ్య' అన్నదానికి కూడా చాలా కథలున్నాయని చెప్పారు. కాగా వేమన కంసాలి అభిరామయ్యతో, లంబికా శివయోగితో శిష్యరికం చేసి కొన్ని విద్యలను అభ్యసించాడు. కాబట్టి కృతజ్ఞుడుగా వారిని స్మరించుకోవడం మేలనుకొన్నారని రాళ్ళపల్లి వారు సూచించారు.

ఈ విధంగా వ్యాస మధ్యభాగంలో వేమన పద్యాల సంఖ్యను నిర్ణయించడం, మూల పాఠాంతరాలను గుర్తించడం, గ్రంథం ఎవరిదనేది చెప్పుట వంటి చిక్కులు అసలు తెగేవికావని శర్మగారు అన్నారు.

***'నాటకోపన్యాసములు'*** లోని రెండో వ్యాసం మొదటి వ్యాసం కన్నా సుదీర్ఘమైంది. దీని మధ్యభాగంలో శర్మగారు ధర్మవరం రామ కృష్ణమాచార్యులు, కోలా చలం శ్రీనివాస రాయల వారి నాటక ప్రత్యేకతలను లోతుగా విశదీకరించారు. వీరిద్దరూ పోటాపోటీగా ముప్పైకి పైగా నాటకాలు రాయడం వారి దక్షతకు నిదర్శనమన్నారు. అంతేకాదు నాటకాలను తులనాత్మకంగా అధ్యయనం చేసి, వాటి లక్షణాలను వెల్లడించారు. అలాగే, విషాదాంత నాటకాల గురించి కూడా శర్మగారు నిశితంగా చర్చించారు.

---

[40] వేమన. పుట.19.

శర్మగారు కృష్ణమాచార్యులు, శ్రీనివాస రాయల నాటకాలను మూడు అంశాల ఆధారంగా పరిశీలిస్తున్నానని వ్యాసంలో చెప్పుకున్నారు. అవి:

1. ప్రాచ్య, పాశ్చాత్య నాటక పద్ధతులు.
2. తమ నాటకాలను తామే ఆడించవలసిన భారం.
3. జనాలకు నీతిని బోధించాలనే ఉద్దేశం.

మొదటి సూత్రం ఆధారంగా ప్రాచ్యుల, పాశ్చాత్యుల తత్త్వం ఒకటే అయినా వారి పరిభాషలు సరిసమానన్నారు. సంస్కృత నాటకాలు తీక్షణమైన పద్యాలతో కూడి ఉంటే, తెలుగు నాటకాలు మాత్రం గద్య, పద్య మిశ్రమాలై ఉంటాయని చెప్పారు. కొన్ని సందర్భాల్లో గద్య, పద్యాలు విడిగా కనిపిస్తాయన్నారు. నాటకంలో అంకాలను రంగాలుగా విభజించి ప్రదర్శించడం మన వారి ప్రత్యేకతగా శర్మగారు అభివర్ణించారు. పాశ్చాత్యుల్లో నేరుగా కథలోకి వెళ్ళే పద్ధతి ఉంటే, మనవారిలో నాంది, ప్రస్తావనలతో వెళ్ళటం కనిపిస్తుందన్నారు. యుద్ధం, చావు వంటి సన్నివేశాలను పాశ్చాత్యులు ప్రత్యక్షంగా వేదికపై చూపిస్తే, భారతీయులు అవి జరిగినట్లు అనిపించడం గమనించవచ్చనే కొన్ని స్పష్టమైన భేదాలను వ్యాసంలో చర్చించారు.

కృష్ణమాచార్యులు, కోలా చలం వారిద్దరూ 19వ శతాబ్దంలో ఉన్నవారు కాబట్టి అప్పటి పరిస్థితులను బాగా అర్థం చేసుకొని నాటకాలు రాశారని శర్మగారు చెప్పారు. వీరు కేవలం తెలుగు భాషనేగాక ఆంగ్లాన్ని కూడా అధ్యయనం చేసి ఇటు తెలుగు అటు ఆంగ్ల నాటక పద్ధతులను మేళవించి కృషి చేశారన్నారు. ఇలాంటి గొప్ప ప్రయత్నం చేయటం వల్ల నాటక ప్రక్రియకే మంచి పేరు రాగలిగిందని గుర్తు చేశారు. వీరు నాటకాల్లో కేవలం పద్య, గద్యాలనే కాకుండా 'ఒపేరా' అనే కొత్త రూపకాలను తీసుకొచ్చారు. సాధారణంగా నాటకాల్లో పద్య, గద్యాలుండటం సహజం కాని వీరు పాటలను ప్రవేశపెట్టి ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారన్నారు. కోలా చలం వారు పాటలను, కృష్ణమాచార్యుల వారు పద్యాలను ఎక్కువగా ప్రవేశపెట్టారని కాని, కొన్ని నాటకాల్లో అవి అనివార్యంగా ఉన్నాయని తెలిపారు. చాలా చోట్ల పునరుక్తి కూడా అవ్వడం భావానికి భంగం కలిగించిందని చెప్పారు. నాటకాల్లో అర్థ భావాలు రెండూ వాడినా ప్రాసలవల్ల అవి దెబ్బ తినడం జరిగిందన్నారు. అక్కడక్కడ కవిత్వం లాగా ఉన్నా అవి ప్రబంధ స్థాయికి వెళ్ళాయని విమర్శించారు. తెలుగు సాహిత్యంలో నన్నయ, తిక్కన, ప్రబంధ కవుల పద్యాలను, శబ్దార్థాలను నాటకాల్లో తీసుకురావడం కనిపిస్తుందని చెప్తూ, కోలాచలం వారి 'శిలాదిత్య' నాటకంలో దాన్ని చూడవచ్చునన్నారు.

పద్య, గద్యాలు, పాటలే కాకుండా మాటల్లో కూడా పూర్వ కవుల అనుసరణ సంపూర్ణంగా ఉందన్నారు. పాశ్చాత్య నాటక పద్ధతుల్లో అవసరమనిపించిన వాటినే వీరు గ్రహించారు తప్ప అన్నిటిని గుడ్డిగా స్వీకరించలేదని రాళ్ళపల్లివారు అన్నారు. ఇలా విచక్షణతో ముందుకు వెళ్ళటం వారి విజ్ఞతకు నిదర్శనమన్నారు. శర్మగారు వ్యాసంలో ప్రేక్షకుల మనోభావాలను కళ్ళకు కట్టినట్లు చిత్రించారు. నాటకాల్లో ఎక్కువగా పద్యాలకు, పాటలకు

కాకుండా వస్తువుకు ప్రాముఖ్యం ఇవ్వాలని నొక్కిచెప్పారు. శృంగార సన్నివేశాలు ఇరువురి నాటకాల్లో కనిపిస్తున్నప్పటికి కృష్ణమాచార్యులుగారిదే పై చేయిగా ఉందన్నారు. నాటకాల్లో పాత్రలను ప్రవేశ పెట్టే పద్ధతుల్లో మనవారు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తారని గుర్తు చేశారు. విషాదాంత నాటకాలు రాయడం మంచి పరిణామంగా భావించినప్పటికి 'సారంగధర' నాటకం విషాదంగా ముగించటం రుచించలేదని ''*ఇది పది శోకాంత నాటకాలు చేసినంత పని తెలుగువారికిది యొక్కటే చేసినది; చేయు చున్నది. దీనికిఁ దగినట్లు కార్చుటకుఁ గావలసినన్ని కన్నీళ్ళు తెలుగు వారి కున్నవా యని సందేహపడవలసి యున్నది.*''[41] అని వ్యంగ్యంగా చెప్పారు. ఇలా ఇరువురి నాటక లక్షణాలను ఆయా పద్ధతులను ఆమూలాగ్రం చర్చించారు.

శర్మగారు సూచించిన మూడు సూత్రాల్లో రెండవది 'తమ నాటకాలను తామే ఆడించుకొనే పరిస్థితి'. ఈ విషయంలో ఇరువురు ఎంతో కష్టపడి పనిచేశారన్నారు. 'సరస వినోదిని సభ', 'సుమనోరమ' అనే రెండు నాటక సంఘాలను స్థాపించి ఎంతో మంది విద్యావంతులను చేర్చుకొని, అనేక నాటకాలను ప్రదర్శింపజేయడం గొప్పదన్నారు. ఈ నాటకాలు చూసిన వారికి సృష్టించిన వారికి ఉపయోగకరంగా ఉండి సమాజంపై గొప్ప ప్రభావం చూపాయన్నారు. నాటక కళా ఔన్నత్యాన్ని ఇనుమడింప చేయడానికి వారి జీవితాలనే త్యాగం చేశారని రాళ్ళపల్లివారు కొనియాడారు. కేవలం నాటకాలు రాయడమే కాదు అభినయ విషయంలో కూడా వారే బాధ్యులుగా వ్యవహరించడం కష్టంతో కూడిన పని అయినా ఎంతో సమర్థతతో నిలబడ్డారంటే వారికున్న సంకల్ప సిద్దే కారణమనవచ్చు.''*నాలుగణాలకు బ్రతికియున్న వాఁడెల్ల నాటక సభ్యుడు కావచ్చు.*''[42] కాని ఇంత శ్రమించి నాటకాలు చేయడం అంటే మాటలు చెప్పినంత సులువు కాదని రాళ్ళపల్లి వారు వారిద్దరి కృషిని మెచ్చుకున్నారు.

నాటకాలను సమాజ హితంగా తీసుకురావడంలో వీరిద్దరూ సిద్ధహస్తులయ్యారని చెప్పి, కొన్ని సందర్భాల్లో వారి సిద్ధాంతాలకు ఎటువంటి భంగం జరక్కుండా జాగ్రత్తపడటం గమనార్హమన్నారు.

శర్మగారు వీరి నాటకాలను సూక్ష్మంగా పరిశీలించి, ఏదో ఒక నీతిని సమాజానికి బోధించడానికే కంకణం కట్టుకున్నారని చెప్పారు. కోలాచలం వారి నాటకాల్లో ఎక్కువ నీతి కనిపిస్తుందన్నారు. కాని కొన్ని నాటకాల్లో నీతిని పని గట్టుకొని అతికించినట్లుందని కూడా విమర్శించారు. ఈ నీతి అనేది ఆస్వాదించేటట్లుండాలి తప్ప ఏదో తెచ్చి పెట్టినట్లుండ కూడదని శర్మగారు అభిప్రాయపడ్డారు. నాటకాలను రసభరితంగా చిత్రించిన ఘనత కృష్ణమాచార్యుల వారికే దక్కుతుందని ఉద్ఘాటించారు.

ఈ విధంగా తెలుగు నాటక సాహిత్యంలో ఒక ఒరవడిని సృష్టించిన ధర్మవరం, కోలాచలం చిరస్మరణీయులని శర్మగారు చెప్పారు. తాము చేపట్టిన పనిని త్రి కరణ శుద్ధిగా

---

[41] నాటకోపన్యాసములు. పుట. 58.

[42] నాటకోపన్యాసములు. పుట. 71.

చేయడంలో తమకు తామే సాటని ''*అభినయ విద్యకై తమ శక్తి యుక్తులనెల్ల నా జీవము ధార పోసిన కార్య శూరులు వీరిద్దఱు*''[43] అని ప్రశంసిస్తూ వ్యాసాన్ని ముగించారు.

***'నిన్నటి సంగీతము – ఇరువురు సంగీత కోవిదులు'*** వ్యాస మధ్యభాగంలో వీణ శేషణ్ణ, బిడారం కృష్ణప్పగార్లు జీవించిన కాలంలో సంగీత విద్యపై ఉన్న ప్రభావాన్ని తెలియజేశారు. కాగా వీరిద్దరూ సంగీత విద్యను అభ్యసించిన విధానాన్ని రాళ్ళపల్లివారు స్మరించుకున్నారు. ముఖ్యంగా శేషణ్ణ, కృష్ణప్పల సంగీత ప్రతిభా పాటవాలను లోతైన పరిశీలన దృష్టితో మన ముందుంచే ప్రయత్నం చేశారు. శేషణ్ణ సంగీత విద్యలో మహా ప్రతిభావంతులు. వీరు ఫిడేలు, జల తరంగం, సర్వజిత్తు, హార్మోనియం, పియానో అనే వివిధ సంగీత పరికరాలను వాయించడంలో గొప్ప ప్రావీణ్యం ఉన్నవారన్నారు. అన్ని వాయిద్యాల్లో కంటే వీణపై వారికి మక్కువ ఎక్కువని చెప్పారు. వీరు దీనితో 'ఆటలాడినవాడేగాని, పోటులాడినవాడు కాదు' అని చమత్కరించారంటే సంగీతం పై వారికున్న మమకారం తెలుస్తుంది. శేషణ్ణగారిది లెక్క లేనన్ని సంగీత కచ్చేరీలు చేసిన అనుభవం కాబట్టి, వీరి సంగీతంలో రాగం, తానం, పల్లవులు గొప్పగా తొణికిసలాడుతాయని చెప్పారు. శేషణ్ణగారి రచనా విశేషాలు శర్మగారి మాటల్లోనే చూడండి. ''*రచన యెంత గంభీరమో అంత విస్తారము, ఎంత కఠినమో అంత మృదువు, ఎంత అపూర్వమో అంత యందము. నడక యెంత విలంబమో, ద్రుతమో అంత స్పష్టము.*''[44] అని విశ్లేషించారు.

రెండోవారు బిడారం కృష్ణప్ప. వీరు శేషణ్ణగారి కంటే కొంత భిన్నమైన వారని చెప్పారు. సంగీత విద్యలో వీరిది కొంత కఠినమైన విధానంగా కనిపిస్తుందని, సంగీతంలో అనుకున్న దాన్ని ఎంత కష్టమైన దాన్నైనా సులభంగా పూర్తి చేయగల హఠయోగులు బిడారం వారని శర్మగారన్నారు. కృష్ణప్పగారి విశిష్టను శర్మగారిలా కొనియాడారు. ''*పాడునప్పుడు మొగమున నవ్వుకన్న గాంభీర్యము ఎక్కువ; పాటలో అందచందములకన్న అఖండత ఎక్కువ. వినువారిని ముగ్ధులనుగా జేయుట కంటె మూగలనుగా జేయుట ఎక్కువ*''[45]

వీరిద్దరూ పాడిన కీర్తనలు త్యాగయ్యగారివి, వారి శిష్యులవి, శాస్త్రులు మొదలైన వారివే ఎక్కువగా అభ్యసించేవారని తెలుపుతూ, వీరి వల్ల నేర్చుకున్న సంగీత రాగాలను గుర్తు చేసుకున్నారు.

***'సంగీత సాహిత్యాలు: అక్షర రమ్యత'***లో సంగీత, సాహిత్యానికి అక్షర రమ్యత లేకపోతే ఎటువంటి లోటు కలుగుతుందో స్పష్టం చేశారు. సంగీత, సాహిత్యాలు పుట్టినప్పటి నుండి సోదరత్వంతో మెలిగాయని చెప్పారు. సాహిత్యం అంటే భాష మనకు సహజంగా అలవడుతుంది. కాని నాద విద్య మాత్రం ప్రయత్నంతోనే వస్తుందని సూచించారు. ఈ రెండు విద్యల్లో హద్దులు మీరితే ప్రమాదంలో పడతాయని కూడా చెప్పారు. ఈ విధానం మనం

---

[43] నాటకోపన్యాసములు. పుట. 78.

[44] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 316.

[45] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 317.

త్యాగయ్యగారి కీర్తనల్లో గమనించవచ్చునన్నారు. ఈయన సంగీతానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడంతో సాహిత్యంలో లోటు కనిపిస్తుందన్నారు. కాబట్టి సంగీతంలో ఎంత సమర్థులైనా సాహిత్యంలో కొంత కృషి చేస్తేనే రెండూ నిలబడగలిగేవని సూచించారు. శర్మగారు ఈ వ్యాసంలో సంగీత, సాహిత్యాలను నిర్లక్ష్యం చేస్తే, వచ్చే నష్టాన్నిలా ప్రస్తావించారు. *''నాదాభిమానం కల రచయితలు భాషాభిమానాన్ని చాలా హద్దులో ఉంచుకోకపోతే మూలద్రవ్యానికే లోపం వచ్చే సంభవం కద్దు. అట్లు హద్దులో ఉంచగలిగిన భాష, సాహిత్యం సంగీతానికి ఎన్నో విధాల సహాయం చేయగలదు.''*[46]

ఈ వ్యాసంలో నన్నయగారి అక్షర రమ్యత విశేషాలను గుర్తుచేస్తూ, ఇది సంగీతానికి, సాహిత్యానికి ఎలా తోడ్పడుతుందో వివరించారు. అచ్చులు సంగీతానికి ఉపయోగపడితే, హల్లులు సాహిత్యానికి సహాయపడతాయని సోదాహరణంగా తెలియజేశారు. సంగీత, సాహిత్యాల్లో అక్షర రమ్యత 'ప్రాచీన గీతకవుల ప్రకృష్టసాక్ష్యానికి' నిదర్శనమని కింది పదాన్ని ఉదహరించారు.

***"హరవరముకుటజటాలలితం***
***అమరవధూకుచపరిమలితం***
***బహువిధకుసుమరజోరుణితం***
***విజయతే గంగావిమలజలం"***[47]

పై పదాన్ని పురస్కరించుకొని మనదేశ భాషలో ఉన్న హల్లుల సామర్థ్యం ఎంతో గొప్పదని, ఇలాంటిది మరే దేశంలో లేదని రాళ్ళపల్లివారు చెప్పారు. ప్రాకృత భాషలో ఉన్న గీత వాఙ్మయం సంస్కృత భాషలో లేదన్నారు. జయదేవుడు తమ 'గీత గోవిందం' లో పాటలనూ, పద్యాలనూ కలగలిపి అద్భుత రచన గావించాడని చెప్పారు. వీరి రచనల్లో నాద వ్యక్తి విస్తారానికి అవకాశం చాలదనిపిస్తుందని రాళ్ళపల్లివారు పలు కారణాలను పేర్కొన్నారు. అలాగే, వ్యాసంలో తాళ్ళపాక అన్నమయ్య పాటను కూడా ఉదహరించి సంగీత, సాహిత్యాలు మేళవించిన అక్షర రమ్యత ఉందని తేల్చిచెప్పారు.

***'వేమన కవిత్వము, హాస్యము, నీతులు'*** అనే వ్యాస మధ్యభాగంలో వేమన కవిత్వాన్ని, వ్యాసాన్ని, నీతులను లోతైన దృష్టితో పరిశీలించిన రాళ్ళపల్లివారు సాహిత్య తత్త్వాన్ని అద్భుతంగా చర్చించారు. ఇందులో ప్రధానంగా వేమన దేన్ని ఆశించి కవిత్వం రాశాడన్న విషయాల్నీ పరిశోధనాత్మకంగా తెలిపే ప్రయత్నం చేశారు.

మన పెద్దలు 'కావ్యం యశసే అర్థ కృతే', 'ఊరక కృతుల్ రచియింపు మటన్న శక్యమే' అనే గొప్ప మాటలను చెప్పారు. నిజంగా మన కవులంతా వీటికి కట్టుబడే తమ రచనా వ్యాసంగాన్ని కొనసాగించడం కనిపిస్తుందని శర్మగారు గుర్తు చేస్తూ, వేమన మాత్రం

---

[46] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 329.
[47] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 331.

ఎటువంటి కీర్తి ప్రతిష్ఠలను ఆశించకుండా తనకు తెలిసిన దానిని నిర్భయంగా లోకానికి చెప్పాడని కొన్ని పద్యాల్ని ఉదహరించారు.

గుంటుపల్లి ముత్తమంత్రి ***"ఆ పడుచు నిచ్చువానిఁ బద్య మిచ్చినవాని***
***కడుపు చల్లఁజేసి గౌరవమున***
***నడపలేనివాఁడు....."*** (పుట:143) (2375)

ఈ పద్యాన్ని ఉదహరించి ఎవరిలోనైనా మంచి గుణాలు కనిపిస్తే, వాడి పక్షాన చేరి పద్యాలు రాసే స్వభావం కలవాడని వేమన. దీంతో పూర్తిగా విభేదించి, వేమనకు అలాంటి తత్త్వం లేదని శర్మగారు ఉద్ఘాటించారు.

రాళ్ళపల్లివారు వేమనలోని బహిరంగ, అంతరంగాలను తులనాత్మకంగా పరిశీలించి ఈయన అంతరంగానికి చెందిన వ్యక్తని చెప్పారు. వీరి కవిత్వంలో అంతరంగం చాలా బాగుందన్నా శర్మగారు బహిరంగాన్ని తప్పుబట్టారు. ముఖ్యంగా భాష, ఛందస్సులలో వేమన అక్కడక్కడ అశ్రద్ధ ప్రదర్శించాడని సోదాహరించారు. వ్యక్తిగతంగా కూడా వేమన బహిరంగంగా శ్రద్ధ చూపలేక పోవడం గమనార్హమని వ్యాసకర్త తెలిపారు.

వేమన కవిత్వం ఎంత గొప్పగా ఉన్నా పండితులు ఆదరించక పోయారని శర్మగారు నిరసించారు. సర్వ వ్యాప్తమైన వేమన కవిత్వానికి చదువుకున్నవారు ఎప్పటికీ లొంగి ఉండడానికి గుణాలే కారణమన్నారు. ఈ వ్యాస మధ్యభాగంలో శర్మగారు భావుకుడు, భావము, వస్తువు, రచన, సభ్యులు అనేవి కవిత్వానికి పంచభూతాలాంటివని భావించి సుదీర్ఘంగా చర్చించారు. అసలు కవిత్వానికి భావాలు ప్రాణాలని, వస్తువు, భాష అనేవి అవయవాలని అభివర్ణించారు. అలాగే భావాలు నిండు కడవ లాంటివని, దీన్ని లాగడానికి భాష ఒక తాడులాగా పనిచేస్తుందని చెప్పారు. వస్తువు గురించి చెప్తూ, 'కాదేదీ కవితకనర్హమన్నట్లు' వివరించారు. దేన్ని కవిత్వంగా చెప్పినా దానికి 'స్పష్టత, సరళత, సమగ్రత' అనే లక్షణాలు ప్రధానమని సూచించారు. వీటికి ఛందస్సు, లయ వంటివి గొప్పగా తోడ్పాటు నిస్తాయని అన్నారు. కవి సృష్టించిన కవిత్వంతో అందరూ తృప్తి పడటం కష్టమని చెప్తూ, ఇలా వేమన కవిత్వంతో కొందరికి సంతోషం కలిగించక పోవచ్చునని అన్నారు.

సాధారణంగా సాహిత్య లోకంలో భావాలు సొంతంగా ఉండక పోవడం కద్దని రాళ్ళపల్లి అన్నారు. స్వయంగా చెప్పిన మాటల కంటే అరువు మాటలే సమాజాన్ని తొందరగా ఆకట్టుకోగలవని వ్యాసకర్త చెప్పడంలో ఎంతో వ్యంగ్యముంది. కాని వేమన కవిత్వంలో అరువుగా తెచ్చిన భావాలు ఎక్కడ లేవని, తాను స్వయంగా తెలుసుకొన్న వాటినే అవతలి వారికి ఇంపు కలిగేటట్లు చెప్పాడని రాళ్ళపల్లివారు గుర్తుచేశారు. అంతేగాక ఆకాలపు వారి దృష్టిలో విచిత్రమైన కల్పనలు, భావాలు ఉన్నవారినే కవులుగా భావించడాన్ని ఈయన దుయ్యబట్టారు.

వేమన తన భావాలను ఒక పద్ధతిలో వెల్లడించడానికి 'ఆటవెలది' ఛందస్సును విరివిగా ఉపయోగించాడని శర్మగారన్నారు. వేమన తన ఆలోచనల్ని ఆటవెలది పద్యాల్లోనే చక్కగా

చెప్పగలనని భావించి ఉండవచ్చు. కందం, సీసం, తేటగీతుల్లో కొన్ని పద్యాలు అక్కడక్కడ వినియోగించాడు కాని ఎక్కువగా 'ఆటవెలది' ని ఇష్టపడడం జరిగింది. దీనివల్ల తెలుగు సాహిత్యంలో 'ఆటవెలది' ఛందస్సు ఎందరినో ఆకర్షించటం పరిపాటి. తర్వాత కొందరు కవులు ఆయా ఛందస్సులో తమ తమ ప్రతిభా పాటవాలు చాటుకోవడం ముదవాహమన్నారు. కాగా వేమన 'ఆటవెలది' కి ఉన్నంత ప్రచారం దేనికి లేకపోవడం గమనార్హ మన్నారు. ఓ రెండు 'ఆటవెలది' పద్యాలిలా ఉదహరించారు.

*"ఆ. వె. కడుపు బోరగించి కన్నులు ముకిళించి*
*బిఱ్ఱ బిగుసుకొన్న బీదయోగి*
*యమునిబారిగొట్టి యతఁడేమి సేయును...."* (పుట: 156) (73)

*"ఆ. వె. కోతిఁబట్టి తెచ్చి క్రొత్తపుట్టము గట్టి*
*కొండముచ్చులెల్ల కొలిచినట్లు*
*నీతిహీను నొద్ద నిర్భాగ్యులుందురు...."* (పుట: 156) (1201)

పై పద్యాలను పరిశీలించి వేమన కవిత్వంలో ఉండే తత్త్వాన్ని వ్యాసకర్త ఇలా అభివర్ణించారు. "*తాను చెప్పు ప్రతి న్యాయమునకును ఒక యుపమానము తప్పక యుండును. ఆ యుపమానములు గూడా ఊహా కల్పితములు గాక, యింటిచుట్టు ముట్టుఁగల వస్తువు లగుటచే, వాని సొగసును బిగువును అందఱనుభవించి యానందింతురు.*"[48] అని వేమన కవిత్వంలోని సహజత్వాన్ని ప్రశంసించారు.

రాళ్ళపల్లివారు వేమన కవిత్వంలోని హాస్యాన్ని లోతుగా పరిశీలించారు. అది సమాజంలో ఎంతో మార్పును కలిగించిందన్నారు. తెలుగు సాహిత్యంలో వేమన పద్యాల్లో హాస్యం విస్తృతంగా ఉంది. ఈ హాస్యానికి ఎంతో పటుత్వం ఉండడం గమనించవచ్చు. వేమన తన స్వతంత్ర ఆలోచనలతో రాయడమేకాదు మన చుట్టూ ఉండే పరిస్థితులనే వస్తువుగా తీసుకోవడం ఆకట్టుకునే విషయమన్నారు. ఈయన హాస్యం కొన్ని సార్లు ఇబ్బంది పెట్టేటట్లు ఉంటుందంటూ...

ఆ. వె. *"గొడ్డుటావుఁ బితుకఁ గుండ గొంపోయిన*
*పండ్లు రాలఁదన్ను; పాలనీదు;*
*లోభివాని నడుగ లాభంబు లేదయా..."* (పుట:159) (1333)

ఇలా సాధారణ విషయాలతోనే గొప్ప హాస్యాన్ని పండించిన వేమన అందరికి తెలిసిన సామాన్యాంశాలనే గంభీరంగా రెండు పాదాల్లో చెప్పి, మూడవ పాదంలో దానికి ఒక కొత్త మార్గాన్ని వేసే ప్రయత్నం చేయటం ప్రత్యేకమైందని రాళ్ళపల్లివారు కొనియాడారు.

వేమన కవిత్వంలో కేవలం హాస్యమే కాదు దానికి మించిన స్థాయిలో నీతి దాగి ఉంటుందని అనంతకృష్ణశర్మ పునరుద్ఘాటించారు. మంచి చెడ్డలు, న్యాయాన్యాయాలు,

[48] వేమన. పుట. 157.

ధర్మాధర్మాలను తత్త్వాల గురించి వేమన కవిత్వంలో దొరికినంతగా మరెక్కడ దొరకదన్నారు. వేమన ని స్వార్థ జీవితం గడిపిన వాడనీ, ఈయన చెప్పే నీతి, హాస్యాల్లో భావి తరాలకు ఉపయోగపడే సంస్కరణ ధోరణి ఉంటుందని వ్యాసకర్త తెలిపారు. సమాజం దేని వల్లా, ఎవరి వల్ల ఇబ్బంది పడుతుందనే విషయాలను వేమన చాలా సూక్ష్మంగా ఆలోచించినట్లు కనిపిస్తుందన్నారు. శత్రువుల్ని కూడా ప్రేమించే హృదయం వేమనలో ఉందని రాళ్ళపల్లివారు చెప్పారు.

*"ఆ. అనువుగాని చోట నధికుల మనరాదు*
*కొంచె ముందు టెల్ల కొదువగాదు*
*కొండ యద్దమందు కొంచెమైయుండదా?....* (పుట: 165)

(128) వంటి పద్యాలను ఉదహరించి వేమన కవిత్వంలో స్వానుభావం, వివేకం, చాలా ప్రబలంగా ఉన్నాయన్నారు.

*"ఆ. ఆలి మాటలు విని అన్నదమ్ముల రోసి*
*వేఱె పోవువాఁడు వెఱివాఁడు*
*కుక్క తోఁకబట్టి గోదావరీఁదునా?...."* (పుట:165) (298)

వంటి పద్యాలను ఉదహరించి వేమన కవిత్వంలో వస్తు ధర్మాల క్రమం, ఉపమానాల తత్త్వం, పరమత ఖండనం లాంటివెన్నో విషయాలు అనన్య సామాన్యంగా ఉంటాయని రాళ్ళపల్లి వారు అభిప్రాయపడ్డారు.

వేమన కవిత్వాన్ని బ్రౌను, కాంబెల్ దొరలు తమ తమ దృక్పథాలకు అనుగుణంగా మలుచుకొని విశ్వవ్యాప్తం చేశారు. కాని మన తెలుగు వారు మాత్రం వేమనని కవుల చత్రంలోకి తీసుకురాలేక పోవడం విచారకరమని రాళ్ళపల్లి వాపోయారు. ముఖ్యంగా రాబోయే తరాలకు వేమన పద్యాల్లోని కవిత్వాన్ని, హాస్యాన్ని, నీతిని పరిచయం చేసి, వారి మానసిక స్థాయిని అభివృద్ధి పరచాల్సిన అవసరం ఎంతైనా ఉందని శర్మగారు ఈ వ్యాస మధ్యభాగంలో ఆకాంక్షించారు.

***'వేమన కాలమందలి మత ధర్మముల స్థితి'*** అనే వ్యాసంలో రాళ్ళపల్లివారు అప్పటి సంఘ స్థితిని, ద్వైత, అద్వైత సిద్ధాంతాలను, జైన, బౌద్ధ మతాల మనుగడను, శ్రీ వైష్ణవం, వీరశైవం, శంకరం మొదలైన వాటి ధర్మాలను లోతైన అవగాహనతో నిష్పక్షమైన అభిప్రాయాలను వ్యాసం మధ్యలో వెల్లడించారు.

శర్మగారు ముందుగా ప్రాచీన, ఆధునిక కాలాల్లో ఉండే ధర్మ స్థితిగతులను స్పష్టం చేస్తూ, ప్రస్తుత రోజుల్లో అర్థం ప్రధాన పాత్ర పోషిస్తుంటే, పూర్వం ప్రతి విషయంలో మోక్షం ప్రబలంగా ఉండేదన్నారు. ఈ మోక్షం గురించి ఆసాంతం చర్చించి ప్రాచీనులు 'మోక్ష ద్వేషులు' కాదని నిరూపించారు. నేటికి కొన్ని విషయాల్లో ప్రాచీనులు అనుసరించిన మార్గాలనే ఆధునికులు అనుసరిస్తున్న సందర్భాలున్నాయన్నారు. ఈ మోక్ష దృష్టే ప్రాచీనులను ధర్మ

బద్ధులుగా, ఆధునికులను ఆర్థికులుగా చేసిందని చెప్తూ, ఇహ పర లోకాలు రెండు ఒకటేనని శర్మగారు పునరుద్ఘాటించారు.

రాళ్ళపల్లివారు వేమనను ధార్మికులు నివసించిన కాలంలో పుట్టాడని చెప్పి, అక్కడక్కడ అన్యాయపు చాయలు పెల్లుబుకుతున్న స్థితిని కూడా చూపించారు. అప్పటి శిష్టులు ఏది చెప్తే, అది ధర్మంగా చలామణి అవుతుండేదని గుర్తు చేశారు. ఇటువంటి పరిస్థితి వేమనలో మార్పులు తీసుకోవచ్చిందని వ్యాసకర్త పరిశోధనాత్మక దృష్టితో తెలిపారు.

అప్పటికి ద్వైతం, అద్వైతం విస్తృతంగా చలామణిలో ఉండేవని, జైన, బౌద్ధ మతాలు ఇదమిత్థంగా ఉన్నాయి తప్ప అంత ప్రభావాన్ని కలిగించ కుండా ఉన్నాయని, ఇక చార్వాకులు ఒక ప్రత్యేక మార్గాన్ని అనుసరించడం కనిపిస్తుందని రాళ్ళపల్లివారు చెప్పారు. భగవంతుడు, భక్తుడు వేరు వేరని నమ్మిన సగుణ బ్రాహ్మణులు ద్వైతులైతే, వీరికి విరుద్ధంగా ఇద్దరు ఒకటే అనే సిద్ధాంతం నిర్గుణ బ్రాహ్మణులైన అద్వైతులదనే వాదాలను వెల్లడించారు. కాగా ఈ సిద్ధాంతాలు ఒకదానిలో ఒకటి లీనమవటం జరిగిందని ఆయన అన్నారు. ఇక్కడ అద్వైతుల్లో అనేక మార్పులు వచ్చి, శివుడు, విష్ణువు, బ్రహ్మలను దేవుళ్ళను పూజించగా, ద్వైతుల్లో దీనికి మించిన మార్పులు వచ్చి అనేక గ్రామ, వీధి దేవుళ్ళు వెలిశారని సూక్ష్మ దృష్టితో వ్యాసకర్త చెప్పారు.

ఆనాడు ఆధిపత్య వర్గాలు వేదాలు, పురాణాలను బాగా అవపోసన పట్టిన బ్రాహ్మణులు చెప్పినట్లు నడుచు కోవటం ఆచారంగా ఉండేదని, వీరి చెప్పు చేతల్లోనే ప్రతి కార్యం జరిగేదని శర్మగారన్నారు. దీన్నే అదనుగా భావించి బ్రాహ్మణులు కొంత డాంబికంగా ఉండి ఇతర వర్గాలను చిన్న చూపు చూడసాగిరని తూర్పారబట్టారు. వీరికి వ్యతిరేకంగా వీరశైవం పుట్టుక రావటం జరిగింది. *''బ్రాహ్మణ విధానానికి వ్యతిరేకంగా వివిధ కులాలు ఏకమైన సందర్భాన్ని బౌద్ధమతంలో చూడగలం. ఆ తర్వాత కాలంలో శక్తిమంతమైన ఉద్యమంగా వీరశైవం రూపొందింద''* ని[49] పిల్లల మర్రి రాములు ధ్రువీకరించారు. దీంట్లో నుండే వేమన వచ్చారని సూచించారు. ఈ జ్ఞానుల ఆధిపత్యం ఎలా ఉండిందో చూడండని శర్మగారు కింది పద్యాన్ని ఉదహరించారు.

> ***"ఆ భూమిలోను పుణ్య పురుషులు లేకున్న***
> ***జగము లేల నిల్చు పొగులుఁగాక,***
> ***అంత తఱుచు దొరక రాదనాదనుగాని...."*** (పుట:81) (2868)

వేమన శైవుడైనప్పటికి కూడా అక్కడ ఉన్న దుర్గుణాలను సైతం వదల కుండా విమర్శించారు. కేవలం బ్రాహ్మణులు, వైష్ణవులనే కాకుండా ఎక్కడ అన్యాయం ఉంటే అక్కడ వేమన పద్యం వాలిందని రాళ్ళపల్లివారు ఉద్ఘాటించారు.

---

[49] తెలుగులో భక్తి కవిత్వం సామాజిక విశ్లేషణ. పుట. 26.

సగుణ బ్రహ్మవాదుల లీలావాదాన్ని, నిర్గుణ బ్రహ్మవాదులు మాయ వాదాన్ని వేమన దుయ్యబట్టారని రాళ్ళపల్లివారు అన్నారు. ఒక సందర్భంలో వేమన యజ్ఞ యాగాదుల్ని విమర్శించిన విధానం గమనించండని చూపిన పద్యం ఇది.

*"ఆ. విప్రులెల్లఁ జేరి వెఱ్ఱికూఁతలు గూసి*
*సతిపతులను గూర్చి సమ్మతమున*
*మును ముహూర్త మంచ ముండెట్లు మోసెరా....?* (పుట:84) (3537)

ఇలాంటి పద్యాలు చాలా ఉన్నాయని శర్మగారు గుర్తుచేశారు. అంతేగాక కొన్ని సందర్భాల్లో బ్రాహ్మణుల ఆలోచనలను మెచ్చుకున్న సందర్భం కూడా మరికొన్ని పద్యాల్లో కనిపిస్తుందని చెబుతూ ఆయా పద్యాలను వ్యాసంలో ఉదహరించి చూపించారు. కాగా సహృదయులైన బ్రాహ్మణులెంతో మంది వేమనను ఆదరించినట్లు రాళ్ళపల్లి వారు చెప్పారు. వేమన సమాజంలో ఉన్న జాతి, మతాల మధ్య గల తారతమ్యాలను తక్కెడలో వేసి కొలిచారని వ్యాసకర్త పునరుద్ఘాటించారు.

ఆనాడు యోగులుగా మారిన వారి గురించి వ్యాసంలో శర్మగారు ప్రత్యేకంగా చర్చించారు. వీర శైవులు ఈ యోగ విద్యను స్వీకరించినట్లు తెలుస్తుందన్నారు. వీరు తొలుత అద్వైతులుగా ఉండి యోగాను వదిలారు. అయితే శంకరాద్వైతులుగా ఉన్నవారు ఈ యోగాను లోతుగా అభ్యసించడం కనిపిస్తుందని వ్యాసకర్త సూచించారు. బ్రాహ్మణుల్లో శంకరులున్నారు కాని వారు యోగ విద్యను నేర్వలేక పోయారు. వీర శైవులు యోగ విద్యను నేర్చిన కొందరు ఆలు బిడ్డలను వదిలినవారు, బ్రహ్మచార్యులైనవారు అడవుల్లోని కొండల్లో విహరించి విశిష్టతగల 'స్వర్ణవాద' విద్యను నేర్చారు. దీన్ని పాటించే వారు కఠినమైన నిర్ణయాలను అనుసరించేవారని శర్మగారు తెలిపారు. ఇలా ఆనాడు వీరందరూ బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని తగ్గించడానికే యోగ విద్యను అభ్యసించి ప్రత్యేకంగా చలామణి అవ్వటం పరిపాటి.

వేమన పేదరికాన్ని అనుభవిస్తున్నపుడు కంసాలి వారిని ఆశ్రయించి వారి వృత్తిని నేర్చుకోవడానికి ప్రయత్నించాడు. కాగా వారి నుండి బయటికి వచ్చి హఠ యోగ విద్యను అభ్యసించడానికి ప్రయత్నించినప్పుడు చాలా మందికి అనేక సేవలు చేశాడు. కాని ఆ విద్యను వారు వేమనకు పూర్తిగా నేర్పించలేదని శర్మగారు తెలిపారు. ఇలాంటి సందర్భాల్లో వారిని నిరసిస్తూ ఎన్నో పద్యాలను రాశారని కూడా వెల్లడించారు.

ఇలా వేమన తన కాలంలో వెలసిన అనేక మతాల మధ్య ఉన్నాడు కాబట్టి ఎన్నో పరిస్థితులను స్వయంగా చూడగలిగాడని వ్యాసకర్త చెప్పారు. ఎంతో లోతైన పరిశీలనతో శర్మగారు తన మెదడుకు పదును పెట్టి ఎన్నో ప్రామాణికమైన విషయాలను బయటపెట్టారు. ముఖ్యంగా భావితరాలు ఈ మతాల ప్రభావాలను ఎలా అవగాహన చేసుకుంటే బాగుంటుందో

చెప్పే ప్రయత్నం చేశారు. అంతేగాక వేమన ఈ జ్ఞానాన్ని పొందడానికి సమాజమే గొప్ప అవకాశం కలిగించిందని రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ స్పష్టం చేశారు.

ఈ విధంగా శర్మగారు వ్యాస మధ్య భాగాన్ని లోతుగా, విస్తారంగా రాసుకుంటూ వెళ్ళారు. చెప్పే విషయాన్ని ఎక్కడ పక్కకు పోనియకుండా చాలా జాగ్రత్తగా ఆయా అంశాల్ని తెలిపారు. సందర్భాన్ని బట్టి హాస్య, వ్యంగ్య ధోరణుల్ని మిళితం చేస్తూ ఇవ్వాల్సిన జ్ఞానాన్ని ఇస్తూ ముందుకు వెళ్ళారు.

### 3.3.3. వ్యాసంలో అంత్య భాగం

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ వ్యాస విషయాన్ని బట్టి ముగింపును తిర్చిదిద్దారు. ఇక్కడకూడా ఆది బాగానికి ఇచ్చినట్లు శీర్షికలు ఇవ్వలేం కనుక. మధ్యభాగం విస్తారంగా కొనసాగిన విషయం చివరలో ఒకటో లేదా రెండు పేరాలనుంచి అంత్య భాగం మొదలవుతుంది. దీన్నే అంత్య భాగం అనడం జరిగింది. కొన్ని వ్యాసాలను పరిశీలిస్తే ఆయా అంత్యభాగాలు అవగతమవుతాయి.

***'రాయల నాటి రసికత'*** వ్యాసం ముగింపులో. *''జనులలో రసికత పెరిగినట్లు సదసత్తులు, తరిగిన తరుగును కావున నెన్ని దోషములున్నను రసికత్వము తిరస్కరింపదగినది కాదు. అది నాగరికతకు నిదానము; పౌరుషమునకు ఫలము; అభ్యుదయమునకాధారము.''* [50] అంటూ రాళ్ళపల్లి వారు రాయల కాలంలో ప్రజల అనుభవించిన రసికతను, నేటి కాలపు ప్రజలు అనుభవిస్తున్న రసికతతో తులనాత్మకంగా పరిశీలించారు. రాను రాను సమాజంలో వచ్చిన కొన్ని విపరీతమైన మార్పులను విమర్శించారు. ఆనాటి ప్రజల జీవితమే ఉన్నంతలో ఉత్తమమైనదని ఉద్ఘాటించారు. అంతేగాకుండా ఆ కాలం నాటి ప్రజల జీవితాలు ఆధునికులు స్ఫూర్తిమంతంగా ఉన్నాయని శర్మగారు గుర్తు చేశారు.

***'తిక్కన తీర్చిన సీతమ్మ'*** ఈ వ్యాస అంత్య భాగంలో రాళ్ళపల్లివారు వ్యాసుడు, భవభూతి, తిక్కనలు రాసిన రామాయణాల్లోని ఆయా పాత్రల ఔన్నత్యాన్ని అభివర్ణిస్తూ వ్యాసాన్ని ముగించారు. ఉదాహరణకు *''దీనిని ముఖ్యంగా రాముని దృష్టితో అనుభవించినవాడు భవభూతి. అట్లే సీతాదేవి దృష్టితో చూచి వేదన పడినవాడు తిక్కనామాత్యుడు; వాల్మీకి మహర్షిది ప్రధానంగా ధర్మదృష్టి యని చెప్పబనిలేదు.''* [51] ఈ మాటల్లో రాళ్ళపల్లి వారి సంస్కృతాంధ్ర పాండిత్యం సునిశితమైన విమర్శన దృష్టి వ్యక్తమవుతాయి. శర్మగారు ఈ వ్యాసంలో తిక్కన తీర్చిదిద్దిన సీతమ్మ గురించి రాసినా వాల్మీకి, భవభూతుల పాత్ర చిత్రణ కౌశలంతో పోలుస్తూ తిక్కనగారి పాత్ర చిత్రణ చాతుర్యాన్ని వెలువరించాడు. ఇతర విమర్శకులలో సాధారణంగా కనబడని శర్మగారి తులనాత్మక

[50] సారస్వతాలోకము. పుట. 24.

[51] సారస్వతాలోకము. పుట. 129.

పరిశీలినా దృష్టి ఈ వ్యాసంలో ప్రస్ఫుటంగా గోచరిస్తుంది. రాళ్ళపల్లి వారి వ్యాస రచనా వైశిష్ట్యానికి ఇదొక చక్కని నిదర్శనం.

***'త్యాగయ్యగారి నాద సుధా రసం'*** ఈ వ్యాస సమాప్తిలో *''కవిత్వం రసింపగలిగితే తెలుగు తెలిసిన వారానందిస్తారు. కాని త్యాగయ్యగారి నాదసుధ దొరికితే – హిందువులే కాదు. మనుష్య జాతే తరించి పోతుంది. ఆయన కళ నారాయణాస్త్రం; దానికి నమస్కారం తప్ప వేరే ఎదురేమీ లేదు.''* [52] ఇక్కడ శర్మగారి ఈ మాటలు ఆదర్శనీయమైనవని అనవచ్చు. కళలనేవి నిత్యం ఆస్వాదించదగినవి కాబట్టి వీటికి తరతమ భేదాలు ఉండవని రాళ్ళపల్లి వారన్నారు. అంతేగాక వీటిని ఎంతో బాధ్యతతో కాపాడుకోవాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా త్యాగయ్యగారిలో ప్రవర్ధిల్లిన భక్తి, గానం, కవితలను నిశితంగా పరిశీలించి స్పష్టమైన అభిప్రాయాలను వెల్లడించిన శర్మగారు త్యాగయ్యగారికి నమస్కారం తప్ప మరేమీ చేయలేమని చెప్పారు. ఇలాంటి గొప్ప వారందించిన విద్యలు రాబోయే తరాలకు దారి దీపాలని సూచించారు.

***'నాటకోపన్యాసములు'*** ఇరవయ్యో శతాబ్దం వచ్చే సరికి దాదాపు స్త్రీ, పురుషుల మధ్య ఉన్న భేదాలు తగ్గాయని చెప్తూ, స్త్రీలు కూడా అభినయ సంఘాలు స్థాపించుకొని నాటకాలు వేయవచ్చన్న ఈ వ్యాస చివరి వాఖ్యాలివి. *''దీనికిఁదోడు స్త్రీలే ప్రత్యేకముగా అభినయ సంఘములను స్థాపించుకొనిరేని మగవారిని రావలదని నిషేధించు నధికారమును వారి కబ్బినట్లయి తూనిక సరిపోవును. మఱియు అధికారము చలాయించుటయే యపరాధమా? అట్లేని మగవారి నీతిరీతులనుగూర్చి మగవారిప్పుడెన్ని విధముల నపరాధపడుచుండలేదు? ఆఁడవారినిగూర్చి నప్పుడు మాత్రము ఈ జోలి మనకేల యని యూరకుండ వలయునా? ఏల? వారేమి యేయడవులలోనో వసించు మృగ జాతివారా? మనుష్యులుకారా? వారును వీరును కలిసి మెలసి యుండవలసి యుండఁగా, ఇద్దరికిని పరస్పర సహవాసమున లాభనష్టము లెన్నో యుండఁగా, దానికిఁ దగినట్లు వ్యవహారపు నియమముల నేర్పఱచుకొనుట అనాగరకత యగునా? నియమము లేని స్వేచ్ఛావర్తనమే నాగరికతయేని యది యెంతత్వరలో నశించిన నంత క్షేమము.''*[53] అని ముగించారు.

రాళ్ళపల్లి వారు కళామయ జీవులు కాబట్టి కళలను నేర్చుకోవడానికి జాతి భేదాలుండవని చెప్పిన మాటలు 'త్యాగయ్యగారి నాద సుధా రసం' లోనే అన్నారు!. ఈ 'నాటకోపన్యాసములు' మొదటి వ్యాసం చివరి మాటల్లో కూడా అదే అభిప్రాయాన్ని చెప్పారు. దీనివల్ల రాళ్ళపల్లి వారి వ్యక్తిత్వం అవగతమవుతుంది. నాటకాల్లో స్త్రీ పాత్రలను పురుషులు కూడా వేసి మెప్పించవచ్చని చెబుతూ, దానికి కారణాలను ఇలా సూచించారు. పర స్త్రీ పరాయి మగవారితో నటించడంవల్ల కొంత నీతికి భంగం కలిగే అవకాశముంటుందని అన్నారు.

[52] సారస్వతాలోకము. పుట. 116.

[53] నాటకోపన్యాసములు. పుట. 35.

మానవ జీవితంలో కొన్ని నీతి నియమాలు పాటించడం చాలా ముఖ్యమని శర్మగారన్నారు. రాళ్ళపల్లివారు చెప్పిన ఈ అభిప్రాయం అనేక చర్చలకు దారితీసింది. కాని శర్మగారు తాను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి జీవించినవారు. అందుకే నియమాలు లేని నాగరికత ఎంత తొందరగా నశిస్తే అంతమేలని అభిప్రాయపడ్డారు.

వేమన గ్రంథంలోని మొదటి వ్యాసం ***'ఉపోద్ఘాతము'*** ముగింపులో రాసిన ప్రతి వాక్యం భావితరాలకు ఉపయోగపడేవేనంటూ...''*ఇతరుల భావములును రచనలును మనకెంత యసహ్యముగానున్నను వానిని తిద్దు నధికారము మనకు లేదని తలఁచుట మనవారనేకు లింకను నేర్వనివిద్య. కావుననే, అందందు కొన్ని యనావశ్యకమైన సవరణలున్నను, చిన్నదైనను, ఇప్పటికిని బ్రౌను దొర ముద్రణమే సర్వోత్తమ మని చెప్పుటకు సిగ్గగుచున్నది. అతఁడు మనకుఁ జేసిన మహోపకారమును నే నరగంట చూచుచున్నానని తలఁపకుఁడు. చెన్నపట్టణములోని ప్రాచ్యపుస్తకశాలలోని వ్రాతప్రతుల నొకమాఱైనను చూచిన వారికి తప్ప తక్కినవారి కామహనీయుని తప్పుతెలియదు. కాని యతఁడు దోసిలి నిండఁ బెట్టినను, పెట్టిన దెంతమంచి వస్తువైనను, అది బిచ్చమే. అతని యౌదార్యమున కతనిని పొగడుదము. కాని మన దారిద్ర్యమునకు సిగ్గుపడవలదా? ఇందఱు తిండికి దండుగ తెలుఁగు వారుండి వేమన వంటివాని విషయమై కూడ ఇంకను తెల్లదొరగారి తిరిపెమునకే యొడిఁ బట్టవలసినందు కేడ్వవలదా? ఆంధ్ర మహా పురుషులందఱితోడ వేమన్నకును యూనివర్సిటీ కుర్చీలపై సమానముగాఁ గూర్చుండఁ జోటిచ్చి ధన్యులైన ధీరులు ఆంధ్ర విశ్వకళాపరిషత్తువారు. వారు ఇంకఁ గొంత యౌదార్యము వహించి, వ్రాఁత ప్రతులను ప్రాఁత యచ్చుప్రతులను సేకరించి, సంప్రతించి, సవిమర్శముగా వేమన్న పద్యముల నూతన ముద్రణ మొకటిచేసి పుణ్యము గట్టుకొందురుగాక! సామాన్య లోకరిద్దఱితో ఆ కార్యము సాధ్యము కాదు గావున నా భారము ప్రకృతము వారికే చెందియున్నది.''*[54] అంటూ సమాప్తం చేశారు.

సుదీర్ఘమైన ఆలోచనతో చెప్పిన ఈ మాటలు సహృదయులను ఆలోచింపజేస్తాయి. విమర్శనాత్మకంగా వ్యాసాన్ని ముగించటం గొప్ప సాహిత్య నిర్మాణానికి దోహదం చేసిందని చెప్పాలి. లోపాలను కప్పి పుచ్చుకోవడం కాదు వాటిని ఎప్పటికప్పుడు సరిదిద్దుకోవడం మంచిదని ఆలోచింపజేసే ఈ వాక్యాలు మేల్కొలిపే విధంగా ఉన్నాయి.

***'నాటకోపన్యాసములు'*** గ్రంథంలోని రెండో వ్యాసం బాగా విస్తృతిగలది. దీనిలో ధర్మవరం రామ కృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరాయలిరువురు తెలుగు నాటక రంగానికి అజరామరమైన సేవ చేశారని రాళ్ళపల్లివారు కొనియాడారు. అంతేకాదు వీరిద్దరి నాటకాలను తులనాత్మకంగా పరిశీలించి అనేక విశేషాలను వెల్లడించారు. ''*ఆంధ్ర వాఙ్మయము పాశ్చాత్య సాహిత్య సంపర్కముతో క్రొత్తక్రొత్త తెరువులఁ దిరుగుట కుపక్రమించిన కాలమున ఆ భాషలో లేని నాటకరచనకై, ఆ కాలమున బహిష్కృతమగు అభినయవిద్యకై తమ*

---

[54] వేమన. పుట. 22–23.

*శక్తి యుక్తులనెల్ల నాజీవము ధారపోసిన కార్యశూరులు వీరిద్దఱు. వారు శక్తి కొలఁది, అనుకూలము కొలఁది, అవకాశము కొలఁది తయారుచేసి కట్టియిచ్చిన సద్ది చాలునా చాలదా యని చూచుకొవలసినది వారి మార్గమున ముందుకు నడవఁగోరువా రందఱు చేయవలసిన పని. నేను నాటకకర్తనుగాని, అభినేతనుగాని ఇదివఱకును గాకున్నను రెంటియందును కొంత యనురాగము గలవాఁడనుగాన, ఇప్పుడు నేఁ జేయఁ బ్రయత్నించిన దదే. కాని యిది వట్టి పై పరామరిక. లోఁతుకు దిగి చూడవలసినది, చేయవలసినది కొండంత కలదు. నాకన్న శక్తియు, అవకాశమును, అనుకూలమును గలవా రా పని కధికారులు.''* [55] అని రాళ్ళపల్లి వారు ధర్మవరం రామకృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరాయలు చేసిన నాటక కృషి భవిష్యత్ తరాలు ఎలా అందిపుచ్చుకోవాలని గుర్తుచేశారు. నాటక ప్రక్రియపై శర్మగారికున్న లోతైన పరిశీలన దీని వల్ల తేటతెల్లమతుంది.

***'నిన్నటి సంగీతము – ఇరువురు సంగీత కోవిదులు'*** వ్యాసంలో రాళ్ళపల్లివారు తమ సంగీత గురువులైన వీణ శేషణ్ణ, బిడారం కృష్ణప్పల సంగీత ప్రతిభా విశేషాలను కొనియాడుతూ వ్యాసాన్నిలా ముగించారు. *''ఈ ఇద్దఱియందును దక్షిణాదిబాణీ లేదనువారు అప్పటికిని ఇప్పటికిని గలరు. నిజమే కారణము వారు స్వతంత్రులగు నిర్మాత లగుటయే. బాణీ అను పేరితో ఒకరిద్దఱి పోకడలనే అందఱును అచ్చుగొట్టు దుష్పద్ధతి యీవల దక్షిణ దేశమందు ప్రబలుచున్నది. నవ్యత నశించుచున్నది. ప్రతి వ్యక్తి యందును ఈశ్వరదత్తమగు విశిష్టగుణ మొకటియైన నుండును. అది స్ఫురించుటకు కళలందెల్ల సంగీతము సర్వోత్తమసాధనము. వీరిది ఒక ప్రత్యేకశైలి. వీరు ఇతరుల నెప్పుడును అనుకరింపలేదు. కావుననే ఇతరు లెవరును వారిని అనుకరింపజాలరు.''* [56] అంటూ తమ సంగీత గురువులైన వీణ శేషణ్ణ, బిడారం కృష్ణప్పగార్ల ప్రత్యేకతలను తెలియజేశారు.

***'సంగీత సాహిత్యాలు: అక్షర రమ్యత'*** వ్యాసాన్ని ముగించిన విధానం ఆకట్టుకునేలా ఉంది *''సంగీత సాహిత్యాల పరస్పర స్పర్థలో సంగీతము పై చెయ్యిగా నిలిచినప్పుడు కలిగే సహజ పరిణామాలలో ఈ అక్షర రమ్యత ఒకటి. అంతే తప్ప నియమమూ, శాస్త్రమూ కాదు. నిర్మాణోత్సాహం సంగీతంలో ఎక్కువగా ఉంటే సాహిత్యం తనంతట ఈ రమ్యావస్థకు దిగుతుంది. అట్లుగాక భక్తి, శృంగారం మొదలైన భావాల ఉద్రేకం ఎక్కువగా ఉంటే సాహిత్యమిచ్చే అక్షరా లెటువంటివైనా వాటితోనే సంగీతం సవరించుకోవలసివుంటుంది. మహామహులైన వాగ్గేయకారులందరి రచనలలోనూ దీన్ని మనం చూడవచ్చును.''* [57]

సంగీత, సాహిత్యాల్లో చెయ్యి తిరిగిన రాళ్ళపల్లివారు అక్షర రమ్యతను ఆకళించుకున్న మేధావని ఈ వ్యాసం చదివితే తెలుస్తుంది. సంగీతానికి, సాహిత్యానికి అక్షర రమ్యత తోడ్పడే విధానాన్ని శర్మగారు వ్యాసంలో నిర్మాణాత్మకంగా పొందుపరచారు.

---

[55] నాటకోపన్యాసములు. పుట. 78.

[56] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 317.

[57] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 333.

***'వేమన కవిత్వము, హాస్యము, నీతులు'*** అనే వ్యాసాన్ని శర్మగారు ఈ విధంగా పూర్తిచేశారు. *''నిజము చూడఁబోయిన కారణ మిదికాదు. రహస్యము వేఱు. మనము సంప్రదాయమునకు దాసులము. దానిని మార్చుకొను శక్తి మనలో ననేకులకు లేదు. వేమన పద్యములు పెద్దతరగతుల విద్యార్థులకు చదువ నియమించు సంప్రదాయము ఇదివరకు లేదు. ''అది లేకయే ప్రపంచము జరుగుచున్నదే; పరీక్షలలో విద్యార్థులు 'ప్యాసు' అగుచున్నారే; ఈ క్రొత్త సంప్రదాయము లేల? ఉన్నట్లుండనిత్తము'' – అనుటయే మన యిప్పటి స్థితి. ఆంధ్ర విశ్వకళాపరిషత్తు వారు ఈ విషయమున ముందంజవేసి యట్టి సంప్రదాయమును గల్పించిరేని శిష్యులకు హృదయోల్లాసము గల్గించినవా రగుదురు. తామును స్వధర్మమును నిర్వర్తించి ధన్యులగుదురు.''*[58]

వేమన పద్యాల్లో గొప్ప కవిత్వం, హాస్యం, నీతులున్నాయని ఉద్ఘాటించిన రాళ్ళపల్లివారు విద్యాధికారులు వీటిని గమనించక పోవటం వారి అవగాహన లోపమని విమర్శించారు. వేమన కవిత్వాన్ని విద్యార్థులు పాఠశాల స్థాయి నుండి చదవటం వల్ల వారిలో మానసిక స్థాయి పెరుగుతుందని గుర్తుచేశారు. దాన్ని ప్రభుత్వాలు, యూనివర్సిటీలు ముందుకు ప్రోత్సహించడంలో వెనకబడ్డారని ఏకరువు పెట్టారు. విదేశీయులకు ఉన్నంత అభిమానం స్వదేశీయులకు లేక పోవడాన్ని రాళ్ళపల్లివారు తప్పుబట్టారు. ఈ వ్యాసం ముగింపులో భవిష్యత్ తరాలు చేయాల్సిన కర్తవ్యాన్ని స్పష్టంగా తెలియజేయడం గమనిస్తే శర్మగారి ఆలోచన ఎంత లోతైనదో బోధపడుతుంది.

***'వేమన కాలమందలి మత ధర్మముల స్థితి'*** వ్యాసం చివర్లో రాళ్ళపల్లివారు స్వర్ణవాద విద్యా విలువలను, దాని రహస్యాలను వారు పాటించే కఠోరమైన నియమాలను లోతైన దృష్టితో పరిశీలించి, వాటిని వేమన ఎలా ఉపయోగించుకున్నారో తెలుపుతూ వ్యాసాన్ని ముగించిన క్రమం ఆలోచింపజేస్తుంది.

***"ఆ. ఇహమున సుఖియింప హేమతారక విద్య***
***పరమున సుఖయింప బ్రహ్మవిద్య***
***కడమ విద్యలెల్ల కల్ల మూఢుల విద్య....*** (పుట: 91) (436)

*అని నిర్ణయించుకొని, యట్టి యోగులలో ముఖ్యుఁడుగా నుండినవాఁడు గాఁ బోలును, లంబికాశివయోగి నాశ్రయించెను. ఇతని శ్రద్ధకు సంతసించి యతఁడును సరహస్యమగు యోగవిద్య నుపదేశించెను. దానిని గూర్చి ముందు మనవి చేయుదును.''*[59] అని రాళ్ళపల్లివారు యోగ విద్య రహస్యాలను ఎంతో లోతైన అవగాహనతో వివరించారు. వేమన జీవించి ఉన్న నాటి మత పరిస్థితులను రాళ్ళపల్లివారు చాలా స్పష్టంగా అర్థం చేసుకొని రాసిన విధానం మంచి పరిశోధనకు నిదర్శనంగా భావించవచ్చు.

[58] వేమన. పుట. 168.
[59] వేమన. పుట. 91.

ఈ విధంగా రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారి వ్యాసాల్నీ ఆది, మధ్య, అంత్య భాగాలుగా విభజించి పరిశీలించటం వల్ల తెలిసే ముఖ్యాంశాలు కింది విధంగా చూడవచ్చు.

## 3.4. రాళ్ళపల్లి వారి వ్యాస నిర్మాణ వైశిష్ట్యం

రాళ్ళపల్లివారు ఒక వ్యాసం రాయడానికి ఎన్నుకొనే విషయం నుండి దాన్ని ముగించే వరకు తీసుకునే జాగ్రత్తలు ప్రత్యేకమైన వనిగా కనబడతాయి. వీరి వ్యాసాల్లో ఉండే విషయాలు ఎంతో కుతూహలంగానూ, ఆసక్తికరంగానూ, ఆలోచనాత్మకంగానూ ఉండటం ఒక ఎత్తైతే, అత్యంత పరిశోధనాత్మకంగానూ, విమర్శనాత్మకంగానూ ఉండటం మరో ఎత్తు.కాగా శర్మగారు చెప్పే విషయానికి అవసరమయ్యే పూర్వాపరాలు పేర్కొనటంగాని, అందులోని గుణదోషాలను వెల్లడించడం గాని నిష్పాక్ష పాతంగా ఉండటం లాంటివి నూతనంగా ఉన్నాయి. శర్మగారు విషయాల్ని సూచనాప్రాయంగా చెప్పడమేగాక, వాక్యనిర్మాణంలోనూ, పదప్రయోగాల్లోనూ గొప్ప నేర్పును, తీర్పును కలిగినవారని పై అవగతమవుతుంది.

రాళ్ళపల్లివారు వ్యాసాంతాన్ని నిర్వహించిన తీరు నిరుపమానం, ఒక వ్యాసం వస్తు ప్రాధ్యాన్యాన్ని చక్కని చిక్కని రీతిలో చివర్లో చెప్పడం వీరికి వెన్నతో పెట్టిన విద్య. కొన్ని చోట్ల వ్యాస విషయాన్ని తులనాత్మకంగా పరిశీలించి, దాన్ని కొక విస్తృతినీ, వైశిష్ట్యాన్నీ సంతరించి పెట్టారు. మరికొన్ని చోట్లు విమర్శకులకు నూతన దృష్టిని, దృక్పథాన్ని కలిగిస్తారు. ఈ విధంగా శర్మగారి వ్యాస సమాప్తి వైవిధ్య భరితంగానూ, వైశిష్ట్య సమన్వితంగానూ రూపొందటం జరిగింది.

వ్యాసకర్తగా రాళ్ళపల్లి వారిని పరిశీలించే సందర్భంలో ఒక విషయం తప్పక గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. వీరు రాసిన వ్యాసాల్లో ముక్కాలు మువ్వీసం ఉపన్యాసాలేనన్న సంగతి మరువరాదు. ఈ ఉపన్యాస ప్రధాన లక్షణం ఎదుట వున్న శ్రోతల హృదయాలకు హత్తుకునేలా చెప్పడం. ఈ ధోరణి రాళ్ళపల్లి వారి వ్యాసాల్లో అడుగడుగునా కనడబడుతుంది. వీరి ఉపన్యాస వ్యాసాలు చదువుతున్నంతసేపు ఎక్కడా విసుగు పుట్టదు. చెప్పేదాన్నే మళ్ళీ, మళ్ళీ చెప్పరు. శ్రోతల స్థాయికి దిగి ఉపన్యసిస్తారు. అందువల్ల కఠినమైన విషయాన్ని కూడా సులభంగా అర్థమయ్యే రీతిలో ఆయన ఉపన్యాసాలు ఉంటాయి. అంటే శర్మగారి ఉపన్యాసాలే వ్యాసాలు. వ్యాసాలే ఉపన్యాసాలని చెప్పవచ్చు. వీరి ఉపన్యాస ప్రత్యేకతను పుట్టపర్తి నారాయణాచార్యులిలా అభివర్ణించారు. *“గంటలకొలఁది మాటలాడినను విసుగనింపించదు. అరుచి కనిపించదు. ఎదుటి వారిని నొప్పింపఁడు. బహిరంగముగా ఖండింపఁడు. తాను గూడా సానుభూతితో వారి వెంటనే నడచివచ్చినటులుండును.”*[60]

అంతేగాక చాలా మంది విమర్శకుల వ్యాసాల్లో కనపడని సరళత్వం రాళ్ళపల్లి వారి వ్యాసాల్లో గోచరిస్తుంది. ఉదాహరణకు శర్మగారు 1928లో వేమనపై చేసిన ఏడు ఉపన్యాసాలు వ్యాసాలుగా అచ్చులోకి వచ్చాయి. అలాగే ‘సారస్వతోపన్యాసములు’

---

[60] భారతి నవంబర్ 1941. పుట: 460.

(1931),'నాటకోపన్యాసములు' (1935), ఇటీవలే 2017 జూన్ లో వచ్చిన 'రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు' అనే గ్రంథంలోని కూడా ఎక్కువ భాగం ఉపన్యాసాత్మకమైన వ్యాసాలే ఉన్నాయి.

రాళ్ళపల్లి వారి వ్యాసాల్లో హాస్యం, వ్యంగ్యాత్మకమైన లక్షణంతో పాటు సమకాలీన సమాజ పోకడల ధోరణి ఉండటం మరో లక్షణం. శర్మగారి హాస్యం అప్పుడప్పుడు గిలిగింతలు పెడుతుంది. ఉదాహరణకు 'రాయల నాటి రసికత' వ్యాసంలో *''ఏ బుద్ధిమంతుడు దీనిని గల్పించెనో కాని యిది చాలా మంచి పద్ధతి; తక్కిన వారు తమ తమ పనులు తకరారు లేకుండ చేసుకోవచ్చును. ఆ కోపము తీర్చవలసిన అక్కరగలవారు పోయి తీర్తురు. కైకేయి కొఱకు దశరథుడే దీనిని కల్పించెనేమో''*[61] అని రాయల కాలంలో నిర్మించబడ్డ కోప గృహాల గురించి రాళ్ళపల్లి వారు చెప్పిన ఈ మాటలు సహృదయులకు నవ్వు తెప్పిస్తుంది. అలాగే శర్మగారి వ్యంగ్యపు కత్తికి రెండు వైపులా పదునుంటుందనడానికి నిదర్శనమైన మాటలు *''రమణీ ప్రియదూతిక తెచ్చియిచ్చు కప్పురవిడెము' లేకున్న కవిత్వము సాధ్యము గాదని పెద్దన చెప్పెను. ఇట్టి తాంబూలములోని యితర పరిమళ ద్రవ్యము లన్నియు దీనివైచి నేడు అనేకులు వానికి బదులుగా పొగాకును చేర్చుకున్నారు! నేటి వారనగా ప్రాత పద్ధతికి జేరిన వారనుట. క్రొత్త నాగరికతరుణులలో ననేకులకు తాంబూలము తల దిరిగించును గదా! కాని పొగాకు పొగ మాత్రము వారికి తిరుగుచున్న తలను నిలుపును.''* [62] అని వ్యంగ్య బాణాలు సూదంటు రాయిలా తగలక మానవు.

రాళ్ళపల్లి వారి వ్యాస రచనా వైశిష్ట్యాన్ని ప్రముఖ విమర్శకులైన ఘట్టమ రాజుగారు ఇలా వివరించారు. *''శర్మగారు వ్యాస రచనలకు అంశాన్ని ఎన్నుకొనేటప్పుడు చూపే శ్రద్ధాసక్తులు, విషయాన్ని వింగడించేటప్పుడు కనబరిచే తార్కికత, వ్యాసాంశాన్ని మెల్లమెల్లగా విస్తరిస్తూ పోయేటప్పుడు ప్రదర్శించే విజ్ఞత, రసికత, సుకుమార హాస్యం, తీక్షణమైన వ్యంగ్యం పఠితల్ని మంత్రముగ్ధుల్ని చేస్తాయి. వ్యాసకర్త అక్కడక్కడ ఇతరేతర విషయాలు ప్రస్తావించినా, అవి శాఖా చంక్రమణం అనిపించకుండా, మూల వస్తువు విశదీకరణకు దోహదం చేయటం విశేషం. రాళ్ళపల్లి వారు వ్యాసం ఆది మధ్య భాగాల్ని ఎంతో నేర్పుగా నిర్వహించడం ఒక ఎత్తైతే, అంత్య భాగాన్ని కొండంత ఓర్పుగా నడపడం మరో ఎత్తు. వ్యాస విషయాన్ని తల పొలం దాకా సునాయాసంగా, అవలీలగా తీసుకెళ్లి మణిపూసల్లాంటి పదాల్ని పేర్చి, వ్యాసానికి సమగ్రతను, సౌందర్యాన్ని సంతరించి పెడుతుంది ఈ అంత్య భాగం. అంతేకాక, వ్యాస విషయం గురించి విభిన్న కోణాల్లో దర్శింపగలిగే కొత్తచూపు ప్రసాదిస్తుంది. ఇలాంటి నూతనోత్తేజం కలిగించే ఎన్నో వ్యాసాలు రాళ్ళపల్లి వారి కలం నుంచి జాలువారటం గమనార్హం''*[63] అని అన్నారు.

---

[61] సారస్వతాలోకము. పుట. 6.

[62] సారస్వతాలోకము. పుట.18.

[63] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు – గోరంత దీపం. పుట. 6.

ఇలా రాళ్ళపల్లి వారి వ్యాసాల్లో హాస్య, వ్యంగ్యపు హొయలు పాఠకులకు విసుగు పుట్టించకుండా ఉత్సాహాన్ని నింపుతాయి. కాగా ఈ రెండింటిని పండించడానికి సమకాలీన విషయాలను ఎన్నుకోవడం మరింత ఆలోచింపజేసి మార్పుకు దారి చూపిస్తాయి. ఇలాంటి హాస్య, వ్యంగ్యాంశాలను తరువాతి అధ్యాయాల్లో సందర్భాన్ని బట్టి తెలపడం జరుగుతుంది.

## ఈ అధ్యాయంలో ముఖ్యాంశాలు

- రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి వ్యాసాలు సాహిత్య వ్యాస రచనకు ఆదర్శాలని చెప్పవచ్చు.
- ఎందుకంటే వ్యాసంలోని ఆది, మధ్య, అంతాలను విషయ సమన్వితంగా, వివేచన భరితంగా, కళాత్మకంగా తీర్చిదిద్దుతారన్న అంశాలు పరిచయం చేయబడింది.
- వీరి వ్యాసాలు ఎంతో కుతూహలంగా, ఆలోచనాత్మకంగా రూపొందాయని తెలుస్తుంది.
- శర్మగారి వ్యాసాల్లో హాస్యం పాఠకుల్ని మురిపింపజేస్తే, వ్యంగ్యం చురుకు పుట్టిస్తుందన్నదాన్ని చూస్తాం.
- ఈ అధ్యాయంలోనే కట్టమంచి రామలింగారెడ్డి, పింగళి లక్ష్మీకాంతల వారి వ్యాస రచనా విధానాన్ని శర్మగారి వ్యాసాలతో పోల్చి, వీరి వైశిష్ట్యాన్ని వివేచించడం జరిగింది.

తర్వాత అధ్యాయంలో రాళ్ళపల్లి వారి సాహిత్య విమర్శ గురించి తెలుసుకుందాం.



# నాల్గవ అధ్యాయం

# రాళ్ళపల్లివారి సాహిత్య విమర్శ

# నాల్గవ అధ్యాయం

# రాళ్ళపల్లి వారి సాహిత్య విమర్శ

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి వ్యాస నిర్మాణ వైవిధ్యాన్ని గత అధ్యాయంలో తెలుసుకున్నాం. ఈ అధ్యాయంలో రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి సాహిత్య విమర్శ కృషిని విశ్లించుకుందాం. ఈయన తెలుగు సాహిత్య విమర్శనా రంగంలో అందె వేసిన చెయ్యి. సునిశిత పరిశీలనా దృష్టితో సుస్పష్టమైన అభిప్రాయాలు చెప్పటంలో శర్మగారు అగ్రగణ్యులు. తెలుగు విమర్శనా రంగం మొదట అస్తవ్యస్తంగా ఉండేది. ఇది ఒక క్రమ పద్ధతిలో నిలబడేందుకు అనేక అవస్థలు పడాల్సి వచ్చింది. దీనిలో తలము నకలైనా ప్రాచీనులూ, ఆధునికులు ఎంతో మంది ఉన్నారు. ప్రధానంగా ఆధునిక విమర్శనా రంగాన్ని కొత్త పుంతలు తొక్కించింది కట్టమంచి రామలింగారెడ్డి. వీరి తర్వాత అదే తోవలో అన్వేషించి తన ప్రత్యేకమైన విమర్శనా దృక్పథంతో పటిష్టమైన మార్గాన్ని ఏర్పాటు చేసింది రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ. ఈయన విమర్శనా వైఖరిని తెలుసుకునే ముందు తెలుగు సాహిత్య విమర్శ ప్రవర్ధిల్లిన తీరు తెన్నులను స్థూలంగా పరిశీలించడం సముచితం. దీని వల్ల విమర్శ రంగం పరిణామాలు వికాసాలు అవగతమవుతాయి.

## 4.0. తెలుగు సాహిత్య విమర్శ – పూర్వ రంగం

తెలుగు సాహిత్య విమర్శ ప్రారంభంలో గ్రంథ పరిశోధన, పరిష్కరణ, కవుల చరిత్ర రూపంలో ఉండేది. 19వ శతాబ్దంలో ఈ రంగానికి ఒక నూతన ఉత్తేజం వచ్చింది. ఈ క్షేత్రంలో కందుకూరి వీరేశలింగం పంతులు, కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి, గురజాడ శ్రీ రామమూర్తి, పి. దక్షిణామూర్తి, వెన్నేటి రామచంద్రరావు, సుబ్రహ్మణ్య అయ్యర్, వింజమూరి రంగాచార్యులు మొదలైన ప్రముఖులు పేర్కొనదగినవారు. వీరందరూ కొనసాగించిన విమర్శ కేవలం కృతి కర్త, కృతి భర్త, కాలం, కులమతాలు, రస చర్చ, శబ్ద వ్యుత్పత్తి, కావ్య బహిరంగ చర్చ, లక్షణాలు, శబ్ద సాధుత్వ, అసాధుత్వం వ్యాకరణాంశాల వాదోపవాదాల రూపంలో నిక్షిప్తమైంది. ఈ ఉద్దండ పండితులు చేసిన విమర్శ కృషిని స్థూలంగా పరిచయం చేయబడుతుంది.

కందుకూరి వీరేశలింగం పంతులు ప్రథమాంధ్ర విమర్శకుడని, వీరు రాసిన '*విగ్రహ తంత్ర విమర్శనము*' (1876) తొలి తెలుగు విమర్శా గ్రంథమని ఎస్వీ రామారావు పేర్కొన్నారు.[1] '*విగ్రహ తంత్ర విమర్శనము*' లో లక్ష్య విమర్శ, భాషా విశేషాలు, కావ్యగతాంశాలు ప్రధానంగా చర్చించబడ్డాయి. అందుకే దీన్ని తొలి తెలుగు విమర్శ గ్రంథమని పిలిచారు. ఆరోజుల్లో కొక్కొండ వేంకటరత్నం పంతులు, శివశంకర పాండ్య '*విగ్రహ తంత్ర*

[1] తెలుగులో సాహిత్య విమర్శ. పుట. 102.

విమర్శనము' లోని లోపాలను ఎత్తి చూపితే, వీరేశలింగం పంతులు వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని చివరికి *'పండిన వృక్షమునకే రాతి దెబ్బలన్నట్టు, పుస్తకాలు వ్రాయువారికే విమర్శనముల రాళ్ళు తాకును''*[2] అని వాపోయారు. అయితే కోవెల సంపత్కుమారాచార్యులన్నట్లు *''ఒక గ్రంథమును గూర్చిన గుణ దోష విచార విస్తృతితో ప్రత్యేకముగా రూపు సంతరించుకొన్న 'విగ్రహ తంత్ర విమర్శనము' తెలుగు సాహిత్య విమర్శ రీతికి ఆద్యము కాగా, ఆధునిక యుగమున తెలుగులో సాహిత్య విమర్శ యన్నది వీరేశలింగం ప్రవృత్తము.''*[3] అన్న మాటలు అక్షర సత్యాలు.

వీరేశలింగం పంతులు *'ఆంధ్రకవుల చరిత్రము'* ను మూడు భాగాలుగా రాశారు. ఇది 1886, 1894, 1899 సంవత్సరాల్లో ముద్రించబడింది. ఈ గ్రంథంలో 232 మంది కవుల ప్రాథమిక సమాచారం చోటు చేసుకొంది. కవి, కృతి భర్తల సమాచారం, కవిత్వ లక్షణమనే పద్ధతిలో రచించబడింది. ఈయన రచనలన్నీ దాదాపు గ్రాంథిక భాషలోనే రాయబడ్డాయి. తదనంతరం వీరేశలింగం పంతులు *'వివేకవర్ధిని, హాస్య సంజీవని, చింతామణి'* పత్రికల్లో తమ విమర్శను పెద్ద ఎత్తున కొనసాగించారు. వీటిల్లో పంతులుగారు భావశూన్యమైవుండి, రసహీనమైన కావ్యాలను తూర్పారబట్టారు. ఈయన 'ప్రబంధ ప్రణీతృపంథా'ను విడనాడాలనే ఉద్దేశంతో *'అభాగ్యోపాఖ్యానము'* ను రాశారు. అలాగే సూరన *'సరస్వతీ నారద విలాపము'* లో సమకాలీన కావ్య స్థితిగతుల్ని వ్యంగ్యంగా నిరసించారు. ప్రబంధాల్లోని శృంగార వర్ణనలపై దండెత్తిన వీరేశలింగంగారు రాసిన సమీక్షలు, వ్యాసాలు, పీఠికలు వారి విమర్శనా దృక్పథానికి అద్దం పడతాయి.

వీరేశలింగం కంటే ముందే గురజాడ శ్రీరామమూర్తి కవుల చరిత్రను రాశారు. ఇది 1893లో ప్రచురితమైంది. ఇందులో 24 మంది కవుల చరిత్రలు చోటు చేసుకున్నాయి. ఈయన కవుల కావ్యాల ఆధారంగా సమాచారాన్ని పొందుపరిచారు. ముఖ్యంగా కవి జీవితం, అతని రచనలు, కృతి చరిత్ర, లోక ప్రచారంలోని కథలు, కవిత్వ శైలి మొదలైన అంశాలను ఒక పద్ధతిలో తెలపటం జరిగింది.

పి. దక్షిణామూర్తి 1892లో *'పింగళి సూరన'* అనే గ్రంథం రాశారు. ప్రాచీన కవుల్లో ప్రత్యేకంగా ఒక కవిపై వచ్చిన మొట్టమొదటి విమర్శ పుస్తకమిది. సూరన కావ్యాల్లో సహజమైన వర్ణనలు, స్వభావ సిద్ధమైన శృంగార భావనలు, స్పష్టత, సౌకుమార్యాలు ఉన్నాయని తెలిపారు. అలాగే రసానుగుణమైన శైలి, నాటకీయతలను ప్రశంసించారు. దీనిలో దక్షిణామూర్తి గ్రంథకర్త హృదయాన్ని చాలా చక్కగా ఆవిష్కరింపజేశారు.

పుదుప్పాకం సుబ్రహ్మణ్య అయ్యర్ రాసిన *'నన్నయ భట్టారకుడు'* 1910లో ఆదికవి శృంగార వర్ణనలోని సహజత్వాన్ని, రస పోషణను కొనియాడారు. నన్నయ కథకు

---

[2] తెలుగులో సాహిత్య విమర్శ. పుట. 105.

[3] ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ : సాంప్రదాయికరీతి. పుట. 18.

ప్రాముఖ్యమిచ్చి సమర్థవంతమైన పాత్ర చిత్రణతో పురాణ శైలితో కావ్యాన్ని రూపుదిద్దడం గమనించదగిందన్నారు.

1914లో *'పింగళి సూరనార్యుడు'* అనే విమర్శ గ్రంథాన్ని వింజమూరి రంగాచార్యులు రాశారు. దీంట్లో ఈయన సాహిత్యపు తీరుతెన్నుల్ని, సూరన కవిత్వ విశేషాల్ని కూలంకషంగా చర్చించారు. ముఖ్యంగా సూరన కవిత్వంలోని స్వకపోల కల్పితమైన కథను చెప్పటం, సమన్వయ సిద్ధి, పాత్ర పోషణ, నాటకీయ శిల్పం, రసోచితశైలి, ప్రౌఢమైన వర్ణనలు, గొప్ప భావనాశక్తి వంటి లక్షణాలు తారసపడతాయన్నారు. తెలుగు కావ్య పరిణామాన్ని చూపించిన మంచి విమర్శనా గ్రంథం ఈ *'పింగళి సూరనార్యుడు.'*

కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి మొట్ట మొదటి నవలా విమర్శకుడు. వీరు *'వివేక చంద్రిక విమర్శనము'* (1896) అనే గ్రంథం రాశారు. ఇందులోని ఏడు ఉపన్యాసాలు ఉన్నాయి. అవి కథ, వస్తువు, పాత్రలు, రసం, వర్ణనలు, అలంకారాలు, నీతులు – ఆచార వ్యవహారాల్లోని విమర్శ ప్రధానంగా పొడసూపింది. బ్రహ్మయ్యశాస్త్రి వీరేశలింగం పంతులు రాసిన రచనలన్నిటిపై విమర్శలు వెలువరించారు. కందుకూరి వారు *'రాజశేఖర చరిత్రము'* ను ఆంగ్లం నుండి స్వీకరించి రాసిందని సోదాహరణంగా నిరూపించారు. శాస్త్రిగారు వ్యక్తిగత విషయాలను విస్మరించి కేవలం గ్రంథ విమర్శ మాత్రమే చేశారు. రచనల్లోని గుణదోషాలను నిష్పక్షపాతంగా తెలిపిన విమర్శకుడీయన. మండనము, మండన– ఖండనము అనే మూడు పద్ధతుల్లో శాస్త్రిగారి విమర్శ కొనసాగింది. కాగా ప్రాచీన, ఆధునిక విమర్శ లక్షణాలను మేళవించడం ఈయన వైశిష్ట్యమని చెప్పవచ్చు. *''సాహిత్య విమర్శను ఆధునికముగా మరింత విస్తృత పరిచి, సుగమము''*[4] చేసిన వారు బ్రహ్మయ్యశాస్త్రి అని కోవెల సంపత్కుమారాచార్యులు తమ సిద్ధాంత గ్రంథంలో కొనియాడారు.

వెన్నేటి రామచంద్రరావు, గురజాడ శ్రీరామమూర్తి, కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి అనే ముగ్గురు విమర్శకులు తెలుగు సాహిత్య విమర్శ ప్రారంభ యుగంలో పరస్పర రచనా ఖండన మండనాలు విరివిగా సాగించారు. వీరందరూ ఆయా గ్రంథాల్లో ఆత్మస్తుతి, పరనింద, కులమతాల ప్రస్తావన యుద్ధ ప్రాతి పదికనా చేసినట్లు కనిపిస్తుంది. *''వెన్నేటి రామచంద్ర రావుగారి 'మను – వస్తు చరిత్ర రచనా విమర్శనము' ఆధునిక సాహిత్య విమర్శకు నాందీ వచనమగుచునే భిన్న కవుల కావ్యముల తులనాత్మక పరిశీలన రీతికిని శ్రీకారము చుట్టినది''*[5] అని కోవెల సంపత్కుమారాచార్యులు అభిప్రాయపడ్డారు.

వేదము వెంకటరాయశాస్త్రి విమర్శ వ్యాఖ్యానాలు, గ్రంథ పీఠికలు, భాషా వ్యాకరణ, ఛందో విమర్శలు, శబ్ద చర్చలు బహుముఖాలుగా ప్రవర్ధిల్లాయి. ఎస్వీ రామారావు తమ సిద్ధాంత గ్రంథంలో గురజాడ అప్పారావు, వేదం వెంకటరాయశాస్త్రి విమర్శపై రాసిన లేఖలోని

---

[4] ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ : సాంప్రదాయికరీతి. పుట. 19.

[5] ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ : సాంప్రదాయికరీతి. పుట. 23.

విషయాలను ఇలా ఉదహరించారు. "వ్యాకరణాది మీమాంసలే నాటి విమర్శక విచారములు. ఆ చర్చలలో సరళము లరుదు. పరుషములే మెండు. భాష ప్రధానము, భావముకాదు, పరుష వాక్యములను తీసివేసిన యెడల శాస్త్రులవారి విమర్శనము మనకెల్ల భాషాజ్ఞానమును విస్తరించిన వర ప్రసాదము."[6] ఈ అభిప్రాయం వల్ల వేదం వారి విమర్శలో భాషా పరిజ్ఞానం, లక్ష్య, లక్షణా చర్చ, లోకానుభవం, శబ్దార్థాలు, రసం, ఇతివృత్తం, పాత్ర పరిష్కరణ వంటి అంశాలపైనే దృష్టిని సారించారని తెలిసొస్తున్న విషయం.

గురజాడ అప్పారావు శశిలేఖ, ఆంధ్రప్రకాశిక, కృష్ణాపత్రిక, ఆంధ్రపత్రిక, కేసరి, మొదలైన సాహిత్య పత్రికల్లో విమర్శ వైఖరిని కొనసాగించారు. ముఖ్యంగా వీరు రాసిన నాటకాల్లో, పీఠికల్లో, డైరీ, లేఖల్లో కూడా విమర్శ కనబడుతుంది. వ్యావహారిక భాషను ప్రోత్సహించడానికి వీరు శతదా పాటు పడ్డారు.

ఆనాడు వెలువడిన సాహిత్య పత్రికల ద్వారా విమర్శ విరివిగా ప్రచురితమైందని చెప్పవచ్చు. ప్రధానంగా భాషా దోషాలు, మత విశేషాలు, కృతి భర్త, కృతి కర్త, ఛందస్సు, వ్యాకరణాంశాలు, రస చర్చ వంటి అంశాలపై లోతైన చర్చలు జరిగాయి. మహాభారతం పై పనప్పాకం, అనంతచార్యులు, కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి, పార్నంది రామ శాస్త్రి మొదలైనవారు విమర్శ వ్యాసాలు రాశారు. వీరందరూ కథ, చిత్రణ, పాత్ర పోషణ వంటి అంశాలపైనే పరిశీలన గావించారు.

పై విధంగా మన తెలుగు సాహిత్య విమర్శా పూర్వ రంగం రూపు దిద్దుకుని ఉండేది. తర్వాత 19వ శతాబ్దం నుంచి పాశ్చాత్య సాహిత్య ప్రభావం కారణంగా తెలుగు సాహిత్య విమర్శలో అనూహ్యమైన మార్పులు చోటుచేసుకున్నాయి.

## 4.1. కట్టమంచి రామలింగారెడ్డి విమర్శ

ఆధునిక తెలుగు సాహిత్య విమర్శకు దిశానిర్దేశం చేసిన మహనీయులు కట్టమంచి రామలింగారెడ్డి. 20వ ద్వితీయ దశకంలో రెడ్డిగారు ప్రతిపాదించిన విమర్శ సిద్ధాంతాలు ఎందరో సహృదయుల్ని ఆకట్టుకున్నాయి. ఈయన తమ 'కవిత్వ తత్త్వ విచారము'(1914) లో ఏదైన కావ్యంలో కేవలం బాహ్య విషయాలనే కాకుండా అంతర విషయాలను కూడా లోతుగా చర్చించినప్పుడే అన్ని అంశాలూ తెలుస్తాయని అన్నారు. అంటే అంతకు ముందున్న సాహిత్య విమర్శను పరిశీలిస్తే బాహ్య విషయాలైన కవి, కావ్యం, కథానాయకుడు, రసం, నాయికా నాయకులు, అలంకారాలు, వర్ణనలు మొదలైనవి మాత్రమే స్థూలంగా తెలిసేవి. కాగా శబ్ద సాధుత్వం, అసాధుత్వం అనే వ్యాకరణాంశాల చర్చలకే ఎక్కువగా చోటుండేది. అంటే ఇక్కడ హేతుబద్ధమైన పరిశీలన అనేది కొరవడిందని స్పష్టమవుతుంది. అయితే కట్టమంచి రామలింగారెడ్డి నూతన ఆలోచనా దృక్పథం 'అసలు కావ్యం ఎవరిది? ఎందుకు రాశారు? ఆనాటి దేశకాల పరిస్థితులేమి? పాత్రపోషణ నిర్మాణం ఎట్టిది? రసం, వర్ణనలు, అలంకారాలు

---

[6] తెలుగులో సాహిత్య విమర్శ. పుట. 126.

మొదలైనవి కావ్యంలో ఎలా రూపొందాయి' అనే ఆంతరంగ విషయాలను సోపపత్తికంగా తెలియజేశారు. ఇటువంటి లక్షణాలను తెలిపిన కట్టమంచి వారిని ఎస్వీ రామారావు "*విశిష్ట విమర్శనా దృక్పథమునకు మార్గ దర్శకుడయ్యెను. అతని 'కవిత్వ తత్త్వ విచారము' సాహిత్య విమర్శ వికాసమునకు రాచబాట వేసెను.*"[7] అని శ్లాఘించారు.

రామలింగారెడ్డి తెలిపిన విమర్శ మౌలికాంశాల్లో భావనాశక్తి, కథైక్యలక్ష్యం, వర్ణనలు, అలంకారాలు, హేతువులు, నాటకీయ సరణి, పాత్ర పోషణ, మిశ్రమ భావన, రస దృష్టి వంటి వాటిని ప్రధానంగా పేర్కొనవచ్చు. ఇవన్నీ కావ్యంలో ఎలా ప్రతిబింబించాలనే అంశాల్ని చాలా వివరంగా తెలియజేశారాయన. రెడ్డిగారు కథ, పాత్రలు, ప్రకృతి విశేషాలు, వర్ణనలనేవి కావ్యంలో ఒకే రకంగా ఉండాలన్నారు. కావ్యాత్మను స్పష్టంగా దర్శించడమే కాదు దాని లక్ష్యాన్ని కూడా సమన్వయించ గలగాలని నొక్కి వక్కాణించారు.

కట్టమంచి రామలింగారెడ్డి దృష్టిలో భావనాశక్తి అంటే మనసులో ప్రతిబింబించే ఆలోచనలు. వీటిని వ్యక్తం చేయడానికి నూతన పద కల్పనల సృష్టి చాలా అవసరమని ఆయన అన్నారు. ఈ కల్పనలు కొత్తగా, స్వతంత్రంగా, సందర్భానుసారంగా రక్తి కట్టించాలని చెప్పారు. దీనికై కవికి గొప్ప ప్రతిభా పాటవాలు ఉండాలన్నారు. అంతేకాక రచనను ప్రతిభావంతంగా రాయటానికి నిశిత విశ్లేషణా శక్తి అవసరం మవుతుందని తెలిపారు. కవి భావనల్లో రచనాశక్తి సహజంగా అలవడాలంటే కవికి స్పష్టమైన ఆలోచనా విధానం నిక్షిప్తమై ఉండాలి. కావ్యంలో పాత్ర పోషణ సందర్భానుసారంగా రూపొందడమే కాకుండా, కల్పనా సృష్టిని బట్టి వర్ణనా శక్తి ఒదిగి పోవాలని రెడ్డిగారు చెప్పారు. ఇంకా కవికి నిరంతర అభ్యాసం చాలా అవసరం. దీంతో పాటుగా రచనా చాతుర్యాన్ని మరింతగా పెంపొందించుకోవాలంటే ప్రత్యేక కృషి చేయాలని వివరించారు. దీనంతటిని సమర్థవంతంగా నడపాలంటే కవికి లోకశాస్త్రపరిజ్ఞానం ఉండి తీరాలన్నారు. ఈ జ్ఞానానికి ప్రతీకగా వేమనను ఉదహరించారు. 'రెడ్డిగారికి వర్డ్సవర్త్, కొలరిడ్జ్ ల వల్ల ఈ భావనా శక్తి అలవడిందని కోవెల సంపత్ కుమారాచార్య తమ సిద్ధాంత గ్రంథంలో పేర్కొన్నారు. [8]

సి. ఆర్. రెడ్డి 16వ శతాబ్దంలో విరివిగా వెలువడిన ప్రబంధాల్లో అనవసరపు మెరుగులను దుయ్యబట్టారు. పింగళి సూరన రాసిన '*కళాపూర్ణోదయము*' '*ప్రభావతీ ప్రద్యుమ్నము*' లను ఆధారంగా చేసుకొని విమర్శలో నిర్దిష్టమైన అభిప్రాయాలను వెల్లడించారు. భారతాన్ని, ప్రబంధాలను తులనాత్మకంగా పరిశీలించిన రామలింగారెడ్డి దాదాపు ఈ రెండూ రచనలు ఒకటేనని అభిప్రాయపడ్డారు. అంటే ప్రబంధాలను ప్రత్యేక ప్రక్రియగా రెడ్డిగారు గుర్తించలేదని అర్థం చేసుకోవాలిక్కడ. భారతం, ప్రబంధాల్లో కథా స్వరూపం సమగ్రంగా ఉండడాన్ని కట్టమంచివారు గమనించారు.

---

[7] తెలుగులో సాహిత్య విమర్శ. పుట. 153.

[8] ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ – సాంప్రదాయికరీతి. పుట. 45.

రామలింగారెడ్డి పాఠకుడి మనసు ప్రక్కకు పోకుండా వుండాలంటే కావ్యంలో కథను ఐక్యంగా తీర్చిదిద్దాలంటారు. ఉన్న విషయానికి ఒక అంశం చేర్చినా, తీసేసినా కథా నిర్మాణం మాత్రం చెడి పోకూడదని భావించారు. ప్రక్రియ స్వరూప స్వభావాలు, ఉద్దీపనలు, నిర్వహణ రీతులు, ప్రకృతి, తాత్పర్యాలనేవి పాఠకుని మనసుని పదిలంగా ఉంచగలవని ఈయన సూచించారు. కావ్యంలో కథ హృదయ గతంగా ఉండాలి. వర్ణనలు కథను దృష్టిలో ఉంచుకుని రూపొందించాలి. అలంకారాలను సందర్భాన్ని బట్టి తీర్చిదిద్దాలని రెడ్డిగారు ఉగ్గడించారు.

కథాంశంలోని సంఘటనలు కాలాన్ని అనుసరించి ఉండాలి. కాలమనేది రచనకు హేతువు కాబట్టి ఇది లేకపోతే రసానందం కుదరదని కట్టమంచివారు తెలిపారు. ఇంకా కథలో ఉత్సుకత, అంగాంగాల సాంగత్యం, వర్ణనలు, నాటకీయత ఎంతో ముఖ్యమని సి. ఆర్. రెడ్డి అన్నారు. నాటకీయత గురించి కట్టమంచి వెల్లడించిన అభిప్రాయాలను నిశితంగా పరిశీలించిన కోవెల సంపత్ కుమారాచార్య *"నాటక సరణి నాటకీయత యననేమో, అది దృశ్యకావ్యమందెట్లుండునో రెడ్డిగారు స్పష్టము చేయలేదని"*[9] విమర్శించారు.

రామలింగారెడ్డి కవుల పాత్ర చిత్రణ ఆయా పాత్రల గుణ గణాలు దేశకాల పరిస్థితుల కనుగుణంగా వుండటం మంచిదన్నారు. కావ్యాల్లో మంచిచెడ్డలు కలగలిసిన పాత్రలు పొడసూపాలన్నారు. పాత్రలు పూర్వాపరాలతో మిశ్రమించి ఉండాలని ప్రస్తుతించారు. ప్రబంధాల్లోని పచ్చి శృంగారాన్ని, అశ్లీల అనౌచిత్యాన్ని నిరసించారు. రస దృష్టిలో తిక్కన 'నానా రసాభ్యుచితబంధాన్ని మెచ్చుకున్నారు. పింగళి లక్ష్మీకాంతం కట్టమంచివారి విమర్శ దృష్టిని ఇలా అభివర్ణించారు. *"విశృంఖల విహారమొనర్చు దానిని మెచ్చడు. సముచిత నియమ పరిపాలనము నిరర్థక బంధ విచ్ఛేదము. అస్వతంత్రతా తిరస్కారము ఇవియే ఈయన పదింపదిగా సాంఘికాచార విషయమునను కావ్య మర్యాద విషయమునను బోధించు ధర్మములు."*[10]

సి. ఆర్. రెడ్డి ప్రాచీన సాహిత్య బలహీనతలపై విమర్శలు గుప్పించారు. అలంకారికులు నిర్మించిన సూత్రాలాధారంగా కావ్యాలను ఆస్వాదించాలని భావించారు. ఒక రకంగా కట్టమంచివారు విమర్శలో స్థిరమైన అభిప్రాయాలను వెల్లడించారని చెప్పవచ్చు. రెడ్డిగారి విమర్శను లోతుగా పరిశీలిస్తే వారిది హేతుబద్ధమైన విమర్శగా కనబడుతుంది. కాగా స్వతంత్రమైన అభిప్రాయాలను నిర్భయంగా చెప్పారని తెలుస్తుంది. ప్రధానంగా రెడ్డిగారు తెలుగు సాహిత్య విమర్శలో మౌలిక ప్రతిభకు పట్టం కట్టిన విమర్శకులు. కావ్యంలో వర్ణనలు, పాత్రలు సహజంగా ఉండాలని, ప్రాచీన ఆలంకారికుల నియమాలను గుడ్డిగా అనుసరించ కూడదని ఆయన అన్నారు. కవిత్వం ప్రజల జీవితాలను సహజమైన రీతిలో ప్రతిబింబింపజేయాలని, పాండిత్య భారాన్ని ప్రదర్శించరాదని పునరుద్ఘాటించారు."అక్షర

[9] ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ – సాంప్రదాయికరీతి. పుట. 75.

[10] గౌతమ వ్యాసములు. పుట. 104.

*యుద్ధాలకు దిగటమే విమర్శగా చలామణి అవుతున్న కాలంలో విమర్శ తీరును నిర్దేశించినది మాత్రం రామలింగారెడ్డిగారిదే''*[11] అని కొల్లు వెంకటేశ్వరరావు కొనియాడారు.

## 4.2. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ – విమర్శ

కట్టమంచి రామలింగా రెడ్డి తర్వాత ఆధునిక తెలుగు సాహిత్య విమర్శను గొప్ప మలుపు తిప్పిన మహనీయుల్లో రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ కూడా ఒకరని చెప్పవచ్చు. ఈయన సుమారు డెబ్బై యేళ్ళు పాటు విమర్శ రంగంలో నిర్విరామంగా కృషి చేసిన ఘనాపాఠి. శర్మగారు బహుభాషా విద్వాంసులు. ప్రాచ్య పాశ్చాత్య సాహిత్య విమర్శ ధోరణులను బాగా అవగాహన చేసుకొన్న విజ్ఞానులు. కాగా నిశితమైన పరిశీలనతో నిర్దిష్టమైన అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడించే వ్యక్తిత్వం గలవారు. అంతేకాకుండా ఆధునిక తెలుగు సాహిత్య విమర్శకు చక్కని బాట వేసిన పండిత వరేణ్యులు.

అనంతకృష్ణశర్మగారి విమర్శ విధానాన్ని తెలుసుకోవడానికి *'వేమన'* (1929), *'నాటకోపన్యాసములు'*(1934) *'సారస్వతాలోకము'*(1954) *'రాళ్ళపల్లి పీఠికలు'*(1979) *'రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు'* (2017) బాగా తోడ్పడతాయి. శర్మగారు విమర్శ గురించి ప్రత్యేక గ్రంథం రాయకపోయినా సందర్భాను సారంగా వారి వ్యాసాల్లోనే ఆయా విమర్శ అంశాలను శక్తిమంతంగా, ఆదర్శనీయంగా వెల్లడించారు. వీటన్నిటిని తెలుసుకోవాలంటే గ్రంథాలను సమగ్రంగా అధ్యయనం చేయాలి.

### 4.2.1. రాళ్ళపల్లి విమర్శ మార్గం

అనంతకృష్ణశర్మగారి విమర్శ భావము, వస్తువు, రచనల అనుశీలనా ప్రధానంగా అడుగులు వేసింది. వీరి విమర్శ ఆద్యంతం ఈ మూడు సూత్రాలపైనే ఆధారపడిందని చెప్పవచ్చు. కవిత్వంలో భావ, వస్తు, రచనలు ప్రముఖ పాత్ర పోషించాలని శర్మగారు వక్కాణించారు. ఈ కళాంగాలను తెలుగు సాహిత్య విమర్శలో సి. నారాయణరెడ్డి, కోవెల సంపత్కుమారాచార్యులు, అనుమాండ్ల భూమయ్య లాంటి ప్రముఖులు కొనసాగించారు. శర్మగారు ఏర్పరచిన ఈ భావము, వస్తువు, రచనల గురించి సోదాహరణంగా తెలుపబడుతుంది.

#### 4.2.1.1. భావము

రాళ్ళపల్లి వారు భావము, వస్తువు, రచనల గురించి *'నాచన సోముని నవీన గుణములు'* అనే వ్యాసంలో సుదీర్ఘంగా చర్చించారు. భావమనగా రూపం లేనిది, కంటికి కనబడనిది, కేవలం వ్యక్తం చేయగలిగే భావోద్వేగమని చెప్పారు. అంటే కవులు మనకు కంటికి కనిపించని విషయాలను తమ భావనా బలంతో కళ్ళముందు కదలాడేటట్లు చేస్తారు. దీని కోసం కవికి గొప్ప ప్రతిభా పాటవాలు ఉండాలి. ప్రధానంగా శర్మగారు తెలిపిన భావాలు ప్రేమ, కోపము,

[11]తెలుగు సాహిత్య విమర్శ దర్శనం. పుట. 634.

అసూయ, అసహ్యము, అలక్ష్యము, దయ, ద్వేషము. మొదలైనవి. వీటిని ఈయన జీవాలని, ప్రాణాలని అన్నారు.

ముఖ్యంగా ఒక రచనలో భావం ఎంత బలంగా ఉంటే అది అంత రంజింపజేస్తుందని రాళ్ళపల్లి వారి అభిప్రాయం. ఇలా గొప్ప భావనతో రచనలు చేసిన వారిలో తిక్కన ముందు వరుసలో ఉంటారని అన్నారు. వెరసి ఎర్రన, నాచన సోమన, అన్నమయ్య, వేమన మొదలైన వారి రచనల్లో ఉండే భావనా శక్తిని శర్మగారు సునిశితంగా పరిశీలించారు.

తిక్కన భారతంలో ద్రౌపదికి కీచకుని వల్ల అవమానం కలిగినప్పుడు భీముని హృదయంలో రేగిన కోపాన్ని గొప్ప భావనా బలంతో కవిత్వీకరించిన పద్యాన్ని ఇలా చూపించారు.

సీ. *నేలయు నింగియు దాళముల్ గా జేసి*
*యేపున రేగి వాయించి యాడ*
*గుల పర్వతంబులు గూల్చి యొండొంటితో*
*దాకంగ వీకమై దన్ని యాడ*
*నేడు సాగరములు నిక్క దక్క డ బెట్టి*
*పలుచని రొంపి మైనలది కొనగ*
*దిక్కు లు నాలుగు నొక్క చోటికి దెచ్చి*
*పిసికి పిండలి చేసి పిడుచ గొనగ*
*మిగుల బ్రహ్మాండ భాండంబు పగుల వ్రేయ*
*నప్పళించుచు ప్రళయకాలానలమున*
*గండరించిన రూపంబు కరణి భీము*
*డతి భయంకరాకారత నతిశయిల్లె* (భా. వి.ప. 2 – 134)

నిండు సభలో భీముడు భూమి, ఆకాశాన్ని ఏక తాళంగా చేసి, ఒక్క తన్నుతో కుల పర్వతాలను కూల్చి, అక్కడఇక్కడ నేలను కాలితో తంతూ, ఏడు సముద్రాలు ఒక్కటైయ్యేట్లుగా చేసి చెమట పుట్టించాడు. కాగా దిక్కులన్నింటినీ ఒక్కటిగా చేసి, పిండిగా పిసికి ముద్ద చేసినట్లు, బ్రహ్మాండ బాండాలను పగల గొట్టే రీతిగా, ప్రళయకాల రుద్రుడిలా భీముడు అతి భయంకరాకారం దాల్చాడనే తిక్కన భావాన్ని శర్మగారు ఆవిష్కరింపజేశారు.

నాచన సోముడు 'ఉత్తర హరివంశము'లో రాక్షస స్త్రీల వికృత రూపాన్ని వర్ణించిన తీరు భావనా బలానికి నిదర్శనంగా ఉంది.

సీ. *వికృతాననంబులు విరళ దంతంబులు*
*నిడు పైన దౌడలు నిక్కు మెడలు*
*ముడివడ్డ బొమలును ముమ్మాల ముక్కు లు*
*బల్ల వెంద్రుకలును బరికె తలలు*

*బొక్కి రొమ్ములు లోతుబొట్టలు మిడి గ్రుడ్లు*
*గూని వీపులు నిడు గ్రొంకి వ్రేళ్ళు*
*బూర కాళులు నీచబోయిన చేతులు*
*గోలమూపులు గుదిగొన్న తొడలు*
*నతిభయంకరగతి సూపు నట్టహాస*
*కహకహారావములతో గాననయ్యె*
*దాన పావక ఘన శిఖాదగ్ధతాల*
*సాలసంకాశమగు పిశాచద్వయంబు* (ఉ.హ. 2 – 122)

వికారమైన ముఖంతో, పెద్ద పెద్ద పళ్ళతో వాటిపైన వొంగిన మెడలతో, కలిసిపోయిన కను రుబ్బలతో, పెద్ద పెద్ద ముక్కులతో, జడలు కట్టిన తలలతో, ఎండిన ఎదలతో, లోతైన కడుపులతో, పెద్ద పెద్ద కన్నులతో, గూని వీపులతో, వంగకర టింకర వేళ్ళతో, లావైన ఏనుగు కాళ్ళతో, పుల్లల్లాంటి చేతులతో, బండల్లాంటి తొడలతో, భయంకరంగా కనపడే రెండు పిశాచాలను నాచన సోమన్న పాఠకుల కళ్ళముందు నిలిపాడు. అనంతకృష్ణశర్మ నాచన సోముని ఈ భావనా ప్రతిభను ప్రశంసించారు.

రాళ్ళపల్లి వారు అన్నమయ్య సంకీర్తనల్లో కూడా ఈ భావనా శక్తి ఎంతో బలంగా కనిపిస్తుందని ఈ కీర్తనను ఉదహరించారు.

*పాపినైన నాపాలగలిగి త్రోవ*
*చూపుమన్న నెందుఁజూపరు.*

*ధృతి దూలి జగమెల్లఁ వేసరితి*
*ఇతరాయముల కేగి వేసరితి*

*గతిమాలి పరుపైఁ గనలి వేసరితి*
*మతిమాలి కులవిద్య మాని వేసరితి*
*విసిగి యాచారంబు విడిచి వేసరితి*
*పసచెడి ప్రియములు పలికి వేసరితి*

*కొసరి ద్రవ్యంబుపైఁ వేసరితి*
*కనుగంది లోలోనె కాఁగి వేసరితి*

*కోవిదులగువారిఁ గొలిచి వేసరితి*
*దైవము లందరిఁ దగిలి వేసరితి*

***శ్రీ వేంకటేశుని సేవమాని వట్టి***
***సేవలన్నియును నేఁజేసి వేసరితి***

(రా. సా. సం. వ్యా. పుట: 169 – 170)

పై పద్యంలో స్వయంనిందార్థక భక్తి కనిపిస్తుంది. పాపాత్ముడైన నాకు ఈ లోకవాసులు మోక్షానికి వెళ్ళేందుకు మార్గాన్ని ఎందుకు చూప లేకపోతున్నారు. శాశ్వతమైన సంతోషాన్ని వదిలి, వ్యర్థమైన పనుల కోసం తిరిగి, దిక్కుమాలిన తనంతో ఇతరుల వెంట వెళ్ళి, బుద్ధి లేక కుల విద్యను విడిచి, భగవదాచారాలనన్నింటిని విస్మరించి, సారం లేని అప్రియాలను పలికి, లాభాపేక్షతో డబ్బు సంపాదించాలన్న తాపత్రయంతో, మనసులో నానారకాల ఆలోచనలతో కాగి, ఈ లోకంలోని పండితులందరినీ సేవించి, దేవతలందరిని పొగిడి, శ్రీవేంకటేశ్వరున్ని పూజించకుండా ఇతర దేవతలను పొగిడి విసిగిపోయానని అన్నమయ్య చెప్పాడు. ఇందులో ఆశ, నిరాశ, నమ్మకం, సందేహం, తృప్తి, వేసట, కోపం, దీనత, దుఃఖం, ఆనందం మొదలైన భావాలు అడుగడుగునా ప్రతిఫలించాయని శర్మగారు తెలియజేశారు.

వేమన పద్యాల్లో కూడా గొప్ప భావనా శక్తి కలదని రాళ్ళపల్లివారన్నారు. వేమన చెప్పిన ప్రతి పద్యంలో జీవిత అనుభవం మిళితమై ఉండటం వల్ల భావం తీవ్రతరంగా ఉందని శర్మగారు గుర్తుచేశారు. వేమన పద్యాల్లో ఏవి చదివినా మనసుకు హత్తుకొంటాయి. ఉదాహరణకు ఈ కింది పద్యాల్లో ఉన్న భావం ఎంత గొప్పగా పరిశీలించ బడిందో గమనించండి.

*ఆ.* ***ఆకులన్ని దిన్న మేక పోతుల కేల***
***కాక పోయె నయ్య కాయసిద్ధి?***
***లోకు లెల్ల వెఱ్ఱి పోకిళ్ళఁ బోదురు....*** (వేమన పుట: 155)

మేకలు ఆకులు తిన్నంత మాత్రాన వాటికి బలిష్ఠమైన, సౌష్ఠవమైన శరీరం కలగనట్లుగానే. లోకులు వెర్రి పోకడలు పోతారనే భావం స్పష్టమవుతుంది.

*ఆ.* ***సతులఁ గవయనేల? సుతులఁ బడయనేల?***
***వెతలు పడఁగనేల ? వెఱ్ఱితనము :***
***నేలమీఁదిరాయి నెత్తికెక్కినయట్లు...*** (వేమన పుట: 151)

పెళ్ళి చేసుకొని, పిల్లల్ని కని వాళ్ళతో బాధలు పడటం. నేలపై వున్న బరువైన రాయిని అతి కష్టం మీద నెత్తికెత్తుకోవడంతో సమానమన్న వేమన భావాన్ని శర్మగారు బాగా పట్టుకొన్నారు. ఇలా వేమన పద్యాలను చదవగానే అందులో ఉన్న భావాలు సులభంగా తొందరగా బోధపడతాయని రాళ్ళపల్లివారన్నారు.

శర్మగారు భావానికి ఎక్కువ ప్రాముఖ్య మిస్తూ, "*భావము నిండు కడవ వంటిది. భాష దానిని పై కీడ్చు త్రాడు.*" [12] అని అన్నారు. ఇక వస్తువు భావానికి పరాధీనమై ఉంటుందని

[12] వేమన. పుట. 153– 154.

తెలిపారు. ఇలాంటి భావాలు వేదాలు, పురాణాలు వెరసి కావ్యాల్లో అంత ఉన్నతంగా కనిపించవని అభిప్రాయపడ్డారు. అలాగే శర్మగారి దృష్టిలో తిక్కన, అన్నమయ్య, వేమనల రచనల్లో భావాలు ఎంతో గొప్పగా నిక్షిప్తమయ్యాయని అన్నారు. ముఖ్యంగా వేమనలో ఉండే భావాలు అత్యంత సహజమైనవని తెలిపారు. ఎందుకంటే అవి స్వయంగా అతనివే కాబట్టి. పైగా వాటిలో తీవ్రత బహుళంగా ఉందని అనంతకృష్ణుల వారు భావించారు. నిర్వచనోత్తర రామాయణంలో చూపిన రచనా వైశిష్ట్యాన్ని తిక్కన పెంచి పోషించిన సీతమ్మ పాత్రను శర్మగారా '*నాచన సోముని నవీన గుణములు*' *తిక్కన తీర్చిన సీతమ్మ*' అన్న వ్యాసాల్లో రంగరింపజేశారు. అన్నమయ్య సంకీర్తనల్లోని 'ఆర్జవం' (తాను అనుభవించిన భావాలు) పుష్కలంగా కనబడుతుందని శర్మగారు తెలిపారు.

ప్రధానంగా కవిత్వ రచనకు భావించేవాడు (కవి), భావము, వస్తువు, రచన, సభ్యులు అనేవి పంచభూతాలని శర్మగారు అన్నారు. భావ, వస్తు, రచనల్లో ప్రాచీనులు, ఆధునికులు దేనికి ప్రాధాన్యమిచ్చారనే అంశాలను సూక్ష్మ దృష్టితో తెలియజేశారు. వీటిని స్థూలంగా తెలుసుకోవడం వల్ల ఆయా అంశాలు అర్థమవుతాయి.

కల్పనల్లో వైచిత్రిని చూపించేవారు ఈ కాలం నాటి కవులని శర్మగారు అన్నారు. కాగా భావాల్లో వైవిధ్యాన్ని పెంచి పోషించిన వారు ఆకాలం కవులని భావించారు. అంతేకాదు "*ప్రాచీనులలో భావమునకే యర్థ రచన బంటు. తరువాతి వారిలో అర్థ రచనకు భావము బంటు.*" [13] అని సెలవిచ్చారు. దీన్ని బట్టి ప్రాచీనులు భావానికి అధిక ప్రాధాన్యమిచ్చారని, ఆధునికులు వస్తు, రచనలకు ప్రాముఖ్యమిస్తున్నారనే సత్యాన్ని రాళ్ళపల్లి వారు స్పష్టం చేశారు.

పై విధంగా అనంతకృష్ణశర్మగారి దృష్టిలో భావనా శక్తి కావ్యంలో సింహభాగానికి చెందినదని అర్థం చేసుకోవచ్చు. కాగా రచయితలు కవిత్వంలోగాని, రచనల్లో గాని బలమైన భావాలను శక్తిమంతంగా చెప్పాలని అనంతకృష్ణశర్మగారు ఆకాంక్షించారు.

### 4.2.1.2. వస్తువు

రాళ్ళపల్లి వారు వస్తువును ఈ విధంగా అభివర్ణించారు. "*ఒక పూర్ణ వస్తువునకు సంబంధించిన యవాంతర విషయము లనేకము లేర్చి కూర్చుట వస్తుకళ.*" [14] అనగా ప్రకృతిలో కనిపించే జాతి, గుణము, క్రియ మొదలైన పదార్థాలని పేర్కొన్నారు. కాగా ఈ వస్తువుగాని, భావముగాని వేరువేరుగా ఉంటే అన్వయం కుదరదు. ఈ రెండూ ఎప్పుడూ ఒకదానితో ఒకటి కలిసి ఉంటేనే మేలని శర్మగారు భావించారు. "*భావమెంత తీవ్రముగా, సూక్ష్మముగా నుండిన నంత యానందమును కలుగును. వస్తువెంత సహజముగా, విరివిగానుండిన నంత తృప్తి కలుగును*" [15] అని భావ, వస్తువుల ప్రాముఖ్యాన్ని రాళ్ళపల్లి వారు తెలిపారు.

---

[13] సారస్వతాలోకము. పుట. 58.

[14] సారస్వతాలోకము. పుట. 56.

[15] సారస్వతాలోకము. పుట. 47.

తెలుగు సాహిత్యంలో వస్తు కళకు ప్రాధాన్యమిచ్చిన సందర్భాలు అక్కడక్కడ ఉన్నాయని రాళ్ళపల్లి వారు తమ వ్యాసాల్లో ఉదహరించడం జరిగింది. వాటిని సోదాహరణంగా పరిశీలిద్దాం.

రాళ్ళపల్లి వారు నన్నయ భారతంలోని చివరి పద్యాన్ని వస్తు కళకు ఉదాహరణగా చూపించారు.

ఉ. ***శారదరాత్రు లుజ్జ్వల లసత్తర తారకహారపంక్తులం***
***జారుతరంబు లయ్యె, వికసన్నవకైరవగంధబంధురో***
***దార సమీరసౌరభము దాల్చి సుధాంశువికీర్యమాణ క***
***ర్పూర రాగ పాండురుచిపూరములం బరిపూరితంబులై*** (భా. అ.ప. 142)

పై పద్యంలో నన్నయ వెన్నెల రాత్రులను, ఉజ్జ్వలంగా ప్రకాశించే నక్షత్రాలను, సువాసనలు వెదజెల్లే కలువ పూలను – ఈ విధంగా సుందరమైన పలు వస్తువులను ఏరి కూర్చినారేకాని మనస్సుకు ఆహ్లాదం ఇచ్చే అనుభూతిని కలిగించలేకపొయ్యారు. ఇక్కడ భావం కన్న వస్తువు ప్రవర్ధిల్లిన సందర్భం కనబడుతుందని శర్మగారు అన్నారు.

నాచన సోమనాథుడు ఏక సీసంలో రాసిన పద్యాన్ని రాళ్ళపల్లి వారు వస్తు రచనకు తార్కాణంగా పేర్కొన్నారు.

సీ. ***పాంచాల పాండ్య బర్బర కిరాతాభీర***
***కురు విదేహ విదర్భ కుకుర గౌళ***
***గాంధార మగధ కొంకణ కళింద పుళింద***
***సింధు సౌవీరాంధ్ర చేది చోళ***
***సాముద్ర సాల్వ కోసల కళింగ కుళింగ***
***వత్స సౌరాష్ట్రాంగ వంగ మత్స్య***
***సూరసేన సుదేష్ణ సువ్నాకాశ కరూశ***
***లాట కర్నాట మాళవ వరాట***
***కుంతలావంతి ఘూర్జర కుహ్మక త్రి***
***గర్త బహుధాన యవన టేంకణ దశార్ణ***
***పుండ్ర బాహ్లిక ద్రవిడ కాంభోజ హూణ***
***కేకయ వసాతి కాశ్మీర కేరళములు*** (ఉ.హ. 5-144)

నాచన సోమన్న భారతదేశంలోని 56 దేశాలకు మరొక్కటి చేర్చి మొత్తం 57 దేశాల పేర్లను సీస పద్యంలో కూర్చిన నేర్పు ప్రశంసనీయమేకాని ఈపద్యం అలౌకిక ఆనందం కలిగించదు. కాని నాచన సోముని వస్తుకళా వైచిత్రికి ఈ పద్యం చక్కని ఉదాహరణ అని అనంతకృష్ణశర్మగారు అన్నారు.

వేమన పద్యాల్లో వస్తువుకు ఉండే ప్రాముఖ్యాన్ని శర్మగారు చాలా చోట్ల గుర్తించే ప్రయత్నం చేశారు. ఉదాహరణకు...

ఆ. *పసుల వన్నెవేఱు పాలేక వర్ణమౌ*
*పుష్పజాతివేఱు పూజయొకటి:*
*దర్శనముల వేఱు దైవం బదొక్కటి...."* (2480)

పై పద్యంలో పశువులు, పూలు, దర్శనాలు అనే వస్తువులను తీసుకొని వేమన ఎంత సత్యాన్ని చెప్పారనేదిక్కడ తెలుస్తుంది.

ఆ. *పనస తొనలకన్న పంచదారలకన్న*
*జుంటి తేనెలకన్న జున్నుకన్న*
*చెఱుకు రసముకన్న చెలిమాట తీపురా!...."* (2404)

పనస తొనలు, చెక్కెర, జుంటి తేనెలు, జున్ను, చెఱుకురసం అనే వస్తువులను తీసుకొని వీటి కంటే ప్రియురాలి మాట ఎంత మధురంగా ఉంటుందని తెలిపాడు కవి. ఈ పద్యాల్లో కవులు కల్పించిన వస్తు స్పృహ ఎంతో ఆకట్టుకునేలా ఉందని రాళ్ళపల్లి వారి అభిప్రాయం.

## 4.2.1.3. రచన

రచనా కళ అనేది భావ, వస్తువులను వెలువరించే పద్ధతి అని శర్మగారన్నారు. భావ, వస్తువులకు ఒక రూపం ఇవ్వడానికి రచన ఉపయోగపడుతుంది. ఆయా విషయాలను రాసేటప్పుడు ఉపయోగించే శైలి, ఛందస్సు, సమాసాలు, రసాలు, అలంకారాలు, జాతీయాలు, సామెతలు, పలుకుబడులు, అన్యదేశ్య పదాలు, నూతన పదాల సృష్టి లాంటివి రచనా వైవిధ్యానికి తోడ్పడే సూక్ష్మంశాలు. ఇవి రచనల్లో మితంగా ఉండాలని రాళ్ళపల్లి వారు భావించారు. అంతేకాదు రచనను చదివేవారికి హితం చేకూర్చాలని చెప్పారు. అంతరంగాలైన భావ, వస్తువులను బహిరంగం చేయడానికి బలమైన సాధనం రచన. ఈ రచనా సామర్థ్యం ఆషామాషీగా వచ్చేది కాదు. ఒక వేళ వచ్చినా దాన్ని సముచితంగా తీర్చిదిద్దే శక్తి కవికి ఉండాలని శర్మగారు తెలిపారు. భావాలు తేలికగా ఉంటే వస్తువులో నాణ్యత కొరవడుతుంది. ఈ భావ, వస్తువులు కుదరక పోతే రచనలో పస ఉండదు. ఇలాంటి రచనలకు అంత గుర్తింపు రాదు. మన రాతలు చిర స్థాయిగా నిలబడాలంటే రచనలో ఔచిత్యం ఉండటం తప్పనిసరని శర్మగారు అభిప్రాయపడ్డారు. ఈ రచనా శక్తి ప్రాధాన్యాన్ని కొన్ని వ్యాసాల్లో వీరు ఉదాహరణంగా చర్చించారు.

రాళ్ళపల్లి వారు *'కవి చిత్రములైన త్రోవలలో క్రొత్త మాటలు, క్రొత్త కూర్పు మొదలగునవి కల్పించి చూపునప్పుడు అతని వ్యక్తియే మన కన్నుల యెదుర నిలిచి బలవంతముగా మన మెప్పును లాగుకొనును.'*'[16] అని రచనా శక్తి గురించి చెప్పారు. అయితే ఇది కొన్ని సందర్భాల్లో ఓహో అనిపిస్తుంది కాని ఆహా అనిపించడం జరగదన్నారు. అంటే అప్పటికప్పుడు

[16] సారస్వతాలోకము. పుట. 49.

సంతోషపడడానికి సరిపోతుంది కాని లోతైన సంతృప్తిని ఇవ్వదని శర్మగారి భావన. ఇలాంటి సన్నివేశాల్ని శర్మగారు తమ వ్యాసాల్లో లోతుగా పరిశీలించారు.

నాచన సోమన వస్తువు, రచనను పోషించిన విధానం ఎంతో ఆకర్షణీయంగా ఉంటుందని ప్రస్తావించిన పద్యం.

*సీ.* *పవనవేగశీర్ణపాదపాగ్రంబుల*
*జడియకుండగ బట్టు సామజములు*
*పూజార్థ నియమిత పుష్ప మాలికలపై*
*మధుకరంబుల జోపు మర్కటములు*
*అవభృథ స్నాన పర్యంత నిర్మలతకై*
*కాసారముల గాచు కాసరములు*
*నిజనిజోటజ భాగ నీవార సీమలు*
*సొరక కావలియుండు సూకరములు*
*తే.* *గలిగి కంసవైరి కన్నులపండువై*
*పొలుపు మిగిలె బూర్ణకలశ విగళ*
*దాల వాల వారిహారితముని దారి*
*కాశ్రమంబు బదరికాశ్రమంబు* (ఉ.హ. 2 –100)

పైపద్యంలో కవి ఏనుగులు, కోతులు, ఎనుపోతులు, పందులు మొదలగు జంతువులకు విరుద్ధమైన పనులు కల్పించి గొప్ప చమత్కారం కలిగించాడు. దీన్ని చదివినప్పుడు సాధారణంగా నవ్వుకుంటాం. అంటే ఇది కేవలం చదివినప్పుడు అలా రంజింప చేస్తుంది తప్ప దీనిలో సహజత్వం గాని తృప్తిగాని సంపూర్ణంగా దొరకవని శర్మగారు అన్నారు. ఎందుకంటే ఇక్కడ భావ, వస్తువులు లోపించాయి. అంటే కేవలం రచనా సౌందర్యం ఉంటే సరిపోదు. దీనిలో భావ, వస్తువులు రెండూ మిళితమైతేనే కావ్యానికిగాని, రచనకు గాని శాశ్వతత్త్వం కలుగుతుందని రాళ్ళపల్లి వారు ఉద్ఘాటించారు.

ఉదాహరణకు వేమన పద్యాల్లో భావ, వస్తు, రచనలు మూడు కలగలిసిన సందర్భాలను అనంతకృష్ణశర్మగారు ఇలా గుర్తుచేశారు.

రచనా వైచిత్రిగల వేమన పద్యాలను శర్మగారు తమ వ్యాసాల్లో కొన్నిటిని పేర్కొన్నారు. ఉదాహరణకు...

*ఆ.* *పునుఁగు పిల్లికేల పుట్టించె వాసన?*
*కనకము తన కేమి కల్గఁజేసె?*
*బ్రహ్మ చేతలెల్ల పాడైన చేతలు...”* (2581) (వేమన పుట: 81)

పునుగు పిల్లి వాసనలు ఎందుకు పుట్టిస్తుంది? దేవుడు బంగారుకు విలువ ఇచ్చాడేకాని పరిమళం ఎందుకు ఇవ్వలేదు? బ్రహ్మ చేతలన్నీ పనికిమాలిన వని తాత్పర్య మిక్కడ. ఈ

పద్యంలో వేమన చమత్కారమైన అర్థాన్ని స్ఫురింపజేస్తూ, యథార్థాన్ని చెప్తూ సుకుమారమైన హాస్యాన్ని కలిగించారు. ఇక్కడ భావంలో విశిష్టత, వస్తువులో వైచిత్రి రెండూ ఉన్నాయని శర్మగారు అన్నారు.

శర్మగారు వేమన భావ, వస్తు, రచనా కౌశల్యానికి నిలువుటద్దంగా భావించిన మరో పద్యాన్ని గమనించండి.

*ఆ. గొడ్డుటావుఁ బితుకఁ గుండ గొంపోయిన*
*పండ్లు రాలఁదన్ను; పాలనీదు*
*లోభివాని నడుగ లాభంబు లేదయా..."* (1333) (వేమన. పుట: 159)

గొడ్డు టావును పితకడానికి పోతే అది పాలు ఇవ్వదు. పైగా అది పాలు పిండేవాడి పళ్ళు రాలేటట్లు తన్ని కుండ పగులకొడుతుంది. అదే విధంగా పిసినారిని సహాయం అడిగితే ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఇందులోని చమత్కారం హాస్యాన్ని తెప్పిస్తుంది. వేమన ఒక జీవిత సత్యాన్ని రమణీయంగా వ్యక్తీకరించిన విధానం మనల్ని కట్టి పడేస్తుంది. కవి ప్రదర్శించిన చమత్కారం భావ, వస్తువులకు విశిష్టత చేకూర్చింది. ఇదే వేమన భావ ప్రకటనా వైఖరి, రచనా చాతుర్యమని అనంతకృష్ణులవారు అన్నారు.

ఈవిధంగా కవిత్వంలో భావాన్ని జీవమనీ, వస్తువుని బుద్ధి అనీ, రచనను శరీరమని శర్మగారు అభివర్ణించారు. ఈ మూడు కళాంగాలలో ఏది తక్కువైనా కవిత్వం ఉత్తమకోటికి చెందదని అనంతకృష్ణులవారి అభిమతం.

రాళ్ళపల్లి వారి విమర్శ మార్గం గురించి డి. చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన అభిప్రాయాలు తెలుసుకోదగినవి. (వివిధ రచయితలతో ఇంటర్వ్యూలు) ప్రశ్నావళి : 2, ప్రశ్న: 5 ని చూడు (అనుబంధం 1)

### 4.2.1.4. భావము, వస్తువు, రచనల్లో ముఖ్యాంశాలు

1. భావము రూపం లేనిది. కంటికి కనబడనిది. కేవలం వ్యక్తం చేయగలిగే భావోద్వేగం.
2. భావాలు ప్రధానంగా ప్రేమ, కోపం, అసూయ, అసహ్యం, అలక్ష్యం, దయ, ద్వేషం మొదలైనవి.
3. వస్తువు అంటే ప్రకృతిలో కనిపించే జాతి, గుణ, క్రియలు.
4. భావము, వస్తువులు రెండు ఎల్లప్పుడు కలిసుంటేనే అన్వయం కుదురుతుంది. ఇవి విడిగా ఉండకూడదు.
5. రచన అనగా భావ, వస్తువుల్ని ఆసక్తికరంగా వెల్లడించే గొప్ప సాధనం.
6. **ఈ** రచనలో ప్రధానంగా అనేక భాషాంశాలు ఇమిడి ఉంటాయి. అవి: శైలి, ఛందస్సు, సమాసాలు, రసం, అలంకారాలు, జాతీయాలు, పలుకుబడులు, అన్య దేశాలు, నూతన పదాలు మొదలైనవి ముఖ్య పాత్ర పోషిస్తాయి.

## 4.3. అభిరుచి విమర్శ

ఆధునిక తెలుగు సాహిత్య విమర్శను మలుపు తిప్పి, సుమారు డెబ్బై యేళ్ల పాటు విమర్శ రంగంలో నిర్విరామంగా కృషి చేసిన రాళ్ళపల్లి వారిని కొందరు పరిశోధకులు 'అభిరుచి విమర్శకులు' గా అభివర్ణించారు. ఎస్వీ. రామారావు తమ సిద్ధాంత గ్రంథంలో *"ఆలోచనా ప్రధానమైన విమర్శకు రసస్పర్శను ఆపాదించి పఠితలలో సాహిత్యాభిరుచిని పెంపొందించిన అనంతకృష్ణశర్మగారు అభిరుచి విమర్శకులుగా పేరు పొందిరి."*[17] అని అన్నారు. వెలమల సిమ్మన్న *"రాళ్ళపల్లి వారు 'అభిరుచి' విమర్శకులుగా పేరు ప్రఖ్యాతులు గడించారు."*[18]అని తెలిపారు. అలాగే శర్మగారి విమర్శపై ఎం. ఫిల్., చేసిన వి. రమాంజనీ కుమారి ఒక అడుగు ముందుకు వేస్తూ, *"వీరి విమర్శలలో అభిరుచి లక్షణం కనిపించినా ఔచిత్యం మేర మీర"*[19]దని ఉద్ఘాటించారు. ఇలా తెలుగు సాహిత్య విమర్శ రంగంలో చాలామంది శర్మగారిని 'అభిరుచివిమర్శకుల' నే అనుకుంటున్నారు. సాధారణంగా ఎవరైనా అభిరుచి లేనిదే ఎలాంటి పని చేయరు. అటువంటి అభిరుచి శర్మగారికి ఉందనడంలో ఎటువంటి సందేహం లేదు.

సాహిత్యపరంగా 'అభిరుచి' విమర్శకు నిఘంటువులు చెప్పే అర్థాలను, నిర్వచనాలను పరిశీలించినప్పుడు శర్మగారు 'అభిరుచి' విమర్శకుల వర్గంలోకి రారనిపిస్తుంది. కట్టమంచి రామలింగారెడ్డి వల్ల శర్మగారికి పాశ్చాత్య కావ్య సంప్రదాయాలు పరిచయం కావడం అన్నది విదితమే. శర్మగారిపై జార్జి శాంతాయన, టి. ఎస్. ఇలియట్ ప్రభావాలు కూడా ఉన్నాయి. సాతవల్లి చంద్రశేఖర్ *'విమర్శ – రాళ్ళపల్లివారి దృక్పథం'* అనే వ్యాసంలో *"అర్నాల్డులాగే రాళ్ళపల్లివారు గూడ అంతకు ముందున్న ప్రాచ్య పాశ్చాత్య సిద్ధాంతాల సమన్వయంతో తమనదైన ఒక నూతన విమర్శ మార్గాన్ని కొనసాగించారు."*[20] అని సోపపత్తికంగా నిరూపించే ప్రయత్నం చేశారు. ఇలాంటి అంశాలనూ లేదా శర్మగారి విమర్శలో ఏవైనా అభిప్రాయాలు అభిరుచి విమర్శను గుర్తుచేస్తాయని నిరూపించకుండానే వారిని 'అభిరుచి' విమర్శకులన్నారు.

రాళ్ళపల్లివారు నాగళ్ళ గురుప్రసాద రావుకు లేఖ రాస్తూ వారి విమర్శ గురించి ఇలా చెప్పుకొన్నారు. *"నా దృష్టిలో, నా వ్యవహారములో, విమర్శ ఒక శాస్త్రముగాదు. ఆ దృష్టితో నా విమర్శలు నేనెప్పుడను సాగింపలేదు. నా కు తోచినది అభిమాన సంప్రదాయములకు పూర్తిగా లోగక స్పష్టముగా వినీతితో చెప్పవలెనని నా ప్రయత్నము. Every criticism is autobiography అని ఒక తాత్వదర్శి అన్నాడని విన్నాను."*[21] అని అభిప్రాయపడ్డారు. అంతేకాదు శర్మగారు గొప్ప పరిశీలన దృక్పథం కలిగినవారో అనడానికి మరో ఉదాహరణ. రాళ్ళపల్లి వారు ఆనాడు కొంత మంది వ్రాసిన సిద్ధాంత గ్రంథాలకు పరీక్షకులుగా ఉండి నారు.

---

[17] తెలుగులో సాహిత్య విమర్శ. పుట. 186.

[18] తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు. పుట. 653.

[19] తెలుగు సాహిత్య విమర్శ దర్శనం. పుట. 363.

[20] తెలుగు సారస్వత సమాఖ్య. న్యూఢిల్లీ ప్రత్యేక సంచిక అక్టోబర్. 1981. పుట: 46.

[21] అనంత రాగం. పుట. 236.

ఈ విషయమై ఘట్టమరాజు శర్మగారితో ముఖాముఖి చేస్తున్న సందర్భంలో "పరిశోధన వ్యాసాల పరిశీలనలో మీరు పాటించిన విధానం ఏమిటి?" ప్రశ్నించినప్పుడు రాళ్ళపల్లి వారు చెప్పిన సమధానం వారి మాటల్లోనే *"పరిశోధకుడు తన సిద్ధాంత వ్యాసానికి సంబంధించిన విషయాన్ని సమగ్రంగా సేకరించడం కష్టమే. కాన, తాను సేకరించిన విషయము గురించి తన అభిప్రాయాలను స్పష్టంగా, పరస్పర సంబద్ధంగా చెప్పుతున్నాడా లేదా అనేది చూస్తాను. ఆ విషయమై స్వతంత్రమైన ఆలోచనా దృక్పథం అంటే సంతోషమే. కాని నిర్బంధం లేదు. వ్యాసకర్త సిద్ధాంతాలతో నేను ఏకీభవించకపోవచ్చును. అది వేరేమాట. ఉదాహరణకి గుడిముందు బలియిచ్చే విధానం నాకు సరిపడదు. అయితే తత్సంబంధమైన కృతి నా పరిశీలనకు వస్తే నేను 'నా' దృష్టితో చూడను. విషయ ప్రతిపాదన సహేతుకంగా స్పష్టంగా, రమ్యంగా ఉన్నదా లేదా అని మాత్రమే గమనిస్తాను."*[22] అని సెలవిచ్చారట. ఇటువంటి వాటిని పరిశీలించకుండా ఏదో తేలిగ్గా బిరుదులు ఇచ్చేశారు. ఒక వేళ శర్మగారు అభిరుచి విమర్శకులై ఉండి ఉంటే *'ఆధునిక సాహిత్య విమర్శ – అభిరుచి ధోరణి'* అనే అంశంపై పరిశోధన చేసిన మోచెర్ల నాగరాజు తమ లఘు సిద్ధాంత వ్యాసంలో శర్మగారిని 'అభిరుచి' విమర్శకులని చెప్పి ఉండేవారు. కాని ఎక్కడా వారి గ్రంథంలో రాళ్ళపల్లివారి పేరు కనపడదు.

నిజంగా పూర్వ పరిశోధకులు శర్మగారి సాహిత్య కృషిని సమగ్రంగా పరిశీలించి ఉంటే అభిరుచి విమర్శకులనే వారు కాదేమోనని అనిపిస్తుంది. పైగా శర్మగారు లోతైన ఆలోచనలతో తమ రచనా వ్యాసంగాన్ని కొనసాగించిన గొప్ప విమర్శకులు. కొందరిలో రాళ్ళపల్లి వారు ఎదైనా చదివినప్పుడు లేదా విన్నప్పుడు అప్పటికప్పుడు ఏదనిపిస్తుందో దాన్ని నిర్భయంగా చెప్తారన్న అభిప్రాయం ఉన్నది. అయితే అది నిజం కాదు. వారు దేన్నైనా చెప్పాలంటే దాని పూర్వాపరాలను సునిశితంగా పరిశీలించి ఆయా ఆకరాలను దృష్టిలో ఉంచుకొనే తెలుపుతారన్నది అక్షర సత్యం. 'అభిరుచి విమర్శ' అనేది ఎక్కువ శాతం కళా రంగానికి వర్తించే సూక్ష్మాంశం. దీన్ని సాహిత్య విమర్శలో చాలా చులకనైనదిగా భావిస్తున్నారు. ఇటువంటి తేలికైన విమర్శలు శర్మగారు ఎప్పుడూ చేయలేదు.

'అభిరుచి విమర్శ' ను ఆంగ్లంలో Impressionistic criticism అంటారు. ఆయా గ్రంథాల్లో ఉన్న నిర్వచనాలను పరిశీలిస్తే దీని స్వరూప స్వభావాలు బోధపడతాయి.

**1.** Among critics themselves there are not wanting those who take up the position however much principles and criteria may be invoked. That ever efforts may be made to eliminate the personal factor. All criticism fundamentally subjective and impressionistic. (Hudson – An introduction to the study of

[22] సంగీత సాహిత్య శారదా దరహాసం – శ్రీమాన్ రాళ్ళపల్లి (సెప్టెంబర్ 22, గురువారం, ఆంధ్రప్రభ, 1977)

English literature – George G. Harrah company Bombay – 1944.)[23]

**2.** ఒక రచనను చదివినప్పుడు విమర్శకునిపై అ కావ్యం కలిగించే ప్రభావాన్ని. దానివల్ల కల్గే స్పందనను ఆధారం చేసుకొని సాగే కావ్యానుశీలనం అభిరుచి విమర్శ. వస్తువులోని వాస్తవ సత్యాన్ని వక్రీకరించకుండా స్వీయ దర్శనానికి ప్రాధాన్యతనిస్తుంది.[24]

**3.** Impressionist gives his impressions of subjective reality. But he is not interested in destroying or reshaping that reality. Rather he uses his knowledge of the self to try and understand that reality to despite it and came to terms with it. (Brijraj sing – the development of critical tradition from pater o Yeats – the Macmillan company – London –1978)[25]

**4. Impressionistic criticism**

Attempts to represent in words the felt qualities of a particular passage or work and to express the responses (the – "impression") that the work. Directly evokes from the critic. As William Hazlitt put it in his essay "on genius and common sense" (1824) "you decide from feeling. And not from reason; that is, from the impression of a number of things on the mind...

Though you may not be able to analyze or account for it in the several particulars" and Walter Pater later said that in criticism "the frits step toward seeing one's object as it really is, is to know one's own impression as it really is, to discriminate it, to realis it distinctly" and posed as the basic question "what is this song or picture .... To me (preface to studies in the history of the renaissance, 1873) at of extreme the mode of criticism becomes in Anatole France's phrase, "the adventures of a sensitive soul among masterpieces"[26]

---

[23] ఆధునిక సాహిత్య విమర్శ – అభిరుచి ధోరణి. ఎం. నాగరాజు. 1991. పుట. 4.

[24] ఆధునిక సాహిత్య విమర్శ – అభిరుచి ధోరణి. పుట. 9.

[25] ఆధునిక సాహిత్య విమర్శ – అభిరుచి ధోరణి. పుట. 9.

[26] A Glossary of Literary Terms (M. H. Abrams. Geoffrey Galt Harpham) pg. 68.

**THE ENCYCLOPAEDIA AMERICANA**

**IMPRESSIONISM:** In literature in its broadest application refers to style of writing in which characters, scenes or actions are presented, not from the point of view of objective reality, but as they appear to the writer at a particular moment. The term is borrowed from impressionism in painting.

*'ఒక రచనలో తనకు కనిపించిన విషయాల్నీ, ఆ రచన చదవగా తనకు అనిపించిన విషయాన్ని మాత్రమే ఆధారం చేసుకొని విమర్శకుడు చేసేదే అభిరుచి వాద విమర్శ.' (ఆ విమర్శకుడికి అలా అనిపించడానికి, అతనికి అప్పటికే ఏర్పడి ఉన్న అభిరుచులే కారణం.)*

*విమర్శకుడు ఏదో ఒక తాత్త్విక, రాజకీయ సిద్ధాంతాలకు కట్టుబడి కాకుండా, ఆ రచనను చదవడం ద్వారా తనకి ఎలా అనిపిస్తే, అంటే తన అభిరుచికనుగుణంగా ఆ రచనను పరిశీలించి, అంచనా వేసే విమర్శనా పద్ధతి. తనకు తోచినదాన్ని రచన చదవడం ద్వారా, పాఠకులకు చెబుతాడు విమర్శకుడు. అయితే ఈ పద్ధతి తర్వాత కాలంలో విమర్శకు గురి అయ్యింది. ఇందులో రచనలో వున్న మంచి చెడ్డలను పరిశీలించడం కుదరదనీ, ఇది అసమగ్ర విమర్శగానే ఉంటుందనీ, పలువురు అభిప్రాయపడ్డారు.''* [27]

*"అభిరుచి విమర్శ (impressionistic criticism): అన్న మాటకు సమానార్థకంగా తెలుగులో అభిరుచి విమర్శ అన్న పదాన్ని ఉపయోగిస్తున్నాం. విమర్శకుడి స్వీయానుభూతిపై అభిరుచి విమర్శ ఆధారపడి ఉంటుంది.''* [28]

ఇది కళారంగంలో ఉన్న విమర్శ. ముఖ్యంగా చిత్ర కళలో మాత్రమే కనిపిస్తుంది. ఒక చిత్రాన్ని అప్పటికప్పుడు చూసి చెప్పే అభిప్రాయం అభిరుచి విమర్శ అని పై నిర్వచనాల వల్ల తేటతెల్లమవుతుంది. అంటే సాహిత్య పరంగా 'అభిరుచి' విమర్శను పరిశీలిస్తే ఉత్తమ కోటికి చెందిన విమర్శ కాదని తెలుస్తుంది. ఇంకా చెప్పాలంటే 'తాడూ బొంగరం లేని విమర్శ'ని కూడా అర్థమవుతుంది. కాగా రాళ్ళపల్లి వారు సాగించిన విమర్శను ఆద్యంతం పరిశీలిస్తే అలాంటి ఛాయలు ఎక్కడా కనిపించవు. శర్మగారు ఎప్పుడూ నేల విడిచి సాము చేయలేదు. నేలమీదనే ఉండే ఆ పని చేశారని ముక్తకంఠంతో చెప్పవచ్చు. ఒక సందర్భంలో ఎస్వీ రామారావుగారే *''హేతు బద్ధమైన విశ్లేషణ, స్వతంత్రమైన వివేచన ఆయన సాహిత్య విమర్శకు జీవమును జవమును ఒసగిన''వని*[29] శర్మగారిని అన్నారు. 1959లోనే సాళ్వ కృష్ణమూర్తి రాళ్ళపల్లి వారికున్న అభిరుచిని లోతైన దృష్టితో పరిశీలించి ఒక స్పష్టతను కలిగించారు. *'అనంతకృష్ణులు – అభిరుచి నిర్దేశము'* అనే వ్యాసంలో కృష్ణమూర్తి *''అంతరంగ*

[27] సాహిత్య విమర్శ పదాల డిక్షనరి – ఎస్. ఎస్. నళిని – 2009. పుట. 23.

[28] తెలుగు సాహిత్య విమర్శ దర్శిని. పుట. 363.

[29] తెలుగులో సాహిత్య విమర్శ (ఎస్వీ రామారావు) పుట. 189.

*వాసనల నక్కరగా పండించుటయే అభిరుచి పరమార్థము.''* [30] అని అన్నారు. దీన్ని బట్టి శర్మగారు దేన్నైతే రాస్తారో దానికి సంబంధించిన విషయాలను సుశితంగా పరిశీలిస్తారని అర్థం చేసుకోవచ్చు. రాళ్ళపల్లివారు బహుముఖీన ప్రజ్ఞా పాటవాలు కలిగిన పండిత వరేణ్యులు. వీరు చూపించే ఆధారాలు కూడా ఎంతో ప్రామాణికంగా ఉంటాయి. ఇరవై ఎనిమిదేళ్ళ వయసులో రాసిన *'ఆంధ్రవాఙ్మయమున నాచన సోమనాథున కీయఁదగిన స్థానము'* వ్యాసంతో విమర్శ రంగంలోకి అడుగు పెట్టారు రాళ్ళపల్లివారు. దీనిలో నాచన సోముని స్థానం కవిత్రయ స్థాయికి తక్కువగా, ప్రబంధ స్థాయికి ఎక్కువగా ఉందని నిరూపించారు. కాగా ఈ వ్యాసం చక్కని తులనాత్మక దృష్టికి నిదర్శనంగా ఉంది. ఎఱ్ఱనకు, సోమనకు ఉన్న ప్రతిభా పాటవాలను శర్మగారు ఆధారాలతో అంచనా వేసి చూపిన క్రమాన్ని పండిత లోకం ఆనాడు మెచ్చుకొంది. అయినా దీనిపై కొందరు విమర్శకులు విరుచుకుపడినారు.

కాని నిలబడలేక పోయారు.*'త్యాగయ్య గారి నాదసుధారసం'* అనే వ్యాసంలో *''త్యాగయ్య గారి కవిత ఈ ఆశుతరగతిది. ఆశ్చర్యము కలిగించే ముక్కలెన్ని ఉన్నా అఖండత చాలనిది. కనుక తెలుగు సాహిత్యంలో ఇతర మహాకవుల రచనలు చవిచూచిన నాలుకకు త్యాగయ్య కవితలోని రసం చాలదు. ఈ మాట సాహసమైతే మన్నించండ''ని*[31] త్యాగయ్యనుద్దేశించి రాళ్ళపల్లివారు అన్నారు. దీన్నిబట్టి శర్మగారు గంభీరమైన ఆలోచనలు కలిగినవారుగా అనిపిస్తారు. వీరి అభిప్రాయాలు భారతీయ కావ్యశాస్త్ర సిద్ధాంతాలను స్పృశించినట్లుంటాయి. అంతేకాక లోతైన ఆలోచనతో విశిష్టమైన దృక్పథాలను పరిచయం చేస్తాయి. ఉదాహరణకు *'నాచన సోముని నవీన గుణములు'* వ్యాసం ద్వారా ఒక కావ్యంలో భావము, వస్తువు, రచనలను లోతుగా పరిశీలించే సంప్రదాయాన్ని తెలుగు సాహిత్య విమర్శకు పరిచయం చేసిన ఘనత శర్మగారికే దక్కుతుంది. ఈ సంప్రదాయమాధారంగానే వీరి విమర్శ మొత్తం ముందుకు నడిచిందన్న విషయాన్ని ముందే తెలుసుకొన్నాం. తర్వాత ఈ ధోరణిని పలువురు సాహిత్యంలో ముందుకు తీసుకెళ్ళడం కూడా జరిగిందన్న సంగతి విదితమే. రాళ్ళపల్లివారు ఒక రచనను వివిధ కోణాల్లో పరిశీలిస్తారు. తాను జీర్ణించుకున్న సిద్ధాంతాలతో అన్వయం కుదిరితే తప్ప దేన్ని చెప్పే ప్రయత్నం చేయరు. ఇలాంటి విశిష్ట లక్షణాలు మన తెలుగు సాహిత్యంలో చాలా కొద్ది మందిలోనే కనిపిస్తాయి.

సాళ్వ కృష్ణమూర్తి రాళ్ళపల్లివారి వ్యక్తిత్వానికే మాధుర్యం సహజంగా అబ్బిందంటూ *''సంస్కృతముతో పాటు లలితములైన ప్రాకృత తెలుగు కన్నడ తమిళాంగ్లముల కొఱ్ఱులు వైచిన వారాయన. అన్నిటికంటే ముఖ్యముగా భావానుభమునకు వలసిన్న సత్యసంపద ఆయనకు జన్మ సిద్ధము. మందహాస తుందిలమైన మాట సరళి, వార్తికమైన వాక్యరచన. ఇంతటి సాధన సంపత్తిలో తమ యనుభవమును నమ్మిదాని యాథార్థ్యమును, మంచి చెడ్డలను తామే*

---

[30] అనంత కృష్ణులు: అభిరుచి నిర్దేశము. భారతి జూలై 1959. పుట: 26.

[31] సారస్వతాలోకము. పుట. 114.

*తేల్చుకొనెడు శర్మగారు అనుభవ రసికులు గాక వివేక ప్రధానులగు శుష్క విమర్శకులలో నెట్లు చేరుదురు!''* [32] అని అభిప్రాయపడ్డారు. దీన్ని బట్టి శర్మగారి విమర్శ వైశిష్ట్యం ఏంటో అవగతమవుతుంది.

అనంతకృష్ణశర్మ అభిరుచి విమర్శ గురించి సిహెచ్. లక్ష్మణ చక్రవర్తి తెలిపిన అభిప్రాయం గమనించదగింది. దీనికోసం (వివిధ రచయితలతో ఇంటర్వ్యూలు) ప్రశ్నావళి: 4, ప్రశ్న: 9. ని చూడు (అనుబంధం 1)

రాళ్ళపల్లివారి వ్యక్తిత్వంలో సహజమైన పాండిత్యం కనిపిస్తుంది. వివిధ భాషలు వారికి కరతలామలకం కావడం పరిపాటి. మృదువైన మాటసరళి శర్మగారి సొంతం. చక్కని పదాల కూర్పు, వివేచన శక్తి, సమ్యక్ దృష్టి, లోకజ్ఞత, స్వదేశాభిమానం లాంటి వెన్నో కలగలిసిన హృదయం రాళ్ళపల్లివారిది. కళలపై వీరికున్న అభిప్రాయాలు *'నాటకోపన్యాసములు'* లో పొడసూపాయి. చారిత్రక పరిశోధకులకే ఆదర్శమైన గ్రంథం *'వేమన'* వీరికి మంచి పేరు తెచ్చిపెట్టింది. *'సారస్వతాలోకము'* లో ప్రాచీన సాహిత్యంపై వెల్లడించిన అభిప్రాయాలు చాలా గొప్పవి. ఇటీవల వచ్చిన *'రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు'* శర్మగారి వ్యక్తిత్వాన్ని, అభిరుచిని సమపాళ్ళలో అంచనా వేసే విధంగా ఉన్నాయి.

ఈ ఆధారాలను బట్టి రాళ్ళపల్లి వారిని అభిరుచి విమర్శకులనే దానికి బదులు సంప్రదాయ విమర్శకులుగానే నిర్ధారించవచ్చు.సంప్రదాయ విమర్శకు స్వంత ఆలోచనలను జోడించి తన విలక్షణమైన అభిప్రాయాలను వెల్లడించిన విశిష్టమైన విమర్శనా విధానం ఆయనది. సుప్రసిద్ధ విమర్శకులు ఘట్టమరాజు అశ్వత్థనారాయణ అనంతకృష్ణశర్మగారి జన్మదినం సందర్భంగా *'సారస్వత సాలోచనలో 'అనంత'పథం'* అనే వ్యాసం రాశారు. అందులో శర్మగారి వ్యాసాల వైశిష్ట్యాన్ని, విమర్శనా దృక్పథాన్ని కళ్ళకు కట్టిస్తూ... *''తెలుగు సాహిత్య విమర్శనా రంగంలో రాళ్ళపల్లివారి సేవను బేరీజు వేయడానికి ప్రతిభావంతంగా ప్రయత్నించిన వాళ్లలో ప్రముఖులు – సాళ్వ కృష్ణమూర్తి, కోవెల సంపత్కుమారా చార్యులు. కేవలం వైయక్తిక అభిరుచి ప్రకారం ఎలాంటి సామాజిక శ్రేయస్సును పట్టించుకోకుండా కావ్యలక్ష్య లక్షణాల్ని పాటించకుండా చేసే అభిరుచి విమర్శకు శర్మగారు ఆమడ దూరం''*[33] అని ఉద్ఘాటించారు. దీన్ని బట్టి రాళ్ళపల్లి వారు సంప్రదాయ విమర్శకులనే భావించడం సముచితం.

## 4.4. రాళ్ళపల్లి వారి – స్త్రీవాద దృక్పథం

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ రచనల్ని సూక్ష్మంగా పరిశీలిస్తే అక్కడక్కడ స్త్రీ చైతన్య దృక్పథం చాలా బలంగా కనపడుతుంది. సమాజ మనుగడకు స్త్రీలు పెట్టని కోటలాంటి వారు. వీరి అస్తిత్వం లేనిది ఏ సమాజం ఉన్నతిని సాధించలేదన్నేది నిర్వివాదాంశం. ఎక్కడ స్త్రీలు

---

[32] అనంత కృష్ణులు: అభిరుచి నిర్దేశము. భారతి జూలై 1959. పుట. 26.

[33] ఆంధ్రజ్యోతి. జనవరి 23 మంగళవారం. 2018.

పూజించ బడతారో అక్కడ దేవతలు సంచరిస్తారని పెద్దలమాట. సామ్రాజ్య ఉత్థాన పతనాలకు స్త్రీలు దోహదం చేసినట్లు చరిత్ర చెబుతోంది. 'ప్రతి మగాడి వెనుక ఒక స్త్రీ' అనే నానుడి అందరూ చెప్పేమాట. కాబట్టి స్త్రీకి పూర్వం నుండి సమాజం అత్యంత ప్రాధాన్యాన్ని ఇచ్చిందన్నది అక్షర సత్యం. అదే స్థాయిలో స్త్రీని ఒక భోగ వస్తువుగా చూసిన సందర్భాలు కూడా ఎక్కువే. ఇటువంటి స్త్రీ ఔన్నత్యాన్ని రాళ్ళపల్లి వారు వీలు దొరికినప్పుడల్లా తమ రచనల్లో ప్రస్తవించే ప్రయత్నం చేశారు. కాగా పురుషులతో సమానంగా స్త్రీలకి ప్రాముఖ్యం ఉండాలని శర్మగారు ఆకాంక్షించారు.

## 4.4.1. ఖండకావ్యాల్లో స్త్రీ దృక్పథం

రాళ్ళపల్లివారు1911 నుండి 1979వరకు నిర్విరామంగా రచనా వ్యాసంగాన్ని కొనసాగించారన్నది విదితమే. వీరు రాసిన *'తారా దేవి'*(1911) *'మిరాబాయి'*(1913) అనే ఖండకావ్యాలు 20వ శతాబ్దం రెండవ దశకంలో వెలువడ్డాయి. వీటిల్లో నాటి స్త్రీ చైతన్యాన్ని సంఘ సంస్కరణ దృష్టితో శర్మగారు ఆవిష్కరింపజేశారని రెండవ అధ్యాయంలో తెలుపబడింది. ఈ రెండు కావ్యాలు స్త్రీ జాతి ఔన్నత్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని చెప్పవచ్చు.

*'తారా దేవి'* కావ్యంలో రాళ్ళపల్లి వారు తారా దేవిని పల్లెటూరి పడుచు పిల్ల ధైర్యసాహసాలకు చిహ్నంగా చూపించారు. ఇందులో తారాదేవి జొన్న చేనులో దూరిన అడవి పందిని సునాయాసంగా బయటికి రప్పిస్తుంది. దీన్ని ఆ రాజ్యాన్ని పాలించే రాజు స్వయంగా చూస్తాడు. ఇంత మంది సైన్యం చేయలేని పనిని ఓ యువతి ఎటువంటి భయం లేకుండా చేయడాన్ని రాజు కళ్ళారా చూసి విస్తుపోతాడు. గొప్ప ధైర్యం కలిగిన తారాదేవిని ఎలాగైనా పెళ్ళి చేసుకోవాలని రాజు అనుకుంటాడు. ఈ కావ్యాన్ని ఆద్యంతం చదివితే స్త్రీలలో కూడా ఎన్నో ధైర్య సాహసాలు ఉంటాయని బోధపడుతుంది. కావ్యంలో కవి తారాదేవి తల్లిని చైతన్యానికి ప్రతీకగా చిత్రించారు. తారా పెళ్ళి చేయడానికి తల్లి నిర్ణయమే చివరికి ఆధారమవుతుంది. పురుషులు చేయలేని సాహసాలు స్త్రీలు చేసి చూపించిన విధానాన్ని శర్మగారు కళ్ళకు కట్టించారు. ఈ పాత్ర ద్వారా కవి మొత్తం స్త్రీ జాతికే చైతన్యం కలిగించారని చెప్పవచ్చు.

*'మిరాబాయి'* కావ్యంలో శర్మగారు మీరాబాయిని అభాగినులకు ప్రతినిధిగా చూపించారు. మరిది దాష్టీకానికి గురైన మీరా ఇంటినుండి తన భవ బంధాలను తెంచుకొని శ్రీకృష్ణుని ఆరాధనలో లీనమౌతుంది. కాగా తన భక్తి భావనతో అశేష జన బాహుళ్యాన్ని ఆకర్షిస్తుంది. ఆనాటి రాజ కుటుంబాల్లో సైతం స్త్రీలు పడే ఇబ్బందులను శర్మగారు ఈ కావ్యంలో తెలిపారు. రాళ్ళపల్లివారు మీరాబాయి పాత్ర ద్వారా ఉమ్మడి కుటుంబాల్లో స్త్రీలు కనీసం తమకు నచ్చిన దైవాన్ని పూజించడానికి వీలు కలిగించకపోవడాన్ని నిరసించారు. చరిత్రలో ఉన్న మీరాబాయి రాజుల దాష్టీకానికి బలైతే, శర్మగారు సృష్టించిన మీరాబాయి ఆ దాష్టికాన్ని ఎదిరించి నిలబడింది. నిలబడడమే కాదు అందరిచేత పూజింపబడింది కూడా. ఈ విధంగా రాళ్ళపల్లి వారు లోతైన దృష్టితో స్త్రీలు కూడా ఎంతో శక్తిమంతులని సమాజానికి చాటి చెప్పారు.

తెలుగు సాహిత్యంలో ఖండకావ్యాలు విరివిగా వెలువడుతున్న కాలమది. ప్రధానంగా కట్టమంచి రామలింగారెడ్డి *'ముసలమ్మ మరణము'*, రాయప్రోలు *'లలిత'*, గురజాడ *'కన్యక'*, *'పూర్ణమ్మ'* మొదలైన కావ్యాల్లో ఉన్న స్త్రీ చైతన్యం ఒక ఎత్తైతే, శర్మగారు సృష్టించిన ఈ కావ్యాల్లో ఉండే స్త్రీ చైతన్యం మరో ఎత్తుగా కనబడుతుంది. కానీ ఈ రెండు ఖండకావ్యాలను రావాల్సినంత గుర్తింపు రాకపోవడం విచారకరం.

## 4.4.2. విమర్శలో స్త్రీ దృక్పథం

రాళ్ళపల్లివారు *'వేమన'* (1929) *'నాటకోపన్యాసములు'* (1935) *'సారస్వతాలోకము'* (1954), *'రాళ్ళపల్లి పీఠికలు'* (1979), *'రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు'* (2017) అనే గ్రంథాల్లో అక్కడక్కడ స్త్రీ దృక్పథాన్ని వెల్లడించారు. దానిని కూడా సోదాహరణంగా పరిశీలిద్దాం.

శర్మగారు *'రాయలనాటి రసికత'* వ్యాసంలో స్త్రీని ప్రవృత్తి భోగాల్లో ప్రముఖమైందిగా పేర్కొని పలు అంశాల్ని మన ముందుంచారు. పదహారవ శతాబ్దంలో స్త్రీని కేవలం భోగ్య వస్తువుగా భావించడాన్ని శర్మగారు ఖండించారు. పైగా స్త్రీలకు పురుషుడు భోగ్య వస్తువు ఎందుకు కాకూడదని ప్రశ్నించారు. ఆనాటి మహిళ మగవారికి దాసిగా ఉండి అనేక సేవలు చేసింది. తండ్రులు తమ ఆడబిడ్డలను ఎవరో ఒకరింటికి ఇచ్చి వదిలించుకోవాల్సిన వస్తువుగా చూడటాన్ని శర్మగారు తప్పుబట్టారు. అప్పటి సమాజం యుక్త వయసులో ఉండే ఆడవారిని గురించి మాత్రమే ఆలోచించింది తప్ప ముసలి వాళ్ళను, చిన్నపిల్లలను పట్టించుకోలేదంటూ.. మన కవుల దృష్టిని *"పడకటింటిలో పెండ్లి కొడుకు దృష్టియే కాని వేరుండదు."*[34] అని విమర్శించారు. యవ్వనంలో ఉండే స్త్రీ హృదయాన్ని ఆకర్షించడం ఆనాటి మహా పురుషులకు ఎంతో గౌరవంగా ఉండేదన్నారు. రాయలకాలం కంటే పూర్వం మహిళలను మరింత ప్రేమతో ఆరాధించిన సందర్భాలున్నాయని వ్యాసకర్త తెలిపారు. ఇదే ధోరణి ప్రబంధ కాలంలో కూడా కొంతవరకు కొనసాగిందని చెప్పుకొచ్చారు. అయితే ఈ విధానం స్త్రీ యవ్వనంలో ఉన్నంత వరకే కొనసాగింది తప్ప మరీ ముందుకు వెళ్ళలేదని శర్మగారు వాపోయారు. ఇంకొంత లోతుగా పరిశీలిస్తే రాయలకాలంలో స్త్రీలు అత్యంత దుర్భర జీవితాన్ని గడిపిన సందర్భాలను మనం చూడవచ్చని రాళ్ళపల్లివారు చెప్పారు. కానీ రాను రాను సమాజం స్త్రీల పట్ల అనేక మార్పులు రావడం ముదావహమన్నారు. రాయల కాలంలో బహుభార్యాత్వం, వేశ్యల గుంపు ఎక్కువగా ఉండేది. కానీ నేడు దాదాపు ఈ రెండూ తగ్గిపోవడం ఆహ్వానించదగ్గ అంశమని శర్మగారన్నారు. ఇంకా త్వరితగతిన స్త్రీ పురుషుల సమానత్వం రావాలని అనంతకృష్ణశర్మ కోరుకున్నారు.

శర్మగారు ఎఱ్ఱన *'హరివంశము'* లోని స్త్రీ పాత్ర చిత్రణకు, నాచన సోమనుని *'ఉత్తర హరివంశము'* లోని స్త్రీ పాత్ర చిత్రణకు తేడాలున్న క్రమాన్ని తేటతెల్లం చేశారు. వీరిద్దరూ

---

[34] సారస్వతాలోకము. పుట. 16.

ఊర్వశిని చిత్రించిన తీరులో చూపిన వైవిధ్యాన్ని శర్మగారు స్పష్టంగా తెలియజేశారు. సోమన ఉత్తమ స్త్రీలైన వారికి *'మిండఱికము'*, *'లంజతనము'* మొదలైన పదాలను వాడి సహృదయులకు రోత పుట్టించారు. కాని ఎఱ్ఱన ఎంతో ఔచిత్యంతో స్త్రీ మనోభావాన్ని అర్థం చేసుకొని గంభీరంగా నడిపించటం బాగుందన్నారు. రాళ్ళపల్లివారు నీచ పాత్రలను కూడా సొగసుగా చిత్రించిన పాలవేకరి కదిరీపతిని సోమనాథునికన్న ఉత్తమ కవి అని ప్రశంసించారు. అంతేకాకుండా *''కావ్యము సౌమనస్య ప్రధానము''*[35] అని రాళ్ళపల్లి వారు ఉద్ఘాటించారు. అలాగే, వర్ణనలు ఔచిత్యాన్ని మీరితే రసాభాసం కూడా జరుగుతుందని వ్యాసకర్త హెచ్చరించారు.

పై పేరాలో చర్చించిన విషయాలను *'ఆంధ్రవాఙ్మయమున నాచనసోమనాథునకీయదగిన స్థానము'* అనే పేరుతో రెండో సారి సమాధానంగా రాసిన వ్యాసంలో స్త్రీ జాతి స్వభావాన్ని శర్మగారు మరింత స్పష్టం చేశారు. రాళ్ళపల్లివారు ఈ వ్యాసంలో ఎఱ్ఱన, నాచన సోమనల కావ్యంలోని స్త్రీ పాత్ర చిత్రణను లోతుగా పరిశీలించారు. నాచన సోముడు భర్తను పోగొట్టుకొన్న రాక్షస స్త్రీలను వర్ణిస్తూ, వాళ్ళ వేదనను చిత్రించే భావుకతను ప్రదర్శింపలేదని శర్మగారు అన్నారు. కాగా వైధవ్య బాధ దేవతలకు, మనుష్యులకు రాక్షసులకు తీవ్రంగా ఉంటుందని...*''మగని పోగొట్టుకొని యేడ్పు యే యాదుదియైనను భావుకుని మనసు కరగింపదా?''*[36] అని శర్మగారు అన్నారు. నాచన సోమునికి ఈ బాధ అర్థంగాక రాక్షస స్త్రీల వైధవ్యాన్ని వివిధ రీతుల్లో వర్ణించి తన కళా ప్రతిభను నిరూపించుకున్నాడే కానీ, వాళ్ళ భావ తీవ్రతను ఊహించలేకపోయాడని రాళ్ళపల్లివారు అభిప్రాయపడ్డారు. ఇక్కడ శర్మగారి మనస్సు విశాలమైనదిగానూ, లోతైనదిగానూ కనబడుతున్నదన్న విలక్షణమైన ధోరణి బయటపడింది.

పై రెండు పేరాల్లో అనంతకృష్ణశర్మ మొదటి దాంట్లో ఉత్తమ స్త్రీల మనోభావాలను దెబ్బతీసే వర్ణనల్నీ తప్పుబట్టారు. రెండో పేరాలో నీచ స్త్రీల గౌరవాల్ని తక్కువ చేసిన క్రమాన్ని నిరసించారు. దీన్ని బట్టి రాళ్ళపల్లివారు చిత్త సంస్కారానికి వత్తాసు పలికిన సహృదయులని అర్థమవుతుంది.

స్త్రీలు ఏ సామాజిక వర్గం వారైనా, పేదలైనా, శ్రీమంతులైనా శర్మగారి దృష్టిలో ఒకటేనన్న భావం తెలుస్తుంది. ఎఱ్ఱన, నాచన సోమనల కావ్యాన్ని తులనాత్మకంగా పరిశీలించిన ప్రముఖుల్లో రాళ్ళపల్లివారు ఒకరు. ఈ విషయం పై ఆనాడు కొందరు విమర్శకుల మధ్య ఖండన మండనాలు జరిగాయి. ఏది ఏమైనప్పటికి శర్మగారు చెప్పిన అంశాలే ఎక్కువ మందిని మెప్పించాయి. ఎఱ్ఱన, నాచన సోమనల హరివంశాల్లో ఉన్న పాత్ర వైశిష్ట్యాన్ని ఎంతో ఔచితీమంతంగా శర్మగారు అంచనావేశారు. కాగా ఎఱ్ఱనది నీచ పాత్రలను కూడా గౌరవించే

---

[35] రాళ్ళపల్లి సాహిత్య సంగీత వ్యాసాలు. పుట. 53.

[36] సారస్వతాలోకము. పుట. 105.

మనస్తత్వమైతే, సోమనది దానికి విరుద్ధమైనదిని సోదాహరణంగా నిరూపించారు. భర్త చనిపోయిన స్త్రీలను విధవరాండ్రని సమాజం భావిస్తుంది. కాని భార్య చనిపోయిన భర్తను విధురునిగా ఎందుకు చూడరని రాళ్ళపల్లివారు ప్రశ్నించారు. అంతేకాదు *"రాక్షస విధవలని, దేవతావిధవలని భేదము కలదా?"* [37] అంటూ పురాణ పాత్రల్లో నీచ స్త్రీల అస్తిత్వాన్ని సైతం శర్మగారు గౌరవించినట్లు దీని ద్వారా అర్థం చేసుకోవచ్చు. సోమన చేసిన ఈ పాత్ర చిత్రణను దృష్టిలో ఉంచుకొని *'కావ్యము సౌమనస్య ప్రధానము'*[38] అని రాళ్ళపల్లివారు ఉద్ఘాటించారు.

అత్తింటి కోడలైన నిగమశర్మ అక్క దారి తప్పిన తమ్ముణ్ణి సక్రమమైన మార్గంలో తెచ్చేందుకు రకరకాలుగా ప్రయత్నించి విఫలమైన వైనాన్ని శర్మగారు *'నిగమశర్మఅక్క'* వ్యాసంలో చిత్రించారు. నిగమశర్మ అక్క మనస్తత్వాన్ని భారతీయ మహిళా సంస్కృతికి నిదర్శనంగా ఈయన తీర్చిదిద్దారు. సంప్రదాయ కుటుంబంలో పుట్టి పెరిగిన స్త్రీ జీవితాన్ని శర్మగారు ఈ వ్యాసంలో నిక్షిప్తం చేశారు. సాధారణంగా స్త్రీలకు పెళ్ళై అత్తింటికి వెళ్ళాక తమ పుట్టింటి బాగోగులను మరిచి పోతారని సభ్య సమాజం అనుకుంటుంది. కానీ ఇక్కడ నిగమశర్మ అక్క ఎంతో బాధ్యతగా చెడిపోయిన తమ్ముణ్ణి, విచ్చిన్నమైన ఇంటి అస్తిత్వాన్ని నిలబెట్టేందుకు చూపిన చాకచక్యాన్ని శర్మగారు గొప్పగా కీర్తించారు. ఈ విధానం దాదాపు భారతీయ కుటుంబాలన్నింటిలో నెలకొని ఉంటుందని రాళ్ళపల్లివారు వ్యాసం ద్వారా చెప్పారు.

తెనాలి రామకృష్ణుడు సృష్టించిన ఈ పేరు లేని పాత్రకు శర్మగారు అత్యంత పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టారనటంలో అతిశయోక్తిలేదు. తెనాలి రామకృష్ణుడు నిగమశర్మ అక్క బాధ్యతలను గొప్పగా చిత్రించినప్పటికీ, ముక్కెర పోయినందుకు బాధ పడిందనటంతో ఔచిత్యం దెబ్బతిందని విమర్శించారు. తెనాలి రామకృష్ణకవి తనకు బాగా ఇష్టమైన కవి అయిప్పటికీ శర్మగారు తమ అభిప్రాయం చెప్పటంలో ఎక్కడా వెనకాడలేదు. రామకృష్ణుడి హాస్యానికి పదహారవ శతాబ్దం తో పాటు ఇరవై ఒకటవ శతాబ్దం కూడా నవ్వుతుంది. కాని ఈ *'పరిహాసము పవిత్రవస్తువును కూడా గమనింపదేమో'*[39] నని శర్మగారన్నపుడు రెండు సమాజాలు కొంత ఆలోచించాయి. ఈ పరిహాసం స్త్రీ ఔన్నత్యాన్ని కుంటు పడేలా చేయకుంటే బాగుండేదని అభిప్రాయపడుతూ వ్యాసాన్ని ముగించారు.

రామాయణాన్ని *"ముఖ్యంగా రాముని దృష్టితో అనుభవించినవాడు భవభూతి. అట్లే సీతాదేవి దృష్టితో చూచి వేదన పడిన వాడు తిక్కనామాత్యుడు; వాల్మీకి మహర్షిది ప్రధానంగా ధర్మదృష్టి యని చెప్పబనిలేదని"*[40] రాళ్ళపల్లివారు *'తిక్కన తీర్చిన సీతమ్మ'* వ్యాసంలో అన్నారు. తులనాత్మక దృష్టితో పరిశీలించిన ఈ వ్యాసం స్త్రీ ప్రాధాన్యాన్ని గుర్తుచేస్తుంది. తిక్కన *'నిర్వచనోత్తర రామాయణం'* లో సీతా పరిత్యాగ ఘట్టాన్ని భారతీయ మహిళా దృక్పథానికి

---

[37] సారస్వతాలోకము. పుట. 105.

[38] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 53.

[39] సారస్వతాలోకము. పుట. 71.

[40] సారస్వతాలోకము. పుట. 129.

ప్రతీకగా చిత్రించారని శర్మగారు చెప్పారు. తిక్కన భారతానికి వచ్చినంత పేరు రామాయణానికి రాలేకపోయిందన్న మాట ఎంత నిజమో, తిక్కన రామాయణంలోని సీతమ్మకు వచ్చినంత పేరు మూల రామాయణంలోని సీతకు రాలేక పోవడం అంతే నిజమని శర్మగారన్నారు. తిక్కన తీర్చిన దిద్దిన సీతమ్మ ధర్మపత్నిగా, ఆదర్శ మూర్తిగా, తల్లిగా పతివ్రతామాతగా విశ్వానికే ఆరాధ్యమైన కుసుమమని కొనియాడారు.

రాళ్ళపల్లివారు 'నాటకోపన్యాసములు' (1935) అనే గ్రంథంలో ధర్మవరం రామకృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావుల నాటకాలను తులనాత్మక దృష్టితో పరిశీలించి, కళలకు సంబంధించి అనేక మౌలిక విషయాలను వెల్లడించారు. అందులో భాగంగానే స్త్రీ జాతి ఔన్నత్యాన్ని సమకాలీన సమాజం కాపాడుకోవాల్సిన అవసరముందని శర్మగారు అన్నారు. కాగా నాటకాల్లో "*స్త్రీ పాత్రలు స్త్రీలే ధరించవలెను.*"[41] అనే స్వభావవాదుల అభిప్రాయాన్ని ఖండిస్తూ, స్త్రీ పాత్రలను పురుషులు కూడా వేసి మెప్పించవచ్చని వ్యాసకర్త సోదాహరణంగా నిరూపించారు. అంటే రాళ్ళపల్లి వారిక్కడ స్త్రీల అభినయానికి అడ్డుచెప్పారని సాధారణంగా అనిపించవచ్చు. కానీ ఈయన దృష్టిలో పర స్త్రీ, పర పురుషునితో అభినయించినప్పుడు నీతికి భంగం కలుగుతుందని భావించి మాత్రమే అలా చెప్పారనేది దృష్టిలో పెట్టుకోవాల్సిన అంశం. ఎందుకంటే లోకంలో "*ఉండునది, ఉండవచ్చు నట్టిది, ఉండవలయు నట్టిదియు నగు వస్తువును బ్రదర్శించుట తోడనే కళలన్నియు మొదలు పెట్టును.*"[42] అని శర్మగారే అంటారు.

దీని ప్రకారం అభినయించడం ముఖ్యంగాని స్త్రీలా, పురుషులా అన్నది విషయం కాదు. అంటే నటనలో ఈ వెసులుబాటు ఉన్నప్పుడు నీతి తప్పడమెందుకని శర్మగారు ప్రశ్నించారు. అంతేకాకుండా స్త్రీలు కూడా ప్రత్యేకంగా అభినయ సంఘాలను ఏర్పాటు చేసుకొని నటిస్తే మంచిదన్నారు. రాళ్ళపల్లివారు స్వయంగా కళామయ జీవి కాబట్టి ఈ అభిప్రాయాన్ని లోతుగా పరిశీలించే చెప్పారనవచ్చు. కాగా శర్మగారు కేవలం పురుషులు మాత్రమే అన్ని రంగాల్లో ఉండాలని ఎప్పుడూ కోరుకోలేదు, కోరుకోరుకూడా. స్త్రీ, పురుషులిద్దరు ఒక్కటేనన్న దృష్టి ఆయన మాటల్లోనే "*స్త్రీ పురుషులలో ఒకరు చెడి యొకరు పవిత్రులుగా నుండుట యెన్నఁడును సంభవింపదు. చెడిన నిరువురును జెడుదురు; తప్పిన నిరువురును తప్పుదురు. కాబట్టి యీ విషయమున ఎక్కువ తక్కువ లెవరికి లేవు.*"[43] అని ఉద్ఘాటించారు. ఈ విధంగా స్త్రీలు ఎప్పటికీ గౌరవ స్థానంలో ఉండాలని అనంతకృష్ణశర్మ నొక్కి వక్కాణించారు.

రాళ్ళపల్లివారు 'వేమన' (1929) గ్రంథంలో స్త్రీ జాతి స్థితిగతులను సుస్పష్టం చేశారు. ముఖ్యంగా వేమన జీవిస్తున్న కాలంలో స్త్రీల పట్ల సమాజం వ్యవహరించిన తీరు తెన్నులనూ చక్కగా అంచనా వేశారు. కాగా వేమనకు స్త్రీలపై వున్న వైఖరిని విమర్శనాత్మకంగా

---

[41] నాటకోపన్యాసములు. పుట. 9.

[42] నాటకోపన్యాసములు. పుట. 10.

[43] నాటకోపన్యాసములు. పుట. 34.

రాళ్ళపల్లివారు పరిశీలించారు. ఆనాటి సమాజం స్త్రీ పట్ల వ్యవహరించిన క్రమాన్ని శర్మగారిలా అంటారు. *“సామాన్యముగ స్త్రీ భోగ్య వస్తువనియు, మగవానిని జెఱుచుటకే సృజింపఁబడినదనియు రూఢ మూలమైయున్న భావము మనలో నింకను నశింపలేదన్న”*[44] ఆలోచనలే ఉండేవి. ఈ పరిస్థితుల మధ్య వేమన మనుగడ సాగించటం జరిగిందన్నారు. అయితే రాళ్ళపల్లివారు వేమన జీవితంపై, ఆయన పద్యాలపై విశేషమైన కృషి చేసిన వారుగా, వేమనకున్న సంఘసంస్కరణ దృక్పథాన్ని అనన్యసామాన్యమైనదిగా అంచనా వేశారు. కానీ వేమనకు స్త్రీలపైగల వైఖరిని మాత్రం ప్రశ్నించకుండా వదల్లేదు. వేమనకున్న శక్తి సామర్థ్యాలను శర్మగారి మాటల్లోనే *“దేశదేశములుఁదిరిగి యిందఱికిన్ని బోధనలు చేసినవాఁడు. ప్రపంచమంతయు మగవారిమయమనియే తలఁచినట్లు కానవచ్చుచున్నదే కాని, ఆఁడువారున్నారే, వారు యెవరినైనా దగ్గఱకుఁబిలిచి శిష్యురాండ్రనుఁగాఁజేసుకొనెన? ఇతని పద్యములన్ని వెదకినను అట్టి మనః పరిణామమున్నట్లే కానరాదు.”*[45] వేమన స్త్రీల వల్ల అనేక బాధలను అనుభవించినప్పటికీ ఒక సంస్కరణవాదిగా స్త్రీల చైతన్యంపై అంతగా దృష్టి పెట్టలేక పోయారని శర్మగారన్నారు. తరిగొండ వెంగమాంబను సుబ్రహ్మణ్యయోగి అభివృద్ధిలోకి తెచ్చినట్లు వేమన ఒక్క స్త్రీమూర్తిని కూడా వృద్ధిలోకి తీసుకోరాలేక పోయారని శర్మగారు వాపోయారు.

శర్మగారి ఈ *‘వేమన’* గ్రంథంలోని ఐదవ ఉపన్యాసం ‘వేమన యోగసిద్ధి – మతప్రచారము’ అనే వ్యాసంలో వేమనకున్న స్త్రీ దృక్పథాన్ని ఒక చోట విమర్శించినా, మరో చోట కొనియాడకుండా ఉండలేక పోయారు. ఆనాడు ఆడపిల్లల తండ్రుల బాధలు మాటల్లో చెప్పనలవి కాదని వ్యాసకర్త చెప్పారు. ధనవంతులైన ఆడపిల్లల తండ్రులు మాత్రం ఏదోలా తమ ఆడపిల్లకు వరకట్నం ఇచ్చి వారి పెళ్ళిళ్ళు చేసేవారు. కాని పేదలైన తల్లిదండ్రులు ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేయడంలో నానా కష్టాలు పడేవారు. దీన్ని గమనించిన వేమన చలించిపోయిన సంగతిని శర్మగారు గుర్తుచేశారు. దీని వల్ల వేమన ఈ వరదానాన్ని పేదింటి ఆడపడుచులకు చేస్తే, ‘ధనమేకాదు, సుఖము కూడా కలుగుతుంద’ని బోధ చేశారని శర్మగారు వ్యాసంలో తెలిపారు. *“రాళ్ళపల్లి, నార్ల వంటి విమర్శకులు వేమన స్త్రీల పట్ల చేసిన వ్యాఖ్యల్ని తప్పుబట్టార ని”*[46] ప్రముఖ మార్క్సిస్ట్ విమర్శకురాలైనా పి. సంజీవమ్మ అన్నారు.

సి. నారాయణరెడ్డి *‘నాగార్జున సాగరం’* గ్రంథానికి రాసిన పీఠికలో శర్మగారు వ్యక్తపరిచిన స్త్రీ దృక్పథం కూడా గమనించదగింది. ఈ కావ్యంలోని కథానాయక శాంతిశ్రీ బ్రహ్మచారిణిగా కనబడుతుంది. ఈమె చిన్నప్పటి నుండి బౌద్ధ సిద్ధాంతాల పట్ల ఆకర్షితురాలై పద్మదేవుని శిష్యురాలిగా జీవితం కొనసాగిస్తుంది. వీరిద్దరి మధ్య ప్రేమ చిగురించి ఒకరిని విడిచి మరొకరు ఉండలేని పరిస్థితికి చేరుకొంటారు. ఏవో కారణాలవల్ల ఇద్దరు విడిపోతారు. తర్వాత

---

[44] వేమన. పుట. 110.

[45] వేమన. పుట. 111.

[46] వేమన కవిత్వం – స్త్రీ. సంపాదకుడు, రాచపాళెం చంద్రశేఖర రెడ్డి ప్రజా శక్తి బుక్ హౌస్ 2017 ఏప్రిల్. పుట. 88.

ఈ శాంతిశ్రీ జీవితం ఎన్నో ఒడిదుడుకులకు లోనవ్వడం జరుగుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని శర్మగారు ఇలా అన్నారు. ''*గురు దేవుఁడు, పద్మదేవుడు ఇద్దరును శుష్కహఠవాదులే. వీరిరువురి నడుమ పరవశముగా నలిగినది శాంతిశ్రీ.*''[47] సాధారణంగా ఎవరైనా శిష్యుల అభివృద్ధిని కాంక్షిస్తారు. కాని ఇందులో శాంతిశ్రీ జీవితాన్ని మాత్ర గురువే నలిపివేయడం బాధ పెట్టిందన్నారు. రాళ్ళపల్లివారు ఈ పీఠికలో స్త్రీల వ్యక్తిత్వం చాలా సుకుమారమైందిగా తెలిపారు. దీన్ని అలుసుగా తీసుకోవడం మగవారికి తగినది కాదని హెచ్చరించారు. స్త్రీల సున్నిత మనస్తత్వాన్ని ఈ సమాజం అర్థం చేసుకోవాలని శర్మగారు ఉద్బోధించారు.

'*రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు*' (2017) గ్రంథంలో '*పదములు – క్షేత్రయ్య*' అనే వ్యాసంలో రాళ్ళపల్లివారు ఆకాలపు స్త్రీల అపార మనో వేదనను మన కళ్ళముందుంచారు. క్షేత్రయ్య జీవించిన కాలంలో ఆడజాతి ఆధ్యాత్మికత ఎంతో గొప్పదని కొనియాడిన శర్మగారు ఆనాటి స్త్రీల దయనీయ పరిస్థితులను కూడా నిష్పాక్షిక దృష్టితో వెల్లడించారు. ముఖ్యంగా రాజకుటుంబాల్లో భార్యల పరిస్థితి మాటల్లో చెప్పనలవి కాదని ఆయన అన్నారు. బహుభార్యాత్వం ఒక రకమైన ఇబ్బందిగా ఉంటే, దానికి తోడు చెలికత్తెల చొరవు మరీ కంటకంగా ఉన్న సందర్భాల్ని వ్యాసకర్త గుర్తుచేశారు. పురుషులు ఎన్ని తప్పులు చేసినా స్త్రీలు కళ్ళు మూసుకొని ఉండాల్సిన పరిస్థితుల్ని రాళ్ళపల్లివారు నిరసించారు. అంతేకాకుండా ఆనాటి వాఙ్మయాన్ని రాసేవారు ఇలాంటి విషయాలను దాటిపోవడం కద్దని కూడా విమర్శించారు.

రాళ్ళపల్లివారి స్త్రీ దృక్పథం గురించి సి. మృణాళిని అభిప్రాయం పరిశీలించదగింది. దీనికోసం సిద్ధాంత గ్రంథం చివరిలోని (వివిధ రచయితలతో ఇంటర్వ్యూలు) ప్రశ్నావళి: 3, ప్రశ్న: 30 ని చూడు (అనుబంధం 1)

దీన్ని బట్టి శర్మగారి ఆలోచనలు ఎంత విశాలంగా, లోతుగా, ఔచితీమంతంగా ఉంటాయనేది తెలుస్తుంది. రాళ్ళపల్లివారు సమాజంలో స్త్రీ, పురుషులు కలిసి పనిచేయ లేనిదే దేన్నీ సాధించలేరనీ, ఒకరు ఎక్కువ మరొకరు తక్కువనే సంకుచిత భావాల్ని విడనాడాలని అభిప్రాయపడ్డారు. దీన్ని బట్టి శర్మగారి స్త్రీవాద దృక్పథం ఎంతో హేతుకీకరణతో కూడిందని అర్థం చేసుకోవచ్చు. రాళ్ళపల్లివారు తమ స్త్రీవాద దృక్పథాన్ని రచనా ప్రారంభం నుండి సందర్భానుసారంగా గుర్తుచేస్తూ వస్తున్నారన్న సత్యాన్ని మరువరాదు.

## 4.5. రాళ్ళపల్లి వారి వ్యాసాల్లో వ్యక్తిత్వ చిత్రణ

రాళ్ళపల్లివారు '*త్యాగయ్యగారి నాద సుధారసం*' '*త్యాగరాజయ్య సాహిత్యము*' అనే వ్యాసాల్లో త్యాగయ్యగారి వ్యక్తిత్వాన్ని చాలా లోతుగా పరిశీలించారు. త్యాగయ్య తన జీవితంలో రామభక్తిని, కవితను, గానాన్ని త్రివేణి సంగమంగా నడిపించారని శర్మగారు అన్నారు. అంతేకాదు త్యాగయ్య ఏనాడు కీర్తి, ప్రతిష్ఠలను, ద్రవ్యాన్ని ఆశించకుండా తాను అనుకొన్న

---

[47] రాళ్ళపల్లి పీఠికలు. పుట. 164.

మార్గాన్నే అనుసరించిన గొప్పవ్యక్తి అని ఈయన చెప్పారు. శర్మగారు చెప్పిన ఈ విషయాల వల్ల మనకు త్యాగయ్య చెప్పిన ఈ కీర్తన తప్పకుండా స్ఫురిస్తుంది.

*"నిధి చాలా సుఖమా! రాముని స*
*న్నిధి సేవ సుఖమా! నిజముగ బల్కు మనసా"*[48]

రాజులూ, అధికారుల చెప్పు చేతల్లో ఉండటం త్యాగయ్యకు ఇష్టం లేదని శర్మగారు ఈ కింది పద్యం ద్వారా వివరించారు.

*'దుర్మార్గ చరాధముల దొర నీవన జాలరా'*
*జేనె దుదరము నింప నేనరుల పొగడితినా'* (సారస్వతాలోకము పుట: 111)

త్యాగయ్య ఎనభై ఏండ్లూ ఎంతో సంస్కార వంతంగా, సంప్రదాయంగా, దృఢమైన సంకల్పంతో, త్రికరణ శుద్ధిగా, పవిత్రంగా తన శేష జీవితాన్ని గడిపిన మహనీయుడని శర్మగారు అన్నారు. త్యాగయ్యలో ఉండే ఈ విశేషమైన వ్యక్తిత్వం శర్మగారిలో కూడా ఉన్నట్లు మనం గమనించవచ్చు. రాళ్ళపల్లివారు మైసూరులో ఉన్నప్పుడు *'భార్గవీ పంచవింశతి'* పేరుతో కొన్ని పద్యాలను రాశారు. అందులో వారి వ్యక్తిత్వాన్ని తెలిపే ఈ పద్యం చూడండి.

మ. *"ధనమే యిమ్మని నిన్ను నేనడుగనో తల్లి! తలంపం ధనం*
*బనఁ బై నొత్తిన రాజముద్రయె కదా! ప్రాణంబుతో నీ జగం*
*బున నున్నన్ని దినాలుఁ గొంద ఱయిన న్మోదింపగా గౌరవం*
*బున జీవింప ననుగ్రహింపు మదియే పూర్ణంబగున్ భార్గవీ"*

(అనంతరాగం పుట: 133)

ఈ విధంగా రాళ్ళపల్లివారు ఏ విషయం రాసినా అందులో తాను లీనమై రాశారనేది గమనార్హం. తాను పరిశీలించిన వ్యక్తుల్లో తమకు ఉపయోగపడే మంచి విషయాలను శర్మగారు ఎప్పటికప్పుడు ఎటువంటి అరమరికలు లేకుండా స్వీకరించారు. కాగా తమ జీవిత పర్యంతం గొప్ప విలువలతో కూడిన వ్యక్తిత్వంతో ముందుకు సాగిన మనీషి రాళ్ళపల్లివారు.

వేమనను తొలి సారిగా మహాకవిగా గుర్తించిన విమర్శకులు కట్టమంచివారు. దీన్ని అంది పుచ్చుకొన్న వారు శర్మగారు. ''*వేమన కవిత్వము గాలివంటిది. అది దూఱని చోటు లేదు. దొరకని తావు లేదు*''[49] అని ఈయన ఉద్ఘాటించారు. వెరసి వేమనకుండే సామాజిక దృక్పథాన్ని, కవితా ధర్మాన్ని, స్వాతంత్ర్యబుద్ధిని లోతుగా పరిశీలించి, దాని ఔన్నత్యాన్ని సమాజానికి చాటి చెప్పారు. వేమనలోనూ ఆయాన రాసిన పద్యాల్లోనూ ఉండే మౌలికత, సంగ్రహ శక్తి, సంఘ సంస్కరణ దృష్టి తెలుగు సాహిత్యంలో తక్కువగా కనిపిస్తాయని శర్మగారు గుర్తించారు. కాగా సందర్భాన్ని బట్టి నీతిని, హాస్యాన్ని పండించి సమాజ చైతన్యానికి పాటుపడిన గొప్ప వ్యక్తిగా వేమనను అభివర్ణించారు. వేమన కవిత్వం సామాన్యులకు కూడా

[48] ప్రముఖ వాగ్గేయకారులు. (భూసుర పల్లి వెంకటేశ్వర్లు) పుట. 58.
[49] వేమన. పుట. 147.

సులభంగా అర్థం కాగలదని శర్మగారు అన్నారు. ఎందుకంటే! ఈయన మాటలు నేరుగా, సూటిగా సామాన్యంగా మన కండ్ల ముందు జరిగే అంశాల్నే ప్రస్తావించేలా ఉంటాయి కాబట్టి. వేమన గొప్ప వ్యక్తి అని చెప్పినప్పటికీ ఆయనలో లోపాలు లేకపోలేదని శర్మగారన్నారు. స్త్రీల పట్ల వేమనకున్న మనస్తత్వాన్ని రాళ్ళపల్లి వారు విమర్శనాత్మకంగా పరిశీలించిన క్రమం పైన చూశాం. వేమన తన జీవితం పట్లా, సమాజం పట్లా వ్యవహరించిన తీరు తెన్నులను రాళ్ళపల్లి వారు ఎంతో స్పష్టంగా 'వేమన' గ్రంథంలో వెల్లడించారు. వేమన పుట్టి పెరిగిన పరిస్థితులను, అప్పటి సమాజ స్థితిగతులను బేరీజు వేసి, వీటికి అనుగుణంగా వేమన వ్యక్తిత్వం ఎలా మలుపులు తిరిగిందో బోధపరిచారు. వేమనకు కలిగిన మానసిక పరిణామవికాసాన్ని శర్మగారి మాటల్లోనే చూడండి.'' *వేమన్న మనసు చాలా మృదువై, దయ, ప్రేమము మొదలగు భావములకు లోఁగెడిదైనను, తీవ్రమైన వివేచనాశక్తి దానిని స్వాధీన పఱుచుకొని గట్టి చేయుచుండును గాన, అది కేవలము భక్తిచేతనే తృప్తిపొంది భజింపఁబడు వస్తువునందలి గుణదోషములను విమర్శింపలేనంత నమ్మకము గలిగియుండఁజాలినది గాదు.''*[50] ఈ విధంగా వేమన వ్యక్తిత్వం చైతన్యానికి ప్రతీకగా అభివర్ణించారు. శర్మగారు వేమనకు బహిరంగ శుద్ధికంటే అంతరంగా శుద్ధి ఎక్కువన్నారు. వేమన వ్యక్తిత్వం సమాజాన్ని, సాహిత్యాన్ని ఒక క్రమ పద్ధతిలో పెట్టడానికి తోడ్పడిందని అనంతకృష్ణశర్మ సూచించారు. వేమన స్వానుభమే ఆయన వ్యక్తిత్వానికి ప్రతీకని అన్నారు. వేమన మనుషులు చేసే తప్పులను కులమతాలకతీతంగా తూర్పారబట్టీ, సమాజంలో అట్టడుగు వర్గాల ప్రజల బాధలను సైతం వేమన పద్యాల్లో మనసుకు హత్తుకొనే విధంగా ఉన్నాయని శర్మగారన్నారు.

క్షేత్రయ్య గురించి మొదటి సారిగా లోతైన దృష్టితో తూచి చూచినవారు రాళ్ళపల్లివారు. క్షేత్రయ్య మువ్వ గోపాలునిపై అనేక కీర్తనలు రాసి పేరు పొందిన గొప్ప కృష్ణ భక్తుడు. రసికుడు, సహృదయుడు, భాషా మర్మజ్ఞుడు అంతకు మించి ప్రతిభాశాలి అని శర్మగారన్నారు. భక్తి తత్వంలోనే వీరి ఆలోచనలు ఆధ్యాత్మికతను సంతరించుకొన్నాయని చెప్పారు. క్షేత్రయ్య మనస్సు మొత్తం స్త్రీ కేంద్రీకృతంగా ఉంటుందని, ఈయన వ్యక్తిత్వం స్త్రీ అంగాంగ వర్ణనే కాకుండా వారి మానసిక స్థైర్యాన్ని కూడా అర్థం చేసుకొనేలా కనిపిస్తుందంటారు. క్షేత్రయ్య అనేక వైష్ణవ క్షేత్రాలను దర్శించి అక్కడున్న దేవతలపై పదాలను రాశాడు. రాజుల ఆశ్రయాన్ని తిరస్కరించిన వారిలో క్షేత్రయ్య కూడా ఒకరు. మొత్తం క్షేత్రయ్య సాహిత్యాన్ని పరిశీలించి రాళ్ళపల్లి వారు ''*ఈతని సాహిత్యమంతయు ఆ కాలపు ఆఁడజాతి యొక్క ఆధ్యాత్మికకథ యనవచ్చును.''*[51] అభిప్రాయపడ్డారు.

రాళ్ళపల్లివారు కట్టమంచి రామలింగారెడ్డి వ్యక్తిత్వాన్ని భౌతికంగానూ, ఆధ్యాత్మికంగానూ చాలా దగ్గరగా పరిశీలించిన వ్యక్తి. వీళ్ళిద్దరిది స్వల్పకాల పరిచయమే

---

[50] వేమన. పుట. 82.

[51] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 152.

అయినప్పటికీ శర్మగారు రెడ్డిగారి తత్త్వాన్ని అర్థం చేసుకొన్న తీరు అందరిని ఆలోచింపజేస్తుంది. ప్రధానంగా రెడ్డిగారిలో ప్రతిభ, లోకజ్ఞానం, అనుభవం, అధికారం, ఆత్మప్రత్యయం లాంటివి ఎక్కువేనని శర్మగారు చెప్పారు. కట్టమంచివారు ఇతర వ్యక్తుల్లో ఉండే ప్రతిభను, నూతనత్వాన్ని గౌరవించే గుణ సంపన్నుడని రాళ్ళపల్లివారు తెలిపారు. భారత, రామాయణాలను జీర్ణించుకొన్న రెడ్డిగారికి 'కవితా ప్రపంచరవి' తిక్కన రచనంటే అమితమైన అభిమానం. కాగా రెడ్డిగారిది ప్రత్యేకమైన ఆలోచనా ధోరణి. తానేదైతే అనుకొంటారో అది చేసి తీరుతారు. ఇంట్లో అయినా వీధిలోనైనా తనదే పైచేయి ఉండాలని అనుకొనే మనస్తత్వం కలవారని శర్మగారు తెలిపారు. కట్టమంచి వారి మీద శర్మగారికున్న గౌరవాన్ని అలాగే గురుభావననూ వెరసి రెడ్డిగారి వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే ఈ రెండు పద్యాలు గమనించండి.

'ఆ. *నీదు నగవు బిగువు, నెఱపల్కు పదను, నీ*
*తెలివిలోఁతు, నడత తెగువ, నీదు*
*నిండు తెలుఁగు మనసు, నీయొర్మి, నీకూర్మి*
*మచ్చుమందులగుచు మరపె నన్ను.*

'ఆ. *వయసునందుఁ, గలిమి, వైదుషీగరిమ, లో*
*కానుభూతి, మించువోని ప్రతిభ*
*నెంత దొడ్డవాఁడవీవు! నాకిచ్చిన*
*దెంత చనవు! మఱతునెట్లు దాని!*

(గాథాసప్తశతి అంకిత పద్యాలు)[52]

కట్టమంచివారు మిత్రులను చాలా గౌరవిస్తారని, ధర్మతత్త్వాలను లోతైన దృష్టితో అర్థం చేసుకొన్న వారని, కావ్యాలను ఆస్వాదించే అద్భుతమైన మనసు కలవారని రాళ్ళపల్లివారు తెలిపారు.

ఈ విధంగా రాళ్ళపల్లివారు ఆయా వ్యక్తుల మనస్తత్వాలనూ, కృషివిశేషాలనూ ఎటువంటి భేదభావాలు లేకుండా నిష్పాక్షిక దృష్టితో బయట పెట్టిన వైనం స్పష్టంగా బోధపడుతున్నది గమనార్హం.

## 4.6. రాళ్ళపల్లి వారి వ్యాసాల్లో పాత్ర చిత్రణ వైశిష్ట్యం

శర్మగారు రాసిన వ్యాసాల్లో 'నిగమశర్మ అక్క' అనే వ్యాసం ప్రముఖమైంది. ఈ పాత్ర తెనాలి రామకృష్ణుడు రాసిన *'పాండురంగ మాహాత్మ్యము'* లోనిది. మామూలు సామాన్య కుటుంబ జీవనాన్ని ఈ 'నిగమశర్మ అక్క' పాత్ర ద్వారా మనం చూడవచ్చు. నిజానికి ఇది తెలుగు సాహిత్యంలో ఒక పేరు లేని పాత్ర అయినా గొప్ప పేరు ప్రఖ్యాతులు పొందిందన్నది విదితమే. తెలుగు ప్రబంధాలలో రామకృష్ణుడి ఆలోచనా విధానం చాలా మంది విమర్శకులను ఆకర్షించింది. ఈ 'నిగమశర్మ అక్క' గురించి రాళ్ళపల్లి వారు అందించిన ఆలోచన సమాజానికి

---
[52] శాలివాహన గాథాసప్తశతీసారము. పుట. V.

ఎంతగానో ఉపయోగపడుతుంది. ఓ నిరక్షరాస్యురాలైన అక్క తాను పుట్టి పెరిగిన పేద బ్రాహ్మణ కుటుంబంలోని సంస్కారాన్ని ఎలా పుణికి పుచ్చుకొంది. ఈ అనుభవం తిరిగి తన పుట్టింటిని చక్క పెట్టేందుకు ఎట్లా ఉపయోగించుకొనింది అన్న అంశాలు ఈ పాత్ర ద్వారా శర్మగారు చక్కగా తెలియజేశారు. దారి తప్పిన తమ్ముణ్ణి దారిలోకి తీసుకోరావడానికి అక్క చేసిన విశ్వ ప్రయత్నాలను తెనాలి రామకృష్ణకవి ప్రబంధంలో ఎక్కడో ఓ మూలన పొందుపరిచారు. దీన్ని శర్మగారు గుర్తించి ఆడజాతి బాధ్యతను సమాజానికి తెలియజెప్పారు. అంతేకాదు సంప్రదాయ పేద కుటుంబాల్లో కూడా ఆచరించదగిన పద్ధతులుంటాయని నిరూపించారు. 'నిగమశర్మ అక్క' తాను తలపెట్టిన పనిని సక్రమంగా చేయడానికి మానసికంగా ముందూ వెనకా ఆలోచించిన విధానాన్ని రాళ్ళపల్లివారు కళ్ళకు కట్టించారు. ఇలాంటి మంచి పాత్రను సృష్టించిన తెనాలి వారిని శర్మగారు *''రామకృష్ణుడమృతములో లేఖిని నద్ది దిద్ది తీర్చి యాడించిన పుత్తడి బొమ్మయిది''*.[53] అని నిగమశర్మ అక్క ను పరిచయం చేసిన తెనాలివారిని ప్రశంసించారు.

'తిక్కన తీర్చిన సీతమ్మ' అనే వ్యాసంలో శర్మగారు తులనాత్మక దృష్టితో సీతమ్మ పాత్రను పరిశీలించారు. ఇప్పటివరకు వచ్చిన రామాయణాల్లో కవులు ఆయా పాత్రల ఔన్నత్యాన్ని చాలా గొప్పగా చిత్రించారు. కాని తిక్కన పోషించిన సీత పాత్ర అన్ని రామాయణాలకు తలమానికంగా నిలుస్తుందని రాళ్ళపల్లివారన్నారు. *''కవి ముఖ్యంగా ప్రజా హృదయానికి ప్రతినిధి''* [54] అని చెప్తూ తిక్కన తీర్చి దిద్దిన సీత పాత్ర ఉత్తరరామాయణంలో అలాగే కనిపిస్తుందని తెలిపారు. కాగా భవభూతి రాముని దృష్టితో రామాయణాన్ని రాస్తే, వాల్మీకి ధర్మ దృష్టితో రాశాడు. కాని తిక్కన మాత్రం సీతమ్మ పక్షాన నిలబడ్డాడని శర్మగారు అభిప్రాయపడ్డారు. రామాయణంలో సీతమ్మ చుట్టూ ఉండే సన్నివేశాలు, కథ మొత్తం హృదయ విదారకంగా ఉంటుందని రాళ్ళపల్లివారు గుర్తుచేశారు.

పుట్టపర్తి నారాయణా చార్యులు రాసిన *'ప్రబంధ నాయికలు'* అనే విమర్శ గ్రంథానికి పీఠిక రాస్తూ, పెద్దన – వరూధిని, తిమ్మన – సత్యభామ, సూరన – కలభాషిణి, భట్టుమూర్తి – గిరిక లను రచయిత గొప్పగా స్పృశించారని చెప్పారు. ఈ పాత్రలన్నీ శృంగార వైభవం కలిగినవని శర్మగారు అన్నారు.

*'రాయల నాటి రసికత'* వ్యాసంలో *'ఆముక్తమాల్యద', 'మనుచరిత్రము', 'పారిజాతాపహరణము'* అనే ప్రబంధాల్లో ఆనాటి సమకాలీన సాంఘిక పరిస్థితులు కళ్ళకు కట్టినట్లు ఉంటాయని రాళ్ళపల్లివారు చెప్పారు. ఈయన చాలా సహజమైన సన్నివేశాలతో ఆయా పాత్రలు కొట్టవచ్చినట్లు కుదరటాన్ని సూక్ష్మదృష్టితో పరిశీలించారు. ఈ పాత్రల్లో ఉన్న మానవ సంబంధాలు గొప్ప సంప్రదాయానికి నిదర్శనంగా కనిపిస్తాయన్నారు. కాలపరంగా

---

[53] సారస్వతాలోకము. పుట. 63.

[54] సారస్వతాలోకము. పుట. 123.

ఆయా సన్నివేశాలు ఆసక్తి కలిగించడం పరిపాటిగా ఉందని వివరించారు. *'మనుచరిత్రము'*లో వరూధిని, స్వరోచి చుట్టూ అల్లుకొన్న ఆరణ్యక సన్నివేశాలు వివిధ ప్రాంతాలను అద్దంలో చూపిస్తాయని అన్నారు. ఈ పాత్రలను చుట్టూ అల్లుకొన్న కథను చెప్పటానికి కవులు సాంఘిక, రాజకీయ, చారిత్రక, సామాజిక, ప్రాంతీయ మొదలైన అంశాలను దృష్టిలో పెట్టుకొన్నారని వీటిని తప్పక అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని శర్మగారు చెప్పారు.

## 4.7. రాళ్ళపల్లి వారి దృష్టిలో రసం

శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గొప్ప రస హృదయం కలవారు. సాహిత్యంలో అన్ని ప్రక్రియల్లో రసానికి ఎక్కువ ప్రాధాన్యం ఉండాలన్నారు. కవులు ఆయా రచనల్లో ఆదరణ ఉన్నా, లేకున్నా ఆయా అంశాల్లో రసానికి పెద్ద పీట వేస్తే ఆకర్షణీయంగా, ఆదర్శవంతంగా ఉంటుందన్నారు. ఏ భావమైతే చిరకాలం మనసులో ఉండి, అలౌకిక ఆనందాన్ని కలిగిస్తుందో అదే నిజమైన రసమని శర్మగారు తెలిపారు. రాళ్ళపల్లివారు రసానికిచ్చిన నిర్వచనాన్ని ఎలా ఉందో పరిశీలించండి. *''శోధితములై పవిత్రములైన భావములే రసములని జెప్పవచ్చు.''*[55] అలంకారశాస్త్రం ప్రకారం రసానికి సంఖ్య వుంటుంది. కానీ రాళ్ళపల్లి వారి దృష్టిలో రసానికి సంఖ్య ఉండదన్న మాటలు గమనించండి. *''అది యిన్నే విధములని పలకపై సుద్దతో చూప సాధ్యముగాదు.''*[56] కవులు భావించే భావాలను బట్టి రసం ప్రవర్థిల్లుతుందని శర్మగారు ఉద్ఘాటించారు. జుగుప్సా, భక్తి, వాత్సల్యాదులు కూడా రసమని వాదించేవారు మనలో లేకపోలేదని ఆయన గుర్తుచేశారు. కాబట్టి మనస్సులో కలిగే శోకం, అసూయ, ద్వేషం, సంతోషం, ప్రణయం మొదలైన చిత్త వికారాలన్నీ రసాలే నని శర్మగారు భావించారు.

ఈ రసమనేది కావ్యానికి, కవిత్వానికి ప్రాణంలాగా, జీవంలాగా పనిచేస్తుందని రాళ్ళపల్లివారి అభిమతం. కవి ఈ రసాన్ని ఎంత గొప్పగా తీర్చిదిద్దితే అంత మంచి పేరు ప్రఖ్యాతులు పొందగలుగుతాడన్నారు. పైగా కావ్యంలో అలంకారాలు, రీతులు లాంటివన్నీ ఈ రసానికి లోబడి ఉంటాయన్నారు. కాబట్టి రసానికి ప్రాముఖ్యం ఇవ్వాలని శర్మగారు అన్నారు. నవరసాల్లో శృంగారం మాత్రమే ప్రధాన రసం కాదని, ప్రతీ రసంలోనూ ఆయా సందర్భాన్ని బట్టి గొప్ప తీవ్రత ప్రవర్థిల్లుతుందని ఆయన అన్నారు. అసహ్యమైన దానిలో కూడా ఆకర్షణీయంగా రసాన్ని పండించిన కవులకు మంచి గుర్తింపు వస్తుందనీ, అలాంటి వారిలో వాల్మీకి, కాళిదాసులు పేర్కొనదగినవారని రాళ్ళపల్లివారు సూచించారు.

అనంతకృష్ణశర్మ రసాన్నీ, నీతిని ఒకే విధంగా చూశారు. ఈ రెండూ ఒకదానితో ఒకటి పరస్పరం కలిసి ఉంటాయనిచెప్పారు. కాగా రసం ఉన్న చోట నీతి, నీతి ఉన్న చోట రసం తప్పకుండా కనబడుతాయని తెలియజేశారు.

---

[55] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 126.

[56] సారస్వతాలోకము. పుట. 101.

రాళ్ళపల్లి వారు అక్కడక్కడ వ్యాసాల్లో రసపోషణ వైచిత్రిని గుర్తుచేసిన సందర్భాలను కింద సోదాహరణంగా పరిశీలిద్దాం.

నాచన సోముడు ఉత్తరహరివంశంలో పిశాచుల్లో ఉండే భక్తి రసాన్ని అత్యద్భుతంగా వర్ణించాడని శర్మగారు కింది పద్యం ద్వారా ప్రస్ఫుటం క్రమాన్ని చూడిండి.

సీ. *పుండరీకములతోఁ బురిడించుకన్నులఁ*
*గారుణ్య మనుతేనె గడలు కొనఁగ*
*మందారశాఖలో మలయఁజాలెడు కేలఁ*
*బాంచజన్యం బనుపండు మెఱయ*
*నుదయాద్రి తటముతో నుద్దించునురమునఁ*
*గౌస్తుభం బను దివాకరుఁడు దోఁప*
*నాలోకనంబుతో నవ్వు పాదంబున*
*నాకాశనది యను నమృత మొప్పు*

గీ. *నమృత ధారధరము మాట లాడినట్లు*
*భాగ్యదేవత రూపు చేపట్టినట్లు*
*లలితగతి నున్న సద్గుణాలంకరిష్ణు*
*విష్ణుఁ బొడగంటి భవముల వీడుకొంటిఁ*

(రా. సా. సం. వ్యా. పుట: 80)

పై పద్య భావమిలా...తామర పువ్వుల్లాంటి అందమైన కను రెప్పలకు దయా దాక్షిణ్యాలు విస్తరించి ఉన్నాయి. పెద్ద పెద్ద కొండల నడుమ మందార పువ్వుల గుంపుల్లో విష్ణుశంఖం పండులాగా దొరికింది. ఉదయకాలంలో కొండల మధ్య ప్రకాశించే మణిలా సూర్యుడు వస్తాడు. ఈ లోకంలో ఆకాశం నుండి నువ్వుతూ నదులు, సముద్రాలు అమృతంలాగా పుట్టాయి. ప్రియమైన మాటలతో ఓ దేవతలాంటి రూపం కలిగిన సుందర సద్గుణరాలిని నేను. ఈ విష్ణువుపై ఉన్న ఆలోచనల్నీ వదిలినానని దయ్యాలు అన్న సందర్భమిది. ఇందులో భక్తి రసం అద్భుతంగా చెప్పబడింది. మూఢ భక్తిలో కూడా కల్మషాలు ఉండవన్నదిక్కడ గమనించాల్సిన విషయం.

అన్నమయ్య శృంగార రసంలో కూడా ఆధ్యాత్మికతను చాలా గొప్పగా చిత్రించిన విధానాన్ని శర్మగారిలా ఉదహరించారు.

*నిన్ను బాసిన యట్లు నెలతకు వియోగదశ*
*లెన్నడను దోప విదియేమొ కాని*

*నిను దలచి లలితాంగి నీ రూపమాత్మలో*
*గని నీవు సవి బయలు కౌగిలించినది*

*తనర నాకాశ తత్త్వము నీ మహత్త్వమని*
*వనిత యెవ్వరి చేత వినెనో కాని*

*నిను బొగడి నీరూపు కనుదోయి కెదురైన*
*తనివి దీరక బయలు తగ జూడ దొడగె*
*మునుకొన్న సర్వతోముఖుడ వనగా నిన్ను*
*వెనకకే భావమున వినెనొ కాని*

*తలపునను వాక్కునను తలప దలపగ నీవు*
*కలసి యా కమలాక్ష గౌగిలించితివి*
*తెలిసితిమి వేంకటాధిపతి నీ విన్నింట*
*గల పనెడి మాట నిక్కంబులో కాని.* (రా. సా. సం. వ్యా. పుట: 170-171)

నిన్ను నమ్ముకొన్న స్త్రీని ఎప్పుడు బాధించవు కాని, నిన్ను స్మరించిన స్త్రీ మాత్రం నీ రూపాన్ని కలలో చూసి హత్తుకొన్నది. నీ గురించి ఎవరి దగ్గరో చాలా గొప్పగా విన్నది కాని, నిన్ను పొగిడే సందర్భంలో నిన్ను చూడాలని నీవున్న చోటికి బయలు దేరింది ఆమె. నీవు సర్వోత్తముడని ఎవరో చెప్పగా విన్నది. సుదీర్ఘ ఆలోచనతో, నీ మాటలు స్మరింపగా నీవు నన్ను పెనవేసుకొన్నావు. శ్రీ వేంకటేశ్వరా నీవు అంతటా ఉన్నావని అనుకొంటున్న సందర్భమిది. ఇలా అన్నమయ్య శృంగారంలో ఆధ్యాత్మికతను పండించిన వైన్యాన్ని ఈ కీర్తనలో చూడవచ్చు.

తిక్కన భారతంలో ఎన్నోరసాలను సమయానుగుణంగా పండించాడు. అందులో కీచకుడికి ఉద్రేకం కలిగించిన ఒక పద్యాన్ని శర్మగారు 'నాటకోపన్యాసము'లు గ్రంథంలో ఇలా ఉదహరించారు.

ఉ. *వికృతపుఁజావు సంప మది వేడుక పుట్టినఁ గిట్టి పట్టి మ*
*స్తకమును బీనదీర్ఘ భుజ శాఖలుఁ బాదయుగంబు మేనిలో*
*నికిఁ జొర నుగ్గగాఁ దుఱిమి నించిన క్రంతలతి త్తియైన కీ*
*చకు ధరణీ స్థలిం జదిపి చక్కని ముగ్గగఁ జేసె దుష్టుఁడై.* (భా. వి. ౨-౩౫౩)
(నాటకోపన్యాసములు పుట: 66- 67)

విరాట పర్వంలో కీచకుడి ప్రవర్తన ఇలా ఉంది. దారుణంగా చంపి, ఆనందాన్ని పొంది, చంచలమైన ఆలోచనలతో శరీరం పరిపరి విధాల బాధపడేలా చేసింది. దీనిలో కూడా ఉద్రేకం ఏ స్థాయిలో ఉండాలో ఆ స్థాయిలో ఉందని శర్మగారు గుర్తుచేశారు.

క్షేత్రయ్య పద సాహిత్యాన్ని రాళ్ళపల్లివారు లోతుగా అధ్యయనం చేసి, వీరి పదాల్లో ఎక్కువగా శృంగార రసం ఉట్టి పడుతుందని గుర్తించారు. ఈ శృంగారంలోనే భక్తి కూడా మిళితమై ఉంటుందని పేర్కొన్నారు. శర్మగారు చెప్పిన ఈ అభిప్రాయాన్ని ఎస్ గంగప్ప కూడా

సమర్థించారు. ఈయన 'క్షేత్రయ్య పదసాహిత్యం' గ్రంథానికి శర్మగారి చేత ముందుమాట కూడా రాయించుకొన్నారు. ఎస్. గంగప్ప ఈ గ్రంథంలో క్షేత్రయ్య పదాల్లో శృంగార రసాన్ని ప్రత్యేకంగా పరిశీలిస్తూ, 'రాళ్ళపల్లి వారిచ్చిన స్పష్టతను యధాథతంగా పేర్కొన్నారు.'[57] క్షేత్రయ్య పదాలను ఆంధ్రులు శృంగార దృష్టితో చూస్తే, కన్నడిగులు భక్తి భావనతో దర్శించారని శర్మగారన్నారు. దీన్ని పురస్కరించుకొని శృంగార రసానికి సంబంధించి ఎస్. గంగప్ప కొన్ని కీర్తనల్నీ ఉదహరించారు. వాటిలో ఉదాహరణకు ఒకటి పరిశీలిస్తే శర్మగారు చెప్పిన ఈ రసం గొప్పతనం గొచరిస్తుంది.

పల్లవి : *దూరమెంచక యిటుల సామిపై – దూరలేల బలికేరే?*
**అ. ప** : *తారుమారు మాటలేల నాడేరే? తరుణులార!*
*తాళరె ఇక చాలును* ॥దూర॥
*ఎన్నదగిన చెలులతోడ జెలిమిగ – నెన్నడైన బలికీనా?*
*కన్నెలెంద రెన్ని వగలు చేసిన – కన్నులెత్తి చూచీనా?*
*వన్నెమీర నెవరేమి పల్కిన – విన్నవిననిరీతి నుండసామి!*
*చెన్ను మీర నా చెలిని గూడెనని – చిన్న మాటలేల వాడేరే* ॥దూర॥
*వారి యిండ్ల కెల్ల నాసామి – వలసిపోయినాడా?*
*కోరికోరి ఖేదనములొసంగి – వారి వేడుకొన్నాడా?*
*వారిజాక్షి తావద్దికి రమ్మని – వలసిసొలసి చొక్కి తినని పిలువగ*
*చేరబోయి దాని జూచి నేనని – మీరి భ్రమసికూడెనేమొ? తెలియదు* ॥దూర॥
*కంతుజనకు మువ్వగోపాలు డే – కాంతమునను మును నన్ను గూడి*
*కంతు కేళి లోపల బిగి కౌగిట – గళలంటి మెలగుచును*
*వింతవింతవగకుల్కు స్వామి యే – యింతికైన, దక్కునా? యూరకె*
*రంతులేల జేసేరే? మిక్కిలి రమణులార? వాని మనసు దెలియక* ॥దూర॥

(క్షేత్రయ్య పద సాహిత్యం పుట: 169-170)

ఈ పాటలో క్షేత్రయ్య తనను స్త్రీగా భావించుకొని, భగవంతుణ్ణి పురుషుడిగా అనుకొని తన చెలికత్తెలతో పలు మాటలను చెప్తాడు. ఇందులో మధుర భక్తి అద్భుతంగా ఉంది. నిర్మలమైన శృంగార రసం ఉట్టిపడుతుంది. దీని భావ మిలా. ఒక స్త్రీ తన చెలికత్తెలతో చెప్తున్న మాటలివి. నేను పూజిస్తున్న స్వామిని దూరంగా ఎందుకు ఉంచమని దురుసుగా మాట్లాడుతారు? చిత్రవిచిత్రంగా వక్రమెందుకు చేస్తారు? ఆపండి. నా స్వామి ఎప్పుడైన పర స్త్రీలతో మాట్లాడాడా? కన్నెపిల్లలెందరున్నా కన్నెత్తి చూశాడా? అంటూ... స్వామితో ఆమె ఎంతమంది స్త్రీలు నీతో సరసమాడిన పట్టించుకోకు స్వామి అన్నది. నా స్వామిపై నిందలెలా వేస్తారు? ఎవరి ఇంటికైనా వెళ్లాడా? అదేపనిగా ఎన్నడైనా వారి అవకాశం చూసి కోరుకొన్నాడా

[57] క్షేత్రయ్య పద సాహిత్యం పుట: 165

? వారిజాక్షి తన వద్దకు రమ్మన్నప్పుడు స్వామి వెళ్లాడని, అది నేనే నని మీరు భ్రమ పడకండి. ఆ మువ్వగోపాలుని మనసు తెలుసుకోకుండా పరిహాసపు మాట్లాడ కండని ఆమె తన చెలికత్తెలను హెచ్చరించిన సందర్భం ఇందులో కనిపిస్తుంది.

క్షేత్రయ్య పై పాటలో విప్రలంభ శృంగారాన్ని, సంయోగ శృంగారాన్ని పోషించారు. కాని మనకు విప్రలంభ శృంగారమే ఎక్కువగా కనిపిస్తుంది. ఇలా శృంగార రసంలోనే భేదాలున్నాయన్న అంశం ఇక్కడ అవగతమవుతుంది. కాబట్టి రస పోషణలో తీసుకోనే శ్రద్ధాసక్తులు కవికి గొప్ప పేరు తెచ్చిపెడతాయని శర్మగారు ఉద్బోధించారు.

రాళ్ళపల్లివారు కావ్యంలో లేదా కవిత్వంలో రసం ఇమిడిన సందర్భాలనే స్పృశించి వదిలేయలేదు. ఆ రసం ఇమడని సందర్భాలను కూడా గుర్తుచేశారు. ఉదాహరణకు *'నాటకోపన్యాసములు'* (1935) గ్రంథంలో ధర్మవరం రామకృష్ణమాచార్యులు *'సారంగధర'* నాటకంలో సందర్భ ఔచిత్యం లేకుండా పద్యాలను చేర్చారని తెలుపుతూ కింది పద్యాన్ని ఉదహరించారు.

**క.** ***దినయామిమల నయారే***
***ఘనయాతన లనుభవింపఁ గననాయెనయా!***
***వినయార్యనయా సునయా***
***తనయా మన యార్తి కెడియు ధారణి నెనయా!***

(నాటకోపన్యాసములు. పుట: 48)

పై పద్యంలో రసధార లేదని శర్మగారు చెప్పారు. ధర్మవరం రామకృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసచార్యులు లిద్దరూ నాటకాలకు ముందు కథను తయారు చేసుకొని మధ్యలో ఆయా పద్యాలను లేదా పాటలను పొందుపరిచారన్న విషయాన్ని గుర్తించి చెప్పారు. ఇలా చేయటం వల్ల కొన్ని పద్యాలు అనవసరంగా నాటకం మధ్యలో వచ్చాయని వాపోయారు. ముఖ్యంగా దీనివల్ల రసధార దెబ్బతింటుదని వక్కాణించారు.

ముందుగా చెప్పుకొన్నట్లు శృంగార రసం మాత్రమే అస్వాదనీయమని భావిస్తే రాళ్ళపల్లివారు దాన్ని మెచ్చుకోరు. అన్ని రసాలూ అస్వాదనీయాలని చెప్తూ, *"రస మేదియైనను మనము సహజముగా నేర్పఱుచుకొన్న నీతి, ధర్మము, అనురూప్యము, సౌమనస్యము మొదలగు హద్దులను మీఱి పోయినచో దాని ఫలమగు ఆనందమును మన మనుభవింపఁజాలము"*[58] అని ఓ స్పష్టమైన అభిప్రాయాన్ని వెల్లడించారు.

ఈ విధంగా రాళ్ళపల్లివారు తమ స్వతంత్ర దృష్టితో ఎంతో సంయమానంతో ఈ రస దృష్టిని ఆయా వ్యాసాల్లో పొందుపరిచారన్నది అవగతమవుతుంది.

---

[58] నాటకోపన్యాసములు (పుట: 61)

## 4.8. రాళ్ళపల్లి వారి దృష్టిలో అలంకారం

అలంకారాల గురించి రాళ్ళపల్లివారు చెప్పిన అభిప్రాయాలు పరిశీలించదగినవి. ఈయన *'నాచనసోముని నవీన గుణములు'*, *'ఆంధ్రవాఙ్మయమున నాచనసోమనాథున కీయఁదగిన స్థానము'* అనే వ్యాసాల్లో ఈ అంశాల్ని పేర్కొన్నారు.

కవిత్వం రసభరితమని భరతుడు, జగన్నాథపండితరాయలు, విశ్వనాథుడు మొదలైనవారు వాదించారు. మరికొందరు కవిత్వానికి అత్యంత ముఖ్యమైంది అలంకారమని పేర్కొన్నారు. వీరిలో భామహుడు ప్రముఖుడు. ఆ తర్వాత గుణం ప్రధానమని దండీ, ధ్వని ముఖ్యమని ఆనందవర్ధనుడు మున్నగు వారు తెలిపారు. ఇంకొందరు రచనలో చమత్కారం ఉండాలని అన్నారు.[59]

'సాధారణంగా అలంకారాలనేవి అగ్నిపురాణంలో ఎనిమిదనీ. అలాగే భారతీయ అలంకారికులైన కుంతకుడు 20, వామనుడు 33, దండి 37, భామహుడు 38, మమ్మటుడు 61, భోజుడు 72, రుయ్యకుడు 84, విశ్వనాథుడు 88, విద్యానాథుడు 73, జయదేవుడు 100, అప్పయ దీక్షితులు 124 అని'[60] ఇలా ఎవరికి ఎన్ని సాధ్యమైతే అన్ని చెప్పారు. ఇప్పటి వరకు కావ్య రచనకు ఏ అలంకారాలు పనికివస్తాయన్న విషయాల్ని చెప్పిన వారు తెలుగులో చాలా అరుదుగా కనిపిస్తారు. సాధారణంగా అలంకారాలు రెండు రకాలు. అవి శబ్దాలంకారాలు, అర్థాలంకారాలు. వీటిలో శబ్దాలంకారాలు కావ్యరచనకు బలం చేకూర్చవని, అర్థాలంకారాల్లో కొన్ని మాత్రమే కావ్య రచనకు తోడ్పడతాయని రాళ్ళపల్లివారి అభిప్రాయం. ప్రధానంగా ఉపమ, ఉత్ప్రేక్ష, రూపకాలంకారాలు రచనకు అనుకూలమైనవని చెబుతూ ఉత్ప్రేక్షాలంకారమున్న పద్య పాదాలను ఇలా ఉదహరించారు.

*'ఇరుల బండారంపుటింటికి బెట్టిన*
*బొందు మల్లెల కోట గోర గెలిచి* (ఉ.హ. 2-171)

సీ. *కుంకుమ హత్తించి కొనగోరదీర్చిన*
*పురుహూతు నిల్లాలి బొట్టసంగ*
.................................
*తెలిదిక్కు తొయ్యలి చెలులపై జల్లంగ*
*నిండముంచిన పైబడికుందయనగ'* (ఉ.హ. 3-86)
(సారస్వతాలోకము. పుట: 60)

[59] కావ్యాలంకార సంగ్రహం. పుటలు. 109-128.
[60] తెలుగు వ్యాకరణము. పుట. 427-429.

ఇటువంటివి చదువరుల కన్నులకు పండగ చేస్తాయని రాళ్ళపల్లివారు అన్నారు. ఈ అర్థ, శబ్దాలంకారాలలో ఏది శ్రేష్ఠమో తెలియాలంటే శర్మగారి అభిప్రాయం తప్పక చదవాల్సిందే. ''*విషయము స్పష్టముగఁ జెప్పుటకు వలయు మార్గము నాశ్రయింపవలయుఁ గాని, యా మార్గమును శబ్దాలంకారశ్లేషాది కల్పనాకంటకములచే దుష్ప్రవేశముగా నొనరించుట పాడిగాదనియు నట్లు స్వపాండిత్య ప్రకటనమందే తాత్పర్యముగా గలవాఁడు కవియై పుట్టరాదని నా మతము*'' [61] దీన్ని బట్టి శర్మగారి అలంకార దృక్పథాన్ని అర్థం చేసుకోవచ్చు.

రాళ్ళపల్లివారు ప్రాచీన ఆలంకారికులు తెలిపిన విషయాలను బాగా ఆకళింపు చేసుకొని తనదైన తీరులో ఆలోచించడానికి ప్రయత్నం చేశారు. అందుకే వీరిని ధ్వని వాది అని అనవచ్చు. వీరి అభిప్రాయాలు నిత్య నూతనాలుగా చలామణి అవుతుండడం విశేషం.

## 4.9. రాళ్ళపల్లి వారి – సామాజిక దృక్పథం

సామాజిక దృక్పథం కలవారంటే సమాజంలో ప్రజలకు ఉపయోగపడే అంశాలను కులమతాలకు అతీతంగా, ఏదీ ఆశించకుండా తాను పొందిన జ్ఞానాన్ని నిష్పక్షపాతంగా పంచిపెట్టే గుణం గలవారని చెప్పవచ్చు. ఇలాంటి సహృదయత లోకంలో కొందరికే ఉంటుంది. సాధారణంగా సాహితీవేత్తలు, కవులు, రచయితలు అందరూ సృష్టించే సాహిత్యం సమాజ హితం కోసమే. కానీ ఈ హితాన్ని ఎవరికి ఇవ్వాలీ, ఎలా పంచాలనే ఆలోచనతో చేసే కృషే రచయితలను గాని, కవులను గాని ఉన్నత స్థాయిలో నిలబెడుతుంది. అటువంటి స్థానంలో చెప్పుకోదగిన వ్యక్తి రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ. ఈయన రాసిన సృజనాత్మక, విమర్శ రచనలను సునిశితంగా పరిశీలిస్తే ఆ సామాజిక దృక్పథం ఏవిధంగా పరిఢవిల్లిందన్న విషయం తెలుస్తుంది. దీన్ని ఒక క్రమపద్ధతిలో పరిశీలిస్తే ఆ పరిణామం స్పష్టంగా బోధపడుతుంది.

సమాజంలో ఉండే వర్ణవ్యవస్థ, మతం, ఆచార – సంప్రదాయాలు, విద్య – సారస్వతం, గురువులు, విద్యార్థులు, భాషా వికాసం, క్రీడా వినోదాలు, మహిళలు, దేవదాసీలు, వేశ్యలు, దుస్తులు, అలంకారాలు మొదలైన అంశాలన్నీ సామాజిక దృక్పథంలో భాగమే. వీటిని ఉద్దేశించి రాళ్ళపల్లివారు ఆయా సందర్భాల్లో ఎలా స్పందించారన్న విషయాల్ని కింద పరిశీలించి ఆయన కనబరిచిన సామాజిక దృక్పథాన్ని అవగాహన చేసుకొనే ప్రయత్నం చేద్దాం.

### 4.9.1. విమర్శ వ్యాసాల్లో సామాజిక దృక్పథం

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ 1912 నుంచి 1977 వరకు తమ వ్యాసాంగాన్ని ఉదృతంగా కొనసాగించారు. వీటిలో ఉన్న ఆయా సామాజికాంశాల్ని సమూలంగా పరిశీలించడం వల్ల శర్మగారికి సమాజం పట్ల ఉన్న బాధ్యత తెలిసే అవకాశం ఉంది.

[61] రాళ్ళపల్లి సాహిత్య సంగీత వ్యాసాలు. పుట. 74.

### 4.9.1.1. కవిత్వం – సామాజిక బాధ్యత

రాళ్ళపల్లివారు 1912లో 'కవిత' అనే వ్యాసం రాశారు. ఇది వారి తొలి వ్యాసంగా ప్రముఖ విమర్శకులు ఘట్టమరాజు అశ్వత్థనారాయణ భావించారు.[62] ఇందులో ప్రధానంగా కవిత్వం రాయడానికి కావాల్సిన సిద్ధాంతాలను శర్మగారు సూచించారు. అవి 1. చక్కని సాహితి 2. ఛందశ్శాస్త్రమున జ్ఞానము 3. ఔచిత్యము 4. సారళ్యము. ఇవి కవిత్వరచనలో కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. కవిత్వాన్ని శర్మగారు ఒక సామాజిక బాధ్యత గల ప్రక్రియగా భావించి ఈ నియమాలను చెప్పారు. *''సాహితియనగా నే భాషలోఁగవితఁ జెప్పఁబూనునో, యా భాషయందు నిర్దుష్టమగు జ్ఞానము. ఏపదమున కేయర్థమున శక్తికలదో యేమాట నెట్టిచోట నుపయోగించిన నేయర్థము మారునో, చక్కగ నెఱిఁగినఁగాని కవిత్వము జెప్పఁబూనరాదు.''*[63] అంటూ కవిత్వం రాసే వారిలో ఒక గొప్ప సామాజిక చైతన్యాన్ని, అంకిత భావాన్ని, నిబద్ధతను పెంచడానికి శర్మగారు ప్రయత్నం చేశారు. అంతేకాకుండా నన్నయ, తిక్కనాదుల కవితల్లోని గొప్పతనాన్ని గుర్తుచేస్తూ రాళ్ళపల్లి వారు చెప్పిన ఈ మాటలు చూడండి *''ఉన్నది యున్నట్లు లోకానుభవసిద్ధములగు మాటల నెవరి నోటవచ్చునని యట్లట్లే పద్యముల నిమిడ్చి రసపుంజముగ జెప్పుటయేకదా వారికవిత యున్నతికి గారణము? ఇంతకన్నఁ గావ్యమున కింకేమి కావలయు?''*[64]అని చెప్పటంలో లోతైన ఆలోచన ఉందని గమనించాలి. రాళ్ళపల్లివారు కవికిగాని, రచయితకుగాని విషయ స్పష్టత ముఖ్యమని *'ఆంధ్రవాఙ్మయమున నాచన సోమనాథున కీయఁదగిన స్థానము'* అనే వ్యాసంలో పేర్కొన్నారు.[65] కాబట్టి కవులు, రచయితలు తమ రచనలపట్ల ఎంతో జాగ్రత్త వహించాలన్న విషయాలను సూక్ష్మ పరిశీలనతో తెలియజేశారు.

### 4.9.1.2. జానపద సాహిత్యం

శర్మగారు *'కన్నడ జానపద సాహిత్యం'* అనే వ్యాసంలో జానపద సాహిత్యంలోని గుణగణాలను చక్కగా వివరించారు. ఈ సాహిత్యంలో శబ్దానికంటే అర్థానికీ, దానికంటే భావానికే ప్రాధాన్యం ఉండటం దాని తత్త్వమన్నారు. స్వచ్ఛమైన జీవితాలను ఎటువంటి సంకేతాలు లేకుండా జానపదంలో ఇమిడి ఉంటుందన్నారు. ఎవరేమనుకున్నా సరే తమ మనసుకి ఏది తోస్తే దాన్ని బయటపెట్టడం గొప్ప లక్షణమని శర్మగారు అభిప్రాయపడ్డారు. *''రసానుభవ చాపల్యం కలవారి కిందులో వున్న ఆకర్షణ సాంకేతిక సాహిత్యంలో ఉండదు.''* [66] అన్న ఈ మాటలు శర్మగారి సామాజిక స్థాయిని అర్థం చేసుకోవడానికి సాక్ష్యాలుగా నిలుస్తాయి.

---

[62] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. గోరంత దీపం. పుట. 12.
[63] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 29.
[64] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 32.
[65] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 74.
[66] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 119.

రాళ్ళపల్లివారు *'ఆంధ్రసాహిత్య చరిత్ర సంగ్రహము'* వ్యాసంలో ప్రత్యేకంగా పామర సాహిత్యంపై చెప్పిన విషయాలు ఆయన సామాజిక దృక్పథానికి అద్దంపట్టేవిగా ఉన్నాయి. ముఖ్యంగా స్త్రీలు ఈ పామర సాహిత్యాన్ని సృష్టించారని, ఈ సాహిత్యం పండితుల సాహిత్యానికి ఏ విధంగానూ తీసిపోదని రాళ్ళపల్లివారు చెప్పారు. సామాజిక దృక్పథమే కాదు సామాజిక చైతన్యం కూడా శర్మగారిలో ఉందనడానికి ఈ వాక్యాలే నిదర్శనం *''ప్రజ్ఞలో, ప్రతిభలో మన మితరులకన్న తక్కువ కాదన్న భరోసా కానీ, ఇంకను మనలో తలయెత్తలేదు''* [67] ఈ మాటలు మన కర్తవ్యాన్ని మరింత పెంచుతున్నాయి. శర్మగారు కన్నడ పాఠకుల కోసం రచించిన ఈ వ్యాసంలో ఆంధ్రసాహిత్య చరిత్ర పరిణామాన్ని పరిచయం చేశారు.

### 4.9.1.3. ప్రబంధ సాహిత్య ఔన్నత్యం

*''ఇప్పటివరకు వచ్చిన తెలుగు సాహిత్యము కేవలము సంప్రదాయమను గడ్డిపోచను పట్టుకొని స్వరూపమును, స్వధర్మమును మరిచి, మునుగక తేలక జీవచ్ఛవముగ నున్నదే కాని రాయలనాటి వాఙ్మయము వలె లేదు.''* [68] అన్న శర్మగారి పలుకులు ప్రబంధ సాహిత్య ఔన్నత్యాన్ని మన కళ్ళముందు ఉంచుతాయి. ఆనాటి సామాజిక పరిస్థితులను అర్థం చేసుకోవడానికి ఈ ప్రబంధాలు బాగా తోడ్పతాయి. వీటిలో వర్ణనలు ఎక్కువగా ఉన్నప్పటికీ అప్పటి సామాన్య ప్రజల జీవితాలు కూడా నిక్షిప్తమై ఉన్నాయని రాళ్ళపల్లివారు సూచించారు. తెలుగు సాహిత్యం మొదటి నుండి రాజులను ఆశ్రయించి ఉండటంపై ఒక రకమైన నిర్వేదం వ్యక్తం చేసిన శర్మగారు,

### 4.9.1.4. ఉత్తమ సంస్కారం

రాళ్ళపల్లివారు అక్షరాస్యుల్ని, నిరక్షరాస్యుల్ని ఒకే దృష్టితో చూశారనడానికి నిదర్శనమైన వ్యాసం *'నాటకకళ: నేటి మన నాటకములు'*. ఈ వ్యాసంలో సినిమాలకు, నాటకాలకు, స్త్రీలకు, పురుషులుకు, సామాన్యులకు, అసామాన్యులకు మధ్య ఉండే తారతమ్యాలను సంయమనంతో అంచనా వేశారు. ఇందులో శర్మగారు చెప్పిన ప్రతి మాట మనల్నీ ఆలోచింపజేస్తుంది. ఉత్తమ సంస్కారం ఎలా ఉండాలో చెప్పిన విధానాన్ని గమనించండి.*''తత్త్వము విచారించితి మేని చాదస్తముల యంతస్తును దాటి లోతుకు దిగి చూడగల్గుటయే ఉత్తమ సంస్కారమునకు గుర్తు. అట్లుచేయలేనిది వట్టి పైపూత.''* [69] అని చెప్పడాన్ని పరిశీలిస్తే వీరి దృష్టిలో ఎవరి పని వారికి గొప్పదన్న ఆలోచన కలగక మానదు. మేం అంతనీ, ఇంతనీ వట్టి గొప్పలు చెప్పటం కాదు చేసే పని సక్రమంగా నిర్వర్తించటం నేర్చుకొంటే చాలని ఉద్బోధించారు. మానవ సంబంధాలు మర్యాదహీనంగా, అస్తవ్యస్తంగా ఉండడాన్ని శర్మగారు తప్పుబట్టారు. మనిషి జీవితానికి శ్రద్ధ అనేది అత్యంత అవసరమని నొక్కి చెప్పారు.

---

[67] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 107.

[68] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 116.

[69] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 124.

### 4.9.1.5. ప్రజా పద జనకుడు – క్షేత్రయ్య

క్షేత్రయ్య మానవతా దృష్టికోణాన్ని ఆవిష్కరింపజేసిన వ్యాసం 'పదములు – క్షేత్రయ్య'. తెలుగు, కర్ణాటక ప్రాంతాల ప్రజల జీవితాలనుండి పుట్టిన ఈ పదాల్లో భక్తి, శృంగారం కలగలసి ఉండటం విశేషమని శర్మగారన్నారు. ''*మారుమూల గ్రామాల్లో ఎక్కడో కనిపించే అచ్చతెలుగు పదాలుగాని, పండితులు ప్రబంధాల్లో వాడిన క్లిష్టసమాసాలుగాని వాటి అవసరాన్ని బట్టి క్షేత్రయ్యకి అందుబాటులో నిలుస్తాయ*''ని[70] భూసురపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. క్షేత్రయ్య స్త్రీని ఎప్పుడూ అగౌరవ పరచలేదని చెప్పిన మాట శర్మగారి సహృదయతకు నిదర్శనం. అంతేకాదు సమాజంలో స్త్రీల అభివృద్ధే నిజమైన సామాజిక ప్రగతికి ముఖ్యం. వీటిని మనం జాగ్రత్తగా అర్థం చేసుకోవాలని అంటూ ''*ఉపేక్షచే ఏగర్భగుడిలోనో మురుగలవలసి యున్నను వాని యందచందములు ఆఱనివి; శక్తి శుష్కింపనిది. గమనించి, ఉపాసించి, అనుభవింపని లోపము మనది గాని వానిదిగాదు.*'' [71] అని రాళ్ళపల్లివారు ఉద్ఘాటించారు.

### 4.9.1.6. సాహిత్య సామాజిక సేవ

రాళ్ళపల్లివారు కందుకూరి వీరేశలింగం పంతులు చేసిన పనిని ప్రశంసిస్తూ, వీరి కృషి సమాజానికి ఎంతో చైతన్యం, ఉత్సాహం కలిగించిందని '*ఆధునికాంధ్ర సాహిత్యపు వేగము*' అనే వ్యాసంలో కొనియాడారు. అంతేకాదు మనం ఎంత కాలమని ఇతరుల సాహిత్యంపై ఆధారపడగలం? మనకంటూ ఒక ప్రత్యేకత ఉండాలని శర్మగారు కోరుకొన్నారు. మన భాషను, మన యాసను, మనగోసను మనం కాపాడుకోక పోతే ఇంకెవరు కాపాడుతారని ప్రశ్నించారు. ప్రజలు ఎప్పుడూ ప్రభుత్వాలని మార్పు చేస్తుండాలి. అప్పుడు కానీ సమాజం త్వరితగతిన అభివృద్ధిలోకి రాదని రాళ్ళపల్లి వారు అభిప్రాయపడ్డారు. ఈ విషయాల్ని రాళ్ళపల్లి వారు 1953లోనే చెప్పారంటే ఆయనకు ఉండే ముందు చూపుని, సామాజిక బాధ్యత ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు.

### 4.9.1.7. విద్యా విధానం

రాళ్ళపల్లివారు 1927లో అనంతపురంలో జరిగిన '*ఆంధ్ర గాయక జనసభ*" అధ్యక్షోపన్యాసం చేస్తూ, చెప్పిన అంశాలు విద్యా వ్యవస్థ సంస్కరణకు ఎంతగానో ఉపయోగపడుతాయి. ముఖ్యంగా ఈయన కళలను కాపాడుకోవాల్సిన అవసరాన్ని ఎంతో దార్శనికంగా వివరించారు. ఆనాడే ఇంత ముందు చూపుతో మాట్లాడిన రాళ్ళపల్లి వారికి సమాజంపై, విద్యా వ్యవస్థపై ఉన్న భక్తి శ్రద్ధలు ఎలాంటివో ఊహించవచ్చు. ప్రధానంగా ఉన్నత విద్యలో చోటు చేసుకొన్న లోపాలను ఈ వ్యాసంలో ఎండగడుతూ ఇకనైనా వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పిల్లలను తల్లిదండ్రులు చిన్నప్పటి నుండే క్రమశిక్షణతో పెంచాలి. నాణ్యమైన విద్యా సౌకర్యాలు వారికి అందేలా చూడాలి. కాగా వారి

---

[70] ప్రముఖ వాగ్గేయకారులు. పుట. 35.

[71] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 148.

ఉన్నతికి తల్లిదండ్రులే చొరవ తీసుకోవాలి. దీనికోసం ఉపాధ్యాయులు కూడా నిబద్ధతతో కృషి చేయాల్సిన అవసరముందని తెలిపారు. అలాగే విద్యార్థుల కూడా పెద్దలు చెప్పిన మాటలను శిరసా వహించి అభివృద్ధి బాట పట్టాలని అనంతకృష్ణశర్మ ఆకాంక్షించారు.

సంగీత విద్యా సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన స్థితిని శర్మగారి మాటల్లో వింటేనే బాగుంటుంది. *''చదువులో మనకు స్వాతంత్ర్యము లేదు; సంధ్యలో నమ్మకములేదు. సంధ్యను బోధించి దాని విలువ నెఱిఁగించువారు లేరు. చదువు చెప్పువారికి మన సంగీతము తెలియదు, కాఁబట్టదుగూడ. ఇన్నాళ్లును కళాశాలలు గుమాస్తాలనే తయారుచేయుచుండెడివి. ఇప్పుడు వారికి తోడు కూలివారిని, బేహారులను సృష్టింప మొదలుపెట్టినవి. ఇంతేకాని రసికులను సృజించుట గూడ తన ధర్మమని గుర్తించిన యూనివర్సిటీ మన దేశమందింకను పుట్టవలసియున్నది.''*[72] అని ఎంతో ఆవేదనతో చెప్పిన మాటలివి.

నేటి చదువులను ఉద్దేశించి చెప్పిన ఈ రెండు మాటలను కూడా తప్పక వారి నుండే వినాలి. *''ఇప్పటి చదువునకు ఫలము బ్రదుకు. అనఁగా కాలక్షేపముచేయుట. అంతేకాని మనుష్యుల హృదయమందు పుట్టుచుండు, పుట్టవలసిన రసభావములకు సంబంధించిన కళలకు మన 'కళాశాల'లలో చోటెక్కడిది? కావుననే లక్షణముగా పద్యమొక్కటి చదువఁగల విద్యార్థి యొకఁడు నేఁడు దొరకుట దుర్లభమైనది.''*[73] అని విద్యా వ్యవస్థలో ఉండే అనేక లోపాలను ఆనాడే తూర్పారబట్టారు.

ఇలా రాళ్ళపల్లి వారు తమ సామాజిక బాధ్యతను అవకాశం దొరికినప్పుడల్లా బయటపెట్టారు. ఇటువంటి వ్యాసాలు నేటి పాఠ్యపుస్తకాల్లో ఉండాల్సిందని చెప్పటానికి సందేహించక్కరలేదు.

## 4.9.1.8. గ్రామీణ దృష్టి

రాళ్ళపల్లివారు *'గంగిరెద్దు'* కావ్యానికి పీఠిక రాస్తూ, ఆనాటి గ్రామీణ జీవితాలను కళ్ళకు కట్టినట్లు చూపించారు. ముఖ్యంగా కవిత్వం గాని, వ్యాసం గాని రాసే వారు పట్టణాల్లో ఉండటం వల్లా గ్రామీణ పరిస్థితులను పట్టించుకోరన్న మాటను అపోహగా రాళ్ళపల్లి వారు తలిచారు. పట్టణంలో ఉండే వారిలో ఎక్కువ మంది పల్లె నుంచి వచ్చిన వారే నని గుర్తుచేశారు. అంతేకాదు రాజుల వద్ద ఉండే కవులు సామాజిక విషయాలపై దృష్టి పెట్టరన్న మాటను కూడా శర్మగారు సరికాదని అన్నారు. కవులుగాని, రచయితలుగాని సామాజిక దృక్పథం లేనిదే రచనలు చేయరని ఉద్ఘాటించారు. శర్మగారు మాటలు నేర్చిన మానవుల బాధలే కాదు, మాటలు రాని మూగ జీవుల మనస్తత్వాన్ని కూడా ఎరిగిన మృదుస్వభావి అని చెప్పవచ్చు. గంగిరెద్దులు వాళ్ళు ఆ పశులను పెట్టే ఇబ్బందులు అంతా ఇంత కాదు. కాగా ఆ మూగ జీవుల వల్ల మనిషి ఎంత లబ్ధి పొందుతున్నాడో ఒక్కసారి ఆలోచించండని శర్మగారు సూచించారు.

---

[72] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 278 – 279.

[73] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 279.

రాళ్ళపల్లివారు *'వదరుబోతు'* గ్రంథ పీఠికలో 'అధికార వృద్ధులు, వయో వృద్ధులు, విద్యా వృద్ధులందరూ అనుసరిస్తున్న పద్ధతుల్లో ఉన్న లోపాలను తప్పుబట్టిన వైనం ఈ వ్యాసాల్లో కనిపిస్తుందని చెప్పారు. స్వాతంత్ర్యోద్యమంలో ప్రజలు చేసిన పోరాటలను మనం ఎప్పటికీ మరువకూడదని శర్మగారు అన్నారు. సమాజంపై బాధ్యతతోనే ఈ వదరుబోతు వ్యాసాల్లో ఈయన కూడా ఓ రచయిత కొనసాగారన్నది అక్షర సత్యం. ఆనాడు అనంతపురం జిల్లాలో ఉన్న కుళ్ళు కుతంత్రాలను కడిగిపారేయ్యాలనే ఈ వదరుబోతు వ్యాసాలు వచ్చాయని ఈయన చెప్పటంలోనే గొప్ప సామాజిక దృక్పథం దాగి ఉంది.

అనంతకృష్ణశర్మ *'పెన్నేటి పాట'* పీఠికలో రాయలసీమ ప్రాంత దుస్థితిని లోతైన దృష్టితో వెల్లడించారు. రాయలసీమలో చెఱువులు ఎండిపోవటం, వర్షాలు రాక పోవటం, అధికారులు నిర్లక్ష్యంగా పరిపాలించటం, ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తులై ఉండకపోవటం, కాగా ఈ ప్రాంతంలో జనులు చదువు సంధ్యలు లేక అనాగరికులుగా ఉండటం లాంటి ఎన్నో విషయాల్ని శర్మగారు దృష్టిలో పెట్టుకొని తమ అభిప్రాయాలు తెలిపారు.

### 4.9.1.9. నాటకోపన్యాసములు – సామాజిక దృక్పథం

రాళ్ళపల్లివారు ధర్మవరం రామకృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావు రాసిన నాటకాలను తులనాత్మకంగా పరిశీలిస్తూ, అనేక సామాజిక అంశాలను నిశితంగా చర్చించారు. ప్రధానంగా ఈ గ్రంథంలో రెండు వ్యాసాలున్నాయి. మొదటి వ్యాసంలో స్త్రీ పాత్రలను స్త్రీలే కాకుండా పురుషులు కూడా వేసి మెప్పించవచ్చు అన్న అభిప్రాయం ముఖ్యమైంది. దీనికి ఉదాహరణలు కూడా వ్యాసంలో చూపించారు. ఇక్కడ రాళ్ళపల్లివారు స్త్రీలను కళా ప్రపంచానికి దూరం చేయాలనే నెపంతో ఈ మాట అనలేదు. నీతిని దృష్టిలో పెట్టుకొని చెప్పారు. అంటే శర్మగారికి మానవ సంబంధాలపై ఉండే ఆలోచనలేమిటో దీనివల్ల స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. సంస్కృతీ సంప్రదాయాలను కాపాడటం శర్మగారి ఉద్దేశ్యంగా అర్థం చేసుకోవచ్చు.

ఒక సందర్భంలో శర్మగారు కట్టమంచి రామలింగారెడ్డితో *''బుద్ధుని జాతక కథలలో దశరథ జాతకమనే కథ ఉన్నది. అందులో రామునికి సీత చెల్లెలు గాని భార్య కాదు'* అని చెప్పారట. అప్పుడు రెడ్డిగారు *''అందులో ఆశ్చర్యమేమీ లేదు. చెల్లెలే భార్యగా వ్యవహరించి వుండవచ్చును. ఫ్రాన్స్ దేశంలో పూర్వకాలంలో ఒక దొర (ఫారల్ మేన్ అని అన్నట్లు నా జ్ఞాపకం) తన బిడ్డనే పెండ్లాడినాడు. తన తర్వాత రాజ్యానికి వచ్చేవారు అన్యరక్తం వారుగా ఉండరాదని ఆయన యిష్టం అని నిర్లక్ష్యంగా ప్రత్యుత్తర మిచ్చారట. అప్పుడు శర్మగారు నాకెంత హృదయభేదకంగా వుండిందో చెప్పి చూపలేను.''*[74] అని అన్నారు. దీన్ని బట్టి శర్మగారికి మానవ సంబంధాలపై ఉన్న అభిప్రాయం స్పష్టంగా బోధపడుతుంది.

[74] 'కట్టమంచి వారి వైలక్షణ్యం' రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 174.

రాళ్ళపల్లిపల్లి వారు చెప్పిన పై అభిప్రాయం కొందరికి మింగుడు పడకపోవచ్చు. కానీ ఈయన నాటకరంగంలో జరిగే ఆయా సన్నివేశాలనూ, పాశ్చాత్య దేశాల్లో ఉండే సంస్కృతీ, సంప్రదాయాలను పరిశీలించి ఈ మాట చెప్పారన్నది నిజం. కేవలం మానవ జాతికి సంబంధించిన నైతిక విలువలను కాపాడాలని ఆలోచించారే తప్ప మరోటి కాదన్నది సత్యం. స్త్రీ, పురుషుల్లో ఒకరు చెడి, మరొకరు బాగుపడటాన్ని శర్మగారు ఒప్పుకోలేదు. అది మంచైనా చెడైనా ఇద్దరికీ చెల్లాలని సార్వజనీనకంగా మాట్లాడారు. అంతేకాదు నీతి నియమాలు లేని ప్రపంచం ఎంత త్వరగా నశిస్తే అంత మంచిదని అభిప్రాయపడ్డారు.

రాళ్ళపల్లివారు రెండో వ్యాసంలో వెల్లడించిన సామాజిక దృష్టి కూడా పరిశీలించదగింది. అందులో ముఖ్యమైన అంశాలు ఇలా ఉన్నాయి. నాటకాల్లో పద్యాలు, పాటలకన్న భావాలకు ప్రాముఖ్యముండాలని శర్మగారన్నారు. అలాగే వస్తువు దేశకాలాదులకు దగ్గరగా ఉంటే మంచిదని సూచించారు. నాటకాల్లో శృంగారం, యుద్ధం, మరణం లాంటి సుదీర్ఘ సన్నివేశాలు అనవసరపు పొడిగింపే తప్ప మరోటికాదన్నారు. కాగా ఈ నాటకకారులిద్దరూ చేసిన శోకాంత నాటకాలు చాలా మందిని ఆకట్టుకొన్న విషయం సత్యమని గుర్తుచేశారు. సాధారణంగా నాటకాల్లో నీతి ప్రత్యక్షమై కాకుండా పరోక్షంగా ఉంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. కానీ వీరిద్దరూ ఇష్టంగానో, లేక కొందరు అతి రసికుల ప్రభావాలకో లోనై కొన్ని సన్నివేశాల ప్రత్యక్షం చేయటం రుచింపలేదన్నారు. శోకాంత నాటకాలను సంతోషంగానూ, విషాదాంత నాటకాలను మరోరకంగా మార్చటం సమంజసంగా లేదన్నారు. *'విషాదసారంగధర'* నాటకంలో చిత్రాంగి చావుపై, *'రామరాజు చరిత్రము'* లోని అషాబీని ఆత్మహత్యపై రాళ్ళపల్లివారు సుదీర్ఘ చర్చ చేస్తూ, చావు, బ్రతుకుల తారతమ్యాన్ని విశదపరిచారు. అసలు ఈ జీవితం దేవుడిచ్చిన వరం లాంటిది. దాన్ని ఎట్ల తీర్చిదిద్దుకొంటే అట్లా ఉంటుంది.

ఏవో బాధలు వచ్చాయని నిండు ప్రాణాలను పోగొట్టుకోవడం సమస్యకు పరిష్కారం కాదు. చచ్చి సాధించే దానికన్నా, బ్రతికి సాధించేది ఉత్తమమని చెప్పారు. నాటకాల్లో ఇటువంటి సన్నివేశాలు సమాజశ్రేయస్సుకు విఘాతం కలిగిస్తాయని వాపోయారు. నాటకాల్లో హాస్యం ఉండటం మంచి పరిణామంగా భావించిన రాళ్ళపల్లి వారు అది అతి అయితే కొందరికి వెగటు కూడా పుట్టించవచ్చని అభిప్రాయపడ్డారు. గొప్ప హాస్య సన్నివేశాలను నాటకాల్లో కల్పించి ఆనందింపజేయటంలో వీరిద్దరూ సిద్ధహస్తులయ్యారని ప్రశంసించారు. నీతి విషయంలో శ్రీనివాస రాయలది పై చేయిగా ఉన్నా, ఇద్దరూ పురాణాలను అధ్యయనం చేసి, వాటిలో ఉన్న నీతిని బయటికి తీసి చూపించటంలో సఫలురయ్యారని మెచ్చుకొంటూ "కాని *కళాసంసారమున నీతి తెరమఱుఁగు భార్యగా నుండి పనిచేయవలయునేకాని ముందుపడి*

*మొగముఁ జూపి త్రోసికొని రారాదు.''*[75] అని అభిప్రాయపడ్డారు. ఈ విధంగా ఎన్నో సామాజిక అంశాలను చర్చించిన శర్మగారి దృష్టి సమాజ చైతన్యానికి నిదర్శమని భావించవచ్చు.

## 4.9.1.10. సారస్వతాలోకము – సామాజిక దృక్పథం

రాళ్ళపల్లివారు *'రాయలనాటి రసికత'* వ్యాసంలో రాయలకాలం నాటి సామాజిక జీవితాన్ని చాలా చక్కగా దృశ్యమానం చేశారు. మూడు ప్రబంధ కావ్యాల్లో పొందుపరచబడిన అప్పటి ప్రజల రసికతను సూక్ష్మబుద్ధితో పరిశీలించారు. ఆనాడు ధనికులు, పేదలు నిర్మించుకున్న ఇండ్లు, వేసుకొన్న వస్త్రాలు, ధరించిన ఆభరణాలు, పూసుకొన్న సుగంధాలు, స్వీకరించిన పుష్పాలు, రుచి చూసిన తాంబూలాలు ఇంకా అన్నపానస్నానాదులన్నిటినీ అభవించటంలో చూపిన శ్రద్ధాసక్తులు చాలా గొప్పవని శర్మగారు అన్నారు. ఆనాటి ప్రజల్లో ధనవంతులు ఉన్నతంగా జీవిస్తే, లేనివారు ఉన్నదాంతో తృప్తిపడ్డారని వ్యాసకర్త తెలిపారు. ఈ ప్రవృత్తి, నివృత్తి భోగాలను అనుభవించడంలో ఆకాలపు ప్రజలే సమర్థులని అభిప్రాయపడుతూ, *''అది నాగరికతకు నిదానము; పౌరుషమునకు ఫలము; అభ్యుదయమునకా ధారము.''* [76] అని రచయిత తమ సామాజిక దృక్పథాన్ని చాటుకొన్నారు.

'రాయల వైదుష్యము' వ్యాసంలో శర్మగారు కృష్ణదేవరాయల గొప్పతనాన్ని సోదాహరణంగా తెలియజేశారు. పదవీ వ్యామోహంతో రాయలు ఎప్పుడు గర్వపడలేదనీ, ప్రజలకు ఇవ్వాల్సినంత స్వాతంత్ర్యం ఇచ్చారని శర్మగారు అన్నారు. అంతేకాదు రాయలు సాంగరాజ్యాన్నీ, స్వాంగ రాజ్యాన్నీ రెండిటినీ సమానంగా చూడాలని శాసించినా గొప్ప ధర్మమున్న రాజని కొనియాడారు. తన సామ్రాజ్యంలో ప్రతిభ ఏ మూలనున్నా సరే దాన్ని గుర్తించి గౌరవించిన కారణ జన్ముడు కృష్ణదేవరాయలని ప్రశంసించారు. శ్రీ కృష్ణదేవరాయలు సాధించిన గొప్ప సిద్ధులను కాపాడుకొని ప్రజలు మునుముందుకు సాగాలని శర్మగారు వ్యాసంలో ఆకాంక్షించారు.

రాళ్ళపల్లి వారు *'నిగమశర్మ అక్క'* వ్యాసంలో సాధారణ బ్రహ్మణ కుటుంబ జీవన వాతావరణాన్ని చక్కగా ఆవిష్కరించారు. 'నిగమశర్మ అక్క'ను తెనాలి రామకృష్ణుడి *'పాండురంగమాహాత్మ్యము'* నకే విలక్షణతను సంతరించిపెట్టిన పాత్రగా అభివర్ణించారు. కావ్యంలో నిగమశర్మ అక్క చెడిపోయిన తమ్ముడిని, ఇంటి బాగోగుల్నీ ఎంతో లౌక్యంగా చక్కబెట్టేందుకు చేసిన ప్రయత్నాల్నీ శర్మగారు ఔచిత్యవంతంగా వివరించారు. నిజానికి ఈ పాత్రకు అంత పేరు ప్రఖ్యాతులు లేకపోయినా, పేర్లున్న పాత్రల కన్న మేలైనదని రాళ్ళపల్లివారు నిరూపించారు.

[75] నాటకోపన్యాసములు. పుట. 77.

[76] సారస్వతాలోకము. పుట. 24.

## 4.9.1.11. వేమన – సామాజిక దృక్పథం

రాళ్ళపల్లివారు తెలుగు కవిత్వాన్ని రసదృష్టితో పరిశీలించిన విమర్శకులు. ఆయన విమర్శకు పునాది విశాలమూ, గంభీరమూ ఐన మానవ జీవితమే అన్న సంగతి మరువరాదు. అనంతకృష్ణశర్మ మొట్టమొదటి గ్రంథ రచన 'వేమన' (1929) లో వారి సామాజిక దృష్టి లోతైనదీ, సూక్ష్మమైనదీ అని తెలుస్తుంది. శర్మగారు గురువైన కట్టమంచి రామలింగారెడ్డి ప్రభావానికి లోనై వేమన కవిత్వాన్ని అభ్యసించారు. రాళ్ళపల్లివారు ప్రాచ్య విమర్శనా దృష్టికి పాశ్చాత్య విమర్శనా లోకాన్ని జోడించి వేమనను జీవితానుభవాన్ని చిత్రిక పట్టిన మహాకవిగా నిరూపించారు. రాళ్ళపల్లి వారి సామాజిక దృక్పథం 'వేమన' గ్రంథంలో సుస్పష్టంగా, నిఖార్సుగా వ్యక్తమైన విధానాన్ని తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం.

అనంతకృష్ణశర్మ వేమన గ్రంథం తొలి వ్యాసంలోనే *''నాకియ్యలేద'ని తిట్టినవారేకాని 'నీవు చెడిపోవుచున్నా'వని తిట్టిన వారరుదు.''* [77] అని సమాజ దుస్థితిని ఎండగడుతూ వేమన సాహిత్య కృషిలో ఉండే సామాజిక దృక్పథాన్ని చెప్పేందుకు పూనుకొన్నారు. శర్మగారన్న ఈ మాటలను వ్యంగ్యంగా అర్థం చేసుకొన్నప్పుడు దాని విస్తృతి చాలా స్పష్టంగా బోధపడుతుంది. అసలైన సామాజిక దృష్టి అంటే తాను పొందిన అనుభవాలను సమాజంతో పంచుకోవడమే. కాగా జీవితంలో ఎదురైన ఒడిదుడుకుల్నీ సూక్ష్మంగా చెప్పి, వాటికి పరిష్కార మార్గాలను సూచించడమేనని అన్నారు. ఇలాంటి సాహసం వేమన జీవితం, సాహిత్యంలో ప్రత్యేకంగా కనబడుతుందని 'వేమన' పరిశోధనలో రాళ్ళపల్లివారు వెల్లడించారు.

వేమన్నను ఎప్పుడూ స్వార్థబుద్ధితో ఆలోచించిన వాడు కాదని శర్మగారు అన్నారు. వేమన తన చుట్టూ ఉన్న ప్రజలను మేల్కొలిపే విధంగా కవిత్వం రాశాడే కానీ, చెడగొట్టే కవిత్వం రాయలేదని బాహాటంగా చెప్పారు. ఇలాంటి సామాజిక దృక్పథంతో కవిత్వం రాసేవారిని చూసి సమాజం హేళన చేయడం తగదన్నారు. 'సమాజ సంస్కరణ నిమిత్తం కవిత్వం రాసిన వేమనకు మన మందరం ఎన్ని చందాలైనా ఎత్తీ, ఎంతమంది వేశ్యలను సమర్పించినా తప్పులేదని ఉగ్గడించారు.'[78] సాధారణంగా సమాజంలో వేమనలాంటి వారు చాలా అరుదుగా ఉంటారు. ఒక వేళ ఉన్నా ఇంత నిష్పాక్షికంగా ఆలోచించి రాసే ప్రయత్నం చేయగలరా? అని శర్మగారు ప్రశ్నించారు. మనిషిగా జన్మించి మృగంలా ఆలోచించడాన్ని వేమన సూటిగా తప్పుబట్టిన క్రమాన్ని రాళ్ళపల్లివారు మార్పుకు చిహ్నంగా భావించాలని సూచించారు.

### 4.9.1.11.1. కవి – కవిత్వం

వేమన పద్యాలను నోరున్న ప్రతి ఒక్కరు సులభంగా నేర్చుకొని గుర్తుపెట్టుకోవచ్చని వ్యాసకర్త పేర్కొన్నారు. పైగా సందర్భాన్ని బట్టి వేమన చెప్పిన మాటలు స్మరించుకొంటే బుద్ధి వికాసమవుతుందన్నారు. పల్లె ప్రజల జీవన విధానంలో భాగమైన వేమన జీవితాన్ని ప్రతి

---

[77] వేమన. పుట. 3.

[78] వేమన. పుట. 56.

ఒక్కరూ అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలని తెలిపారు. కాగా సామాజిక, ఆర్థిక, మానవ సంబంధాలను ఎలాంటి అరమరికలు లేకుండా శక్తిమంతంగా, హృదయానికి హత్తుకొనేలా బయటపెట్టగలిగిన ఆలోచన వేమనది. ఉన్నదానిలో గొప్ప తాత్త్వికతకు పునాది వేసిన సృజనకారుడిగా ఈయన్నీ అర్థం చేసుకోవాలని శర్మగారి మాట. అంతేకాదు వేమన పద్యాలు ఎక్కువ శాతం ప్రజల నోళ్ళలో నానుతున్నాయంటే ఆ కవిత్వంలో ఎంత చైతన్యం దాగుందోనంటూ *"తాను జెప్పుమాట యితరుల హృదయమునందు పడి జారిపోక యందే యంటుకొనునట్లు చేయుటయే కవి కితరుల యందు లేని భగవద్దత్తమైన శక్తి."* [79] అని వ్యాసకర్త అభిప్రాయపడ్డారు. ఇలాంటి శక్తి యుక్తులు కవులు, రచయితలకు ఊరకే రాదు. దానికోసం ఎంతో అనుభవం కావాలి. ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కోవాలి. కుందుర్తి ఆంజనేయులు కవిత్వం గురించి మాటలు స్మరింపదగినవి. *"ప్రజలకోసం కవిత్వం రాయడమంటే ప్రజలందరికీ అర్థమయ్యేట్లు రాయడమనికాదు. వారిని ఉద్దేశించి, వారి సమస్యలను గురించి, వారిని ప్రబోధితుల్ని చేయడానికి రాయడమే."*[80] దాదాపు ఈ మాటలు వేమన కవిత్వానికి చక్కగా సరిపోతాయి. సమాజానికి ఏదో ఒక కొత్త విషయం చెప్పాలనే ఆతృత ఉన్నప్పుడే అది సాధ్యమవుతుంది. ఈ ఆతృత, ఆర్జవం వేమన కవిత్వానికి గొప్ప పునాది వేశాయని రాళ్ళపల్లివారు గుర్తుచేశారు.

## 4.9.1.11.2. కవి – స్వతంత్రబుద్ధి

సాధారణంగా ఊహించి చెప్పిన మాటలకన్న తాను స్వయంగా అనుభవించిన కష్ట నష్టాలను చెబితే గొప్ప ఆదరణ లభిస్తుందంటూ.. *'వేమన ప్రబంధకవులవలె తానుండు ప్రపంచమును దాఁటి వ్రాసినవాఁడు కాఁడు. అతని పద్యములందెల్ల స్వానుభవమును కవితా ధర్మము తాండవ మాడుచుండును.'*[81] ఏదో రచన, అలంకారం, ఛందస్సులకోసమో వేమన కవిత్వం రాయలేదు. పైగా ఎప్పుడూ నేల విడిచి సాముచేయలేదు. సమాజ చైతన్యం కోసమే కవిత్వం రాశాడని రాళ్ళపల్లివారు పరిశోధనలో నిరూపించారు. వేమన తక్షణమే కన్నవి, విన్నవి పద్యాలుగా అల్లడం ఆయన బుద్ధి నైశిత్యానికి తార్కాణం. వేమన సమాజంలో అన్ని కులాల సాధకబాధకాల్నీ స్వయంగా అర్థం చేసుకోగలిగాడు. మనుషుల మనసులు చదవగలిగాడు. మనిషిని మనిషిగా భావించాడే తప్పా, ఏ కులానికో, మతానికో లేదా సిద్ధాంతాలకో అంటగట్టి చూడలేదు. ఆర్థిక బేరసారాలతో ఎవరినీ తక్కువ చేయలేదు. ఉన్నవారు లేనివారిని పీడించే నిరంకుశత్వాన్ని అనునిత్యం తప్పుబట్టారు. అనవసరంగా రాయీ రప్పలకు మొక్కే విధానాన్ని నిరసించాడు. దోషమెక్కడున్నా దాన్ని ఎత్తి చూపించాడానికి కలలోనైనా వెనకాడలేదు. ఎవరో వచ్చి ఏదో చేస్తారని నమ్మి కూర్చోకండి. మీరు చేసే పనిలో న్యాయ, అన్యాయాలను స్వయంగా తెలుగుసుకొని ముందుకు వెళ్లండని తన పద్యాల ద్వారా ఉద్బోధించాడు వేమన. కవి తాను

[79] వేమన. పుట. 167.

[80] కుందుర్తి వ్యాసాలు. పుట. 55.

[81] వేమన. పుట. 29.

మాత్రమే స్వతంత్రంగా ఆలోచించడం కాదు. సమాజాన్ని సైతం స్వతంత్రంగా ఆలోచింపచేసినప్పుడే నిజమైన మార్పు పొడచూపగలదని రాళ్ళపల్లవారు వేమన కవిత్వం ద్వారా తెలిపారు. వేమనలో స్వతంత్రమైన భావాలే బలమైన ఆనకట్టలుగా నేడు ఉపయోగపడుతున్నాయంటే ఆయనలో ఉండే ఆర్జవ శక్తే దానికి మూలాంశమని అనంతకృష్ణులవారి అభిప్రాయం.

## 4.9.1.11.3. సామెతలు – నీతులు

వేమన ఆటవెలదులను జీవిత పర్యంతం గుర్తుండి పోయేలా తీర్చిదిద్దాడని శర్మగారు చెప్పిన మాటలు గమనించండి.*''ఇంత చిన్న వృత్తములో, అంత గొప్ప భావములను, యతిస్థానములు వదలక, వెనక ముందు అతుకులు తిరుగుడులు లేక, కత్తిరించినట్లున్న శబ్దార్థములతో, ఎట్లతఁడు అచ్చువేసినాఁడురా? యనుప్రశ్న పద్యములు వ్రాయుటకు చేయివేసిన వారికెల్ల తెగనిది.''*[82]

వేమన జీవితంలోని లోతుపాతుల్నీ, ఆటుపోటుల్నీ క్షుణ్ణంగా ఎరిగినవాడు; అనుభవించినవాడని కూడా తెలుస్తుంది. అందువల్ల ఆయన ఆటవెలది పద్యాల్లోని మొదటి రెండు పాదాల్లో ఒక విషయాన్ని పరిశీలించి చెప్పి, మూడో పాదంలో దాన్ని సారాన్ని స్పష్టంగా తెలిపాడు. కాబట్టి వేమన రాసిన చాలా పద్యాల్లో మూడో పాదం ఒక సామెత (లోకోక్తి)లాగా స్థిరపడింది. ఉదాహరణకు...1.''**పురుషులందు పుణ్యపురుషులు వేరయా,/ 2. "తలలు బోడులైన తలపులు బోడులా,/3."మంత్రజలముకన్న......** వేమన గాఢమైన జీవితానుభవాలను మూడు ముక్కల్లో ఎంతో అర్థవంతమైన సామెతలాగా రూపొందించడం ఆశ్చర్యకరమైన విషయం.*''ఆయన పద్యపక్తులెన్నియో మెరసి బుద్ధిని ఆకర్షించును. అందువల్లనే అవి చాలావరకు తెనుగు నుడికారములై నానుడులై సామెతలై సూత్రములై నీతులై ప్రజల నోట నానుచున్నవి.''*[83] అని నార్ల వెంకటేశ్వరరావు అభిప్రాయపడ్డారు. ఇలాంటి నీతులు చెప్పడానికి కారణం వేమనకు ఎదురైన అనుభవాలే తప్ప, ఏవో పుస్తకాలు చదివి క్రోడీకరించి రాయలేదని శర్మగారు తెలిపారు. వేమన చెప్పే ప్రతి న్యాయానికి ఒక ఉపమానం తప్పక ఉంటుంది. ఆ ఉపమానం కల్పితంగా కాకుండా మన చుట్టూ ఉండే వస్తువై ఉంటుంది. తప్పా మరోలా ఉండదని శర్మగారు సోదాహరణంగా తెలియజేశారు.

## 4.9.1.11.4. హాస్యం

*''వేమన భాషాశైలి నిష్ఠురము, మర్మభేదకము. అవ్వాత మృదుల నిందోక్తి మెత్తటి వాజ్యము. మధుర హాస్యము మధ్య నడయాడుచుండును. చతుర హాస్యము ఆయన ప్రత్యేక లక్షణమ''ని*[84] కట్టమంచి రామలింగారెడ్డిగారు అన్నారు.

[82] వేమన. పుట. 155.

[83] వేమన పాశ్చాత్యులు. మరుపూరు కోదండ రామిరెడ్డి. పుట. 5.

[84] వేమన పాశ్చాత్యులు. పుట. 38.

హాస్యమనేది మన పూర్వీకులకే అంతగా తెలీదు. ఇక మనకెలా తెలుస్తుందని శర్మగారు అంటారు. సాధారణంగా 'నవ్వించడం ఒక యోగం, నవ్వక పోవడం ఒక రోగం' అని నానుడి. కానీ ఈ మధ్య కాలంలో కృత్రిమ నవ్వుల్నే టీవిల్లోనూ, ఇతరేతర చోట్ల చూస్తున్నాం. సహజంగా, స్వచ్ఛంగా నవ్వేవారు, నవ్వించేవారు నేడు కరువువైనారు. మొదట్లో ఈ హాస్యం నాటకాల్లో విదూషకుని పాత్ర ద్వారా వ్యక్తమయ్యేది. రాను రాను అది నవలలు, కథలు మొదలైన తెలుగు ప్రక్రియల్లో ప్రవేశించింది. ఆనాడు నాటకాలే హాస్యానికి వేదికలవ్వడం గమనించాల్సిన అంశంగా రాళ్ళపల్లివారు గుర్తుచేశారు. అయితే వేమన లాంటి ఋషి పుంగవులు హాస్యాన్ని సాధనంగా చేసుకొని సమాజ ప్రక్షాళనకు పునుకొన్నారు. ఈయన హాస్యంలో ఎక్కువ విమర్శ కనబడినా తొలిగా నవ్వు తెప్పించి, వెరసి లోతైన చింతనాన్ని కలిగిస్తుంది. ఉదాహరణకు ***"ఎదుటి వారి సొమ్ములెల్ల వారికి తీపు"***....[85] అన్న మాటలో ఉన్న ఆంతర్యం అందరినీ ఆలోచింపజేస్తుంది. 'ఉన్న మాట చెప్పితే ఉలుకెక్కువ' 'బుద్ధిచెప్పువాడు గుద్దితేనేమయా' అన్నట్లు.. వేమన ఏది చెప్పినా కుండబద్దలు కొట్టినట్లే చెప్పడం విశేషం. ఇతరులలో గల పొరపాట్లను ఎత్తి చూపించి వేమన హాస్య రసానికి ప్రాణం పోశారు. వేమన తన పద్యాల్లో రెండు పాదాల్లో ఏదో సమస్యను చెప్పి, మూడు పాదంలో దానికి కావాల్సిన విరుగుడును లేదా పరిష్కారాన్ని తెలపడం వల్లా ఫక్కున నవ్వు తెప్పిస్తుంది. కొన్ని సందర్భాల్లో సుదీర్ఘ ఆలోచనలకు లోను చేస్తుంది. అంతకు మించి విజ్ఞానాన్ని కలిగిస్తుంది. ఉదాహరణకు ***"లోభివాని నడుగుట నిష్ఫలము; గొడ్డుటావును బితికినట్లు; మేక మెడ చన్ను గుడిచినట్లు."*** [86] అనే మాటలు సాధారణంగా బూతుల్లగా అనిపించినా తిట్టుకు తిట్టూ, నవ్వుకు నవ్వూ, హాస్యానికి హస్యం అన్నట్లు స్ఫురించక మానదు. వేమన పండించిన ఈ చిరుహాస్యం సమాజాన్ని తప్పుదావ పట్టించకుండా, సరైన మార్గంలోనే నడిపిందని లోతైన దృష్టితో పరిశీలిస్తే తెలుస్తుంది. ఎగతాళి చేసి నవ్వడం వల్ల కొన్ని సందర్భాల్లో మనిషికి బాధ కలుగుతుంది. కానీ వేమన చేసే ఎగతాళి మూర్ఖుణ్ణి వివేకిగా మారుస్తుంది. సమాజంలో ఉన్న తప్పులను బయటపెట్టి, గొప్ప హాస్యం కల్పించిన వేమనకు హాస్యమనే శిల్పం మీద ఉన్న అవగాహనే విస్తృతమైందని శర్మగారి పరిశోధన వల్ల తెలుస్తుంది. ఈ ఔచిత్యం అందరికీ అబ్బినదికాదు. కృత్రిమ హాస్యానికన్నా సహజమైన హాస్యానికి శక్తి ఎక్కువని వేమన కవిత్వం చదివితే తేటపడుతుంది. మానవుల జీవిత మర్మమెరిగిన వేమనకు హాస్యం అలవడిన తీరుతెన్నుల్నీ అనంతకృష్ణశర్మగారు ఆసాంతం పరిశీలించి చెప్పడం వారి సునిశిత దృష్టికి నిదర్శమనవచ్చు.

## 4.9.1.11.5. సమాజ సంక్షేమం

వేమన తాను పొందిన జ్ఞానంతో సమాజంలో మానవులు చేసే పొరపాట్లను సూక్ష్మదృష్టితో పరిశీలించే ప్రయత్నం చేసిన సంఘ సంస్కర్త. సాధారణంగా సమాజంలో

---

[85] వేమన. పుట. 159.

[86] వేమన. పుట. 159.

మాకెందుకులే అనుకొనే వారి సంఖ్యే ఎక్కువ. బాధ్యత తీసుకొనే వారికే బరువన్నట్లు వేమన భావాలకు భారమెక్కువే మరి. వేమన అనేక వ్యసనాలకు లోనై ఎన్నో విషయాల్లో లోతులు తెలుసుకొన్న యోధుడుగా ప్రసిద్ధి చెందాడు. ప్రతి సమస్యకు పరిష్కార మార్గాన్ని యోచించిన విజ్ఞుడు వేమన. ఈయన జీవితాన్ని రాళ్ళపల్లివారు తన పరిశోధనలో వీలైనంత విశాలంగా ఆలోచించి సోదాహరించారు. సమకాలీన సామాజిక సమస్యలపై వేమన కుమ్మరించిన పద్యాలను రాళ్ళపల్లివారు విరివిగా గుర్తుచేశారు. ఎంత చెప్పనా అర్థం చేసుకోని సమాజాన్ని చూసి వేమన తిట్టి పోసిన సందర్భం కింది పద్యంలో చూడండి.

ఆ. *ఎద్దుకైనఁగాని యేడాది తెచ్చిన*
*మాట దెలిసి నడుచు మర్మమెఱిఁగి*
*మొప్ప తెలియలేఁడు ముప్పదేండ్లకునైన..."*[87] (వే. జ్ఞా., 356)

ఇలా మార్పు తీసుకోరావడానికి ఎంతగానో ప్రయత్నించిన తీరే వేమనలోని బలమైన గుణం. ఎవరూ వినక పోయినా తాను చెప్పాల్సిన దాన్ని గట్టిగా చెప్పాడు. ఇలాంటి అంశాలను రాళ్ళపల్లివారు సందర్భానుసారంగా గుర్తుచేయడం గొప్ప సామాజిక విజ్ఞతకు నిదర్శనం.

## 4.9.1.11.6. హేతువాద దృష్టి

'ఆంగ్లంలో దీన్ని Rationalism అంటారు. అంటే సత్యాన్ని, వాస్తవాన్ని తెలుసుకోవడం అని అర్థం. ఈ దృష్టి సరిగ్గా 17వ శతాబ్దంలో ప్రారంభమైందని'[88] ఎస్. ఎస్. నళిని పేర్కొన్నారు. దీన్ని బట్టి చూసే సరిగ్గా ఇది వేమన జీవించిన కాలమని అర్థమవుతుంది.

ప్రతి విషయాన్ని హేతువాద దృష్టితో యోచించే అలవాటు కలిగిన గొప్ప కవి వేమన. సమాజంలో పాతుకుపోయిన మూఢనమ్మకాలను పారద్రోలడానికి వేమన నిత్యం పరితపించాడు. అందుకే ఏ పద్యం చదివినా దానికి ఓ కార్యకారణ సంబంధాన్ని జోడించి చెప్పడానికి పద్యాన్ని ఆయుధంగా మార్చుకొన్నాడు. ఉదాహరణకు కింది పద్యాన్ని చూడండి.

ఆ. *ఎఱుకలేని దొరల నెన్నాళ్ళు కొలిచిన*
*బ్రతుకు లేదు వట్టి భ్రాంతిగాని*
*గొడ్డుటావు పాలు గోఁకితే చేపునా?....*"[89] (691)

ఇలా ఏది చెప్పినా దానికి తగిన హేతువును చూపించే పద్ధతి వేమనకే సాధ్యమని శర్మగారు గుర్తుచేశారు.

## 4.9.1.11.7. మౌలికత – సంఘ సంస్కరణ

అనంతకృష్ణశర్మగారు వేమన పద్యాల్లోని మౌలికతకు సూక్ష్మదృష్టితో పరిశీలించారు. వేమన ఆలోచనల్లో తీవ్రమైన బలముంది. వేమనలో అరువు తెచ్చుకొన్న భావాలు

[87] వేమన. పుట. 116.
[88] తెలుగు సాహిత్య విమర్శ దర్శనం. పుట. 1090-91.
[89] వేమన. పుట. 65.

లేవనవచ్చును. ఈ భావాలన్నీ తనవే కాబట్టీ అత్యంత ఆదరణకు నోచుకొన్నాయి. ఏది ఎలా చెప్పిన తన అనుభవం నుండే చెప్పాడు కనుక చదవడానికి ఆసక్తి పుడుతుందని రాళ్ళపల్లివారు చెప్పారు.

''*సంఘ సంస్కారికుండవలసిన ప్రధానగుణము ఏ సంఘమును తాను సంస్కరింపదలచునో, దానిలోనే తానును జేరి, వారి సుఖదుఃఖములను తాను ననుభవించి, వారి జ్ఞానా జ్ఞానములతో సహానుభూతి గలిగియుండుట.*''[90] అని శర్మగారన్న మాటల్లో సామాజిక దృక్పథం స్పష్టంగా కనిపిస్తుంది. ఇలాంటి స్పృహకలిగి ఉంటేనే ప్రజలు కూడా అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేయగలరు. అలా కాకుండా ఎన్ని ఉపన్యాసాలిచ్చినా వ్యర్థమేనని ఇటువంటి ప్రాధాన్యమున్న ఎన్నో విషయాలను శర్మగారు తడమకుండా వదలలేదు.

## 4.9.1.11.8. వేమన కాలం – సమాజం స్థితిగతి

వేమన జీవించిన కాలంలో (క్రీ.శ. 1780–1869) అనేక వాదాలు, మతాల సిద్ధాంతాలు సమాజంలో విరివిగా ప్రబలాయి. వీటన్నింటిని వేమన సంయమనంతో అర్థం చేసుకొని ముందుకు వెళ్ళాడు. కాబట్టి సమాజానికి చెప్పాల్సిన అంశాలనే కవిత్వంగా మలిచారు. దోషం ఎక్కడ ఉన్నా దాన్ని వదలి పెట్టలేదు. ఈ నిచ్చెన మెట్ల సమాజాన్ని వేమన ఆసాంతం అవగాహన చేసుకోవడానికి ప్రయత్నించాడు. ధర్మం, మోక్షసాధనం, న్యాయం లాంటి సూక్ష్మాంశాలను ఒక బాధ్యతగా అర్థం చేసుకొన్నాడు. ద్వైతం, అద్వైతం, జైనులు, బౌద్ధులు, చార్వాకులు పాటించే సిద్ధాంతాలను గుడ్డిగా నమ్మకుండా మానవుని నిజమైన శక్తిని వేమన నమ్మాడు. ఈ వాదాలను వేమన నిరసించిన తీరున్న పద్యాలు వేమన కవిత్వంలో అనేకం ఉన్నాయి. వాటిలో శర్మగారు సందర్భానుగుణంగా పేర్కొన్న పద్యాన్ని చూడండి.

ఆ. ***సాటి చేయవచ్చుఁ జదివి వాదము లాడు***
***చదువరులను జెట్టి సముదయమును***
***పోరిపోరి గెల్చు నోరు నోవనివాఁడు...***"[91] (3873)

వేమన జీవించిన కాలంలో న్యాయ, అన్యాయాలు రెండూ అభివృద్ధి చెందాయని వ్యాసకర్త అభిప్రాయపడ్డారు. వేమన మనసు చాలా మృదువైనది. దయ, ప్రేమ అనే భావాలతో పాటు గొప్ప వివేచన శక్తి కలది. తాను నమ్మిన శైవంలోకూడా తప్పులు లేకపోలేవని వేమన అన్నట్లు రాళ్ళపల్లి వారు ఈ పరిశోధనలో నిగ్గుతేల్చారు. వేమన 'కంటిలోని నలుసునూ, కాలి ముల్లునూ, చెప్పులోని రాయినీ, చెవిలోని జోరీగనూ వస్తువులుగా తీసుకొని ఇంటి పోరుకు అన్వయించడం ఎవరూ కాదనలేని సత్యం. కానీ ఈ ఇంటి పోరుకన్న వీధి పోరు వేమన్నను ఎక్కువగా కలచి వేసిన సంగతిని శర్మగారు సందర్భోచితంగా గుర్తుచేశారు.

---

[90] వేమన. పుట. 115.

[91] వేమన. పుట. 80.

వేమన మత సిద్ధాంతాలను నిష్కర్షగా తప్పుబట్టిన విధానం పద్యాల్లో కొట్టవచ్చినట్లు కనిపిస్తుందని రాళ్ళపల్లివారన్నారు. వేమన నివసించిన ప్రాంతంలోని ప్రజలు మాట్లాడే భాషనే పద్యాల్లో చొప్పించడం సామాజికతకు నిదర్శనం. వేమన ఇంటి చుట్టూ పండిత వాతావరణం నెలకొన్నా దానికి ఆకర్షితుడు కాకుండా గ్రామీణ భాషకు పట్టం కట్టాడు. తను వెల్లడించాల్సిన అంశాలను పరిశోధనాత్మకంగా, తులనాత్మకంగా బయటపెట్టాడు. వేమన సంసార జీవితంపై ఏనాడు అసహనం పడకుండా జాగ్రత్తపడ్డాడని రాళ్ళపల్లివారు అన్నారు. వేమన సంసారాన్ని 'మాయ' గా భావించలేదని శర్మగారు అభిప్రాయపడ్డారు. వేమన సంసార జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా సమర్థవంతంగా ఎదుర్కోగలిగాడు. అంతే కాదు దాన్ని మనిషి కర్తవ్యంగా నొక్కి చెప్పి తన సహనాన్ని చాటుకొన్నాడు. సమాజంలో జరిగే అన్యాయాలనూ, అక్రమాలను ఎప్పటికప్పుడు తూర్పారబట్టడం వేమన కవిత్వం లక్షణం. వేమన తప్పులను ప్రత్యక్షంగానే కాకుండా పరోక్షం చెప్పడాన్ని అలవర్చుకొన్నాడు. పైగా హాస్యాన్ని జోడించి చెప్పడంతో అది అర్థమవ్వాల్సిన వారికి సులభంగా అర్థమై కోపం, బాధ, సంతోషం మొదలైన హావభావాలను కలిగిస్తుందని వ్యాసకర్త తెలిపారు. వేమన పద్యాల్లో కేవలం విమర్శలే కాకుండా వాటికి పరిష్కార మార్గాలను కూడా సూచించాడు. బాధలో ఉన్నవారికి సంతోషాన్నిచ్చి ఉపశమనం కలిగించాడు వేమన. సమాజంలో మానవ సంబంధాల గొప్పతనాన్ని తెలిపి జీవితాలకు వెలుగులు ప్రసాదించాడు. వేమనను సమాజం ఎన్నో బాధలకు గురిచేసింది. కానీ వాటిని ఓప్పిగ్గా ఎదుర్కొని నిలబడ్డాడంటే దానికి కారణం ఆయనలో ఉన్న నిగ్రహశక్తి. వేమనను నానా మాటలు తిట్టి, పిచ్చివాడని రాళ్ళతో కొట్టిందీ సమాజం. అయినా సహించుకొన్నాడు. తోటి వారిని ప్రేమించాడు. ప్రకృతిని ఆరాధించాడు. మూగ జీవులను దగ్గరకు తీసుకొన్నాడు. బండరాళ్ళకు మొక్కొద్దని ఉద్బోధించాడు. ఎన్నని చెప్పేది. తన మనసుకు ఏది తోస్తుందో దానికి ఆలస్యం లేకుండా స్పందించాడు. ఇలా అనేక సమస్యలకు సమాధానమిచ్చిన వేమన కవిత్వాన్ని తప్పక చదవాలని వ్యాసకర్త ఆకాంక్షించారు. అంతేకాదు నేడు పాఠశాల విద్యార్థులకు వేమన పద్యాల్ని నేర్పించి సామాజిక జీవితం పట్ల చక్కని అవగాహన కల్పించమన్నారు.

పాఠ్యాంశాల్లో ఏవో ప్రబంధాల్లోని కఠినమైన పద్యాలు పెట్టి పిల్లల తలలు బద్ధలు కొట్టడం కన్న వేమన రాసిన ఈ సులభమైన పద్యాల్ని నేర్పించి, ప్రేరణ కలిగించమని వక్కాణించారు. వేమన చైతన్యం కలిగిన గొప్ప యోధుడు. వేమన కేవలం మూర్త విషయాలనే కాకుండా అమూర్త అంశాలను కూడా కవిత్వంలో రాసిన దీర్ఘదర్శి. శాస్త్ర సాంకేతిక రంగాల్లో సమాజం సాధించాల్సిన పురోభివృద్ధిని ఆనాడే చెప్పడం వేమన దార్శనికతకు నిదర్శనమని రాళ్ళపల్లివారు అన్నారు. వేమన మనం ప్రతి దినం చూసి, వినే సంగతుల్నే తన భావనా బలంతో గొప్ప కవిత్వంగా మలిచాడు. వేమన్ను మత మౌఢ్యాన్ని తీవ్రంగా తిరస్కరించిన అభ్యుదయవాదిగా గుర్తించకపోతే ఆయన కవిత్వం చదివి లాభం లేదని రాళ్ళపల్లివారు పునరుద్ఘాటించారు.

పై విధంగా అనంతకృష్ణశర్మగారు వేమన కవిత్వంలోని సామాజిక దృక్పథాన్ని అంచనా వేసి, వేమన్నను గొప్ప మానవతవాదిగా, ప్రజాకవిగా నిరూపించారు. వేమన సంస్కరణా దృక్పథం ఏ సమాజానికైనా, ఏ కాలానికైనా వర్తిస్తుందని చెప్పారు. వేమనను గొప్ప దార్శనికునిగా, మహాకవిగా తెలుగు పరిశోధన రంగంలో నిలబెట్టిన ఘనత కూడా రాళ్ళపల్లి వారికి కచ్చితంగా దక్కుతుంది. ఇప్పటివరకు వేమన మీద ఎంతో మంది ఎన్నో పరిశోధనలు చేసి ఆయా అంశాల్ని బయటపెట్టారు. కానీ రాళ్ళపల్లి వారు తెలుగు పరిశోధకుల్లో కవిజీవిత రచనను విమర్శనాత్మక దృష్టితో పరిశీలించిన తొలి వ్యక్తి కావడం విశేషం. వేమనపై పరిశోధన చేసిన వారు అనేక వివాదాంశాలను లేవనెత్తారు. శర్మగారు ఏ వివాదాల జోలికి పోకుండా వేమన జీవితం నుండి సమాజం ఏమి నేర్చుకోవాల్న అంశాల్ని కూలంకషంగా తమ పరిశోధనలో వెల్లడించారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెరిగి, సంస్కరణ భావాలు అలవాడలంటే వేమన పద్యాలు తప్పక చదవాలని పేర్కొన్నారు. సమకాలీన సమాజం వేమన జీవించిన కాలం నాటి పరిస్థితులను అర్థం చేసుకొని భవిష్యత్తు కార్యాచరణకు వేసుకోవాల్సి మార్గాన్ని రాళ్ళపల్లివారు చక్కగా ఏర్పాటుచేశారు.

## 4.10. రాళ్ళపల్లివారిపై కట్టమంచి రామలింగారెడ్డి ప్రభావ – విశేషాలు

సాధారణంగా ఏ విషయంలోనైనా ఒకరు ప్రత్యక్ష ప్రభావాలకి లోనైతే, మరొకరు పరోక్ష ప్రభావాలకి లోనై ఉంటారన్నది వారి వారి జీవిత చరిత్రలు తెలుసుకొన్నప్పుడు బోధపడుతుంటాయి. ఈ క్రమంలోనే కట్టమంచి, రాళ్ళపల్లి గార్ల స్నేహ సంబంధాల్నీ, గురుశిష్యుల అనుబంధాన్నీ అర్థం చేసుకోవచ్చు.

### 4.10.1. కట్టమంచివారు పరిచయానికి ముందు రాళ్ళపల్లి

శర్మగారికి పదమూడేళ్ళ వయస్సు వరకు తండ్రిగారే గురువు. ఈయన *'రామాయణ సంగ్రహము', 'రఘువంశము', 'చంపూ రామాయణం', 'చంపూభారతము', 'విశ్వగుణా దర్శనము'* అనే సంస్కృత గ్రంథాలను బోధించారు. అలాగే కూచిమంచి తిమ్మకవి *'అచ్చతెలుగు రామాయణం, నీలా సుందరీ పరిణయము, 'ఆంధ్రనామ సంగ్రహము'* లను కూడా తండ్రిగారి వద్దనే అభ్యసించారు.

1906లో శర్మగారు చదువు కోసం మైసూరుకు వెళ్ళారు. అక్కడ మొదటగా సజ్జయ్య తాతాచార్యుల వద్ద భారవి *'కిరాతార్జునీయము'*, చామరాజేంద్ర సంస్కృత పాఠశాలలో *'సంస్కృత వ్యాకరణము, ప్రాకృత వ్యాకరణము*, అలంకారాలు, కాళిదాసుని *'అభిజ్ఞాన శాకుంతలము'* నాటకాన్ని సగభాగం చదివారు. తర్వాత పరకాలమఠంలో శ్రీ కృష్ణ బ్రహ్మతంత్ర యతీశ్వరుల వద్ద చదువులో కొంత అనుభవాన్ని పుణికిపుచ్చుకొన్నారు. చామరాజనగరం రామాశాస్త్రి గారితో *'ఉత్తర రామాయణము, ముద్రారాక్షసము' 'అనర్ఘ రాఘవము' 'కాదంబరి'* లో కొంతభాగం అభ్యసించారు. ఇలాంటి ఉద్దండ గురువుల బోధన వల్ల రాళ్ళపల్లివారు సంస్కృతంలో మంచి పాండిత్యాన్ని సంపాదించగలిగారు. ఈ విషయాన్ని

ప్రముఖ పరిశోధకులు ఘట్టమరాజు అశ్వత్థ నారాయణ *'రాళ్ళపల్లివారి జీవిత చరిత్ర సంగ్రహము'* లో ఇలా ప్రస్తావించారు. *"శ్రీ కృష్ణ బ్రహ్మతంత్ర పరకాలయతీశ్వరుల, చామరాజనగర రామాశాస్త్రిగారి సాన్నిహిత్యం వలన శర్మగారికి సంస్కృత సాహిత్యములో మంచి ప్రవేశము కలిగినది."*[92]

## 4.10.2. కట్టమంచివారి పరిచయం తర్వాత రాళ్ళపల్లి

1910లో మైసూరు మహారాజ కాలేజీలో ఆచార్యులుగా పనిచేస్తున్న కట్టమంచి రామలింగారెడ్డి పరిచయ భాగ్యం కలిగేంత వరకూ శర్మగారు కేవలం సంస్కృతాన్నే చదుకోసాగారు. అంటే అప్పటికీ శర్మగారికి తెలుగు సాహిత్య పరిచయం చాలా తక్కువగా ఉందని తెలుస్తోంది. కట్టమంచి రామలింగారెడ్డి తత్త్వశాస్త్రములో, చరిత్రలో, ఆంగ్ల సాహిత్యము, తర్కశాస్త్రాన్ని బాగా అభ్యసించిన మేధావి. పైగా ఆ కళాశాలలో ఈ విషయాల్ని విద్యార్థులకు బోధించేవారు. ఇంగ్లాండులో ఐదేళ్ళు పాటు చదువుకొని గొప్ప ప్రపంచ జ్ఞానాన్ని సంపాదించిన ప్రజ్ఞాశాలి రెడ్డిగారు. ఈయన శిష్యుడు కందాళ రఘునాథ చార్యులు శర్మగారిని కట్టమంచి వారికి పరిచయం చేయించారన్న విషయాల్ని మొదటి అధ్యయంలోనే తెలుసుకొన్నాం. ఈ పరిచయం కట్టమంచివారు 1951లో కీర్తిశేషులైయేంతవరకూ మూడు పూవ్వులు ఆరు కాయలుగా వర్థిల్లింది. ప్రధానంగా శర్మగారు రెడ్డిగారితో ప్రాచీన తెలుగు సాహిత్యాన్ని బాగా ఆకళింపు చేసుకొన్నారు. ఈ విషయాన్ని శర్మగారే 'నాగురువులు' అనే వ్యాసంలో స్వయంగా ఇలా చెప్పుకొన్నారు. *"ప్రాతప్రపంచముననే ప్రాకులాడుచున్న నాకు వారి తోడి సహవాసము ఆధునిక ప్రపంచపు తలుపులు తెరచి ఆహ్వానించినది."*[93] విశాలమైన దృష్టి, అనర్గళంగా మాట్లాడే శక్తి, హృదయాన్ని ఆహ్లాదపరిచే హాస్యం, నిశితమైన విమర్శ, నిర్భయమైన అభిప్రాయాలు కలగలిసిన కట్టమంచివారి సాన్నిద్యం శర్మగారికి దొరకడం నిజంగా అదృష్టమే అనవచ్చు.

సంస్కృతానికే పరిమితమైన రాళ్ళపల్లివారి పాండిత్యాన్ని రెడ్డిగారు తెలుగు, ఆంగ్లానికి విస్తరింపజేశారు. తెలుగు సాహిత్య విమర్శ ప్రపంచానికి రెడ్డిగారు అందించిన విమర్శా మణి రాళ్ళపల్లివారు అనటం సముచితం. సుమారు మూడేళ్ళు వారానికి మూడు నాలుగుసార్లు వీరి చర్చా గోష్ఠి కొనసాగింది.*'భారతము'*,*'రామాయణము'* మొదలైన విషయాల్నీ వీరు హేతుబద్ధంగా చర్చించడం జరిగింది. ఒకరికొకరు భావ వినిమయాన్ని గాఢంగా చేసుకొన్నారు. కాబట్టి అక్కడక్కడ కొన్ని అభిప్రాయాలు కలిసినా, మరికొన్ని అభిప్రాయాలు వైరుధ్యంగా పరిణమించాయి. శర్మగారు తిక్కన భారతంపై, వేమన కవిత్వంపై మక్కువ పెంచుకోవడానికి రెడ్డిగారితో చేసిన చర్చలే ప్రధానకారణం. రెడ్డిగారికి శర్మగారిలోని సంస్కృత

[92] అనంతరాగం. పుట. 124.

[93] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 199.

పాండిత్యం, ఏ విషయాన్నైనా నేర్చుకోవాలనే అభిలాష బాగా నచ్చాయి. పైగా చర్చల్లో శర్మగారి అభిప్రాయాల్నీ కూడా ఆయన అంగీకరించే వారంటే అది రాళ్ళపల్లి వారి విద్వత్తుకు నిదర్శనం.

అప్పటి శర్మగారి వయసు పదిహేడేళ్లు. రెడ్డిగారి వయసు ముప్పైయేళ్ళు. వయస్సులో ఎంత వ్యత్యాసమున్నా తెలుగు సాహిత్యం మీదున్న అభిమానం వీరిని కలిపింది. రెడ్డిగారు శర్మగారిలో ఉన్న ప్రతిభా పాటవాల్నీ పరిశీలించి, ఏ డిగ్రీలు లేకున్నా మైసూరు మహారాజా కాలేజీలో తెలుగు పండితునిగా నియమించారు. ఈ విషయాన్ని శర్మగారే 'కట్టమంచి వైలక్షణ్యము' అనే వ్యాసంలో *"ఆ కాలేజిలో అదివరకూ లేని తెలుగు శాఖను నా కోసమే ప్రారంభం చేయించినాడాయన అని నా నమ్మకం."*[94] అంటూ తన గురుభక్తిని చాటుకొన్నారు. వేమనపై ఇంత గొప్ప పరిశోధన చేయడానికి రెడ్డిగారు అందించిన ప్రోత్సాహమే కారణంగా ఆయా లేఖల వల్ల స్పష్టమవుతుందని బంగోరె చెప్పిన మాటలు చూడండి *"ఏయే వ్యాసాలు, పుస్తకాలు చదవాల్సిందీ, ఎవరెవరితో సంప్రదించి ఏయే ప్రదేశాల్లో సంచరించి విషయ సేకరణ జరపాల్సింది సూచిస్తూ రాళ్ళపల్లిని పురికొల్పిన తీరు యీ జాబుల్ని బట్టి ద్యోతకమవుతుంది."* [95] ఈ విధంగా రాళ్ళపల్లి వారు కట్టమంచివారితో అనేక విషయాల్ని నేర్చుకొన్నారని పై అంశాలను బట్టి తెలుస్తుంది.

## 4.10.3. రాళ్ళపల్లి సృజన సాహిత్యంపై కట్టమంచి వారి ప్రభావం

1914 సమయం నాటికే రెడ్డిగారిది పలు సాహిత్య రచనలు చేసిన అనుభవం. వాటిలో *'ముసలమ్మ మరణము'* (1900), *'కవిత్వ తత్త్వవిచారము'* (1914), *'భారత అర్థశాస్త్రము'* (1914) మొదలైన గ్రంథాలను శర్మగారు చదివారు. అంతే కాదు రెడ్డిగారి రచనల్లో కొన్నింటికి ప్రూపులు చూడటం శర్మగారికి పరిపాటైయింది. వారానికి నాలుగైదు దినాలు రెడ్డిగారితో సాహిత్య చర్చలు చేయడం వల్ల ఈయనపై రెడ్డిగారి ప్రభావం బాగా పడిందని తెలుస్తోంది. శర్మగారు రాసిన *'తారాదేవి'* (1911), *'మిరాబాయి'* (1913) ఖండకావ్యాలను రెడ్డిగారు చదివి మెచ్చుకొని అచ్చుకూడా వేయించి ప్రోత్సాహించిన సందర్భం విదితమే కదా! ఈ రెండు కావ్యాల్లో స్త్రీ చైతన్యం ప్రబలంగా కనబడుతుంది. ఈ దృక్పథం శర్మగారికి ఆనాటి సమకాలీన సమాజ పరిస్థితుల వల్లా రావటం ఒక ఎత్తైతే, రెడ్డిగారి ప్రభావం వల్లా రావడం రెండో కారణమనవచ్చు. *'ముసలమ్మ మరణము'* లో స్త్రీ ఆత్మార్పణం చేసుకొని సమాజానికి మేలు చేకూరుస్తుంది. ఆ కాలంలో వచ్చిన రాయప్రోలువారి *'లలిత'*, (1910) *'తృణకంకణము'*, గురజాడవారి *'కన్యక'* (1911), *'పూర్ణమ్మ'* మొదలైన కావ్యాల్లో స్త్రీలు ఆత్మార్పణం చేసుకొని సమాజాన్ని చైతన్య పరిచిన సందర్భాలు విరివిగా చోటు చేసుకొన్నాయి. బహుశా శర్మగారు ఈ ఆలోచనలతో కూడిని వస్తువుని కొంచెం మార్పు చేస్తే బాగుంటుందనీ, స్త్రీలలో ఉన్న ధైర్య సాహసాల్నీ బయటపెట్టే ప్రయత్నం చేసి ఉండవచ్చు. క్రమక్రమంగా శర్మగారు రెడ్డిగారు రాసిన

[94] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 172.

[95] వేమన – సి. ఆర్. రెడ్డి. పుట. 30.

రచనలను చదవటం వల్లా, వారి ప్రభావానికి లోనయ్యారన్న విషయాన్ని పై ఆధారాల వల్ల ఉహించవచ్చు.

## 4.10.4. రాళ్ళపల్లి విమర్శపై కట్టమంచి వారి ప్రభావం

కట్టమంచివారు ఆధునిక సాహిత్య విమర్శకు వేసిన మార్గం చాలా గొప్పది. పూర్వం జరిగిన శబ్దచర్చలను త్యజించి, భావార్థ చర్చలకు వీరి విమర్శ దారితీసింది. అనంతకృష్ణశర్మ కట్టమంచివారి సాహిత్య చర్చల ప్రభావంతో పాశ్చాత్య సాహిత్య విమర్శ రీతుల్నీ అవగాహన చేసుకొని, ఆయా సిద్ధాంతాల్ని మరింతగా విస్తృతం చేసి, తెలుగు విమర్శ రంగానికే నూతన మార్గం వేసిన సునిశితమతి. ఇటువంటి మార్గం వేసిన కట్టమంచివారి ప్రభావం శర్మగారిపై ఎలా ఉందన్న విషయాల్ని సోదాహరణంగా, తులనాత్మకంగా తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం.

కట్టమంచివారు '*కవిత్వతత్త్వ విచారము*' అనే ఉద్గ్రంథంలో సాహిత్య విమర్శ ప్రధానాంశాలను లోతుగా చర్చించారు. కానీ రాళ్ళపల్లివారు వివిధ వ్యాసాల్లో ఆయా విమర్శాంశాలను సుస్పష్టంగా వ్యక్తీకరించారు. ప్రత్యేకించి కట్టమంచివారు భావానికి ప్రాధాన్యమిచ్చిన వారైతే, రాళ్ళపల్లివారు భావంతోపాటు వస్తువు, రచనలకు కూడా ప్రాముఖ్యం కలిగించిన వారు. కట్టమంచివారు భావనా శక్తి గురించి చెప్పి ఒక ఆలోచన కలిగిస్తే దాని ఆధారంగా రాళ్ళపల్లివారు కొంత మెరుగులుదిద్ది సాహిత్య విమర్శకు పటిష్టతను చేకూర్చారు. దీని వల్ల తెలుగు సాహిత్య విమర్శలో నూతన ద్వారాలు తెరుచుకొన్నట్లైందనవచ్చు. రెడ్డిగారు 'వేలు చూపితే శర్మగారు హస్తాన్ని దిగమింగి' తెలుగు సాహిత్య విమర్శను మరింత విశాలం చేశారు.

## 4.10.5. భావనా శక్తి

ముందుగా కట్టమంచి, రాళ్ళపల్లిగార్ల భావాలను తులనాత్మకంగా పరిశీలన చేసి, ఆ తర్వాత భాష విషయానికి వెల్లడం జరుగుతుంది.

కట్టమంచివారు '*కవిత్వతత్త్వ విచారము*' లో భావనా శక్తి అంటే ఏమిటో చాలా స్పష్టంగా నిర్వచించారు. పైగా ఇతరేతర అంశాలపై కూడా పలు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అట్లే శర్మగారు కూడా తమ వ్యాసాల్లో రెడ్డిగారు చెప్పిన నిర్వచనాలనూ, అభిప్రాయాలనూ పోలిన మాటలు చెప్పినట్లు కింది విషయాల వల్ల తెలుస్తోంది.

విమర్శలో కట్టమంచివారి ప్రభావం రాళ్ళపల్లివారిపై ఉందన్న దానికి ఉదాహరణగా ఈ అభిప్రాయాన్ని చూడండి.''*నాయిక వివాహానంతరం ఆమె చెలికత్తెలైనా తమ చెలిని శోభనపుగది తలుపుల చెంత వదులు తారేమోకానీ, కవి మాత్రం అరక్షణం కూడా ఆమెను వదలడానికి అంగీకరించడని.*'' [96] కట్టమంచివారన్నారు. ఇలాంటి అభిప్రాయాన్నే శర్మగారు

[96] కవిత్వతత్త్వవిచారము. పుట. 41.

*‘రాయలనాటి రసికత’* వ్యాసంలో *‘‘స్త్రీలను వర్ణించు సన్నివేశమెట్టిదైనను మనకవుల దృష్టి పడకటింటిలో పెండ్లికొడుకు దృష్టియే కాని వేరుండదు.’’*[97] అంటారు.

వేమన కవిత్వం గురించి రెడ్డిగారు ‘కవిత్వతత్త్వవిచారము’ లో *‘‘గాయము కానుపింపకయు, రక్తము కాఱకయు నుండునట్లు శరీరమును ఛేదింపఁజాలినంత మిగుల వాఁడిగల కత్తి నొకదానిని పూర్వము విశ్వకర్మసన్నిభుఁడగు శిల్పి యొకండు నిర్మించెనని గాథయొకండు గలదు.’’*[98] అని పేర్కొంటే, శర్మగారు *‘‘గాయపు మందు కత్తికేపూసి కొట్టినట్లు తిట్టుచూనే నవ్వించు హాస్యకుశలత.’’*[99] అని ‘వేమన’ పరిశోధనలో ప్రస్తుతించారు.

మరో ఉదాహరణ కట్టమంచివారు *‘కవిత్వతత్త్వ విచారము’* లో విమర్శకు మార్గమైన పలు సూత్రాలను నిర్మిస్తూ భావన శక్తినిలా నిర్వచించారు. *‘‘భావనాశక్తి యనఁగా విషయముల మనస్సులోఁ బ్రతిబింబించునట్లు చేయు సామర్థ్యము. ఒక్క ప్రతిబింబించుట యననేల! ప్రత్యక్షముగ నవతారమెత్తునట్లు చేయుట.’’*[100] రాళ్ళపల్లివారు కూడా ఇదే భావనా శక్తిని ‘నాచన సోమనాథునికీయదగిన స్థానము’ అనే వ్యాసంలోనూ, ‘వేమన’ గ్రంథంలోనూ సందర్భాను సారంగా నిర్వచించే ప్రయత్నం చేశారు. వాటిని పరిశీలిద్దాం. *‘‘భావములు ప్రేమ, కోపము, అసహ్యము, అలక్ష్యము, దయ మొదలగు ప్రాణిధర్మములని వేరుగా చెప్పబనిలేదు.’’*[101] ‘వేమన’ గ్రంథంలో భావంపై నిర్వచనం ఇలా ఉంది. *‘‘భావమనఁగా పదార్థములమొక్క స్వరూపజ్ఞానముగాని, యిదిమంచిది చెడ్డది యను నభిప్రాయముగాని కాదు. మఱి విషయమును గూర్చి మనకుఁగలుగు ద్వేషము, కోపము, అసూయ, అసహ్యము, ప్రేమ, భక్తి మొదలగునవి భావములనఁడును.’’*[102] అన్నారు. విధాన్నాన్ని చూస్తే రెడ్డిగారి ప్రభావం శర్మగారిపై తప్పకుండా ఉందన్న నిర్ధారణకు రావచ్చు.

ఈ భావనా శక్తి నిర్వచనాల్లో కట్టమంచివారిది లక్ష్యంగా కనబడితే, రాళ్ళపల్లివారిది లక్షణంగా ఉంది. అంటే రెడ్డిగారి అభిప్రాయాలు నిర్వచనాలుగా ఉంటే, శర్మగారివి ఉదాహరణలుగా నిర్మితమైన విషయం స్పష్టమవుతుంది. వీరిద్దరి అభిప్రాయాలను పురస్కరించుకొని కోవెల సంపత్కుమారా చార్యులు తమ సిద్ధాంత గ్రంథంలో ఇలాగంటారు. *‘‘రామలింగారెడ్డి భావనా శక్తికి కల్గించిన ప్రాధాన్యము పరోక్షమైన ఊఁత. కళాంగముల వింగడింపుతో భావకళా నిరూపణముతో అనంతకృష్ణశర్మగారు కలిగించినది ప్రత్యక్షమైనది. పటిష్ఠమైనది.’’*[103] అని అభిప్రాయపడ్డారు.

---

97 సారస్వతాలోకము. పుట. 16.

98 కవిత్వతత్త్వవిచారము. పుట. 20 – 21.

99 వేమన. పుట. 3.

100 కవిత్వతత్త్వవిచారము. పుట. 19.

101 సారస్వతాలోకము. పుట. 42.

102 వేమన. పుట. 148.

103 ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ : సాంప్రదాయికరీతి. పుట. 102.

## 4.10.6. భాషాశైలి

కట్టమంచిగారి ప్రభావం శర్మగారిపై కేలవం భావంలోనేగాక భాషాశైలిలో కూడా కొనసాగిందని కింది పరిశీలన వల్ల తెలుసుకోవచ్చు. ప్రారంభంలో కట్టమంచివారి భాషా ప్రభావం శర్మగారిపై పడిందన్న అంశాన్ని ఇద్దరి పుస్తకాల్లోని కొన్ని మాటలను పరిశీలిస్తే కొంత వరకు బోధపడగలదు.

కట్టమంచివారు తమ 'కవిత్వతత్త్వ విచారము' (1914) గ్రంథ ప్రథమ భాగంలో 'ఆదికవుల గుణదోషములు' గురించి రాసిన వచనం ఈ విధంగా కొనసాగింది. ''*ఆకాలంబున నాంధ్రదేశమునఁ బ్రబలముగా నుండిన కవితారీతి ప్రబంధరచన. ప్రబంధకవులకే మధ్య కవులనియుఁ బేరు గలదు. ఆది కవులయు వీరియు జాడలు వేఱు. అనేక విషయముల విరుద్ధములును.*''[104]

రాళ్ళపల్లివారు 'కవిత' (1912) అనే వ్యాసం ప్రారంభంలో రాసిన వచనాన్ని గమనించండి. ''*లోకమున మనుజుందఱకును ముఖ్యముగ నానంద మిదునవి రెండు. ధనమును, విద్యయును. అందు ధనమస్థిరమగుటచే నందువలనఁ గలుగు నానందము చిరకాల మొకతీరుగ నుండదు.*''[105]

అట్లే శర్మగారు వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ వారు అచ్చువేసిన 'వేమన పద్యములు' (1917) గ్రంథానికి రాసిన పీఠికలోని రాసిన భాషాశైలిని చూడండి. ''*ఫలాపేక్ష లేక, యితరులను సంతోషపఱుచుటకుఁగాక, తాము చేయుపనికి భవిష్యత్కాలమునఁ గలుగఁగల విలువను గమనింపక, కేవలము జిహ్వాచాపల్యమును దీర్చుకొనుటకై స్వాభావికముగఁ గవన మల్లువారు ఏవాఙ్మయమునఁగాని యనేకు లుందరు.*''[106]

పై కట్టమంచి, రాళ్ళపల్లి గార్ల భాషాశైలి దాదాపు దగ్గరగా ఉన్న క్రమం కనబడుతుంది. ఇందులో అరసున్నలుండటం ఒకటైతే. విషయాన్ని సరళంగా రాయటం మరొకటి. అంటే వ్యావహారిక భాషకు ఇద్దరూ దూరంగా ఉన్నారన్న విషయం ఇక్కడ స్పష్టమవుతుంది.

ఉదాహరణకు కట్టమంచివారు 'వ్యాసమంజరి' (1947) 'సునందిని' వ్యాసం ప్రారంభ వాక్యాలు చూడండి. ''*ఈ గ్రంథమును రచించినవారు రాజమహేంద్రపుర వాస్తవ్యులగు ఆచంట సత్యవతీ దేవిగారు. ఈమె మంచివంశస్థురాలు. విద్యావతి. ప్రజ్ఞ, భావనాశక్తి, ఉపజ్ఞ, ఇత్యాది చిత్రకళాగుణములును మంచిశైలిని గలయదియని చదువరులే గ్రహింతురు. ముంజేతికంకణమున కద్దమేల? నాసాక్ష్యమిం దనవసరము.*''[107]

ఉదాహరణకు రాళ్ళపల్లివారు 1970లో బండారు తమ్మయ్య *'వేమన చరిత్రము'* నకు రాసిన ఉపోద్ఘాతంలో వచన విధానం ఇలా నడిచింది. ''*శివశ్రీ బండారు తమ్మయ్యగారి యీ*

---

[104] కవిత్వతత్త్వ విచారము. పుట. 17.

[105] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 27.

[106] రాళ్ళపల్లి పీఠికలు. పుట. 1.

[107] వ్యాస మంజరి. పుట. 200.

*'వేమన' ఆ విచిత్ర మహాపురుషుని గూర్చిన విమర్శ గ్రంథములలో ఇప్పటికి కొలికిపూస. వీరి శ్రద్ధా భక్తులు, రక్తిశక్తులును అసాధారణముగా కడచిన శతకార్ధమున కెక్కువగా ఆంధ్ర సాహిత్య ప్రపంచమున ప్రతిఫలించుచునే యున్నవి.''*[108]

పై రెండు వచనాలకు శైలిలో వ్యత్యాసం స్పష్టంగా కనబడుతుంది. రెడ్డిగారు ముందు ఏ భాషాశైలిలో రాశారో చివరి వరకూ దాన్నే కొనసాగించారు. ఉదాహరణకు రెడ్డిగారు ***'ఈమెను – ఈపె'*** అని రాయటం కనబడుతుంది. అయితే రాళ్ళపల్లివారి భాషలో ఇలాంటి పద ప్రయోగాలు దాదాపు లేవు. రెడ్డిగారు మాత్రం వ్యావహారిక భాషకు ఆమడదూరంలోనే ఉండిపోవడం గమనించదగిన విషయం.

1918లో కట్టమంచివారు మహారాజా కళాశాల ప్రిన్సిపాల్ నుండి మైసూరు విద్యాశాఖాధికారిగా పదోన్నతి పొందిన అనంతరం బెంగళూరులో మూడేళ్లపాటు వున్నారు.[109] అప్పుడు రాళ్ళపల్లివారికి కట్టమంచివాని కలుసుకోవడం తగ్గిపోయింది. అక్కడి నుండి రాళ్ళపల్లివారి భాషలోనూ, అభిప్రాయాల్లోనూ వైవిధ్యత పొడసూపినట్లు ఆయా వ్యాసాల వల్ల తేటతెల్లమవుతుంది. శర్మగారు పెద్దలు నేర్పిన విద్యలను ఆధారంగా చేసుకొని తన కంటూ ఒక ప్రత్యేకతను నిలబెట్టుకోవడంలో సిద్ధహస్తులని ముందే తెలుసుకొన్నాం కదా! ఇలా వీరు కట్టమంచి వారితో ఉన్నప్పుడు రాసిన భాషకూ, వారు దూరమైనప్పుడు రాసిన భాషకు వ్యత్యాసం కొట్టవచ్చినట్లు కనబడుతుంది. తర్వాత్తర్వాత శర్మగారు వ్యావహారిక భాషనూ, మాండలిక భాషను తమ రచనల్లో వాడటం యాదృచ్ఛికం అయింది.

రాళ్ళపల్లి, కట్టమంచి గురుశిష్యులు అయినప్పటికీ పరిశోధనల విషయంలో కొన్ని సందర్భాల్లో వాదవివాదాలు చేసుకొన్నారు. ముఖ్యంగా *'రంగనాథ రామాయణము'* కర్తృత్వ విషయంలో ఈ పరిస్థితి ఏర్పడింది. ఈ అంశాలు మొదటి అధ్యాయంలోనే చర్చించాం. ఇలా రెడ్డిగారు గురువైనప్పటికీ శర్మగారు నిజాలను నిగ్గుతేల్చుటలో ఖాతరు చేయలేదు. పరిశోధనల్లో మాత్రమే వీరికి అభిప్రాయ భేదాలు వచ్చాయి తప్ప, వ్యక్తిగతంగా వీరి బంధం చాలా దృఢమైనదని ఆయా వ్యాసాల వల్ల తెలుసుకోవచ్చు. శర్మగారు రెడ్డిగారిని ఎంతగానో ఆరాధించారు. దీనికి నిదర్శనం 1932లో *'శాలివాహన గాథాసప్తశతీసారము'* అనే గ్రంథాన్ని శర్మగారు తమ గురువుగారైన కట్టమంచివారికి అంకిత మిస్తూ ఐదు ఆటవెలది పద్యాలు రాశారు. వీటిలో శర్మగారికి రెడ్డిగారి పట్ల ఉన్న వినయవిధేయతలు ద్యోతకమవుతాయి. ఉదాహరణకు ఒక పద్యాన్ని చూడండి.

**ఆ. వె. *సరస మిత్రుఁడనఁగ, గురుఁడనఁ, జేపట్టి***
***పయికి నెత్తినట్టి ప్రభువనంగ,***

[108] రాళ్ళపల్లి పీఠికలు. పుట. 318.
[109] కట్టమంచి రామలింగారెడ్డి జీవితం – సాహిత్యం. పుట. 43.

***ముత్తెఱఁగుల మనసు ముడిగొన్న వారు నా***

***జీవితమున లేరు నీవుదక్క.*** (శా. గా. స. పుట: v)

ఇలా వీరి స్నేహ సౌభాగ్యాలు తెలుగు సాహిత్య విమర్శరంగానికే ఎంతో మేలు చేకూర్చాయి. "*వీరిద్దరు తెలుగు సాహిత్య విమర్శకులకు మార్గదర్శులేకాక, సాహితీ ఉపాసకుల హృదయాలకు ఉత్తేజం కలిగించిన ప్రముఖులు.*"[110] అని కు|రాజితేంద్ర బాబు ఒక సందర్భంలో ప్రశంసించారు.

ప్రత్యక్షంగా శర్మగారే రెడ్డిగారి గురించి *'నాగురువులు'*, *'కట్టమంచి వైలక్ష్యణ్యం'* అనే వ్యాసాల్లో చాలా విషయాలు వెల్లడించారు. వీటిని చదివితే కట్టమంచి వారి విద్వత్తు గురించి, వ్యక్తిత్వం గురించి స్పష్టంగా తెలుస్తుంది. కట్టమంచివారు కూడా శర్మగారి విద్వత్తును కృషి విశేషాలనూ ఆయా లేఖల్లో విశదపరిచారు. ఉదాహరణకు *'కవిత్వతత్త్వ విచారము'* ముందు మాటలో "*ఒంటిగా నే సమర్థించి యుండఁజాలను. నాకుం దోడుగా మైసూరు మహారాజుగారి కాలేజియందాంధ్రపండితులగు రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు నిలిచినందునఁ గార్యము నెఱవేఱఁగాని లేకున్న నైయుండుట సందిగ్ధము. ఇంత త్వరలో నైయుండుట యసంభము.*"[111] అని రాశారు. దీనివల్లనో, మరిదేనివల్లనో ఆంధ్రదేశంలో రెడ్డిగారి *'కవిత్వతత్త్వవిచారము'*, *'అర్థశాస్త్రము'* గ్రంథాలను రాళ్ళపల్లివారే రాసి కట్టమంచివారు పేరు పెట్టారన్న పుకార్లు పుట్టుకొచ్చాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని శర్మగారు *'వేమన'* పరిశోధన గ్రంథంలో "*కట్టమంచి రామలింగారెడ్డిగారు రచించిన 'కవిత్వతత్త్వ విచారము' నుగూడ నేను రచించినట్లు కొందరితలఁపు. ఆ యపకీర్తినిగాని, ఈకీర్తినిగాని నాకర్తృత లేదని మాత్రము ఈ సందర్భంమున ప్రకటింపవలసి యున్నది. అది భ్రాంతిమూలకము. ఒకరి కర్తృత్వము వేఱొకరికిఁ జెందించుట కదుంగడు నన్యాయ్యము గావున అది నాదికాదను సత్యము నిచ్చటఁ బ్రకటింపవలసి యున్నది.*"[112] అని చెప్పి వివరణిచ్చారు. ఇది శర్మగారి సహృదయతకు తార్కాణమని చెప్పవచ్చు.

పై విషయాలను తెలుసుకొన్న తర్వాత రెడ్డిగారి ప్రభావం శర్మగారిపై కేవలం భావాల్లోనే కాదు భాషలో కూడా కొంతవరకు కొనసాగిందన్న సంగతి స్పష్టమవుతుంది. ఏది ఏమైనప్పటికి కట్టమంచివారు శర్మగారి లాంటి ప్రతిభకల పరిశోధకులను ఎందరినో ప్రోత్సాహించిన వారుగా మన తెలుగు సాహిత్య సహృదయ లోకానికి తెలిసిందే. ఇట్లాంటి గురువుల వద్ద చదువుకొని శర్మగారు తమ కంటూ ఒక గుర్తింపును తెచ్చుకొన్న గొప్ప వ్యక్తిగా తెలుగు సాహిత్య చరిత్రలో నిలిచిపోయారు. కట్టమంచి రాళ్ళపల్లి ల స్నేహం తెలుగు సాహిత్యానికి పటిష్ఠమైన సేతుబంధంగా వెలుగొందింది. ఇలాంటి స్నేహ సౌభాగ్యాలు గొప్ప సాహిత్య నిర్మాణానికి ఎంతగానో తోడ్పడతాయని పై విషయాల వల్ల అర్థం చేసుకోవచ్చు.

---

[110] వేమన. పుట. V.

[111] కవిత్వతత్త్వవిచారము. పుట. 6.

[112] వేమన. పుట. 18.

## ఈ అధ్యాయంలో ముఖ్యాంశాలు

- రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు ప్రాచీన సంప్రదాయానికి చెందిన వారైనా ఆధునిక దృక్పథంతో విమర్శల్ని వెలయించారు.
- శర్మగారు భావము, వస్తువు, రచనల పునాదిపై తమ విమర్శ పద్ధతిని కొనసాగించారు.
- వీరు అభిరుచి విమర్శకులుగా పేర్కొనబడినా! ప్రాచీన కావ్య సంప్రదాయాలతో పాశ్చాత్య కావ్య సిద్ధాంతాల్ని మేళవించి రచనలు సాగించారు.
- ఈయన విమర్శ సంప్రదాయం మౌలికమైన కావ్య సూత్రాలతో కూడా తనదైన ముద్ర కలిగివుంది.
- శర్మగారి విమర్శలో హాస్య, వ్యంగ్యాలు కట్టమంచి వారి ప్రౌఢిమతో ప్రభావితమైనాయి. అంతేకాదు రాళ్ళపల్లివారు విమర్శలో సౌకుమార్యాన్ని తన వివేచన శక్తితో పెంపొందించుకున్నారు.
- అనంతకృష్ణశర్మగారి విమర్శ రచనలు పాత కొత్తల మేలు కలయికతో అలరారుతూ నేటి తరం వారిని కూడా ప్రభావితం చేసేలా ఉన్నాయి.
- శర్మగారి విమర్శలో తులనాత్మక పరిశీలన ఎంతో మౌలికంగా, సుప్రసన్నంగా ప్రదర్శితమవుతుంది.
- రాళ్ళపల్లివారు గ్రంథ పరిష్కరణలో మూలానికి భంగం కలిగించకుండా ఔచిత్య పూర్ణమైన పాఠాలను రూపొందించారు.

తర్వాత అధ్యాయంలో సంగీత కృషి విశేషాల్నీ పరిచయం చేసుకుందాం.



# ఐదవ అధ్యాయం

## సాహిత్య, సంగీత సమన్వయకర్తగా రాళ్ళపల్లి

## ఐదవ అధ్యాయం

# సాహిత్య, సంగీత సమన్వయకర్తగా రాళ్ళపల్లి

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి వ్యక్తిత్వం, రచనా నేపథ్యం, రచనల స్వరూప స్వభావాలు, వారి సాహిత్య విమర్శ మొదలైన అంశాలను గత అధ్యాయాల్లో తెలుసుకున్నాం. ఈ అధ్యాయంలో రాళ్ళపల్లి వారు సాహిత్యాన్ని, సంగీతాన్ని సమన్వయించిన విశిష్టతను విశ్లేషించుకుందా. రాళ్ళపల్లి వారు ఇటు సాహిత్యంలోనూ, అటు సంగీతంలోనూ తనదైన ముద్రను నిలుపుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి. ఈయన సాహిత్య వ్యాసం రాయడంలోనూ, ఒక అభిప్రాయం చెప్పడంలోనూ ప్రత్యేకత పొందినట్లే, ఒక కీర్తనను పరిష్కరించడంలోనూ అంతే ప్రతిపత్తిని చాటుకున్నారు. అనంతకృష్ణశర్మ చిన్నప్పటి నుండి నేర్చుకున్న సంగీతాన్ని జీవిత పర్యంతం పట్టు విడువకుండా కొనసాగించారు. కర్ణాటక సంగీత వాఙ్మయంలో గొప్ప విద్వాంసులైన గాన విశారద బిడారం కృష్ణప్పగారి శిష్యరికం చేశారు. సంగీతంలో లో లోతుల్ని బాగా అర్థం చేసుకున్నారు.

వీణ శేషణ్ణ. వీణ సుబ్బణ్ణ, మైసూరు వాసుదేవా చార్య లాంటి సంగీత విద్వాంసుల సాన్నిహిత్యం వలన శర్మగారు గొప్ప సంగీత సంస్కారాన్ని అలవరచుకున్నారు. అంతేకాదు హిందుస్తానీ, కర్ణాటక సంగీత తత్త్వాల సారాన్ని గ్రహించారు. సంగీత వాయిద్యాల మర్మాన్ని తెలుసుకున్నారు. రాగ, తాళాల మేళవింపులని శ్రద్ధగా ఆకళింపు చేసుకోగలిగారు. శర్మగారు తెలుగువారి సంగీత వైశిష్ట్యాన్ని తమ వ్యాసాల్లో ఆవిష్కరిపంజేశారు. ప్రధానంగా వాగ్గేయకారుల కృషి విశేషాలనూ, వారి ఔన్నత్యాన్ని ఇనుమడింపజేశారు. సంగీతంలో ఇంతటి విద్వత్తును సంపాదించిన రాళ్ళపల్లి వారిని సంగీత ఉద్దండులు ఆధునిక వాగ్గేయకారుడని అభివర్ణించారు. ఇలా ఎంతో ఉన్నతిని సాధించిన అనంతకృష్ణశర్మగారి సంగీత జీవితం ప్రతి ఒక్కరూ తెలుసుకోదగింది. పైగా ఆదర్శవంతమైంది కూడా. రాళ్ళపల్లివారు సంగీత పాఠాలను ఎలా సాధన చేశారు? ఆ సాధనతో ఎలా సిద్ధిని పొందారు? కాగా ఈ సాధన సిద్ధుల్లో సమకాలీన సమాజం ఏమి స్వీకరించాలనే అంశాలను ఈ అధ్యాయం ద్వారా పరిశీలించడం జరుగుతుంది. వెరసి రాళ్ళపల్లివారి స్వీయ రచనల్లోని సంగీత వైదుష్యాన్ని కూడా తెలుసు కొనబడుతుంది.

### 5. 0. రాళ్ళపల్లివారికి తల్లి నేర్పిన సంగీతం

రాళ్ళపల్లివారి సంగీత కృషి విశేషాల్ని తెలుసుకునే ముందు. ఓ సంగతిని తప్పక గుర్తుచేసుకోవాలి. శర్మగారు వేమనపై పరిశోధన చేసి, ఉపన్యసించిన సందర్భంగా చిలుకూరి నారాయణరావుగారు 'మాయని ముత్యములు' అనే పేరుతో ముప్పై రెండు ఆటవెలది పద్యాలు రాసి అప్పటి సమావేశంలో అందరికీ వినిపించారు. ఆ ముత్యాలు విన్న సహృదయులు

మంత్రముగ్ధులైనారు. ఇవన్నీ శర్మగారి సాహిత్య, సంగీత కృషిని అద్దం పట్టించేవిగా ఉండటం విశేషం. ఉదాహరణకు ఒక పద్యం చూడండి.

ఆ. ***అలఁతి యలఁతి తునియ లతికి కాహలఁ గూర్తు***
***రలఁతి యలఁతి పదము లతుకు దీవు***
***గానమందు గాన భావంబులను నిందు***
***కీర్తనీయ చరిత కృష్ణ శర్మ!*** 7 (రా. అ. కృ. శ. స. పుట: 2)

సంగీతసాహిత్య సవ్యసాచిగా శర్మగారు చేసిన కృషి ఎప్పటికీ కీర్తించదగిందీ, చిరస్మరణీయమైందిగా భావించవచ్చు.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారికి తండ్రి కర్నమదకల కృష్ణమాచార్యులు సాహిత్య గురువైనట్లే, తల్లి అలిమేలు మంగమ్మగారు సంగీత గురువులైనారు. ఈమాట శర్మగారే 1961లో *'నా గురువులు'* అనే వ్యాసంలో ఇలా గుర్తుచేసుకున్నారు.*''నా సంగీత శ్రద్ధకు ఉగ్గుపాలు పోసినది నా మాతృశ్రీ అలమేలు మంగమ్మగారు.''*[1] ఈమెకు పెద్దగా శాస్త్రీయ సంగీతం తెలియక పోయినా శ్రావ్యంగా పాడగల శక్తిని ఆ భగవంతుడు ప్రసాదించాడు. సంస్కృతం, కన్నడం, తమిళం, తెలుగులలో హరికథ, పెండ్లి, జోల,పూజా పాటలూ, భజన కీర్తనలూ, కథా గేయాలూ మొదలైన వాటన్నింటిని ఈమె అలవోకగా పాడేవారు. గ్రామంలో ఏ పండక్కో పబ్బానికో లేదా ఏదైనా భజన కార్యక్రమానికో ఆయా పాటలు పాడి ఊరి ప్రజల్లో భక్తి వైరాగ్యాన్ని నింపేవారు. అలిమేలు మంగమ్మ ఈ పాటల్ని అడపాదడపా తమ కూతురు యదుగిరమ్మకూ, కొడుకు అనంతకృష్ణశర్మకూ చెప్పించేవారు. వీరిద్దరూ ఐదారేండ్ల వయస్సులో తల్లి చెప్పే పాటల్నీ శ్రద్ధగా విని వాటిని రోమంథం చేసేవారు. అట్లా రాళ్ళపల్లివారు ఆయా పాటల్ని చాలా సులభంగా 'వేలు చూపితే హస్తం దిగిమింగినట్లు' తక్కువ సమయంలోనే అవపోసన పట్టిన ఏక సంతాగ్రహిగా పేరు పొందారు. దాంతో గ్రామంలో ఏ భజన కార్యక్రమం జరిగినా అనంతకృష్ణశర్మ తప్పక ఉండాల్సిన పరిస్థితి నెలకొనింది.

ఆనాడు శర్మగారి వయసులో ఉన్న వారికెవరికి ఈ గౌరవం దక్కలేదని చెప్పవచ్చు. రాళ్ళపల్లివారు అన్న గోపాల కృష్ణమాచార్యులు వీణ నేర్చుకోవడం చూసి దాన్నికూడా ఆకళింపు చేసుకొన్నాడు.*''సంగీతసాహిత్యములలో జన్మసిద్ధమైన అభిరుచి, ఉన్నత వాదశక్తి, రచనలలో తీక్షణధార, రసమాధుర్యము, రసిక జీవితము.''*[2] ఈ విధంగా రాళ్ళపల్లివారికి దైవానుగ్రహంగా అడిపాడే వయసులోనే ఈ సంగీత విద్య అబ్బిందన్న సంగతి స్పష్టమవుతుంది. నిజంగా ఆ జాతకం చెప్పినట్టుగానే వీరి జీవితం కూడా గడిచిందనవచ్చు. శర్మగారు కష్టాలకు కృంగిపోకుండా జీవితాన్ని ఎంతో సంయమనంతో గడిపినారు. భగవంతుణ్ణి సేవిస్తూ తాను

---

[1] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 200.

[2] అనంతరాగం. పుట. 121.

చేయాల్సిన కార్యక్రమాలను త్రికరణ శుద్ధిగా నిర్వర్తించారు. అది సంగీతమైనా సాహిత్యమైనా ఒకే తీరుగా భావించి కృషి చేసిన మహానుభావులు అనంతకృష్ణులు.

## 5. 1. రాళ్ళపల్లివారు గురువులతో నేర్చుకున్న సంగీతం

అనంతకృష్ణశర్మగారు 1906లో చదువుకోసం మైసూరుకు వెళ్ళిన సంగతి మొదటి అధ్యాయంలోనే పేర్కొనబడింది. ఆనాడు గాన విశారద బిడారం కృష్ణప్ప, వైణిక శిఖామణి శేషణ్ణ, కె. వాసుదేవాచార్యులు మొదలైనవారు కర్ణాటక సంగీతంలో పేరు మోసిన విద్వాంసులుగా ఉండేవారు. ఇలాంటి ఉద్దండుల సంగీత కచ్చేరీలు మైసూరులో నిత్యం జరుగుతుండేవి. అందరూ వెళ్ళినట్లు శర్మగారు కూడా సాధారణ శ్రోతగా ఆ సభలకు హాజరయ్యేవారు. వీరందరి ప్రతిభను కళ్ళారా చూసి ఆశ్చర్య చకితులై పులకించి పొయ్యేవారు. అలా శర్మగారు పాటలు పాడటం, పద్యాలు చదవటం, సంగీత వాద్యాలు వాయించడంపై మక్కువ పెంచుకొన్నారు. తదనంతరం తాను కూడా అందులో తలమునకలయ్యారు. క్రీ. శ. 1909లో ముమ్మడి శ్రీ కృష్ణదేవ రాజవడయరుగారి వర్ధంతి సందర్భంగా బిడారం కృష్ణప్ప చేసిన కచ్చేరి పట్ల శర్మగారు ఆకర్షితులైనారు. దాంతో కృష్ణప్పగారి వద్ద సంగీత విద్య నేర్చుకోవాలని అనుకొన్నారు. అలాగే ఓ నాలుగేళ్లపాటు వారితో పాడటాన్ని అభ్యసించారు. కానీ పెరిగే మొక్కకి పిచ్చి మొక్కలడ్డన్నట్లు. ఈ కార్యం అంత సజావుగా ముందుకు సాగలేదు. ఎందుకంటే అప్పటికే రాళ్ళపల్లివారు మైసూరు మహారాజా కాలేజిలో తెలుగు పండితులుగా ఉద్యోగం చేయడం ఒకటి. కాగా శర్మగారికి 1918లో 'ఇన్ ఫ్లుయెంజా'అనే విషజ్వరం సోకడం మరొకటి. వెరసి వైద్యుల సలహామేరకు పాడటానికి దూరమైయ్యారు. అయినా శర్మగారు నిరాశ చెందకుండా పాడటానికి బదులుగా పిటీలు వాయించడం పై దృష్టి కేంద్రీకరించారు.

రాళ్ళపల్లివారు పాడే భాగ్యాన్ని కోల్పోయినప్పుడు పడిన బాధ అంతా ఇంతా కాదని చెప్పాలి. ఆ సన్నివేశాన్ని . వి. సీతారామయ్యగారు '*కాలేజి దినగళు*' అనే గ్రంథంలో పేర్కొన్నారని ప్రముఖ విమర్శకులు ఘట్టమరాజు తమ వ్యాసంలో ఆ కరుణ రసార్ద్రత చెడకుండా యథాతథంగా పొందుపరచారు. దానిలో భావమిలా ''వి.సీతారామయ్య ఏదో సందర్భంలో శర్మగారి ఇంటికి వెళ్ళారట. అప్పుడు ఆయన పాట పాడుతున్నట్లు వినిపించిందట. ఆ దృశ్యాన్ని కిటికీలో చూశారట. శర్మగారు పాడటానికి గొంతు సహకరించని సమయం దాపురించిన స్థితిని గమనించి విస్తుపోవటం ఈయన వంతైందట. ఆ సమయంలో రాళ్ళపల్లివారు 'తెర తీయగ రాదా నాలోని – మత్సరమను తెర' అనే త్యాగయ్యగారి కీర్తన పాడుతున్నారట. ఈ కీర్తన మానవ జీవితంలో ఇమిడి ఉన్న బాధల్ని అద్దంలో చూపించే ప్రత్యేకత కలదని వి. సీతారామయ్య ఆ దృశ్యాన్ని మాటల ద్వారా కళ్ళకు కట్టించారు.''[3] ఈ విధంగా రాళ్ళపల్లివారికి పాడటం అలవడక పోవడంతో చాలా నిర్వేదానికి గురైయ్యారన్నది దీనివల్ల స్పష్టమౌతుంది.

---

[3] అనంతరాగం. పుట. 130– 131.

రాళ్ళపల్లివారు తమ గురువుల వద్ద ఎన్నో విలువల్ని నేర్చుకొన్న వినయశీలి. తాను గ్రహించిన వాటిలో కొన్ని ప్రధాన అంశాలను ఈయన *'నా గురువులు'* అనే వ్యాసంలో పొందుపరిచారు. ఈ సందర్భంగా వాటిని పరిశీలిస్తే సమంజసంగా ఉంటుంది. *'సంగీతకళకు బుద్ధి శ్రమకంటే దేహశ్రమ యెంతో యెక్కువ కావలయును. అర్థము చేసికొనుట ఒకయెత్తు; ఆచరించి చూపుట ఇంకొక ఎత్తు. రెంటిలో ఏది శిథిలమైన సంగీతము నిరుపయోగ కళ యగును. తక్కిన కళలకును దీనికిని గల భేదమది.''*[4] చాలా స్పష్టంగా చెప్పిన ఈ మాటలు నేటి తరం వాళ్ళకు ఎంతో ఉపయోగకరమని చెప్పనక్కరలేదు.

మరో సందర్భంలో బిడారం కృష్ణప్పగారి సంగీత తత్త్వాన్ని శర్మగారిలా తెలిపారు.*''శుద్ధమైన స్పష్టమైన యుచ్చారణ; పాడినపాటల జ్ఞానము; చేసికొన్న నియమమును ఎప్పుడుగాని ఏమాత్రమును తప్పక నిర్వహించుట; అచంచలమైన శ్రీరామభక్తి: తననోట భగవంతుడే గానరూపముతో వెలువడుచున్నాడను నమ్మిక ఇవి ఆయనగారి గానవ్యక్తికి రూపు గొలిపినవి. సంగీతమొక వినోదకరమైన అలంకారవస్తువని ఆయన యెప్పుడును భావింపలేదు.''*[5] దీనివల్ల సంగీత విద్య ఎంతటి పవిత్రమైందో అర్థమవుతుంది.

బిడారం వారు ఎప్పుడూ నా లాగే పాడాలని చెప్పిన వారు కాదు. ఆయా రాగ, తాళాలకు అనుగుణంగా స్పష్టంగా పాడితే సరిపోతుందన్న సహృదయులని శర్మగారు వ్యాసంలో పేర్కొన్నారు. అవి *''నావలె పాడవలెననే ప్రయత్నం చేయవద్దు, కీర్తనలు, లక్షణాలు, సామాన్య శారీరక నియమాలూ నాకూ తెలిసినవి చెప్తాను. కాని మీ శారీరధర్మం, శరీరధర్మం, మనోధర్మం వేరు. భగవంతుడు నా కంటే మంచి కల్పనాశక్తినీ, బుద్ధిశక్తినీ మీకనుగ్రహించి ఉండవచ్చు. దానిచేత మీరు నా కంటే చక్కగా రక్తిగా పాడనూవచ్చు. నన్ను చూచి వాతలు వేసుకొని మీ స్వరూపం, శక్తీ చెడగొట్టుకోవద్దండి. మీ ఆత్మతృప్తిగా పాడుకొండి. ఇది కృష్ణప్పగారు శిష్యులకు చేసిన ఉపదేశమని.''*[6] రాళ్ళపల్లివారు గుర్తుచేశారు. ఈ విధంగా శర్మగారు ఎంతో వినయంగా గురువుల్లోని సంస్కారాన్ని అర్థం చేసుకొని ముందుకు నడిచారు.

## 5.2. రాళ్ళపల్లి వారు ఇతరులకు నేర్పిన సంగీతం

రాళ్ళపల్లివారు తనకు తెలిసిన విద్యను ఇతరులకు ధారపోసే హృదయం కలవారని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. శర్మగారు సుదీర్ఘకాలం పాటు మనసు పెట్టి నేర్చుకున్న ఈ సంగీతాన్ని తనతోనే అంతం కానివ్వలేదు. సమయం దొరినప్పుడల్లా తమ కూతుళ్ళకూ, మనుమలకూ, మనుమరాళ్ళకు బోధించేవారు. శర్మగారి పెద్దకూతురు ప్రభావతి సుపుత్రి మాధవి వారి తాతగారితో నేర్చుకొన్న సంగీతాన్ని రాళ్ళపల్లివారి 125వ జయంతి సందర్భంగా శ్రోతల కళ్ళు చెమర్చేలా స్మరించుకొన్నారు. *''మా తాతగారు మా కుటుంబంలో దాదాపు స్త్రీలందరకీ సంగీతం నేర్పించారు. నేను ఆయన దగ్గర వీణను నేర్చుకొనేటప్పుడు కొన్ని*

---

[4] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 203.

[5] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 203.

[6] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట: 204.

*సందర్భాల్లో సయమం తెలిసేది కాదు. అలా ఏదో గీతమో, కృతో పూర్తి అయ్యేంతవరకు వదిలేవారు కాదు. ఓ సందర్భంలో నా చేతిలో రక్తం కూడా వచ్చింది. మా తాతగారితో దాదాపు పదేళ్ళపాటు వీణను నేర్చుకొన్నాను. అది ఎప్పటికీ నేను మరువలేదు. ఎందుకంటే ఆయన నేర్పించే పద్ధతి అలా ఉంటుంది.''*[7] అని అనేక విషయాల్ని జ్ఞాపకం చేసుకున్నారు. దీన్నిబట్టి రాళ్ళపల్లివారికి సంగీతంలో గల అంకిత భావమేమిటో తెలుస్తుంది.

రాళ్ళపల్లివారు పవిత్రమైన ఈ సంగీతాన్ని కేవలం కుటుంబ సభ్యులకు మాత్రమే కాకుండా బయటి వారికి కూడా బోధించారు. అలా శర్మగారితో సంగీతాన్ని అభ్యసించిన అదృష్టవంతులు టి. తాతాచార్యులు, పద్మచరణ్(ఏ.వి. కృష్ణమాచార్యులు) ముఖ్యులు. వీరికి శర్మగారు సంగీతాన్ని ఎలా నేర్పే వారో తెలుసుకోవాలంటే వారు రాసిన వ్యాసాలు చదవాల్సిందే. ఉదాహరణకు పద్మచరణ్ రాసిన *'దేశికోత్తములు'* అనే వ్యాసం కొన్ని విషయాల్ని స్మరించుకున్నారు. వాటిలో ఉదాహరణకు *''చిన్నతనంలోనే నేను వారింట్లో చేరి అయ్యగారి వద్ద సంగీత పాఠాలే కాక జీవిత పాఠాలు కూడా నేర్చుకొన్నా''* నని.[8] అన్నారు. అంతేకాదు రాళ్ళపల్లివారు సంగీత పాఠాలు నేర్పడంలో చాలా శ్రద్ధ చూపేవారు. శిష్యులను సైతం శ్రద్ధగా ఉండాలని చెప్పేవారు. ఈ రోజు చెప్పిన పాఠాలు రేపు అప్పగించాలనేవారు. తప్పులు చెప్తే 'రామ రామా' అని చెవులు మూసుకొనేవారు. శృతి బాగా వచ్చేవరకు వినిపించేవారు. ఏదైనా సంగీత పాఠం నేర్పించేటప్పుడు కఠోరంగా ఉండేవారు. సరైన మార్గంలో పడేంతవరకూ వదిలేవారు కాదని పద్మచరణ్ వివరించారు. రాళ్ళపల్లివారు సంగీతాన్ని ఏనాడు వృత్తిగా, ఉపాధిగా పెట్టుకోలేదు. కాగా శిష్యులకు ఉచితంగానే పాఠాలు బోధించేవారని పద్మచరణ్ రాళ్ళపల్లివారి సంగీత అధ్యాపకత్వాన్ని ఆవిష్కరించారు.

రాళ్ళపల్లివారు సంగీతంలో అపారమైన పాండిత్యం గడించిన విద్వాంసులు. ఆనాడు కర్ణాటక ప్రాంతంలో సంగీత గురువుల్లో శర్మగారు కూడా ప్రముఖులైనారు. ఏమైనా సందేహాలు వస్తే ఈయన్ని అడిగి నివృత్తి చేసుకోవడం నిరంతరం జరిగే ప్రక్రియ. కాగా సంగీత విభాగంలో పరిశోధనలు చేసేవారికి ఆయా సందర్భాల్లో సలహాలూ, సూచనలు కూడా ఇచ్చేవారు. పద్మామూర్తి సంగీత పరిశోధన చేసే సందర్భంలో రాళ్ళపల్లివారిని సంప్రదించి అనేక విషయాలను స్వయంగా తెలుసుకొన్నారు. ఆమె శర్మగారిలోని ప్రజ్ఞాపాటవాల్నీ, పరిశోధనకు చేసిన సహాయాన్ని *'A DISCIPLE'S TRIBUTE'* (గురువుకు శిష్యురాలి నివాళి) అనే వ్యాసంలో చాలా చక్కగా తెలియజేశారు. ఇందులో పద్మామూర్తి చెప్పిన మాటలు *''As a scholar he encouraged creativity in youngsters, offered information, insights and guidance to anyone who approached him without any reservation.''*[9] (ఎవరైనా పరిశోధకులు శర్మగారి దగ్గరికి వస్తే వారిని ప్రోత్సహించేవారు.

[7] త్యాగరాయ గానసభ – హైదరాబాదు (జనవరి 23– 2018)

[8] అనంతరాగం. పుట. 163.

[9] రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ శతజయంతి సంచిక. పుట. 141.

ఏ రిజర్వేషన్ అక్కర లేకుండా వారికి కావాల్సిన సమాచారాన్ని అందించేవారు. అంతేకాదు దానిపై మంచి అవగాహన కలిగించి, మార్గదర్శకత్వాన్ని చూపేవారు.) అని శర్మగారి వ్యక్తిత్వాన్ని బహిర్గత పరిచారు.

సంగీతంలో ఇంత పరిజ్ఞానం పొందిన రాళ్ళపల్లివారిని పండిత లోకం వేనోళ్ళ పొగిడింది. శ్రీపాద పినాక పాణి శర్మగారి సంగీత పాండిత్యం చాలా గొప్పదనీ, వారు శిష్యులకు నేర్పే పద్ధతి అనుసరణీయమైందీ, ఆదర్శమైందన్న మాటలిలా...''*సంగీతం పాడగలిగితే శిష్యులను తయారు చేసే గుణముండదు. ఈ రెండూ కలిగితే తమకృతి పాఠాంతరమును స్వరపరచి ఇవ్వగల సామర్థ్యం లోపిస్తుంది. ఇవన్నీ కలిగి సాహిత్య సేవతో బాటు, సంగీతలోకానికి ఎన్నదగిన సేవ చేసిన సుప్రసిద్ధ వ్యక్తి శర్మగారు.''*[10] ఇలా వీరొక్కరేకాదు . సంధ్యావందనం శ్రీనివాసరావు, నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు, . జి. బాలకృష్ణప్రసాద్, కె. వాణి మొదలైన వారు శర్మగారి సంగీత కృషినీ, ప్రతిభా పాటవాల్నీ ఆయా వ్యాసాల్లో పేర్కొన్నారు.

అనంతకృష్ణశర్మగారు సంగీతాన్ని అభ్యసించడానికి ప్రధానకారణమైన విషయాల్ని టి. టి. శ్రీనివాసన్ మాటల్లో ''*శర్మగారు ఆత్మ సంతోషానికే సంగీతం నేర్చుకొన్నారు. ఈ మాట ఆయన ఎన్నో చోట్ల ప్రస్తావించారు. పేరు ప్రతిష్ఠలుగాని, ధనార్జనం చేయడంగాని ఆయనకు ఉండేది కాదు. ఆయన స్వాను భవానికి, ఆత్మోన్నతికీ సంగీత సాధన చేశారు. తమ జీవితంలో అంతిమ రోజుల్లో కూడా ఆయన నిత్యము వయోలిన్ సాధన చేసేవాడు. ఆయన ఎక్కువగా కచేరీలు చెయ్యలేదు. తమకు ఇష్టమైనప్పుడు, ఇష్టమైన చోట పాడేవారు. ఫిడేలు వాయించేవారు అని తెలుస్తుంది.''*[11]

ఈ విధంగా ప్రాంతాలకతీతంగా అనేక మంది ప్రముఖులు శర్మగారితో సంగీత గ్రంథాలకు పీఠికలు రాయించుకున్నారు. ఎన్నో సభలకు, సమావేశాలకు ఆహ్వానించి, వారు చెప్పే విషయాలను శ్రద్ధగా వినేవారు. శర్మగారు సంగీతంపై రాసిన అనేక వ్యాసాలు ఆరోజుల్లో *భారతి, ఆంధ్రపత్రిక,* వాణి మొదలైన ప్రసిద్ధ పత్రికల్లో ప్రచురితమయ్యేవి. ఈ వ్యాసాలను చదివి ప్రత్యక్షంగా ఎన్నో అంశాలను నేటికీ తెలుసుకుంటున్నవారు లేకపోలేదు. కళలను కాపాడుకోవడానికి శర్మగారు పడిన తపన ఆ వ్యాసాల్లో ప్రస్ఫుటంగా వ్యక్తమవుతోంది.

## 5.3. రాళ్ళపల్లి వారి సంగీత రచనలు – పరిశీలన

రాళ్ళపల్లివారు సాహిత్య రచనలతో పాటు సంగీత రచనలు కూడా చేశారు. అవి గీతాలు, స్వరపల్లవులు, వర్ణాలు, కృతులు, తిల్లానాలు, మంగళాలని ప్రధానంగా చెప్పుకోవచ్చు. వీటన్నింటిని జాగ్రత్తగా అధ్యయనం చేస్తే శర్మగారి పాండిత్యం తెలుస్తుంది. నిరంతరం భగవంతుణ్ణి ఆరాధించే తత్త్వం శర్మగారిది. ప్రతి పాటలో ఏ దేవతనో లేదా దేవుణ్ణో

---

[10] అనంతరాగం. పుట. 160.

[11] రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ (కన్నడ డీ.లిట్ సిద్ధాంత గ్రంథం) పుట. 137.

స్తుతించారు. పొట్లూరి అనురాధ రాళ్ళపల్లివారి సంగీత వైదుష్యంపై ఎం. ఫిల్., పరిశోధన చేస్తూ *''సంగీత త్రిమూర్తులచే మహోత్కృష్టంగా తీర్చిదిద్దబడిన కృతి యొక్క ఆకృతి వీరి రచనలలో కూడా ఆవిష్కరింపబడింది.''*[12] అని శర్మగారి కృషిని ప్రశంసించారు. దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు వీరు ఎంతటి విద్వాంసులనేది. శర్మగారు రాసిన సంగీత స్వీయ రచనల్నీ చదివితే అది మరింత స్పష్టంగా అవగతమవుతుంది. ముఖ్యంగా సంగీతాన్ని అభ్యసించే వారికి ఈ రచనలు మార్గదర్శకాలుగా ఉపయోగపడతాయని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. శర్మగారు ఆయా గీతాలు, వర్ణాలు మొదలైన వాటిని రాసేటప్పుడు చూపిన విజ్ఞత సహృదయులను ఎంతగానో ఆలోచింపజేస్తుంది.

రచనను ఎన్నుకొనే స్థాయి నుండి అది ముగించేవరకు ఈయన అనుసరించే విధానాలు ఆదర్శనీయాలు. పైగా అవి ఎంతో ఆస్వాదనీయంగానూ ఉండటం విశేషం. పల్లవి, అనుపల్లవి, చరణం, చిట్టిస్వరం, రాగతాళాలు లాంటి ప్రత్యేకాంశాల్ని సాహిత్యానికి తగ్గట్టుగా ఎంపిక చేసుకొని, ఎక్కడా విసుగు పుట్టించక నిర్మించడం వీరి సూక్ష్మదృష్టికి నిదర్శనంగా భాసిల్లుతుంది. రాళ్ళపల్లివారు గీతాలు రెండు, స్వర పల్లవులు రెండు, వర్ణాలు రెండు, కృతులు పదమూడు, తిల్లాన ఒకటి, మంగళాలు ఎనిమిది రచించారు. మొత్తం ఇరవై ఎనిమిది లభ్యమవుతున్నాయి. ఇంకా ఉండవచ్చు. వీటన్నిటిని రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ పెద్ద కుమారుడు ఫణిశాయి *'పరమానంద గానసుధా'* (2002) గ్రంథం ద్వారా వెలుగులోకి తీసుకొచ్చారు. ఇది కన్నడ భాషలో రాయబడింది. దీనిలో అనంతకృష్ణశర్మగారి సంగీత రచనలు, మంగళాలను కలిపి ఓ సంకలనంగా రూపొందించారు. కాగా గీతాలు, స్వరపల్లవులు, వర్ణాలు, తిల్లానాలు, మంగళాలు అనేవాటి లక్షణాలేమిటో ప్రత్యేకించి పేర్కొనలేదు. పైగా సంగీత విద్యార్థుల కోసం కాబట్టి అవి ఇవ్వకున్నా సరిపోతుంది. కాని సాహిత్య విద్యార్థులు వీటిని అర్థం చేసుకోవాలంటే వాటి నియమ నిబంధనాలను తెలుసుకోవడం అవసరం.

## 5.3.1. గీతము

సాధారణంగా గీతం అంటే *''పాట, పలుకబడినది'*[13] అని నిఘంటు అర్థాలు ఉన్నాయి. సంగీత రచనలో ఇది ప్రముఖమైనది. సంగీత విద్యార్థులకు పునాది రాయి వంటిది. *''గీతములోని సంగీతము చాల ఇంపుగాను సాధారణముగాను, సులభముగాను ఉండును. రాగ భావ ముట్టిపడుచుండును. లయ ఒకేరీతినడుచును.''*[14]మొదటి నుండి చివరి వరకు నిలుపకుండా పాడటం దీని పద్ధతి. గీతాల్లో పల్లవి, అనుపల్లవిలు ఉండకూదని చెప్తారు. కానీ కొందరు వీటిని రాస్తూ ఉండటం జరుగుతూ వస్తున్నది. గీతాలు రెండు రకాలు.1. సామాన్య గీతాలు, 2. లక్షణ గీతాలు. సామాన్య గీతంలో ఏదో ఒక దైవాన్ని ప్రార్థించడం

---

[12] రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి సంగీత వైదుష్యం – ఒక పరిశీలన. పుట: 15.

[13] శబ్దరత్నాకరము. పుట. 280.

[14] గానకళాబోధిని. పుట. 57.

ఉంటుంది. లక్షణ గీతాలు మాత్రం వాటి రాగ లక్షణాలు తెలుపునంతే. రాళ్ళపల్లివారివి సామాన్య గీతాల కిందికే వస్తాయన్నది గమనార్హం. ఈ గీతాల్ని రచించిన వారిలో పైడాల గురుమూర్తి, గోవింద దీక్షితులు, పురందర దాసులు ప్రభృతుల్ని ప్రత్యేకించి పేర్కొనవచ్చు. గీతాలను రాయటాన్ని ఒకప్పుడు గొప్ప విద్వత్తుగా భావించేవారు. ఇలాంటి కష్టమైన దాన్ని రాళ్ళపల్లివారు రచించడం వీరి ప్రతిభకు, ఆసక్తికి నిదర్శనమనవచ్చు. శర్మగారు రాసిన గీతాలు రెండు. ఈ గీతాల్లో పల్లవి, చరణాల భావాలను, రాగతాళాల విశిష్టతను మాత్రమే తెలుపడం జరుగుతుంది. మిగత స్వరప్రస్తారాన్ని *'పరమానంద గానసుధ'* అనే గ్రంథంలో చూడవచ్చు. అయితే పల్లవి, చరణాలకు అర్థాలు ఆయా సంగీత గ్రంథాల్లో ఉంటాయి. కానీ రాళ్ళపల్లివారి దృష్టిలో ఎలా నిర్వచించబడ్డాయో చూడండి. *''గాయకప్రపంచమందు మొత్తపు పాటయందలి కేంద్రమగు భాగమును వెలువరించు భాగమునకు 'పల్లవి' అని నేటి వ్యవహారము.''*[15] అలాగే శర్మగారి ఆలోచన ప్రకారం చరణం అంటే *'నుడుగు.'*[16] ఇక గీతాల్లోకి వెళ్ళి వాటిలోని భావాల్నీ, రాగతాళాల ప్రత్యేకాంశాల్ని పరిశీలిద్దాం.

**గీతం** : వరద కరిగిరీశ
**రాగం** : సావేరి
**తాళం** : రూపక
**పల్లవి** : వరద కరిగిరీశ సకలవాంఛితఫలదాయక వనజనయన పాహిమాం॥
**చరణం** : కరుణారస వరుణాలయ కామజనక కనకవసన॥
పరమానందమయలీల భాగదాయమూల వనజనయన పాహిమాం॥

(*'పరమానంద గానసుధా'* పుట: 19)

**రాగ తాళాల విశేషాలు :** ఈ గీతాన్ని సావేరి రాగంలో రాశారు. ఇది కరుణ రసంతో కూడి ఉంటుంది. కర్ణాటక సంగీతంలో ఈ రాగానికి చెప్పుకోదగ్గ స్థానం ఉంది. దీనిని శర్మగారు ఎంతో మధురంగా తీర్చిదిద్దడంలో సిద్ధహస్తులయ్యారు. ముఖ్యంగా శర్మగారు పల్లవిలో **'పదమగరిస'** అనే ప్రయోగంతో విష్ణుమూర్తి సముద్రమంతటి కరుణ గలవాడని స్తుతించడం ప్రత్యేకతను చాటుకొన్నది. **'దనిదమగరిసధ'** అనే ప్రయోగంతో విష్ణుమూర్తి లీలా మాధుర్యాన్ని ప్రస్ఫుటింపజేశారు.

**గీతం** : మదనజనక మధుసూదన
**రాగం** : నాటకురంజి
**తాళం** : ధృవ
**పల్లవి** : మదనజనక మధుసూదన మానితగుణ మాయాతీత మాధవ మామవ భూ॥

---

[15] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట.138.
[16] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట.139.

**చరణం** : యదుకులధన యమునాతీర కదంబవన శాలీ
ముదితహృదయ చరాచర మూలకంద పరమానంద
మాధవ మామవ భూ॥ (*'పరమానంద గానసుధా'* పుట: 20)

**రాగ తాళాల విశేషాలు :** నాటకురంజి అనేది **మనిదని పదనిస, స దప గమపగరిస, సనిదమ గమపగరిస** – మొదలైన ప్రయోగాలతో కూడిన ఒక రక్తి రాగం. రంజింపచేయడం దీని ప్రత్యేకత. నిడివి చిన్నదైనా గొప్ప భావాలు, మంచి ప్రయోగాలతో అందరిని అలరించే రాగమిది. ఇందులో **'సనిదమ'** కు మధుసూదన అనే ప్రయోగాన్ని, **'గమరిగరిస'** అనే దానికి పరమానందాన్ని చేకూర్చారు. అలాగే **'మగమ నిదని'** మాధవ (విష్ణుమూర్తి) **'గమనిద'** తీర (ఒడ్డు) **'రిగమగరిగస'** చరా చరా (సంచరించే) **'సనిదమగరిగ'** మూలకంద (మూలమైన వాడా) అనే అందమైన ప్రయోగాలు వేశారు.

### 5.3.2. స్వర పల్లవి

గీతాలను నేర్చుకొన్న తర్వాత స్వరాలను నేర్చుకోవటం ఆచారం. ఇది కొంచెం వర్ణమును పోలి ఉంటుంది. పల్లవి, అనుపల్లవి కొన్ని చరణాలు కలిగి ఉంటాయి. నడక సాధారణంగా మధ్యంగా ఉంటుంది. చరణాలు వేరు వేరు ధాతువుల్లో ఉంటాయి. కొన్ని జతి స్వరాల్లో అనుపల్లవి కనబడదు. ఈ రకమైన రచనకు సాహిత్యం లేదు. ఇది నృత్యానికి ఉపకరిస్తుంది. ఇలాంటి జతి స్వరాల్ని రచించినవారిలో పొన్నయ్యపిళ్ళై, వడివేలుపిళ్ళై, శివానందపిళ్ళై మున్నగువారు ప్రసిద్ధులు.[17] ఇలాంటి స్వర పల్లవుల్ని శర్మగారు రెండు రాశారు. ఉదాహరణకు

**స్వరపల్లవి-1**

**రాగం** : కానడ

**తాళం** : ఆది

**పల్లవి** : ॥గా,, ,, మారీసా నీసా । దా,,,,నీ, ।,, సారీపా ॥ (గా)
॥గా,,,, మారీసా నీసా । దా,,,,నిని । సారీససరిప॥ (గా)
॥గా,,,, మారీసా నీసా । దా,,,,నిస । రిగమపామదప॥ (గా)

**చరణం** : ॥గా మ ధా ధ, గ మ ధా ధ మ ని ధ ద ని । ప మ ధ ప గా గా । మ రీ రీ స రి ప ।॥ (గా) ఇందులో చరణాలు ఐదు వరకు ఉన్నాయి.

[17] గానకళాబోధిని. పుట: 58.

**స్వరపల్లవి -2**

**రాగం** : శంకరాభరణం

**తాళం** : ఆది

**చరణం** : ॥సా, ధ ని పా మ ప గా మ ప దా ని । సా,,,, ని రి । ని సా ద ని ప ద ని॥

(సా) ఇందులో చరణాలు ఏడు వరకు ఉన్నాయి. (*'పరమానంద గానసుధా'* పుట: 22–23)

**రాగ తాళ విశేషాలు** : సంగీత విద్యార్థులు ఈ సరళి, దాటు, జంట, అలంకారాల్ని స్వరపల్లవుల్ని తర్వాత తెలుసుకొంటారు. ఇది వర్ణం నేర్చుకొనేవారికి చాలా ఉపయోగకరం. దీనికి శర్మగారు ఔచిత్య శోభితంగా 'కానడ' రాగాన్ని ఎంచుకొన్నారు. ఇందులో వక్రమైన రక్తి మిళితమై ఉంటుంది. కొంచెం కష్టంతో కూడి ఉంటుంది. ఇది గాంధార గమకంతో పాడుకొనేవారికి అనుకూలం. ప్రత్యేకించి ఈ రాగంలో గాంధారం దీర్ఘంగా, గమకంతో కూడి విద్యార్థికి గమక అనుభవాన్ని కలిగిస్తుంది. ఈ రచన సాధారణంగా గమకంతో కూడి గాంధారంతో ప్రారంభమవుతుంది. ఇది రాగభావావిష్కరణకు మిక్కిలి తోడ్పడుతుంది. ఈ సుదీర్ఘమైన రాగాన్ని రాళ్ళపల్లివారు ఎంతో ప్రతిభావంతంగా పూర్తిచేయడం చెప్పుకోదగ్గ విశేషం.

## 5.3.3. వర్ణము

వర్ణం అభ్యాస గాన రచనలలో చాలా ప్రధానమైంది. దీన్ని నేర్చుకోవటం, పాడటం చాలా కష్టం. కాగా దీన్ని బాగా నేర్చుకుంటే ఇతర రచనలు అతి సులభంగా వస్తాయని పెద్దల మాట. వాద్యం, గాత్రం చేసే వాళ్ళు వాళ్ళు బాగా నిమగ్నమై వీటిని అవలీలగా పాడుతారు. రాగాలు పరిపూర్ణంగా తెలిస్తే తప్ప వర్ణం రాయటం సాధ్యం కాదు. ఇందులో రెండు భాగాలు ఉంటాయి. 1. పూర్వభాగం, 2. ఉత్తర భాగం. పల్లవి, అనుపల్లవి, ముక్తయి స్వరాలు పూర్వభాగంలో, చరణం, చరణ స్వరాలు ఉత్తర భాగంలో ఉండును. పల్లవి, అనుపల్లవికి సాహిత్యం ఉంటుంది. ముక్తాయ స్వరంలో సాహిత్యం ఉండదు. ఉదాహరణకు కింది వర్ణాలను చూడండి.

- **మమ మనసి సదా విహార**

**రాగం** : హమీర కల్యాణి

**తాళం** : ఆది

**పల్లవి** : ॥మమ మనసి సదా విహార మధుమథన మహాదేవి భార్గవి జగదీశ్వరి॥
మందహాస సుందరతర బహువిధ మాయామయ రూపిణి జనమోహిని॥

అమిత భువనగణ కందుకలీలా వినోద పరవశనిజశీలే॥

అమృతజలధిబాలే పరమానందాధి కారిణి విచిత్ర విహారిణి॥

**చరణం** : జగదంబా జయదీనజనాభయదాయిని నిరపాయిని॥ .
(*'పరమానంద గానసుధా'* పుట: 23) (దుర్గాదేవీ. ప్రజలకు భయాలను పోగొట్టీ, అభయమిచ్చే దేవతా.)

తర్వాత పల్లవి, చిట్టిస్వర – జతులకు స్వర ప్రస్తారం ఉంటుంది.

**రాగ తాళ విశేషాలు** : కర్ణాటక సంగీతంలో 'వర్ణము' చాల ఉన్నతమైనది. దీనితో ప్రదర్శనలు కూడా చేసే వెసులుబాటు ఉంది. దీన్ని శర్మగారు హమీరు కల్యాణి అనే అరుదైన రాగంలో పొందుపరచడం చెప్పుకోదగింది. వర్ణంలో స్వర పోకడలు ప్రత్యేకమైనవి. ఇది నిడివి తక్కువ గలిగిన ఒక దేశ్యరాగం. దీనిని రాళ్ళపల్లివారు చిట్టిస్వరంలో తీసుకురావడం మరో విశేషం. ప్రధానంగా ఈ వర్ణాల వల్ల స్వరాలను స్పష్టంగా పలకడానికి ఓ మంచి మార్గం ఏర్పడుతుంది. ఆలాపన అనేది మరింత తేలికవుతుంది. ఈ హమీరు కల్యాణి రాగాన్ని శర్మగారు సంగీత విద్యార్థులకు ఉపయోగకరమైనదిగా మలచినారు.

- **గానరసమూర్తి**

**రాగం** : కేదారగౌళ
**తాళం** : ఆది
**పల్లవి** : ॥ గానరసమూర్తి త్యాగరాజు పాటలు తేనెలతేటలు॥
**అనుపల్లవి** : ॥ ఆ నలువకైన తరమా వాని సొగసులెల్ల పొగడగ॥
**చరణం** : ॥ మనసులోని నాస్తిక భావములను మరపించు భక్తికి రాచబాటలు
చనవున మూఢులకైన సంగీత సారములు తెలుపు ముద్దు మాటలు
చనుబాలిరుగడల దొలకనాడెడు సరస్వతికి ఆటల పూదోటలు
మునులును గానని శ్రీరాముని మనకనుల గట్టించు గారడియాటలు॥.

(*'పరమానంద గానసుధా'* పుట: 24–26)

**రాగ తాళ విశేషాలు** : ఇది శాస్త్రీయ విలువలతో కూడిన ప్రాచీన రాగం. దీర్ఘమైన కంపితాలతో రక్తిని కలిగిస్తుంది. మంద్ర పంచమం నుంచి తార పంచమం వరకూ విస్తరించి ఉన్న విళంబకాలంతో ఈ కేదారగౌళ రాగం నిర్మితమవుతుంది. ఈ కృతి రచనా విషయంలో రాళ్ళపల్లివారి ప్రతిభ ఎంతో విశిష్టతను చాటుతున్నది.

## 5.3.4. కృతులు

సంగీత కృతికి, సాహిత్య కృతికి తేడాలుంటాయి. ఈ కృతిలో రాగం, తాళాలు రచయితని బంధింపవు. తన ఇష్ట ప్రకారం ఏర్పాటు చేసుకొనే వెసులుబాటు ఉంటుంది. అలాగే తాళం, నడకలు కూడా రచయిత ఇష్టమే. ఒక రకంగా ఇది విశాలమైనది, విపులమైనది, స్వచ్ఛమైనది అనవచ్చు. ఏ భావాలు అయితే తన మనసులో ప్రవర్తిల్లుతాయో వాటిని ఇందులో పొదిగింపవచ్చు. రెండు శతాబ్దాల నుండి వీటిని విరివిగా రాస్తున్నారు. కృతిలో పల్లవి, అనుపల్లవి, చరణాలు ఉంటాయి. చరణం దాదాపు అనుపల్లవిని పోలి ఉంటుంది. సాహిత్యం

దైవస్తుతి, రాజస్తుతి లేదా వేదాంత విషయాలుగాని ఉంటాయి. రాగ, భావాలు సంపుష్టిగా వెదజల్లును. నాలుగైదు చరణాలు వరకు ఉండవచ్చు. రచయిత చాకచక్యాన్ని ప్రదర్శించవచ్చు. ఇందులో సంగతులు ప్రధాన ఆకర్షణగా ఉంటాయి. వీటిని తొలుత త్యాగరాజులవారే సృష్టించారు.[18] రాళ్ళపల్లివారికి త్యాగరాజుగారంటే చాలా అభిమానమని ఆయా వ్యాసాల ద్వారా వెల్లడైందన్నది విదితమే. అలా వీరు కూడా కృతులు రాయడానికి ఉపక్రమించి ఉండవచ్చు. వీరు రాసిన కృతులు దాదాపు పదమూడు. అందులో కొన్నిటిని పరిశీలిద్దాం.

- **మోహనసురుచిరరూప**

**రాగం** : శుద్ధసీమంతిని

**తాళం** : ఆది

**పల్లవి** : ॥ మోహనసురుచిరరూప వి – మోచిత భవభయతాప ॥

**అనుపల్లవి** : ॥ శ్రీహరే వికలచిత్తదురాప – శీలధీర చేతోమణిదీప ॥

**చరణం** : ॥ శ్రీనాథ సతతపర – మానందమయ మయి విహర సదయ ।
భానుచంద్ర బింబాంతవిహార – భావదూర మాయామయచార ॥
మోహనసురుచిర...... (*'పరమానంద గానసుధా'* పుట: 29)

**రాగ, తాళ విశేషాలు** : శుద్ధ సీమంతిని ఒక అరుదైన రాగం. ఈ రాగంలో 'జానకీరమణ' అనే త్యాగయ్యగారి కృతి మాత్రమే కనిపిస్తున్నది. ఇలాంటి రాగాన్ని తీసుకొని చిట్టి స్వరంతో నిర్మించడం శర్మగారి ఆలోచనకు నిదర్శనమనవచ్చు. త్యాగరాజుగారి కృతి ఎలా అయితే ప్రవర్ధిల్లిందో అలాగే శర్మగారుకూడా దీన్ని తీర్చిదిద్దారు. అనుపల్లవి, చరణాలతో ఇది అద్భుతంగా ఆవిష్కృతమైంది.

- **లోకాధినాథ సకలశోకమోచన**

**రాగం** : దేవమనోహరి

**తాగం** : రూపక

**పల్లవి** : ॥ లోకాధినాథ సకలశోక మోచన –త్రి ॥

**అ. నుపల్లవి** : ॥ ఏకాంత పావన జగదేక మోహన – శ్రీ ॥

**చరణం** : ॥ సకలాగమసార సుగుణసార్వభౌమ సర్వోత్తమ ॥
సుకవీంద్ర వచనాలంకార ॥
సుకుమార శుభఫలదాయక నిన్నే శరణంటిని ॥
అకళంకకృపాకర పరమానంద ధీర – శ్రీ ॥
(*'పరమానంద గానసుధా'* పుట: 27)

**రాగ, తాళ విశేషాలు** : దేవ మనోహరి రాగమనేది అంత విస్తారమైనది కానప్పటికీ ఆలాపనకు అనుకూలమైనది. ఇందులో రక్తి ప్రధానం. ''ఎవరికై అవతారమెత్తితివో'' అనే

---

[18] గానకళాబోధిని. పుట. 60.

త్యాగరాజు కృతి ఈరాగంలో ఇమిడింది. దీనిలో కొన్నిరచనలు మాత్రమే ఉన్నాయి. శర్మగారు ఈ రాగాన్ని ఎంచుకొని చిట్టిస్వరంతో రూపొందించడం చెప్పుకోదగింది.

- **కలశజలధిజాతాం**

**రాగం :** కళ్యాణి

**తాళం :** ఆది

**పల్లవి :** ॥కలశజలధిజాతాం జంగమకల్పలతాం విభావయ మానస ॥

**అ. పల్లవి:** ॥ లలిత దరహాసకుసుమవికాసాం లావణ్యమయ కిసలవిలాసాం ॥

**చరణం:** ॥ ఆనంద పరివాహ మయ కరుణాపాంగ సుందర వదనాం పర
మాను కూల్యరస పరవశ హరి హృదయావాల కోమలసదనాం ।
గానామృతరసాస్వాదినీం గాధేతరలీలావినోదినీం ।
నానా విజ్ఞానదాయినీం నాగాధిపభోగశాయినీం
అనాథపాయినీం అనపాయినీం ॥ కలశజలధిజాతాం...... .

(*'పరమానంద గానసుధా'* పుట:37)

**రాగ, తాళ విశేషాలు :** కళ్యాణిరాగం ఎంతో ప్రసిద్ధమైనది. నేటికి అమిత ఆదరణ పొందుతున్న రాగం. అనేక కోణాల్లో ఎంతో సౌందర్యంగా ప్రవర్ధిల్లే గుణం కలిగిన రాగమిది. వాగ్గేయకారులు ఎక్కువగా ఈ రాగంలోనే రచనలు కొనసాగించారు. ఇది సంపూర్ణమైన రాగం. ఎప్పుడు పాడినా విసుగనిపించదు. ఆరోహణలోనూ, అవరోహణలోనూ ఏడు స్వరాలూ ఉపయోగించే రాగం. దీన్ని 'తీవ్ర' రాగం అనికూడా అంటారు. ఇటువంటి రాగాన్ని రాళ్ళపల్లివారు ఎంతో వినసొంపుగా తీర్చిదిద్దారు.

- **హరిణి హరిరమణి**

**రాగం :** కాంభోజి

**తాళం :** మిశ్ర చాపు (ఎత్తుగడ అనాగత)

**పల్లవి :** ॥హరిణీ హరిరమణీ మమ దురితతతి మనిశముపశమయతు ॥

**అ. పల్లవి:** ॥ కరుణారసధునీ కమలా కామజననీ ॥

**చరణం:** ॥ ఆనందరసమయా పరమానందరసమయీ పరమానందరసమయీ
అఖిలాండేశ్వరీ వీణామృదగదనా వికచాంభోజసదనా ॥ హరణీ ॥ .

(*'పరమానంద గానసుధా'* పుట: 39)

**రాగ, తాళ విశేషాలు :** కాంభోజి రాగాన్ని వాగ్గేయకారులు విరివిగా ఉపయోగించారు. ఇది ఒక నిరంకుశమైన రాగం. భిన్న కోణాల్లో దీన్ని ప్రవర్ధింపజేయవచ్చు. సంపూర్ణ స్వరూపాన్ని అందించలేం. త్యాగయ్య ఈ రాగంలో'చెడే బుద్ధి' అనే కృతిని చేశారు. కర్ణాటక సంగీతంలో ముఖ్యమైన రాగాల్లో ఇది కూడా ఒకటి. దీన్ని రాళ్ళపల్లివారు ఎంతో చాకచక్యంగా స్వరపరిచారు. తాళం కంటే ముందు కృతిని మొదలుపెట్టడం దీని ప్రత్యేకత.

- **మహాదేవి దరహాసకలయా**

**రాగం :** హిందోళ

**తాళం :** ఆది

**పల్లవి :** ॥ మహాదేవి దరహాసకలయా మమ మానసకుహరం ప్రదీపయ ॥

**అ. పల్లవి:** ॥ అహంకారాంధకారదూషితం అమేయ లోభ పంకరూషితం ॥

**చరణం :** అరుణాధరకిసలయపుట సునిచిత కిరణరదనకలికోజ్వలే
సురభిళధవళాంబుజపీఠదళమిళితరుచిదుకూలాంచలే ॥
కరుణామృతధారావిరజీకృత శరణాగతజనహృదయతలే
పరమానంద సుధాంబుధి వీచీప్లవనహంసి ప్రణతార్తిహర వరద
మహాదేవి.... ('*పరమానంద గానసుధా*' పుట: 43)

**రాగ, తాళ విశేషాలు** : మోహనం, అభేరి, సింధుభైరవి, కల్యాణి రాగాల్లాగే, హిందోళం రాగం కూడా చాలా ప్రసిద్ధమైన రాగం. పంచస్వర రాగాలలో హిందోళం చాలా రక్తి కట్టించే రాగం. అనేక రాగాల్ని మిళిత చేసుకొని రూపొందిన పురాత రాగమిది. సప్తస్వరాలలోని "ప", "రి" స్వరాలు హిందోళంలో లేవు!ఇంతకుముందు చెప్పుకున్న మోహనం రాగంలాగే, హిందోళం కూడా ఐదు స్వరాలున్న జనరంజకమైన ప్రసిద్ధ రాగం. నిర్దిష్టమైన రూపంకలిగిన హిందోళం రాగం కరుణ, భక్తి, శృంగార రసాలను పోషింపగలదు. రాగభావ ప్రాధాన్యం, గమక ప్రాముఖ్యం కలిగిన రాగం. మధ్యమ, విలంబ కాల, లయలతో మిళితమైన రాగం. సర్వాంగ సుందరంగా హిందోళ రాగాన్ని రూపొందిస్తోంది. రాళ్ళపల్లివారి సంగీత వైదుష్యానికి ఈ రాగం ఓ మచ్చుతునకలాంటిదని చెప్పవచ్చు.

- **చింతయ శ్రీరామచంద్రం**

**రాగం :** ముఖారి

**తాళం :** మిశ్రచాపు

**పల్లవి :** ॥ చింతయ శ్రీ రామచంద్రం చేతోనీరదనీల మతంద్రం ॥

**అ. పల్లవి:** ॥సంతతం సకలామయాహారి నిరంతరాయకరుణామృతసాంద్రం అనంత కల్యాణ గుణనిధిం చిరంతనఫణితి పరమావధిం॥

**చరణం:**

1. ॥ స్వాధీన చేతనాచేతనం సాకేతనికేతనం సదాతనం ॥
2. ॥ శ్రీ జనకనృపవరతనయాప్రణయామృత రసభావితం
   సీమాతీత మహామహిమోపేతం॥
3. ॥ గాధేయ మహాసవనాంతరాయకారి మారీచాది

పలాశనికరనిరాసనం కరరుచిరం జితశరాసనం॥

4. ॥మానవతనుబహుమాననిదాన మహనీయ మధురావతార
సంపాదితా భువనమంగళం దరహసితాధరదళం॥

5. ॥పావనతపోధన శబరిং పరీక్షిత వనఫలమూల
రసలోల మృదుహృదయం సదాసదయం॥

6. ॥ధరణితనయాకరసరసిజ పరిచయోపచిత పరిమళ
సరస వనమాలాకర్బుర భుజాంతరం నిరంతరం॥

7. ॥నీరజబంధుకులాభరణం నిఖిలకారణం నుతజన
దురితవిదారిణం నరలీలానారాయణం ప్రణవమయ
పాదసుధాలహరీ పరవశ పరమానంద భరితాంతః కరుణం
భవసాగరతరణం శరణం॥ (*‘పరమానంద గానసుధా’*పుట: 49)

**రాగ, తాళ విశేషాలు :** రాళ్ళపల్లివారికి ఇష్టమైన రాగమిది. దీనిలో కరుణ రసం అత్యద్భుతంగా ఉంటుంది. భక్తికి కూడా ఈ రాగం అనుకూలమైంది. శర్మగారు సాధారణంగా పల్లవి, అనుపల్లవి, చరణాల్ని ఎంతో హృదయగతంగా ఇమిడ్చారు. ఏడు చరణాలు రామాయణ గాథను స్పష్టంగా గుర్తుచేస్తున్నాయి. రాళ్ళపల్లివారు రాసిన ఈ పద్ధతి త్యాగరాజస్వామివారి పంచరత్న కీర్తన ‘జగదానందకారకా’ నాట రాగాన్ని పోలి ఉంది. ఈ గీతం ఇంత పెద్దది అయినా ఎక్కడా పునరుక్తులు లేకపోవడం విశేషం. రాళ్ళపల్లివారి నిశిత దృష్టికి ఇది తార్కాణం.

- **నా చేతకాని పని**

**రాగం :** యమునాకల్యాణి

**తాళం :** ఖండచాపు

**పల్లవి :** ॥ నాచేతగాని పని నాతలకు మోపితివి
నీ చిత్తమెట్టిదో వాచామగోచరము ॥

**అ. పల్లవి:** ॥ నీచేయి పట్టుకోని నేనడచుచుండగా
పాచిపట్టినచోట పదమనుచు త్రోసెదవు ॥

**చరణం:** ॥ ఏచోట గుంటయో ఏచక్కి మిట్టయో
ఏది వెలుగో చీకటెందుగలదో
చూచి యెరుగని నన్ను శోధింపనేలరా
ఆశాంతపాప పరమానందమయ మూర్తి॥

(*‘పరమానంద గానసుధా’*పుట: 52)

**రాగ, తాళ విశేషాలు :** హిందుస్థానీ సంగీత ప్రభావంతో మన సంగీతాన్ని ప్రేరేపించిన రాగంగా ఈ యమునా కల్యాణికి పేరుంది. ఇది విలంబ ప్రధాన రాగం. దీక్షితులవారి

పంచలింగస్థలకృతి 'జంబూపతే' మరియు త్యాగరాజుల వారి 'హరిదాసులు వెడలిరి' అనే పాటలు ఈ రాగంలో ఉన్నాయి. ఒక రకంగా ఈ రాగంలో పాటలు రాయడం కష్టమైనది. అయినా రాళ్ళపల్లివారు చాలా గొప్పగా రచించారు. గాంధార, మధ్యమాలు దీనికి అనుకూలమైనవి.

ఈ విధంగా రాళ్ళపల్లివారు రాసిన ప్రతి గీతంలోనూ ఆధ్యాత్మికత, భక్తి అడుగడుగునా చోటు చేసుకోవడం సర్వసాధారణం. వీటిని నిశితంగా పరిశీలించి అధ్యయనం చేస్తే ఎన్నో విషయాలు బోధపడతాయి. ముఖ్యంగా భావి సంగీత విద్యార్థులకు ఇవి మార్గదర్శంగా నిలుస్తాయి.

## 5.3.5. తిల్లానాలు

కర్ణాటక సంగీతంలో ప్రసిద్ధి పొందిన ఈ తిల్లానాలను రాళ్ళపల్లివారు కూడా ఆకళింపు చేసుకోగలిగారు. సాధారణంగా తిల్లానాల్ని నృత్య నాటికలలో ఎక్కువగా ఉపయోగిస్తారు. హిందుస్థాని సంగీతంలో కూడా ఈ తిల్లానాలకు ఎంతో ప్రసిద్ధి ఉంది. మామూలుగా తిల్లానా అంటే అర్థం ఈ విధంగా ఉంది.*''పల్లవి, అనుపల్లవి, చరణములను అంగములనుకలిగి మధ్యమ కాలములో పాడదగిన రచన ఇది. దీని సాహిత్యము జతులతోను స్వరములతోను విరాజిల్లును. ఇది చురుకైన రచన. ఉద్రేకింపజేయు రచన.''*[19] ఇది పండిత పామర జనరంజకంగా ఉంటుంది. వీటిని సాధారణంగా కచేరి చివరి అంశంగా మంగళానికి ముందు దీన్ని ఆలపిస్తారు. ప్రాచీన కాలంలో తిల్లానాలు ఉన్నట్లు కనబడవు. త్రిమూర్తులు వీటిని రాయలేదుగానీ, మార్గ నిర్దేశకులు మాత్రం వారే. తర్వాత్తర్వాత వాగ్గేయ కారులు వీటిని రాయడం మొదలు పెట్టారు. స్వాతి తిరునాళ్, మైసూరు సదాశివరావు, రామనాడు శ్రీనివాసయ్యంగార్, పల్లవి శేషయ్య, పొన్నయ్యపిళ్ళై మొదలైన వారు తిల్లాన రచయితలుగా పేర్గాంచారు. వీరిలాగానే రాళ్ళపల్లివారు కూడా తిల్లానాలు రాయడానికి ప్రయత్నించారు.*''తిల్లాన సంప్రదాయం అనుసరించి మునుపటి వాగ్గేయకారుల పంథాలోనే చక్కని స్వర, జతుల మేళవింపుగా రచింపబడినవి.''*[20] అని పొట్లూరి అనురాధ తన ఎం. ఫిల్., పరిశోధనలో అభిప్రాయపడ్డారు.

- **ధీంతధీం తఝణుతకిట (తిల్లానా)**

**రాగం :** బేగడ

**తాళం :** ఆది

**పల్లవి :** ॥ ధీంతధీం తఝణుతకిట తధిన ధీం తిలానంత తోంనంత ॥

**అ. పల్లవి:** ॥ తాహత ఝుఝుంతరి తాకు ధణాంతక తదితోం తళాంగు తతదిన తోంత ॥

---

[19] గానకళాబోధిని. పుట. 65.

[20] రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి సంగీత వైదుష్యం – ఒక పరిశీలన. పుట. 73.

ణేకు తఝంత తకుంత ధీంతరిత దిల్లల్లానా దిరికిటతోం దిల్లానా
దిరికిటతోం ధిన్నాధిరి కిటతోంత ॥

**చరణం:** నవనీత చపలహృదయ నతసదయ నటరాజశిఖామణి నాదలోల
భువనాధార భవభయదూర పరమానందాకార జయ జయ
ధీంతధణాంతకిట తధ్రజ మికిటతోం సగరిమ గపమధపమపగరి
గమపదాప రీగ మపధ పస పరి తానాదిరిధిత్తోం నాదిరిదిత్తోం
తధింగిణతోం ॥ ధీంతధీం..... (*'పరమానంద గానసుధా'* పుట: 54)

**రాగతాళ విశేషాలు:** బేగడ రాగంలో 'ధీం తధీం' అనే ఆదితాళ తిల్లాన ఒక చక్కని రచన. ఇందులో వినసొంపైన రాగాలు, అర్థవంతమైన భావాలు, సందర్భోచిత ప్రయోగాలతో ఇమిడి ఉన్న రచన ఇది. బేగడ రాగంలో భావాలుగానీ, ప్రయోగాలుగానీ ఔచిత్యంతో కుదిరాయి. రాళ్ళపల్లివారు ఇందులో ***పదనీ, దప, గారి, దప అనే*** మొదలైన ప్రయోగాలు చొప్పించి రచనకు అందాన్ని చేకూర్చారు.

### 5.3.6. మంగళాలు

సాధారణంగా సంగీతంలో మంగళం అంటే ఏదైన కార్యం ముగింపులో చేసే పూజా కార్యక్రమం లాంటిదని చెప్పవచ్చు. దీనికి నిఘంటు అర్థం *''శుభము కోసము హారతి ఇచ్చునపుడు పాడు పాటలు.''*[21] ఇవి భారతీయ సంస్కృతిలోనే చాలా గొప్పవి. వీటిని అనాదిగా ఆనవాయితిగా చేస్తూ వస్తున్నారు. ప్రధానంగా ఆధ్యాత్మికత చోటు చేసుకొని ఉండటం వీటి ప్రత్యేకత. మంగళాలన్నీ దాదాపు దేవుళ్ళనీ, దేవతల్నీ స్తుతిస్తున్నట్లుంటాయి. వీటిని వాగ్గేయకారులు విరివిగా రచించారు. ఆ ధోరణితోనే రాళ్ళపల్లివారు కొన్ని మంగళాల్నీ వెలువరించారు. వీరి మంగళాలు మోహన, ఫరజు, జంఝూటి, కాపి, కమాన్, నాటకురంజి, మోహనకల్యాణి, సురటి అనే రాగాలతో కూడినవి. వీటిలో శర్మగారు పలువురు దేవతా మూర్తులను మనసారా స్తుతించినట్లు తెలుస్తుంది. సుమారుగా ఈయన పది మంగళాలు రాసినట్లు తెలుస్తోంది. వాటిలో ఉదాహరణకు రెండిటిని తెలుసుకొందాం.

- **మంగళ మంబుజరిపు సహజె**

**రాగం :** మోహన

**తాళం :** అది

**పల్లవి :** ॥ మంగళ మంబుజరిపు సహజే తవ రంగదభంగ కృపాంబుధే ॥

**అనుపల్లవి:** ॥ మంగళకర సువిహంగమ పుంగవ తుంగతురంగమసంగతే ॥

**చరణాలు:** ॥ చందర మౌళ్యరవింద నందన పురందరముఖ బుధవంద్యే ।
కుందముకుళరుచి నిందన సుందర బంధురసురదన బృందే ॥
॥బింబఫలాధరి బంభరవరనికురుంబ కుంతలికరంబే ।

[21] శ్రీహరి నిఘంటువు తెలుగు – తెలుగు. పుట. 510. (ఆంధ్రభారతి నిఘంటువు –అంతర్జాలం)

అంబశంబకర కుంభికుంభవరదంబ విడంబికుచే॥
॥సంతతమశ్మ పురాంతరనివసదనంత విచింతతశీలే।
కంతుజననికృతమంతువిబుధరిపుసంతతికృంతనలోలే॥
('పరమానంద గానసుధా' పుట: 56)

- **నీలామానవత మనోహర**

**రాగం** : కాంభోజి

**తాళం** : రూపక

**పల్లవి** : ॥ నీలామానవత మనోహర లీల మంగళ – జలజ నయన ॥

**అ. పల్లవి** : ॥ నీలనీరదభాసుర వల్లభ – బాలారతిలోల సుతశీల మునిజాల ప్రియ ॥

**చరణాలు** : ॥నందనందన సుందరీజన సందనగంధ గజేంద్ర గమన మందరోద్ధర మోనిమనోహర మిందాళిమిళింద గోవింద సురబృందార్చిత ॥

॥ చిత్ర విచిత్ర పవిత్ర పదాత్రివహ ధరిత్రీశ శాత్రవ సంచయ శోషణ మోహన గాత్ర నరమిత్రాంబుజ మిత్రాబ్జ పవిత్రేక్షణ॥

॥పాపహరాపరరూపశిలాపుర గోపాలకృష్ణ వినుత ద్రౌపదీపటదాయక మంజుక లాపానత తాపాపహ భూపాలక దీపాచ్యుత॥

ఈ విధంగా రాళ్ళపల్లివారి మిగతా మంగళాలు కూడా ఎంతో ఆధ్యాత్మికతని నింపుకొని అలరారుతుండటం విశేషం.

## 5.4. అన్నమయ్య సంకీర్తనలు – రాళ్ళపల్లివారి పరిష్కరణ

తెలుగు సాహిత్యంలో తాళ్ళపాక అన్నమాచార్యులది అద్వితీయమైన స్థానం. వీరు రాసిన సంకీర్తనలు ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన విషయం తెలిసిందే. సుమారు ముప్పై రెండువేల సంకీర్తనల్లో కేవలం పన్నెండు వేలు మాత్రమే దొరకడం దురదృష్టకరం. మిగతా సంకీర్తనల్లో కూడా అన్నమయ్య భక్తి తత్పరత ఎంతో వైభవంగా ఉండి ఉంటుంది. దానికోసం ఇంకా లోతైన గాలింపు జరగాల్సి ఉంది. ఏదైతేనేమి అన్నమాచార్యులు రచించిన ఈ సంకీర్తనల్నీ పండితులు గుర్తించి వాటి మాధుర్యాన్ని తెలిపేందుకు విశేషమైన కృషిచేశారు. కీ. శే. విజయరాఘవాచార్యులు, వేటూరి ప్రభాకరశాస్త్రి, ఉదయగిరి శ్రీనివాసాచార్యులు, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, పి. టి. జగన్నాథరావు, గౌరిపెద్ది రామసుబ్బశర్మ మొదలైనవారు అన్నమాచార్యుల సంకీర్తనలు వెలుగు చూడడానికి కారణమయ్యారు. వేటూరి ప్రభాకరశాస్త్రి అన్నమయ్య సంకీర్తనలపై కొన్ని వ్యాసాలు రాసి వాటి వైశిష్ట్యాన్ని విశదపరిచారు. రాళ్ళపల్లివారు ఆ కీర్తనలలో కొన్నింటికి విశిష్ట స్వరకల్పనతో గానామృతాన్ని కలిగించేందుకు

ప్రయత్నించారు. ఇలా అనేకమంది పండితులు, పరిశోధకులు అన్నమాచార్యుల కీర్తనలపై విస్తృత స్థాయిలో అధ్యయనం చేస్తుండటం నేటికి కొనసాగుతోందన్నది విదితమే కదా!

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ 1912లో మైసూరు మహారాజా కళాశాలలో తెలుగు పండితులుగా ఉద్యోగం చేస్తున్న రోజులవి. అప్పటికే ఈయన ఓవైపు సాహిత్యం, మరో వైపు సంగీతాన్ని నిష్ఠగా అధ్యయనం చేసుకుంటూ విజ్ఞానాన్వేషణలో నిమగ్నులై ఉన్నారు. అలా దినాలు గడుస్తుండగా మైసూరు విశ్వవిద్యాలయ గ్రంథాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానంవారు 1935-37లో ప్రచురించిన తాళ్ళపాక సంకీర్తలు వీరి కంటపడ్డాయి. ఇక వాటిని సునిశితమైన పరిశీలనతో లోతైన అధ్యయనం చేసి, అందులో ఉన్న సంగీత రస గుళికలను అర్థం చేసుకొన్నారు. తాళ్ళపాక పాటల్లోని రాగాలు ఎలా ప్రవర్ధిల్లాయో తెలిపేందుకు ఓ వ్యాసం రాశారు. ఆ వ్యాసం 1948లో ఆంధ్రపత్రికలో అచ్చయ్యింది. దీన్ని గమనించిన వేటూరి ప్రభాకరశాస్త్రిగారు శర్మగారిని ప్రశంసించారు. తి.తి.దే వారు కూడా శర్మగారి కృషిని దృష్టిలో పెట్టుకొని 1948లో జరిగిన ఓ సమావేశానికి ఆహ్వానించారు. ఆ విధంగా రాళ్ళపల్లివారికి అన్నమాచార్యుల సంకీర్తనల్ని పరిష్కరించే అవకాశం దొరికింది.

రాళ్ళపల్లివారు అన్నమయ్య సంకీర్తనల్ని 1950 నుంచి 1975 వరకు పరిష్కరించారు. ప్రధానంగా 1951-1955లలో *'తాళ్ళపాకవారి ఆధ్యాత్మిక సంకీర్తనలు'* 7,8,9,10,11 అనే ఐదు సంపుటాలు. 1956-1956లలో *'తాళ్ళపాక పాటలు'* అనే రెండు సంపుటాలు. 1956-1975ల మధ్యకాలంలో *'తాళ్ళపాకవారి శృంగార సంకీర్తనలు'* 12,13,14,19,20.22 అనే ఆరు సంపుటాల్ని సంశోధించి, స్వయంగా పీఠికలు రాసి వెలువరింపజేశారు. ఈ పరిష్కరణలో శర్మగారికి సహాయకులుగా ఉదయగిరి శ్రీనివాసాచార్యులు, గౌరిపెద్ది రామసుబ్బశర్మలు ఉన్నారు. అస్తవ్యస్తంగా ఉన్న అన్నమయ్య సంకీర్తనల్ని ఓపికతో పరిష్కరించారు. పైగా ఆయా విషయాల్ని బాగా అర్థం చేసుకోవడానికి అన్నమయ్య సామాజిక నేపథ్యాన్ని, ఆనాటి సమాజ పరిణామాన్ని అవగాహన చేసుకొన్నారు. ఎంతో సంయమనంతో సూక్ష్మబుద్ధితో శర్మగారు ఈ పనిలో తలమునకలైనారని ఆయా పీఠికలు చదివినప్పుడు తెలుస్తుంది.

*''యెప్పుడైనను చదివినప్పుడు ఆ రచనలందలి అసాధారణ భావనాశక్తి, భాషయందలి స్వతంత్ర మధురధార, భావములందుఁ గానవచ్చు అసందిగ్ధమైన యార్జవము, విషయ వైవిధ్యము- వీనికి పరవశము కాక తప్పినదికాదు.''*[22] అని శర్మగారు అంటారు. ఇలా అన్నమయ్య సంకీర్తనల్లోని ఆధ్యాత్మికతనూ, శృంగారాన్ని సక్రమంగా పీఠికల ద్వారా వ్యక్తమయ్యేలా చేశారు. అన్నమయ్య పాటల్లోని పల్లవి, చరణాలు, వాటి భావాలు ఏమాత్రం చెడకుండా వాటికి రాగ, తాళాలను నిర్ణయించారు. కొన్నిటికి రాగముండీ తాళం లేకపోతే తానే వాటిని ఆలోచించి సందర్భానుగుణంగా సరిచేయడానికి ప్రయత్నం చేశారు.

[22] రాళ్ళపల్లి పీఠికలు. పుట. 30.

రాళ్ళపల్లివారు అన్నమయ్య సంకీర్తనల్లో నూట ఎనిమిది పాటలకు రాగాలను సమకూర్చారు. *''అన్నమయ్య పదాల్లోని పల్లవి చరణములందలి శబ్దార్థముల పొందిక, పాటల స్వరూపం చెడ కుండా పఠనయోగ్యంగా ముద్రించడం, వాక్య నిర్మాణము, మాండలిక ప్రాంతీయభాషల ప్రభావం తదితర అంశాలను పరిష్కరణలో దృష్టియందుంచుకొన్నారు.''*[23] అని డాక్టర్ కేసర్ల వాణి అన్నారు. రాళ్ళపల్లివారు స్వర పరచిన పాటల్లో ఉదాహరణకు కొన్ని చూడండి.

1. ఇప్పుడిటు కలగంటి (**రాగం :** భూపాళం, **తాళం :** జంపె)
2. అదివో అల్లది (**రాగం :** శ్రీరాగం, **తాళం :** ఆది)
3. ఆఁకటివేళల (**రాగం :** ముఖారి, **తాళం :** రూపకం)
4. వాడలవాడల (**రాగం :** వరాళి, **తాళం :** రూపకం)
5. అలరులు కురియగ (**రాగం :** శంకరాభరణం, **తాళం :** ఆది)
6. బ్రహ్మకడిగిన పాదం (**రాగం:** ముఖారి, **తాళం :** రూపకం)

శర్మగారు స్వరప్రస్తారం కల్పించిన పాటల్లో చెప్పుకోదగినవి ఎన్నో ఉన్నాయి. జీ. బాల కృష్ణప్రసాద్ *''సంగీత కళానిధి'' శ్రీమాన్ రాళ్ళపల్లి'* అనే వ్యాసంలో *''శర్మగారి సునిశిత పరిశీలనా స్వభావం తాళ్ళపాకవారి పాటలకు చక్కని బాణీలను సమకూర్చడంలో చాలా ఉపకరించింది. ఏ కారణాలవల్లనైతే నేమి, వారు స్వరపరిచిన తాళ్ళపాక పాటలు జన సామాన్యంలో బహుళ ప్రచారాన్ని పొందలేకపోయినవి.''*[24] అని అభిప్రాయపడ్డారు. కాలం మారుతున్న కొద్ది సంగీతం అనేక మార్పులు చోటు చేసుకోవడం మామూలే. శర్మగారు స్వర పరిచిన పాటల్లో నేటికి చలామణిలో లేకపోలేదన్న విషయం మరువరాదు.

## 5. 5. తెనుగు మీరా

భారతీయ హిందీ సాహిత్యంలో మీరాబాయి భజనలకు ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఇవన్నీ హిందుస్తానీ సంగీత శైలీలో విస్తృత ప్రచారంలో ఉన్నాయి. వీటిని ఇతర భాషల వాళ్ళు కూడా వారి వారి భాషల్లో పాడుకొని సంతోషిస్తున్నారు. ఈ ధోరణిలోనే ఓరుగంటి రామచంద్రయ్య కౌండిన్య మీరాబాయి భజన పాటలను తెలుగులోకి అనువదించారు. వీటిని రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు చాలా రమ్య రసార్ద్రంగా స్వరపరిచారు. కర్ణాటక సంగీతంలోనే వీటికి స్వరాలను ఇవ్వడం జరిగింది. ఇవి ఎంతో జనరంజకరంగా ఉండటం విశేషం. రామచంద్ర కౌండిన్య రాసిన 'తెనుగు మీరా' అనువాద గ్రంథానికి శర్మగారు ముందు మాట రాస్తూ *''రామచంద్రయ్యగారు వహించిన యీ రాగ తాళ రచనా స్వాతంత్ర్యము ఈ పాటల యందు మనకు ఆత్మీయతను సంపాదించి పెట్టినది.''*[25] అంతేకాదు కౌండిన్య అనువాదం

---

[23] శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ శతజయంతి సంచిక (1893-1993) పుట. 75.
[24] శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ శతజయంతి సంచిక (1893-1993) పుట. 84.
[25] రాళ్ళపల్లి పీఠికలు. పుట. 177.

మూలాన్నెక్కడా విస్మరించలేదు. పైగా హిందీ మూలాన్ని కూడా గ్రంథంలో పొందుపరిచారు. దీనివల్ల అనువాద సౌష్ఠవాన్ని సులభంగా అర్థం చేసుకోవచ్చు. అని శర్మగారు అన్నారు.

నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు శర్మగారి సంగీత విద్వత్తును ప్రశంసిస్తూ ఇలా అన్నారు. 'శర్మగారు లక్ష్య లక్షణాలైన రెండింటిలోనూ ప్రతిభావంతులైనవారు కాబట్టి సంగీత విజ్ఞాన విషయాల్ని సుబోధకంగా సుమనోహరంగా చెప్పగలరు' అంటూ వారి సంగీత ప్రతిభలో ఆదర్శమైన అంశాల్నీ ఇలా పేర్కొన్నారు.

1. *రాగ స్వరూపమును చెఱచు ప్రయోగములను ఎంత మాత్రము స్పృశింపకుండుట.*
2. *రాగములను గతానుగతికముగా వినిన సంగతులను చిలుకవలె కాక స్వరస్వరమునకు కలిగిన సంబంధ బాంధవ్యములను తెలిసి తలస్పర్శి అయిన భావముతో సుబోధముగా ప్రస్తారము చేయుట.*
3. *మంద్ర మధ్యతార స్థానములలో నాదము సమత్వముతో నుండుట.*
4. *కృతిని రాగతాళాది ప్రతిపత్తులకు భంగము వాటిల్లకుండ శ్రోతకు సాహిత్యము చక్కగా తెలియునట్లు పాడుట.*
5. *రాగమునందు శుద్ధ అకారమునకు ప్రాముఖ్యమిడుట.*
6. *జిహ్వాతాల్వోష్ఠకంఠమూలాది స్థాన సంయోగముచే నేర్పడు కసరు విసరు అవ్యక్త నాదముతో గాన తాళమునందు ఎక్కడి అక్షరములు అక్కడికే వచ్చులాగున సుశ్రావ్యముగా పాడుట.*
7. *స్వరకల్పనమునందు తాళగతికే దాస్యము చేయక రాగభావమందొదిగించి శ్రోత ఊహించుకొను గతికి తావీయక వివిధ విభాగ భేదములతో సమర్థగతితో కల్పనము చేయుట.*
8. *సంగీతమున ఆరభటవృత్తికంగా తావీయక దృఢబంధముగల కైశికవృత్తికి ప్రాధాన్యమిచ్చుట.''*[26] లాంటి అనేక శిష్టాదర్శాలు రాళ్ళపల్లి వారి సంగీతంలో ఉన్నాయని గుర్తుచేశారు.

రాళ్ళపల్లివారి గ్రంథ పరిష్కణ గురించి ఆర్. వి. యస్. సుందరం తెలిపిన విషయాలు కోసం (వివిధ రచయితలతో ఇంటర్వ్యూలు) ప్రశ్నావళి: 1, ప్రశ్న: 8 ని చూడు (అనుబంధం 1)

## 5.6. రాళ్ళపల్లి వారి సంగీత వ్యాసాలూ – విశేషాంశాలు

శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు సంగీత విద్యపై ఉన్న ఇష్టంతో కొన్ని వ్యాసాలు రాశారు. అవి *శ్రీ సాధన, భారతి, నాట్య కళ, ఆంధ్రపత్రిక ఉగాది సంచిక* మొదలైన పత్రికల్లో ప్రచురితమయ్యాయి. వీటన్నిటినీ సునిశితంగా అధ్యయనం చేస్తే ఈయన సంగీతాన్ని ఎలా అభ్యసించారో, దాని నుంచి ఏమి నేర్చుకున్నారన్న అంశాలు బాగా తెలిసొస్తాయి. కాగా సంగీత

[26] అనంతరాగం. పుట. 161–162.

ప్రాధాన్యాన్ని సమాజం ఎలా అర్థం చేసుకోవాల్సో వివరించే అభిప్రాయాలు స్పష్టంగా బోధపడతాయి.

*“ఒక విధంగా చెప్పాలంటే రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు సంగీత కారుల, సంగీతకారులు (Nusicians, Nusician) సంగీతంలోని అన్ని ప్రకారాల్లోనూ అంటే రాగం, తాళం, పల్లవి, స్వర ప్రస్తారం మరియు శాస్త్రంలోనూ ఘన విద్వాంసులు. శర్మగారు పాడే శైలి ఆయన విద్వత్తు, వారి సంగీత శాస్త్ర ప్రావీణ్యం, భావ రసాలతో నిండిన మనోధర్మం ఇవన్నీ గొప్ప విద్వాంసులకు, సంగీత విద్యార్థులకు గొప్ప సహాయ కారులుగా ఉండేవి”*[27] అని టి. టి. శ్రీనివాసన్ అన్నారు.

*‘కీర్తిశేషులైన వైణిక శిఖామణి శేషణ్ణగారు’* (శ్రీసాధన పత్రిక ఆగస్టు 14, 1926) ఈ వ్యాసంలో రాళ్ళపల్లివారు శేషణ్ణగారి సంగీత ప్రతిభా పాటవాల్ని ఎంతో స్ఫూర్తివంతంగా తెలియజేశారు. శేషణ్ణ సంగీత రంగంలో కఠోర పరిశ్రమచేసినవారు. ఎటువంటి ధనం ఆశించకుండా అల్ప తృప్తిని పొందినవారు. ఎంతోమంది శిష్యుల వాత్సల్యాలను చొరకొన్నవారని రాళ్ళపల్లివారు అన్నారు. శేషణ్ణ సంగీత వాయిద్యాల్లో గొప్ప యోగ్యతను సాధించడమేకాక, ఇతరుల ప్రతిభను గుర్తించి, గౌరవించి ప్రోత్సహించిన సహృదయులని నిర్ణయించారు. ఈర్ష్యా ద్వేషాలు లేకుండా తాను నేర్చుకున్న విద్యను అందరికీ పంచిపెట్టిన గొప్పవ్యక్తి. ఎంతో వినయంతో మర్యాదగా జీవితాన్ని గడిపిన ఆదర్శనీయులని శేషణ్ణగారని రాళ్ళపల్లివారు గుర్తుచేశారు. అంతేకాకుండా శేషణ్ణ తమ వీణలో కర్ణాటక, హిందుస్థాని, పాశ్చాత్య సంప్రదాయాన్ని ఘనంగా ప్రదర్శించే ప్రావీణ్యాన్ని శర్మగారు దగ్గరుండి ఆస్వాదించారు.

రాళ్ళపల్లివారు రోజు రోజుకి సంగీత విద్యపై తగ్గిపోతున్న ఆదరణను ఏకరువు పెడుతూ సుదీర్ఘంగా ప్రసంగించిన విషయాలు *‘ఆంధ్ర గాయక జనసభ’* ఈ వ్యాసంలో ఉన్నాయి. ’ఈ ప్రసంగం 1928 జనవరి: భారతి పత్రికలో ప్రచురితమైంది. వ్యాసంలోకి వెళితే తెలిసేవి. శర్మగారు చెప్పిన అంశాలిలా ఉన్నాయి. మన పూర్వీకులు అందించిన ఈ సంగీతాన్ని ప్రస్తుతం మనం ఏమేరకు కాపాడుకుంటున్నామో పునఃపరిశీలన చేసుకోవాలన్నారు. కేవలం సంగీతమే కాదు మొత్తం కళలన్నిటినీ కాపాడుకోవాలని ఆకాంక్షించారు. వీటిని పురుషులతోపాటు స్త్రీలు కూడా అభ్యసించాలని తెలిపారు. విశ్వవిద్యాలయాల్లో కళల్ని ప్రత్యేక కోర్సులుగా రూపొందించాలన్నారు. దేన్ని నేర్చుకోవాలన్నా ముందుగా ఆసక్తి ఉండాలి. ఉపాధ్యాయులు పిల్లలకు ఆయా కళలపై అభిరుచి కలిగించాలి. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. విద్యార్థులు క్రమశిక్షణతో పెద్దల చెప్పినట్లు నడుచుకోవాలి. అప్పుడుగానీ వీటిని అవగాహన చేసుకోలేమని స్పష్ట పరిచారు. శర్మగారు సంగీత విద్య లోతుపాతుల్ని క్షుణ్ణంగా ఈ వ్యాసంలో వివరించారు. తాను అర్థం చేసుకొన్న ఆయా అంశాల్ని చాలా ఓప్పిగ్గా చెప్పారు. ఈ

[27] రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ (కన్నడ డి. లిట్., సిద్ధాంత గ్రంథం) పుట. 136.

సంగీతానికి సాహిత్యం కూడా తోడైతే మరింత బాగుంటుందన్నారు. తెలుగువారైన క్షేత్రయ్య, త్యాగయ్యలు చేసిన కృషిని రాళ్ళపల్లివారు నొక్కి వక్కాణించారు. కాగా తెలుగు ప్రాంత పరిపాలకులు ఏమేరకు కళకారులని గుర్తించారో స్మరించుకోవాలని ఉద్ఘాటించారు. ఈయన తన గురువుల దగ్గర నేర్చుకున్న విలువల్నీ ఈ తరం వాళ్ళకు పండు ఒలిచి పెట్టినట్లు చెప్పారు. కాగా ఈ కళలపై కళాకారులకు ఎంత ప్రీతి ఉంటుందో అంతే ఇష్టంతో వీరిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రేక్షకులకి ఉండాలి. అప్పుడే కళలు కళాకారులు బతుకుతారనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఇతర ప్రాంతాల సంగీతాలతో పోల్చుకుంటే మన తెలుగువారి సంగీతం ఎంతో ఉన్నతమైందని రాళ్ళపల్లివారు అభిప్రాయపడ్డారు.

రాళ్ళపల్లి వారికి సంగీతంపై ఉన్న సూక్ష్మ దృష్టి, తులనాత్మక అధ్యయనం *''భారతీయ సంగీత మందలి దక్షిణోత్తర మార్గములు''* (నాట్య కళ, డిసెంబర్, 1934) అనే వ్యాసం ద్వారా వెల్లడవుతుంది. మొత్తం దేశంలో ఉన్న సంగీత విద్యనంతటిని శర్మగారు చాలా లోతుగా అర్థం చేసుకున్నారు. ఇందులో శ్రుతికి హిందుస్తానీ, తాళ లయలకు కర్ణాటకాలు ప్రాముఖ్యం వహిస్తాయన్నారు. హిందుస్తానీ సంగీతం తండ్రిలాంటిదైతే, కర్నాటక సంగీతం తల్లిలాంటిదని తేల్చి చెప్పారు. ఏ ప్రాంతంలో ఏది ప్రాముఖ్యం వహిస్తున్నదన్న విషయాల్ని చాలా స్పష్టంగా వివరించారు. సంగీతంలో శ్రుతి, లయలకు అనుగుణంగా ప్రవర్ధిల్లిన రసభావాలను సూచీ ముఖంగా పరిశీలించారు. ఈ వ్యాసం *''రాళ్ళపల్లి వారి సంగీత వైదుష్యానికీ, సమదర్శనానికీ ప్రతీక''*[28] అని ప్రముఖ విమర్శకులు ఘట్టమరాజు అన్నారు.

తెలుగువారి పాటల్లో హిందుస్తానీ సంగీత పోలికలు కనిపిస్తాయని *'కర్ణాటక గానశైలి పవిత్రత'* (భారతి, మే, 1939) అనే వ్యాసంలో శర్మగారు అన్నారు. కన్నడిగులు, తమిళులు సంగీతంలో ఉన్నతులేకాని హిందుస్తానీ రేడియో, నాటిక, సినిమాలు మొదలైన వాటికి ఆకర్షితులైనారు. నిజానికి హిందుస్తానీ కంటే కర్ణాటక సంగీతం కొంత క్లిష్టమైనదని ఈయన భావన. సులభంగా ఉన్నదని హిందుస్తానీకి ఆకర్షితులైతే పెద్దగా గుర్తింపు రాదు. కాబట్టి కర్ణాటక సంగీతాన్ని అనుసరించడం మంచిదన్నారు. ముఖ్యంగా తెలుగువారి సంగీతంపై శర్మగారికి అమితమైన గౌరవం. దాన్ని వారి మాటల్లోనే *''నేటి స్వభాషాభిమాను లెట్లు తలంచినను గానమునకు పనికివచ్చు భాషలలో తెలుగువంటిది ఇప్పటికి మరియొకటి లేదు.''*[29]

సంగీతంలో ప్రాంతీయ భేదాలు అవసరమా? అంటూ శర్మగారు *'స్వభాషాభిమానమునకు సంగీతముతో ఏమి గొడవ?'* (భారతి, ఆగస్టు, 1941) అనే వ్యాసం రాశారు. తమిళులు తమ సభల్లో తెలుగు పాటలను ఎక్కువగా పాడనీయకూడదనే నిర్ణయాలు చేసుకోవడం తప్పని రాళ్ళపల్లివారు అన్నారు. ఏవో రహస్య సమావేశాలు

[28] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 20.
[29] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 313.

నిర్వహించుకొని విచిత్ర నిర్ణయాలు చేసుకోవడం హస్యాస్పదంగా ఉందన్నారు. సంగీతం సార్వజనీనమైన విద్య కాబట్టి ఎవరి శక్తి సామర్థ్యాల మేరకు వారు దీన్ని అస్వాదించవచ్చు. అంతేకాని దీనికి కన్నడ, తెలుగు, తమిళమనే తారతమ్యాలు ఎందుకన్నారు. కన్నడిగులు తెలుగును ఎంతగా ఆదరిస్తున్నారో చూస్తున్నారు కదా! ఎందరో ఉద్దండ సంగీత కారులు దీన్ని అంగీకరించారు. కానీ తమిళుల్లో కొందరికి ఇలాంటి నిర్హేతుకమైన భావాలుండటం అంత అరోగ్యకరం కాదని రాళ్ళపల్లివారు గుర్తుచేశారు. ఏదైనా విద్య నేర్చుకోవడానికి ఆసక్తి ఉన్నవారిని ప్రోత్సహించాలిగానీ, పనికిరాని నిర్ణయాలతో ఇబ్బంది పెట్టకూడదని ఖకరాఖండిగా చెప్పారు. భాష మీద అభిమానం ఉండాలి కానీ అది ఇతరులను కించపరిచేలా ఉండకూదని రాళ్ళపల్లివారి అభిమతం.

సంగీత, సాహిత్యాలు రెండూ శంఖంలో పోసిన తీర్థం లాంటివని శర్మగారు *'సంగీత సాహిత్యాలు : అక్షరరమ్యత'* (భారతి, అక్టోబర్, 1945) అనే వ్యాసంలో అన్నారు. ఇవి సోదరత్వాన్ని కలిగివుంటాయి. పాడేవారు పదాలను సరిగ్గా ఉచ్చరించకపోతే సంగీతం హద్దులు మీరే ప్రమాదం ఉంది. నన్నయలోని అక్షర రమ్యత సంగీతానికి బాగా ఉపయోగపడుతుంది. మన ప్రాచీన కవులు దీన్ని చాలా జాగ్రత్తగా అనుసరించారు. జయదేవుని అష్టపదుల్లో దాన్ని గమనించవచ్చని కొన్ని పద్యాలను ఉదహరించారు. అక్షరరమ్యత విషయంలో వాగ్గేయకారులు మెలుకువతో ఉండాలని గుర్తుచేశారు.

రాళ్ళపల్లివారు *'మన సంగీత వాద్యాలు'* (ఆంధ్రపత్రిక ఉగాది సంచిక ఉ. సం. 1947) అనే వ్యాసంలో ప్రస్తుతం సంగీతానికి ఉపయోగపడే వాద్యాలైన వీణ, మృదంగం, వేణువు, సన్నాయి మొదలైన వాటిని గురించి తెలిపారు. సంగీతానికి పూర్వం నుండి ఎన్నో వాయిద్యాలు ఉన్నాయి. కానీ నేడు కొన్ని వాడుకలో లేవు. అయితే ఉన్న వాటిని కాపాడుకోవాలని ఆకాంక్షించారు. కర్ణాటక సంగీతంలో ఫిడేలు వాయిద్యానికి ఆదరణ ఎక్కువ. వీణను ప్రత్యేక సందర్భాల్లో ఉపయోగిస్తున్నారని శర్మగారు గుర్తుచేస్తున్నారు. *"ఈ వ్యాసం రాళ్ళపల్లివారి పాండితీగరిమకు, విశ్లేషణసామర్థ్యానికీ చక్కని ఉదాహరణగా"*[30] సుప్రసిద్ధ విమర్శకులు అశ్వత్థనారాయణ కొనియాడారు.

సంగీతంలో ఆంధ్రుల స్థానం ఎంతో స్థిరమైందని రాళ్ళపల్లివారు *'ఆంధ్రులు – సంగీతము'* (ఆంధ్రపత్రిక ఉగాది సంచిక, 1950) అనే వ్యాసంలో పేర్కొన్నారు. మొట్టమొదట సప్తస్వరాలు వ్యాకరణం నుండి పుట్టాయని, పద్దెనిమిది రాగాల్లో ఆంధ్రజాతి రాగం గొప్ప విశిష్టమైందని అభిప్రాయపడ్డారు. భారతదేశ దక్షిణ ప్రాంతానికి కర్ణాటక సంగీతం ఆధార బిందువు. అందుకే ఈ ప్రాంతానికి కర్ణాటక సంగీతమనే నామం స్థిరపడింది. ఈ కన్నడంలో ఆంధ్రుల స్థానం సుస్థిరమైందని అన్నారు. లక్షణ గ్రంథాల్లో ఆంధ్రులు విశిష్ట కృషిని సలిపారు.

[30] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 21.

ఇది పురాణాల్లో కొంత తక్కువగా ఉన్నా! ప్రబంధకాలంలో విస్తృతిని చాటుకొన్నదని వ్యాసకర్త అన్నారు.

శర్మగారు 'సంగీతము' (తెలుగు విజ్ఞాన సర్వస్వము, 3వ సంపుటము 1959) అనే వ్యాసంలో భారతదేశ సంగీత పుట్టు పూర్వోత్తరాలను చాలా చక్కగా తెలిపారు. రాళ్ళపల్లి వారు అటు ఉత్తరం నుండి దక్షిణం వరకూ గల సంగీతజ్ఞుల్నీ, సంగీత గ్రంథాల్ని సమీక్షించారు. శృతి, లయల్లో హిందుస్తానీ, కర్ణాటక సంగీతాలు ప్రముఖమైనవని అన్నారు. నన్నయ, తిక్కనల రచనల్లో సంగీత ఛాయలు చాలా తక్కువగా కనిస్తాయని చెప్పారు. సాధారణ పల్లెప్రజలైన జానపదులు, గిజనులు, నాగరికులు భారతీయ శాస్త్రీయ సంగీతంలో గొప్ప కృషి చేయడం విశేషమన్నారు. సాహిత్యంలో ప్రబంధయుగం, దక్షిణాంధ్రయుగాలవల్ల కర్ణాటక సంగీతానికి గుర్తింపు వచ్చిందన్నారు. సంగీతంలో తెలుగుభాషా మాధుర్యం, ఔన్నత్యం మరువరానివని శర్మగారు చెప్పారు. దీనివల్లే కర్ణాటక సంగీతానికి పేరు ప్రఖ్యాతులు లభించాయని వ్యాసకర్త అభిప్రాయపడ్డారు. ఈ వ్యాసం ఎంతో సుదీర్ఘమైంది. మొత్తం సంగీతంలో ఉన్న ప్రధాన అంశాలన్నింటిని అవలోకనం చేశారు శర్మగారు.

రాళ్ళపల్లివారు సంగీత రాగాలైన సైంధవి, మంగళకైశికి, ద్విజావంతీలపై విశేషమైన ప్రసంగాలు చేశారు. వాటిని పొట్లూరి అనురాధ తన ఎం.ఫిల్ సిద్ధాంత వ్యాసం అనుబంధం – 3లో పొందుపరిచారు.[31] ఇవి సంగీత విద్యార్థులకు ఎంతో ఉపయోగపడగలవని చెప్పవచ్చు.

పై వ్యాసాల, ప్రసంగాల వల్ల రాళ్ళపల్లి వారికి గల సంగీత సదభిరుచి సుస్పష్టంగా అర్థమౌతుంది. ఓ సందర్భంలో ఘట్టమరాజు అశ్వత్థనారాయణ రాళ్ళపల్లి వారితో ముఖాముఖి చేస్తూ ''నేటి సంగీతం గురించి – సంగీత వేత్తల గురించి చెప్పండని అడిగినప్పుడు. శర్మగారు బాధ పడుతూ సెలవిచ్చిన మాటలు ''*వీణశేషణ్ణ బిడారం కృష్ణప్పవంటి మహానుభావులు తమ సంగీత సాధన – సిద్ధులను ఇతరులకు సంతోషంగా పంచిపెట్టినారు. ఆ కాలంలో వారి ఇండ్లకు వెళ్లిన వారెవ్వరు వారి సంగీతామృతాన్ని చవి చూడకుండా తిరిగి వచ్చేవారు కాదు. మరి నేడో గాయకులలో, వాద్య కారులలో చాలామందిలో తమ సిద్ధిని పంచిపెట్టాలనే భావనకంటే ఇతరములైన భావనలు ప్రబలుతున్నాయి. పేరు – ప్రసిద్ధులు ధనార్జన ఇవే ముఖ్యములై నాదోపాసన గౌణము కావటము చింతింపదగ్గ విషయము.''*[32] ఈ అభిప్రాయం రాళ్ళపల్లివారు ఎంతో వేదనతో చెప్పారని స్ఫురించక మానదు. ఎందుకంటే నేడదే స్థితి దాపురితమై ఉంది కాబట్టి. ఈ విధంగా శర్మగారు తాను సంగీతంలో సంపాదించిన పరిజ్ఞానాన్ని వ్యాసాల్లోనూ, ఉపన్యాసాల్లోనూ, ముఖాముఖీలలోనూ ఔచితీమంతంగా వెల్లడించడం పరిపాటి. ''*తెలుగువారై, కన్నడ దేశంలో ఉండి తమిళనాడు గౌరవాన్ని*

---

[31] సంగీత కళానిధి రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ సంగీత వైదుష్యం – ఒక పరిశీలన పుటలు. 146– 158.

[32] సంగీత సాహిత్య శారదా దరహాసం – శ్రీమాన్ రాళ్ళపల్లి (సెప్టెంబర్ 22, గురువారం, ఆంధ్రప్రభ, 1977)

*పొందగలిగారు అంటే శ్రీ శర్మగారి సంగీత విద్యా ప్రాభవమే కారణం.''*[33] అని శ్రీపాద పినాక పాణి తెలిపారు.

సంగీతంలో చిరస్మరణీయమైన కృషికిగాను శర్మగారిని ఇటు ఆంధ్ర ప్రాంతం వారూ, అటు కర్ణాటక ప్రాంతంవారూ ఘనంగా గౌరవించారనే చెప్పాలి. ఈయన్ను 1954లో కాకినాడ సరస్వతీ గానసభవారు సన్మానించారు. 1961లో కర్ణాటక వారు మైసూరు సంగీత పరిషత్ అధ్యక్షునిగా నియమించి 'గాన కళాసింధు' అనే బిరుదు నిచ్చారు. 1964లో ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీకి అధ్యక్షులుగా ఎన్నుకొని 'గాన కళాప్రపూర్ణ' పేరుతో సన్మానించారు. తర్వాత 1969లో కర్ణాటక సంగీత నాటక అకాడమీ అధ్యక్షులు కూడా అయ్యారు. 1970లో ఈయన 'సంగీత కళా రత్న' బిరుదు పొందారు. 1973లో కేంద్ర సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్ అర్హత సాధించారు. 1974లో ప్రతిష్ఠాత్మకమైన మద్రాసు మ్యూజిక్ అకాడమీ నుంచి 'సంగీత కళానిధి' అనే పేరును కూడా సొంతం చేసుకున్నారు. ఇదే సంవత్సరం శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వీరి సాహిత్య, సంగీత కృషికి గాను గౌరవ డాక్టరేటునిచ్చి గౌరవించింది.

## ఈ అధ్యాయంలో ముఖ్యాంశాలు

- రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ సంగీత, సాహిత్యాల్ని దశాబ్దాల పాటు సాధన చేసి సిద్ధి పొందినవారు.
- వీరి సంగీత, సాహిత్య సవ్యసాచిత్వం తెలుగు సాహిత్యానికి తెలుగు సాహిత్యానికి అపురూపంగా విరాజిల్లింది.
- శర్మగారు అన్నమయ్య, క్షేత్రయ్య, త్యాగయ్యల సంగీతాల్నీ సాహిత్య దృష్టితో పరిశీలించి ఎన్నో లో వెలుగుల్ని ప్రసరింపజేశారు.
- రాళ్ళపల్లి వారు హిందుస్తానీ, కర్నాటక సంగీతంలోని సామ్య భేదాల్ని వివరించడంతో పాటు సమన్వయ ధోరణిని అవలంబించారు.
- అనంతకృష్ణులవారు సంగీత కారుల భాషా దురభిమానాన్ని తీవ్రంగా ఖండించి సామరస్య దృష్టిని ప్రతిపాదించారు.
- రాళ్ళపల్లి వారి సంస్కృత, తెలుగు కీర్తనలలో భావ తీవ్రత, భాషా గాంభీర్యం, గాయన కౌశలం ఉట్టిపడుతుంది.
- శర్మగారి సంగీత కృషిని అవగాహన చేసుకోగలిగితే! సాధారణ తెలుగు విద్యార్థులకు సైతం సంగీతం మొదలైన కళల పట్ల ఆసక్తి పుట్టక మానదు.

రాబోయే అధ్యాయంలో అనంతకృష్ణశర్మగారి భాషాశైలి గురించి తెలుసుకుందాం.

---

[33] అనంతరాగం. పుట. 159.

# ఆరవ అధ్యాయం

# రాళ్ళపల్లివారి భాషాశైలి

ert

ఆరవ అధ్యాయం

# రాళ్ళపల్లి వారి భాషాశైలి

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి జీవితం, నేపథ్యం, సాహిత్య, సంగీత వైశిష్ట్యాల్నీ తెలుసుకున్నాం. ఈ అధ్యాయంలో వారి భాషాశైలిని విశ్లేషించుకుందాం. రాళ్ళపల్లి వారు పద్య, గద్య రచనల్లో సిద్ధహస్తులు. బహుభాషా కోవిదులైన వీరు ప్రాచీనతలో ఆధునికతను ప్రవేశపెట్టారు. తొలి రచన నుంచి తుది రచన వరకూ వీరి వ్యక్తీకరణ ఎంతో ఉదాత్తంగా రూపు దిద్దుకొంది. దీనికి కారణం వీరి భాషా శైలి. సాధారణంగా రాళ్ళపల్లి వారు దృష్టిని తెలుసుకొని సిద్ధిని పొందినవారు కాబట్టి వీరి భావాలు పటిష్ఠమై ఉంటాయి. ఈయన రచనల్లో పదబంధాలు, శబ్ద ప్రయోగాలు, అలంకారాలు, జాతీయాలు, నుడికారాలు, మాండలిక పదాలు వెరసి వాక్య నిర్మాణాలు అత్యంత సరళ సుందరంగా ప్రవర్ధిల్లుతుంటాయి. మామూలుగా శర్మగారు సాహిత్య, సంగీతాల్లో మేరు పర్వతం లాంటి వారు కాబట్టి ఆయా రంగాల్లో ఋషి స్థానం వహించారు. ఈయన 1911లో రచనా వ్యాసంగం ప్రారంభించారు కనుక అప్పటి పరిస్థితులకు అనుగుణమైన భాషను వాడారు. కాలక్రమంగా ఈ భాషను సరళీకరించు కోవడానికి ప్రయత్నించారు. ఈయన సంస్కృత భాషా ప్రభావానికి లోనైనప్పటికీ లలితమైన పదాలు వాడి, తేట తెలుగులో రాయడానికి ఇష్టపడ్డారు. రచనల్లో ప్రామాణిక భాషను ప్రోత్సహిస్తూనే మాండలికత వైపు అడుగులు వేశారు. శర్మగారి రచనల్ని జాగ్రత్తగా పరిశీలించి వారి భాషా శైలిని ఈ అధ్యాయంలో పరిశీలించడం జరుగుతుంది.

## 6. 0. రాళ్ళపల్లి పద్య రచనలు – భాషాశైలి

అనంతకృష్ణశర్మగారిది మొదటి నుండి సంస్కృత, ప్రాకృత రచనలు చదివిన అనుభవం. కాబట్టి ఆ ప్రభావం వీరి తొలి రచనలో స్పష్టంగా కనబడుతుంది. శర్మగారు ఎక్కువగా సరళ గ్రాంథికంలోనే రాశారు. అయితే రానురాను భాషాశైలిని మార్చుకోవడానికి ప్రయత్నించారు. మొదటి అధ్యాయంలో చెప్పుకున్నట్లు లభ్యమైన శర్మగారి రచనల ఆధారంగా భాషాశైలిని పరిశీలించుకుంటూ వెళితే ఎలా మార్పులకు లోనైయిందో స్పష్టంగా బోధపడగలదు.

## 6.1. భార్గవీ పంచ వింశతి

రాళ్ళపల్లి వారు రచించిన రచనల్లో లభ్య మౌతున్న తొలి కృతి *'భార్గవీ పంచవిశంతి'*. దీనిని మత్తేభ, శార్దూల వృత్తాల్లో రాశారు. సుమారు ఇరవై ఎనిమిది పద్యాలు దొరుకుతున్నాయి. ఈ పద్యాల్లో సంస్కృత పదాలు ఎక్కువగా ప్రయోగించబడ్డాయి. ఉదాహరణకు ఓ పద్యం చూడండి.

శా. ***నీచుండైనను నిర్గుణుండైన నెంతే ఘాతుకుండైన దు***
***ష్టాచారుండయినన్ ద్వదీయ కరుణా పాంగంబు మైసోకినన్***
***వాచాతీత విభుక్తి యుక్తిగనడే నా తల్లి యట్లౌట చే***
***నా చాపల్యము నిన్ను వేడి కొన కుండం జాలకో ! భార్గవీ.***

ఇందులో ఉదాహరణకు ***నీచుడు, నిర్గుణుడు, ఘాతుకుడు, దుష్టుడు*** అనే విశేషణాలను ఔచిత్యంతో ఉపయోగించారు. **చపలమును** కాస్త **చాపల్యముగా** ప్రయోగించారు. ఈ విధంగా సందర్భాను సారంగా విశేషణ, విశేష్యాలకు ప్రాధాన్యమివ్వటం గమనార్హం. కాగా చెప్పాల్సిన దాన్ని సూటిగా చెప్పారు. శర్మగారికి తిక్కన రచనలంటే అమితమైన ప్రీతి, కనుక వారిని అనుసరించే ప్రయత్నం కూడా వీరికి పరిపాటైంది. ఈ పద్యాలను చదువుతున్నప్పుడు కొంచం కష్టమనిపించినా అర్థంకాకపోవు. శర్మగారి ఆర్జవ శక్తి బలమైనదని చెప్పడానికి ఈ పద్యాలు నిలుటద్దాలు.

## 6.2. ఖండకావ్యాలు

రాళ్ళపల్లి వారి ఖండకావ్యాలైన *'తారాదేవి'* (1911), *'మీరాబాయి'* (1912) రచనల్లోని భాషాశైలిని రెండవ అధ్యాయంలో సోదాహరణంగా పేర్కొనటం జరిగింది. (57, 58, 78, 79 పుటల్లో) వీటిలో కాలానుగుణంగా పలుకుబడులు, పదబంధాలు, సామెతలు, జాతీయాలు, నుడికారాలను ఉపయోగించడంలో రాళ్ళపల్లి వారు ప్రతిభను కనబరిచారు. ప్రస్తుతం ఈ భాషా శైలిలో భాగంగా కొన్ని ఉదాహరణలు ఇక్కడ పరిశీలిద్దాం.

**'తారాదేవి'** కావ్యంలో ఉదాహరణకు కొన్ని ఉదాహరణలు;

- **పలుకుబడులు**
  1. *''నీకు, నెద్ది యిష్టమొ నాకు నభీష్టమదియె''* (పద్యం: 168, పుట: 18)
  2. *''పూసగుచ్చినట్లు''* (పద్యం: 135, పుట: 16)
- **జాతీయాలు**
  1. *''ఆవులించిననే ప్రేవులు లెక్కబెట్టఁదగు* (పద్యం: 83, పుట: 10)
- **సామెతలు**
  1. *''సిరిరా మోకాలొడ్డెదు''* (పద్యం:142, పుట: 17)
  2. *''తాను ద్రవ్విన గోతిలోఁదానె బడినయట్లు''* (పద్యం : 97, పుట: 11)
- **పదబంధాలు**
  2. *''సంజకెంజాయ''* (పద్యం: 74, పుట: 9)
  3. *''భూరి తరంబుగ''* (పద్యం: 9, పుట: 2)

ఉదాహరణకు 'తారాదేవి' కావ్యంలో శర్మగారు కింది పద్యాన్ని ఎంత సరళ సుందరంగా రచించారో చూడండి.

ఉ. *భీతియు రోషము ™ధృతియుఁ బిక్క టిల్లంగ వరాహ మెంతయు ™*
*ఱోతు మత్తుచే, నొద లెఱుంగక పైఁబడ దూకుచుక్కన*
*న్నాతి యొకింతయు ™మన సున ™భేయమందక జొన్న కొయ్యచే*
*నాలరినొ యే టడఁచ నాటిమూర్ధముపైఁ బలంబుగ ™*

(పద్యం : 36, పుట: 5)

ఉత్కంఠమైన పరిస్థితిని తెలిపే సందర్భమిది. దీన్ని శర్మగారు వృత్త పద్యంలో సులభంగా వెల్లడించారు. ఈ కావ్యంలో అక్కడక్కడ వచనం కూడా కనిపిస్తుంది. ఆ వచనం పద్యాల కన్న కొంచం సరళంగా ఉంది. దాన్ని పరిశీలించండి.*''వ. మనమ్మనర్గ జింతించి యంత మృగయావిహార సంసక్త చిత్తుండగుటఁ జేఁజిక్కి తక్కిన వనవరాహంబు దారినరయర్గ గోరి యా నెలఁత కిట్లనియె.''*[1] ఈ విధంగా కావ్యంలో పద్య, గద్య మేళవింపు చక్కగా కుదిరింది.

***'మిరాబాయి'*** కావ్యంలో ఉదాహరణలు;

- **పలుకుబడులు**
    1. *''వెలకు మీరిన సొమ్ములు గలవె?''* (పద్యం: 91, పుట: 19)
    2. *''కనులారఁగంటి''* (పద్యం : 112, పుట: 21)
- **జాతీయాలు**
    1. *''చెవులు గింగురు వడునట్లు''* (పద్యం: 58, పుట: 14)
    2. *''మేలిమి సొమ్ములు''* (పద్యం: 21, పుట: 8)
- **సామెతలు**
    1. *''మంత్రములు లేని సంధ్యకు మఱియుఁ చెంబు నీరు''* (పద్యం: 59, పుట:14)
    2. *''దొరబుద్ధులు దొడ్డలు వో తలంపగన్''* (పద్యం: 50, పుట: 12)
- **పదబంధాలు**
    1. *''కోమల వల్లకీ''* (పద్యం: 67, పుట: 15)

ఓ పద్యాన్ని పరిశీలిస్తే భాషామాధుర్యం అవగతమౌతుంది.

చ. ***''కల నయినన్ గనన్ వినఁగఁ గానము మేల్బళి! యిట్టిగాన; మీ***
***లలనకు సాటివచ్చు లలనామణు లెన్నఁగ ముజ్జగంబులం***
***గలుగుదు రొక్కొ! యిట్టులె సుఖంబుగ నిక్కడ నుండ మన్న, న***
***ర్గళముగ రాజ్య మన్న యురిత్రా దొకటున్నది యేమి సేయుదున్?***

(పద్యం: 80, పుట: 17)

[1] తారాదేవి (పుట: 3)

ఇందులో కవి మేల్బళి, లలన, లనలామణి, ముజ్జగంబు, సుఖంబు, అనే పదాలను ప్రయోగించి ఆసక్తిని కలిగించారు. ఇటువంటి పద్యాలను కావ్యంలో విరివిగా పొందుపరిచారు.

'తారాదేవి' లో లాగే 'మిరాబాయి' లోకూడా వచనం కనిపిస్తుంది. అది ఏవిధంగా ఉందో చదవండి. ''*వ. విని కుంభండు మనమ్మున నేమేమియొ చింతించి బొమలు ముడివెట్టి నిజాంగనం గనుంగొని.*''[2]

అనంతపురం మాండలికంలో పెద్దవాళ్ళని **'దేవర'** (వచనం: 98, పుట: 20) అని పిలవటం సంప్రదాయం. ఇలాంటి మాండలిక పదాలను రాళ్ళపల్లివారు సందర్భానుగుణంగా ప్రయోగించి కావ్యానికి మెరుగులు దిద్దారు.

రెండు ఖండకావ్యాల్ని రాళ్ళపల్లివారు విషయగతంగా రాయడమేకాకుండా భాషాంశాల్ని దృష్టిలో పెట్టుకొని రాయడం ముదావహం. సంస్కృత పదాలు, అచ్చమైన తెలుగు పదాలు, సంధులు, సమాసాలు మొదలైన వాటిని పద్ధతి ప్రకారం పొందుపరిచారు. కావ్యాల్లో ఆయా రసాలను సమర్ధవంతంగా పోషించడం సందర్భోచితంగా ఉంది.

## 6.3. కవితలు

రాళ్ళపల్లివారి కలం నుండి పలు ప్రసిద్ధమైన ముక్తక కవితలు వెలువడ్డాయి. వీటిని శర్మగారు సంప్రదాయానికీ, ప్రాంతీయ చైతన్యానికీ, సంగీత శాస్త్ర ప్రాధాన్యానికీ, స్వాతంత్ర్య కాంక్షకు నిదర్శనంగా మలిచినారు. ఈ కవితల నేపథ్యం గురించి రెండవ అధ్యాయంలో తెలుపబడింది.(85-95 పుటల్లో) కాబట్టి ఇక్కడ ఆయా కవితల్లో రాళ్ళపల్లి వారు పండించిన భాషా మాధుర్యాన్ని సూచనా ప్రాయంగా గుర్తుచేసుకోవడం సముచితం.

రాళ్ళపల్లివారు *'పెనుగొండ కొండ'* కవితను వీరరసం ఉట్టిపడేలా సరళమైన భాషలో రాశారు. కవితలో లలితమైన పదాల పొహళింపు అందాన్నిస్తుంది. ***'త్రావి త్రేచిన'*** , ***'ద్రాక్షారసములు'*** వంటి నుడికారాలు శర్మగారి సూక్ష్మ దృష్టికి నిదర్శనాలుగా నిలుస్తాయి.

*''పరిహాసలీల''* కవితలో లక్ష్మీదేవిని ప్రార్థిస్తూ కవి చెప్పిన మాటలు నియమ నిబంధనాలకు తార్కాణం. ఇందులో శర్మగారి భావము, వస్తువు, రచనలు సంప్రదాయంగా ఉన్నాయి. **'పేరాస'** అనే పదం కవి ప్రతిభకు నిదర్శనంగా ఉంది. *'మునలివీణ'* కవితలో **'విశాల సౌధంబు', 'ఒడలు గంపించు'** పదాలను గొప్ప లౌకంగా ప్రయోగించారు.

రాళ్ళపల్లివారు *'ఆహ్వానము', 'విస్మృత వేణుగీతి', 'శమీపూజ', 'భారతికి సాధువాదము'* మొదలైన కవితల్ని పద్యాల్లో రాశారు. వీటిలో సంస్కృత పదాలు, తెలుగు పదాల మేళవింపుని చక్కగా కొనసాగించారు. భాష విషయంలో శర్మగారి తత్వం *'ప్రబంధకవి'* అనే కవితలో స్పష్టంగా తేటతెల్లమవుతుంది. పద్నాలుగు పాదాలు కలిగిన ఈ కవితలో ఈ రెండు పాదాలు చూడండి. .''***అర్థమేకాని పద్యములల్ల నేల? - వీధి వీధుల విను వారి వెదక నేల?/***

---

[2] మిరాబాయి. పుట. 19.

***అచ్చు తేటల కాసించు నట్టి మమ్ము – తాటి యాకుల కంతలో దార్ప గలవె?."*** [3] అంటూ సులభమైన తెలుగులో రచనలు ఉండాలని ఆకాంక్షించారు. శర్మగారు ఈ కవితను ప్రబంధ కవుల పద కాఠిన్యాన్ని విమర్శిస్తూ రచించారు. ఇందులో లలితమైన హాస్యం, వాడియైన వ్యంగం ప్రధానంగా కనబడుతాయి.

రాళ్ళపల్లి వారి కవితల్ని పరిశీలిస్తే, సంస్కృత, తెలుగు పదాల మేలు కలయికగా భాసమానం అవుతుంది. దేశీయమైన పదాలను ఉపయోగించటం, విషయ ఔచిత్యంగా కవితను అల్లడం, సంధులు, సమాసాలు, అలంకారాలు, నుడికారాలు, జాతీయాలు సందర్భానుసారంగా ప్రయోగించడం శర్మగారి పాండితీ గరిమకు నిదర్శనంగా కనబడతాయి.

## 6.4. అనువాదాలు

లభ్యమౌతున్న రాళ్ళపల్లివారి అనువాద రచనలు ఐదని ముందే తెలుపబడింది. అవి. 1. *అజవిలాపము* 2. *వేదాంత దేశికుని అభీతిస్తవము* 3. *శాలివాహన గాథాసప్తశతీ సారము* 4. *నృత్తరత్నావళి* 5. *సుందర పాండ్య విరచిత ఆర్యా.* రాళ్ళపల్లివారు ఈ రచనల్ని మూలానికి అనుగుణంగా తెలుగు చేయడానికి ప్రయత్నించారు. ఎక్కడా మూల భావాల్నీ, అర్థాల్నీ చెడనీయ కుండా సంయమనం పాటిస్తూ ముందుకు కొనసాగారు. ఉదాహరణకు వీరి '*శాలివాహన గాథాసప్తశతీ సారము*' అనువాదాన్ని సోదాహరణంగా రెండవ అధ్యాయంలో పరిశీలించడం జరిగింది. (పుటలు: 124–144). ఇక్కడ స్థూలంగా అర్థం చేసుకోవాల్సిన విషయాలేమిటంటే, రాళ్ళపల్లివారు అనువాదం ఆయా సమకాలీన సామాజిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఉంటుంది. ఈయన భాషలో ఎక్కడా వ్యర్థ పదాలు ఉండవు. రాళ్ళపల్లివారు '*గాథాసప్తశతి*' లో గాథల్ని రెండు పర్యాయాలుగా అనువదించారన్నది విదితమే. కాగా తొలిముద్రణలోని అనువాదిత గాథలు మలి ముద్రణలో కొన్ని మార్పులకు లోనయ్యాయి. వీటిని శర్మగారే స్వయంగా మార్చుకోవడం గమనార్హం. ఉదాహరణకు అలాంటి గాథల్లో కొన్నిటిని చూడండి.

తొలి ముద్రణ 1931 లో ప్రచురితమైన గాథ ఒకటి :

ఆ. *వంటయింటి పనుల నంటిన మసిచేయి*
*సోఁకియుండఁ జంద్ర సుందరముగ*
*నింపు గొల్పుచున్న యిల్లాలి మోమును*
***భర్త నవ్వుచున్న వాఁడు చూచి.*** ౭ (హాలుఁడు ౧–౧౪) శా. గా. స (పుట: 3)

మలి ముద్రణ 1964లో పై గాథలో చివరి పాదాన్ని ఎలా మార్చారు చేశారో చూడండి.

ఆ. *వంటయింటి పనులనంటిన మసిచేయి*
*సోఁకియుండఁ జంద్రసుందరముగ*
*నింపు గొలుపుచున్న యిల్లాలి మోమును*

[3] ఆంధ్ర పత్రిక ఉగాది సంచిక. 1922.

***నగుచునున్నవాఁడు మగఁడు చూచి.*** ౧౧(హాలుఁడు ౧–౧౪)

శా. గా. స (పుట: 3)

మరో గాథ చూడండి. (1931 )

ఆ. మలిన చిత్తుఁడైన మ**ఱఁ**దికి నిల్లాలు
గోడమీఁద వ్రాసికొన్న **యట్టి**
రామువెంటఁ దిరుగు సౌమిత్రి చరితంబు
చిన్న నవ్వుదోఁపఁ **జెప్పి చూపు**. ౨౦ (హాలుఁడు. ౧–౩౫) శా.గా. స (పుట:6)

మార్పులకు లోనైన గాథ (1964)

ఆ. మలిన చిత్తుఁడైన మ**ర**ఁదికి నిల్లాలు
చిన్ననవ్వు దోఁపఁ **జెప్పుచుండు**
రాముVెంటఁ దిరుగు సౌమిత్రి చరితంబు
గోడమీఁద వ్రాసికొన్న **దాని.** ౨™ (హాలుఁడు. ౧–౩౫) శా.గా. స (పుట: 7)

పై గాథల్లో మొదట చూసిన పద్యంలో కేవలం చివరి పాదాన్ని మార్చిన విధానం కనబడుతుంది. అదే రెండో ఉదాహరణగా పేర్కొన్న గాథలో రెండవపాదం చివరి పాదంగా, చివరిపాదం రెండవపాదంగా మార్పులు కావడం ప్రధానంగా గమనించవచ్చు. మొదటి పాదంలో **(ఱఁ)** ని (రఁ) గా మారిస్తే, రెండవపాంలోని **'యట్టి'** ని **'దాని'** గా రాశారు. అలాగే **'జెప్పి చూపు'** ని **జెప్పుచుండు** అని మలిచారు. రాళ్ళపల్లివారు భాష విషయంలో ఎన్నో జాగ్రత్తలు వహించారన్నది ఇక్కడ స్పష్టమౌతుంది. ఇలా 1931, 1964 ముద్రణల్ని ముందు పెట్టుకొని చూస్తే కొన్ని గాథలు రూపు మార్చుకొన్నట్లు మనకు తారసపడతాయి. నందూరి రామకృష్ణమాచార్య *'పుంభావ సరస్వతి'* అనే వ్యాసంలో శర్మగారి *'గాథా సప్తశతి'* ని పురస్కరించుకొని అన్నా మాటలు గమనార్హం. *''గాథల అలతి అలతి పలుకుబడులు శ్రీ రాళ్ళపల్లివారి వ్యక్తిత్వములో లీనమైనవే. వారు దీనిని అనువదించుట ఆంధ్రుల అదృష్టము.''*[4] ఈ విధంగా అల్పాక్షరాల్లో అనల్పార్థాలను పొదిగింపజేసిన రాళ్ళపల్లివారి ఈ అనువాదం ప్రత్యేకమైనదీ, విశిష్టమైనది. శర్మగారి ఆలోచన ఎప్పటికప్పుడు మార్పుల్ని ఆహ్వానించేలా ఉంటుందన్న సంగతి చెప్పుకోదగింది.

రాళ్ళపల్లివారికి తెలుగు భాషపై ఉన్న మమకారం ఈ మాటల ద్వారా వ్యక్తమవుతుంది. *''సంస్కృతభాషాసంప్రదాయమైన పరసవర్ణమును నే నిందు వాడ లేదు: అనాదిగా అట్టిచోట్ల నిండుసున్ననే వాడు పద్ధతి తెలుగువ్రాఁతలో పుట్టి నెలకొన్నది గనుక.''*[5]

[4] రాళ్ళపల్లి అభినందన సంచిక 1977. పుట. 32.

[5] సుందరపాండ్య విరచితా ఆర్యా . పుట. 7.

శర్మగారి 'ఆర్యా'లో సుమారు 150 పద్యాలున్నాయి. ఇవన్నీ అచ్చమైన దేశి పదాలతో నిర్మితమవ్వడం గమనార్హం. ఉదాహరణకు ఓ రెండు పద్యాలను పరిశీలించి చూస్తే, తెలుగు భాష అందాలు తేటతెల్లమౌతాయి.

మూలం : ***న తథా శశీ, న సలిలం,***
***న చందనరసో, న శీతలచ్ఛాయా,***
***ప్రహ్లాదయతి హి పురుషం***
***యథా మధురభాషిణీ వాణీ.*** (పద్యం: ౧౨, పుట: 12)

అనువాదం : **తే.** ***నిండు జాబిల్లి గాని, పన్నీరు గాని,***
***చందనము గాని, శీతలచ్ఛాయ గాని,***
***తియ్యఁగా నాడుమాటరీతిని జగాన***
***మదికి నింపులు గావుగా మానవునకు.***
(పద్యం: 12, పుట: 13)

సులభమైన పదాల పొందికతో ఉన్న ఈ పద్యాలన్నీ సహృదయ పాఠకులకు రసగుళికల్లాంటివే. ఈ పద్యాల్లో రాళ్ళపల్లివారు గొప్ప నీతిని చెప్పడమే కాకుండా భాషా మాధుర్యాన్ని లలితంగా చూపించారు.

ఉదాహరణకు మరో పద్యం చూడండి.

మూలం : ***మలినాశ్చేత్తేఽమలినాః***
***యేషాం హృదయాని నిత్యశుద్ధాని;***
***తేఽమలినా అపి మలినాః***
***యేషాం హృదయాని కలుషాణి.*** (పద్యం: ౩౯, పుట: 24)

అనువాదం : **ఆ.** ***మనసు తేట యెపుడు మయికొన్న వారెంత***
***మలినులై నఁ గాని మయిల గారు;***
***మనసు ముఱుగుచున్న మనుజులు పై కెంత***
***నిర్మలముగనున్న నిచ్చమైల.*** (పద్యం: 39, పుట: 25)

ఇలాంటి తేలికైన పద్యాలను అల్లడంలో రాళ్ళపల్లివారు చేయి తిరిగిన రచయితగా చెప్పవచ్చు. అనువాదం ఎంత కఠినంగా ఉన్నా దాన్ని బాగా అవగాహన చేసుకొని అందరికీ అర్థమయ్యే రీతిలో రాయటం రాళ్ళపల్లివారి పాండిత్యానికి తార్కాణంగా భావించవచ్చు.

అనంతకృష్ణశర్మగారు ప్రాచీనాంధ్ర కవిత్వ సంప్రదాయాన్నే అనుసరించినా సులభంగా బోధపడే సంస్కృత పదాల్నీ, ఇంపుసొంపులుగల నుడికారంతో కూడుకొన్న తెలుగు పదాల్నీ వాడి ఖండకావ్యాలూ, ముక్తక కవితలూ రాశారు. 20వ శతాబ్దపు రెండుమూడు

దశకాల రోజుల్లో రాళ్ళపల్లివారి భాషాశైలి నూతనమూ, అనుసరణీయమూ గానూ రూపొందింది.

## 6.5. రాళ్ళపల్లి గద్య రచన భాషాశైలి

రాళ్ళపల్లివారి భాషాశైలి పద్య రచనల్లో ఎంత మృదు మధురంగా ఫరిడవిల్లిందో చూశాం. ప్రస్తుతం గద్య రచనల్లో భాషాశైలి పరిణామాన్ని పరిశీలించడం వల్ల వీరి వచన రచనా ప్రత్యేకతను తెలుసుకోవచ్చు. రాళ్ళపల్లివారి వచన రచనపై సాళ్వ కృష్ణమూర్తి వ్యాసం రాస్తూ *''తెలుగును ఒడుపుతో తేటగా వ్రాయనేర్చిన కొద్దిమంది సిద్ధహస్తులలో శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారొకరు.''*[6] అని అభివర్ణించారు. ఈ విధంగా రాళ్ళపల్లివారి భాషాశైలి నూతనమైన దారిలో ప్రయాణించిందని పేర్కొనవచ్చు. దీన్ని సోదాహరణంగా పరిశీలిస్తే ఆయా అంశాలు స్పష్టంగా అవగతమౌతాయి.

ప్రధానంగా శర్మగారి వ్యాస రచన 1912 నుంచి 1977 వరకు నిర్విరామంగా కొనసాగింది. ఈ కాలాన్ని మూడు భాగాలుగా విభజించుకొని చూస్తే, వీరి భాషా పరిణామం స్పష్టంగా బోధపడే అవకాశం ఉంది. ఆ విభాగాల్ని ఈ కింది విధంగా చేసుకోవచ్చు.

| | |
|---|---|
| **ప్రథమ దశ** | 1912 నుండి 1917 |
| **ద్వితియ దశ** | 1918 నుండి 1950 |
| **తృతియ దశ** | 1951 నుండి 1977 |

### 6.5.1. 1912 నుండి 1917 వరకు రాళ్ళపల్లి భాష

రాళ్ళపల్లివారి భాష 1912 నుండి 1917 వరకు గ్రాంథిక శైలిలోనే అడుగులు వేసింది. దీనికి కొన్ని కారణాలను ఊహించవచ్చు. అప్పటికి ఈయన సంస్కృత, ప్రాకృత రచనల్ని బాగా చదువుకోవటం, ప్రఖ్యాత గురువుల వద్ద శిష్యరికం చేయటం, ఆనాటికి ఉన్న తెలుగు సాహిత్య ధోరణి, కట్టమంచి వారి సాహచర్యం, , కాగా వీరి పద్య రచనల అనుసరణ లాంటివన్నీ వీరి భాషాశైలిపై ప్రభావం చూపాయనవచ్చు. రెడ్డిగారి భాషా ప్రభావం శర్మగారిపై ఎలా పడిందో నాల్గవ అధ్యాయంలో సోదాహరింపబడింది. (పుటలు: 313)

శర్మగారి వ్యాసాల్లో లభ్యమౌతున్న తొలి వ్యాసం 'కవిత'. ఇది 1912లో *'ఆంధ్ర పత్రిక'* పరిధావీ సంవత్సరం ఏప్రిల్ 10న ప్రచురితమైంది. దీంట్లో రాళ్ళపల్లివారు 'కవిత' రాయడానికి గల నియమాలను చాలా చక్కగా తెలిపారు. కానీ భాష గ్రాంథికశైలిలో ఉంది. ఉదాహరణకు కొన్ని వాక్యాలిలా. *''సాధారణముగ నెట్టి వారికిని గవితఁజెప్పవలయునని యాశ యుండును. పల్లెటూళ్లలోనుండు కాఁపువాండ్రు సైతము దాము మోటఁగొట్టునపుడును దున్నునపుడును బాడుటకే పదము లల్లవలయునని ప్రయత్నపడుచుందురు. ఇఁక నొకటిరెండక్షరములు వచ్చినవారిఁజెప్పవలయునా? అట్టి మోటువారు రచించునదియుఁ బండితులు*

---

[6] భారతి మాసపత్రిక 1959 ఆగస్టు సంచిక. పుట. 34.

*రచించునదియుఁ కవితయేనా? కాకున్నఁ గవిత యన నెట్టిది?''*[7] ఇక్కడ అరసున్నలతో, పద్య నడక లాగా వాక్య నిర్మాణం కొనసాగింది. అంటే పూర్తిగా శర్మగారు గ్రాంథిక భాషాశైలిలోనే రాశారనేది అర్థమౌతుంది.

1915 – 1916 మధ్యకాలంలో రాళ్ళపల్లివారు రాసిన వ్యాసం *'ఆంధ్రవాఙ్మయమున నాచన సోమనాథున కీయఁదగిన స్థానము.'* దీంట్లో వీరి వచనశైలిని గమనించండి. *''విషయ మాంధ్రులకుఁ గాకపోయినను నాకుఁ గ్రొత్తది. అదియు విమర్శనమాత్రసాధ్యము. విమర్శనీయుఁడు మహాకవి. విమర్శనమార్గమును బలుపోకలఁ బోవునది. సర్వసమ్మతముగా విమర్శింపఁజాలుట యొకని తలలో వ్రాయఁబడిన యదృష్టముగాదు; అందును నాయట్టి యవిమర్శకునకు – అట్లైనను నిందుఁ జేయివేయుటకుఁ గారణ ''మీ నెపమునన్నైనఁ గొంతవఱకుఁ బ్రాచీనగ్రంథసౌందర్య మనుభూతము గాఁగల'' దను నాశయ.''*[8] ఇక్కడ కూడా శర్మగారి భాష అరసున్నలూ, శకటరేఫలతో నడిచింది. ఇదే వ్యాసంలోనే **'ఇంతేకాదు'** నే దాన్ని **'ఇంతియ కాదు'** (పుటలు: 39, 40, 50, 54, 56) అని అంటారు. సుదీర్ఘమైన ఈ వ్యాసం ఆద్యంతం ప్రాచీన భాషాశైలిలోనే సాగిందనవచ్చు.

1917లో శర్మగారు *'వేమన పద్యములు'* గ్రంథానికి పీఠికలో *''వేమన యిజాతికిఁ జేరిన కవి. ఇతని కాలమును గూర్చి మన కేమియు నాధారము లభింపదు. శాసనాద్యాధారములఁ బ్రతిష్ఠించు రాజుల నాశ్రయించి జీవించుచుండిన ప్రబంధపురాణకవులే యనేకులు నేఁటి కింకను నేకాలమునకును జేరకయుండగా, ఈ ప్రపంచమందే జిహాస గలిగి నిరపేక్షుఁడై సిద్ధుఁడైన వేమనవంటివాని కవనమున నాతనికాలము నిర్ణయించుటకు దగిన యాధారము లుండు నని యాశించుట నిరర్థకము, మఱియుఁ గొంత వ్యాప్తిని సంపాదించిన ప్రాచీన పురుషుల విషయమున లేనిపోని కథలను దమకును దెలియకయే యల్లుట జనసామాన్యస్వభావము గావున నట్టి వేమ ననుగూర్చి వాడుకలోనున్న యట్టి కథలన్నియుఁ బ్రకృతవిమర్శ కాధారములని భావించుట యుక్తము కాదు.''*[9] అని పొడవాటి వాక్యాల్లో విషయాన్ని ఆవిష్కరించారు. ఇక్కడ కూడా వీరి భాషాశైలి మునుపటిలాగానే అడుగులు వేస్తూ వెళ్ళింది.

పై ఉదాహరణలు చదివిన తర్వాత ఆదిలో రాళ్ళపల్లివారి భాషాశైలి గ్రాంథికంలోనే నడిచిందని నిర్ధారణ అవుతుంది. కానీ శర్మగారు చక్కని నేర్పుతో, సారళ్యంతో, తేటతనంతో విషయ సంగ్రహాన్ని చెప్పిన తీరు ఆకట్టుకోక పోదు. ఈయన విషయాన్ని ఎంతో గొప్పగా, ఆసక్తికరంగా, నిర్మాణాత్మకంగా వ్యక్తం చేస్తారనేది దాని లోతులకు వెళితే తప్ప తెలుసుకోలేం. ఈ నాటి విద్యార్థులు ఈ వ్యాసాలను చదవటానికి కొంచెం ఇబ్బంది పడితే పడవచ్చు. కానీ, ఇది సహృదయ పాఠకుల ఆత్మకు ఇంపైన భోజనమేనని చెప్పవచ్చు.

---

[7] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 27.

[8] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 35.

[9] రాళ్ళపల్లి పీఠికలు. పుట. 2.

## 6.5.2. 1918 నుండి 1950 మధ్య కాలంలో భాషాశైలి

రాళ్ళపల్లివారి రచనల్లో 'వేమన' (1929), 'నాటకోపన్యాసములు' (1935) ''సారస్వతాలోకము'' (1954) అప్పటికే తెలుగు సాహిత్య విమర్శలో గొప్ప పేరు ప్రఖ్యాతులు గడించాయి. వీటివల్ల రాళ్ళపల్లివారి విద్వత్తు దశదిశలా వ్యాపించింది.

1929 లో ప్రచురితమైన 'వేమన' గ్రంథంలో తొలి వ్యాసం – ఉపోద్ఘాతము. ఇందులో రాళ్ళపల్లివారి భాషాశైలి నిర్మాణం చూడండి. ''*వేమన ఆంధ్రులలో సాటిలేని వ్యక్తి. అతీంద్రియములైన తత్త్వములను దెలిసికొనవలెనను నాశ, వాని ననుభవ పూర్వకముగా సాధించు సాహసము, తనకుఁ దెలిసిన వానిని నిర్భయముగా ప్రపంచమునకు బోధించు ధైర్యము, దానికి సాధనమై యిరుప్రక్కలందును మఱుఁగులేని మంచిపదనుగల చురకత్తివంటి కవితాశక్తి, దానికి మెఱుఁగిచ్చునట్టి సంకేతదూషితము కాని ప్రపంచ వ్యవహారములందలి సూక్ష్మదృష్టి, గాయపుమందు కత్తికేపూసి కొట్టినట్లు తిట్టుచునే నవ్వించు 'హాస్యకుశలత' – ఇవన్నియు వేమన్నను సృష్టి చేయునప్పుడు బ్రహ్మదేవుఁడుపయోగించిన మూలద్రవ్యములు.*'' [10] ఇక్కడ భాష కొంత సరళమైనదిగా తోస్తుంది. ''**వేమన** *చదువుతుంటే కేవలం ఒక విమర్శ గ్రంథం చదివినట్లుగా పాఠకుడు అనుభూతి చెందడు. ఓ కావ్యం చదివినప్పుడు కలిగే ఆనందం అనుభవిస్తాడు.*''[11] అని కొలసాని సాంబశివరావు అన్న మాటలు అక్షర సత్యాలు.

1935లో రాళ్ళపల్లివారి 'నాటకోసన్యాసములు' గ్రంథం వెలువడింది. దీంట్లో రెండో వ్యాసం ముగింపు వాక్యాల్లో భాషాశైలిని గమనిద్దాం. ''*ఆంధ్రవాఙ్మయము పాశ్చాత్యసాహిత్య సంపర్కముతో క్రొత్తక్రొత్త తెరువులఁ దిరుగుట కుపక్రమించిన కాలమున ఆ భాషలో లేని నాటకరచనకై, ఆ కాలమున బహిష్కృతమగు అభినయవిద్యకై తమశక్తియుక్తులనెల్ల నాజీవము ధారపోసిన కార్యశూరులు వీరిద్దఱు. వారు శక్తికొలఁది, అనుకూలముకొలఁది, అవకాశముకొలఁది తయారుచేసి కట్టియిచ్చిన సద్ది చాలునా చాలదా యని చూచుకొనవలసినది వారి మార్గమున ముందుకు నడవఁగోరువా రందఱు చేయవలసిన పని. నేను నాటకకర్తనుగాని, అభినేతనుగాని ఇదివఱకును గాకున్నను రెంటియందును కొంత యనురాగము గల వాఁడనుగాన, ఇప్పుడు నేఁ జేయఁ బ్రయత్నించిన దదే, కాని యిది వట్టి పై పరామరిక. లోఁతుకు దిగి చూడవలసినది, చేయవలసినది కొండంత కలదు. నాకన్న శక్తియు, అవకాశమును, అనుకూలమును గలవా రా పని కధికారులు.*''[12] ఇక్కడ శైలి పెద్ద పెద్ద వాక్యాల్లో నడిచినప్పటికీ పాఠకుణ్ణి కట్టిపడేసేలా ఉంది. పైగా ఆలోచింపజేస్తుంది కూడా.

'సారస్వతాలోకము' 1954లో ప్రచురితమైనప్పటికీ ఇందులోని వ్యాసాలన్నీ 1950 లోపు రాసినవే అన్నది గమనార్హం. కొంతకాలానికీ 'రాయల నాటి రసికత', 'రాయలవైదుష్యము', 'నిగమశర్మఅక్క', 'తిక్కన్న తీర్చిన సీతమ్మ' మొదలైన వ్యాసాల్నీ

---

[10] వేమన . పుట. 3.

[11] శత వసంత సాహితీ మంజీరాలు. పుట. 512.

[12] నాటకోపన్యాసములు. పుట. 78.

పాఠ్యగ్రంథాల్లో కూడా చేర్చడం జరిగింది. ఎంతో మంది విద్యార్థులు ఆనాడు ఈ వ్యాసాల్ని ధారణ చేయడం మొదలు పెట్టారు. దీంతో శర్మగారి వచనం విశేషంగా ప్రచారంలోకి వచ్చింది. ఉదాహరణకు 'తిక్కన్న తీర్చిన సీతమ్మ' వ్యాసంలో శైలిని చదవండి. *''ఒక విధంగ చూస్తే తిక్కన్న గారి రచనలలో పాత్రపోషణమనే కావ్యధర్మాన్ని విమర్శించడం న్యాయం కాదనిపించును. ఎందుకంటే; ఆయన రచించిన ఉత్తర రామాయణం, భారతం రెండూ ఎరువు సొత్తులే. అందలి పాత్రలన్నీ వాల్మీకి వ్యాసుల కైవాడపు తీర్పులు; ఒక్కటైనా తిక్కన్న క్రొత్తగా సృష్టి చేయలేదు. వాటిలోని కథా సందర్భాలూ అట్టివే. అందులో ఆదేశాగమలోపాలేమైనా ఉంటే తిక్కన్నకు దొరికిన గ్రంథ పాఠమట్టిదనే మనమూహించుకోవలెను. రామాయణం ఉత్తర కాండలో, ముఖ్యంగా భారతంలో సర్వత్రా పాఠ భేదాలకు మితీ మేరా లేదన్నది సుప్రసిద్ధ విషయం.''*[13] ఇక్కడ ప్రధానంగా వాక్యాల్నీ చిన్నవిగా రాయడం కనిపిస్తుంది. భాష కూడా సరళతవైపు అడుగులు వేయటం గమనించవచ్చు. ఈ 'సారస్వతాలోకము' లోని భాషాశైలిని పురస్కరించుకొని నిడుదవోలు వేంకటరావు చెప్పిన మాటలు వారి నుండే వినాలి. *'' శర్మగారి వ్యాసశైలి సజీవమైనది. మనసుమీద ముద్ర వడునట్లు చెప్పగల శక్తి దానికి గలదు. వాక్యములు చిన్నవియై పటుత్వము గలవి. భావబంధుర మైనవి. సరసమగు హాస్యముతో జాతీయతను ప్రకటించునవి. 'సారస్వతాలోకము'న ప్రకాశితమైన వీరి వ్యాసములలో ననుకరణమునకు నలవీయని రచనాశిల్పము గలదు. కావుననే శ్రీ శర్మగారు వ్యాసరచయితలలో ప్రత్యేకవ్యక్తిత్వముగల మనీషి.''*[14]

రాళ్ళపల్లివారు వ్యాసం రాయడానికి ఎన్నుకొనే అంశాలు అందరికీ ఆసక్తిని కలిగిస్తాయి. పైగా వ్యాసాన్ని రమణీయంగా, తులనాత్మకంగా, విషయగతంగా రూపొందించే విజ్ఞత వీరికి కలదు. రాసేవి ప్రాచీన సాహిత్య అంశాలైనప్పటికీ ఆధునికతకు బాటలై ఉండేవి. వీరి ఎన్నో వ్యాసాలు సామాజికాంశాలను ప్రస్ఫుటింపజేసిన కళాఖండాలు. ఇవి గొప్ప సాహిత్య నిర్మాణానికి, సమాజ మనుగడకు చేయుతనిస్తాయి. ఇలా అనేక ప్రత్యేకతలతో సంప్రదాయబద్ధంగా శర్మగారి వ్యాసం రూపొందటంతో క్రమక్రమంగా వాటికి పాఠకుల ఆదరణ విశేషంగా పెరిగింది.

## 6.5.3. 1951 నుండి 1977 మధ్య కాలంలో భాషాశైలి

శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ ఈ మధ్య కాలంలో సుమారు ఎనిమిది సాహిత్య వ్యాసాలూ, నాలుగు సంగీత వ్యాసాలూ, అరవై మూడు పీఠికలు రాశారు. ఇక్కడ శర్మగారి భాషాశైలి వ్యావహారికంగానే ప్రవర్ధిల్లిందనవచ్చు. ఉదాహరణకు కొన్ని వ్యాసాల్లోని శైలిని చూద్దాం.

---

[13] సారస్వతాలోకము. పుట. 118.

[14] ఆంధ్ర వచన వాఙ్మయము. పుట. 166.

తొలుత *'అనువైన సంగీతం – పూజాసమయాల్లో'* (1953) అనే వ్యాసంలోని కొన్ని వాక్యాల్ని చూడండి. *''మానవజాతి హృదయాన్ని వద్దన్నా వచ్చి మీదపడి ఆక్రమించుకొనే తత్వం భక్తి. మనకంటే గొప్పవారిని చూచినప్పుడు వారి అసాధారణశక్తులకు మనమాశ్చర్యపడక తప్పదు! భయపడక తప్పదు. ఈ భయ విస్మయాలే భక్తిగా పరిణమించేవి. భగవంతుని అనంతమహిమను భావించినవారెవరుగాని భక్తులుగా మారక తప్పదుగదా. ఆ భక్తి తొమ్మిది విధాలుగా ప్రాచీనులు విభజించినారు.''*[15] ఈ వాక్య నిర్మాణంలో ఎక్కడ కూడా అరసున్నలుగాని, శకటరేఫలుగాని లేవు పైగా చిన్న చిన్న వాక్యాలు విషయాన్ని చెబుతూ పోతున్నట్లు కొనసాగింది. ఆదిలో *'ఆంధ్రవాఙ్మయమున నాచన సోమనాథున కీయఁదగిన స్థానము.'* వ్యాసంలో **'ఇంతే కాదు'** అనే దాన్ని **'ఇంతియ కాదు'** గా ప్రయోగించారని చూశాం కదా. ఈ వ్యాసంలో **'ఇంతియ కాదు'** కాస్త **'ఇంతేకాదు'** గా (పుటలు: 13, 14) మారింది.

మరొక సాహిత్య వ్యాసమైన *'నృసింహ పురాణ పాఠశోధన'* (1969 సౌమ్య ఉగాది సంచిక) లో భాషాశైలిని చూడండి; *''ఎఱ్ఱన నృసింహపురాణము కాళిదాసుని కుమార సంభవము వంటిది. ఆయన హరివంశము అతని రఘువంశమునకు సాటి. హరివంశము రఘువంశము వలె వేరు వేరు కథల సంపుటి. నృసింహపురాణము కుమారసంభవము వలె అనుస్యూతమైన ఒక కథ గల తీర్పు. హరివంశమను ప్రాతపేరే నిలిపి రఘువంశముతో నామసామ్యమును గూడ సాధించినవాడు ఎఱ్ఱన. మరి కుమార సంభవమువలె నృసింహసంభవమని పేరు పెట్టక తన గ్రంథమునకు 'లక్ష్మీనరసింహావతారము' అని నామకరణము చేసినాడు;''*[16] అలా తేలికైన వచనంలో భాష మునుముందుకు వెళ్ళుతోంది.

ముందు పేర్కొన్నట్లు శర్మగారు 1950 నుండి 1977 వరకు విరివిగా పీఠికలు రాశారు. ఉదాహరణకు 1965 లో *'సమగ్రాంధ్ర సాహిత్యం'* (సంపుటం 8) పీఠికలో భాష ఎంత చక్కగా ఉందన్నది తిలకించండి *''శ్రీ ఆరుద్రగారి యీ 'సమగ్రాంధ్ర సాహిత్యం' అపూర్వమైన, అసాధారణమైన రచన. ప్రయత్నం గొప్పదా, ఫలసిద్ధి గొప్పదా అని ఆశ్చర్యపడవలసిన పెద్ద పనితనం.*

*మరి విశేషమేమంటే, ఇప్పటి మునిసిపల్ పార్కులవంటి 'దేశి' వాఙ్మయవీధులలో స్వచ్ఛందగా ఈదులాడుతావుండిన ఆరుద్రగారు ఉన్నదున్నట్లు ఈ 'మార్గ' కావ్యమహాటవిలో ముండ్లనక, రాళ్ళనక పరిశోధనకు దిగి, పెడమొగం పెట్టకుండా ధీరంగా, దీర్ఘంగా ప్రయత్నం సాగిస్తా వుండేది! ఈ సాహసకార్యంలో వారికి అప్పుడప్పుడు తమ ఆధునిక రచనా లీలలు విశాంతిస్థానాలుగా మాత్రం ఉపకరించిందేమో అనిపిస్తుంది. సద్దు లేకుండా ఎన్నేండ్లుగానో ఈ పరిశోధన ప్రయాస సాగుతా వుండవలెను. లేకపోతే ఈ సిద్ధి ఇంత సార్వభౌమంగా రూపొందదు.''*[17] ఇందులో శర్మగారు రాసిన ఏ వాక్యాన్ని గాని, పదాన్ని గాని తీసివేసే పరిస్థితి

---

[15] సంస్కృతి 1953 జూలై. పుట. 13.
[16] రాళ్ళపల్లి సాహిత్ సంగీత వ్యాసాలు. పుట. 237.
[17] రాళ్ళపల్లి పీఠికలు. పుట: 311.

కనబడదు. చెప్పే విషయాన్ని చాలా సంయమనంతో, తార్కికంగా, ఖచ్చితత్వంతో, లౌక్యంతో చెప్పటం వీరికి మొదటి నుండి ఉన్న అలవాటు. శర్మగారు గోరంతలు కొండతలు చేసి, కొండంతలు గోరంతలు చేసి చెప్పినట్లు ఎక్కడా కనిపించదు. తనకు తెలిసినంత వరకు ఆయా ఆధారాల్ని బట్టి అభిప్రాయాలు వెల్లడించడం వీరి సిద్ధాంతం. ఒక వేళ తను తప్పులు చేస్తే వాటిని సరిదిద్దుకోవడానికి కూడా సిద్ధంగా ఉండటాన్ని పలు సందర్భాల్లో చెప్పినట్లు గమనార్హమే. ఇలా రాళ్ళపల్లివారు ప్రతి దాన్ని దార్శనికంగా ఆలోచించే గుణం కలిగివారని తెలుస్తుంది.

1973లో తూమాటి దొణప్ప రాసిన *'జానపద కళా సంపద'* పీఠికలో శర్మగారు తెలుగు దేశంలో రాయలసీమ, తెలంగాణా, కోస్తాంధ్ర అని ప్రత్యేకత ఏమి ఉండదు. అందరూ ఒకటేనన్న భావాన్ని వ్యక్తం చేశారు. అలాగే అది ప్రామాణికం, ఇది ప్రామాణికం అనడం కూడా తగదు. ఎవరి యాసల్లో వారు తమ బాధను, సంతోషాన్ని ఇలా దేన్నైనా స్వేచ్ఛగా రాయగలిగే రోజులు రావాలన్నారు. అంటే రాళ్ళపల్లివారి భాష తొలుత గ్రాంథికంలో ఉండేది. తర్వాత సరళ గ్రాంథికం అయ్యింది. ఆ తర్వాత వ్యావహారికం అయ్యింది. వెరసి మాండలికతవైపు పయనించిదని ఈ పీఠికలో చెప్పిన అభిప్రాయాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఉదాహరణకు ఇందులోని భాషాశైలి ఇలా.''*నేటి రాయలసీమ తెలుగు అట్లాంటి అపభ్రంశాల్లో ఒక స్థూలరూపం తెలంగాణాది ఇంకొకటి. కృష్ణా గోదావరి సీమది మూడవది. ఆంధ్రదేశం రాజుల– మంత్రుల యాజమాన్యంలో ఈ మూడు వప్పులుగా నిలబడినందు కంటే ముందే యెంతో అనాదిగా ఈ అపభ్రంశాలు పుట్టి పెరుగుతానేవున్నవి. వాటిలో మూడవది మాత్రం వ్యావహారిక మనే నామకరణ సంస్కారం పొంది, ఇంతా 'శిష్ట వ్యావహారిక' మనే మడిగట్టు కొని, రాష్ట్రం మూడు మూలలకా ప్రాకి అల్లుకొంటా అధికారం చెలాయిస్తా వుంది. తెగువకూ చొరవకూ పేరుపొందిన తూర్పువారి అపభ్రంశం పక్కలో మలకసీమ భాష గూడా అక్కడక్కడ కొంత తల యెత్తుకుని తిరిగి ప్రయత్నం చేస్తావుండేది గమనించవచ్చును.*''[18] ఇక్కడ వీరి భాష వ్యవహారికమైందన్న సంగతి సరేసరే. కాని రాసే భాషపై తాను తెలిపిన అంశాలు ఎంతో దార్శనికమూ, ఆదర్శనీయము కూడా అన్నదాన్ని మరువరాదు.

రాళ్ళపల్లివారు 1979 మార్చి 11న కీర్తశేషులయినప్పటికీ రచనా వ్యాసంగం మాత్రం 1977 వరకే సాగినట్లు కొన్ని ఆధారాలను బట్టి తెలుస్తుంది. ఇదే యేట జనవరి రెండున లంకా కృష్ణమూర్తి *'త్యాగశిల్పము'* నకు రాసిన చివరి పీఠికలో కొన్ని వాక్యాలిలా ''*ఇప్పుడు శ్రీ కృష్ణమూర్తిగారు తన యీకావ్యమును అద్యంతము విశ్వాసముతో వినిపించి, ఆ క్షేత్రమును ఆధ్యాత్మికముగా నాకు దర్శింపజేసినారు. నాచర్మదృష్టికి మసకు మసకుగా అంటుకొనియున్న రూపమును అంతశ్చక్షువున చిక్కగా అచ్చుగొట్టినారు.*''[19] ఇలా వీరి రచనా వ్యాసంగం ఆబాల గోపాలం ఆమోదయోగ్యమైందిగా ముగిసిందని చెప్పవచ్చు.

[18] రాళ్ళపల్లి పీఠికలు. పుట. 328.

[19] రాళ్ళపల్లి పీఠికలు. పుట. 250.

రాళ్ళపల్లివారి వచనాన్ని పుట్టపర్తి నారాయణాచార్యులు ఇలా అభివర్ణించటం ముదావహం. *"నా గద్యమునకు రూపురేకలు దిద్దినది వారి వచన రచన – చిన్న చిన్న వాక్యములు; సంస్కృతాడంబరము లేని పదములు; అందమైన యంత్య ప్రాసలు; అక్కడక్కడ వేమన్న వంటి యతులు; లలితమైన హాస్యము ; రసానుబంధి చమత్కారము; నిశితమైన దృష్టి, భావములలో స్పష్టత, మితి యొఱిఁగి భాషించుట యివి వారి రచనలోని ప్రధాన లక్షణములు."* [20]

పై విధంగా రాళ్ళపల్లివారి భాష గ్రాంథికం నుండి సరళ గ్రాంథికానికి తదుపరి వ్యావహారికానికి అంచలంచెలుగా మార్పు చెందుతూ వచ్చింది. దీన్ని బట్టి శర్మగారు మారుతున్న సమాజానికి అనుగుణంగా తమ భాషను మార్చుకోవడంలో కృతకృత్యులయ్యారు. ఈయన మడిగట్టుకొని తానెప్పుడూ ఇలానే ఉంటానూ, లేదా ఇట్లాగే రాస్తానని భీష్మించలేదు. కాగా ఎటువంటి వాగ్దానాల్లాంటివి చేయకుండా తన అభిరుచి మేరకు ముందుకు వెళ్ళిన మృదు శీలి రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ. ఈ సందర్భంగా రాళ్ళపల్లివారిని ప్రాచీనతలోనే ఆధునికతకు మార్గం వేసిన ఋషితుల్యులని అభివర్ణించుకోవచ్చు.

## 6.6. రాళ్ళపల్లి భాషాశైలి హాస్యం – వ్యంగ్య వైఖరి

రాళ్ళపల్లివారి భాషాశైలిలో లలితమైన హాస్యం, వాడియైన వ్యంగ్యం ప్రముఖ స్థానాన్ని వహించాయి. సాధారణంగా హాస్యం మనిషికి ఆనందాన్ని కలిగిస్తుంది. అదే వ్యంగ్యమైతే కొంచం బాధను, కోపాన్ని వెరసి విజ్ఞానాన్వేషణకు అవకాశమిస్తుంది. ఈ రెండిటి వల్ల మనిషికి మానసిక వికాసం అబ్బుతుంది. ఈ విధానం వేమన సాహిత్యంలో బాగా కనబడుతుంది. వేమనపై లోతైన పరిశోధన చేసిన రాళ్ళపల్లివారికి ఆ దృక్పథం కొద్ది వరకు అలవడిందనవచ్చు. మానవజీవితంపై లోతైన అవగాహన కలిగిన శర్మగారు ఆయా విషయాల్ని చాలా ఓర్పునేర్పులతో ఒడిసిపట్టారు. రాళ్ళపల్లివారు పద్యం చెప్పినా, గద్యం రాసినా సందర్భాన్ని బట్టి చమక్కులూ, చురుక్కులు వేయక ఉండరు. కాగా శర్మగారు వేసే ఈ చమక్కులూ, చరుక్కులు అభివృద్ధికి బాటలు వేసేవై ఉంటాయి. ఇలాంటివి రాళ్ళపల్లివారి సాహిత్య కృషిలో ఎన్నో ఉన్నాయి. వాటిని అర్థం చేసుకోవడానికి లోతైన అధ్యయనం అవసరం.

శర్మగారు కుంటిమద్దీ శేషశర్మకు రాసిన ఒక లేఖలో చమత్కారాన్ని ఎలా పండించారన్నది గమనించండి. *"ఈ దినము నా 'సప్తశతి' ప్రతి యొకటి మీకు పంపినాను. ఈ గజ గర్భము ఇంత కాలానికి ఈ శశప్రసవమును సాధించినది. ఏవో కొన్ని మార్పులు చేర్పులు చేసినాను. ఐనా 'ఆత్మన్య ప్రత్యయం చేతః' తప్పదు గదా."* [21] అని ముగించారు. ఇక్కడ **'గజగర్భం', 'శశప్రసవం'** లాంటి మాటలు శర్మగారి పాండిత్యానికీ, చమత్కారానికీ నిదర్శనంగా ఉన్నాయి.

[20] రాళ్ళపల్లి అభినందన సంచిక 1977. పుట. 17.

[21] అనంతరాగం. పుట. 235.

*'రంగనాథ రామాయణము'* విషయంలో శర్మగారు సులోచనా వృత్తాంతం గురించి మాట్లాడుతూ...*''సులోచన వారి మనస్సులను చాలనాకర్షించినది. ఎవరి నాకర్షింపదు? మునీశ్వరులదైనను, ముసలి యవ్వల దైనను ఆ సృష్టి ముద్దబంగారు వంటిది.''*[22] అని హాస్యాన్ని పండించారు.

రాళ్ళపల్లివారు వ్యంగ్య బాణాలు వేయడంలో సిద్ధహస్తులని తెలిసిందే. ఉదాహరణకు బాడాల రామయ్యగారి డి.లిట్., సిద్ధాంత గ్రంథం *'బసవేశ్వరుని వచనాలు – సమగ్ర పరిశీలన'* శర్మగారు 'మంగళాశంస' పేరుతో పీఠిక రాశారు. అందులోని ఈ కొన్ని పంక్తులు రాళ్ళపల్లివారి విమర్శనా కౌశలానికీ, వ్యంగ్య వైభవానికి, పరిహాస కుశలతకు చక్కని నిదర్శనాలు. ఆ మాటలు చదవండి. *''విస్తర భీతి కానీ, పునరుక్తి సంకోచము కానీ, ఏ మాత్రము లెక్క పెట్టక విషయవైశద్యమే ప్రధానముగా 'యన్నే హాస్తి నతత్ క్వచిత్' అను సంస్కృతోక్తికి ఆంధ్రమున నా ఎరుకలో ఇది ప్రథమోదాహరణము.''*[23]

ఇలాంటిదే మరోకటి చూడండి *''శ్రీ వేంకటరావుగారి గ్రంథవ్యాసంగము విశాలమైనది; వ్యవసాయము విసుగులేనిది. దాని ఫలము పూర్ణముగా ఆంధ్రసాహిత్యమునకు లభించుటకై వారు తమ యభిప్రాయములును, రాద్ధాంతములను కొంత ఆత్రపడక నెమరువేసుకొని వెలువరుచుట కావలసియున్నది.''*[24] అని *'నన్ను గురించిన నిడుదవోలువారి చెనకు'* (భారతి, నవంబరు, 1969) వ్యాసంలో అన్నారు. ఇలాంటి అభిప్రాయాలను కట్టమంచి వారి అభిప్రాయాలతో విభేదించినప్పుడు కూడా శర్మగారు వెల్లడించారు.

*''ఆయన వచనమొకసారి చదివిన వాడు – పలుమారులు చదవక యుండలేడు. దాని యాకృతిపాదాది కేశపర్యంతము రమణీయమైన యొక సుందరి.''*[25] అని పుట్టపర్తి నారాయణాచార్యులు అభిప్రాయపడ్డారు.

ఈ విధంగా రాళ్ళపల్లివారు హాస్య, వ్యంగ్యాలను సమర్ధవంతంగా ముందుకు నడిపారు.

రాళ్ళపల్లివారి భాషాశైలి గురించి . ఆర్. వి.యస్. సుందరం, డి. చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన అభిప్రాయాలు పరిశీలించవలసినవి. దీని కోసం సిద్ధాంత గ్రంథం లోని (వివిధ రచయితలతో ఇంటర్వ్యూలు) ప్రశ్నావళి: 1,2, లోని ప్రశ్న, 4, 4 లను చూడు (అనుబంధం 1)

## 6.7. రాళ్ళపల్లివారి భాషలో అన్యదేశ్య పదాలు

రాళ్ళపల్లివారి భాషలో అక్కడక్కడ ఉర్దూ, ఇంగ్లీష్, కన్నడం, హింది మొదలైన అన్యదేశ్య పదాలు కనబడుతున్నాయి. ఉదహారణకు

---

[22] సారస్వతాలోకము. పుట. 75.

[23] బసవేశ్వరుని వచనములు సమగ్ర పరిశీలన – పీఠిక (14-6-1976)

[24] రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు. పుట. 262.

[25] రాళ్ళపల్లి అభినందన సంచిక 1977. పుట. 17.

1. తకరారు (ఉర్దూ పదం) (పేచి, గొడవ, వివాదం అనే నిఘంటు అర్థాలున్నాయి) 'సారస్వతాలోకము' రాయలనాటి రసికత (పుట: 6)
2. సప్లై (ఇంగ్లీష్) (సరఫరా, అందజేయుట) 'సారస్వతాలోకము' రాయలనాటి రసికత (పుట: 18)
3. సర్టిఫికేటు (ఇంగ్లీష్) (రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు పుట: 284)
4. తోడావేయువారు (రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు పుట: 284) లో 'తోడా' అనేది హిందీ పదం. దీనికి అర్థం (స్వర్ణకంకణం)
5. దొడ్డ సామ్రాజ్యము అనే పదంలో 'దొడ్డ' అంటే అర్థం పెద్ద. ఇది కన్నడ పదం. (రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు పుట: 110)

ఈ విధంగా రాళ్ళపల్లి వారు సందర్భాన్ని బట్టి భాషలో విశిష్టమైన పదాలు ప్రయోగించి గొప్ప చమత్కారాన్ని కల్పింపజేశారు. అవకాశమున్న చోటల్లా ఇలాంటి భాషా ప్రయోగాలను రాళ్ళపల్లి వారు ఉపయోగించారు.

రాళ్ళపల్లి వారి భాషాశైలి గురించి యు. ఎ. నరసింహమూర్తి ఇలా అన్నారు. "*ఆయన వాక్కు ఆయన అక్షరము – రెండూ ఉదాత్తత అనే రెమ్మకు పూచిన జంట పూవులు, వాటికి శాశ్వత వికాసమే కానీ వాడిపోవడం అంటూ ఉండదు.*"[26]

## 6.8. రాళ్ళపల్లి వారి భాషలో నూతన పదాల సృష్టి

రాళ్ళపల్లి వారు తమ రచనల నేపథ్యంలో కొన్ని నూతన పదాలను కూడా సృష్టించారు. వీటిని దాదాపు శర్మగారు ఆయా గ్రంథాలకు రాసిన పీఠికల్లోనే ఎక్కువ రాశారు. వాటిని ఈ కింద పరిశీలిద్దాం.

**1.0.1.1.** జమిలి పదాలు (Rrduplicated words) (రా. పీ. తాళ్ళపాక వారి పలుకు బళ్ళు, పుట: 371)

**1.0.1.2.** బిత్తలి కవిత్వం (దిగంబర కవులు) అంగడి కవులు (రా. పీ. స్వాతంత్ర్య వీరుడు, పుట: 246)

- అనంతరాగం (పుట: 230) 'రాళ్ళపల్లి వారి రమణీయ పీఠికలు' – జి. యన్. రెడ్డి వ్యాసం నుండి స్వీకృతం

  **1.** ముద్రాక్షర శోధన (poof Reading)

  **2.** చిప్ప గుర్తులు (Brackets)

  **3.** గుండు సంఖ్య (Round figures)

  **4.** పగులు మొగ్గలు (Budding flowers)

---

[26] తెలుగు వచన శైలి. పుట. 174.

* రా. అ. శ. సం. (పుట: 58) ఆంధ్ర సాహిత్య అకాడెమీ విశిష్ట సభ్యులుగా శ్రీమాన్ రాళ్ళపల్లి వారి ప్రశంస, దివాకర్ల వేంకటావధాని వ్యాసం నుండి ఉధృతం
    1. మైలపలుకులు
    2. కప్పుకొన్న వైష్ణవం
    3. ముఖ నింద
    4. వట్టిపహరణం
    5. మనం స్వతంత్రలం కాకముందే 'రేడియో' కి 'ఆకాశవాణి' అన్న నామకరణం చేశారు.

ఈ విధంగా రాళ్ళపల్లి వారు కొత్త పదాలను సృష్టించారు. ఇవన్నీ ఇప్పటికీ సహృదయుల నోళ్ళలో నానుతున్నాయి. శర్మగారి హాస్య, వ్యంగ్య అభిప్రాయాల్లాగా ఈ పదాలు కూడా చలామణిలో ఉండటం గమనార్హం.

మల్లంపల్లి సోమశేఖర శర్మగారి 'వేమన' సమీక్షలో రాళ్ళపల్లి వారి భాషాశైలిని ఇలా అంచనా వేశారు. "*వీరిశైలి చాల సత్త్వము కలది. మనసు మీద ముద్రపడునట్లు చెప్పగల శక్తి దానికి కలదు. రసవంతమై యది నిండుజీవముతో తొణుకు లాడు చుండును. నయముతోడి హాస్యమును, ఛలోక్తియు వీరి సొమ్ము. రచనలో ఈ లక్షణమే ప్రస్ఫుటముగ ప్రధానముగ వ్యక్తమగును.*"[27]

రాళ్ళపల్లి వారు ప్రారంభంలో గ్రాంథిక భాషలో రచనా వ్యాసంగం చేశారు. పద్యరచనలు చివరి వరకూ గ్రాంథికాన్నే వాడారు. కాని గద్యంలో మాత్రం శర్మగారు ఆదిలో గ్రాంథిక భాషనే వాడినా, క్రమంగా సరళ గ్రాంథికం, శిష్ట వ్యావహారికం వాడారు. వ్యాసంగం చివర్లో వ్యావహారికమే వాడుతూ, రాయలసీమ మాండలిక పదాలు వాడటం గమనించవచ్చు.

అనంతకృష్ణులవారి గద్య రామణీయకం జగత్ ప్రసిద్ధం. తెలుగు పలుకుబడులు, నుడికారాలు, జాతీయాలు, సామెతలు అక్కడక్కడ అన్యదేశ్య పదాల చమత్కారాలతో శర్మగారి గద్య రచన పాఠకులకు అత్యంత ఆహ్లాదకరంగా రూపొందింది. రాళ్ళపల్లి వారి గద్యం ఎంతో హృద్యమై, సహృదయ సంవేద్యమై తెలుగు గద్య చరిత్రలో ఓ మైలురాయిగా, దీప స్తంభంగా అలరారింది.

## ఈ అధ్యాయంలో ముఖ్యాంశాలు

* రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు రచనా ప్రారంభంలో గ్రాంథిక భాషను వాడినా, రానురాను శిష్టవ్యావహారికాన్ని పాటించారు.

[27] 'వేమన' శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ శతజయంతి సంచిక. పుట. 11.

- శర్మగారి రచనలు లలితమైన భాషా, కుతూహలమైన శైలి కారణంగా అన్ని తరాల పాఠకుల్ని ఆకర్షిస్తాయి.
- అనంతకృష్ణశర్మగారి వ్యాసాల్లో రాయలసీమ మాండలిక పదాలతో పాటూ, ఆంగ్ల, ఉర్దూ పదాల ప్రయోగం కూడా కనిపిస్తుంది. 'సప్లై', 'తకరారు' లాంటి పదాలు కొత్త అర్థాన్ని స్ఫురింపజేస్తూ, సహృదయుల్ని మురిపిస్తాయి.
- రాళ్ళపల్లి వారి భాషాశైలి సంప్రదాయ వాదులతో పాటూ, ఆధునికుల్ని కూడా ఆకర్షించే విధంగా ఉండడం ప్రత్యేకత.

ఇంతవరకు రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి జీవితంలోని వివిధ ఘట్టాల్నీ, వారి రచనా నేపథ్యాల్నీ, సాహిత్య రచనల్లోని విశిష్టాంశాల్నీ, వివిధ అధ్యాయాల్లో తెలుసుకున్నాం. ఆ అధ్యాయాలకు సంబంధించిన ఫలితాంశాలను ఉపసంహారంలో తెలుసుకుందాం. దీని తర్వాత రాళ్ళపల్లివారి బహుముఖ విశేషాల్ని గుర్తించడానికి వీలుగా అనుబంధంలో రాళ్ళపల్లివారితో, వారి సాహిత్యంలో విశేషమైన అనుబంధం ఉన్న రచయితలు, పరిశోధకులు, విమర్శకుల ఇంటర్వ్యూలను అనుబంధాలుగా చేర్చాను. వాటిని గమనిద్దాం.

\

# ఉపసంహారం

# ఉపసంహారం

***'రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ జీవితం, రచనలు: సమగ్రపరిశీలన'*** అనే ఈ సిద్ధాంత వ్యాసం ఆరు అధ్యాయాలుగా విభజించాను. ఒక్కొక్క అధ్యాయంలో నేను పరిశోధించి పరిశీలించిన అంశాలను కింద పొందుపరుస్తున్నాను.

మొదటి అధ్యాయం ***'రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ జీవితం – పరిచయం'*** లో రాళ్ళపల్లి వారి జీవితంలోని కొన్ని దశలు స్థూలంగా పరిచయం చేయబడ్డాయి. శర్మగారి కలం నుండి వెలువడిన సృజనాత్మక, విమర్శనాత్మక రచనల సంక్షిప్త సమాచారం ఇవ్వబడింది. రాళ్ళపల్లి వారి అపూరూపమైన ఖండకావ్యాలు *'తారాదేవి', 'మీరాబాయి'* ల సంక్షిప్త చరిత్ర పేర్కొనబడింది. శర్మగారి ముక్తక కవితలు పెనుగొండ, శమీపూజ, సంధ్యావందనం మొదలైన తొమ్మిది కవితల నేపథ్యాలు వివరించబడ్డాయి వెరసి అనంతకృష్ణుల వ్యక్తిత్వ గరిమ ఆవిష్కరించబడింది.

రెండవ అధ్యాయం ***'రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ రచనలు: సమీక్ష'*** లో శర్మగారి లభ్యమైన రచనల పూర్వాపరాలు పరిశీలించబడ్డాయి. రాళ్ళపల్లి వారి కష్టాలు, కన్నీళ్ళు తెలిపే 'భార్గవీ పంచ వింశతి' పద్యాల నేపథ్యం వివరించబడింది. శర్మగారి ఖండకావ్యాలైన *'తారాదేవి', 'మీరాబాయి'* ల కథా సారాంశం, కావ్య సౌందర్యం, పాత్ర చిత్రణా వైశిష్ట్యం, రచనా రామణీయకాలను సుదీర్ఘంగా చర్చించడం జరిగింది. అంతేకాక ఆనాడు వెలువడిన ఖండకావ్యాల నేపథ్యంలో రాళ్ళపల్లి వారి ఖండకావ్యాల వైశిష్ట్యాన్ని గుర్తించబడింది. అనంతకృష్ణులవారి *'పెనుగొండ కొండ' 'పరిహాస లీల', 'ముసలి వీణ', 'సంధ్యావందనం', 'ఆహ్వానము', 'విస్మృత వేణుగీతి', 'శమీపూజ', 'భారతికి సాధు వాదము', 'ప్రబంధకవి'* అనే ముక్తక కవితల తాత్పర్యాలు, వాటి గొప్పతనాలు పరిచయం చేయబడ్డాయి. కాళిదాసు రచించిన *'రఘువంశము'* లోని 'అజ విలాపాన్నీ, వేదాంత దేశికుని 'అభీతీ స్తవము' ను శర్మగారు ఎంతో హృద్యంగా తేటతెలుగులోకి తీసుకొచ్చి, ఆలోచింపజేసిన విధానాన్ని పరిచయం చేయబడింది. కాగా హాలుని *'గాథాసప్తశతి'* కి రాళ్ళపల్లి వారు చేసిన సంపూర్ణానువాదం తెలుగువారిని ఎంతో ఆకట్టుకొంది. దీన్ని మరి కొంతమంది తెలుగు భాషలోకి సంపూర్ణ అనువాదం చేశారు. ఈ అనువాదాలన్నిటిని స్వీకరించి శర్మగారి అనువాదంతో తులనాత్మకంగా పరిశీలింపబడింది. వెరసి రాళ్ళపల్లి వారి అనువాద కౌశలాన్ని సుస్పష్టంగా తెలుపడమైంది. కాగా *'నృత్త రత్నావళి' 'సుందరపాండ్య విరచిత ఆర్యా'* ల అనువాద గొప్పతనాల్నీ, వాటి కథా కమామీషుల్నీ ఆవిష్కరింపచేయబడ్డాయి. రాళ్ళపల్లి వారి వేమన, నాటకోపన్యాసములు, సారస్వతాలోకము, రాళ్ళపల్లి పీఠికలు, రాళ్ళపల్లి సాహిత్య,

సంగీత వ్యాసాలు అనే విమర్శ రచనల్లో రచయిత దృక్పథాన్ని, విషయ ఔచిత్యాన్ని సమీక్షించడం జరిగింది.

మూడవ అధ్యాయం ***'వ్యాసకర్తగా రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ'***లో వ్యాసం నిర్వచనాలు, లక్షణాలు, భేదాల్ని పేర్కొంటూ సాహిత్య వ్యాసం రాసిన ప్రముఖుల పేర్లను స్మరించుకోడం జరిగింది. శర్మగారి సమకాలికులు కట్టమంచి రామలింగారెడ్డి, పింగళి లక్ష్మీకాంతంల వ్యాసరచనా విధానాలు ఉదాహరణ సహితంగా పరిశీలించబడ్డాయి. అనంతకృష్ణుల వ్యాసరచనా ప్రత్యేకతలైన ఆది, మధ్య, అంతాల స్వరూపాల్ని ఆధారాలతో నిరూపించడం జరిగింది.

నాల్గవ అధ్యాయం ***'రాళ్ళపల్లి వారి సాహిత్య విమర్శ'*** లో తెలుగు సాహిత్య విమర్శ శర్మగారికి పూర్వం వర్ధిల్లిన తీరు వివరించబడింది. కట్టమంచి రామలింగారెడ్డి తమ భావనా శక్తితో తెలుగు సాహిత్య విమర్శకు దారి చూపిస్తే, రాళ్ళపల్లి వారు ఆ భావనా శక్తికి, వస్తువు, రచనలను జోడించి ఓ పటిష్ఠమైన మార్గాన్ని ఏర్పరచి ముందుకు తీసుకెళ్ళిన క్రమాన్ని సోదాహరణంగా వివరించడం జరిగింది. కాగా అనంతకృష్ణులవారు తమ సాహితీ వ్యాసంగంలో కనబరిచిన స్త్రీ దృక్పథం, వ్యక్తిత్వ చిత్రణ, పాత్ర చిత్రణా వైశిష్ట్యం, రస దృష్టి, అలంకార దృష్టి, సామాజిక నేపథ్యాలను వివరించడం జరిగింది. దరిమిలా కట్టమంచి వారి విమర్శా, భాషా ప్రభావాలు శర్మగారిపై ప్రసరించిన పరిస్థితులను ఈ అధ్యాయంలో చూడవచ్చు.

ఐదవ అధ్యాయం ***'సాహిత్య, సంగీత సమన్వయకర్తగా రాళ్ళపల్లి'*** లో అనంతకృష్ణశర్మగారు తొలి నుంచి తుది దాకా చేసిన సంగీత సాధన, పొందిన సిద్ధి వివరించబడింది. రాళ్ళపల్లి వారి సంగీత రచనలు గీతాలు, స్వర పల్లవులు, వర్ణనలు, కృతులు, తిల్లానాలు, మంగళాల రాగతాళాల వైశిష్ట్యం చెప్పడం జరిగింది. అన్నమయ్య సంకీర్తనలూ, తెనుగు మీరా పాటల విషయంలో రాళ్ళపల్లివారు చేసిన కృషి పేర్కొనబడింది. అంతేకాకుండా శర్మగారికి కళలపట్ల ఉన్న ఆదరణ, ఆలోచనల మమకారం ఆయా వ్యాసాల్లో సుస్పష్టంగా ఉంది. దీనిని సంక్షిప్తంగా తెలపడం జరిగింది.

ఆరవ అధ్యాయం ***'రాళ్ళపల్లి వారి భాషాశైలి'*** లో పద్య, గద్య రచనల్లో శర్మగారి భాషాశైలిని సునిశితంగా పరిశీలించడం జరిగింది. రాళ్ళపల్లివారు మొదట గ్రాంథిక భాషలోనే రచనలు చేశారు. అయితే, రాను రాను తమ భాషను సరళీకరించుకుంటూ వ్యావహారిక శైలికి చేరువయ్యారు. వెరసి మాండలిక భాషాశైలిని ప్రోత్సహించిన ఆయా సందర్భాలను క్రోడీకరించడం జరిగింది. ప్రధానంగా అనంతకృష్ణశర్మగారి భాషలోని హాస్య, వ్యంగ్య వైఖరుల్ని గుర్తించబడ్డాయి. శర్మగారు ప్రయోగించిన అన్యదేశ్యాలు, సృష్టించిన నూతన పదాలు ఇందులో పేర్కొనబడ్డాయి.

# అంతం కాదిది ఆరంభం

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి రచనలపై పరిశోధన చేసే అవకాశం లభించడం నా మహద్భాగ్యం. ***'రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ జీవితం, రచనలు: సమగ్రపరిశీలన'*** అనే శీర్షిక పెట్టినంత మాత్రానా వీరిపై ఇక పరిశోధనలు చేయడానికి అవకాశం లేదనడానికి వీలు లేదు. శర్మగారి సాహిత్య కృషి మథించే కొద్దీ మాణిక్యాలు లభ్యమవడం ఖాయం. ఆసక్తి పరులు, కష్ట జీవులు అయినా పరిశోధకులకు రాళ్ళపల్లి వారి సాహిత్య కృషిలోని మరి కొన్ని అంశాలపై లోతుగా పరిశీలించేందుకు అవకాశం ఉందని భావిస్తూ.. కింది అంశాలను సూచిస్తున్నాను.....

1. రాళ్ళపల్లి వారి సృజనాత్మక రచనలు: పరిశీలన
2. అనంతకృష్ణశర్మగారి అనువాద రచనల వైశిష్ట్యం
3. వేమన కవిత్వ పరిశోధనలో రాళ్ళపల్లి వారి స్థానం
4. గ్రంథపరిష్కరణ: రాళ్ళపల్లివారి ప్రతిభా పాఠవాలు
5. తెలుగు సాహిత్య విమర్శ: రాళ్ళపల్లివారి మార్గం
6. రాళ్ళపల్లి వ్యాసాలు – ఒక పరిశీలన
7. తెలుగు పీఠికా సాహిత్యం : అనంతకృష్ణశర్మగారి సేవ
8. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ రచనలు : సామాజిక, సాంస్కృతిక అధ్యయనం
9. రాళ్ళపల్లి వారి నాటకోపన్యాసములు ; నేటి నాటకాలు

# ఉపయుక్త గ్రంథ సూచిక

# ఉపయుక్త గ్రంథ సూచి
# (Bibliography)

## ప్రాథమిక ఆకరాలు (Primary Sources)


1. అనంతకృష్ణశర్మ. రాళ్ళపల్లి, ***తారాదేవి.*** కాకినాడ: 'సరస్వతి' మాస పత్రిక ,1911.
2. అనంతకృష్ణశర్మ. రాళ్ళపల్లి, ***మిరాబాయి*** .రాజమహేంద్రవరం: 'మానవసేవ' మాస పత్రిక ,1913.
3. అనంతకృష్ణశర్మ. రాళ్ళపల్లి, ***వేమన.*** వాల్తేరు: ఆంధ్ర విశ్వకళా పరిషత్ ,1945.
4. అనంతకృష్ణశర్మ. రాళ్ళపల్లి, ***సారస్వతాలోకము***. హైదరాబాదు: మృదులా ప్రచురణ, 2009.
5. అనంతకృష్ణశర్మ. రాళ్ళపల్లి, ***శాలివాహన గాథాసప్తశతీసారము***, హైదరాబాదు: ఆంధ్ర సారస్వత పరిషత్తు, 1964.
6. అనంతకృష్ణశర్మ. రాళ్ళపల్లి, ***నృత్త రత్నావళి.*** హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 2007.
7. అనంతకృష్ణశర్మ. రాళ్ళపల్లి, ***నాటకోపన్యాసములు.*** మచిలీపట్నం: త్రివేణి పబ్లిషర్స్, 1968.
8. అనంతకృష్ణశర్మ. రాళ్ళపల్లి, ***సుందరపాండ్య విరచిత ఆర్యా***. ప్రొద్దుటూరు: శ్రీ రాయల సాహిత్య పరిషత్తు, 1970.
9. అనంతకృష్ణశర్మ, రాళ్ళపల్లి, ***రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు*** . హైదరాబాదు: ఎమెస్కో, చంద్రశేఖర్ రెడ్డి, డి. సంప, 2017.


## ద్వితీయ ఆకరాలు (Secondary Sources)


1. అనురాధ. పొట్లూరి, ***సంగీత కళానిధి రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి సంగీత వైదుష్యం– ఒక పరిశీలన,*** (ఎం. ఫిల్., సిద్ధాంత వ్యాసం), పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 2015.
2. అభ్యుదయ (ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం మద్రాసు శాఖ మాస పత్రిక) సంచిక 10, సంపుటి 2, అక్టోబర్ 1978.
3. అశ్వత్థనారాయణ ఘట్టమరాజు, సుందరం ఆర్వీయస్, ***రాళ్ళపల్లి పీఠికలు.*** బెంగళూరు: రాళ్ళపల్లి అభినందన సమితి, 1977.
4. అశ్వత్థనారాయణ ఘట్టమరాజు, సుందరం ఆర్వీయస్, శ్రీరామ చంద్ర మూర్తి శివలెంక, ***అనంతరాగం.*** బెంగళూరు: రాళ్ళపల్లి అభినందన సమితి, 1977.
5. ఆరుద్ర, ***మన వేమన***, తిరుపతి: శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, 1985.

6. ఆంజినేయులు. కుందుర్తి, ***కుందర్తి వ్యాసాలు***, హైదరాబాదు: తెలుగు పరిశోధన ప్రచురణలు, 1987.

7. ఇనాక్, కొలకలూరి. ***తెలుగు వ్యాస పరిణామం,*** హైదరాబాదు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2001.

8. ఉమేశ్. బడిగె, ***రాళ్ళపల్లి పీఠికలు పరిశీలన.*** (ఎం.ఫిల్., అముద్రిత సిద్ధాంత వ్యాసం), హైదరాబాద్: హైదరాబాద్ విశ్వవిద్యాలయం, 2014.

9. కమలాకర శర్మ. సాగి, ***కదంబం.*** హైదరాబాదు: మూసీ సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక, 2014.

10. కుల శేఖరరావు, ఎం. ***ఆంధ్ర వచన వాఙ్మయము*** (ఉత్పత్తి వికాసము), హైదరాబాదు; ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, 1971.

11. కృష్ణ ప్రసాద్, మల్లాది. ***తెలుగు వ్యాకరణము*** హైదరాబాదు: విక్టరీ పబ్లిషర్స్, 2016.

12. కోదండరామరెడ్డి. మరుపూరు, ***వేమన పాశ్చాత్యులు*** , నెల్లూరు: వర్ధమాన సమాజం, 1970.

13. గంగప్ప, ఎస్. ***క్షేత్రయ్య పద సాహిత్యం***

14. గోపి. ఎన్, ***ప్రజాకవి వేమన*** హైదరాబాదు : ఎన్ అరుణా పబ్లికేషన్స్, 1992.

15. చంద్రశేఖర రెడ్డి, రాచపాళెం. (సంప) ***వేమన కవిత్వం – స్త్రీ.*** విజయవాడ: ప్రజా శక్తి బుక్ హౌస్, 2017.

16. చంద్రశేఖరరెడ్డి, డి. ***తెలుగు పీఠిక.*** హైదరాబాదు; ఆంధ్రసారస్వత పరిషత్, 1990.

17. చంద్రశేఖర్, ఎస్. సాంబమూర్తి, ఎ.వి.ఎస్.ఎస్, ***తెలుగు సారస్వత సమాఖ్య.*** న్యూఢిల్లీ ప్రత్యేక సంచిక అక్టోబర్, 1981.

18. చంద్రశేఖర్. సాతవల్లి, ***రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ సాహిత్య సేవ – సవిమర్శక సమీక్ష.*** (ఎం. ఫిల్., అముద్రిత సిద్ధాంత వ్యాసం) తిరుపతి: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, 1978.

19. జోగారావు. ఎస్వీ, ***మణిప్రవాళము.*** కాకినాడ; శ్రీ పతి ప్రెస్, 1988.

20. డా॥ నరసింహమూర్తి, యు. ఎ. ***తెలుగు వచన శైలి.*** హైదరాబాదు; భాషా సాంస్కృతిక శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, 2014.

21. ద్వానా శాస్త్రి, ***తెలుగు సాహిత్య చరిత్ర.*** హైదరాబాదు: ప్రగతి పబ్లిషర్స్, 2011.

22. నళిని. ఎస్. ఎస్, ***సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ.*** హైదరాబాద్: నవోదయా బుక్ హౌస్, 2009.

23. నాగరాజు, ఎం. ***ఆధునిక సాహిత్య విమర్శ – అభిరుచి ధోరణి*** . హైదరాబాదు: యువ భారతి పబ్లికేషన్స్, 1991

24. నారాయణరెడ్డి. సి, ***ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు: ప్రయోగములు.*** హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1967.

25. నిత్యానంద రావు. వెలుదండ, ***విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన.*** హైదరాబాదు: ఉస్మానియా విశ్వవిద్యాలయం, 2013.

26. పుల్లారెడ్డి, కోడూరు. ***అక్షరం చిలికిన వేళ*** హైదరాబాదు : కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, 2018.

27. ప్రభాకరరెడ్డి. కోడూరు, ***గాథాచతుశ్శతి.*** హైదరాబాదు: కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, 2016.

28. ప్రభాకరరెడ్డి. కోడూరు, ***గాథాత్రిశతి.*** హైదరాబాదు: కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, విద్యా నగర్, 2013.

29. ప్రభాకరశాస్త్రి. వేటూరి, వ్యాసభారతము, హైదరాబాదు : ఆంధ్ర సారస్వత పరిషత్ తిలక్ రోడ్, 1990.

30. బంగోరె, ***వేమన – సి. ఆర్. రెడ్డి .*** విశాఖపట్నం: ఆంధ్రవిశ్వకళాపరిషత్తు, 1981.

31. బడాల రామయ్య. ***బసవేశ్వరుని వచనములు సమగ్ర పరిశీలన*** మంగళాశంస, 14–6–1976.

32. భాస్కర చౌదరి. డా, ***సి. ఆర్. రెడ్డి పీఠికలు.*** చిత్తూరు; శ్రీ బాలాజీ ప్రెస్, 1983.

33. భూమయ్య. అనుమాండ్ల, ***ఆద్యుడు కట్టమంచి.*** వరంగల్లు, వాగ్వాదినీ ప్రచురణలు, 1992.

34. మంగమ్మ. బి, ***తిక్కన నాటకీయశిల్పము.*** కర్నూలు, స్వతంత్రప్రచురణ, 1985.

35. మహాలక్ష్మి, కట్టమంచి. ***సి. ఆర్. రెడ్డి జీవితం సాహిత్యం.*** తిరుపతి: సాయి ప్రచురణలు, 1991.

36. మృణాలిని. సి, ***సకల.*** (మృణాళిని సాహిత్య వ్యాసాలు), హైదరాబాద్: ధృతి పబ్లిషర్స్, 2014.

37. మోహన్. మేడసాని (సం.పా.), ***రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ శత జయంతి సంచిక.*** తిరుపతి: టి. టి. డి, 1993.

38. రమాంజనీ కుమారి. వి, ***విమర్శకునిగా రాళ్ళపల్లి.*** (ఎం. ఫిల్., సిద్ధాంత వ్యాసం) హైదరాబాద్: విశ్వవిద్యాలయం, 2005.

39. రామచంద్రుడు. మంకాల. ***ఆశావాది ప్రకాశరావు సాహిత్యానుశీలనం.*** మహబూబ్ నగర్: శ్రీ కళామంజరి, షాద్ నగర్, 2008.

40. రామ నరసింహం. పరిమి, ***ఆంధ్ర మహాభారత శైలీ పరిశీలనం.*** హైదరాబాద్: పరవాక్ ప్రచురణలు, 1996.

41. రామరాజు. బిరుదురాజు, పుచ్చావాసుదేవ పరబ్రహ్మశాస్త్రి, ***విజ్ఞాన సర్వస్వము తెలుగు సంస్కృతి.*** (రెండవ సంపుటము) హైదరాబాద్: తెలుగు యూనివర్సిటీ, 1988.

**42.** రామలింగారెడ్డి, కట్టమంచి. ***కవిత్వతత్త్వవిచారము*** . విశాఖపట్నం: ఆంధ్రవిశ్వకళాపరిషత్తు, విశాఖపట్నం, 1973.

**43.** రామలింగారెడ్డి. కట్టమంచి, ***వ్యాస మంజరి.*** వాల్తేరు: ఆంధ్ర యూనివర్సిటీ ప్రెస్, 1947.

**44.** రామసుబ్బశర్మ. గౌరిపెద్ది, ***ఆలోచన లహరి.*** హైదరాబాదు: యువ భారతి, 1980.

**45.** రామారావు. ఎస్వీ. డా, ***తెలుగు సాహిత్య విమర్శ – అవతరణ వికాసములు.*** హైదరాబాద్: పసిడి ప్రచురణలు, 1974.

**46.** రాములు. పిల్లలమర్రి, ***తెలుగులో భక్తి కవిత్వం సామాజిక విశ్లేషణ,*** హైదరాబాదు : ప్రజాశక్తి బుక్ హౌస్, 2012.

**47.** లక్ష్మణ చక్రవర్తి, సి.హెచ్, సంపత్కుమారాచార్య, కోవెల (సంప). ***తెలుగు సాహిత్య విమర్శదర్శనం (విజ్ఞాన సర్వస్వం సంపుటం :ii).*** హైదరాబాదు: కొమర్రాజు వేంకట లక్షణ రావు విజ్ఞాన సర్వస్వ కేంద్రం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 2016.

**48.** లక్ష్మణ చక్రవర్తి, సిహెచ్, వారిజారాణి, పి, విజయ్ కుమార్, జి, (సంపా) ***ఆధునిక సాహిత్య విమర్శకులు- ప్రస్థానాలు.*** (తొలి మలి తరాలు) హైదరాబాదు: ఆంధ్ర విద్యాలయ స్నాతకోత్తర తెలుగుశాఖ, 2008.

**49.** లక్ష్మీ నరసింహం. గట్టి, ***గాథా సప్తశతి.*** తెనాలి: సాహితీ సమితి, 1956.

**50.** లక్ష్మీకాంతం, పింగళి. ***రసజ్ఞశిల్పి.*** విశాఖపట్నం; పి. శ్రీనివాస్, 1994.

**51.** లక్ష్మీకాంతం, పింగళి. ***సాహిత్య శిల్ప సమీక్ష.*** హైదరాబాదు; నవచేతన పబ్లిషింగ్ హౌస్, 2016.

**52.** లక్ష్మీకాంతం. పింగళి, ***గౌతమ వ్యాసములు***. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1989.

**53.** లక్ష్మీనారాయణ, గంగిశెట్టి. ***ఆధునికత – సమకాలికత,*** విజయవాడ; చినుకు పబ్లిషర్స్, 2016.

**54.** వెంకటేశ్వరరావు, దార్ల. ***వీచిక,*** (సాహిత్య విమర్శ వ్యాసాలు) హైదరాబాదు: ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, 2009.

**55.** వెంకటేశ్వరరావు, దార్ల. ***బహుజన సాహిత్య దృక్పథం.*** హైదరాబాదు; సొసైటీ& ఎడ్యుకేషన్ ట్రస్టు, 2012.

**56.** వెంకటేశ్వరరావు. దార్ల, ***జ్ఞానానంద కవి ఆమ్రపాలి పరిశీలన.*** హైదరాబాద్: జోత్స్న కళాపీఠం, 1999.

**57.** వెంకటేశ్వర్లు. భూసురపల్లి. ***ప్రముఖ వాగ్గేయకారులు,*** గుంటూరు: అమరావతి పబ్లికేషన్స్, జూన్ 2016.

**58.** వేంకటసుబ్బయ్య. వాసిరెడ్డి, ***గాథా సప్తశతి.*** తెనాలి: భారతి ప్రెస్, 1968.

**59.** వేదవతి, ప్రయాగ. (సం) ***శత వసంత సాహితీ మంజీరాలు.*** విజయవాడ; ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం, 2002.

**60.** పార్థసారథి, ఎన్. సి. ***గానకళాబోధిని.*** చెన్నై; బాల సరస్వతీ బుక్ డిపో, 2014.

**61.** శ్రీ రంగస్వామి. టి, జయచంద్ర. జాబిలి, ***అనంతధామం.*** అనంతపురం: ఆశావాది సాహితీ కుటుంబం, 2009.

**62.** సంపత్కుమారాచార్య, కోవెల. ***ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ: సాంప్రదాయిక రీతి.*** హైదరాబాదు : దక్షిణ భారత ప్రెస్, 1981.

**63.** సతీష్, టీ. ***గాథా సప్తశతి – శృంగారేతర రసాలు.*** అముద్రిత లఘు సిద్ధాంత వ్యాసం, హైదరాబాదు విశ్వవిద్యాలయం, 2011.

**64.** సిమ్మన్న, వెలమల. ***తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు***. విశాఖపట్నం: దళిత సాహిత్య పీఠం, 2012.

**65.** సుందరాచారి, శంకరంబాడి. వెంకటేశ్వరరావు, కనకమేడల. ***శ్రీమాన్ రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ సన్మాన సంచిక.*** చిత్తూరు: అక్టోబర్ 1961.

**66.** సుబ్బారావు. దీవి, ***గాథా సప్తశతి.*** హైదరాబాదు: కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, 2013.

**67.** సుబ్రహ్మణ్యం. జి. వి, డా, ***ఆంధ్ర సాహిత్య విమర్శ– ఆంగ్ల ప్రభావం.*** హైదరాబాద్: యువ భారతి ప్రచురణలు, 1983.

**68.** సుబ్రహ్మణ్యం. జి. వి, ***సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు.*** హైదరాబాదు: తెలుగు అకాడమి, 2012.

**69.** సూర్యనారాయణశాస్త్రి. సన్నిధానం, ***కావ్యాలంకార సంగ్రహం***, హైదరాబాద్: ఎమెస్కో బుక్స్, 2013.

## నిఘంటువులు

**1.** సీతారామాచార్యులు, బహుజనపల్లి. ***శబ్దరత్నాకరము.*** విజయవాడ; విక్టరీ పబ్లిషర్స్, 2013.

**2**. శ్రీహరి. రవ్వా, ***శ్రీహరి నిఘంటువు*** (సూర్యరాయాంధ్ర నిఘంటువు) హైదరాబాదు; గోపాల్ పబ్లికేషన్, 2004.

## దిన పత్రికలు

**1.** శివప్రియ. ***సారస్వత సాలోచనలో 'అనంత' పథం.*** ఆంధ్రజ్యోతి (జనవరి 23 మంగళవారం 2018. (పుట: 4)

**2.** కనకదుర్గ. జె, ***గాథాసప్తశతిలో బాధాతప్తసతులు,*** ఆంధ్రజ్యోతి 'వివిధ' 2016 సెప్టెంబర్ 26

**3.** బొల్లోజుబాబా, ***'హాలుని గాథలకు పొసగని వ్యాఖ్యానం'*** ఆంధ్రజ్యోతి 'వివిధ' 2016 అక్టోబర్ 10,

**4.** కనకదుర్గ. జె, ***'గాథల్లో స్త్రీ కోణమూ ఉంది'*** ఆంధ్రజ్యోతి 'వివిధ' 2016 నవంబర్ 21

**5.** అశ్వత్థనారాయణ. ఘట్టమరాజు, ***సంగీత సాహిత్య శారదా దరహాసం – శ్రీమాన్ రాళ్ళపల్లి,*** సెప్టెంబర్ 22, గురువారం, ఆంధ్రప్రభ, 1977.

**6.** శ్రీనివాస్. అంకే**,** ***'అనంత గీతిక'*** పేరుతో రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ జీవితంపై పది వ్యాసాలు 'సూర్య దినపత్రిక' సాహిత్య పేజి. నవంబర్ – 10 – 2014 నుండి 2015 జనవరి 5 వరకు ప్రతీ సోమవారం**.**


## మాస పత్రికలు

**1.** నారాయణాచార్యులు. పుట్టపర్తి, ***రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ ఆయన రచనలు.*** భారతి(సాహిత్య మాసపత్రి) నవంబర్ 1941.

**2.** శంభుప్రసాద్. శివలెంక, (సంప) సాళ్వ కృష్ణమూర్తి, ***అనంత కృష్ణులు: అభిరుచి నిర్దేశము.*** భారతి (సాహిత్య మాసపత్రిక) సంపుటము : 36, సంచిక: 7, జూలై 1959.

**3.** కృష్ణమూర్తి. సాళ్వ, ***రాళ్ళపల్లి వారు వచనరచన.*** భారతి (సాహిత్య మాసపత్రిక) : 36, సంచిక: 7, ఆగస్టు 1959.

**4.** రామచంద్రా చార్య. టి. పి. యన్, ***గాథాసప్తశతి అనువాదాలు***. భారతి (సాహిత్య మాసపత్రి) మే 1964.

**5.** కృష్ణమూర్తి. వేటూరి, ***మైసూరు సంస్థానంలో రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ***. మిసిమి మాసపత్రిక అక్టోబరు 2014.

**6.** కేశవరెడ్డి. నందవరం, ***యోగవిద్యా రహస్య వేది రాళ్ళపల్లి***. మిసిమి మాసపత్రిక మార్చి సంచిక – 2015.

**7.** రాఘవేంద్రరావు. కల్లూరు, ***నాటి జనజీవన గాథలు.*** తెలుగు వెలుగు ఏప్రిల్ 2018

**8.** ఆంధ్రపత్రిక ఉగాది సంచిక 1922 మే22లో కుసుమ గుచ్ఛములు శీర్షికన రాళ్ళపల్లివారి ముక్తక కవితలు. ఇవే కవితలు గ్రంథాలయ సర్వస్వములో కూడా ప్రచురితమయ్యాయి. 1922.

**9.** సంస్కృతి 1953 జూలై, ***అనువైన సంగీతం – పూజాసమయాల్లో***

**10.** అభ్యుదయ (సంచిక 10, సంపుటి 2) ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం మద్రాసు శాఖ, అక్టోబర్. 1978.

## ఆంగ్ల గ్రంథాలు

1. Abrams M. H, Galt Harpham, Geoffrey. ***A Glossary of Literary Terms.*** Delhi: Cengage Learning India printed, India, 2012.
2. The Encyclopaedia Americana (VOL. NO. 10) Encyclopaedia Americana Corporation, Publisher: FB&C Ltd 1918.
3. Essay & Essayists – En Britannica (VOL NO: 8, P: 716) Encyclopaedia Britannica, Printed in U.S.A. 1981.

## కన్నడ గ్రంథాలు

1. ఫణిశాయి, రాళ్ళపల్లి. ***పరమానంద గానసుధా.*** బెంగళూరు; అక్షర ప్రింటర్స్, 2002.
2. శ్రీనివాసన్, టి.టి. ***రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ*** (డి.లిట్., సిద్ధాంత గ్రంథం) తుమకూరు: ప్రసాంగ్ధ తుమకూరు విశ్వవిద్యాలయం, 2013.

## సభలు సమావేశాలు

1. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ 125 వ ***జయంతి సందర్భంగా*** త్యాగరాయ గానసభ – హైదరాబాదు (జనవరి 23- 2018)

## వ్యక్తిగత ఇంటర్వ్యూలు

1. ఆర్. ఎ. జయంతగారితో (రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ రెండో కుమారులు) తిరుపతిలో4/11/2014న జరిపిన ఇంటర్వ్యూ.
2. డిసెంబర్ 27/12/ 2015న రాళ్ళపల్లిలో (అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం తాలుకా, కంబదూరు మండలం) మరిది వెంకటరెడ్డి (88 సంవత్సరాలు ) చేసిన ఇంటర్వ్యూ

## Url

1. https://te.wikipedia.org/wiki

http://www.andhrabharati.com/dictionary/

# అనుబంధం-1

# అనుబంధం 1

# వివిధ రచయితలతో ఇంటర్వ్యూలు

## ప్రశ్నావళి : 1

### ఆర్. వి. యస్. సుందరం గారి అభిప్రాయాలు : (సెప్టెంబర్ 5. 2018)

**1. సార్! మీరు తొలిసారిగా రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి గురించి ఎలా తెలుసుకున్నారు? ఏ సందర్భంలో?**

**జ.** నా పదిహేడేళ్ళ వయసులో మద్రాసు సర్ త్యాగరాయ కళాశాలలో చదివేటప్పుడు (15.12.1965) సి. వి. సుబ్బన్నగారు అష్టావధానం చేశారు. నాటి ముఖ్య అతిథి రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు. ఆనాటి ప్రసంగంలో అష్టావధానం ఎంత గొప్ప కళ అయినా మానసికంగా చాలా ఒత్తిడి కలుగుతుందని రాళ్ళపల్లి వారు చెప్పటం ఇప్పటికీ జ్ఞాపకం ఉంది.

**2. రాళ్ళపల్లి వారిని ప్రత్యక్షంగా చూశారా? ఎప్పుడు ? ఏం మాట్లాడారో తెలపండి.**

**జ.** మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో నేను ఎం. ఎ. చదివేటప్పుడు (1968-69) నాకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ బహుమతి వచ్చింది. ఇరవైయేళ్ళ వయసులో అప్పటి వరకు ఎవ్వరూ సాహిత్య అకాడెమీ బహుమతి అందుకోలేదు. నేను బహుమతి పొందటానికి పరీక్షకులు రాళ్ళపల్లి వారే. 1969లో నేను తిరుపతికి వెళ్ళి వారి అబ్బాయి జయంత గారింట్లో రాళ్ళపల్లి వారిని కలిస్తే, వారే ఈ విషయం చెప్పారు. నాకు 'తెలుగు సాహిత్యములో దేశికవిత' కు బహుమతి వచ్చిందని దానికి 'మున్నుడి' రాయవలసిందని కోరగా అప్పుడు వారు ఈ విషయం చెప్పారు. ''*నేను మీ బహుమతికి కారణం. అందువల్ల నేను 'మున్నుడి' రాయకూడదు. రాయను*'' అన్నారు. వారి నిజాయితీ ఏమిటో అప్పుడే తెలిసింది. అంతేకాదు, ఎన్నో విలువైన సూచనలు చేశారు. నా వ్రాత ప్రతిలో వారు రాసుకున్న సూచనల్ని చూపించి ముద్రించేటప్పుడు వాటిని గమనించవలసిందిగా సలహా ఇచ్చారు. ఆ రోజు నా జీవితంలో మరపురాని రోజుగా మిగిలిపోయింది.

**3. రాళ్ళపల్లి వారి రచనల్లో మీకు బాగా నచ్చినవి ఏవి?**

**జ.** రాళ్ళపల్లి వారి '*వేమన*', '*సారస్వతాలోకము*', '*నాటకోపన్యాసములు*' నేను విద్యార్థిగా ఉన్నప్పుడే చదివాను. ఇప్పటికీ ఆ పుస్తకాలను జాగ్రత్తగా దాచుకున్నాను. వారి '*వేమన*', '*సారస్వతాలోకము*' మళ్ళీ మళ్ళీ చదువుకున్నాను. నాకు బాగా నచ్చినవి అవే.

**4. రాళ్ళపల్లి వారి వ్యాసాల్లో భాషాశైలిపై మీ అభిప్రాయం తెలిపి, వ్యావహారిక భాషకు లోనయ్యారా? లేదా తెలపండి?**

**జ.** రాళ్ళపల్లి వారి వ్యాసాలు సరళ గ్రాంథికంలో ఉంటాయి. భాషాక్లిష్టత కాని, అన్వయ క్లిష్టత కాని, భావ క్లిష్టత కాని కానరావు. మా గురువుగారు సాళ్వకృష్ణమూర్తి ఒకసారి మా తరగతిలో

రాళ్ళపల్లి వారి శైలిని గురించి ఇలా అన్నారు; *''వారి వచన రచన మధురమైంది. వారికి భాష మీద దానిలోని సంగీతం మీద ఎంత పట్టు ఉందంటే వారి వచనంలో అప్రయత్నంగానే ఆటవెలది, తేటగీతి పాదాలు యతి మైత్రితో సహా దర్శనమిస్తాయి.''* రాళ్ళపల్లి వారి శైలి వారి ఆత్మీయతకు ప్రతిబింబంలా కనిపిస్తుంది. వయసు పైబడిన తర్వాత వారికి రాయలసీమ మాండలికం మీద మక్కువ ఎక్కువయింది. అందువల్ల అక్కడక్కడ రాయలసీమ మాండలికాన్ని ప్రయోగించారు.

**5. రాళ్ళపల్లి వారు ఏర్పరచిన విమర్శ మార్గం భావితరాలకు ఎలా ఉపయోగపడుతుందంటారు?**

**జ.** నేటి విమర్శలో ముఖ్యంగా లోపించింది నిజాయితీ. నేటి విమర్శకులు తమ మనసులో ఉన్న విషయాన్ని చెప్పలేరు. చెప్పరు. వారి మీద బాహ్య ప్రభావాలు ఎక్కువ. సత్యాన్ని ఆవిష్కరించాలనే ఆసక్తి లేదు. మోహం లేకపోవడం, మొహమాటం లేకపోవడం అవసరమని రాళ్ళపల్లి వారి విమర్శ సూచిస్తుంది.

**6. కట్టమంచి రామలింగారెడ్డిగారి విమర్శకు, రాళ్ళపల్లి వారి విమర్శకు భేదా లేమైన కనిపిస్తే తెలపండి? రెడ్డిగారి ప్రభావం శర్మగారి మీద ఎంతవరకు ఉందంటారు?**

**జ.** కట్టమంచి పాశ్చాత్య విమర్శను ప్రాచ్య విమర్శను అధ్యయనం చేసి అన్వయింప చేయాలనుకున్నవారు. ఎలాంటి కవినైనా విమర్శించగల చొరవ ఉన్నవారు. రాళ్ళపల్లి వారు భారతీయ సంప్రదాయంలోనే ఎదిగి స్వతంత్ర అభిప్రాయాలను వ్యక్తం చేసే ధైర్యం ఉన్నవారు. అయినా కట్టమంచివారి ప్రభావం కొంతలో కొంత రాళ్ళపల్లి వారి మీద ఉంది. నిర్భయంగా ఉన్నది ఉన్నట్లు, అనిపించింది అనిపించినట్లు చెప్పడం రాళ్ళపల్లి వారికి కట్టమంచివారి సాహచర్యం వల్ల అలవాటయిందేమో అనిపిస్తుంది.

**7. వాద, వివాదాల్లో విమర్శకుడి సంస్కారం ఎలా ఉండాలంటారు?**

**జ.** ఒకే ఒక్క సందర్భంచాలు. ఒక సారి నిడుదవోలు వేంకటరావుగారు రాళ్ళపల్లి వారిని విమర్శిస్తూ వ్యాసం రాశారు. దానికి జవాబిస్తూ రాళ్ళపల్లి వారు *''నన్ను గురించి నిడుదవోలు వారి చెణుకు''* అని రాశారు. అదేవారి సంస్కారం.

**8. రాళ్ళపల్లి వారి గ్రంథ పరిష్కరణ ప్రత్యేకత ఏమిటి?**

**జ.** ఇప్పటి పాండిత్యం అనేక గ్రంథాలను వెతుక్కుంటూ వెళ్ళే 'పరామర్శన పాండిత్యం' కాని రాళ్ళపల్లి వారు అసంఖ్యాకమైన గ్రంథాల నుంచి పాఠాలను వెలికి తీసి నోటి వెంట చెప్పగల సామర్థ్యం కలవారు. వారితో రెండు మూడు గంటలు గడిపితే కొన్ని వందల శ్లోకాలను, పద్యాలను నోటితోనే ఉద్ధరించేవారు. దీని వల్ల పాఠ పరిష్కరణ వారికి సులువయింది.

**9. సాహిత్య విమర్శలో రాళ్ళపల్లి వారిని అభిరుచి విమర్శకులని అంటారు కదా? ఇది ఎంతవరకు సమంజసమంటారు?**

**జ.** ఈ పేరు విమర్శకునిగా కవిత్వానికిగాని ఎంత వరకు సరిపోతుందో సందేహమే. విమర్శకుడు ఏ రాజకీయ సిద్ధాంతానికో, సామాజిక సిద్ధాంతానికో కట్టుబడి ఉండాలనుకోవడం సమంజసమనిపించదు. ఏ విధమైన ప్రభావాలకు లోను కాకుండా కేవలం వస్తు దృష్టితో చేసే విమర్శను అభిరుచి విమర్శ అనిపేరు పెట్టడం సరికాదని నా అభిప్రాయం.

**10. రాళ్ళపల్లి వారికి విమర్శకునిగా వచ్చినంత గుర్తింపు కవిగా వచ్చిందంటారా?**

**జ.** కవిగా రాళ్ళపల్లి వారు చేసిన కృషి తక్కువే. అందువల్ల వారికి విమర్శకునిగా, పాఠ పరిష్కరణ కర్తగా ఎక్కువ పేరు వచ్చింది.

**11. తెలుగు సాహిత్యంలో భావకవిత్వం ఎంతో మందిని ఆకర్షించింది. కాని రాళ్ళపల్లి వారిని ఎందుకు ఆకర్షించలేకపోయిందంటారు?**

**జ.** చిన్నతనం నుంచి రాళ్ళపల్లి వారు మైసూరులో ఉన్నారు. మొదట పరకాల మఠంలో, ఆ తర్వాత తెలుగు పండితులుగా మైసూరు మహారాజా కళాశాలలో కట్టమంచివారి సాహచర్యంలో, వారి లోకం వేరు. అందువల్ల భావకవిత్వం వారి మీద ప్రభావం చూపలేదు.

**12. సాహిత్యంలో రాళ్ళపల్లి వారి తులనాత్మక దృష్టిపై మీ అభిప్రాయం ఏమిటి?**

**జ.** రాళ్ళపల్లి వారు బహుభాషా పండితులు. తెలుగు, సంస్కృతం, ప్రాకృతం, కన్నడం తమిళం వారికి తెలిసిన భాషలు. భాషలే కాదు. వాటి సాహిత్యాలతోను గాఢమైన పరిచయం ఉంది. అందువల్ల తులనాత్మక దృష్టి వారికి సహజంగానే అలవడింది.

**13. రాళ్ళపల్లి వారి అనువాద విశిష్టత ఏమిటి?**

**జ.** రాళ్ళపల్లి వారు '*శాలివాహన గాథాసప్తశతీసారము*'. సుందర పాండ్య విరచితా ఆర్యా తెలుగులోకి అనువాదం చేశారు. మూలం ఎలా ఉందో అలాంటి శైలినే తెలుగులోకి తీసుకు రాగలగడం వారి విశిష్టత.

**14. అటు కర్నాటకలోనూ, ఇటు తెలుగులోనూ రాళ్ళపల్లి వారి ప్రభావం సాహిత్య, సంగీతాల్లో ఎంతవరకు ఉందంటారు?**

**జ.** తెలుగు నాట కాని కర్నాటకలో కాని రాళ్ళపల్లి రస దృష్టికి, నిజాయితీగల అభివ్యక్తికి, సరళ సుందర రచనకి, సంగీత శాస్త్ర నైపుణ్యానికి పేరు పొందారు. అంత నిజాయితీ, అంత పాండిత్యం, అభిరుచి ఇప్పుడు చాలా అరుదు.

**15. ఎన్నో పుస్తకాలు రాసిన అనుభవం మీది. ఆయా రచనల్లో మీకు రాళ్ళపల్లి వారి ఆలోచన లేమైనా తోడ్పడింటే చెప్పండి.**

**జ.** రాళ్ళపల్లి వారి వల్ల నేను నేర్చు కొన్నది ముఖ్యంగా ఏదైనా నిజాయితీగా చెప్పటం, అందరికీ అర్థమయ్యేట్లు చెప్పటం. ఎంతటి క్లిష్టమైన విషయాన్నయినా సాధ్యమయినంత సరళంగా స్పష్టంగా చెప్పటం అలవాటు చేసుకొన్నాను.

**16. రాళ్ళపల్లి వారి పీఠికల విశిష్టత ఏమిటి? వాటిలో మీకు నచ్చిన పీఠికలు ఏవి?**

**జ.** అనుకున్నది చెప్పటం. కృత్రిమమైన పొగడ్తలు, అబద్ధాలు లేకపోవటం. అన్నమాచార్యుల సంకీర్తనలకు రాసిన పీఠికలు, అవసరమైన చోట్ల చురకలు వేస్తూ ఆరుద్రగారికి రాసిన పీఠిక మొదలైనవి.

**17. రాళ్ళపల్లి వారి కాలంలో కొనసాగిన విమర్శకు, ఇప్పుడు వస్తున్న విమర్శకు వ్యత్యాసం ఏమైనా ఉందా?**

**జ.** రానురాను విమర్శ అన్నది వస్తునిష్ఠగుణం తగ్గి ఆత్మాశ్రయ గుణం ఎక్కువవుతూ ఉంది. నాలుగు మంచి మాటలు ఉండవచ్చు కాని అబద్ధాలు రాయటం, అసలు కంటే కొసరు ఎక్కువ కావటం, వివాదాలే విమర్శ అనుకోవటం. ఏదో ఒక సిద్ధాంతానికి నిబద్ధులై ఉంటేనే గొప్ప విమర్శకులనుకోవటం తగవు.

**18. తెలుగు సాహిత్య విమర్శలో రాళ్ళపల్లి వారిని ఒక యుగ పురుషుడుగా భావించవచ్చా?**

**జ**. యుగ పురుషుడు లాంటి పదాలు అక్కరలేదు. ఒక మహనీయుని కృషిని గుర్తించి దానిలోని మంచి విషయాలను స్వీకరించి భవిష్యత్తును రూపొందించుకోవటం ముఖ్యం.

# ప్రశ్నావళి : 2

## డి. చంద్రశేఖర్ రెడ్డి గారు చెప్పిన అభిప్రాయాలు (ఫిబ్రవరి 23, 2019.శనివారం)

**1. సార్! మీరు తొలిసారిగా రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి గురించి ఎలా తెలుసుకున్నారు? ఏ స్థాయిలో?**

**జ.** రాళ్ళపల్లి వారి గురించి మాకు హైస్కూల్లోనే పరిచయం ఉండేది. మా తెలుగు పండితులు నీల సమయాది శర్మగారి ద్వారా రాయలనాటి రసికత మొదలైన వ్యాసాల్ని చదువుకున్నాం. శర్మగారి శైలి చాలా ఆకర్షణీయంగా ఉండడం వల్ల వారి రచనలు చదివేందుకు ప్రయత్నం చేశాం. కాని అప్పుడు పుస్తకాలు దొరికేవి కావు. పైగా మాకు అప్పుడు చిన్నవయసు కూడాను. తర్వాత ఆంధ్ర సారస్వత పరిషత్తు లో చదువుతున్న రోజుల్లో అక్కడున్న ప్రచురణాలయంలో రాళ్ళపల్లి వారి 'గాథాసప్తశతీ సారము' ఉండేది. ఇందులో ప్రతి పద్యాన్ని మననం చేసే వారం. దీనికి రెండు కారణాలు ఉన్నాయి. మాకు ఆంధ్రుల చరిత్ర సంస్కృతి, ఆంధ్రుల సాంఘిక చరిత్ర అనేవి పాఠ్యాంశాలుగా ఉండేవి. ఆంధ్రుల చరిత్ర సంస్కృతిలో శాతవాహనుల్లో హాలుడు రాసిన గాథాసప్తశతి ప్రధానమైనది. ఇందులో అనేక మంది కవులూ, కవయిత్రులు ఉండేవారు. వీరు రాసిన ఒక్కొక్క గాథను మాకు అలంకార శాస్త్రంలో భాగంగా ధ్వనికి ఉదాహరణగా చెప్పేవారు. అదే సమయంలో ప్రతాపరుద్రయశోభూషణం వంటి గ్రంథాలను అలంకారశాస్త్ర వాచకాలుగా చదవడం వల్ల 'గాథాసప్తశతి' మీద చాలా మంచి అభిప్రాయం ఉండేది. ఇందులో సరళంగా, స్వతంత్రంగా తెలుగులో రాసిన కవిత్వం లాగా అనంతకృష్ణశర్మగారి అనువాదం ఉండేది. దీని ద్వారా మేము అప్పుడు చాలా ప్రభావితం అయ్యాం.

**2. రాళ్ళపల్లి వారి రచనల్లో మీకు బాగా నచ్చినవి ఏవి? ఎందుకు?**

**జ.** ప్రత్యేకంగా ఒక రచనను మాత్రమే చెప్పలేం గాని దాదాపు రాళ్ళపల్లి వారు రాసిన అన్ని రచనలు బాగుంటాయి. ప్రధానంగా ఆయన వివేచన శక్తి వల్లా, విశ్లేషణ పద్ధతి వల్లా, కొట్టవచ్చినట్లు చెప్పే అభిప్రాయ ప్రకటన వల్లా ఆ రచనలు మనకు నచ్చుతాయి. ఈ లక్షణాలు వారి రచనల్లో మొదటి నుంచి చివరి వరకు కొన సాగుతాయి. అయితే శర్మగారు రాసిన రచనల్లో గాథాసప్తశతి బాగా ఆకట్టుకొంటుంది. మిగతావి అంతగా చదివి మననం చేసిన సందర్భాలు లేవు. ప్రత్యేకించి విమర్శపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాను. ముఖ్యంగా 'నాటకోపన్యాసాలకు అనుగుణంగా పానుగంటి వారి 'సాక్షి' లో సారంగధర లాంటి వ్యాసాలను చదివి వాటిని తులనాత్మకంగా అర్థం చేసుకున్నాం. అప్పుడప్పుడు చర్చలు, విమర్శలు కూడా చేసుకున్నాం. ఆ విధంగా ఆయన రచనలు బాగా జ్ఞాపకం ఉండిపోయాయి.

**3. వేమనపై వచ్చిన పరిశోధనల్లో రాళ్ళపల్లి వారి ప్రత్యేకత ఏమిటి?**

**జ.** వేమన మీద ఇప్పటికి కూడా రాళ్ళపల్లి వారిని ఉటంకించినట్లు ఎవరిని ఉటంకించరు. తర్వాత ఎంతో మంది పరిశోధకులు వచ్చి ఉండవచ్చు. ఎన్నో పరిశోధనలు జరిగి ఉండవచ్చు. వేమనను సి. పి. బ్రౌన్ వెలుగులోకి తెచ్చినప్పటి నుంచి బాగా ప్రచారం ఉండేది. అప్పటి నుంచి

వేమనలోని ఆలోచన శక్తిని, పద్యాల వైచిత్రిని, దేశ కాల పరిస్థితుల గురించి ఎంతో రాస్తూ వచ్చారు. కాని ఒక సమగ్రమైన, శాస్త్రీయమైన పరిశోధన అంటే రాళ్ళపల్లి వారి ప్రసంగాలేనని చెప్పవచ్చు. తెలుగు సాహిత్యంలో ఎప్పటికీ నిలిచిపోయే రచనగా వేమన గ్రంథాన్ని భావించవచ్చు.

**4. రాళ్ళపల్లి వారి భాషాశైలిపై మీ అభిప్రాయం తెలిపి, వ్యావహారిక భాషకు లోనయ్యారా? లేదా తెలపండి.**

**జ.** రాళ్ళపల్లి వారి భాషా శైలి తొలి రోజుల్లో పూర్తిగా గ్రాంథికంగానే ఉంది. కాని రాను రాను వీరి భాష గ్రాంథికమే ఐనా వ్యావహారికానికి చాలా దగ్గరగా వచ్చింది. అది కూడా ఆయన రెండో భాగంలో చాలా సరళమైన భాషలో వ్యాసాలను రాశారు. శర్మగారి రచన సరళమైందే. కాని కట్టమంచి రాళ్ళపల్లిలు వ్యాహారిక భాషా ఉద్యమంలో పాల్గొన లేదు. కాని భాష విషయంలో వీరు సరళంగా రాయడానికే మొగ్గు చూపారు. ఆ రోజుల్లో దాదాపు అందరూ అదే భాష రాసేవారు. ముఖ్యంగా వీరి శైలి చాలా ధారాళమైనది. ఈ విషయంలో కట్టమంచి, రాళ్ళపల్లిలు పానుగంటి మొదలైనవారికి తీసిపోరు.

**5. రాళ్ళపల్లి వారు ఏర్పరచిన విమర్శ మార్గం భావితరాలకు ఎలా ఉపయోగపడుతుందంటారు?**

**జ.** రాళ్ళపల్లి వారి విమర్శ మార్గం అనేది ఎప్పటికీ శాశ్వతంగా ఉండిపోయే మార్గమే. ఎందుకంటే సత్యా సత్య వివేచన చేసే సందర్భంలో పక్షపాతం లేకుండా నిర్భయంగా తన అభిప్రాయాల్ని చెప్పే లక్షణం ఎక్కడ ఉంటుందో అది అందరికీ ఆదర్శంగానే ఉంటుంది. ఎవరో మనకు ఇష్టం లేదు కాబట్టి వారిని ధూశిస్తూ రాయటం, ఇష్టం కాబట్టి పొగడుతూ రాయటం అనేది చేస్తే దానికి గుర్తింపు ఉండదు. ఈనాడు ఎక్కువగా పొగడ్తల్నే ఇష్టపడుతున్న సందర్భం కనబడుతుంది. ఏదైన విమర్శ చేస్తే అందులో మంచి చెడులను ఆలోచించేవారు చాలా తక్కువగా ఉన్నారు. ప్రస్తుతం కాలికమైన రచనలు వస్తున్నాయి. హేతుబద్ధత అనేది నేడు కొరవడింది. ముఖ్యంగా మనం చెప్పే అభిప్రాయం లోకానికి ఉపయోగపడేదై ఉండాలి. నేడు పాఠకుల్లో మంచి చెడ్డలను గ్రహించి శక్తి కొరవడింది. మంచి విమర్శకుడి వల్ల రచనని మెరుగ్గా అర్థం చేసుకోవడానికి పాఠకుడికి కలుగుతుంది. అది విమర్శకుడికి ఉండాల్సిన లక్షణం. అంటే యుక్తాయుక్త విచక్షణ లేకుండా ప్రమోజనం ఉండదు. తర్వాత ఏం చదవాలి ఏం చదవకూడదన్నది మనకు తెలియాలి కదా. ఈ విచక్షణ నేడు తక్కువైంది. రాజకీయంలో ఫ్యాక్షనిజం లాగా సాహిత్యంలో కూడా ఫ్యాక్షనిజం వచ్చేసింది. ఇలా కాకుండా సాహిత్యం మొత్తాన్ని ఆస్వాదించే గుణం ఉండాలి. ఏదైన రచన చేసినప్పుడు అందులోని లోపాలను ఏవరైన చూపితే వాటిని తెలుసుకొని సరిదిద్దుకొనే గుణం అలవరచుకోవాలి. కాబట్టి రాళ్ళపల్లి వారి విమర్శ నుంచి మనం నేర్చుకోవాల్సి నది ఏమిటంటే! మనం ఒక స్వతంత్రమైన ఆలోచనను ఏర్పరచుకోవడం. దీన్ని నిర్భయంగా బయటికి చెప్పడం. పక్షపాత బుద్ధి లేకుండా

ఉండటం. ఇదంతా కూడా లోకోపకారం కోసమే. కాబట్టి గొప్ప విమర్శకుల నుండి మనం తప్పకుండా నేర్చుకోవాల్సిన విషయాలు.

**6. కట్టమంచి రామలింగారెడ్డిగారి విమర్శకు, రాళ్ళపల్లి వారి విమర్శకు భేదా లేమైన కనిపిస్తే తెలపండి. రెడ్డిగారి ప్రభావం శర్మగారి మీద ఎంతవరకు ఉందంటారు?**

**జ.** ఒక సారవంతమైన, బలమైన సమాజం ఎట్లా ఉంటుంది. ఈ సమాజం నుండి వచ్చే కళలు ఎలా ఉంటాయి. అదే బలహీన మైన సమాజం అయితే ఆ సమాజం నుండి వచ్చే కళలు మొదలైనవి ఎట్లా ఉంటాయి. అనే విషయంలో కట్టమంచి, రాళ్ళపల్లి ఆలోచనలు దాదాపు చాలా దగ్గరగా ఉంటాయి. ప్రభావం ఎప్పుడూ ఉండనే ఉంది. కాకపోతే కట్టమంచి వారి కొన్ని అభిప్రాయాలతో శర్మగారు ఏకీభవించక పోవచ్చు. ఉదాహరణకు రంగనాథ రామాయణం విషయంలో జరిగినది తెలిసిందే కదా. కాబట్టి అభిప్రాయాలు చాలా స్పష్టం. ఆలోచనల ధోరణుల్లో పోలికలున్నాయి. అయితే కట్టమంచి వారు ఏది చెప్తే అది శర్మగారు చెప్తారనేది మాత్రం లేదు. తందాన అంటే తాన అనే బాపతు కాదు శర్మగారు. స్పష్టమైన స్వతంత్రమైన అభిప్రాయాలు ఉన్నాం. ఈ విధంగా మనం అర్థం చేసుకోవాల్సిందే మంటే! స్వతంత్రమైన, స్పష్టమైన అభిప్రాయాలు లేకపోతే ఏ విమర్శకుడు కూడా నిలబడే అవకాశం లేదు. ఎవరిదారిలోనో నడిచేవాడు ఆ దారిలోనే ఉంటాడంతే. కాని స్వతంత్ర విమర్శకుడు కాలేడు. దీన్నిబట్టి శర్మగారికి స్వంత స్థానం ఉందని చెప్పవచ్చు.

**7. సాధారణంగా విమర్శకులు కొన్ని సందర్భాల్లో ఎటు తేలని అభిప్రాయాలు చెప్తుంటారు. అలాంటి అభిప్రాయాలు రాళ్ళపల్లి వారు ఏమైన చెప్పారా? మీకు తెలిసినంత వరకు.**

**జ.** శర్మగారి అభిప్రాయాల్లో అటువంటివి ఎక్కడా కనిపించవు. అంటే తెలియని విషయాల్ని తెలిసినట్లు చేప్పే ప్రయత్నం వారు చేయరు. ప్రధానం ద్వైదీభావం ఉండటానికి కారణం. మనకి స్పష్టమైన అభిప్రాయం లేకపోవడం. పక్షపాత బుద్ధి ఉండటం. ఈ రెండు లేనప్పుడు అభిప్రాయం ఎప్పుడు స్పష్టంగానే ఉంటుంది. తప్పుదారి పట్టించదు. నిజానికి కట్టమంచి వారు అలంకారికులను అనుసరించరు. కాని రాళ్ళపల్లి వారు అంతో ఇంతో అనుసరిస్తూ ముందుకు నడిచారు. ఈ విషయంలో వారిద్దరికీ కొంత వరకూ తేడాలు ఉన్నాయి. అయితే కొన్ని సందర్భాల్లో ఇద్దరూ ఏది చెప్పిన ఒకేలాగా అనిపిస్తాయి. కాని ఎవరి ప్రత్యేకత వారిది. కట్టమంచి వారి అభిప్రాయాలను కురుగంటి సీతారామాచారులు మొదలైన వారు పనికి రానివని అన్నారు. ప్రస్తుతం ఎవరి అభిప్రాయాలు నిలబడ్డాయో మనకు తెలుసు. స్పష్టమైన అభిప్రాయాలు ఉన్న విమర్శకులు ఎప్పుడూ కూడా అటు ఇటు తేలని అభిప్రాయాలు చెప్పరు.

**8. వాద, వివాదాల్లో విమర్శకుడి సంస్కారం ఎలా ఉండాలంటారు?**

**జ.** విమర్శకుడంటే పక్షపాత బుద్ధి లేకపోవడం ఒకటే ప్రధానం. మనలో ఉండే లోపాల్నీ ఎవరైన చెబితే వాటిని స్వీకరించే గుణం ఉండాలి. వినయ విధేయతలు నేర్చుకోవాలి. కొత్తగా వచ్చే

విమర్శకులందరూ కూడా ఈ లక్షణాలను అలవరచుకోవాలి. లేదంటే ఎవరి దారి వారిది అవుతుంది అంతే.

**9. రాళ్ళపల్లి వారి విమర్శను ఎవరైనా ముందుకు తీసుకెళ్ళినట్లు మీరు గమనించారా?**

**జ.** రాళ్ళపల్లి వారి మార్గంలో ఎవరూ పెద్దగా రచనలు చేసినట్లు కనిపించదు. కానీ ఇది ఒక మార్గంగా తీసుకొంటే దీనిలో ఎక్కువ దూరం ప్రయాణించిన వారు కనిపించరు. రాళ్ళపల్లి వారి శైలి కూడా చాలా భిన్నమైంది దాన్ని అనుసరించడం అంత సులభం కాదు. రాళ్ళపల్లి వారికి విస్తృతమైన జ్ఞానం ఉంది. ఇంతకు ముందు ఎవరో చెప్పిన అభిప్రాయాలను వారు చెప్పి చేతులు దులుపుకునే రకం కాదు. అయినా ఈ అనుసరణ అనేది దేశకాల పరిస్థితులను బట్టి ఉంటుంది. అయితే పూర్వులు చేసిందే మనం చేయాలంటే అది కుదరని పని. నిజానికి శర్మగారి లాంటి రచయితల నుంచి మనం ఏం నేర్చుకోవాలంటే? ఏ రచననైనా విమర్శించేటప్పుడు రచయిత మీద సహానుభూతి ఉండాలి. అందులో గుణ దోష విచారణ చేయగలిగి ఉండాలి.

**10. సాహిత్య విమర్శలో రాళ్ళపల్లి వారిని అభిరుచి విమర్శకులని అంటారు. ఇది ఎంతవరకు సమంజసమంటారు?**

**జ.** అసలు విమర్శంతా అభిరుచే. ఒక రచన చదవడం వల్ల మనలో కలిగిన భావాన్ని వ్యక్తం చేసినప్పుడు అది అభిరుచి విమర్శ అవుతుంది. అభిరుచి అనేది వ్యక్తిగతమా? సామాజికమా అన్నప్పుడు అందులో కొంత తేడా ఉంటుంది. శాస్త్ర పరంగా, అభిప్రాయ పరంగా ఏదో ఒక సామాజిక దృక్కోణానికి చెందకుండా ఉన్నప్పుడు వచ్చే విమర్శ ఎప్పుడూ కూడా అభిరుచి విమర్శ అవుతుంది. ఇందులో మళ్ళీ తేడాలు ఉంటాయి. వ్యక్తిగతమైన అభిరుచి, కళారూపాలను ఆనందించగలిగే సామర్థ్యం ఒక్కొక్కరికి ఒక్కో విధంగా ఉంటుంది. ఒక రచయితగా ఒక రచనను ఏ దృక్కోణంతో చదువుతామన్నది ముఖ్యం. ఏ ప్రక్రియను చదువుతామో దాని లోతుపాతులు తెలుసుకోవాలి, తెలిసుండాలి. ఈ అభిరుచి అనేది మన చుట్టూ ఉన్న సమాజంలో భాగంగా ఏం నేర్చుకున్నాం, ఏం నేర్చుకోవాలనే దాన్ని బట్టి ఉంటుంది. కళా రూపాలను ఆనందించడంలో తేడాలు ఏమీ ఉండవు. అన్ని కళలకు ఆయా మూల సూత్రాలు ఉంటాయి. ఒక్కో కళకు ఒక్కో వైవిధ్యం ఉంటుంది. కాబట్టి శర్మగారిని అభిరుచి విమర్శకులనడం సముచితం.

11. **అనంతకృష్ణశర్మగారు సంప్రదాయ విమర్శకుడా?**

**జ.** ఆధునిక విమర్శకులు ఎవరు సంప్రదాయ విమర్శకులు కారు. ప్రాచీన సాహిత్యాన్ని అధ్యయనం చేయడానికి, విమర్శించడానికి సంప్రదాయ విమర్శను వాడుకుంటున్నాం. లాక్షణిక విమర్శ అనేది ఒకటి ఉంది కదా. దాన్ని సంప్రదాయ విమర్శ అంటాం. 'మంచి అన్నది గతమున కొంచమేనోయ్', 'గతకాలము వచ్చు కాలము కంటెన్'... లాంటివి సంప్రదాయ విమర్శకు వర్తిస్తాయి. రాళ్ళపల్లి వారిలో సంప్రదాయ విమర్శ లేదు. ఆయన మార్పుని ఆహ్వానించాడు. పాత అంతా మంచిది, కొత్త అంతా రోత అనే ధోరణి ఆయనకు లేదు. శర్మగారి

పీఠికల్లో కూడా గుణ దోష విచారణ బాగా ఉంది కదా!. ఇవన్నీ ఒక శాస్త్రానికి కట్టుబడి చేసినవి కావు కదా! వాటిల్లో అంత సరుకు కూడా లేదు కదా! కాలాను క్రమంగా మనలో చాలా ఆలోచనలు వస్తుంటాయి. అనుకూల విమర్శ, ప్రతికూల విమర్శలను దృష్టిలో పెట్టుకొంటే అనంతకృష్ణశర్మగారిలో ప్రతికూల విమర్శకు తావుండదు. వీరి రచనలు సార్వకాలికం, సార్వ జనీనం.

**12. రాళ్ళపల్లివారికి విమర్శకునిగా వచ్చినంత గుర్తింపు కవిగా వచ్చిందంటారా?**

**జ.** రాళ్ళపల్లివారికి కవిగా అంతా పేరు లేదు. అయితే శాలివాహన గాథాసప్తశతీ సారము వల్ల వీరిని మంచి కవిగా గుర్తించవచ్చు. ఇది అనువాద రచన అయినప్పటికినీ. పైగా ఆయన కవితల్ని సాహితీ వేత్తలు అంతగా ప్రస్తావించినట్లు కనిపించదు. అయితే శర్మగారు మంచి కవే కావచ్చుకానీ ఆయన స్థానం మాత్రం విమర్శనే చెప్పాలి. ఆయన విస్తృతంగా కవిత్వం రాయలేదు. అవి గ్రంథ రూపంలో రాలేదు. అందువల్ల కవిగా ఆయన కీర్తి ఆశించినట్లుగా కనబడదు.

**13. తెలుగు సాహిత్యంలో భావకవిత్వం కొందరిని ఆకర్షించింది. కాని రాళ్ళపల్లి వారిని ఎందుకు ఆకర్షించలేకపోయిందంటారు?**

**జ.** భావకవిత్వం పూర్తిగా ఆయన్ను ఆకర్షించలేదని చెప్పేందుకు లేదు. ఉదాహరణకు ఆయన కవితలు భావకవిత్వంలోకే ఉన్నాయి. మొదట ఆయన కవిగానే ఉండాలని అనుకోలేదు కదా! అంటే తన ప్రధానమైన వ్యాపకం, వ్యావృత్తి కవిత్వం కాదు కాబట్టి దాని గురించి పెద్దగా చెప్పేదేం లేదు. ఇప్పుడు అక్కిరాజు ఉమాకాంతం మొదలైన కొందరు భావకవిత్వాన్ని ధూషించారు. కాని శర్మగారు ఎక్కడా భావి కవిత్వాన్ని దూషించ లేదు. కాబట్టి ఎవరైన ఏ కవిత్వంలోనైన గుణం ఉంటే అంగీకరిస్తారు, లేకుంటే విమర్శిస్తారు. దీన్ని బట్టి శర్మగారికి భావ కవిత్వంపై ప్రత్యేక ఆకర్షణ ఆయనలో ఏమీ లేదు. సంప్రదాయం ఎక్కువేగాని అంది గడ్డ కట్టుకో పోయినది కాదు.

**14. రాళ్ళపల్లి వారి అనువాద విశిష్టత ఏమిటి?**

**జ.** ఆయన చాలా అందంగా అనువాదం చేశారు. అంటే వచన అనువాదం అంత ఎక్కువ చేయలేదు. కవిత్వం, పద్యాలు ఎంతో ఆకట్టుకునేలా ఉన్నాయి.

**15. రాళ్ళపల్లి వారి పీఠికల విశిష్టత ఏమిటి? వాటిలో మీకు నచ్చిన పీఠికలు ఏవి?**

**జ.** శర్మగారి పీఠికల్లో గుణదోషాల చర్చ చాలా బాగుంటుంది. పైగా రచయితలను అభినందించే ధోరణి చాలా బాధ్యతాయుతంగా ఉంటుంది. ఉదాహరణకు సురవరం ప్రతాపరెడ్డి 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' గ్రంథాన్ని చదివి కొన్ని అభిప్రాయాలు రాసి రెడ్డిగారికి పంపితే వారు ఆ అభిప్రాయాలను యథావిధిగా తమ గ్రంథంలో ప్రచురించారు. ఆయన పీఠికలు అల్పాక్షరాలలో అనల్పార్థం అన్నట్టుగా ఉంటాయి. వ్యర్థమైనవి దాదాపు ఉండవు.

అంటే హాస్యం, వ్యంగ్యం ప్రదర్శించినప్పుడు ఒకటి అర ఉండవచ్చేమోగాని, ఈ వాక్యం లేకపోతే ఏమి అనే ప్రశ్న వేసుకోవడానికి అవకాశం ఉండదు.

**16. మీకు తెలిసినంత వరకు శర్మగారి సాహిత్య కృషిపై ఇంకా ఎలాంటి పరిశోధనలు జరగాల్సిన ఆవశ్యకత ఉంది?**

**జ.** పరిశోధన అనేది వారి అన్ని రచనలపైన జరగవచ్చు. ప్రత్యేకించి నాటకోపన్యాసాల మీదే సుదీర్ఘమైన పరిశోధన చేయవచ్చు. మంచి పరిశోధన అంశం అవుతుంది. స్థూలమైన పరిశోధనలే జరిగాయి గాని, సూక్ష్మమైన పరిశోధనలకు సమయం వచ్చినట్లు లేదు. ఒక రచనను మనం ఎన్నోకోణాలుగా పరిశీలించవచ్చు. నిజానికి శర్మగారి వదరుబోతు పీఠిక చదివితే సాక్షి, వదరుబోతు రెండు చదివినట్లే అవుతుంది. ఆ రెండింటి లక్షణాలు పూర్తిగా చెప్పారు. ఈ పీఠిక చదివి మూలాన్ని పరిశీలిస్తే శర్మగారి అభిప్రాయాలు బాగా తెలుస్తాయి. అలా ఒక ఐదు పుటల్లోనే ఆ రెండు రచనల తత్త్వాన్ని చెప్పడం అనేది మామూలు విషయం కాదు. చాలా అద్భుతంగా రాశారు శర్మగారు. ఆ పోలిక కూడా శర్మగారిలా చేయాలంటే ఎంతో పరిజ్ఞానం ఉండాలి. ఇలా రాళ్ళపల్లి వారిపై ఎన్నో పరిశోధనలు చేయవచ్చు. శర్మగారిపై ఒక పిహెచ్. డి., వచ్చింది ఇక అయిపోయిందని భావిస్తే సరిపోదు. అన్నమాచార్యుల కీర్తనల విషయంలో శర్మగారి కృషి అమోఘమైనది. దీన్ని సంగీత శాస్త్రంలో గొప్ప పరిశోధన చేయవచ్చు. పరిశోధకులకు అభిరుచి ఉంటే దేనిపైన అయినా పరిశోధన బాగా చేయవచ్చు.

**17. తెలుగు సాహిత్య విమర్శలో రాళ్ళపల్లి వారిని ఒక యుగ పురుషుడుగా భావించవచ్చా?**

**జ.** దీనికి సంబంధించి నేను '20వ శతాబ్దపు తెలుగు విమర్శకులు' అని ఓ రేడియో ప్రసంగం చేశాను. అందులో పది మంది విమర్శకుల్ని తీసుకున్నాను. ఆ పది మందిలో అనంతకృష్ణశర్మగారు ఒకరు. కాబట్టి తెలుగు సాహిత్య విమర్శ గురించి మాట్లాడాల్సి వస్తే విమర్శకుల్లో మొదటి ముగ్గురు లేదా నలుగురిలో శర్మగారి పేరు ఉండాల్సిందే. ఇలా ఉండడానికి ప్రధాన కారణం తాను ఏది రాసినా లేదా ఏది చెప్పిన సూటిగా, స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా వెల్లడించే అభిప్రాయాలు ఆ పద్ధతులే ఆయన్ను గొప్ప విమర్శకుడిగా నిలబెట్టాయి. కాబట్టి ఆయన ముమ్మాటికి యుగ పురుషుడే. కాదనడానికి వీలు లేదు.

## ప్రశ్నావళి : 3

**సి. మృణాళిని గారి అభిప్రాయాలు : (జూలై 4. 2018)**

**1. మేడమ్! తాతగారితో (శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ) మీ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని వివరిస్తారా?**

**జ.** నేను తాతగారి కుటుంబానికి చెందిన దాన్నే. మా అమ్మ శర్మగారి తొలి సంతానం. ఆమె తర్వాత ఇద్దరు మగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు. మా అమ్మమ్మ చాలా విశిష్టమైన వ్యక్తి. మాకు చిన్నప్పుడు భాగవతం చెప్పింది, పద్యాలు నేర్పింది అమ్మమ్మే. మా అమ్మా, మా ఇద్దరు పిన్నమ్మలు తాతగారి దగ్గర సంగీతం నేర్చుకున్నారు. మామయ్యలలో పెద్ద మామయ్య ఫణిశాయి వయొలిన్, గాత్రం రెండూ అభ్యసించారు. ఆయన బెంగుళూరులో కచ్చేరీలు కూడ చేసేవారు. చిన్న మామయ్య జయంత తిరుపతిలో ఉంటారు. ఆయన సంగీతంలో కంటే సాహిత్యంలో ఎక్కువ అభిరుచి చూపారు. ఇంగ్లీష్ రీడర్ గా పని చేసారు. మా పెద్ద పిన్ని గొప్ప వైణికురాలు. ఆమె ఎంతోమంది శిష్యులను తీర్చిదిద్దింది. ఇప్పుడు చిన్న మామయ్య తిరుపతిలో, చిన్న పిన్ని బెంగుళూరులో ఉన్నారు. వాళ్లందరితో నాకు మంచి అనుబంధం ఉంది.

**2. బాల్యంలో మీ తాతగారితో గడిపిన మధుర జ్ఞాపకాలను తెలపండి. ఆయన మైసూరు, తిరుపతి, బెంగళూరు ప్రాంతాల్లో నివసించారు కదా. ఏ ప్రాంతంలో ఉన్నప్పుడు మీకు మీ తాతగారితో గడిపే అవకాశం వచ్చింది?**

**జ.** నేను ఆయనతో ఉన్నది తిరుపతిలో మాత్రమే. మూడేళ్ల పాటు అక్కడ 5,6,7 తరగతులు చదువుతున్నప్పుడు చిన్న మామయ్య ఇంట్లో ఉండేదాన్ని. తాతగారు అప్పుడు అక్కడే ఉన్నారు. ఆయనంటే భయంగానే ఉండేది. మమ్మల్ని ఎప్పుడూ తిట్టకపోయినా, సీరియస్ గా ఉంటారని భయపడే వాళ్లం. మాకు రోజూ శ్లోకాలు నేర్పే వారు. రాత్రి భోజనానికి ముందు నేను, మా అన్నయ్య బాలగోపాల్, అక్కలు మాధవి, మయూరి శ్లోకాలు తాత ఎదుట కూర్చుని చెప్పాకే భోజనం చేసే వాళ్లం. 7 వ తరగతిలో ఉన్నప్పుడు ఇంటర్ స్కూల్ పోటీకి మా స్కూలు నుంచి పద్య పఠనానికి నేను ఎన్నికయ్యారు. అప్పుడు ఏ పద్యం చెప్పాలని తాతగారినే అడిగాను. పోతన భాగవతంలోని ఘనుడా భూసురుడేగెనో చెప్పమన్నారు. అది చెప్పి మొదటి బహుమతి, కప్పు గెలుచుకున్నాను.

**3. మీ తాతగారు ఎప్పుడైనా మీ ఇంటికి వచ్చి, ఎక్కువ రోజులున్న సందర్భాలున్నాయి**

**జ.** లేదు. అమ్మమ్మ ఉండేది కానీ, తాతగారు రాలేదు.

**4. మీరు తాతగారితో ఉన్నప్పుడు ఎవరినైనా సాహిత్య ప్రముఖులను చూడడం గాని, ఆయనతో సాహిత్య సమావేశాలకు వెళ్ళడం గాని జరిగిందా?**

**జ.** నేను ఆయనతో ఉన్న రోజుల్లో చిన్నదాన్ని కనక సమావేశాలకు వెళ్లే ప్రసక్తి లేదు. కానీ పుట్టపర్తి నారాయణాచార్యులు, ఆరుద్ర, తిరుమల రామచంద్ర వంటి వారు మా ఇంటికి వచ్చేవారు. గౌరి పెద్ది రామసుబ్బశర్మగారు రోజూ కలిసేవారు.

**5. మీ తాతగారు వారి జన్మస్థానమైన రాళ్ళపల్లి గ్రామం గురించి గానీ, వారి పూర్వీకుల గురించి గానీ ఎప్పుడైనా మీతో చెప్పేవారా?**

**జ.** లేదు. తాత తన గురించి ఏ విషయమూ మాతో ఎప్పుడూ చెప్పలేదు.

**6. రాయలసీమ ప్రాంతీయ అస్తిత్వం గురించి రాళ్ళపల్లి వారు మీతో చెప్పిన సందర్భాలున్నాయా?**

**జ.** లేదు

**7. ఏ స్థాయిలో మీ తాతగారి గురించి మీరు బాగా అవగాహన చేసుకున్నారు?**

**జ.** నేను ఎం. ఏ తెలుగు చేయడం మొదలుపెట్టాకే ఆయన సాహిత్య విశేషాల గురించి ఆలోచించాను. ఆయన గురించిన సాహిత్య విశ్లేషణలు చేయడానికి ఇంకా ఎక్కువ కాలమే పట్టింది. ఎం. ఏ పూర్తయ్యేవరకూ నేను రాళ్ళపల్లి వారి మనమరాలినని మా అధ్యాపకులకు చెప్పలేదు. ఎం. ఫిల్ లో ఉండగా, తాతగారు చనిపోయారు. అప్పుడు తెలిసింది. మా శాఖలో అధ్యాపకులకు. వారందరూ తమకు ఆయనతో ఉన్న పరిచయాన్ని నాతో పంచుకున్నపుడు, ఆయన సాహిత్యం గురించి అర్థం చేసుకోవడం ప్రారంభమైంది.

**8. రాళ్ళపల్లి వారి రచనల్లో తొలిసారిగా మీరు చదివినది ఏది? ఏయే రచనలు మిమ్మల్ని బాగా ఆకట్టుకున్నాయి?**

**జ.** మొట్టమొదట చదివింది సారస్వతాలోకము. ఆ తర్వాత వేమన, నాటకోపన్యాసములు. నాకు ఎక్కువగా నచ్చింది సారస్వతాలోకము.

**9. మీ తాతగారి సృజన సాహిత్యంపై మీ అభిప్రాయం?**

**జ.** తాతగారి సృజన సాహిత్యం, అంటే మీరాబాయి, తారాదేవి వంటివి చాలా ఆలస్యంగా చదివాను. కానీ నిజానికి ఆయన అనువాదాలు, సంగీతకృతులు నా ఉద్దేశంలో సృజన సాహిత్యానికి ఏమీ తీసిపోవు. ఆయన విమర్శలో కూడ సృజనాత్మకత తొణికిసలాడుతూ ఉంటుంది.

**11. పాశ్చాత్య, ప్రాచీన, ఆధునిక కవుల్లో రాళ్ళపల్లి వారికి ఇష్టమైన కవులెవరెవరు?**

**జ.** తెలుగు కవులలో ఆయనకు తిక్కన, వేమన ఎక్కువ ఇష్టం, నాకు అర్థం అయినంతవరకూ. అలాగే ఎర్రన, పెద్దనలు కూడ ఆయనకిష్టమే. ఆధునిక కవులలో ఆయనకు కొన్ని కావ్యాలు వచ్చాయి గానీ, అభిమాన కవి ఉన్నాడని అనుకోను.

**12. ప్రాచీన, ఆధునిక సాహిత్యాల్లో వారికి దేనిపై మక్కువ ఎక్కువ?**

**జ.** సహజంగా ప్రాచీన సాహిత్యమే. ఆధునిక సాహిత్యంలో గేయ కావ్యాలు, నాటకాలను ఆయన ఎక్కువ ఇష్టపడ్డారని అనిపిస్తుంది. ధర్మవరం, కోలాచలం నాటకాలు ఆయన ఇష్టపడ్డారు. కన్యాశుల్కం నాటకాన్ని కూడ మెచ్చుకున్నారు.

**13. వేమనపై ఇప్పటి వరకు చాలా మంది ప్రముఖులు పరిశోధనలు చేశారు. వాళ్ళలో రాళ్ళపల్లి వారి పరిశోధన ప్రత్యేకత ఏమిటి?**

**జ.** అందరికంటే ముందు పరిశోధన చెయ్యడమే అసలు విశేషం. అప్పటివరకూ సి.పి. బ్రౌన్ వేమన పద్యాలను బయటకు తీసుకువచ్చినప్పటికీ వాటిమీద విశ్లేషణలు పెద్దగా జరగలేదు. ఇందులో ఆయన historical criticism (చారిత్రక విమర్శ) biographical criticism (కవి జీవిత విమర్శ), తులనాత్మక విమర్శ, సామాజిక విమర్శ, కళా తత్త్వ విమర్శ అన్నిటినీ ప్రదర్శించారు. ఒక పాఠ్యాన్ని, ఒక కవిని ఎలా చదవాలి, ఏయే అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి అని ఆయన చూపించిన మార్గం తర్వాత చాలామందికి అనుసరణీయమైంది. నిజానికి వేమన ద్వారా ఆయన అన్ని రకాల విమర్శనా దృక్పథాలను పరిచయం చేస్తారని అనిపిస్తుంది.

**14. అనంతకృష్ణశర్మ గారి వ్యాసాలు, ఉపన్యాసాల గొప్పతనం ఏమిటి?**

**జ.** రెండిటిలోనూ సమగ్రత, సహృదయ, లోతైన విశ్లేషణ, క్లుప్తత, స్పష్టత, ఖచ్చితత్వం అనే లక్షణాలుంటాయి

**15. రాళ్ళపల్లి వారి భాషాశైలి, హాస్య, వ్యంగ్య వైఖరుల ప్రత్యేకత ఏమిటి? ముఖ్యంగా వ్యావహారిక భాషా ఉద్యమ ప్రభావానికి ఆయన లోనయ్యారా?**

**జ.** ఆయన వ్యవహారిక భాషా ఉద్యమ ప్రభావానికి లోనైనట్టు ఆయన రచనల్లో కనిపించదు. కానీ గురజాడ వారి కన్యాశుల్కం నాటకాన్ని ఆయన చాలా ప్రశంసించారు. ఆయన భాషలో కూడా రాయలసీమ మాండలికం సమృద్ధిగా ఉంటుంది. (ఉదా. దిగంబర కవిత్వాన్ని 'బిత్తలి కవిత్వం'అనడం) కనక మాండలిక ప్రయోగాన్ని ఆయన ఇష్టపడ్డారనిపిస్తుంది. కానీ సంపూర్ణంగా వ్యవహారభాషను వాడే పని ఆయన చేయలేదు. కానీ అటువంటి పుస్తకాలకు పీఠికలు రాసినపుడు దాన్ని విమర్శించలేదు కనక ఆయన వ్యవహారభాష పట్ల సుముఖంగా ఉండేవారని అనిపిస్తుంది. ఇక హాస్య, వ్యంగ్య వైఖరులన్నవి కొందరికి సహజంగా సంక్రమించే గుణాలు. ఆయనకూ అంతే. ఆయనకు వ్యక్తిగతంగా కూడ సెన్స్ ఆఫ్ హ్యూమర్ బాగా ఎక్కువ. ఛలోక్తులతో మాట్లాడడం అలవాటే. విమర్శలో ఆయన ఆ పంథా ఎంచుకోవడం వెనక బహుశా వేమన పట్ల అభిమానం కూడ దోహదం చేసిందేమో. ఆయన వేమన హాస్యం గురించి అన్న మాటలు, ఆయన విమర్శ రచనకు కూడా వర్తిస్తాయి.

**16. తెలుగు సాహిత్యోద్యమాల్లో భావకవిత్వం ఎంతో మందిని ప్రభావితం చేసింది? కాని రాళ్ళపల్లి వారు దానికి లోను కాలేదు ఎందుకు?**

**జ.** రాళ్ళపల్లి వారు అసలు ఏ ప్రభావాలకూ పెద్దగా లోనైనట్టు కనిపించదు. ఆయన అన్నిటినీ చదివారు కానీ దేన్నీ తను అనుసరించాలని అనుకోలేదు. అసలు తనని తాను కవిగా ఆయన చూడలేదు. విమర్శకుడిగానే పరిగణించుకున్నారు. అందుకే భావకవిత్వ రచనలకు ముందు మాటలైతే రాసారు కానీ, దాని ప్రభావానికి లోను కాలేదు.

**17. రాళ్ళపల్లి వారి అనువాద విశిష్టతను చెప్పండి.**

**జ.** రాళ్ళపల్లి వారు అనువదించినవి మూడు. జాయపసేనాని 'నృత్తరత్నావళి', హాలుడి 'గాథాసప్తశతి", సుందరపాండ్య విరచిత ఆర్యా. వీటిలో ఆయన సృజనాత్మకతకు అవకాశం ఉన్నది గాథాసప్తశతి మాత్రమే. ఆయన మూలంలోని పదాలకంటే మూలంలోని భావాలకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చి, సొగసైన తెలుగులో అనువదించడం వల్ల అర్థంలో స్పష్టత, శైలిలో సౌందర్యం రెండు ఒనగూడాయి. ఆయన యథాక్షరానువాదం చెయ్యలేదు. కవి హృదయాన్ని పట్టుకున్నారు. తెలుగు నుడికారంలో దాన్ని ప్రకటించారు అని నాకు తెలిసినంతవరకూ చెప్పగలను.

**18. రాళ్ళపల్లి వారి పీఠికల విశిష్టత ఏమిటి? వాటిలో మీకు నచ్చిన పీఠికలు ఏవి?**

**జ.** పీఠికా రచనలో ఆయన అగ్రగణ్యులు. ప్రస్తుత రచనలోని మంచిని ముందు చెప్పి, విమర్శ తర్వాత చేస్తారు. అదే సమయంలో ఆ రచనకు సంబంధించినవి మాట్లాడుతూ, సమకాలీనమైన అనేక అంశాలపై తన అభిప్రాయాన్ని, విశ్లేషణను జోడిస్తారు. ఉదాహరణకు గుమ్మ రాజు రామకవి '*శ్రీ చౌడేశ్వరీ మాహాత్మ్యము* 'అన్న కావ్యానికి రాసిన పీఠికలో భాషాభిమానం గురించి ఎంతో చక్కగా విశ్లేషించారు. ఆయనలో ఉన్న నిజాయితీ కూడ ఈ పీఠికల్లో వెల్లడవుతుంది. దుర్భాక రాజశేఖర శతావధాని "రాణా ప్రతాపసింహ చరిత్ర' కు రాసిన అభినందనలో, తను ఇంతకుపూర్వం ఇదే కావ్యం మొదలుపెట్టి ఆపేసాననీ, ఈ కావ్యం చూసిన తర్వాత, తను దాన్ని ఆపేయడమే మంచిదయిందనీ ఆయన చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆయన పీఠికలన్నీ రత్నాలే అయినా కొన్ని మరింత మెరుగున్న రత్నాలని చెప్పవచ్చు. సురవరం ప్రతాపరెడ్డి గారి '*ఆంధ్రుల సాంఘిక చరిత్రకు* 'పై రాసిన లేఖలో దానిలో రాళ్ళపల్లి వారు ఎంత లోతుగా ఒక గ్రంథాన్ని చదువుతారో, ఆయనకు ఎన్ని విషయాల్లో ఎంత పరిజ్ఞానం ఉందో తెలుస్తుంది. అలాగే బాలాంత్రపు రజనీకాంతరావు '*ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము*' గ్రంథానికి రాసిన ముందుమాటలో, ఆరుద్ర 'సమగ్రాంధ్ర సాహిత్యానికి రాసిన ముందు మాటలో ఆయన విభేదించిన అంశాలు గమనించదగినవే.

**18. రాళ్ళపల్లి వారి సాహిత్య కృషిలో తులనాత్మక దృష్టి ప్రాముఖ్యాన్ని చెప్పండి.**

**జ.** తొలితరం తులనాత్మక విమర్శలో రాళ్ళపల్లివారు తొలి వరసలో నిలుస్తారు. అసలు వేమనను తిరువళ్లువర్, సర్వజ్ఞులతో పోల్చినప్పుడే ఈ విషయం స్పష్టమైంది. అది కాక, కన్నడ సాహిత్యంతో సన్నిహిత పరిచయం ఉన్నందువల్ల, సందర్భం వచ్చినపుడల్లా, కన్నడం, తెలుగుల తులనాత్మక పరిశీలన ఆయన చేసారు.

**19. రాళ్ళపల్లి వారు ఏర్పరిచిన విమర్శ మార్గ గొప్పతనం చెప్పండి. ఆ మార్గాన్ని ఇతరులెవరైనా అనుసరించారా?**

**జ.** రాళ్ళపల్లివారు కొత్తగా సిద్ధాంతాలు చేసారని ఖచ్చితంగా చెప్పలేం కానీ, వేమన దగ్గర్నుంచి చూస్తే, ఆయన ఏ రచననూ కేవలం ఒక గ్రంథంగా మాత్రమే చూడలేదని అర్థమవుతుంది. ఆ

రచయిత కాలం, అప్పటి సామాజిక, సాంస్కృతిక పరిస్థితులు, నాటి ప్రజల జీవనం, ఆ కవితో పోల్చగల ఇతరులు... ఇలా చెప్పుకుంటూ పోతే, చారిత్రక విమర్శ, పాఠ్య విమర్శ, తులనాత్మక విమర్శ మొదలై నవన్నీ ఆయన విమర్శలో కనిపిస్తాయి. నిజానికి ఒక biographical criticism అన్నది ఎలా ఉండాలో వేమన ద్వారా ఆయన గొప్పగా చెప్పారు. అందులోనే తిరువళ్లువర్, సర్వజ్ఞులతో వేమనను పోల్చడం ద్వారా తులనాత్మక విమర్శకు బీజం వేశారు. అలా చూసుకుంటే ఆధునిక విమర్శకులు చెప్పే సాహిత్య సామాజిక విమర్శకు కూడ ఆయన పెద్దపీటే వేసారు. అంటే కళాతత్వవిమర్శ, చారిత్రక విమర్శ, తులనాత్మక విమర్శ, సామాజిక విమర్శ–ఇలా ఆధునిక విమర్శలో ఉన్న అనేక దృక్పథాలను ఆయన విమర్శలో మనం చూడవచ్చు.

**20. తెలుగు సాహిత్య విమర్శలోకం రాళ్ళపల్లి వారిని అభిరుచి విమర్శకులని అభివర్ణించింది. దీనిపై మీ స్పందన ఏమిటి ?**

**జ.** ఆయనను కేవలం అభిరుచి విమర్శకుడని అనడం సబబు కాదు. ఆ మాటకొస్తే ప్రతి విమర్శకుడూ అభిరుచి విమర్శకుడే. తనకు ఇష్టమైన కవుల గురించే అందరూ రాసారు. రాస్తున్నారు; రాస్తారు కూడా. అభిరుచి అన్నది విమర్శకుడు ఒక రచనను, కవిని ఎంచుకోడానికి తొలి ప్రమాణం.

**21. వాద, వివాదాల్లో విమర్శకుని సంస్కారం ఎలా ఉండాలంటారు?**

**జ.** విమర్శకుడికి ఉండాల్సిన మొదటి లక్షణం సంస్కారం. అంటే సాహిత్యాన్ని సాహిత్యంగా చూడగల, వివేచించగల సంస్కారం. మీ ప్రశ్న కొంత అస్పష్టంగా ఉంది. వాద వివాదాలన్నవి ఎప్పుడు వస్తాయి? మనం ఒక రచనపై ఒక అభిప్రాయాన్ని చెప్పినపుడు, దానితో అంగీకరించని వారు వివాదం లేవదీస్తారు. దానికి మళ్లీ మనం సహేతుకంగా సమాధానం చెప్పడానికి ప్రయత్నిస్తాం. కనక, సహేతుకత, నిష్పాక్షికత, నిర్మాణాత్మక దృష్టి అన్నవి సాహిత్య సంస్కారానికి సంబంధించినవి. వాద వివాదాల్లో విమర్శకుడు వీటికే ప్రాధాన్యం ఇవ్వాలి గానీ, వ్యక్తిగత రాగద్వేషాలకు కాదు.

**22. తెలుగు సాహిత్య విమర్శలో రాళ్ళపల్లి వారి స్థానం ఏమిటి?**

**జ.** తెలుగు సాహిత్య విమర్శలో రాళ్ళపల్లి వారి పేరు చెప్పగానే అందరికీ గుర్తుకు వచ్చేది ఆయన వచన శైలి; వ్యంగ్యం; చమత్కారం. వాక్య నిర్మాణం; తళుక్కుమని అక్కడక్కడా మెరిసే రాయలసీమ యాస. ఇవన్నీ గొప్పవే కానీ, నిజానికి విమర్శకుడిగా రావలసినంత గుర్తింపు ఆయనకు రాలేదని నాకనిపిస్తుంది. ఆయన వస్తు, భావ, రచనల గురించి రాసినది, ప్రవృత్తి నివృత్తి భోగాల గురించి రాసిందీ, కొన్ని శతాబ్దులనాటి కావ్యాలను సైతం, ఆధునిక దృష్టితో చూస్తూ చేసిన విశ్లేషణ – ఆయనను గొప్ప విమర్శకుడిగా నిలబెడతాయి. కానీ వీటిని చాలా తక్కువమంది గుర్తించారు. అలాగే నాటకాల గురించి ఆయన చేసిన విశ్లేషణ ( నాటకోపన్యాసములు ), ముఖ్యంగా పద్యనాటకాలపై ఆయన అభిప్రాయాలు, నాటకంలో

సంగీతానికున్న స్థానం గురించి ఆయన వివేచన, నాటకంలో వాస్తవికత గురించి ఆయన ఆలోచనలు – ఇవన్నీ ఎంతో లోతుగా చర్చించాల్సిన విషయాలు. వాటిపై చర్చ జరగనేలేదు.

**23. రాళ్ళపల్లి వారి కాలంలో ఉన్న విమర్శకు, ఇప్పటి సమకాలీన సాహిత్య విమర్శకు వ్యత్యాసం ఏమైనా ఉందా?**

**జ.** ఇప్పటి విమర్శ దాదాపు పూర్తిగా రాగద్వేషాలకు లోబడింది. అది నిజమైన విమర్శ కాదు. ఉదాహరణకు ఈనాడు నాలాంటి ఒక విమర్శకురాలు, ఒక పుస్తకంలోని మంచి చెడ్డలను విచారిస్తూ, ఒకటి రెండు లోపాలు ఎత్తి చూపితే ఆ రచయితలు భరించలేరు. సహించలేరు. ఆ వాక్యాన్ని పరిహరించమని అడిగేంతగా దిగజారుతారు. అంటే మన రచయితలు ఎలా ఉన్నారో మన విమర్శలు కూడా అలాగే ఉంటాయి. నాటి రచయితలు తమ రచనలో లోపాన్ని విమర్శకుడు ఎత్తి చూపితే, దాన్ని సహృదయంతో స్వీకరించి, యథాతథంగా ప్రచురించే వాళ్లు. ఇప్పుడు అలాంటి రచయితలేరీ? అందుకే విమర్శకులుగా చలామణీ అయ్యే వాళ్లంతా తమకు నచ్చిన, తమకు అనువైన ఒక సాహితీ బృందంలో భాగస్వాములై పోయి, అందులో ఉన్న మిత్రుల పుస్తకాల మీద అభినందన వర్షాలు కురిపిస్తూంటారు. రాజకీయాల్లో ప్రతిపక్షాల్లా సాహిత్యంలో వీరి వ్యతిరేక బృందంవారు అదే రచనను తిడుతూ రాస్తారు. అంటే ఏమిటని అర్థం? అవి రెండూ విమర్శలు కావు. మనకిష్టంలేని రచయితలను, వారి రచనలను ఎండగట్టడం, మనకిష్టమైన వారు రాసిన ప్రతి వాక్యాన్ని అందలం ఎక్కించడం – ఇది విమర్శే కాదు. రాళ్ళపల్లివారు బాలాంత్రపు రజనీకాంతరావుగారి *'ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము'* పుస్తకానికి రాసిన ముందుమాటలో తను ఏకీభవించలేని అంశాలను స్పష్టంగా, సహేతుకంగా చర్చించారు. రజనిగారు ఆయన మాటల్ని గౌరవిస్తూ యథాతథంగా ఆ పీఠికను ముద్రించారు. అలాంటి సహృదయత ఈనాడు ఆశించగలమా? విమర్శకుడికీ, కవికీ మధ్య ఉండాల్సిన ఆరోగ్యకరమైన వాతావరణం ఈనాడు ఉందా?

**25. రాళ్ళపల్లి వారి విమర్శ గురించి ఆనాటి సమకాలికుల అభిప్రాయాలు ఎలా ఉండేవి?**

**జ.** ఆయన సమకాలికులలో కొందరితో ఆయనకు ఎప్పుడూ గొడవే. కట్టమంచి వారితోనే విభేదించిన రాళ్ళపల్లి వారికి, కొన్ని విషయాల్లో (ఉదాహరణకు'నాచనసోమన) చాలామందితో అభిప్రాయభేదాలు వచ్చాయి. కానీ మొత్తం మీద సమకాలికులు ఆయనను గౌరవించే వారనే అనుకుంటాను. అయితే ఆయనను గుర్తించాల్సినంతగా వాళ్లు కూడా గుర్తించలేదు. వాళ్లు కూడా ఆయన వచనాన్ని మెచ్చుకున్నంతగా భావాలను గుర్తించలేదు.

**26. కట్టమంచి, రాళ్ళపల్లి గార్ల స్నేహ సౌశీల్యం ఎలాంటిది? కట్టమంచి వారి ప్రభావం రాళ్ళపల్లి వారిపై ఎంతవరకు ఉందంటారు?**

**జ.** కట్టమంచి వారికి సంస్కృత, తెలుగు గ్రంథాల పఠనంలో రాళ్ళపల్లివారు సహకరించారు. ఆంగ్ల సాహిత్యాన్ని అర్థం చేసుకోవడంలో రాళ్ళపల్లివారికి కట్టమంచి వారు సహకరించారు. ఇవి కాక, ఒకరిపై ఒకరికి ఆత్మీయమైన గౌరవం ఉండేది. ఒకరి ప్రతిభను మరొకరు గుర్తించి

అభినందించేవారు. ఇద్దరిలోనూ గౌరవం సామాన్యలక్షణమైతే, రాళ్ళపల్లి వారిలో కట్టమంచి వారి పట్ల' కృతజ్ఞత, గురు భావం కూడ ఉండేవి. ఏమైనా ఏ ప్రయోజనమూ, స్వార్ధమూ ఆశించని అలాంటి సాహిత్య బంధాలు చాలా అరుదు. ఇద్దరు సాహిత్య వేత్తల మధ్య సాహిత్యాన్ని గురించి అభిప్రాయభేదాలు వస్తే ఎంత హుందాగా ప్రవర్తించవచ్చో వీరిని చూసి నేర్చుకోవాలి.

**27. మీ తాతగారు సంగీతంలో గొప్ప నిష్ణాతులు కదా! ఆ విద్య పట్ల మీరు ఆకర్షితులయ్యారా? అటువైపు ప్రోత్సాహమేమైన చేశారా?**

**జ.** చిన్నప్పుడు మా తాతగారి ఇంట్లో నాకు ఎంతో గొప్పగా అనిపించిన విషయం ప్రతి గదిలోనూ ఎవరో ఒకరు ఏదో ఒక కృతి పాడుతూండడమే. అమ్మమ్మ శ్లోకాలు రాగయుక్తంగా చదివేది; మా అమ్మ త్యాగరాజ కృతులు పాడుతూండేది. మా మామయ్యలూ అంతే, చిన్నమామయ్య కర్ణాటక సంగీతంతో పాటు, రవీంద్ర సంగీత్ కూడ పాడేవాడు. పెద్ద పిన్ని వీణ వాయిస్తూదేది. ఇలా అందరూ ఎప్పుడూ సంగీతంలో నిమగ్నం కావడం తాతగారి పుణ్యమే. ఆయన సందర్భానుసారంగా మమ్మల్ని మందలించడానికి కూడ త్యాగరాజ కృతులను ఆలపించేవారు. 'దుడుకు గల కాలహరణమేలరా హరే! చక్కని రాజ మార్గముండగా సందులు దూరనేల' ఇలా సంగీతంతో సంభాషిస్తూండేవారు. నేను కూడ కొంతకాలం వీణ నేర్చుకున్నా, కొన్ని కారణాల వల్ల మానేసాను. అది ఎప్పటికీ తీరని లోటు. తాతగారి వల్లే ఎటువంటి సంగీతాన్నయినా ఆస్వాదించగల సౌమనస్యం అబ్బింది. అందుకే అన్ని సంగీతాలూ వింటాను.

**28. మీ తాతగారు ఎవరికైనా రాసిన ఉత్తరాలుగాని, ఎవరైనా మీ తాతగారికి రాసిన లేఖలుగాని చూశారా?**

**జ.** తాతగారు ఉత్తరాలు రాయడంలో చాలా శ్రద్ధ చూపేవారు. ఎవరివో ఎందుకుగానీ, నాకే ఉత్తరాలు రాసారు. నేను ఎం. ఏ లో ఉండగా తాతగారికి రాసేదాన్ని. నాకు ఎం. ఏ లో యూనివర్సిటీ ఫస్టు మార్కు వచ్చి రెండు స్వర్ణ పతకాలు వచ్చాయి. ఆ విషయం వెంటనే ఆయనకు రాసాను. ఆయన నుండి వెంటనే సమాధానం "నీకు రాకపోతే ఎవరికి వస్తుంది పాపా? 'అని రాసారు. అలాగే తను ఇక చదవలేకపోతున్నాననీ, తనకు పోస్టులో వస్తున్న ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పుస్తకాలన్నీ నాకు పంపమనీ దేవులపల్లి రామానుజ రావుగారికి లేఖ రాసినట్టు నాకు తాతగారు లేఖ ద్వారా తెలిపారు. అప్పటినుంచి నేను వారి వద్దకు వెళ్లి పుస్తకాలు తెచ్చుకునేదాన్ని. ఆయన కొందరికి ఇంగ్లీషులో ఉత్తరాలు రాయాల్సి వచ్చినపుడు, ఎంత చక్కటి ఇంగ్లీషులో రాసేవారో. కానీ తన స్పెల్లింగుల మీద నమ్మకం లేక, మా నాన్ననో, ఇంగ్లీష్ లిటరేచర్ చదువుతున్న పెద్దక్కయ్యనో పిలిచి లేఖలు చూపించి, అంతా సరిగ్గా ఉందా అని అడిగేవారు. తన కంటే చిన్నవారి నుంచి నేర్చుకోడానికి ఏ రోజూ సందేహించేవారు కారు.

**29. రాళ్ళపల్లి వారు ఎలాంటి గ్రంథాలను చదివేవారు?**

**జ.** *ఆయన సంగీత, సాహిత్య గ్రంథాలు చదివేవారన్నది అందరికీ తెలిసిందే. అయితే ఆయన పెర్రీ మేసన్ డిటెక్టివ్ నవలలు. చందమామ పత్రిక కూడ చదివేవారని చాలా తక్కువమందికి తెలుసు. నిజానికి వేరు శనక్కాయలు చుట్టిన పొట్లంలోని పేపర్ మీద ఏముందో కూడ చదివేవారు. ఎప్పుడూ ఏదో చదువుతూనే ఉండేవారు.*

**30. రాళ్ళపల్లి వారి స్త్రీవాద దృక్పథం గురించి చెప్పండి?**

**జ.** రాళ్ళపల్లి వారు తమ సాహిత్య విమర్శలో ప్రబంధ కవులు స్త్రీల పట్ల అవలంబించిన వైఖరిని తీవ్రంగా విమర్శించారు. రాయలనాటి రసికత 'వ్యాసంలోనూ, 'నాచనసోముని నవీనగుణములు ' లోనూ ఆయన కవులు స్త్రీల వర్ణనలో చేసిన అనౌచిత్యాన్ని నిర్మొహమాటంగా దుయ్యబట్టారు. ఒక్క సాహిత్యంలోనే కాదు. జీవితంలో కూడా ఆయన స్త్రీల పట్ల ఎంతో గౌరవం ఉన్న వ్యక్తి. అమ్మమ్మ పట్ల ఆయన చూపిన గౌరవం మాకందరికీ తెలుసు. అలాగే బాలవితంతువైన ఒక బంధువుల అమ్మాయికి ఆయన సంగీతం నేర్పి'ఎవరి మీదా ఆధారపడకుండా, నీ కాళ్ల మీద నువ్వు నిలబడ్డానికి ఈ విద్యను ఉపయోగించుకో' అని చెప్పారు. ఆమెలాంటి వాళ్లెందరో సంగీతపాఠాలు చెబుతూ స్వావలంబన సాధించారు. తన కుమార్తెలకు వారి అభిప్రాయాలు చెప్పే స్వతంత్రత ఆ ఇంట్లో ఉండేది.

**31. రాళ్ళపల్లి వారి వ్యక్తిత్వం ఎలాంటిది?**

**జ.** రాళ్ళపల్లివారు ఖచ్చితమైన అభిప్రాయాలున్న వ్యక్తి. అందరి పట్ల దయా గుణం ఉన్న వ్యక్తి. దాన గుణం కూడ ఎక్కువే. విద్యాదానంలో ఆయన్ని మించిన వాళ్లు తక్కువ. ఏ పని చేసినా, తనకేం వస్తుందని ఆయన ఏనాడూ ఆలోచించలేదు. తను, తన కుటుంబం అనే స్వార్థం అసలు లేదు. ఇతరుల గురించి ఆలోచించిందే ఎక్కువ. వారి ఇల్లు అన్నదానానికి, విద్యాదానానికీ నెలవు. ఆయనలో మంచి హాస్యచతురత ఉండేది. మాలాంటి పిల్లల మీద ఎన్నో ఛలోక్తులు విసురుతూ, మా భయం కూడ పోగొట్టేవారు. తను గొప్ప పండితుడిననీ, సంగీతజ్ఞుడిననీ ఏనాడూ ఆయన భావించినట్టు నాకు తెలీదు. తన గురించి మాట్లాడుకునే అలవాటు ఆయనకు పెద్దగా లేదు. ఆయన దాన గుణం ఎంతటిదంటే, ఎన్నో ఎకరాల భూమిని రాళ్ళపల్లిలో అణగారిన వర్గాల వారికి దానం చేసేసారు. తన కుటుంబం గురించి కూడా ఆలోచించకుండా అలా దానం చేసే వాళ్లు చాలా తక్కువమంది ఉంటారు.

**32. ప్రత్యేకించి రాళ్ళపల్లి వారి సాహిత్యంపై ఎలాంటి పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందనుకొంటున్నారు? వ్యక్తిగతంగా ఏవరైనా ఆ కృషి చేస్తున్నట్లు మీ దృష్టికి వచ్చిందా?**

**జ.** "విమర్శకుడిగా రాళ్ళపల్లి" అన్నది నాకు తెలిసి ఆయన పై వచ్చిన తొలి ఎం. ఫిల్ గ్రంథం. వి.రమాంజనీకుమారి చేస్తారు. మంచి పరిశోధనాగ్రంథం. అలాగే రాళ్ళపల్లి వారి సంగీత కృషిపై అనూరాధ అనే ఆమె తెలుగు విశ్వవిద్యాలయం సంగీత శాఖలో ఎం. ఫిల్ చేసారు. నిజానికి ఆయన సంగీత, సాహిత్యాలపై ఇంకా పరిశోధన రావలసే ఉంది. ముఖ్యంగా ఆయన

సంగీతం గురించి ప్రపంచానికి తెలిసింది చాలా తక్కువ. అలాగే సాహిత్యం గురించి కూడ లోతైన పరిశోధనలు ఇంకా రావలసివుందని నాకనిపిస్తుంది.

**33. ఇటీవలే ఎమెస్కో బుక్స్ వారు ప్రచురించిన 'రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు', 'వదరుబోతు' గ్రంథాలపై మీ అభిప్రాయం.**

**జ.** అభిప్రాయం ఏముంటుంది ? చాలా సంతోషం వాటిని ప్రచురించినందుకు.

**34. రాళ్ళపల్లి వారి మొత్తం రచనలను అందుబాటులోకి తీసుకొస్తే బాగుంటుందని రాళ్ళపల్లి వారి అభిమానులు భావిస్తున్నారు. దీనిపై మీ స్పందన?**

**జ.** తప్పక బాగుంటుంది. సారస్వతాలోకము నేనే పునర్ముద్రించాను. ప్రతులు అయిపోయాయి. మళ్లీ వేయాలి. ముఖ్యంగా ఆయన పీఠికలు, నాటకోపన్యాసాలు ఇంకా రావలసివుంది. ఆ ప్రయత్నం జరుగుతోంది.

**35. మీ సాహిత్య కృషికి రాళ్ళపల్లి వారి ఆలోచనలు ఏమైనా తోడ్పడ్డాయా? ఆయన జీవితం గురించి మీరేమి గ్రహించారు?**

**జ.** ఆయన నుంచి నేను నేర్చుకుంది నా రచనలపై ఎక్కువ మమకారం పెట్టుకోకపోవడం. విమర్శలో ఏ మాత్రం రాగద్వేషాలకు లొంగకపోవడం; సాహిత్యంలో తెలిసిన వాటి గురించే మాట్లాడడం. కొత్తగా చెప్పడానికి ఏదైనా ఉన్నప్పుడే రాయడం.

**24. తెలుగు సాహిత్య విమర్శలో రాళ్ళపల్లి వారిని ఒక యుగ పురుషుడిగా భావించవచ్చా?**

**జ.** నేను యుగపురుషుడు అనే బిరుదును నమ్మను . అది ఎవరికిచ్చినా సరే . కనక ఆ ప్రసక్తే లేదు.

**36. నేటి యువతరానికి రాళ్ళపల్లి వారి గురించి మీరిచ్చే సందేశం ఏమిటి?**

**జ.** రాళ్ళపల్లివారి విమర్శ దృక్పథమే మొదటిది. అసలు విమర్శకులుగా ఎదగాలన్న ఆలోచనే నేటి యువతరానికి లేదు. ఎందుకంటే ఒక కవితో, కథో రాస్తే త్వరగా పేరు వస్తుంది. అవార్డులూ వస్తాయి. కానీ విమర్శకుడికి గుర్తింపు ఉండదు. అదీ కాక, రచయిత కంటే విమర్శకుడు ఎక్కువ చదువుకోవాలి. నేటి యువతరానికి అంత ఓపిక లేదు. క్షణికమైన విజయాలనే కోరుకుంటున్నారు. కనక ఆయనలా విమర్శనే నమ్ముకుని అధ్యయనం పెంచుకోమని చెప్తాను. కవిత్వం రాయగలిగీ, విమర్శనే ఆయన తన మార్గంగా ఎంచుకున్నారు. ఈనాడు విమర్శకుల కొరత ఎక్కువగా ఉంది. యువతరం ఆ దిశలో కృషిని పెంచుకోవాలి.

## ప్రశ్నావళి : 4

## సిహెచ్. లక్ష్మణ చక్రవర్తిగారి అభిప్రాయాలు : (ఆగస్ట్ 11. 2018)

**1. సార్! మీరు తొలిసారిగా రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి గురించి ఎలా తెలుసుకున్నారు? ఏ సందర్భంలో?**

**జ.** నేను పాఠశాల స్థాయిలో రాళ్ళపల్లివారి పేరు వినలేదు. ఆంధ్ర సారస్వత పరిషత్తు లో చదువుతున్నప్పుడు తొలిసారిగా విన్నాను. *నిగమశర్మ అక్క'*, *'తిక్కన్న తీర్చిన సీతమ్మ'* అనే వ్యాసాలను చదివాను.

**2. రాళ్ళపల్లి వారి రచనల్లో మీకు బాగా నచ్చినవి ఏవి?**

**జ.** *శాలివాహన గాథాసప్తశతీసారము'* బాగా నచ్చుతుంది. అప్పట్లో అనువాదంపై అంత పెద్దగా అవగాహన లేదు గానీ, ఆ పద్యాలను బాగా ఇష్టపడి చదివాను. తర్వాత 'సారస్వతాలోకము'లోని వ్యాసాలను చదివాను.

**3. వేమనపై వచ్చిన పరిశోధనల్లో రాళ్ళపల్లి వారి ప్రత్యేకత ఏమిటి?**

**సూచనలు :**

**i.** వేమనపై జరిగిన పరిశోధనల్లో రాళ్ళపల్లివారి ఆలోచనలకు కొనసాగింపుగానే చాలా పరిశోధనలు వచ్చాయి. దీనికి మూలాలు రాళ్ళపల్లివారి 'వేమన'(1929) పరిశోధనలో ఉన్నాయని పరిశోధకుడుగా నీవు గుర్తించాల్సిన విషయం.

**ii.** ఉదాహరణకు రాళ్ళపల్లి వారిలో ఒక తాత్త్వికమైనటువంటి ఆలోచన, తత్త్వ విషయ దర్శనాలు కనబడతాయి. కొర్లపాటి శ్రీరామమూర్తిగారు, ముదిగంటి సుజాతా రెడ్డిగారి లాంటి వారు రాళ్ళపల్లి లో నాథ సంప్రదాయ పరమైన ఆలోచనలు ఉన్నాయని చెప్తారు. *'వేమన తాత్త్వికత'* అన్న వ్యాసం చూస్తే! నాథ సంప్రదాయం ఉందని చెప్పకపోయినా, వేమన వెనక ఒక తాత్త్వికమైన ఆలోచనా అధ్యయనం ఉందన్నారు. వేదాల్నీ అంగీకరిస్తారు కానీ దేవుణ్ణి అంగీకరించరు వాళ్ళూ. నాస్తికులు కాదు గానీ ప్రకృతి ఆరాధన చెయ్యటం లాంటివి కనిపిస్తాయి. ఈ రకమైన లక్షణాలు ఆయన వేమన తాత్త్వికతలో కనిపిస్తాయి. (*'వేమన నాథ సంప్రదాయం'*– ముదిగంటి సుజాత రెడ్డి) (*'నాథ యోగి వేమన'*– కొర్లపాటి శ్రీరామమూర్తి )

**iii.** రాళ్ళపల్లి వారికి ముందు వేమనపై పరిశోధనలు ఎవరు చేశారన్నది ముందుగా గమనించాలి. (ఉదాహరణకు 'వేమన' అన్న పేరుతో చిన్న పుస్తకం ఒకరు రాశారు. 'పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి. బ్రౌన్ కొంత రాసారు.) రాళ్ళపల్లివారి తర్వాత రాసిన వాళ్ళు ఎవరు. వాళ్ళ ఆలోచన ఏమిటి అనేది ఒక చర్చగా నీ పరిశోధనలో ఉంటే బాగుంటుంది. రాళ్ళపల్లివారు తనవరకు ఎంత మౌలికంగా పని చేశారన్నది స్పష్టంగా తెలుస్తుంది.

**జ.** రాళ్ళపల్లివారు 'వేమన' పరిశోధన తన ముందు వారికంటే చాలా భిన్నంగా చేశారు. వేమనను ఒక కథా వస్తువుగా తీసుకున్నారు. అలాగే ఆయన జీవితాన్ని గురించి చెప్పడానికి ఇష్టపడ్డారు తప్ప! ఆయన సాహిత్యం ద్వారా జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని, తాత్త్వికతను, హాస్య స్ఫురణను అంచనా వేయడానికి ప్రయత్నించలేదు. ఆ దృష్టితో 'వేమన' మిగతా రచనల కంటే రాళ్ళపల్లి వారిది ప్రత్యేకమైంది. ఈయన తర్వాత వేమనపై చాలా మంది పరిశోధనలు చేశారు కదా! అంటే తర్వాత వాళ్ళకు దొరికినంత సామగ్రి వీరికి దొరకలేదు. రాళ్ళపల్లివారి వేమన సాహిత్య విమర్శ దృష్టితో సాగిన ఒక పరిశోధన. మిగతా వారిది పరిశోధన దృష్టితో సాహిత్య విమర్శగా కొనసాగాయి. అంటే! వేమన ఈ కాలానికి చెందిన వాడనీ, ఈ పద్యాలు రాశాడనీ, లేదా రాయలేదని కొనసాగినవి.

**4. రాళ్ళపల్లి వారి వ్యాసాల భాషాశైలిపై మీ అభిప్రాయం చెప్పి, వ్యావహారిక భాషకు లోనయ్యారా? లేదా తెలపండి.**

**జ.** రాళ్ళపల్లివారి కాలానికి వ్యావహారిక భాషే నడుస్తుంది. కానీ ఈయనది ఒక వ్యంగ్యాత్మకమైన శైలి. వైష్ణవుల్లో నైచ్యానుసంధానం అనే ఒక నియమం ఉంటుంది. అది ఏమిటి అంటే! తాను ఎంత గొప్పవాడు అయినా చాలా చిన్నవాణ్ణి అని చెప్పుకోవడం. ఈ విధమైన ఆలోచన రాళ్ళపల్లివారి వ్యాసాల్లో వ్యక్తమవుతుంటుంది. అయితే భాషా శైలిలో వ్యావహారిక దృష్టే ఉంటుంది. ఆయన వాక్య నిర్మాణం మిగతా విమర్శ రచయితల కంటే భిన్నమైంది. చాలా సానబెట్టినట్టుగా ఉంటుంది. ఆయన వ్యాసాల్లో తక్కువ మాటల్లో ఎక్కువ చెప్పడానికి ప్రయత్నం చేయటం లాంటివి ఉన్నాయి. సాహిత్య విమర్శ వ్యాసాలు తీసుకొంటే ఉదాహరణకు పానుగంటి సాక్షివ్యాసాల్లాగా కాకుండా! సాహిత్య విమర్శ వ్యాసం ఎట్లా ఉంటుంది. లేదా ఎలా ఉండాలనే ఒక కొలమానాన్ని తీసుకొంటే తొలి తరంలో వెన్నేటి రామచంద్రరావు కావచ్చు, కట్టమంచి రామలింగారెడ్డి కావచ్చు, కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి కావచ్చు వీళ్ళందరి కంటే! అంటే 1930ల కంటే ముందు ఒక ఆలోచనాత్మకమైన విమర్శ వ్యాసం ఎట్లా ఉండాలన్న దానికి ఉదాహరణగా రాళ్ళపల్లివారు కనిపిస్తారు.

**5. రాళ్ళపల్లి వారు ఏర్పరచిన విమర్శ మార్గం భావితరాలకు ఎలా ఉపయోగపడుతుందంటారు?**

**జ.** రాళ్ళపల్లివారు అన్నమయ్య సంకీర్తనలకు చేసిన పనివల్ల తర్వాత వారికి మార్గం వేశారు. అంటే మిగతా వాళ్ళకి సాహిత్యమో లేదా సంగీతమో తెలిస్తే! ఈయనకు రెండిటిలో ప్రవేశం ఉంది కాబట్టి దానికి ఒక మార్గం వేశారు. మరొకటిఅనుమాండ్ల భూమయ్య 'ఆద్యుడు కట్టమంచి' అనే పుస్తకం రాశారు. అందులో భావకళా, వస్తుకళా, రచనాకళా లను ఆధునికంలో రాయప్రోలు సుబ్బారావు, గురజాడ అప్పారావు, కట్టమంచి రామలింగారెడ్డిగార్లకు అన్వయించారు. ఇది రాళ్ళపల్లి వారి సిద్ధాంతమే. అంటే ఆయా సిద్ధాంతాల్ని ఉపయోగించుకొనే దాన్ని బట్టి ఉంటుంది. భావ, వస్తు, రచనా కళలనేవి రాళ్ళపల్లి

వారి స్వీయ సిద్ధాంతాలు. తిక్కనకు, నన్నయకు, నాచన సోమనకు దీన్ని అన్వయించారు. ఈ విధానం తర్వాతి వారికి ఉదాహరణగా దొరుకుతుంది.నాకు తెలిసినంత వరకు *నిగమశర్మ అక్క*, తిక్కన్న తీర్చిన సీతమ్మ లాంటి ఒక కారెక్టర్ ని ఎన్నుకొని వ్యాసం నిర్మించడం అనేది రాళ్ళపల్లి వారికంటే ముందు ఎవరూ చేయలేదు. తర్వాత కాలంలో కేశవపంతుల నరసింహ శాస్త్రిగారు *'ప్రబంధ పాత్రలు'*, పుట్టపర్తి నారాయణాచార్యులు *'ప్రబంధ నాయికలు'* ఉన్నాయిగాని, మొత్తం రచనలో ఒక పాత్రని తీసుకొని దాని గురించి చెప్పడం అనేది రాళ్ళపల్లి వారే ప్రారంభించారు.

**6. కట్టమంచి రామలింగారెడ్డిగారి విమర్శకు, రాళ్ళపల్లి వారి విమర్శకు భేదా లేమైన కనిపిస్తే తెలపండి. రెడ్డిగారి ప్రభావం శర్మగారి మీద ఎంతవరకు ఉందంటారు?**

**జ.** కట్టమంచివారి విమర్శ మొత్తం సాంఘిక దృక్పథంతో కూడి ఉంటుంది. రాళ్ళపల్లి వారి విమర్శ మొత్తం సాహిత్య ప్రధాన దృష్టితో ఉంటుంది. ఎంతో కొంత సమాజాన్ని గురించిన ఆలోచన ఉంటుంది. ప్రభావం అని అనలేంగాని రెడ్డిగారి ఆలోచనలు రాళ్ళపల్లివారికి ఒక నూతన మార్గం వేసుకోవడానికి తోడ్పడ్డాయని మాత్రం చెప్పవచ్చు. ఆయన చెప్పిన దానికి ఈయన చెప్పడం ప్రభావం కాదు కొనసాగింపు.

**7. సాధారణంగా విమర్శకులు కొన్ని సందర్భాల్లో ఎటు తేలని అభిప్రాయాలు చెప్తుంటారు. అలాంటి అభిప్రాయాలు రాళ్ళపల్లి వారు ఏమైన చెప్పారా? మీకు తెలిసినంత వరకు.**

**జ.** విమర్శకుడు ఎప్పుడూ ఎటూ తేలని అభిప్రాయాలు చెప్పడు. ఆయన పరిధిలో ఆయన సమయానికి ఆలోచించిన విధానాన్ని బట్టి అది అక్కడ పరిపూర్ణమే. అంటే కాలం గడిచే కొద్ది దానికి సంబంధించి కొన్ని ఆలోచనలు, ఆవిష్కరణలు ఏర్పడ్డప్పుడు ఎటు తేల్చకుండా చెప్పాడేంటి? అన్న అభిప్రాయం మనకు ఏర్పడుతుంది. రాళ్ళపల్లివారు *'రంగనాథ రామాయణ'*కర్తృత్వ విషయంలో ఎటు తేలని అభిప్రాయాలు చెప్పారని కొందరంటుంటారు గానీ, అవి వీరితో పాటు వ్యాసాలు రాసిన వారి అభిప్రాయాలు మాత్రమే. అయితే *'రంగనాథ రామాయణము'*లో ఆయన చెప్పాల్సిన అంశాల్ని చెప్పాడని నా అభిప్రాయం. విమర్శకుడు అనేవాడు తనకు తెలిసిన విషయాల వరకు చెప్తాడు. తర్వాత రోజుల్లో పరిశోధన చేసిన వాళ్ళు ఈయన ఇక్కడే ఆగిపోయాడే? అని అనుకుంటారు. అంతేతప్ప మరేమి ఉండదని నేను భావిస్తున్నాను.

**8. వాద, వివాదాల్లో విమర్శకుడి సంస్కారం ఎలా ఉండాలంటారు?**

**జ.** ఈ విషయంలో రాళ్ళపల్లివారువాద వివాదాల్లో తక్కువగానే ఉన్నారని చెప్పవచ్చు. ఏవో ఒకటో రెండో అంశాల్లో తప్ప! పెద్దగా ఏమీ వాద వివాదాలు లేవనుకుంటాను. సంస్కారం అనేది విమర్శకుడిలో ఉంటేనే వాడు సాహిత్య విమర్శకుడు అవుతాడు. అది లేకపోతే వాడు విమర్శకుడుకాడు. కాబట్టి విమర్శకునికి ప్రత్యేకంగా సంస్కారం ఫలానా విషయంలో ఫలానా రీతిగా ఉండాలన్న అవసరం లేదు.

**9. సాహిత్య విమర్శలో రాళ్ళపల్లి వారిని అభిరుచి విమర్శకులని అంటారు కదా? ఇది ఎంతవరకు సమంజసమంటారు?**

**జ.** ఏ విమర్శకుడైన తనకు అభిరుచి లేకపోతే ఏ విషయాన్ని రాయలేడు. ఈ అభిరుచి విమర్శ అనేది జన సమూహంలోకి బాగా వచ్చిందెప్పుడంటే, రాజకీయ,ఆలంకారిక సిద్ధాంతాల్నీ నేపథ్యంగా చేసుకొని సాహిత్య విమర్శ చేసే వాళ్ళు ఉన్నారు. ఈ రెండు వర్గాలకు చేరకుండా మధ్యే మార్గంగా సాహిత్యాన్ని అధ్యయనం చేసే వాళ్ళు కొందరున్నారు. అనంతకృష్ణశర్మగారు పుట్టపర్తి నారాయణాచార్యులు మొదలైనవారు. అంటే! వీళ్ళకు సాహిత్య విమర్శ సిద్ధాంతాలపై విశ్వాసం ఉందా? లేదా అన్నది నేను చెప్పలేను గానీ, వాటిని ఎక్కువ రచనల్లో ఉపయోగించుకోరు. దీనివల్ల వీరికి ఆ పేరు వచ్చింది. వీరి మనసుకు తోచింది వీళ్ళు రాస్తారు. కాబట్టి వీళ్ళకు అభిరుచి విమర్శకులని ఒక ముద్ర వేశారు. అంతేకాదు ఈ అభిరుచి విమర్శ అనే మాట దగ్గర మనకి ఆయా రాజకీయ సిద్ధాంతాల ప్రాబల్యం పెరిగిన తర్వాత దేనికీ సంబంధం లేకుండా తన మనసుతో మాత్రమే సంబంధాన్ని పెట్టుకొని చేసే విమర్శని అభిరుచి విమర్శ అని అన్నారు. ఈ అర్థంలో రాళ్ళపల్లి వారిని అభిరుచి విమర్శకులని అంటే ఇబ్బంది లేదు. కానీ ప్రారంభంలో ఈ పేరుకు పెద్ద ఇబ్బంది ఉండేది కాదు. అర్థ విపరిణామం వల్ల ప్రస్తుత రోజుల్లో అభిరుచి విమర్శ అంటే ఏ సిద్ధాంతం లేకుండా నోటికి వచ్చింది చెప్పేదన్న అభిప్రాయం వచ్చేసింది. రాళ్ళపల్లి వారిని అభిరుచి విమర్శకులన్న వాళ్ళు 1960– 70 ప్రాంతంలో ఒకరకంగా అన్నట్టు లెక్క. 1990 ల ప్రాంతంలో అంటే మరో రకంగా అన్నట్లు లెక్క. రాయప్రోలు వారి కాలానికి అభిరుచి విమర్శ అన్నది సాహిత్యేతర సిద్ధాంతాలు, సాహిత్య సిద్ధాంతాల జోలికి వెళ్ళకుండా తన మనసు, అంతః కరణాన్ని ప్రమాణంగా చేసుకొని చేసే విమర్శ అని అర్థం చేసుకుంటే ఆయన అభిరుచి విమర్శకుడే.

**10. రాళ్ళపల్లి వారికి విమర్శకునిగా వచ్చినంత గుర్తింపు కవిగా వచ్చిందంటారా?**

**జ.** గుర్తింపు అనేది మనం నాలుగైదు రకాలుగా పనులు చేసినప్పటికి ఏదో ఒక రకానికి వస్తుంది. అందుకు ఈయనకు కవిగా అంత గుర్తింపు రాలేదని చెప్పాలి. విమర్శకుడిగా వచ్చినంత పేరు కవిగా రాలేదు. దానికి కారణం ఏమిటంటే మిగతా కవులతో పోల్చుకుంటే ఆయన కవేగాని, చాలా ఎక్స్ట్రాడినరీ కవి మాత్రం కాదు. విమర్శకుడిగా అది కనిస్తుంది గానీ కవిగా అంత కనిపించదు.

**11. తెలుగు సాహిత్యంలో భావకవిత్వం ఎంతో మందిని ఆకర్షించింది. కాని రాళ్ళపల్లి వారిని ఎందుకు ఆకర్షించలేకపోయిందంటారు?**

**జ.** భావకవిత్వం ఎంతో మందిని ఆకర్షించిందన్న దానికి ముందు రాళ్ళపల్లివారి కాలంలో ఎంతమందిని ఆకర్షించదన్న ప్రశ్న వేసుకోవాలి. అంటే ఒక అక్కిరాజు ఉమాకాంతం తప్ప! ఎవరు కూడా ఆ కాలంలో భావకవిత్వం గురించి మాట్లాడలేదు. '*ఎంకిపాట గాలిదుమారం*', బూర్గుల రామకృష్ణరావులాంటి వారు తెలంగాణ నుంచి, అలాగే అటువైపు నుంచి కొందరు

భావకవిత్వం మీద కృషి చేస్తున్నారు. గానీ అది విషయ పరమైన చర్చేగాని సాహిత్య పరమైన చర్చకాదు. అందులో ఉన్న కవిత్వాన్ని గురించి కాదు కాబట్టి ఈయన భావకవిత్వం గురించి మాట్లాడలేదు.

నా ఉద్దేశంలో నారాయణరెడ్డిగారు చెప్పిన ఆరు రకాల భావకవిత్వాలలో రాళ్ళపల్లి మీరాబాయి దీనికి ఒక ఉదాహరణ. దీన్ని మార్మికత అన్న దృష్టితో ఆలోచిస్తే బాగుంటుంది.

**12. సాహిత్యంలో రాళ్ళపల్లివారి తులనాత్మక దృష్టిపై మీ అభిప్రాయం ఏమిటి?**

**జ.** ఈ తులనాత్మక దృష్టిని రెండు భాషల మధ్య చూడాలిగాని ఏరెండు రచనలు, రచయితల మధ్య చూడడం అనేది తులనాత్మక విభాగ సిద్ధాంతం కాదు. ఆయన వ్యాసాలైనా *'రాయలనాటిరసికత'*, *'తిక్కన్న తీర్చిన సీతమ్మ'* లాంటి వ్యాసాల్లో తనకు ఇష్టమైన అంశాలను చెప్పుకొంటూ వెళతారుగానీ, ఆయన వ్యాసాల్లో నేను ఆ దృష్టిని గమనించలేదు.

**13. రాళ్ళపల్లి వారి రచనల్లో సామాజిక దృక్పథ స్థాయి ఎంతవరకూ ఉందంటారు?**

**జ.** సాహిత్య ప్రధానమైన సామాజిక దృష్టే తప్పా ప్రత్యేకించే సామాజిక దృక్పథాన్ని చెప్పాల్సిన అవసరం ఆయనకు కలగలేదు.

**14. మీకు తెలిసినంత వరకు శర్మగారి సాహిత్య కృషిపై ఇంకా ఎలాంటి పరిశోధనలు జరగాల్సిన ఆవశ్యకత ఉంది?**

**జ.** *'వేమన తెలుగు పరిశోధన'* అనే దానిపై పరిశోధన చేయవచ్చు. ఎలా అంటే రాళ్ళపల్లి వారికంటే ముందు, తర్వాతి వారు ఎలా ముందు వెళ్ళారు అన్న అంశాల్ని బయటికి తీయడం పెద్ద విమర్శ అంశం కిందకే వస్తుంది. అంటే శర్మగారి వేమనను ఆధారంగా చేసుకొని మిగతా వాటినన్నింటిని పరిశీలించవచ్చు. ఇప్పటి వరకు రాళ్ళపల్లివారి విమర్శపై ఒక ఎం. ఫిల్ థీసిస్ వచ్చింది. దాని పరిమితులు దానికి ఉంటాయి. ఎవరు ఏరచయితపై పరిశోధన చేసినా, లేదా ఒక రచయితపై అనేకమంది చేసినా ఒకరు అర్థం చేసుకొన్నట్టు మరొకరు అర్థం చేసుకొంటారనడానికి వీలు లేదు. కాబట్టి ఆయన రాసిన ప్రతి అంశంపై పరిశోధన చేయవచ్చు.

**15. తెలుగు సాహిత్య విమర్శలో రాళ్ళపల్లి వారిని ఒక యుగ పురుషుడిగా భావించవచ్చా?**

**జ.** ఈ యుగ పురుషుడు, యుగ వ్యక్తి అనే దాన్ని ఆధునిక సాహిత్యంలో ఆలోచించకుండా ఉండటమే మంచిది. అయితే సాహిత్య విమర్శలో ఒక కాలానికి ఒక యుగపురుషుడుగా రాళ్ళపల్లివారు ఉన్నారు. తన ఆలోచనల ద్వారా. రాసింది తక్కువే అయినా కూడా ఆ యుగంలో ఉన్నారు. మీరు కాలానుగుణమైన విభజన చెయ్యాలి అనుకొంటే రాళ్ళపల్లి కాలం విమర్శలో ఒక విభాగంగా చేసుకోవచ్చు. రాళ్ళపల్లి విమర్శను గురించి సంపత్కుమార గారు చెప్పినట్టు కళాత్మకతను విమర్శలోకి తీసుకొచ్చిన తొలి విమర్శకుడు రాళ్ళపల్లి వారు.

**16. నేటి యువతరానికి రాళ్ళపల్లి వారి గురించి మీరిచ్చే సందేశం ఏమిటి?**

**జ.** ఎవరికీ సందేశాలేమీ అక్కర్లేదు. ఒకటి చదవటమే. తమ గురించి మాట్లాడలేదు. వాళ్ళ గురించి మాట్లాడాడు అన్నది కాదు. సాహిత్య విమర్శకుడికి సంస్కారముండాలి అన్నదాంట్లో

తాత్పర్య మేమిటంటే రచయితని మనం చాలా జాగ్రత్తగా చదవాలి. అప్పుడు అందులో మంచి చెడుల సంస్కారాలు బాగా అర్థమవుతాయి. అలాగే ఎవరినీ అలా తీసి వేయడానికి వీలులేదు. అది ఏ విమర్శకుడైనా సరే ఎప్పుడో చెప్పిన విషయాన్ని ఇప్పడు పరిశీలించి ఇలా ఎందుకు చేశాడు? అని మనం చూడకూడదు. రచయిత రాసిన కాలానికి వెళ్ళి ఆయన చుట్ట పక్కల ఉన్న పరిస్థితులను అర్థం చేసుకొంటే ఆయన ఎంత ఆధునికంగా ఆలోచించారో చూడాలి. ఉదాహరణకు 'నాటకోపన్యాసములు'లో ఆయన స్త్రీ పాత్రలు స్త్రీలు వేస్తే చాలా రకాలైన ఇబ్బందులు భవిష్యత్తులో వస్తాయి అని రాశారు. ఈ మాట ఆనాడు ఆయన దృష్టితో రాశాడు గానీ, తర్వాత వల్లంపాటి వెంకట సుబ్బయ్య లాంటి వారు దీన్ని ఆధునికతకు వ్యతిరేకతగా భావించారు. ఇవాళ నాటకాలు వేసే స్త్రీలు ఎలాంటి ఇబ్బంది ఎదుర్కొంటున్నారో అడగండి? అప్పుడు వాళ్ళు మా కుటుంబంలో మేము ఉన్నప్పటికీ మమ్మల్ని బజారు మనిషిలాగానే చూశారని అంటారు. టీవీలో వచ్చే  కొన్ని హాస్య కార్యక్రమాల్లో స్త్రీ పాత్రలు పురుషులే వేస్తున్నారు. రాళ్ళపల్లి వారు చెప్పిన అభిప్రాయం ఆధునికతకు వ్యతిరేకత అని అర్థం చేసుకొంటారు.కానీ ఆయన ఏ కాలంలో చెప్పారు ఎందుకు చెప్పారన్నది ఆలోచించరు.

# అనుబంధం-౨

# అనుబంధం 2
# రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ రచనల పట్టిక–వివరాలు

| క్ర.సం | రచనలు | ప్రచురణ వివరాలు | సంవత్సరం |
|---|---|---|---|
| 1. | తారాదేవి (ఖండకావ్యం) | 'సరస్వతి' మాస పత్రిక కాకినాడ | 1911 |
| 2. | మిరాబాయి. (ఖండకావ్యం) | 'మానవసేవ' మాస పత్రిక, రాజమహేంద్రవరం | 1913 |
| 3. | లీలాదేవి (అనువాద నవల) | ఆంధ్ర ప్రచారిణీ గ్రంథాలయం, నిడుదవోలు **(అలభ్యం)** | 1913 |
| 4. | **భార్గవీ పంచ వింశతి (28 పద్యాలు)** | సాధనముద్రాక్షరశాల, అనంతపురము. | 1926 |
| 5. | **శ్రీ కృష్ణ భూపాలీయము (పరిష్కరణ)** | మైసూరు ప్రభుత్వం వారు, మైసూరు | 1924 |
| 6. | **శ్రీ మహీశూర రాజ్యాభ్యుదయాదర్శః (చంపూ కావ్యం)** | మైసూరు ప్రభుత్వం వారు, మైసూరు | 1925 |
| 7. | వేమన (విమర్శ) | ఆంధ్ర విశ్వకళా పరిషత్. వాల్తేరు. | 1929 |
| 8. | **సారస్వతోపన్యాసములు (విమర్శ)** | శ్రీ సాధన ముద్రాక్షరశాల అనంతపురం. | 1931 |
| 9. | **శ్రీ మదాంధ్ర మహాభాగవతము (పరిష్కరణ)** | రాయల్ అండ్ కో, కడప. | 1953 |
| 10. | సారస్వతాలోకము (విమర్శ) | త్రివేణీ పబ్లిషర్స్, మచిలీపట్నం. | 1954 |
| 11. | **శాలివాహన గాథాసప్తశతీసారము (అనువాదం)** | ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాదు. | 1964 |

| | | | |
|---|---|---|---|
| **12.** | **నృత్త రత్నావళి (అనువాదం)** | పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు | 2007 |
| **13.** | **నాటకోపన్యాసములను (విమర్శ)** | త్రివేణి పబ్లిషర్స్, మచిలీపట్నం. | 1935-68 |
| **14.** | **సుందరపాండ్య విరచిత ఆర్యా (అనువాదం)** | శ్రీ రాయల సాహిత్య పరిషత్తు, ప్రొద్దుటూరు. | 1970 |
| **15.** | **తాళ్లపాక సంకీర్తనలు (పరిష్కరణ)** | తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి. | 1951-1976. |
| **16.** | **రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు (విమర్శ)** | ఎమెస్కో, రైతు నేస్తం ప్రెస్, హైదరాబాదు. | 2017 |

## ★ కన్నడ రచనలు

**1.** ***గానకలె'*** కావ్యాలయ ప్రకాశన మైసూర్ 1952.

2. ***'సంగీత వ్యాసాల అనువాదం'*** కావ్యాలయ ప్రకాశన మైసూర్

3. ***సాహిత్య మత్తు జీవన కలె'*** కావ్యాలయ ప్రకాశన మైసూర్

4. ***'అనంత భారతీ'*** సంస్కృత వ్యాసం (సం) బి. ఎస్. రామకృష్ణారావు నేషనల్ కాలేజ్ బసవన గుడి. 1977.

## ★ రాళ్ళపల్లివారి ముక్తక కవితలు

ఆంధ్రపత్రిక (దుందుభి) 1922 ఉగాది సంచిక మే లో *'కుసుమ గుచ్ఛాలు'* అనే శీర్షికతో 1నుండి 4 కవితలు ప్రచురితమైనాయి.

1. పెనుగొండ కొండ
2. పరిహాస లీల
3. ముసలి వీణ
4. సంధ్యావందనము
5. ఆహ్వానము (కవిత) అక్టోబర్ భారతి పత్రికలో 1934
6. విస్మృత వేణుగీతి (గ్రంథాలయ సర్వస్వము సంచిక. 1, సంపుటి.3)
7. శమీపూజ (గ్రంథాలయ సర్వస్వము సంచిక: 2, సంపుటం:1)
8. భారతికి సాధువాదము (కవిత), భారతి, జన. 1949.
9. ప్రబంధకవి

**10.** అజవిలాపము (సంస్కృత అనువాదం, కవిత) గ్రంథాలయ సర్వసము, సం.3, సం.1

**11.** అభీతిస్తవము, (సంస్కృత అనువాదం, కవిత) భారతి, సెప్టెం. 1962.

## • రాళ్ళపల్లి వారి వ్యాసాల్లో చేరనివి

1. *'అల్లసాని పెద్దన పెద్దతనము'* (అసంపూర్తి వ్యాసం) సారసి(సారస్వత త్రైమాస పత్రిక) ప్రారంభ సంచిక, జనవరి – మార్చి 1983, తెలుగు సారస్వత సమాఖ్య, న్యూఢిల్లీ, ప్రధాన సంపాదకుడు; ఏల్చూరి మురళీధరరావు.
2. *'సంకుసాల నరసయ్య'* ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక,
3. *'అనువైన సంగీతం – పూజాసమయాల్లో'* సంస్కృతి (పత్రిక), జూలై,1953.

## • 'రాళ్ళపల్లి పీఠికలు' లో చేరనివి

1. *'స్వప్న వాసవదత్తము'* – తిమ్మావజ్ఝల కోదండరామయ్య, ఫ్రీడమ్ ప్రెస్, అభిప్రాయములు, 1921.
2. *'కవిరాజ శిఖామణి'* – తిమ్మావజ్ఝల కోదండ రామయ్య, అభిప్రాయములు, 1921.
3. *'కృష్ణ కథా విపంచి'* (కృష్ణదేవరాయల చరిత్ర) – బాడాల రామకవి, అభిప్రాయములు, వెల్డన్ ప్రెస్, మద్రాసు, 1921; అభిప్రాయములు 1921.
4. *'విహగేంద్ర విజయము'* – కరణము కృష్ణరాయలు గ్రంథకర్తను గురించి, మైసూరు, 6.12.1926.
5. *'శ్రీ సారంగ ధర చరిత్రము'* – చేమకూర వేంకట రాజ ప్రణీతము, విద్వాన్ దీపాల పిచ్చయ్యశాస్త్రి, తెనాలి భారతీ ముద్రణాలయమున, ముద్రితము, 1924; పండితాభిప్రాయము, మైసూరు, 1942.
6. *'మహోదయము'* ఆధునిక కవితా సంకలనం – శివశంకర శాస్త్రి, ఆంధ్రప్రచారిణీ లిమిటెడ్ కాకినాడ, 1946.
7. *'శ్రీ దండకరామాయణము'* – అశ్వత్థ రావు, కలుగోడు, పీఠిక, 1949.
8. *'గాన కళా బోధిని'* – , శ్రీమతి నల్లాన్ చక్రవర్తుల పార్థసారథి దంపతులు, వెల్డన్ ప్రెస్, మద్రాస్; అభిప్రాయము, మైసూరు,1951.
9. *'శ్రీ మహర్షి జీవిత కథామృతము'* (ప్రాచీన భారత మహర్షుల జీవిత చరిత్రము నాలుగవ భాగము) – విద్వాన్ బులుసు వేంకటేశ్వర్లు, జార్జ్ పవర్ ప్రెస్ ముద్రితం, అభిప్రాయము,1953.
10. *'శ్రీ వేంకటేశ్వర స్తోత్ర సంహిత'* – (బంధ స్వరావళి) సంగీతశాస్త్ర ప్రవీణ, వైణిక శిఖామణి వీణా చార్య శ్రీమాన్ తిరుమల నల్లాన్ చక్రవర్తి వెంకటనారాయణా చార్యులు; అభిప్రాయము, 1953.
11. *'విశ్వ శ్రీ'* (దార్శనిక సాహిత్య మాసపత్రిక) పురాణపండ రామమూర్తి,1954.

12. 'సారస్వత నవనీతము' – దేవులపల్లి రామానుజ రావు, శివాజీ ప్రెస్, పత్రికలలో 1942– 1954ల మధ్య రాసిన వ్యాసాలు, అభిప్రాయము, 1954.
13. 'సాహిత్య సమీక్ష' (వ్యాస సంపుటి) – దీపాల పిచ్చయ్యశాస్త్రి, కోకిలా ప్రెస్ , నెల్లూరు, పండితాభిప్రాయము, 1955.
14. 'త్యాగరాజ చరిత్రము' (పద్యకావ్యము) – నల్లాన్ చక్రవర్తుల, వెంకట్రామాఘవర్ ప్రెస్, ప్రథమ ముద్రణ, ఏలూరు, పరిచయము, నవంబర్ –1955.
15. 'నీలాపనిందా పరిణయము' – రాఘవాచార్యహరి, పరిష్కర్త; ఆకుండి వ్యాస మూర్తి, రంజన్ ఎలక్ట్రానిక్ ప్రెస్, తొలిపలుకు,1955.
16. 'ప్రతీకారము' – వేల మూర్తి వేంకట సుబ్రహ్మణ్య కవి, శ్రీ కృష్ణా పవర్ ప్రెస్, తిరుపతి, పండితాభిప్రాయము, 1956.
17. 'త్రివేణి' – (పద్యకావ్య సంపుటి) శ్రీ మాన్ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు, తి. న. సం. జ. తి. వే. బా, శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల వేంకట రామాచార్యులు, దేశీప్రెస్, విజయవాడ, 1958.
18. 'త్యాగరాజీయము' – నలపెద్ది సుబ్బరామయ్య (కావులూరు, నెల్లూరు జిల్లా) ఆశంస, 1959.
19. 'వీర కంకణము' (పద్యకావ్యము – విశ్వనాథా నాయిక చరిత్ర) పాణ్యం నరసయ్య, శ్రీకైలాస్ ప్రింటింగ్ ప్రెస్, ఆశీస్సు,1959.
20. 'సర్వోదయ గానము' – తుమ్మల సీతా రామమూర్తి, లక్ష్మీ ప్రెస్, పీఠిక, 1963.
21. 'గ్రామసీమ' – (ఖండకావ్యము) మధురకవి, విద్వాన్, కనమలూరు శివరామయ్య, మున్నుడి, 1961.
22. 'తపోవనము' – మధురకవి బెళ్ళూరి శ్రీనివాసమూర్తి, శ్రీ కృష్ణదేవ రాయల గ్రంథమాల, హిందూపురం, 12 పుష్పము, ప్రశంస1948.
23. 'సుందర భారతము' – శంకరంబాడి సుందరాచారి, సాహితీ ప్రింటర్స్, మద్రాసు, మంగళాది, 1962.
24. 'సత్యాన్వేషణము' (కష్ట జీవుల కన్నీటిగాథ) – తక్కల్లపల్లి పాపాసాహేబ్, విశ్వనాధ పవర్ ప్రెస్, అనంతపురం, అభిప్రాయము, 1965.
25. 'ఆనంద భిక్షువు' – వాసిలి వే.ల. నరసింహారావు, ద్వితీయ ముద్రణ, లక్ష్మీ ప్రెస్, సమీక్ష, అభినందనము, 1963.
26. 'సువర్ణ ధార' (పద్యకావ్య కదంబము) – మహాకవి ముదిగొండ వీరభద్రమూర్తి, ప్రకాశకులు సాహితీ సమితి రేపల్లె, వెంకట రమణా ప్రింటర్స్, అభినందనము, 1964.
27. 'శ్రీ వేంకటేశ్వర కర్ణామృతము' (భక్తి రస ప్రబంధము) – కవి రత్న ఎమ్. వి. ఎస్. శర్మ, శ్రీరాయల సాహిత్య పరిషత్తు, ప్రొద్దుటూరు; అభిప్రాయము,1966.

28. 'గదా యుద్ధము'– (కన్నడమూలం – రన్నకవి) – కలుగోడు అశ్వత్థరావు, కవిరాజ ప్రింటర్స్, లక్ష్మీ బజార్, రాయదుర్గం, అభిప్రాయము,1966.
29. 'కవితానంద వాల్మీకి రామాయణము – యాత్ర కాండారికము', ఆధారితము సోంపల్లి సంపత్ కృష్ణమూర్తి, బాలాజీ ప్రెస్, చిత్తూరు, 1967.
30. 'శ్రీరామ నిర్వేదము' – నారునాగనార్య, ప్లవంగ, విజయవాడ, భూమిక,1967.
31. 'లేపాక్షి స్వప్నదర్శనము' – బడాలరామయ్య, వావిళ్ళప్రెస్, అభిప్రాయము, 1970.
32. 'విక్రమాంకదేవ చరిత్రము' (అనువాద గ్రంథం) – సుధీంద్రమౌళి, కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి, మాది రాజు విశ్వనాథరావు, శివాజీ ప్రెస్, గంజ్ బజార్, సికింద్రాబాద్, పండితాభిప్రాయము, 1974.
33. 'తాళ్ళపాక కవుల కృతులు' – వివిధ సాహితీ ప్రక్రియలు – వేటూరి ఆనందమూర్తి, మురళీ ఫవర్ ప్రెస్, కుతుబ్ గూడా, హైదరాబాదు, ప్రథమ ముద్రణ, మే, ఆశీస్సులు, 1974.
34. 'బసవేశ్వర వచనాలు – సమగ్ర సమీక్ష' - బాడాల రామయ్య , మంగళాశంస, 1976.

## • రాళ్ళపల్లి వారి రచనలపై పత్రికల్లో వచ్చిన వ్యాసాలు

1. అశోక్ కుమార్, కె. పి. రాళ్ళపల్లి సంగీత సాహిత్య పరిమళం(సమీక్ష) ఆంధ్రభూమి, 28.10.2017.
2. ఉమేశ్, బడిగె. 'రాళ్ళపల్లి వ్యాసాల విశ్లేషణ' పాలపిట్ట (మాస పత్రిక) జనవరి, 2018.
3. ఉమేశ్, బడిగె. రాళ్ళపల్లివారి 'తారాదేవి' ఖండకావ్యం; స్త్రీల ధైర్య సాహసాలు, సంశోధన (త్రైమాసిక తెలుగు పరిశోధన పత్రిక) అక్టోబర్, 2017.
4. ఉమేశ్, బడిగె. 'రాయలసీమ అస్తిత్వం– రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ' రాయలసీమ జాగృతి, డిసెంబర్, 2017.
5. ఉమేశ్, బడిగె. 'రాళ్ళపల్లి వారి సాహిత్య పీఠికా పరిమళం' భావవీణ (మాస పత్రిక) నవంబర్ 2017.
6. ఉమేశ్, బడిగె. 'రాళ్ళపల్లి వ్యాసాల్లో స్త్రీ దృక్పథం' ఆంధ్రజ్యోతి, డిసెంబర్, 10, 2018.
7. ఉమేశ్, బడిగె. 'విమర్శకు వన్నె తెచ్చిన రాళ్ళపల్లి' ఆంధ్రప్రభ, జనవరి,22, 2018.
8. ఉమేశ్, బడిగె. 'సాహిత్య సంగీత కళానిధి రాళ్ళపల్లి జీవిత కథా కమామీషు' మూసీ (సాహిత్య, సాంస్కృతిక, చారిత్రక మాస పత్రిక హైదరాబాదు) జనవరి, 2017.
9. ఉమేశ్, బడిగె. కవి జీవితాల పరిశోధనలు; రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, పరిశోధన; నాడు నేడు, రేపు (అంతర్జాతీయ సదస్సు పత్రాలు) సంపాదకులు మాడభూషి సంపత్ కుమార్, ఫిబ్రవరి, 2016.

10. ఉమేశ్, బడిగె. తెలుగు అనువాదాలను ఉదహరించాల్సింది, ఆంధ్రజ్యోతి "వివిధ"07.05.2018.
11. నరసింహయ్య, ఫణతుల. విమర్శక రాజహంస, చిత్తూరు జిల్లా రచయితల తృతీయ మహాసభల ప్రత్యేక సంచిక, (ప్రచురణ– చిత్తూరు జిల్లా రచయిత సంఘం) సెప్టెంబర్, 24,25,26– 1971.
12. నిత్యానందరావు, వెలిదండ. అక్షర శిఖరాగ్రరోచిష్ణుదు, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, మూసీ(సాహిత్య, సాంస్కృతిక, చారిత్రక మాస పత్రిక) జనవరి, 2018.
13. శివప్రియ, 'సారస్వత సాలోచనలో 'అనంత' పథం' ఆంధ్రజ్యోతి (దిన), జనవరి, 23, 2018.
14. సుందరం, ఆర్వీయస్. 'అనంత రాగాల అనంత కృష్ణులు' మిసిమి (మాసపత్రిక), నవంబర్, 2017.
15. హరినాథ్, పి. ఆర్. రాళ్ళపల్లి సాహిత్య సంగీత వ్యాసాలు, సంశోధన (త్రైమాసిక తెలుగు పరిశోధన పత్రిక) అక్టోబర్, 2017.

# అనుబంధం-3

# అనుబంధం 3

# సదస్సులు మరియు పరిశోధన వ్యాసాలు


తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం

ఆధునిక తెలుగు సాహిత్యం- తీరు తెన్నులు

యు.జి.సి. జాతీయ సదస్సు : జూలై 30, 2016

ధ్రువీకరణపత్రం

ఆచార్య/డా./శ్రీ/శ్రీమతి బడిగె ఉమేశ్ గారు

ఒక రోజు జాతీయ సదస్సులో పాల్గొని రాళ్ళపల్లి వారి తారాదేవి ఖండకావ్యం

స్త్రీల ధైర్య సాహసాలు అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని సమర్పించారు

ఆచార్య ఎం. జయదేవ్
సదస్సు సంచాలకులు

ఆచార్య జర్రా అప్పారావు
సదస్సు కార్యదర్శి

Scanned with CamScanner



# శ్రీ విరక్తిగవి మఠం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కళ్యాణదుర్గం - 515761

కళ్యాణ భారతి (తెలుగు శాఖ), అనంతపురము జిల్లా, ఆంధ్రప్రదేశ్

యు.జి.సి. ఆర్థిక సహాయం తో స్పందన సహకారంతో

జాతీయ సదస్సు,

## ఆధునిక తెలుగు కవిత్వంలో ప్రాంతీయ అస్తిత్వం

ఫిబ్రవరి 2,3, తేదీలు 2017

ఆచార్య / డాక్టర్ / శ్రీ / శ్రీమతి బి. ఉమేష్, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయము (పరిశోధక విద్యార్థి) గారు

హైదరాబాదు (జిల్లా), తెలంగాణ (రాష్ట్రము) జిల్లా / కళాశాల / విశ్వవిద్యాలయం నుండి విచ్చేసి రెండు రోజులు

జాతీయ సదస్సు లో పాల్గొన్నారు / పాల్గొని రాళ్ళపల్లి వారి కవిత్వంలో ప్రాంతీయ అస్తిత్వం.

అనే అంశం పై పరిశోధన పత్రాన్ని సమర్పించారు.

డాక్టర్ అంకే శ్రీనివాసులు
సదస్సు సంచాలకులు

యన్. నిర్మల
శ్రీమతి యన్. నిర్మల
కార్యనిర్వాహాధ్యక్షులు

Scanned with CamScanner

# పరిశోధన:
# నాడు, నేడు, రేపు

(అంతర్జాతీయ సదస్సు పత్రాలు)



సంపాదకులు

ఆచార్య మాడభూషి సంపత్ కుమార్

CS Scanned with CamScanner

# PARISOODHANA: NINNA, NEEDU, REEPU

(Research Papers Presented in the International Seminar
"Research : Yesterday, Today and Tomorrow")

**Editor: Dr. M. Sampath Kumar**
Prof. & Head, Department of Telugu
University of Madras
Chennai-600 005
Mobile:09444075128
email: madabhushisk@gmail.com

First Edition: February 2016

(c) Editor

Cover Design: Thy Designers, Chennai

**ISBN No. : 978-93-81992-32-6**

# పరిశోధన: నిన్న, నేడు, రేపు

(అంతర్జాతీయ సదస్సు పత్రాలు)

**సంపాదకులు:**

**ఆచార్య మాడభూషి సంపత్ కుమార్,** డి.లిట్.

తెలుగు శాఖాధ్యక్షులు, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై-600 005

హక్కులు : సంపాదకులు

మొదటి ప్రచురణ : ఫిబ్రవరి 2016
ముఖపత్ర అలంకరణ: థై డిజైనర్స్
వెల: రూ.400/-

ప్రతులకు:

**పాలపిట్ట బుక్స్**
16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ
సలీంనగర్, మలక్‌పేట, హైదరాబాదు-500 036
ఫోను:040-27678430

Scanned with CamScanner

# కవి జీవితాల పరిశోధనలు: రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

బడిగె ఉమేశ్, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం

తెలుగు సాహిత్యంలో కవి జీవిత పరిశోధనలు ఇప్పటి వరకు చాలా జరిగాయి. ఇలా జరిగిన కవి జీవిత పరిశోధన వల్ల సాహిత్య చరిత్రను సమగ్రంగా తెలుసుకోవడానికి వీలవుతుంది.ఒక వ్యక్తి లేదా ఆవ్యక్తి చేసిన సాహిత్య కృషిని అంతటినీ సాహిత్య చరిత్రలో కొన్ని సార్లు ఆ సాహిత్య చరిత్రలో వున్న పరిధులవల్ల కుదరక పోవచ్చు. అటువంటప్పుడు ఆ వ్యక్తులు లేదా ఆ పుస్తకాల గురించి మరింత లోతుగా తెలుసుకోవడానికి ఇలాంటి పరిశోధనలు దోహద పడతాయి. అందువల్ల ఈ కవిజీవిత కావ్య సమన్వయ పరిశోధనల తీరుతెన్నుల గురించి ఈ పత్రంల్తో వివరించాలనుకుంటున్నాను. ఈ మార్గంలోనే డా॥ దార్ల వెంకటేశ్వరరావు గారి పర్యవేక్షణలో "రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ జీవితం, రచనలు- సమగ్ర పరిశీలన" అనే అంశంపై పరిశోధన చేస్తున్నాను. రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ గారు కవిగా, అనువాదకులుగా, వ్యాసకర్తగా, పరిశోధకులుగా, విమర్శకులుగా సుప్రసిద్ధులు. ఈయన అటు తెలుగు సాహిత్యంలోను, ఇటు కర్నాటక సంగీతంలోను అద్వితీయమైన స్థానాన్ని పొందిన వారు. ఈ పరిశోధన పత్రంలో రాళ్లపల్లి వారిపై జరిగిన కవిజీవిత పరిశోధనల గురించి రాయాలనుకుంటూన్నాను.

**తెలుగు సాహిత్యంలో సాహితీవేత్తలపై జరిగిన పరిశోధనలు**

తెలుగు సాహిత్యంలో వ్యక్తుల మీద జరిగిన పరిశోధనలు కవి జీవిత పరిశోధనల కిందికి వస్తాయి. ఈ విధంగా తెలుగులోచాలా మంది కవుల వ్యక్తిత్వం, రచనలమీద పరిశోధనలు జరిగాయి. ఇప్పటికీ జరుగుతున్నాయి. ఏదైనా ఒక కావ్యంలో ప్రత్యేకమైన అంశాలుంటే ఆ కావ్యం మీద పరిశోధన చేస్తున్నారు. అలాగే ఒక కవి జీవితం, రచనలను మీద కూడా పరిశోధనలు చేస్తున్నారు. ఈ రంగంలో జరిగిన పరిశోధనలు గమనిస్తే ఇంకా జరగాల్సిన పరిశోధనలు ఏమిటో గుర్తించవచ్చు. కవి జీవిత పరిశోధనలు కొందరు డిగ్రీలకోసం వివిధ విశ్వవిద్యాలయాల్లో చేయగా, మరి కొందరు వారి ఇష్టాయిష్టాలను బట్టి ఆయా వ్యక్తులపై వారి సాహిత్య కృషిని తెలుపటానికి వ్యక్తిగతంగా పరిశోధనలు చేశారు. వ్యక్తిగతం లేదా ఇతరుల ప్రోత్సాహంతో జరిగిన కవి జీవిత పరిశోధనలు కొన్ని ఈ విధంగా ఉన్నాయి.తెలుగు సాహిత్యంలో కవుల పైన జరిగిన పరిశోధనలు చాలా ఉన్నాయి. గురజాడ శ్రీరామమూర్తి "కవి జీవితములు"(1876), కందుకూరి వీరేశలింగం పంతులు "ఆంధ్రకవుల చరిత్రము" (1887), చాగంటి శేషయ్య "ఆంధ్ర కవి తరంగిణి " (1949)ల తర్వాత ఆరుద్ర "సమగ్రాంధ్ర సాహిత్యం" (1956-1968) వరకు కూడా చాలా మంది పరిశోధనలు చేసి కవుల చరిత్ర, సాహిత్య చరిత్ర గ్రంథాలుగా వెలువరించారు. అలా ప్రాచీన కవులు, ఆధునిక కాలంలో కవులు, రచయితలు, రచయిత్రులు, విమర్శకులు ఇలా అనేక మందిపై విరివిగా పరిశోధనలు జరగడం అభినందనీయం. అలాగే, వేమన గురించి ముందుగా అభే దుబాయ్ కొన్ని విశేషాల్ని తెలిపితే ఆ తర్వాత సి. పి బ్రౌన్ కొన్ని పద్యాలను అచ్చువేశారు. ఆ తర్వాత వి. వి. శర్మ, వంగూరి సుబ్బారావు లాంటి వారు వేమన గురించి తెలిపారు. తర్వాత రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ గారు వేమన గురించి పరిశోధించారు. "వేమన" (1929) తెలుగులో మొదటి కవి జీవిత విమర్శ గ్రంథంగా గుర్తింపు పొందింది. తర్వాత కె. వి. రమణారెడ్డిగారు గురజాడ అప్పారావు గురించి "మహోదయం"(1969), దువ్వూరి రామిరెడ్డి గురించి "కవి కోకిల" (1965)అనే గ్రంథాలను రాశారు. తర్వాత శ్రీశ్రీ మీద ఆరుద్ర, బూదరాజు రాధాకృష్ణ రావిశాస్త్రి గురించి కె.కె రంగనాథాచార్యులు మొదలైన వారు వ్యక్తిగతంగా కొన్ని పరిశోధనలు చేశారు.

డిగ్రీల కోసం వివిధ విశ్వవిద్యాలయాల్లో చేసిన పరిశోధనలు కూడా చాల కనిపిస్తున్నాయి.ఆధునిక కవుల్లో కందుకూరి వీరేశలింగం గారు తెలుగు సమాజానికీ, సాహిత్యానికి తెచ్చిపెట్టిన వెలుగును అక్కిరాజు రమాపతి రావు పరిశోధించి 1965లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పొందారు.వేటూరి ప్రభాకర శాస్త్రి సాగించిన సాహిత్య పరిశోధన జీవితాన్ని, మరి కొన్ని అనుభవాలను ఆవిష్కరించి పాచిరాజు శేషగిరి రావుగారు 1980లో ఆంధ్ర యూనివర్సిటీ డాక్టరేట్ పట్ట పుచ్చుకున్నారు. కట్టమంచి రామలింగా రెడ్డిపై కట్టమంచి మహాలక్ష్మీ "సి. ఆర్ రెడ్డి జీవితం సాహిత్యం" అనే అంశం 1991లో పరిశోధించారు.

పానుగంటి లక్ష్మీ నరసింహరావు సాహిత్య సృష్టిపై ముదిగొండ వీరభద్ర శాస్త్రి (1963), చిలకమర్తి సాహిత్య సేవపై ముక్తేవి భారతి (1980), జాషువా కృతులపై బి. భాస్కర చౌదరి (1979),మలయ శ్రీ, ఎండ్లూరి సుధాకర్ తదితరులు పరిశోధనలు చేశారు. ప్రముఖ పరిశోధకులు ఆరుద్ర గారి మీద అనేక మంది పరిశోధనలు చేశారు. 2003లో డా॥ దార్ల వెంకటేశ్వరరావు "పరిశోధకుడుగా ఆరుద్ర" గ్రంథంలో ఆరుద్ర రచనలో విమర్శ, పరిశోధకుడిగా ఆరుద్ర దృక్పథం లాంటి విషయాలను చాలా వివరించారు. ఇలాంటి పరిశోధనలకు కొనసాగింపుగా నేడు మరి కొందరు రచయితలపై పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ



Scanned with CamScanner

విధమైనటువంటి కృషి రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ గురించి కూడా జరుగుతుంది.

**రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ గురించి పూర్వ పరిశోధనలు**

రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ కవిగా, విమర్శకులుగా సంగీత కారుడిగా సుప్రసిద్ధులు. వీరి గురించి కొంత మంది పరిశోధన చేశారు. ఈ పరిశోధనలు వ్యక్తి గతం అనే విభాగంలో చేర్చవచ్చని అనుకుంటున్నాను. 1959లో భారతి పత్రికలో 'అనంతకృష్ణులు అభిరుచి నిర్దేశము' 'రాళ్లపల్లి వారి వచన రచన',అనే వ్యాసాలు శ్రీ సాళ్వకృష్ణమూర్తిగారు రాశారు. శ్రీ శంకరం బాడి సుందరాచారి, శ్రీ కనక మడకల వెంకటేశ్వరరావు సంపాదకత్వంలో "శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ సన్మాన సంచిక" 1961 అక్టోబర్‌లో చిత్తూరు నుండి తీసుకొచ్చారు. ఆర్వియస్. సుందరం, ఘట్టమరాజు అశ్వత్థనారాయణ, శివలంక శ్రీరామ చంద్ర మూర్తి వీరి ముగ్గురు కలిసి రాళ్లపల్లి అభినందన సమితి సభ్యులుగా ఏర్పడి 'అనంత రాగం', 'రాళ్లపల్లి పీఠికలు'. అనే పుస్తకాలు ముద్రించి రాళ్లపల్లి వారి సాహిత్య కృషిని విస్తరింపజేశారు. "అనంత రాగం" 1977లో అచ్చయింది. ఇది రాళ్లపల్లి అభినందన గ్రంథం. ఇందులో విభాగాలు ఈవిధంగా ఉన్నాయి. ఆలాపిని అనే విభాగంలో సాహిత్య, సంగీతానికి సంబంధించి ప్రముఖులు రాసిన వ్యాసాలున్నాయి. ఇవి రాళ్లపల్లి గురించి కాకుండా సాహిత్యానికి చెందినవి. మత్తకోకిలలో రాళ్లపల్లి గురించి వీరి సమకాలికులు రాసిన పద్యాలు, కవితలున్నాయి. నెల వెన్నెలలో సాహిత్య విద్వాంసులు రాళ్లపల్లి వారి గురించి తెలిసిన వారు ఆసక్తితో రాసిన వ్యాసాలున్నాయి. కన్నడ కస్తూరి లో కన్నడ ప్రముఖులు రాసిన వ్యాసాలు, ఫిడ్లిన్ ట్యూన్స్‌లో ఇంగ్లీష్‌లో రాసిన కొన్ని వ్యాసాలు రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారిని అర్థం చేసుకోవడానికి తోడ్పడతాయి. ఈ పుస్తకంలో ఘట్టమరాజు అశ్వత్థ నారాయణ గారు రాసిన 'జీవిత చరిత్ర సంగ్రహము' అనే వ్యాసం శర్మగారి గురించి తెలుసుకోవడానికి ప్రామాణికంగా ఉపయోగపడుతుంది. తర్వాత 1893-1993 మధ్య కాలంలో మేడసాని మోహన్ సంపాదకత్వంలో "శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ శత జయంతి సంచిక" వచ్చింది. ఇందులో ఇరవై రెండు వ్యాసాలున్నాయి. వీటివల్ల కూడా శర్మగారి సాహిత్య, సంగీత కృషిని తెలుసుకోవచ్చు. 2005 నవంబర్‌లో హైదరాబాదు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ నిర్వహించిన 'తెలుగులో తొలితరం పరిశోధకులు' జాతీయ సదస్సులో జి. అరుణ కుమారి గారు సమర్పించిన పత్రం 'రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ'. ఈ వ్యాసంలో రాళ్లపల్లి వారి అనువాదాల గురించి, గ్రంథ పరిష్కరణ గురించి చాలా విపులంగా వివరించారు. 'అనంతధామం' (2009) అనే పుస్తకంలో సి. మృణాళిని గారు 'కీర్తనీయ చరితకృష్ణశర్మ' అనే వ్యాసంలో స్థూలంగా రాళ్లపల్లి వారి సాహిత్య, సంగీత కృషిని తెలిపారు. ఈ మధ్య కాలంలో సూర్య దినపత్రిక సాహిత్య పేజీలో డా॥ అంకె శ్రీనివాస్ నవంబర్ 3నుండి డిసెంబర్ 29 ముద్రించిన వ్యాసాలు రాళ్లపల్లి కృషిని తెలుపుతాయి. ఈ విధంగా రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ కృషిని చాలా మంది గుర్తిస్తూ వస్తున్నారు.

**సాహిత్య చరిత్రల్లో రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ**

రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారి గురించి ఆరుద్ర "సమగ్ర ఆంధ్ర సాహిత్యం" నాల్గవ సంపుటిలో రాళ్లపల్లి వారికి కట్టమంచి రామలింగా రెడ్డి తో ఉన్న పరిచయాన్ని తెలిపారు. వావిళ్ల వారి 'వేమన' పుస్తకానికి రాళ్లపల్లి రాసిన ముందు మాటలో వేమన గురించి వెల్లడించిన విషయాలను ప్రస్తావించారు. అలాగే రాళ్లపల్లి వారి పుస్తకాలు సారస్వతోపన్యాసాలు(1931), శాలివాహన గాథ సప్తశతి సారము (1932), నాటకోపన్యాసాలు (1935) రచనలు చేశారని, జాయప సేనాని "నృత్త రత్నావళి" ని వచనంలో అనువదించారని, తర్వాత "మహిశూర రాజ్యాభ్యుదయము, యాదర్శః" వంటి సంస్కృత కావ్యాలు రాసిన రాళ్లపల్లి వారు సాహిత్యం పై దృష్టి పెట్టి, విమర్శ రంగంలోకి రావడం విశేషం అని ఆరుద్ర వివరించారు. కల్లూరు అహోబలరావు "రాయలసీమ రచయితల చరిత్ర"(1977) రెండవ సంపుటిలో రాళ్లపల్లి వారి పుట్టుక, విద్యా విషయాలు గురించి తెలిపారు. అలాగే రాళ్లపల్లి వారు రాయల కాలం గురించి రాసిన వ్యాసాలు, వీరు రాసిన "పెనుగొండ కొండ" పాటలో "చనిన నాళుల తెనుగు కత్తుల/ సాన పెట్టిన బండ- ఈ/ పెనుగొండ కొండ-కొండ"అని పరిచయం చేశారు. "విజ్ఞాన సర్వస్వము "20వ శతాబ్దం తెలుగు వెలుగులు" అనే పుస్తకాల్లో రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ గురించి కవి పరిచయం చేశారు. జి. నాగయ్య తెలుగు సాహిత్య సమీక్ష, ద్వానాశాస్త్రి తెలుగు సాహిత్య చరిత్ర పుస్తకాల్లో కూడా శర్మ గారి గురించి కొద్దిగా కనిపిస్తుంది.

**విశ్వవిద్యాలయాల్లో అనంతకృష్ణశర్మగారిపై జరిగిన పరిశోధన**

రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారిపై ఇంతకు ముందు కొన్ని పరిశోధనలు జరిగాయి. డా॥ సాతవల్లి చంద్రశేఖర్ 1979లో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో "శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారి సాహిత్య సేవ-సవిమర్శక సమీక్ష" అనే అంశం మీద ఎం. ఫిల్. చేశారు. ఈ సిద్ధాంత వ్యాసంలో రాళ్లపల్లి వారి జీవిత విశేషాలు కొన్ని ఘట్టాలు, వీరి సృజనాత్మక, విమర్శనాత్మక రచనలు గురించి,వారి ప్రతిభా పాండిత్యాలు గురించే కాకుండా వారి వ్యక్తిత్వాన్ని కూడా సమీక్ష చేశారు. వి. రమాంజనీ కుమారి 1983లో


Scanned with CamScanner

హైదరాబాదు విశ్వవిద్యాలయంలో "విమర్శకునిగా రాళ్లపల్లి" అనే అంశంపై ఎం.ఫిల్. చేశారు. ఇది ముద్రిత గ్రంథం.ఇందులో రాళ్లపల్లి వారి జీవితం,రచనలను స్థూలంగా పరిచయం చేసి, రాళ్లపల్లికి పూర్వం తెలుగు సాహిత్య విమర్శను పరిచయం చేశారు. అలాగే సాహిత్య సౌందర్య తత్త్వ దృక్పథం, రాళ్లపల్లి వారి విమర్శ గ్రంథాలను విశ్లేషించారు.డా॥ టి.పి.శ్రీనివాసన్,కర్నాటక లోని తుమ్కూరు విశ్వవిద్యాలయంలో "రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ జీవిత మత్తు సాదనే" అనే అంశంపై (2012) డి.లిట్ చేశారు. ఇందులో సంగీతం గురించి ఎక్కువగా చర్చించారు. బి.ఉమేశ్ 2014లో హైదరాబాదు విశ్వవిద్యాలయంలో "రాళ్లపల్లి పీఠికలు పరిశీలన" అనే అంశంపై ఎం.ఫిల్. చేశారు. ఇందులో రాళ్లపల్లి వారి జీవితం, రచనలను సంక్షిప్త పరిచయం చేసి, పీఠికలు స్వరూప స్వభావాలు చర్చించారు,అలాగే రాళ్లపల్లి వారి పీఠికల వివేచన చేసి, అభిప్రాయాలు తెలిపారు. రాళ్లపల్లి వారి సంగీతం గురించి తెలుగు విశ్వవిద్యాలయం. సంగీత శాఖ, డా॥ఎస్ ఉమాదేవి గారి పర్యవేక్షణలో అనురాధ గారు ఎం. ఫిల్., చేస్తున్నారు.

ప్రస్తుత నా పరిశోధన వివరాలు

రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ పై ఇన్ని పరిశోధన జరుగుతున్నాయంటే వారు చేసిన కృషే కారణం కావచ్చు. వీరు పన్నెండవ యేట నుండి రచనా వ్యాసంగం ప్రారంభించారని తెలుస్తుంది. వీరి కలం నుండి వెలువడిన సాహిత్య , సంగీత వ్యాసాలు. సమీక్షలు, పీఠికాభిప్రాయాలు వివిధ సాహిత్య పత్రికల్లో అచ్చయ్యాయి. ఇది అందరికి విదితమే. కాని ఇప్పటి వరకు జరిగిన పరిశోధనలు గమనిస్తే విడివిడిగా వీరి సాహిత్యం, సంగీత పై అక్కడక్కడ వ్యాసాల రూపంలో, పరిశోధనల్లో కొందరు వివరించారు. వీరు చేసిన కృషినంతటినీ సమగ్రంగా పరిశీలించలేదు. కాబట్టి నేను ఈ ప్రయత్నం చేసి, వీరు రాసిన కావ్యాలు, కవిత్వాన్ని విశ్లేషణాత్మకంగా పరిశీలించాలనుకుంటున్నాను. అలాగే వీరి గురించి సమగ్రంగా పరిశోధిస్తే వీరి సాహిత్యదృక్పథాన్ని తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఈయన తెలుగు, కన్నడం, తమిళ, పదాలు అక్కడక్కడా వ్యాసాల్లో ఉపయోగించారు. వీటి పరిశీలిస్తే వీరి భాషా వైశిష్ట్యం తెలుస్తుంది. విశ్వనాథ సత్యనారాయణ గారు ఒక సందర్భంలో రాళ్లపల్లి వారి కవిత్వం గురించి అన్న మాటలు చూడండి. "వారి శమ పూజా, పెనుగొండ పాట, మొదలైనవి తెలుగులో చావవు" వీరి విమర్శ పై కొంతగా కృషి జరిగింది. కానీ, వీరి సాహిత్యం పై కూడా పరిశోధన జరిగితే మరింత బాగుంటుందని అనిపిస్తుంది. ఇవే కాకుండా మరికొన్ని కవితలు రాశారు. వాటిని గమనిస్తే వీరి కవితా మాధుర్యాన్నీ, శైలినీ తెలుసుకోవచ్చు.ఈయన రాసిన మీరాబాయి కావ్యం విశిష్టమైంది. దీని గురించి సాహిత్యలోకంలో మరింతగా తెలియాల్సి ఉంది. ఆ కావ్యాన్ని నా పరిశోధన సమాచారసేకరణలో భాగంగా సంపాదించాను. ఇంతవరకు ఈ కావ్యం గురించి నాకు తెలిసినంతవరకు సరైన పరిచయమే జరగలేదు. అలాగే వీరు రాసిన చాలా సృజన రచనలు కనిపిస్తున్నాయి. వీటిని నా పరిశోధనలో పరిచయం చేసి, విశ్లేషించాలనుకుంటున్నాను. తెలుగులో కవిగా వీరి స్థానం గుర్తించి, గ్రంథ పరిష్కర్తగా, అనువాదకుడుగా, సంగీతకారుడుగా వీరి ఆలోచనలను నా పరిశోధన ద్వారా పాఠకలోకానికి అందించాలనుకుంటున్నాను.

ముగింపు

ఒక వ్యక్తి మీద పరిశోధన చేయడం అంటే వారి జీవితం గురించి కాకుండా, ఆనాటి సమకాలీన సాహిత్య పరిస్థితులు అంటే సాంఘిక, ఆర్థిక, రాజకీయ, చారిత్రక విషయాలు మీద పరిశోధన జరపడం. ఈ విషయాలు సాహిత్య చరిత్రకు ఎంతో దోహదం చేస్తాయి. కాబట్టి వ్యక్తులపై పరిశోధనలు ముఖ్యంగా కవి జీవితాలపై పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని భావిస్తున్నాను.ప్రస్తుతం గత రెండేళ్ళ నుండి మాత్రమే రాళ్ళపల్లివారిపై పరిశోధన (పిహెచ్.డి) చేస్తున్నాను. నా పరిశోధన పూర్తయ్యేనాటికి మరింత సమగ్రమైన విషయాలను అందించగలనని అనుకుంటున్నాను.

ఆధార గ్రంథాలు


1. అహోబలరావు, కల్లూరి. రాయలసీమ రచయిత్రుల చరిత్ర. హిందుపూర్: శ్రీ కృష్ణదేవరాయ గ్రంథ మాల హిందుపూర్, 1977.

2. ఆరుద్ర. సమగ్ర ఆంధ్ర సాహిత్యం. నాల్గవ సంపుటి హైదరాబాదు : తెలుగు అకాడమి హైదరాబాదు, 2012.

3. ఉమేశ్, బడిగె. రాళ్లపల్లి పీఠికలు పరిశీలన. ఎం.ఫిల్ అముద్రిత సిద్ధాంత వ్యాసం. హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయం. 2014.




Scanned with CamScanner

4. చంద్రశేఖర్, సాతవల్లి. శ్రీరాళ్లపల్లి అనంతకృష్ణశర్మ సాహిత్య సేవ-సవిమర్శక సమీక్ష. ఎం.ఫిల్ అముద్రిత సిద్ధాంత వ్యాసం. తిరుపతి: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం.1978.

5. నిత్యానంద రావు,వెలు దండ.విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన. హైదరాబాదు: మార్చి, 2013.

6. రమాంజనీ కుమారి, వి. విమర్శకునిగా రాళ్లపల్లి, ఎం.ఫిల్ సిద్ధాంత వ్యాసం, హైదరాబాదు విశ్వవిద్యాలయం,1983.

7. రామనరసింహం, పరిమి. తెలుగులో తొలితరం పరిశోధకులు.హైదరాబాదు: తెలుగు శాఖ హైదరాబాదు విశ్వవిద్యాలయం, 2005,

8. వెంకటేశ్వరరావు, దార్ల. పరిశోధకుడుగా ఆరుద్ర. పిహెచ్. డి, అముద్రిత సిద్ధాంత గ్రంథం, హైదరాబాదు విశ్వవిద్యాలయం, 2003.

9. సుందరం, ఆర్వీయస్. అశ్వత్థనారాయణ, ఘట్టమరాజు, శ్రీ రామ చంద్ర మూర్తి, శివలెంక. అనంతరాగం. బెంగళూరు: రాళ్లపల్లి అభినందన సమితి, 1977

10. శ్రీరంగస్వామి,టి, జయచంద్ర, జాబిలి, అనంతధామం. అనంతపురం: ఆశావాది సాహితీ కుటుంబం,2009.

- పత్రికలు

1. శంభు ప్రసాద, శివలెంక. భారతి మాసపత్రిక సంచిక36, సంపుటి7,8. 1959.

2. సూర్య దిన పత్రిక సాహిత్య పేజి నవంబర్, డిసెంబర్. 2014



Scanned with CamScanner

RNI No. APTEL/2003/12253

# భావవీణ

అంతర్జాతీయ తెలుగు సాహిత్య, సాంస్కృతిక & భాషాధ్యయన మాసపత్రిక

# BHAVA VEENA

International Journal of Telugu Literary, Culture & Language Study

Vol : 14 Issue No. 11 (3) Monthly November 2017 ISSN No. : 2456-4702



చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (సి.పి. బ్రౌన్)

Scanned with CamScanner

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



# BHAVA VEENA (భావ వీణ)

International Journal of Telugu Literary, Culture & Language Study

(అంతర్జాతీయ తెలుగు సాహిత్య, సాంస్కృతిక, భాషాధ్యయన పత్రిక)

Editor : KOLLA SRIKRISHNA RAO

E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9440033715
Rohini Towers,
2/11 Brodipet, GUNTUR-2.

**Vol. 14 - Issue. 11 (3) - November 2017 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253**

**EDITORIAL BOARD**

*Chief Editor*
Dr.B.VENKATASWAMY,
*M.A.(Tel), M.A. (San), M.A. (Ling), M.A. (Mcj), Ph.D.,*
HOD, Dept. of Telugu,
P. A. S. College, PEDANANDIPADU - 522 235, Guntur Dist., A.P.
Cell no : 7386529274, 7989781963.

**ADVISORY COMMITTEE**

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Dept. of Telugu,
   Sri Padmavathi Mahila University, Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.

**ASSOCIATE EDITORS**

1. **Dr.N. R. SADASIVA REDDY,** M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Dr.V.SANKARA RAO,** M.A.,M.A.,M.Phil,PhD.
   Asst. Professor, Dept. of Telugu, Madras
   University, CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU,** M.A.,M.Phil,PhD.
   Asst. Professor, Dept.of Hindi,
   Moulana Azad National Urdu University,
   HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
   Board of Studies Chairman, Telangana University,
   Dichpally, Nizamabad, Telangana.
5. **Dr. N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
   Asst.Professor, Dept. of Telugu,
   Acharya Nagarjuna University,
   Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
   Asst.Professor, Dept. of Telugu,
   Kakatiya University, Warangal District. Telangana.
7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
   Asst.Professor, Dept.of Modern Indian Languages,
   Madhurai Kamaraj University, Madhurai, Tamilnadu.
8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
   Asst. Professor, Dept. of Telugu,
   Yogi Vemana University, Kadapa.
9. **Dr. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
   Dept. of Telugu,
   Regional Institute of Education (NCRT)
   Manasa Gangothri, Mysore, Karnataka.
10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
    Dept. of Telugu,
    Dravidian University, Kuppam, Chittor Dist.
11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
    Asst.Professor, Dept. of Telugu,
    Adikavi Nannaya University,
    RAJAMUNDRY, East Godavari, A.P.
12. **Mr.D.ESWARA RAO,** M.A.,
    Associate Professor, Dept.of English,
    P.A.S.College, PEDANANDIPADU-522 235,
    Guntur, A.P.

Scanned with CamScanner

13. **Dr.P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu, Silver Jubilee
Govt. Degree College, Kurnool District. A.P.

14. **Dr.K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha**, M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi**, M.A., PhD.
Rt Principal, Govt .Degree College,
Chebrole, Guntur, A.P.

17. **Dr. P. Srinivasa Rao**, M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

18. **Dr. Ch. Praveen Kumar**, M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

19. **Dr. N. Rambabu**, M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
University of Hyderabad, Hyderabad.

20. **Dr. T. Sailamma**, M.A., M.Phil., PhD.
Asst. Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittoor Dist.

21. **Dr. M. Sangeetha Rao**, M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
University of Hyderabad, Hyderabad.

LEGALADVISER

**Dr. A. GURAVAIAH**, ***M.A., L.L.M., PhD.,***
Associate Professor
Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

COVER PAGE & PAGE SETTING

**TENALI PRAKASH**
G.L.S. ENTERPRISES, Guntur.
970 330 1698.

గమనిక: రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - ఎడిటర్.

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, GUNTUR - 522 002.
Andhra Pradesh. Cell : 7386529274, 7989781963. E-mail : parisodhanatelugu@gmail.com.
Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 9703301698.

Scanned with CamScanner

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# రాళ్ళపల్లి వారి సాహిత్య పీఠికా పరిమళం

- బడిగె ఉమేశ్, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

తెలుగు సాహిత్యంలో బ్రౌను దొర కాలం నుండి పీఠికా రచన ఉన్నట్లు తెలుస్తుంది. ఈ పీఠికా రచనను ఒక విమర్శక కళగా భావించవచ్చు. ఎందుకంటే పీఠికలు రాయుగల తెలుగు సాహితీవేత్తలు చాలా కొద్దిమంది మాత్రమే కనిపిస్తుంటారు. వారిలో కట్టమంచి రామలింగ రెడ్డి, వేటూరి ప్రభాకర శాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగార్లను ప్రత్యేకించి చెప్పుకోవచ్చు. వీరి పీఠికా రచన ఒక్కొక్కరి లో ఒక్కో విలక్షణమైన పద్ధతి కనిపిస్తుంటుంది. ప్రత్యేకించి రాళ్ళపల్లి వారు రచించిన పీఠికల్లో కావ్య గతమైన గుణదోషాలను చూపించటమే కాక రచయితను ప్రోత్సహించటం శర్మగారి ప్రత్యేకత. వీరి పీఠికల్లో సమకాలీన సామాజిక అంశాల చిత్రీకరణతో పాటు నాటి రాజకీయ చారిత్రక పరిణామాలు కూడా చోటు చేసుకోవడం మరో ప్రత్యేకత. రాళ్ళపల్లి వారు తనకు నచ్చితేనే పీఠికలు రాసేవారు. ఇందులో ఒకటీ అరా కూడా ముఖస్తుతి రాతలు కనిపించవు. రచన ఆస్వాదనీయంగా ఉంటే మహాకావ్యమైనా, ఖండకావ్యమైనా ఆయన పీఠిక రాయడానికి అంగీకారమే. ఆయన రాసిన ఏ పీఠికను చూసినా సంకుచితత్వానికి తావీయని సహృదయత కనిపిస్తుంది. ప్రధానంగా సూటి దనం, అభివ్యక్తి లాంటి లక్షణాలు అడుగడుగునా కనిపిస్తాయి.

"చెప్పేదానికి ఒక విషయముండాలి. అది చెప్పదగినదై ఉండాలి. స్పష్టంగా చెప్పే శక్తి నీకుండాలి.." అని రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారు అంటుండేవారట. ఈ విషయాన్ని తన కుమారుడు ఆర్.ఏ. జయంతగారు ఒకసారి మాటల సందర్భంలో చెప్పారు. రాళ్ళపల్లివారి వ్యాసాల్ని చదివినవారికెవరికైనా ఆ మాటల్లో నిజం ఉందనిపిస్తుంది. ఎందుకంటే రాళ్ళపల్లి వారు సంగీత, సాహిత్య రచనల్లో అనుసరించిన తీరు అంత స్పష్టంగా కనిపిస్తుంది. అంతేకాదు, రాళ్ళపల్లి వారి పాండిత్యానికి చాలామంది మంత్ర ముగ్ధులయ్యారు. విమర్శ రంగంలో ఆయన మంచి పేరు ప్రఖ్యాతులు పొందారు. అందువల్ల కొంతమంది సమకాలికులు ఆయన చేత తమ పుస్తకాలకు ముందుమాటలు రాయించుకున్నారు. 1917-1978 మధ్య కాలంలో దాదాపు నూట ఇరవై గ్రంథాలకు ఆయన పీఠికలు రాశారు. ఈ పీఠికలను రాళ్ళపల్లి అభినందన సమితి సభ్యులైన పుట్టమరాజు అశ్వత్థనారాయణ, ఆర్వీయస్ సుందరం, శివలెంక శ్రీరామచంద్రమూర్తి గార్లు కలిసి 'రాళ్ళపల్లి పీఠికలు' పేరుతో 1979లో ఒక సంకలన గ్రంథంగా తీసుకొచ్చారు. ఇందులో రాళ్ళపల్లి పీఠికల్ని ప్రాచీన, ఆధునిక, నవల-వ్యాసాలు, నాటకాలు, ఇతర గ్రంథాలకు రాసిన పీఠికలని ఆరు భాగాలుగా విభజించారు. రాళ్ళపల్లి వారు వివిధ రచనలకు రాసిన పీఠికలను ఒక సంకలన గ్రంథంగా తీసుకురావడం వల్ల ఆయన విమర్శ దృక్పథం, ఆయన పాండిత్యం ప్రజలకు స్పష్టంగా గోచరించే అవకాశం లభించిందని భావించవచ్చు.

సంగీత, సాహిత్య రంగాల్లో గుర్తింపు పొందిన రాళ్ళపల్లి వారు విమర్శను ఒక కళగా భావించారు. ఛందోబద్ధ రచనలాగా గుర్తించుకోదగిన మంచి సుందరమైన వచనం రాయడం ఆయనకే సాధ్యమనిపిస్తుంది. వివిధ గ్రంథాలకు ఆయన రాసిన పీఠికలు అలవోకగానో, అనాలోచితంగానో ముఖప్రీతి కోసమో రాసిన పీఠికలు కావు. ప్రతి పీఠికా ఒక చిన్న పరిశోధన వ్యాసం లాగో, ఒక కొత్త విషయాన్నేదోకదాన్ని ప్రతిపాదించేదో, కొత్త సమన్వయాన్ని అందించేదో అయ్యుంటుంది. ప్రతి పీఠికా మూల రచనను చదివించేలా ప్రేరణనిస్తుంది. మూల రచనను చదవడానికి కొత్త ద్వారాల్ని చూపిస్తుందన్నట్లు ఉంటాయి వారి పీఠికలు. దీనితోపాటు "కొండ అందముందు కొంచమై ఉండదా అన్న వేమన సూక్తిలాగా చిన్న మున్నుడిలో కూడ రాళ్ళపల్లి వారి వ్యక్తిత్వం ప్రస్ఫుటమవుతుందని ప్రముఖ పరిశోధకుడు జి.యస్. రెడ్డిగారు ప్రశంసించారు. రాళ్ళపల్లి వారి పీఠికల్లో ముఖ్యంగా వీరి సహృదయత నిశిత పరిశీలనా దృష్టి, పాండిత్యం, భాషా శిల్పం ప్రతిబింబిస్తూ ఉంటాయి.

పీఠిక రచన పూర్వం అవతారికల రూపంలో ఉండి, రచన గురించిన స్థూల పరిచయం కనిపించేది. అంటే ఆ రచనను ఎవరు రాశారు? ఎవరికి అంకితం ఇచ్చారు? అనే అంశాలతో పాటు ఆ రచనలోని విషయాలను సంక్షిప్తంగా తెలియపరిచేదే పీఠికగా నిర్వచించుకోవచ్చు. ఒక ఇల్లుకు పునాది, ఒక నాటకానికి నాంది ఎంత అవసరమో, ఒక పుస్తకానికి పీఠిక కూడా అంతే అవసరమని చెప్పవచ్చు. ఈ పీఠికను ఆధునిక కాలంలో వివిధ పేర్లతో పిలుస్తున్నారు. అవి ముందుమాట, ప్రస్తావన, పరిచయం, ఉపోద్ఘాతం ఇంకా అనేక కొత్త, కొత్త పేర్లను రచయితలు రచనను బట్టీ, వారి వెసులుబాటును అనుసరించి సృజనాత్మకంగా ఆ పేర్లను పెడుతుంటారు. అయితే రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు రాసిన పీఠికలకు పీఠిక, ఉపోద్ఘాతం, ఆముఖం, ప్రస్తావన, అభినందనము, అభిప్రాయము, ఆశీస్సు, తొలి నోము, తొలిపలుకు, మంగళా శాసనము, పరిచయము, మున్నుడి, భూమిక, తిలకం, విన్నపము, సందేశం మొదలైన పేర్లు పెట్టారు. కొన్ని మూడు వాక్యాలలాంటి వాటిని కూడా పీఠికలుగా రాశారు.



Scanned with CamScanner

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



లభించిన ఆధారాలను బట్టి రాళ్ళపల్లి వారు రాసిన పీఠికలు ప్రాచీన కవిత్వానికి సంబంధించి 16, ఆధునిక కవిత్వానికి సంబంధించి 33, నాటకాలకు సంబంధించి 3 , నవల, కథలకు సంబంధించి 3, వ్యాసాలు, విమర్శలు, పరిశోధనలకు సంబంధించి 14 పీఠికలు లభ్యమవుతున్నాయి. రాళ్ళపల్లి వారు మొత్తం 76 గ్రంథాలకు పీఠికలు రాసినట్లు తెలుస్తుంది. ఇవే కాక మరీ 42 గ్రంథాలకు పీఠికలు రాసి ఉండవచ్చునని రాళ్ళపల్లి వారి గురించి పరిశోధించిన వాళ్ళు అంటున్నారు. కానీ ఆ పీఠికలు సేకరించాల్సిన అవసరం ఉంది. మొత్తం మీద రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు సుమారు 120 గ్రంథాలకు పీఠికలు వెలువరించి ఉండవచ్చునని పరిశోధకుల అభిప్రాయం. .

రాళ్లపల్లి వారి పీఠికల్లో గుర్తింపు పొందిన పీఠికలు కొన్ని ఉన్నాయి. అన్నమయ్య ఆధ్యాత్మిక సంకీర్తనల (పరిష్కృత పీఠికలు), పాండురంగమాహాత్మ్యము, శివభారతము (గడియారం వెంకటశాస్త్రీ), నాగార్జునసాగరం (సినారె), పెన్నేటి పాట (విద్వాన్ విశ్వం), ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము (బాలాంత్రపు రజనీకాంత రావు), ద్రోణ ప్రశస్తి (దీపాల పిచ్చయ్య శాస్త్రి), పగడాలు కథ (ఆచంట శారదాదేవి), వదరబోతు (పప్పురి రామాచార్యులు), ప్రబంధ నాయికలు (పుట్టపర్తి నారాయణాచార్యులు), సాహిత్య తత్త్వము- శివభారత దర్శనము (సర్దేశాయి తిరుమలరావు), జానపద కళా సంపద (తూమాటి దొణప్ప), క్షేత్రయ్య పద సాహిత్యం (ఎస్.గంగప్ప), నృత్తరత్నావళి (జాయప సేనాపతి). వీటితో పాటు మిగతా పీఠికలు కూడా చెప్పుకోదగినవి చాలా ఉన్నాయి. వీరి పీఠికల్లో కొన్ని ప్రత్యేకతల్ని గుర్తించవచ్చు. రచయితలతో గల పరిచయం, రచనల అంతరంగ ప్రవేశం, లలితమైన విమర్శ, కొన్ని సూచనలైన మాటలు, ప్రోత్సాహకరమైన మాటలు కలగలిపి మొత్తం రచనకు సంబంధించిన విషయాలు సంక్షిప్తంగా ఉంటాయి..

"రాళ్ళపల్లి పీఠికలు" సంకలనానికి ముందుమాట రాసినా ప్రముఖ పరిశోధకులు, భాషావేత్త ఆచార్యజి.యన్.రెడ్డి ఇలా అన్నారు. "శతాధికములైన రాళ్ళపల్లి పీఠికలు రమణీయములు, కమనీయములు, ఆలోచనామృతాలు" అంటూ... "అవి విషయ ప్రధానములు, విమర్శ తత్త్వ సమన్వితములు, సమీక్షా ప్రాయములు, వైయక్తిక వచన రచన శిల్ప విలక్షణములు. ఎవరో ఒక రచయిత కోరికను మన్నించి మర్యాదకోసమో, మోహమాటనికో నాలుగు మాటల్లో తన అభిప్రాయాన్ని రాసినా అందులోనూ ఒక మెలుకువో, ఒక మరుపమో, ఒక చిన్నమెరుపో ప్రతిబింబమై ఉంటుంది. పెద్ద పీఠికల్లో విషయౌన్నత్యం అభిప్రాయ గాంభీర్యం, పటుత్వం తప్పని సరస వాక్కు, శైలి సంపన్నత ప్రధాన లక్షణాలు. నిజానికి రాళ్ళపల్లి వారి పీఠికలు ఒక నిర్మితికల్గి సుందరంగా, శిల్పశోభితంగా రూపొంది ఉంటాయు"ని రాళ్ళపల్లి వారి పీఠిక కళా స్వరూపాన్ని ఆవిష్కరించారు.

జానుమద్ది హనుమచాశాస్త్రిగారు "రాళ్ళపల్లి పీఠికలు" సంకలన గ్రంథంపై భారతి మాసపత్రికలో సమీక్ష రాస్తూ ఈ విధంగా వ్యాఖ్యానించారు. "పాశ్చాత్య సమీక్షా సిద్ధాంతములను అకళించుకున్న శర్మగారి సాహిత్య సమాలోచనా రీతీ విశిష్టమైనది. వారి దృష్టి సత్య నిష్టమైనది. రచనలోని దోషములను నిష్పక్ష పాతముగా వెలువరించటం వారి ప్రత్యేకత. వీరు తెలిసిన విషయాలు నిరోయముగా ప్రపంచమునకు బోధించు ధైర్యము, దానికి నిబంధనమై ఇరు ప్రక్కలయందు మగులేని మంచి పదును గల చురకత్తివంటి 'రచనాశక్తి', దానికి మెగిచ్చునట్టి సూక్ష్మ దృష్టి గాయపు మందు కత్తికే పూసి కొట్టినట్లు, తిట్టుచునే నవ్వించు హాస్య కుశలత రాళ్ళపల్లి వారి సాహిత్య విమర్శనం మూల సూత్రాలు. ఈ సూత్రాలు పీఠికా రచనలో అనూస్యూతములై చోటు చేసుకొన్న తీరు విలక్షణమైనది. కప్పుకున్న వైష్ణవం, ముఖనింద, పటిష్టహరణం, మైల పలుకులు, ముద్రాక్షర శోధనము, చిప్ప గుర్తులు, పగులు మొగ్గలు, బిత్తలి కవిత్వం, అంగడి కవులు, ఆకాశవాణి లాంటి పదబంధాలను ఉపయోగించడం" రాళ్ళపల్లి వారి ప్రత్యేక భాషా పాండిత్యానికి చిహ్నంగా అభివర్ణించవచ్చు.

రాళ్ళపల్లి వారు పీఠిక రాయడానికి కలిగిన సందర్భాలను, ఆయా రచయితలతో ఉన్న సాన్నిహిత్యాన్ని చెప్తూ, గ్రంథంలోని గుణదోషాలను క్షుణ్ణంగా తెలిపి, రచయితలను మరో రచన చేయడానికి గొప్ప ప్రోత్సాహన్నిచ్చిన మాటలు ఎక్కువ పీఠికల్లో కనబడతాయి.

ఈవిధంగా రాళ్ళపల్లి వారి పీఠికలు ఒక విధమైన వైలక్షణ్యాన్ని కలిగి ఉన్నాయని చెప్పవచ్చు. తెలుగు సాహిత్య చరిత్రలోనూ, సాహిత్య విమర్శ రంగంలోనూ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి పీఠికలు ఒక విశిష్టతను సాధిస్తూనే, మరెంతోమందికి మార్గ దర్శనాన్ని కల్గస్తాయని భావించవచ్చు.

**ఆధార గ్రంథాలు :**

1. అశ్వత్థనారాయణ, ఘట్టమరాజు. సుందరం, ఆర్వీయస్, రాళ్ళపల్లి పీఠికలు. బెంగళూరు: రాళ్ళపల్లి అభినందన సమితి,1977.
2. ఉమేశ్. బడిగె, రాళ్లపల్లి పీఠికలు పరిశీలన. (ఎం.ఫిల్., అముద్రిత సిద్ధాంత లఘు వ్యాసం), హైదరాబాద్: కేంద్రీయ విశ్వవిద్యాలయం, 2014.
3. చంద్రశేఖరరెడ్డి, డి, తెలుగు పీఠిక. హైదరాబాదు: ఆంధ్ర సారస్వత పరిషత్తు, 1990.
4. మోహన్. మేడసాని, శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ శత జయంతి సంచిక. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు తిరుపతి, 1993.



Scanned with CamScanner

# విమర్శకు వన్నెతెచ్చిన రాళ్ళపల్లి



తెలుగు సాహిత్య విమర్శ అనగానే గుర్తుకు వచ్చే మహనీయుల్లో రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ ఒకరు. ఈయన విమర్శకులుగా, కవిగా, అనువాదకులుగా, గ్రంథ పరిష్కర్తలుగా, సంగీత విద్వాంసులుగా ప్రఖ్యాతి పొందినవారు. ఆంధ్రదేశంలోనే కాక కర్ణాటక, తమిళ నాడు రాష్ట్రాలలోనూ విజయపతాకం ఎగరేసిన సాహిత్య సంగీత కళానిధి.

శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ అనంతపురం జిల్లా, కంబదూరు మండలం, రాళ్లపల్లిలో 1893 జనవరి 23న జన్మించారు. వీరి తల్లి అలమేలు మంగమ్మ, తండ్రి కర్నమడకల కృష్ణమాచార్యులు. సుప్రసిద్ధ జ్యోతిశ్శాస్త్రవేత్తలు. రాళ్లపల్లి గోపాల కృష్ణమాచార్యులు వీరికి అన్న. శర్మగారిని చిన్నప్పుడు వీరి మాతామహి లక్ష్మమ్మ దత్తపుత్రునిగా స్వీకరించారు. వీరికి తండ్రిగారే అక్షరాభ్యాసం చేయించి, సంస్కృత, తెలుగు కావ్యాలు చదివించి మొదటి సాహిత్య గురువయ్యారు. తల్లి చిన్నప్పటి నుండి జానపద, భజన పాటలు చెప్పించి సంగీత గురువులైనారు. తర్వాత 1906లో చదువుకోసం మైసూరుకు వెళ్లారు. అక్కడ చామరాజేంద్ర సంస్కృత పాఠశాలలోనూ, శ్రీపరకాల మఠంలోనూ వీరి విద్యార్థి దశ గడిచింది. రాళ్లపల్లి వారికి పేరు మోసిన సంస్కృత విద్వాంసులు చామరాజ నగరం రామాశాస్త్రి, శ్రీ పరకాల మఠ శ్రీకృష్ణ బ్రహ్మ పరతంత్రులు సంస్కృత కావ్యాలను, నాటకాలను బోధించారు. ఆ కాలానికి రాళ్లపల్లివారు చదివిన తెలుగు కావ్యాలు అంటే కూచిమంచి తిమ్మకవి రాసిన 'అచ్చతెలుగు రామాయణము'. 'నీలా సుందరీ పరిణయము' మాత్రమే. శర్మగారికి 1910లో కట్టమంచి రామలింగారెడ్డి పరిచయభాగ్యం లభించింది. సాయంకాలం పూట శర్మగారు తిక్కన భారతం చదువుతూ ఉంటే కట్టమంచి వారు వ్యాఖ్యానం చేస్తుండేవారు. ఉన్నట్టుండి కట్టమంచివారు పదిహేడేళ్ల శర్మగారిని మైసూరు మహారాజా కాలేజీలో తెలుగు పండితులుగా 1912 జూలై 2న నియమించారు. రాళ్లపల్లి వారు ఒకచోట కట్టమంచి వారి గురించిలా చెప్పారు. ''ప్రాత ప్రపంచముననే ప్రాకులాడుచున్న నాకు వారి తోడి సహవాసము ఆధునిక ప్రపంచపు తలుపులు తెరచి ఆహ్వానించినది".

కట్టమంచి వారి శిష్యరికం వల్ల ఆంగ్ల సాహిత్య ప్రభావంతో రాళ్లపల్లివారు 'తారాదేవి' 1911, 'మీరాబాయి' 1913 ఖండకావ్యాలను రచించారు. కాకినాడ నుండి వెలువడే సరస్వతి మాసపత్రికలో ఒకటి. రాజమండ్రి నుండి వెలువడే మానవసేవ మాసపత్రికలో మరొకటి అచ్చయ్యాయి. కానీ ఈ రెండు కావ్యాలు మూడు వందల ప్రతులకే పరిమితమైయ్యాయి. అలాగే ఈ పత్రికల్లో వెలువడిన కారణంగా ఎక్కువ ప్రచారానికి నోచుకోలేకపోయాయి. అనంతకృష్ణశర్మ కొన్ని సంస్కృత కావ్యాలను, నాటకాలను తెలుగులోకి అనువదించి తమకే తృప్తి కలగనందువల్ల వాటిని అచ్చువేయలేదు. వీరు కాలక్రమంలో 'పెను గొండ కొండ', 'శమీపూజ', 'సంధ్యావందనము' మొదలైన విశిష్టమైన కవితల్ని రచించారు. రాళ్లపల్లి శమీపూజ, పెనుగొండ కొండ, చిరకాలం నిలబడే ఉత్తమ కవితలని కవిసమ్రాట్ విశ్వనాథ వారు ప్రశంసించారు.

రాళ్లపల్లి వారు హాలుని 'గాథాసప్తశతి' లోని 738 ప్రాకృత గాథలను అనువదించగా ఆంధ్రసారస్వత పరిషత్తు 1964లో ప్రచురించింది. 'గాథాసప్తశతి' అనువాదాలలో రాళ్లపల్లి వారి కృతి శ్రేష్టతమమైనదిగా భావింపబడుతున్నది. జాయపసేనాని 'నృత్త రత్నావళి' 1969 లోనూ, 'సుందర పాండ్య విరచిత ఆర్యా'ను 1970లో అనువదించి సాహిత్య ప్రియుల మన్ననలను పొందారు.

శర్మగారు 1949 నుండి దాదాపు ఏడేళ్లపాటు తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పనిచేసి తాళ్లపాక వారి సంకీర్తనలు 12 సంపుటాలను తీసుకొచ్చారు. అంతేకాకుండా, 108 సంకీర్తనలకు స్వరకల్పన చేసి ప్రచురించారు.

అనంతకృష్ణశర్మ ప్రధాన క్షేత్రం విమర్శ. దీనికి నిదర్శనంగా వీరి కలం నుండి వచ్చిన విమర్శ గ్రంథాలే సాక్షాలుగా నిలుస్తాయి. వీటిలో 'వేమన' 1929, 'నాటకోపన్యాసములు' 1935, 'సారస్వతాలోకము' 1954, 'రాళ్లపల్లి పీఠికలు' 1979, 'రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ సాహిత్య సంగీత వ్యాసాలు' 2017, 'వదరుబోతు', (1932, 1986, 2017) వ్యాస సంకలనంలో శర్మగారు రెండు వ్యాసాలు రచించడంతో పాటు, దానికి 'ప్రస్తావన' కూడా వెలయించారు. రాళ్లపల్లివారు సాహిత్యంలోనే కాకుండా సంగీతంలో కూడా పేరు ప్రఖ్యాతులు పొందారు. దీనికి గుర్తింపుగా మైసూరులో జరిగిన 4వ సంగీత సమ్మేళనంలో 'గాన కళాసింధు', బెంగళూరు గాయన సమాజం వారిచే 'సంగీతకళారత్న' బిరుదులతో సత్కరింపబడ్డారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ శర్మగారి సంగీత శాస్త్ర ప్రతిభను గుర్తించి 1970లో ఫెలోషిప్ నిచ్చి గౌరవించింది. వీరి కృషిని గుర్తించి అదే సంవత్సరం శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం రాళ్లపల్లి వారికి గౌరవ డా. లిట్ పట్టాలిచ్చింది.

1979లో రాళ్లపల్లి అభిమానులైన శ్రీఘట్టమరాజు అశ్వత్థనారాయణ, డా॥ఆర్వీయస్ సుందరం, బెంగళూరులో 'అనంతరాగం' అనే అమూల్యమైన అభినందన గ్రంథాన్ని అర్పించి రాళ్లపల్లి వారిని ఘనంగా సత్కరించారు. ఈ సభకు అప్పటి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అధ్యక్షులైన డా॥బెజవాడ గోపాలరెడ్డి, ఆంధ్రప్రదేశ్ సంగీతనాటక అకాడమీ అధ్యక్షులైన శ్రీకె.వి. గోపాల స్వామిగారు ప్రధాన అతిథులుగా విచ్చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు 1979 మార్చి 11 సాయంకాలం బెంగళూరులో పెద్దకుమారుడు ఫణిశాయి గారి ఇంట్లో రాళ్లపల్లి వారిని టి.టి.డి. ఆస్థాన విద్వాంసులుగా నియమించి, సత్కరించిన కొన్ని క్షణాలకే రాళ్లపల్లి వారు పరమపదించారు. శ్రీమాన్ రాళ్లపల్లి అనంత కృష్ణశర్మగారు తెలుగు సాహిత్య ప్రపంచంలో గొప్ప వ్యాసకర్తగా, విమర్శకులుగా, అనువాదకులుగా, సంగీత కళానిధిగా ప్రాతఃస్మరణీయులుగా నిలిచి ఉన్నారు.

(జనవరి 23 రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారి 125వ జయంతి సందర్భంగా)

- బడిగె ఉమేశ్
హైదరాబాద్ విశ్వవిద్యాలయం
9494815854

ఆంధ్రప్రభ Mon, 22 January 2018
epaper.prabhanews.com/c/25578933

**ఈ వ్యాసం ఆంధ్రప్రభ దినపత్రిక 'సాహితీ గవాక్షం' పేజిలో 22 జనవరి 2018న ప్రచురితమైంది**

# అనుబంధం-4

# అనుబంధం 4

## క్షేత్ర పర్యటనలో భాగంగా తీసుకున్న ఫోటోలు



తిరుపతిలో రాళ్ళపల్లి వారి విగ్రహం




(దీనిమీద 'లీలా విభూతి', ' నిత్య విభూతి' అనే పదాలకు శ్రీవైష్టవంలో విశేషమైన అర్థాలున్నాయి. వీటిని ప్రముఖ సంస్కృత పండితుడు ఆచార్య రాణి సదాశివమూర్తి ఈ విధంగా వివరించారు. సాహితీ సిరికోన వాట్సాప్ గ్రూప్ (13 జనవరి 2019) విభూతి శబ్దానికి భస్మ మహిమ, ఐశ్వర్యం, సృష్టి వైవిధ్యం, ఒకే తత్త్వముయొక్క భిన్న భిన్న మూర్తులు... అనే అర్థాలు ఉన్నాయి. జీవులందరూ కర్మబంధం ఉన్నంతవరకూ ఆ పరమాత్ముని **లీలా విభూతులే.** శ్వాస ఆగిపోయి ముక్తిని పొంది శాశ్వతవైకుంఠప్రాప్తి కలిగితే **నిత్య విభూతులౌ** తారు. ఈ లీతా విభూతి. నిత్య విభూతి శబ్దాలు వైష్టవపారిషిక పదాలు)




రాళ్ళపల్లి గ్రామానికి వెళ్ళే రహదారి



ప్రస్తుతం రాళ్ళపల్లి గ్రామం



శిథిలమైన రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ పుట్టి పెరిగిన ఇల్లు



రాళ్ళపల్లివారి శిథిలమైన ఇంటికి దగ్గరలో ఉన్న ఆంజనేయ స్వామి గుడి

ఇక్కడే శర్మగారు భజన కార్యక్రమాల్లో పాల్గొనేవారు



రాళ్ళపల్లి గ్రామానికి సర్పంచ్ గా పనిచేసిన రాళ్ళపల్లి మరిది వెంకటరెడ్డి,
రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి మనుమలు, కుటుంబ సభ్యులతో పరిశోధకుడు



మైసూరులో అనంతకృష్ణశర్మగారు తెలుగు పండితునిగా పనిచేసిన
(1912 నుండి 1949) ‘మైసూరు మహారాజా కళాశాల’